TIGHT BINDING BOOK

UNIVERSAL
LIBRARY

OU_204235

UNIVERSAL
LIBRARY

SMANIA UNIVERSITY LIBRARY

T84 Accession No. T 122
D24M
Devarajasudheemani.
Mahabharatamu.

book should be returned on or before the date last marked below

శ్రీరస్తు.

శ్రీమహాభారతము

ఆంధ్రవచనము.

శాంతిపర్వము (391-749.)

శ్రీదేవరాజసుధీమణివ్రణీతము.



మద్రాసు
ఆనందముద్రణాలయమునందు
ముద్రితము.

ఆ. వేంకటేశ్వర్ అండ్ కంపెనివారిచే ప్రకటితము.

1916.

ALL RIGHTS RESERVED.

All Rights Reserved.

Copyright 1917—By **R. Venkateshwar & Co., Madras.** This book is fully protected by an Indian and Foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language and offer it for sale. A substantial copy of the words, ideas or illustrations contained herein constitutes an infringement of a copyright, and notice is hereby given that suit will be filed in every case of infringement.

కాపిరైట్ 1917 వ సం॥ ఆర్. వేంకటేశ్వర్ ఆక్డ కంపెనివారు కాపీ రైట్ దార్లు. ఈపు స్తకము ఇండియా కాపిరైటుచేతను పరకీయమైన కాపీ రైటుచేతను సురక్షితమైనది. ఎవరుగాని యీపు స్తకమును సంపూర్ణముగాగాని లేక యిందొకభాగమునుగాని తాము వేఱుగా ప్రకటించుటకును, మఱి యొకభాషయందు తర్జుమాచేసి క్రయమునకు నిచ్చుటకును, వాడ్క ఇయ్యఁబడదు. ఇందుఁ గలపదములనుగాని భావములనుగాని పటములనుగాని ఏమాత్ర మైనను కాపీచేసినయెడల అది కాపిరైటును నుల్లంఘించిన ట్లగుటచే అట్టివారు దావాకు లోనగుదురని దీనిచే తెలియునగును.

విషయసూచిక.

భీష్ముఁడు బ్రాహ్మణాదుల కాపద్ధర్ముఁ లివి యని యుధిష్ఠిరునకుఁ జెప్పుట 391

భీష్ముఁడు యుధిష్ఠిరునకు బుత్విక్ల క్షణాదులను జెప్పుట ... 397

భీష్ముఁడు ధర్మరాజునకు మిత్రులయు నమిత్రులయు లక్షణములను జెప్పుట 400

భీష్ముఁడు ధర్మరాజునకు జ్ఞాతివిషయమై కృష్ణునకును నారదునకును జరిగినసంవాదమును జెప్పుట 406

భీష్ముఁడు, అమాత్యపరీక్షను గుఱించి కాలకవృక్షీయోపాఖ్యానమును జెప్పుట 411

భీష్ముఁడు ధర్మరాజునకు మంత్రి మొదలయిన వారి లక్షణములను జెప్పుట 421

భీష్ముఁడు ప్రియవచనము లాడుటనుగుఱించి యింద్ర బృహస్పతి సంవాదమును ధర్మరాజునకుఁ జెప్పుట 429

భీష్ముఁడు ధర్మరాజునకు నమాత్యలక్షణములు మొదలయినవి చెప్పుట 430

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బురలక్షణాదులను జెప్పుట 435

భీష్ముఁడు ధర్మరాజునకు రాజ్యమును గుప్తిచేయు ప్రకారము మొదలయినవి చెప్పుట 439

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బ్రజలవలనఁ బన్నుదీఁగుమొదలయినవి చెప్పుట 446

భీష్ముఁడు ధర్మరాజునకు రాజనీతిని జెప్పుట... 451

భీష్ముఁడు ధర్మరాజునకు ఉచథ్యమాంధాతృ సంవాదమునుజెప్పుట... 455

ఉచథ్య మాంధాతృ సంవాదము ... . 4[illegible]

వామదేవ వసుమనస్సంవాదము... 467
వామదేవ వసుమనస్సంవాదము 470
వామదేవ వసుమనస్సంవాదము 475
భీష్ముఁడు ధర్మరాజునకు యుద్ధధర్మమునుఁ జెప్పుట 479
భీష్ముఁడు జయలక్షణములను మఱియుఁ గొన్ని రాజ ధర్మములనుజెప్పుట 482
భీష్ముఁడు క్షత్రియులు యుద్ధముసేయుట ధర్మమగునని నిరూపించుట 487
ఇంద్రుఁడు సుదేవచరిత్రమును యుద్ధ కుజ్ఞమందలి బుత్విగాదియంగ
ములను యుద్ధమృతులకుఁ గలుగుంలోకములను నంబరీషునకుఁ జెప్పుట 492
భీష్ముఁడు, జనకుఁడు తనసేనల నుత్సాహపఱిచి యుద్ధమునకుఁ బంపుట
ను, వ్యూహములుపన్నుట మొదలగువానిని జెప్పుట ... 501
భీష్ముఁడు ధర్మరాజునకు యుద్ధముచేయు విధము మొదలగు వానిని
జెప్పుట 504
భీష్ముఁడు ధర్మరాజునకు యోధులలక్షణములను జెప్పుట ... 512
భీష్ముఁడు ధర్మరాజునకు సేనకుఁ గలజయచిహ్నములును రాజనీతినిని
జెప్పుట 516
భీష్ముఁడు శత్రుజయమునుబట్టి యింద్రునకును బృహస్పతికిని జరిగినసం
వాదము యుధిష్ఠిరునకుఁ జెప్పుట 522
రాజ్యాదులను బోఁగొట్టుకొన్నవాఁడును ధర్మాత్ముఁడునగు రాజుపృథ్వి
మొదలగు వానిని గుఱించి కాసల్యకాలకవృక్షీయసంవాదమును
జెప్పుట 531
క్షేమదర్శికిని కాలకవృక్షీయునకును శత్రువులను గెలుచు కపటోపా
యములను గుఱించిన సంవాదము 539
కాలకవృక్షీయునియాగతిని క్షేమదర్శి మరల రాజ్యప్రాప్తి మొద
లగువానిని బడయుట 543
భీష్ముఁడు గణవృద్ధి మొదలగువానిని జెప్పుట 547
భీష్ముఁడు మాతృపితృగురువుల మహిమలను వర్ణించుట ... 551
భీష్ముఁడు ధర్మరాజునకు సత్యసత్యముల స్వరూపములను జెప్పుట ... 556

భీష్ముఁడు ధర్మరాజునకు దుర్గతిని దాఁటు నుపాయమును జెప్పుట ... 561
భీష్ముఁ డలసత్వ మనర్థహేతువని నిరూపించుటకై లొట్టియ కథను
జెప్పుట 576
భీష్ముఁడు బలవంతుఁడగు శత్రువును వశము చేసికొనుటకు వినయ ముపా
యమగు నని నదీసాగర సంవాదమును జెప్పుట 579
భీష్ముఁడు సభయందు దుష్టుఁడు చెడ్డమాట చెప్పినను దాని నోర్చుట
మంచిదనుట 581
భీష్ముఁడు రాజులకు సాహాయ్యమును జేర్చుకొనుట యూపశ్యకమని
చెప్పుట 584
భీష్ముఁ డొకకుని నితి మొపలగువానివలన భయపడిన కుక్కను
సాధుమృగముగాఁ జేయుటను జెప్పుట 587
భీష్ముఁ డాముని తనకుక్కను బలువగల మృగములను గావించుటయుఁ
బిదప నది తన్నుఁ జంపఁగోరఁగా మరల మునుపటివలెఁ గుక్కను
గావించుటయును జెప్పుట 591
భీష్ముఁడు మంత్రి మొదలయిన వారిగుణములను జెప్పుట ... 594
భీష్ముఁడు భృత్యులను దగినయధికారములందు నియమింపవలయునను;
భృత్యుల లక్షణములను జెప్పుట 601
భీష్ముఁడు ప్రజాపాలనవిధము మొపలయిన వానిని ధర్మరాజునకుఁ
జెప్పుట 603
భీష్ముఁడు యుధిష్ఠిరునకు దండస్వరూపము మొపలగువానిని జెప్పుట 615
భీష్ముఁడు ధర్మరాజునకు వసుహోమమాంధాతల సంవాదమును జెప్పి
దండోత్పత్తి మొపలగువానిని దెలుపుట 624
భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మాదుల ప్రయోజనము మొపలయిన వానిని
జెప్పి ధర్మమును విడిచినవాఁడు చేయవలయు ప్రాయశ్చిత్తవిధిని
నరిష్టుఁడనురాజునకుఁ గామందకుఁడను ముని యుపదేశించిన దానిని
జెప్పుట 633

భీష్ముఁడు ధర్మనునకుఁ బ్రథమకారణమయిన శీలమును దుర్యోధను
నకు ధృతరాష్ట్రుఁడు చెప్పిన యింద్రప్రహ్లాదసంవాదమును ధర్మ
రాజునకుఁ జెప్పుట 638
భీష్ముఁ డాశను నిరూపించుటకై బ్రుహ్మభసుమిత్రచరిత్రమును జెప్పఁ
దొడఁగుట 645
భీష్ముఁడు, సుమిత్రుఁడు బ్రుహ్మాశ్రమమునకుఁ బోవుటయు వారిని
జూచి యాశ పెద్దదియా యాకాశము పెద్దదియా యని యడుగు
టయుఁ జెప్పుట 648
బ్రుహ్మభుం డనుబ్రుహ్మి సుమిత్రరాజునకుఁ దమ తీర్థయాత్రాదులను
జెప్పుట 650
తనుమహర్షి పీరద్యుమ్ననకు దుర్లభవస్తువును గృహతరమైన యాశ
నును బ్రతిపాదించుట 652
యముఁడు తలిదండ్రులకుఁ బరిచర్య సేయుట వారి బ్రుణమును దీర్చు
కొనుట కుపాయమగునని గౌతమునకుఁ జెప్పుట 656
భీష్ముఁడు ధర్మరాజునకు రా జాపత్కాలమందు బ్రజలను బీడించియై
నను బొక్కసము నవశ్యము వృద్ధిచేయవలయునని చెప్పుట ... 657
భీష్ముఁడు రా జాపదయందు సర్వస్వమును బరిత్యజించి యైనఁ దన్ను
రక్షించుకొనవలయునని చెప్పుట 664
భీష్ముఁడు రాజు దుష్టులనుండి ధనము నాక్రమించి యైన నాపదనొం
దిన బ్రాహ్మణులను రక్షింపవలయు ననుట 667
భీష్ముఁడు ం జేవిధమునను బొక్కసమును బెంపవలయు ననియు, కొం
గలు నాపదలయందు ధనమునంతయు దోఁచుకొనక కొంత
మిగిల్చి తక్కినవాని నపహరింపవలయుననియుఁ జెప్పుట ... 671
భీష్ముఁడు బలమును బొగడుట. పాపమునకుఁ బరిహారోపాయములను
జెప్పుట 674
భీష్ముఁడు దొంగగానుండినను శాస్త్రమర్యాద ననుసరించియుండు
వాఁడు పరలోకమును బొందునని నిరూపించుటకు కాపిష్యచరిత్ర
మును జెప్పుట 4

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బొగడ్తసము వృద్ధిసేయుకొఱకు నేధన మపహరింపవచ్చునో యేదిగూడదో వివేచించుట 680
భీష్ముఁడు రానున్నయాపదను బోఁగొట్టునుపాయమును మునుపే చేసికొనవలయునని రూపించుటకై మత్స్యోపాఖ్యానమును జెప్పుట 682
భీష్ముఁ డాపదయందు శత్రువుతోడ నైతము సంధిచేసికొనఁ దగునని రూపించుటకై పిల్లికిని నెలుకకును జరిగిన కథను జెప్పుట ... 685
భీష్ముఁడు యుధిష్ఠిరునకుఁ బూజనీబ్రహ్మదత్తసంవాదమును జెప్పుట 712
భీష్ముఁడు శత్రుంతపునకు భరద్వాజుఁడు చెప్పిన యాపద్ధర్మమును ధర్మరాజునకుఁ జెప్పుట 726
భీష్ముఁ డాపత్కాలమందు నభక్ష్యమును భక్షించియైనను నాత్మరక్షణము చేసికొనవలయునని రూపించుటకై విశ్వామిత్రచండాల సంవాదమును జెప్పుట 736

పటముల పట్టిక.

లొట్టియ తనగొంతునకు గాలివలన నపాయము లేకుం
డుట కై కొండగుహాలో నుంచుట; నక్కలు
చలిచే వచ్చి దానిగొంతును గొఱికి తినుట ... 577

ఒకముని తన కుక్కను బలువిధములైన మృగములుగాఁ
గావించుట; పిదప నది శరభము కాఁగానే మునిని
మ్రింగ వచ్చుట ... 593

పులి నక్కను జంపఁ బ్రయత్నించుట; పులితల్లి నివా
రించుట ... 572

జైమదర్శితో కాలకవృక్షీయుఁ డనుబుషి తనకాకిని
మంత్రులు చంపిరని చెప్పుట ... 415

విశ్వామిత్రుడు చండాలుని గృహముననుండు కుక్క
మాంసము నపహరించుట ... 741

రాజధర్మపర్వము.

{ భీష్ముడు బ్రాహ్మణాదుల కాపద్ధర్మము లివియని యుధిష్ఠిరునకుఁ జెప్పుట. }

యుధిష్ఠిరుఁడు:— 'బ్రాహ్మణుఁ డాపత్సమయములందు క్షత్రియధర్మములచేత బ్రతుకు చూచుకొనవచ్చునని చెప్పితిరి. అతఁ డెప్పుడేని వైశ్యధర్మముచేతను బ్రతుకు జరుపుకొనవచ్చునా?' యని యడిగెను. అందులకు భీష్ముఁడు 'బ్రాహ్మణుఁడు తనబ్రతుకున కపాయముచేత వ్యసనమందుఁ జిక్కియున్నపుడు క్షత్రధర్మముచొప్పున నడచుకొనఁ శక్తుఁడు గాఁడేని, వైశ్యధర్మము నవలంబించి, సేద్యము గోరక్షణమును నాచరించి బ్రతుకనచ్చును' అనెను. యుధిష్ఠిరుఁడు 'భరతర్షభా! బ్రాహ్మణుఁడు వైశ్యధర్మము చొప్పున నడచునపుడు వాఁడు స్వర్గలోకము తనకుఁ దెప్పకుండునట్లుగా నేయేయంగడిసరకు లమ్మవచ్చును?' అని యడిగెను. భీష్ముఁడు 'యుధిష్ఠిరా! కల్లు, ఉప్పు, నువ్వులు, జూలుగల మృగములు, పశువులు, ఎద్దులు, తేనె, మాంసము, వండినయన్నము ననెడి వీనిని సకలమయిన యవస్థలందును బ్రాహ్మణుఁడు వర్జింపవలయును. బ్రాహ్మణుఁడు వీని నమ్మినయెడల నరకమందుఁ బడును. బ్రాహ్మణుఁడు మేక నమ్మినయెడల నగ్నిదేవు నమ్మిన పాపము నొందును; గొఱియ నమ్ము నేని జలదేవుఁ డగు వరుణునమ్మిన పాపమును, గుఱ్ఱము నమ్ము నేని సూర్యు నమ్మిన పాపమును, వండినయన్నము నమ్మినయెడల భూమి నమ్మిన పాపమును, గోవు నమ్మినయెడల యజ్ఞమును సోమరసమును నమ్మినపాపమును బొందుచున్నాఁడు. కనుక బ్రాహ్మ

ణుఁడు వీని నమ్మరాదు. సాధువులు, వండినయన్నము నిచ్చి వండనియన్నమును మార్చుకొనుట నెంతమాత్రము మెచ్చరు. వండనియన్నము నిచ్చి వండినదానిని గొనుట తప్పుగాదు. 'మేము నీవండినయన్నమును భుజించెదము. (మేము బదులుగా నిచ్చెడి) యీ వండనివానిని (ఆమమును) వండుకొనవచ్చు.' అని యీయొడంబడిక చేసికొనుటయందుఁ బాపము లేదు. యుధిష్ఠిరా! వ్యవహారముచొప్పునఁ బ్రవర్తనముగలిగి యున్న పెద్ద లాదినుండి జరుపుచున్న సనాతనధర్మమును నీకుఁ దెలుపుచున్నాను. దానిని దెలిసికొనుము. 'నేనిది నీకిచ్చుచున్నాను. నీ విది బదులుగా మాకిమ్ము' అని యిట్లొడంబడికమీఁద మార్చుకొనుట ధర్మము. బలవంతముగాఁ దీసికొనుట పాపమే. ఋషులును దక్కినవారలును పూర్వమునుండి నడచుకొనుచున్న వ్యవహారము లిట్లు వర్తించుచున్నవి. ఇది నిస్సందేహముగా న్యాయము' అనెను. యుధిష్ఠిరుఁడు 'తండ్రీ! సకలవర్ణములవారును దమతమ ధర్మములను దిగవిడిచి రాజునకెదురై యాయుధము లెత్తికొనిరేని యపుడు రాజబలము తగ్గుచున్నది. అప్పుడు రాజ్యవిధమునఁ బ్రజలకు రక్షకుఁడై ధర్మమునకుఁ బెనుపాఱివై యుండఁగలఁడు? నాకుఁగల యీసందేహమును సవిస్తరముగాఁ జెప్పి తీర్పుము' అనెను. భీష్ముఁడు 'అట్టి సమయములందు బ్రాహ్మణులు మొదలగువర్ణములవారు దానముచేతను, దపస్సుచేతను, యజ్ఞముచేతను, ద్రోహము లేమిచేతను, దమముచేతను, దమతమ క్షేమములు గావించుకొనఁ దివురనలయును. వారియందు వేదబలసంపన్నులగువారు నలుగడిల నుద్యమించిలేచి, మహేంద్రునకు దేవతలు బలముగూర్చినట్లు, రాజునకు బలమును వేదవిధులచేఁ

గూర్చవలయును. రాజుబలము క్షీణించుచుండునపుడు బ్రాహ్మణులె యతనికిఁ బెద్దపని చెప్పుదురు. కనుకఁ దెలివిగలరాజు బ్రాహ్మణబలముచేతనే తనశక్తి వృద్ధినొందింపఁ జూడవలయును. రాజు విజయముసొంది రాష్ట్రమునందు క్షేమమును సమకూర్చినపుడు సకలవర్ణములవారును దమతమ ధర్మముల చొప్పునఁ గర్మములందుఁ బ్రవర్తింతురు. చోరులు కట్టుపాట్లను మీఱి యెల్లయెడల సంకరము గలిగించినపుడు, సకలవర్ణములాయుధము లెత్తికొని వారిని దలపడవచ్చును. అందువలన వారికి దోషము గలుగదు' అనెను. యుధిష్ఠిరుఁడు 'క్షత్రియు లెల్లవారును బ్రాహ్మణులతో విరోధించినయెడల నపుడు బ్రాహ్మణులనును వేదములనును గాచువారెవరు? అప్పుడు బ్రాహ్మణు లనుష్ఠింప వలయు ధర్మమిది? వారికిఁ బెనుప్రాపెవరు?' అని యడిగెను. భీష్ముఁడు తపస్సుచేతను, బ్రహ్మచర్యముచేతను, శస్త్రముచేతను, దేహబలముచేతను, వీనిని వంచనచేతఁగాని వంచనమాత్రికాని యుపయోగించియు, క్షత్రియుల నప్పుడడఁచిపుచ్చవలయును. క్షత్రియుఁడు మేరమీఱి, యందును విశేషించి బ్రాహ్మణుల యందుఁ, బ్రవర్తించునేని వేదములే వాని నడఁచి పుచ్చఁగలవు. ఏలన క్షత్రియులు బ్రాహ్మణులవలననుండి పుట్టినవారు. జలము నుండి యగ్నియు, బ్రాహ్మణులవలన నుండి క్షత్రియులును, ఱాతి వలననుండి యినుమును బుట్టినవి. వీనికిఁ గలతేజమును నన్ని యెడల నడ్డులేక నిగుమ్ముచుండునుగాని తమతమ పుట్టుచోటు లందుమాత్ర మడఁగిపోవుచున్నవి. ఇనుము ఱాతిని ఛేదించి నపుడును, అగ్ని జలములతోఁ దలపడునపుడును, క్షత్రియులు బ్రాహ్మణులను ద్వేషించునపుడును, నామాఁటి బలములును

దూలిపోవుచున్నవి. యుధిష్ఠిరా ! కాఁబట్టి క్షత్రియుల తేజములును బలములు నెంత గొప్పవియు గెలువఁదరము గానివియు నయినను, బ్రాహ్మణులపట్ల నడఁగిపోవుచున్నవి' యనెను.* యుధిష్ఠిరుఁడు 'బ్రాహ్మణులవీర్యము మెత్తనయి క్షత్రియులవీర్యమును దుర్బలమై, సకలవర్ణములవారును బ్రాహ్మణులయెడల దుష్టులై ప్రవర్తించిరేని, యపుడెవ్వరు తమప్రాణములను బాటింపక యుద్ధముసేసి బ్రాహ్మణుల నలుగడల రక్షించి వారిలోకములను బొందుదురు?' రని యడిగెను. అందులకు భీష్ముఁడు 'అప్పుడు గొప్ప మనస్సుగలిగి యిట్టిసితికి నెంతయుఁ గోపముఁ బూనినవారై యుద్ధముసేయఁగల వారెల్ల నాబ్రాహ్మణులనును ధర్మమునును దమ్మును రక్షించుకొనుచుఁ బుణ్యలోకములను బొందుచున్నారు. సమస్తజనులును బ్రాహ్మణులను రక్షించుకొఱకు నాయుధము లెత్తికొనుట యుక్తము. అట్లు బ్రాహ్మణులకై పోరాడుశూరులు మిక్కిలి శ్రద్ధతో వేదాధ్యయనము చేసినవారును, మిక్కిలి గొప్పతపములు చేసినవారును, ఉపవాసముండినపిదపఁ దమ దేహములను నగ్నిహోత్రములందు వేల్చినవారును, బొందునట్టి యుత్తమగతిని బొందుచున్నారు. బ్రాహ్మణుఁడు తక్కిన మూఁడువర్ణములవారికై యాయుధమెత్తికొనునేని దానివలన దోషమునొందఁడు. ఇట్టి సమయములందు ధర్మరక్షణార్థము బ్రాహ్మణులు విడుచుటకంటె నెక్కుడయిన ధర్మము జనులు లేదందురు. బ్రాహ్మణుల విరోధులను దండించుటకై తమప్రాణ

---

* ఇచట నడుమ యుధిష్ఠిరవాక్యము ఉత్తరదేశకోశములందు లేదు. అంతయు భీష్మనివాక్యముగానే యున్నది. అయినను దాక్షిణాత్యకోశాను సారముగా నిట తెలిఁగిఁపఁబడినది.

ముల సర్పించునట్టి వారలకు నమస్కరించుచున్నాను. వారలకు భద్రమగుఁగాక. మనకు వారితోడి లోకము గలుగుఁగాత. అట్టి శూరులు బ్రహ్మలోకమును బొందుచున్నారని మనువు చెప్పెను. జను లశ్వమేధమందలి యవభృథమునందు స్నానముచేసి పవిత్రులెట్లగుదురో యట్లె, దుర్జనులతో యుద్ధముసేయునపుడు వారి శస్త్రములు దగిలి హతులయినసుజనులుగూడఁ బవిత్రులగుదురు. ఆయాకాలమును బట్టియు దేశమునుబట్టియు ధర్మమధర్మమగుచున్నది. అధర్మము ధర్మమగుచున్నది. మనుష్యుల నడవడినిబుణ్యముగాఁగానిపాపముగాఁగానిచేయుటయందుఁగాల దేశములశక్తి యిట్టిదిగా నున్నది. జను లెల్లవారితోడి మైత్రి గలిగియుండువారు కూరకృత్యములు చేసినను నుత్తమమయిన స్వర్గమునొందిన వారయిరి. ధర్మాత్ములగు క్షత్రియులు పాపములు చేయుచున్నను నుత్తమం బగుగతిని బొందుచున్నారు. బ్రాహ్మణుఁడు మూఁడుకాలములందును- అనఁగా తన్ను రక్షించుకొనుటకును, దక్కిన వర్ణములవారినిస్వధర్మములందుఁ బ్రవర్తింపజేయుటకును, దొంగలను దండించుటకును- నాయుధ మెత్తుకొనుటచే దోషమునొందఁడు' అనెను. యుధిష్ఠిరుఁడు 'దొంగలబలిమి చెలరేగి వర్ణసంకరము గలిగి క్షత్రియులు నశక్తులయిండఁగా, క్షత్రియుఁడు గానివాఁడు ప్రజ

---

* 'బ్రాహ్మణస్తి(స్థి)షులోకేషు శస్త్రం గృహ్ణన్ను దుష్యతి। ఆత్మత్రాణే వర్ణదోషే దుర్దమ్యస్యయమేఽపిచ' అని మూలము. 'ఆత్మత్రాణే దస్యుదోషే సర్వస్వహరణేతథా' అని దా. పా. తన్నుఁగాచుకొనుటయందును దొంగలదోషము నడఁచుటయందును, గలధనమంతయు గోలుపోవునపుడును నాయుధమెత్తికొనుట పాపముగాదని యీపాఠమున కర్థము.

లను రక్షించుటకై యీచోరులను నడఁచివుచ్చెనని తలంతము. ఆబలవంతుఁడు బ్రాహ్మణుఁడో, వైశ్యుఁడో, శూద్రుఁడో యగునేని, దండమును ధర్మముగాఁ జెల్లించి ప్రజలను రక్షించిన వాఁడయ్యెనేని, వాఁడట్లుచేయుట ధర్మమా? లేక యట్లు చేయకుండు విధమున వాని నివారింపవలయునా?' యని యడిగెను. భీష్ముఁడు దాఁటు దిక్కులేని ప్రవాహమందు నెవఁడు దాఁటించుతెప్ప యగునో, లేక దరిలేనిదానియం దొకదరి యగునో, యట్టివాఁడు శూద్రుఁడుగాని మఱి యేవర్ణమువాఁడు గాని సర్వవిధములఁ బూజ్యత కర్హుఁడగుచున్నాఁడు. ప్రజలు చోరులచే మిక్కిలియుఁ బీడితులై తపించుచు దిక్కుమాలి యున్నపుడు తా మెవ్వని నాశ్రయించి యెప్పటివలె సుఖముగా నుండఁగలుగుదురో యట్టివానినే వారు తమ సొంతబంధువునుం బోలెఁ బ్రీతిగడలుకొనఁ బూజింతురు. ఇతరుల భయమును బోఁగొట్టి వారికెంతయు నభీష్టమొనఁగూర్చునట్టివాఁడు సన్మాన మున కర్హుఁడగుచున్నాఁడు. మోయలేని యెద్దులతోఁ గాని, పాడిలేని యావులతోఁగాని, గొడ్డురా లయిన యిల్లాలితోఁగాని, పనియేమి? అట్లె ప్రజలను రక్షింపలేనిరాజువలనఁ బ్రయోజన మేమి? మాన్యనిచేతఁ జేయఁబడిన యేనుఁగువలెను, తోలిచే రచింపఁబడిన జింకవలెను, ధనములేని మనుజునివలెను, బేడి వలెను, జవిటినేలవలెను, వేదాధ్యయనములేని బ్రాహ్మణుఁడును బ్రజల రక్షింపలేనిరాజును నున్నారు. వా రందఱును వానకురి యని మేఘమువలె నిరర్థకులే యగుదురు. ఎవ్వఁ డెల్లపుడును సజ్జనులను రక్షించుచును, దుర్జనుల నడఁచుచును నుండునో యట్టి

వాఁడే రాజు గాఁదగును. వాఁడే జగము నంతయుఁ బాలింప నేర్చును' అనెను. ఇది డెబ్బదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు యుధిష్ఠిరునకు ఋత్విక్లక్షణాదులను జెప్పుట.

యుధిష్ఠిరుఁడు.—'పితామహా! ఋత్విజు లగు వా రెట్టికర్మములు నెట్టిశీలమును గలవారుగా నుండవలయును? వా రెటువంటివారుగా నుండవలయును? నీవ్ర మాటకారులందు మేటివిగదే. ఇది చెప్పము' అని యడిగెను.

భీష్ముఁడు.—ఋత్విక్కర్మమునకుఁ బాత్ర లగుద్విజులు సామాదులగు ఛందస్సులును శ్రుతులయందలి విధులును దెలిసి రాజునకు నభ్యుదయము గలిగించు కర్మములెల్లను నడపఁజాలిన వారై యుండవలయునని విధింపఁబడియున్నది. వారు రాజు నందే యాసకుఁ డై ధీరుఁ డై ప్రియవాదుఁ డై యుండవలయును. వారొకరియెడ నొకరునుహృదుఁ డై తక్కినవాని యన్నింటియెడల సమదృష్టిగలిగి యుండవలయును. అకూ ర్రత్వము, సత్యవాక్యము, అహింస,దమము. ఆర్జవము, అదోహము,అభిమానము లేకుండుట, సిగ్గు, తితిక్ష, శమము ననెడి యివి యెవనియందుఁ గనుపట్టుచున్న వ్రో వాఁడు పురోహితుఁడని చెప్పఁబడుచున్నాఁడు. మఱియు బుద్ధిమంతుఁడును, ఉడి వ్రోని ధైర్యముగల వాఁడును, శాంతుఁడును. భూతములను హింసగావింపనివాఁడును, గామద్వేషములు లేనివాఁడును, మూఁడు శుద్ధగుణములుగల వాఁడును, అసూయలేనివాఁడును, జ్ఞానముచేతఁ దృప్తినొందిన వాఁడును నగువాఁడు బ్రహ్మాసనమునకు నర్హుఁడగును. ఇట్టిగుణ

ములుగలవారు గొప్ప ఋత్విజు లగుదురుగాన యిట్టివారెందును దగురీతిని మిక్కిలియు మాన్యులగుదురు' అనెను. యుధిష్ఠిరుడు 'వేదములు దక్షిణ లీయవలయునని చెప్పుచున్నవి. కాని, యింత యీయవలయునని యెచ్చటఁగాని విధికలుగదు. దక్షిణ లీయ వలయుననెడి యీవిధి ధనమును విభాగించుటనుగూర్చి కలిగి నదిగాదు. కర్తయందులకు నశక్తుఁడయినచో నాశాస్త్రము మిక్కిలి భయంకరముగా నున్నది. ఆశాస్త్రము యజమానుని శక్తిని బరికింపదు. మనుజుఁడు శ్రద్ధతోడ యజ్ఞముసేయవలయు నని వేదములందు వినఁబడుచున్నది. యజ్ఞము *పొల్లుతోఁ గూడియుండినయెడల శ్రద్ధ యేమిచేయఁగలదు?' అని యడిగెను.

భీష్ముఁడు 'వేదములను నిరాకరించుటవలనఁ గాని శఠత్వము చేతఁగాని మాయచేతఁగాని యెవ్వఁడును మేలునొందఁడు. నీవిది యిట్లుగాదని బుద్ధిని దలఁపనలదు. నాయనా! దక్షిణ యజ్ఞమున కొకయంగము. అది వేదములకుఁ బెంపు గావించుచున్నది. దక్షిణ లేని యాగము పురుషుని సంసారమును నేవిధమునను దరిం పఁజేయఁజాలదు. ఒక్క †పూర్ణపాత్రమునకుఁ గలశక్తి యెంత

---

* పొల్లుతోఁ గూడియుండుటయనఁగా విహితము లయినదక్షిణలకు బదులుగా వేఱుగువాని సేర్పఱచుట. ఒకయాపునకు మాఱుగా అన్నపిండము లును, పత్నీమునకు బదులుగా యనలును, బంగారమునకుఁ బ్రతిగా రాగి నాణెము, నని తెలియునది.

† యజమానుఁడు వేదములందు విధింపఁబడిన దక్షిణనీయ శక్తుఁడుగాకున్నను వానికిఁ బ్రతియగువాని నిచ్చుటవలన వానికి ఫలము చెడకుండును. ఏలనఁగా ఒకపూర్ణపాత్రము అనఁగా ఇన్నూటయేఁబదియాఱు పిడికిళ్లబియ్యము శ్రద్ధ తోనీయఁగా, అది మిక్కిలి విలువగల దక్షిణతోఁబాటిగా ఫలకారియగు చున్నది.

విలువ గలదక్షిణ కయినను సాటి యగునుగాని వెనుదీయదు. కనుక మూఁడువర్ణములవారును దమతమశక్తికొలఁదిని యజ్ఞము తప్పక చేయవలయును. సోముఁడు బ్రాహ్మణులకు రా జని వేదములందు వినఁబడుచున్నది. అయినను బ్రాహ్మణులు దానిని యజ్ఞములు చేయుటకై విక్రయించుచున్నారు. కాని దాని వలన బ్రతుకు జరుపుటకుఁగాదు. ధర్మములందుఁ బండితులగు ఋషు లాసోమమును విక్రయింపఁగా వచ్చినధనముచేత యాగ మును జేయఁగా నాయాగము పయిపయిని యాగములను బెంచు చున్నదని ధర్మయుక్తముగాఁ జెప్పియున్నారు. * పురుషుఁడు, యజ్ఞము, సోమము ననెడియీమూఁడును న్యాయం బగు నడవడి గలిగి యుండవలయును. అన్యాయం బగు నడవడి గల పురుషుఁ డిహమునకును బరమునకును బాత్రుఁడు గాఁడు. మిక్కిలియు దేహకష్టముచేత గడించిన ధనమునుగొని మహాత్ము లగు బ్రాహ్మణులు గావించెడి యజ్ఞ మంతగా గొప్పధర్మము నొసంగదని వేదములందు వినఁబడుచున్నది. తపస్సు యజ్ఞమున కంటె శ్రేష్ఠమయినదని వేదములందు మిక్కిలి ప్రతిపాదింపఁ బడుచున్నది. ఆ తపమును నీకుఁ జెప్పుచున్నాను. విద్వాంసుఁడవు గదే. దానిని సయితము నేను జెప్పఁగావినుము. అహింస, సత్య వచనము, అకూరత్వము, దమము, దయ యనునివియె ధీరు లగువారు తప మని తెలియుఁదురుగాని శరీరమును స్రుక్కించుట గాదు. వేదములను నిరాకరించుట, శాస్త్రముల నుల్లంఘించుట, మర్యాదలనెల్లఁ బాటింపకుండుట యను నివియె తనకు నాశనము గును. యుధిష్ఠిరా ! 'తప స్సనెడియజ్ఞము చేయువారికి బ్రహ్మ

*ఇట పురుషుఁడనఁగా యజమానుఁడు. యజ్ఞము నేయువాఁడని తెలియునది.

ముతో౯ బడయఁగోరిన యోగము, స్రుక్కు, చి త్త మాఁజ్యము, ఉ త్తమమగు జ్ఞానము, పవిత్రము, సమ స్తమయిన కుటిలత్వ మును, మృత్యువు, ఆర్జవమెల్ల బ్రహ్మపదము. జ్ఞానవిషయ మింతియె. కుదృష్టివాదుల ప్రలాపములు దీనినేమిచేయఁగలదు' అని దినమునకుఁ బదిమాఱు లగ్నిహో త్రమందు వేల్చుచుండు వారు (దశహో తలు) విధించి యున్న దానిని,యుధిష్ఠిరా! వినుము' అనెను. ఇది రెండుదితో మ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు మిత్రులయు నమిత్రులయు లక్షణములను జెప్పుట.

ధర్మరాజు 'పితామహా ! మిక్కిలి యల్పమయిన కార్యమును సయితము మనుష్యుఁడు సహాయములేక యొక్కఁడే చేయుట దుష్కరముగా నున్నది. ఇఁక రాజ్యమువంటి దానిని సహాయము లేక చేయుట యెట్టిదో చెప్పనేల? కాఁబట్టి రాజునకు సహాయుఁ డగు మంత్రి యెట్టిశీలమును నాచారమునుగలవాఁడుగ నుండవల యును? రా జెట్టివానియందు నమ్మికయుంపవచ్చును ? ఎట్టివాని యం దుంపరాదు ?' అని యడిగెను.

భీష్ముఁడు 'రాజా ! రాజులకు నాలుగువిధములయిన మంత్రులు గలరు. వారలు సహార్థుఁడు (రాజుతోపాటి ప్రయోజనము గల వాఁడు) భజమానుఁడు (రాజును భ క్తితోఁ గొలుచువాఁడు)

---

*సహార్థుఁడు, రాజుతోఁబాటిగా 'మనమిరువుర మిశత్రువును నిర్మూలనిచేసి యీరాజ్యము నిరువురు పంచుకొనవలయునని కలసినవాఁడు. భజమానుఁడు,

సహజుఁడు (రాజు తోఁబుట్టుకచే సంబంధించినవాఁడు) కృత్రిముఁడు (దానాదులచే వశీకృతుఁడయినవాఁడు) అని నలుగురు. రెండుపక్షములను గొలువక యొకపక్షమునే యనువర్తించునట్టి ధర్మాత్ముండగు పురుషుఁడు రాజు మిత్రములలో నైదవవాఁడు. అతఁడేపక్షమందు ధర్మముగలదో యాపక్షమందే యుండును. లేక యేపక్షమును జేరక మధ్యస్థుఁడుగా నుండును. (ధార్మికుఁడగు రా జట్టివానిని గయికొనవచ్చును కాని) వానికి రుచింపనివిషయమును రాజు వానికి వెల్లడింపరాదు. మిత్రుఁడని యొక ప్రకృతిలేదు. శత్రువనియు నొక ప్రకృతిలేదు. ఉపకారమువలన మిత్రుఁడును నపకారమువలన శత్రుఁడును నగును. మనుష్యుఁడు తా నెవనిమరణమును గోరునో, కాలము కొంచెము కడవఁగానే వాని బ్రతుకునే కోరును. కాన మిత్రుత్వ శత్రుత్వములు స్వభావసిద్ధములుగావు. జయింపఁ గోరురాజులు ధర్మంబునను నధర్మంబునను జరింతురు. నాలుగు విధములయిన మిత్రులలో నడిమివారగు రెండవవాఁడును మూఁడవవాఁడును శ్రేష్ఠులు. మొదటివానిని నాలుగవవాని నెప్పుడును సందేహించుచుండవలయును. రాజు తానే చక్కఁజేయవలసిన కార్యము బూర్వోక్తులయిన యేవురయందు సందేహింప వలయును. మిత్రులను రక్షించువిషయమందు రా జెంతమాత్రము పరాకు పడరాదు; అట్లు పరాకుపడినరాజును లోకులు మిక్కిలియుఁ గీడ్పఱతురు. అసాధువు సాధువు గామ సాధు వసాధువుగాను నగుచున్నాఁడు. శత్రువును మిత్రుఁడగును. మిత్రు

తాతముత్తాతల వరుసనుండి కొలువుగలవాఁడు. సహజుఁడు, పినతల్లికొడుకు మొదలయినవాఁడు. కృత్రిముఁడు, ధనాదులచే వశీకృతుఁడయినవాఁడు.

డును మిక్కిలి దుష్టుఁడు కావచ్చును. మనుష్యుని చిత్త మెప్పు డును నొక్కతీరున నుండదు. కాబట్టి వాని నొకప్పుడును నెవఁడు నమ్మును? కాబట్టి ముఖ్య మయిన కార్యమును రాజు చక్కఁగానే చేయవలయును. ఒక్కటే యెడ తెగని విశ్వాసము, ధర్మార్థములను మూలముట్టుగ నాశము సేయును. అందఱయెడ విశ్వాసము లేకుండుటగూడ, మృత్యువుకంటె నెక్కుడయినది. విశ్వాసము కాలమృత్యువగును. అవిశ్వాసము విపత్తుగాఁ బర్యవసించును. ఒకఁడు మఱొకనిఁ బూర్ణముగా విశ్వసించెనేని, యీమఱియొకఁడు తనయెడ మంచికోరిక కలిగియుండు నంతవఱకుఁ దాను బ్రదుకును. ఈకారణమునుబట్టి కొందఱయెడ నమ్మికయు, శంకయు రెండును గలిగి యుండవలయును. ఇది రాజనీతిగతి. ఇది సనాతనమయిన సంపత్తి. ఒకఁడు 'నేను గతించినయెడల నాధనము వీనికిఁ జేరవచ్చు' నని యెవనినిగూర్చి తలంచునో యట్టి వానియెడ నెప్పుడును సందేహించుచుండవలయును. పండితులట్టివాని నమిత్రునిఁగా నెన్నుదురు. ఎవనిపొలము దారిని, మఱొకని పొలమునకు నీరుపాఱుచున్నదో యీ మనుష్యుని యిష్టము లేక యిక్కడనుండు కట్టలు తెగిపోనేరవు. అట్లే మిక్కిలి నీటికి భయపడి యీమనుష్యుఁడు గనిమను ద్రెంపఁగోరును.* ఇటువంటి లక్షణముగలవాఁడై శత్రువులు చొచ్చుటకు దారియైన

---

* పెద్దచెఱువు నసకట్టదాపున పొలము గలవాఁడా కట్టను గాచుచుండెనేని దానిక్రింది పొలములు నిమ్మళముగా పంటలు పండుచుండును; వాఁడా కట్టను చెగఁగొట్టినా క్రింది పొలములెల్లఁ జెఱుపు గలుగును. అట్లే గొప్ప శత్రువుండఁగా రాజ్యంపు పొలిమేరను గాచువాఁడు (సీమాంతపాలుఁడు) దానిని బదిలముగాఁ గాచుచుండినచో పరరాష్ట్రమునుండి మంచిసరకులు (ప

రాజ్యంపునెల్ల గాచుచుండునట్టి వాని నెప్పుడును శంకించుచుండవలయును. బుధులు వానిని శత్రువుగా నెన్నుచున్నారు. రాజు వృద్ధినొందుట కెంతమాత్రము తపింపక యత్యంతము సంతోషించువాఁడును, రాజు క్షీణతనొందెనా మిక్కిలి దీనతనొందువాఁడును నగుట యుత్తముఁ డయినమిత్రునిలక్షణముగాఁ జెప్పుదురు. ఎవనినిగూర్చి 'నేను బాడిమాలితినా వీఁడును బాడిమాలు'నని తలంతువో యట్టివానియందు, తండ్రి యందుం బోలె విశ్వాస ముంపవలయును. అట్టివానిని రాజు తనశక్తి కొలఁదిని సర్వవిధముల వృద్ధినొందింపవలయును. ఎవఁడు నీధర్మకార్యములందు నీకుఁ గీడురాకుండ వారింపఁజూచునో యట్టివాఁడు, తక్కిన కార్యములందుఁ గీడువాటిల్లకుండునట్లు చూచుచుండును. ఇట్లుండుటయె యుత్తమం బగు మిత్రలక్షణము. ఎవ్వరెవ్వని క్షీణతనుగోరుదురో వారువానికి శత్రువులని చెప్పంబడెదరు. నీకు వ్యసనము కలిగినప్పుడు మిక్కిలి భయపడువాఁడును, నీకుఁ బెంపు సొంపారునపుడసూయలేక యుప్పొంగువాఁడును, నగుమిత్రుఁడు నీకు సమానుఁడని చెప్పఁబడును. మంచిరూపమును, మేని చాయయుఁ, దియ్యని యెలుఁగును గలిగియోర్పుగలవాఁడై యసూయలేక మంచికులమునఁ బుట్టి మంచిస్వభావము చెలఁగుమన్న పురుషుఁడు, రాజునకు వెను వెనుక ముఖ్యుఁడుగా (అనఁగాఁ బ్రధానమంత్రిగా) నుండవలయును.

ణ్యములు)వచ్చుటచే స్వంష్టిము సుఖమునొందును. ఆపాలిమేరను భేదించెనా స్వరాజ్యము శత్రువులు చొచ్చుటచే నశించును. ఇట్లు శత్రువు వానికధీనుఁడుగా నున్నాఁడుగాన యట్టి సీమాంతపాలుని బలనను శంకించుచుండవలయునని భావము.

ఋత్విజుఁడయినను, గురువయినను, మిత్రుఁడయినను, మేధావియు మంచి జ్ఞాపకశక్తి గలవాఁడును, సమర్థుఁడును, స్వభావమునఁ గ్రూరుఁడు గానివాఁడును,దన్ను గౌరవించినను గౌరవింపక పోయినను మనసునఁ గొంచెమైనను భేదము నొందనివాఁడును నగు పురుషుఁడు నీగృహమందు నిలిచి యమాత్యుఁడుగా నుండఁ గోరునేని నీవు పూజించుచుండవలయును. అతనికి నీపరమరహస్యములయిన మంత్రాలోచనములును నీధర్మార్థముల కలస్థితియుఁ దెలుపవచ్చును. అతనియందుఁ దండ్రియందుంబోలె నీవు విశ్వసింపవలయును. ఒకకార్యమునకు నొక్కనినే నియమింపవలయును గాని యిద్దఱను ముగ్గురను గూడదు. ఏలన వారొకరి నొకరు సైఁపకపోవచ్చును. ఒక్కకార్యమునందుఁ బెక్కండ్రను నియమించినపుడు వారలకు భేదముగలుగుట యెప్పుడును జూపట్టుచున్నది. కీర్తి ప్రధానము గాఁగలవాఁడై, సమయములన్నిటను

'సతే విద్యాత్పరం మంత్రంప్రకృతిం చార్థధర్మయోః' అని బో.మూలము. 'సంవిద్యాః పరమం మిత్రం ప్రకృతి ..' అని దా. మూలము. ధర్మార్థములరెంటికిని ప్రకృతిగానుండు మిత్రుని మిక్కిలి యుత్తముఁడఁగా దెలియవలయునని యర్థము. ప్రకృతి యనఁగా ముఖ్యకారణము. ఇది అర్థమునకును ధర్మమునకును ధర్మార్థములు రెంటికిని ప్రకృతిగా మూఁడువిధములగును:—ఇందుఁ 'గృషి, వర్తకము,కోట, మేర, ఏనుఁగులు పట్టుచోటు, బంగారు రత్నములు మొదలయినవి యెత్తుచోటు, కప్పముతీయుట, దిక్కులేనిచోటు' అని యీయెనిమిదియు అర్థసంబంధియగు ప్రకృతి. ధర్మాధికారియగు నొకఁడు ధర్మప్రకృతి యగును. కోట్యధ్యక్షుఁడు, సేనాపతి, రాజు, పురోహితుఁడు, వైద్యుఁడు, జ్యోస్యుఁడు నసెడి యీయారువ్వురును, ధర్మార్థములు రెంటికిని ప్రకృతియగుదురు - అని ఆంధ్ర వ్యాఖ్యానము.

చప్పక వర్తించుచు, సమర్థులగు వారిని ద్వేషింపక, యనర్థముల నాచరింపక, కామమువలనఁగాని భయమువలనఁగాని లోభ క్రోధములవలనఁగాని ధర్మమును దిగవిడువక, సమర్థుఁడయి వలయునంత మాటాడు దిట్టతనము గలిగియున్న పురుషుఁడు నీకు వెనువెనుకఁ బ్రధానుఁ డగు మంత్రిగా నుండవలయును. మంచి కులమునఁ బుట్టినవారును, శీలసంపన్నులును, ఓరుపు గలవారులును, తన్నుఁదాను బొగడుకొననివారును, శూరులును, గొప్ప తనముగలవారును, విద్వాంసులును, గర్హ్యమిదియని నిశ్చయింప నేర్చినవారును నయిన యిట్టిపురుషులను, నీకార్యములన్నింటిని జూచుటకు మంత్రులుగా నేర్పఱుపవలయును. వీరు నీవలనఁ బూజితులై వలయువస్తువుల నొందు, నీమేలునందే నిష్ఠ కలిగి నీకెంతయు సహాయులై యుందురు. అర్థమును సంబంధించిన యాదాయ వ్యయములు మొదలయిన కార్యములందును మఱియు గొప్ప కార్యములందును నియుక్తులై వీరు మిక్కిలియు శ్రేయమును గలిగింతురు. మఱియు,వీరొండొరులకు మేలు చేయఁతాము కాఁగోరుచు, వలయునపు డొకరినొకరు గలసి యాలోచించుచు, అర్థమును సంబంధించిన కార్యములనెల్లఁ గావించుచుందురు. ఎప్పుడును జ్ఞాతులను జూచినచో మృత్యువుంబోలె నెన్ని భయపడవలయును. జ్ఞాతి సామంతునివలెనే యెప్పుడును రాజు వెంపును సయింపఁడు. కపటము లేక, మెత్తఁదనముగలిగి మిక్కిలి దాతయు, నకార్యములందు లజ్జగలవాఁడును, సత్యవచనుఁడును నగు రాజు నాశమునకు జ్ఞాతిత్వప్రదక్కిన వాఁడెవ్వఁడును సంతోషింపఁడు. ఒకప్పుడు జ్ఞాతులు గానివారును దుఃఖము కలిగింతురు; జ్ఞాతులును సుఖము గలిగింతురు. జ్ఞాతులు లేనివా

నిని దక్కి-నజనులును గీడ్పఱుతురు. పరులచే నవమానితుఁ డయిన మనుష్యునకుఁ దనజ్ఞాతియె ముఖ్యమయిన ప్రాపగును. తనజ్ఞాతికిఁ గలిగిన యవమానమును జ్ఞాతియొక్కఁడె సైఁపఁడు. తక్కినవాఁ డట్లుండఁడు. బంధువు తనజ్ఞాతికిఁ జేసిన యవమానమును దనకుఁ జేసినట్లే తలంచును. కాఁబట్టి, జ్ఞాతులయందు గుణమును దోషమును రెండును గానంబడుచున్నవి. జ్ఞాతిలేని మనుష్యుఁడు సంతోషమును బొందఁడు. వృద్ధియుఁ బొందఁడు. జ్ఞాతి వర్గమందు మంచి సెబ్బరలు రెండును గనుపట్టుచున్నవి. జ్ఞాతులను వాక్కు-చేతను గార్యములచేతను నెప్పుడును గౌరవముతోఁ బూజింపవలయును. వారలకుఁ బ్రియమే చేయవలయును. అప్రియ మెంతమాత్రమును జేయరాదు. వారి యెడల మనస్సునందు నమ్మిక లేకుండినను, ఎప్పుడును నమ్మిక గలవానివలె నుండవలయును. వారియందు గుణమనికాని దోషమనికాని దృఢముగా నిరూపించుట శక్యముగాదు. ఇట్లు పరాకులేక ప్రవర్తించుచువచ్చు మనుష్యునియందుఁ బగవారును గలంకలేక మిత్రులగుదురు. ఇట్లు శత్రువు, మిత్రుఁడు, ఉదాసీనుఁడు, జ్ఞాతి, బంధువు లనువీరలయందు నెప్పుడును బ్రవర్తించుచు నచ్చు మనుష్యుఁడు చిరకాలము మంచికీర్తిని బొంది వెలయుచుండును." అనెను. ఇది యెనుబదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు ధర్మరాజునకు జ్ఞాతివిషయమై కృష్ణునకును నారదునకును జరిగినసంవాదమును జెప్పుట.}

ధర్మరాజు 'ఇట్లు పరస్పర మసూయ గలజ్ఞాతులను బొంధ

వులను మిత్రులను శత్రువులను దనవశము చేసికొనుట యిట్లు కష్టముగా నున్నదిగాన వారల మనసులను వశము చేసికొనుటకు దారియెద్ది?' యని యడిగెను.

భీష్ముడు ఈవిషయమై, దేవర్షియగు నారదునకును వాసుదేవునకును నొకసంవాదము జరిగెను. పురాతనమయిన యీయితిహాసము నుదాహరించెదరు. వాసుదేవుడు 'నారదా! పండితుడుగాని మిత్రుడును, బండితుడయ్యును మంచి తెలివిలేని యమిత్రుడును, బగమమయిన మంత్రమును (రహస్యమును) దెలిసికొనఁ దగినవారుగారు. కాబట్టి, నీకుఁ గలపరిపూర్ణజ్ఞానమును మంచిచెలిమిని దృఢముగా నేను గనుఁగొన్న వాఁడనుగాన కొన్నివిషయముల నడుగుచున్నాను. నేను*రాజనిపేరుగలిగి జ్ఞాతులకు నూడిగము చేయుచున్నాను. భుజింపఁదగిన వానియందు, సగమునుమాత్రమే భుజించుచున్నాను. తక్కినసగమును జ్ఞాతుల కిచ్చుచున్నాను. వారల వాక్కులనుండి వెలువడు పరుసంపుమాటలను సహించుచున్నాను. అగ్నిని గోరినవాఁడరణిని జిలుకునట్లు, ఆపరుసనిమాటలు నామనస్సును మథించుచున్నవి. దేవర్షీ ! వారల వాక్కులనుండి వెడలు క్రూరంపుఁబలుకులు నన్నెప్పుడును దహించుచున్నవి. నారదా! బలదేవుఁడు బలమునమిన్న. గదుఁడు సౌకుమార్యమునను బ్రద్యుమ్నుఁడు చక్కఁదనమునను మదించి యున్నవారు. నాకు సహాయుఁడొక్కఁడును లేఁడు. నారదా ! తక్కినవారయినయంధకులును వృష్ణు

---

*దాస్యమైశ్వర్యవాదేన జ్ఞాతీనాం వైకరోమ్యహమ్' అని దా.మూలము. '...నకరోమ్యహమ్' అని బొ.మూలము. నాదాయాదుల యైశ్వర్యము నెత్తిపొగడుచు వారికి నూడిగమును సెప్పుడునుజేయను' అని ప్రతాపచంద్రరాయలు.

లును మిక్కి_యు భాగ్యవంతులై బలవంతులు నై పరులకుఁ జెనకరాకున్నారు. వా రెడ తెగనిపూనికయుఁగలరు. వా రెవ్వని పక్షమునఁ జేరరో వాఁడు నశిం చును. ఎవ్వని పక్షమునఁ జేరు దురో వాని కన్నియుఁ గలుగుచున్నవి. ఆహుకుఁడును అక్రూ రుఁడు నిరువురును దమయందు నాకధిక మగునెయ్యము లేదని నన్ను విడిచియున్నారు. కాన వారియం దొకరిపక్షమును జేరలే కున్నాను. ఈ యిరువుర పక్షమున నుండుటయు దుఃఖముగా నున్నది. ఈ యిరువురను విడిచి పుచ్చుటయు నంతకంటె దుఃఖ ముగానున్నది. మహర్షీ ! ఒక తల్లి తనయిరువురు కొడుకులును జూడరా, నపు డిరువురకును గెలుపును గోరినట్లు, నేనును వారి యందొకరికి గెలుపును మఱొకరికి నోటమియుఁ గోరకున్నాను. నారదా! ఈ యిరువురనుబట్టి యిట్లు దుఃఖపడుచున్నాను గాన, నా నిమి త్తము నాకును జ్ఞాతులకును శ్రేయం బయినమార్గ మును నీవు చెప్పవలయును' అని యడిగెను.

నారదుఁడు ' వృష్ణికులతిలకా ! మనుష్యునకు బాహ్యము ఆభ్యంతరము నని రెండు విధములయిన యాపదలుగలవు వీని యందుఁ దనచేతఁ గావింపబడినది యాభ్యంతర మనియుఁ,బరు లచేతఁ గావింపఁబడినది బాహ్యమనియుఁ జెప్పఁబడును. ఇప్పుడు నీకుఁ గలిగియున్నయాపద యాభ్యంతరము. ఇది నీ కర్మముల వలననే కలిగినది. బలదేవుఁడు మొదలయిన భోజవంశమువా రక్రూరునితో సంబంధించి, ధనమునుబట్టియో, యిచ్చచేతనో, మాటలచేతనో, ద్వేషముచేతనో,పురికొనియో యతని పక్షమునఁ జేరినవారయిరి. నీ వన్ననో, నీవు గడించినధనమును మఱొకని కిచ్చివై చితివి.నీకు స్నేహితులు గావలసినందఱుమనుష్యు లున్నను

నీవు చేసినపనివలననే,యీబెడదదెచ్చుకొంటివి.ఆధనమును గ్రక్కి-నకూటినింబోలె మరలఁగయికొనుట శక్యముగాదు. బభ్రువునుండియు*నుగ్రసేనునివలన నుండియు రాజ్యమును మరలఁ బడయుట యలవిగాదు. నీవు నీయంతటను, విశేషించి జ్ఞాతులలో భేదము కలుగు ననుభయమువలనను,దానిని గయికొనుట దరముగాదు. ఒకవేళ నా ప్రయత్నము సిద్ధించినను నది మిక్కిలి ప్రయాసమున మహోదుష్కరమును జేసినపిదపనే కలుగును. దాని వలన గొప్పక్షయమును గొప్పధననాశమును, లేక పూర్ణనాశమును సంభవించును. కాఁబట్టి యినుముచేతఁ జేయఁబడని సాధనము నుపయోగింపుము. అది మృదువయ్యు హృదయములఁ ఛేదించునదిగా నుండవలయును. దానిని దీటి దీటి నీజ్ఞాతులండఱ నాలుకలను గోసిపుచ్చుము' అనెను. వాసుదేవుఁడు 'నన్ను దీటి దీటి నాజ్ఞాతుల నాలుకలను జక్కఁబఱుపుమని చెప్పితివే. ఇనుము కాక మృదువయ్యు హృదయములను ఛేదించునట్టి యాయాయుధమెద్ది ?' యని యడిగెను.

నారదుఁడు 'నీశక్తికొలఁది నెప్పుడు నన్నము వెట్టుట,ఓరుపు, నిష్కాపట్యము, మెత్తఁదనము, పూజ్యులగు వారిని బరువుకొలఁదిని బూజించుట యనునివియె యినుము కాని యాయుధము.

---

* ఆహుకుఁడును అక్రూరుఁడును పరస్పరము మిక్కిలి వైరముగలిగియుండిరి. ఈ యిరువ్రురును గృష్ణుని తమతమ ప్రక్కఁజేరఁ బురికొలిపిరను నతఁడట్లు చేయక యిరువురయెడ సముఁడై యుండెను. కాన వారి కితనియందుఁ బక్షపాతులేకుండెనని తెలియునది.

ఇక్కడ నుగ్రసేనునకు రాజ్యమిచ్చి వేయుటయే కృష్ణునియందుఁ దప్పుగా నారదుఁడు చెప్పుట తెలియునది.

కటువుగాను జులకగాను నీజ్ఞాతులు మాటలాడఁ గోరుచున్న పుడు నీవు వారలమనసును, వాక్కును, హృదయమును మంచి తిన్నని మాటలచేతనే యడఁంపుము. మహాపురుషుఁడు గానివాఁడును,మంచిబుద్ధి లేనివాఁడును,సహాయము లేనివాఁడు నగు నొక మనుష్యుఁడు తగినంత పెనుబరువును నెంతపాటుపడిననుతొమ్మున మోవఁజాలఁడు. నీ విట్టిబరువును (వృష్ణులను బరిపాలించు టను) నీ మూఁపున భరింపుము. ఎద్దులన్నియును మిట్టపల్లము లులేనిదారిని పెనుబరువును మోయును; పోవఁ గటు వయిన దారియందుఁ బ్రసిద్ధిగన్న మేలియెద్దు మాత్రమే పెనుబరువును మోయును. కేశవా ! నీవు నీసంఘమందు ముఖ్యుఁడవుగా నున్నావు. ఈ సంఘము భేదిల్లెనా పెనునాశము గలుగును. కాఁబట్టి యీ సంఘము నిన్నుఁబొంది కీడ్పడకుండునట్లుగా నీవు గావింప వలయును. ప్రాజ్ఞుఁ డగువానియందు బుద్ధియు శూరుయునిందిం యనిగ్రహమును ధనమునిచ్చుటయు నుండునే కాని తక్కిన గుణము లుండవు. కృష్ణా ! ఎప్పుడును దనపక్షమువారిని రక్షిం చుట, ధనమును గీర్తిని నాయువును వృద్ధిఁబొందించును. కాఁబట్టి జ్ఞాతులకు నేకొదవయు లేకుండునట్లుగా నీవు చేయవలయును. ప్రభూ ! సంధి విగ్రహము మొదలయిన యీఱు గుణములను ప్రయోగించుటయు దండయాత్రలుపుటయు రాఁగలకాలము నను వర్తమానకాలమునను గలదియు నీకుఁ దెలియని దొక్క టియులేదు. మహాబాహూ ! యాదవులు, కురురులు, భో జులు, అంధకులు, వృష్ణులు, లోకములు, లోకపతులు నంద ఱును ని న్నాశ్రయించినవారై యున్నారు. మాధవా ! ఋషు లును నీయభివృద్ధిని గోరుచున్నారు. నీవు సమస్త ప్రాణులం

దును బెద్దవు. నీపు పరమం బయినగతి నెఱుఁగుదువు. యదువు లందు మిన్నవు. నిన్ను నండగొని యాదవులు సుఖముగా వర్ధిల్లు దురు' అనెను. ఇది యెనుబదియొకండవయధ్యాయము.

రాజధర్మానుశాసనపర్వము.

భీష్ముఁడు, అమాత్యపరీక్షను గుఱించి కాలక వృక్షీయోపాఖ్యానమును జెప్పుట.

భీష్ముఁడు 'అమాత్య పరీక్ష విషయమై నే నిపుడు చెప్పినది ప్రథమవిధి. రెండవవిధిని జెప్పెదను వినుము. రాజుసర్థమును వృద్ధిఁ బొందించుమనుష్యుని రా జెప్పఁడును రక్షింపవలయును. బొక్కసము నశించుచుండునపుడు, అమాత్యుఁడే దాని నపహరించుచున్నాడని తెలిసి వేతనము పుచ్చుకొనువాఁడో మఱి యితరుఁడో దానిని నీకుఁ జెప్పవచ్చునేని. వాఁడుచెప్పినది మంతనమున విన నవధరించి యాయమాత్యుని బారినుండి వానిని రక్షింపవలయును. అపహరింపఁ దొడఁగిన యమాత్యులు రాజునకు మిక్కిలి వలయునట్టివారిని రూపుమాపఁజూతురు. రాజుకోశమును నపహరింపఁ జూచు మనుష్యులందఱను నొక్కటిగాఁ గూడికొని దానిని గావం గోరువానిని బాధింప నుంకింతురు. కాన వానిని రాజు రక్షింపనిచో వాఁడు తప్పక నశించును. ఈ విషయమై కాలకవృక్షీయుఁ డనుముని కోసలరాజును జూచి చెప్పిన యీ పురాతన మగునితిహాసమును నుదాహరించుచున్నారు. ఱేమదర్శి యనువాఁడు కోసలదేశమునకు నధిపతి. వాని యొద్దకుఁ గాలకవృక్షీయుఁ డనుముని పోయెనని మాకు వినికి.

అతఁ డొకగూటియందు నొకకాకిని బంధించికొని శ్రేమదర్శి క్రింది యధికారు లందఱు నడవళ్లను బరిశీలించుకొఱకు నానాజు దేశమునందు మాటిమాటికిఁ గ్రుమ్మఱినవాఁడయ్యె. అతఁడు 'నేను గాకిని సంబంధించినవిద్యను గఱచియున్నాను. జరిగిన దియు జరుగుచున్నదియు జరుగఁగలదియు నన్నియు నాకుఁ గాకులు దెలియఁబఱుచుచున్నవి' యని యీరాజ్యమందుఁ బెక్కండ్రకుఁ జెప్పుకొనుచుఁ జుట్టును సంచరించు చుండెను. అతనిని బెక్కుజనులు బలసికొని యుండుటవలన నతఁడు రాజు నియోగుల యందఱు యపచారములను గనుఁగొన సాగెను. ఇట్లతఁ డా రాజ్యమందుఁ గలకార్యమునంతయు, అందందుఁగల యధికారుల దోషములను, అశేషముగాఁ దెలిసికొని యంత 'నాకు నీరాజ్యమునందలి వన్నియుఁ దెలియు' నని చెప్పికొ నుచు రాజును జూడంగోరి కాకముతోఁ గూడఁ బోయెను. అతఁడు కోసలరాజుకడకుఁ బోయి యందు భూషణాలంకృతుఁడై యున్నయమాత్యునిఁ జూచి 'అమాత్యా! నీ వీయీచోట నీయీకార్యమును జేసితివి.దీనిని నీఁడును వీఁడును నెఱుఁగుదురు. రాజుబొక్కసము నపహరించితివి. ఈవిషయమును గాకి చెప్పుచు న్నది. కాన దీనిని శీఘ్రముగ నాలోచింపుము' అనెను. అతఁడ ప్పు డాతీరుగనే యందు బొక్కసము నపహరించి యున్నతక్కిన వారిని గూర్చియుఁ జెప్పెను. ఆముని చెప్పినమాట యించు కయినను బొల్లగుటలేదని యెందును బ్రసిద్ధిగాంచియుండెను. ఇట్లాబుషి యపరాధులం గావించిన యధికారు లందఱును నొక్కటిగాఁ గూడి రాత్రియం దతఁడు నిదురించు చుండఁగా నతనిని మీఁది యీకాకమును జంపివైచిరి. తెల్లవాఱఁగానే


యాముని గూఁటియందుఁగాకి ప్రాణముచేఁగొట్టువడియుండుట నుజూచి తేమదర్శియొద్దకుఁబోయి 'రాజా! నీవు ప్రాణములకును ధనమునకును ప్రభుండవు;ఈశ్వరుండవును.కాన నీవలన నభయ మువేఁడెదను. నీయాజ్ఞనుగొని నీకు హితంబగు వచనముఁజెప్పఁ గోరుచున్నాను. నీవు శూరుండవై యున్నను, నీ వలననుండియు ధనము లవ్వారిగా నపహరింపఁ బడుచున్నవి. ఈ విషయమై మి క్కిలియు దుఃఖితుఁడనయ్యా, మిత్రుల కార్యమునందు మిక్కిలి యక్కఱ కలిమింబట్టియు, నేను నీహితమునుగోరి,సారథి మంచి గుఱ్ఱమును మీఱునట్లు, నిన్ను మీఱితివైనను నీకుఁ దెలుపవల యు ననుతలంపునఁ బ్రేమ డయివాఁ నిందు వచ్చితిని. మిత్రుఁ డగువాఁ డొకఁడు తనకు హితము సేయఁగోరి యందులకై యతి మాత్రకోపమును భక్తియుఁ బెనఁగొన బలవంతముగాఁ దన్ను మీఱి తెలుపవచ్చెనేని, తనమేలును దెలిసి తనయైశ్వర్యము నభి వృద్ధిని గోరునట్టిప్రాజ్ఞుం డగుపురుషుఁ డతనిని క్షమింపవల యును.' అనెను. రా జతనిం జూచి 'నీవేది కోరుదువో దానిని నాకుఁ జెప్పవచ్చును. నేను నాహితమును గోరినవాఁడను గాన నీ వేది చెప్పినను నాకోరుపు లేకుండుటకుఁ గారణమేమి? ఈ విషయమై నీ విష్టపడునది చెప్పుము. ఇట్లని నీకు గట్టిగాఁ బ్రతిజ్ఞ సేయుచున్నాను. బ్రాహ్మణోత్తమా ! నీవు చెప్పిన మాట చొప్పున నేను జేసెదను' అనెను.

ముని *'నేను నీక్రింది కొలువుడుగాండ్రి గుణములను దోష

* విద్వాన్నయానపాయాంశ్చ భయాఖ్యాతృన్ భయానిచ, భక్త్యా వృత్తిం సమాఖ్యాతుం భవతోఽన్తికమాగతః. ప్రాగేవోక్తంతు దోషోఽయ మాచార్యై ర్నృపసేవనమ్ । అగతేః కుగతిర్హ్యేషా యారాజ్ఞా సహజీవితా'

ములను వానివలన నీకుఁగలుగు భయములను జక్కఁగా గుఱు తెఱిఁగి, నీయందలి భక్తిఁజేసి వానినంతయుఁ జెప్పుటకై నీయొద్దకు వచ్చితిని.ధర్మోపదేశకు లయిన యాచార్యులు రాజునుగొలుచుట దోషమని మును లే చెప్పియున్నారు. రాజునుగొలిచి బ్రతుకుట, వేఱుగతి లేని మనుష్యునికిఁగూడ మిక్కిలి కుచ్చితమయిన బ్రతుకగును. రాజులను జేరియున్న మనుష్యునిఁ, గూర్చిరసర్పము లతోఁ జేరినవానినిగానే పెద్దలు చెప్పెదరు. రాజులకు మిత్రులును బెక్కండ్రు; శత్రువులును బెక్కండ్రు; కావున వారలందఱి వలననుండి రాజు నుపజీవించువారికి భయము కలుగునని జెప్పెదరు. అట్లు రాజువలన నుండియు నొక ముహూర్తకాలమున వీనికి భయము కలుగును. రాజునెడ నెప్పుడును నొక్కతీరునఁ బరాకు లేకయుండుట శక్యము గాదుసుమీ. సంపదను గోరు మనుష్యుఁడు రాజువలన నేవిధమునను బరాకు పడఁగూడదు. పరాకువలన మనుష్యునిబుద్ధి చెడుచున్నది. బుద్ధి చెడినవానికిఁ బ్రాణము నుండదు.మంచి చదువరి యగువాఁడు ప్రాణమునకును ధనమునకును బ్రభుండును నీశుండు నగు రాజును, మండుచున్న యగ్నిని గుపితమైన సర్పమును డగ్గఱునట్లు,దారసింపవలయును. తాను మెలఁగవలసిన విధమును జక్కఁగాఁ గఱచికొని యొకఁడు రాజసమీపమున,మండుచున్న యగ్ని సమీపమునందుఁ బోలెఁ, గూర్చుండ వలయును. రాజు ప్రాణమునకును ధనమునకును బ్రభుఁడును నీశ్వరుఁడును నగును. కాన యతఁడు క్రూరవిషముగల

అని దా. మూ. 'జ్ఞాత్వాన ఘానఘాంశ్చాపి భృత్యైతస్తే భయానిచ,భక్త్యా... మాగమమ్,ప్రాగేవో క్తస్తు దోషోయమాచార్యైర్నృపసేవినామ్,అగతీకోగతి ర్వేశ్యా పాపా రాజోపసేవినామ్' అని బృ. మూలము.



415. జీవుడర్శితో కాలకవృక్షీయుఁ డనుబుషి తనకాకిని మంత్రులు చంపిరని చెప్పుట.

సర్పముఁ బోనివాఁడగుటంబట్టి యతనిని, బ్రతికుణమును,దన్ను లేదని తలఁచుకొనుచుఁ, దాను నశింపఁగ లఁచ్లె యెన్నుకొనుచు, మిక్కిలి జాగ్రత్తతోఁబరిచరింపవలయును వాఁడురాజు మ్రోలఁ జెడుమాట లాడుటకును, దాఁటుమాటుగఁ గూర్చుండుటకును, దగని చేష్టలు చేయుటకును, దగని రీతుల దగ్గఁటుటకును, దగని పోకలు పోవుటకును, దగని యభినయములును నంగ వికృతులును నెఱపుటకును, నెపుడును జంకు గలిగియుండవలయును. రాజును బ్రసన్ననిఁ గావించినచో నతఁడు దేవతవలె సకలార్థములును గలిగించును. అతఁడు క్రుద్ధుఁడయ్యెనా యగ్నివలె సమూలముగా దహించి నైచు' నని యముఁడు చెప్పెడు. అట్లు లోకవ్యవహారము జరుగుచున్నది. (ఈవిధుల చొప్పున) నీకు నభివృద్ధి గలిగించు దానినే యిపుడు చేయుదును. మాబోఁటి యమాత్యులు నీబోఁటిమిత్రములకు నాపదయందు బుద్ధిని సహాయము చేయుదురు. ఈకొకి నాయది, నీకార్యమును జేసినందులకై చంపఁబడినది. ఇందులకై నిన్ను నిందించుట నాకుఁదగదు. కాని, యీపక్షిని చంపినవారికి నీయందుఁ బ్రేమ లేదు. నీకు హితులెవరో యెవరహితులో దెలిసికొనుము. ఇతరులకు నీబుద్ధిని లోపఱుపక యన్నిటిని నీయంతన నీవే చేయుము. నీయింట నున్నవారందఱును మ్రుచ్చులు చుమీ. వారు నీప్రజలవెంపును గోరువారు గారు. కాన వారి విరోధమునకు నేను గుఱియైతిని. వారు నీకంతరంగు లయినవారితోఁ గుట్రపన్ని నిన్ను నాశము సేయుటవలన నీపిదప రాజ్యమును దా మాశ పడుచున్నారు. అయినను వారి పన్నుగడ లసందర్భములవలన సిద్ధించినవిగావు. వారివలన భయపడి నేను మఱియొక్క పట్టు

నకుఁ బోయెదను. నాకు విషయవాంఛ యేమియు లేకున్నను, నీమనుష్యులు దురాత్ములుగాన యీబ్రాహ్మణమును నాకాకిని గూర్చి యేసి దానిని యమపురికిఁ బంపిరి. నేను దీనిని దపంబున మిక్కిలియుఁ బ్రాపారు దివ్యదృష్టిచేఁ గనుఁగొంటిని. నీ రాజ్య మిది వెక్కులు నక్రములు, చేఁపలు, మొసళ్లు, తిమింగలములును గుంపులుగాఁ గలిగి యున్నయొక మహానదిని బోలినది. దీనిని నే నీకాకిచే నుత్తరించితిని. నీరాజ్యమును - గూలిన వ్రాఁకులును బండతాలును ముండ్లును గలిగి, సింహవ్యాఘ్రములు నెరసి, చొచ్చుటకును నుండుటకును నశక్య మయినహిమవంతపు మహాగుహయుంబోని నీరాజ్యమును - నీకాకితోడ్పాటునఁ గడచితిని. పండితులు చీఁకటి గ్రమ్మియుండుటచేఁ బోరాని ప్రదేశమునకు దీపముతోడునఁ జొరను, దాఁటరాని నదిని నోడలచేత దాఁటను వచ్చునుగాని, చొరరానిరాజు నీతిపథమునందుఁ జొచ్చుటకును గడచుటకును నేయుపాయమును దెలియరా దందురు. నీ రాజ్యము చీఁకటిగ్రమ్మిచొరరాకున్న యొకయరణ్యమువలె నున్నది. దీనికి నొడయుండ వగునీకు నిందు విశ్వసించుట యలవిగాకున్నది.ఇఁకనాకు విశ్వసించుటను జెప్పనేల? ఇందుమంచియు సెబ్బరయు సమముగానే యున్నది. కాఁబట్టి యిందు వసించుట నేమముగాదు. మంచికార్యము చేయువాఁ డిందు వధమునే పొందుచున్నాఁడు. దుష్కార్యము చేయువాని కేజంకునులేదు. న్యాయముచొప్పున దుష్కార్యము చేయువానికే వధము కలుగవలయునుగాని, సత్కార్యపరుని కెంతమాత్రముగాదు. కాఁబట్టి యిచ్చటఁ జిరకాల ముండుట యుక్తముగాదు. తెలిసినవాఁడు దీనిని శీఘ్రమున దిగవిడువ వలయును. రాజా! సీత యనెడి నదియొకటి

గలదు. దానియందుఁ బడవలు మునుఁగును. నీయీరాజ్య మానదికి సాటియైనది. సర్వమును నాశము సేయునట్టి వలవంటిది. *నీవు తేనె గోరువా రుటకిపడు చఱియవు; విషముగలసిన యన్న మవు. నీస్వభావ మిపు డసజ్జనుల భావముంబోలెఁ దోఁచుచున్నది; కాని సజ్జనులభావముంబోలెఁ గాదు. నీవు క్రూరవిషములగు సర్పములు చుట్టియున్నకూపమువలె నున్నావు. నీవు, చొరరాని రేవుగలదియు పెద్ద గట్ట గలదియు, వెదుళ్లయు ప్రేములయుఁ బొదరులు బలసినదియునై తియ్యనినీరు గలయేటివలె నున్నావు. కుక్కలును గ్రద్దలును నక్కలును జుట్టి యున్న రాజహంస మవు. ఒక పెద్ద మ్రాఁకును నూఁతగొని పెచ్చుపెరిఁగిన పెనుతీఁగలగుబు రా మ్రాఁకును గ్రమ్ముకొని దానికిఁ బొడవుగా వ్యాపించినదై పిదపఁ దన్నుముట్టిన పెద్దయెరగలిచిచ్చుచేత నా మ్రాఁకును సయితము దహించునట్లు,ని న్నాశ్రయించిన యమాత్యులు నున్నారు. రాజా ! వారలను బరికించి చూడుము. చక్కఁబెట్టుము. నీవలన నధికారము నొందినవారలును నీవు పరిపాలించుచున్నవారలు నగు మనుష్యులే ని న్నవమానించి నీప్రియునిఁ జంపఁగోరుచున్నారు. నేను రాజ వయిననీదుశీలమును ని న్నను సరించి బ్రతుకువారి స్వభావమును దెలియఁగోరుచు, వీరుని యిల్లాలి యింటియం దున్న విటకానివలెను, పామున్న యింటియందు వసించువానివలెను, మిక్కిలి జంకుగలిగి యెంతయు

---

* 'మధు ప్రపాతోహిభవాన్ భోజనం విషసంయుతమ్' అని మూలము. మధు ప్రపాతమనఁగా తేనె పెఱయున్న కొండచఱియకు నుతిపడుట. తేనె యున్నను అందులకై యాచఱియకు నఱుకుట యపాయకరమైనట్లు నీవు నపాయకరుఁడ వనుట.

నెచ్చరికతోడ ననన్ను రక్షించుకొనుచు నిందు వచ్చితిని. రాజేంద్రా! నేను 'రాజు జితేంద్రియుఁడగునా ? అతని భృత్యులడఁగి ఖడఁగి యున్నారా ? ప్రజలు రాజును ప్రేమింతురా ? రాజును ప్రజలను ప్రేమించునా?' యని తెలియఁగోరినవాఁడ నై యిందులకు నీకడకు వచ్చితిని. ఆకలి గలవానికి నన్నమువలె నీవు నాకుఁ బ్రియుండవయితివి. అయినను నేను నీయమాత్యులను దప్పిలేనివాఁడు నీటినింబోలె నెంతయు నొల్లను. నీకు మంచి నేయఁగోరితిని గాన నాయందు వారు దోషము కట్టిరి. వారికి నాయందుఁగలవిరోధమున కింతకంఁటె వేఱుకారణము లేదనుటకు సందేహము లేదు. నాకు వారియం దెంతమాత్రము ద్వేషము లేదు. వారియందలి దోషములను దెలుపుట వారికి ద్రోహము చేసినట్లయినది.మూఁపునఁ గొట్టువడిన సర్పము వలనంబోలె మంచిమనస్సు లేనిపగవానివలన భయము గలిగియుండ వలెను' అనెను.

రాజు 'బ్రాహ్మణోత్తమా ! నీకుఁ గలిగినయీకాతీయకుఁ దగిన పరిహారమెంతయుఁ జేసెదను. మఱియు మిక్కిలి సత్కరించెదను. ఇట్లు పూజితుఁడవై మరల నాయింట వసించియుండుము.ని న్నెవ్వరొల్లరోవారు నాయింట నుండరు. నీవు చెప్పినమమష్యులకు నీకనేమి చేయవలయునో నీవె తెలిసి చేయవలయును. నారాజ్యమందు దండము చక్కఁగా జరుపఁబడునట్లును, కార్యములు చక్కఁగాఁ గావింపఁబడునట్లును, నీవు కనుఁగొనుచు నేను శ్రేయమును బొందునట్లు వినియోగించుచుండుము' అనెను.

ముని 'నీ వీకాకిని జంపిన దోషమును గనుఁగొనకుండి యమాత్యులం దొక్కొక్కరిని (నధికారమందు) దుర్బలునిఁగాఁ

జేయుము. పిదప వారికిఁ దగినకారణముల నిరూపించి యొక్కొక్కనిఁగా వారిని జంపుము. వెక్కుండొక్కదోషమునే చేసిన యెడల వారందఱు నొక్కటిగాఁగూడి * ముండ్లనుగూడ మెత్తగిలఁజేయుదురు. ఇఁక మఱుబోఁటి మెత్తనివారలను జేయుట చెప్పనేల? ధనమందు జగమంతయుఁ గట్టువడియున్నది. కాన, దానిని ధనముచేతనే బంధింపవలయును. ధనము నాశ్రయించుట వలననే మనుష్యులకు గౌవరముపుట్టుచున్నది. కాఁబట్టిధనమును వారలనుండి తీసివైవుము. ఒక్కొక్క మనుష్యునియొక్క దోషమునకుఁగాను వానికి విరోధియైన మనుష్యుని వానికడకుఁ బంపుము. వాఁడామనుష్యునియందుఁ బెక్కులు దోషములు వెలువఱిచి వానిధనమును దీసికొని వైచును. కొందఱుకుఁ దిన్నని మాటలాడియుఁ, గొందఱుకుఁ బరస్పరము భేదము పుట్టించియు, వైరము కలిగింపుము. పిదప దండింపుము. రాజా! బుద్ధిమంతుఁ డగురాజు తనలోపలితలంపును గప్పిపుచ్చి, బిల్వకాయను గొనియె బిల్వకాయను గొట్టునట్లు, అశుద్ధుండగు మంత్రిని నశుద్ధుఁ డగుమనుష్యునిఁ గొనియే నాశముచేయఁదగును. కాఁబట్టి రాజా! మనమంత్రాలోచనములు (వారు సందేహించి) వెలిపుత్తు రేమోయని భయపడి యిట్లు జాగ్రత్తతో మెలఁగవలయునని యింతయు నీకుఁ జెప్పుచున్నాను. మేమో బ్రాహ్మణులము; కాన దయాళురము; ఎవ్వరిని దండింప నొల్లనివారమనుట ప్రసిద్ధము. మేము మాకుంబోలెనే నీకునుఁ దక్కినవా

* 'కంటకానపి మృద్నీయుఃʼ అని మూలము. ముండ్లవలె బాధకులయిన వారినిగూడఁ బడఁగూల్తురు. ఇఁక మఱుబోఁటి సాధువులను గూల్చుట చెప్పనేలయనిభావము.

రికిని శుభమును గోరుదుము. రాజా! నన్నుగుఱించి చెప్పుచున్నాను. నేను నీకుఁ జెలికాఁడను. నాపేరు కాలికవృక్షీయుఁడందురు. మీతండ్రిపరిపాలనమునఁ దీరాజ్యమునకుఁ బెక్కువిపత్తులు కలుగఁగా నేను దక్కినకార్యము లన్నియు దిగవిడిచి యీవిపత్తులను దొలఁగించుటకై యీపుడు తపము సలిపితిని. నీవు మరలఁ దగినవారలను మిత్రులని నమ్మి భ్రమింప కుండుటకై, నీయందలి స్నేహమువలన నీకుఁ జెప్పుచున్నాను. రాజా! నీవు రాజ్యమును నలవొకగాఁ బడసితివి. దానిని సంబంధించిన సుఖములను దుఃఖములను రెంటిని నాలోచింపుము. నీ రాజ్యములను మంత్రులయందుఁ బెట్టి నీవేల పరాకు పడవలయును?' అనెను. పిదప * రాజు క్షత్రియకులమం దొకనిని మంత్రిగా నేర్పఱచుకొని యీబ్రాహ్మణోత్తమునిఁ గాలకవృక్షీయునిఁ బురోహితునిఁగాఁ గయికొనెను. ఈ మార్పులయిన పిదపఁ గోసలరాజును భూమినంతయు నేకచ్ఛత్రముగాఁ బాలించి మిక్కిలి యశస్సును బొందునట్లుచేసి కాలకవృక్షీయముని యుత్తమములగు యాగములు పెక్కులు యజించెను. కోసలరాజు నతని హితవచనములను విని భూమిని జయించి యతఁడు నియమించునట్లు తాను నడచుకొనుచుండె' ననిచెప్పెను' ఇది యెనుబదిరెండవయధ్యాయము.

---

* తతో రాజకులే మంత్రీ సంజజ్ఞే భూతసాపనః, పురోహిత కులేచైవ సంప్రాప్తో బ్రాహ్మణర్షభః॥ అని జె. మూలము. తతోరాజకులే నాన్వీ సంజజ్ఞే' అని (డా. మూలము) ఆబ్రాహ్మణోత్తమునిఁబురోహితునిఁ గావింపఁగా రాజకులమువారి యందు మిక్కిలిస్తుతులు చెలంగెనని యర్థము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు మంత్రి మొదలయిన వారి లక్షణములను జెప్పుట.

ధర్మరాజు 'పితామహా! వ్యవహారనిర్ణయసభ్యులును, యుద్ధాదులందును సహాయులును, హితులును, సేనాపతులు మొదలయిన బలంగమువారును, మంత్రులును నెట్టివారుగా నుండవలయును' అని యడిగెను.

భీష్ముఁడు 'నీవ్యవహారనిర్ణయసభ్యులయినవారు లజ్జతోఁగూడిన బెట్టును, నింద్రియ నిగ్రహమును, సత్యమును, నిష్కపట్యమును, యుక్తమయినది లెస్సగాఁ జెప్పు దిట్టతనమును, గలిగియుండవలయును, నీకుఁ గెడతోడు నీడలై మిక్కిలి శూరులును బ్రహ్మణ్యులును, మిక్కిలి చదువరులును, నీయెడ నెంతయు సంతుష్టులును, గార్యములందు మంచి యుత్సాహము గలవారును నగు మనుష్యులను సకలములయిన నీ యాపదలందును సహాయులుగాఁ బడయఁ గోరవలయును. మంచి కులమునఁబుట్టి పూజితుండగు మనుష్యుఁడెప్పుడును దనశక్తినిదాఁపఁడు. వాఁడు నీ దుఃఖమునఁగాని, సుఖమునఁగాని, రోగమునఁగాని, మరణమునఁగాని, నిన్నెప్పుడును దిగవిడువఁడు. అట్టి వానిని సుహృదునిఁగావించుకొన వలయును. నీ బలంగమువారు మంచికులమున బుట్టిన వారుగను, నీదేశమునందుఁ గలిగినవారుగను, బ్రాజ్ఞులుగను, రూపవంతులుగను, మిక్కిలి చదువరులుగను, సమర్థులుగను, ప్రేమ గలవారుగను నుండవలయును. నాయనా! చెడుకులమునఁ బుట్టినవారును, లుబ్ధులును, గూర్మరులును, సిగ్గుమాలిన వారును నగు మనుష్యులును, దిన్నచేయి తడియాఱకుండునంతవఱకు ని

న్ననుసరింతురు. రాజు మంచికులమునఁబుట్టినవారును, మంచి స్వ
భావముగలవారును,ఇంగితము నెఱింగినవారును, అకూ్రరులును,
దేశకాలములను వానికిఁ దగిన విధులను దెలిసినవారును, ఒడ
యని కార్యమందు హితమునే కోరుచుండువారును, నగు మను
ష్యులను నెప్పుడును నన్ని విషయములందును మంత్రులుగా
నియమింపవలయును. ధనములచేతను, సమ్మానములచేతను,
వస్త్రాభరణాదుల నిచ్చుటచేతను, ఇంపయిన పలువగలభోగ
ములచేతను, నీ వెవరిని నీకుఁ బ్రయోజనకరులుగాఁ దలంతువో
వారలను బ్రీతులు గావించి నీతోఁబాటిసఖులనుగాఁ జేయవల
యును. ప్రవర్తనము తప్పనివారును, మంచి నడవడిగలవారును,
మిక్కిలి చదువరులును, వ్రతపరులును, గొప్పమనస్సు గలవా
రును, సత్యవాదులును నగు మనుష్యులు నీ యక్కఱలయం దే
కనుగలిగి యెప్పుడును నిన్ను బిగనాడకుందురు. పూజ్యులు కాని
వారును, నియమములను బాటింపనివారును, మందబుద్ధులును,
గట్టుపాటులనుండి జాఱినవారును నగు మనుష్యులను మర్యాద
లను నతిక్రమింపకుండునట్లు నీవు పదిలముగా నిర్బంధించి చూ
చుకొను చుండవలయును. రెండు పక్షములం దొకటిని నేరు కొన
వలసి వచ్చినపుడు, వెక్కండ్రుగల పక్షమును విడిచి యొక్కఁ
డుగల పక్షమును వరింపరాదు. అయిన నాయొక్కఁడు వెక్కు
గుణవిశేషములంబట్టి వెక్కండ్రకంటె నెక్కుడుగా నుండినేని
యా యొక్కనికై వెక్కండ్రను దిగవిడువ వచ్చును. ఎక్కుడ
యిన వానిలక్షణములు పరాక్రమము, కీర్తిప్రధానము లయిన
కార్యములందలి యాసక్తికట్టుపాటులందుఁ దప్పక నిలుచుటయు
నగును. సమర్థులను బూజించునట్టి వాఁడును, అర్హతలేని వారి

తోడ మచ్చరింపని వాఁడును, గామమువలనను భయము వలనను గ్రోధమువలనను లోభమువలనను ధర్మమును విడువనివాఁడును, అహంకారములేని వాఁడును, సత్యవాదియు, మన్నించు స్వభావము గలవాఁడును, జితాత్ముఁడును, మాన సంపన్నుఁడును, అన్ని సందర్భములందును జక్కఁగాఁ బరీక్షింపఁబడినవాఁడును నగు పురుషుని నీవు మంత్రసహాయునిఁగా నేర్పఱుచుకొనవలయును. గొప్పకులమునఁ బుట్టుటయును, కులమునకుఁ దగిన శౌరనము గలిమియు, ఓరుపును, సమర్థతయును, ఆత్మశుద్ధియును, శూరతయు, నెనరును, సత్యమును, నుత్కృష్టుఁడగు వాని లక్షణములు. ఇట్లు తెలివిగలిగి నడచుకొనుచుండు పురుషునకు శత్రువులును వైర కలంకమును విడిచి ప్రసన్నులయి మిత్రులగుచున్నారు. ఆత్మనిగ్రహమును మంచి ప్రజ్ఞయుఁగలిగి యైశ్వర్యము నభిలషించు రాజిటమీఁదఁ దన దేశమందు మంచికులమునఁ బుట్టినవారును, ఆప్తులును దురాచారులచే వశీకరింపరానివారును, వ్యభిచారము లేనివారును నయి తన్ను సంబంధించియుండు మనుష్యులచేత మంత్రుల గుణాగుణములను బరీక్షింపవలయును. ఐశ్వర్యమును నభ్యుదయమును గోరుపురుషుఁడు, మంచికుల మునఁ బుట్టినవారును, మంచి చదువరులును, వంశ పరంపరఁగాఁ గొలుచుచు వచ్చువారును, అహంకారము లేనివారును నగుపురుషులను మంత్రులుగాఁ జేసికొనవలయును. వీరలకు వినయముతోడి బుద్ధియు, ప్రన్ననిస్వభావమును, తేజమును, ధైర్యమును, క్షమయు, శుచియు, ననురక్తియు, నిలుకడయుఁ, గార్యములందు దిట్టతనమును నుండవలయును. రాజా! రాజు కార్యభరమును వహింపఁదగినవారును, బ్రౌఢవయస్కులును, మంచి

గుణములందుఁ బరీక్షింపఁబడినవారును, గపటము లేనివారును, ధనమును వృద్ధిఁబొందించువారును, మితిమీఱిక మాటాడువారును, వీరులును, వివేకశీలురును, కులీనులును, ధైర్యశాలులును, నింగితజ్ఞులును, నకూర్చిరులును, దేశకాలవిధులను దెలిసినవారును, భర్తకార్యమునందు హితమునుగోరువారును, నగు మంత్రులనేవురను, నెప్పుడును నన్నికార్యములందును నేర్పుఱుప వలయును. తేజోహీనుఁడును, మిత్రులచే దిగవిడువఁబడినవాఁడును, బట్టుదలతోఁ బనిచేయఁజాలఁడు. ఒకవేళ వానిని నియమించినచో నన్నికార్యములను గొనసాగింపక తప్పక సందేహమునే కలిగించుచుండును. ఒకమంత్రి శుభం బగుగొప్పవంశమునఁ బుట్టినవాఁడయ్యును, ధర్మార్థకామములను బాటించువాఁడయ్యును, జదువ వల్పముగాఁగలవాఁడగునేని, కార్యపద్ధతి నాలోచించుటకుఁ జాలనివాఁడగును. ఇక్ష్వా, తక్కువకులమునఁ బుట్టినవాఁడు, తా నెంతచదువు చదివియుండినను, కొనిపోవువాఁడులేని గ్రుడ్డివానివలె, నేర్పును నూహాయు వలసిన కార్యములందుఁ దెలియక పొరఁబడుచుండును. ఒక్కయుద్దేశమందును నిలుకడలేనివాఁ డెంతబుద్ధియుఁ జదువును గలిగియుండినను, ఉపాయములను దెలిసియుండినను, కార్యములఁ గొనసాగించుచుఁ జాలకాలముండఁజాలఁడు. దుర్మతియుఁ, జదువులేనివాఁడునగు మనుష్యుఁడు కార్యమునకు దిట్టతనముగాఁ బూనవచ్చునుగాని దానివలన ఫలవిశేషము లేమిగలుగునో తెలిసికొనఁజాలఁడు. తనయం దనురక్తిలేని మంత్రియందు రాజెప్పుడును నమ్మికయుంచుట యొప్పదు. కాఁబట్టి యనురక్తుఁడు గాని మంత్రికిఁ దనయాలోచనములను దెలిపుచ్చరాదు. అట్టికపటుఁడు తక్కిన మంత్రులతోఁ

గుట్రగూడి తన యేలికను,అగ్ని గాలితోడ్పాటునఁ గలిగిన సం
దులమూలమునఁ జొచ్చి వ్రాఁకును దహించునట్లు, నాశము
సేసివైచును. రా జెప్పఁడేని యొకనాఁడు క్రుద్ధుఁడై యొకభృ
త్యుని స్థానమునుండి తొలఁగించియు, నాగ్రహమునఁ బరుసు
లాడియు, మరలఁ బ్రసన్నుఁడయి వానిని స్థానమున నుంపఁ
గలుగును. అనుర క్తిగల భృత్యుఁడే యాయావానికెల్ల నోర్వఁ
జాలునుగాని, మఱియొక్కఁ డెంతమాత్రము సైఁపఁడు. మంత్ర
లకుఁగూడఁ గొన్నిసమయములందు రాజులయెడఁ బిడుగునుఱు
ములవలె బిట్టుగాఁ గోపము కలుగుటగలదు. ఎవఁడు తనయెడ
యునికిఁ బ్రియము చేయుతలంపున భట్టికోపములను నడఁచుకొ
నునో, మఱియొండయని సుఖదుఃఖములను దనకును సమానము
గాఁ గలిగియుండునో, యట్టిమమమ్యుని రాజు సమస్తకార్యము
లం దాలోచన మడుగవలయును. కపటము గలవాఁడు రాజు
నం దనుర క్తి కలిగియుండినను దక్కినగణములచే నిండియున్న
ను, రాజనీతియందు మిక్కిలి తెలివిగలవాఁడయి యున్నను,రాజు
మంత్రాలోచనమును వినుట కర్హుఁడుగాఁడు. పగవారితోడఁ
గూడికొని రాజు ప్రజల సుఖదుఃఖములను మిక్కిలి పాటింపకుండు
నట్టివాఁడు పగవాఁడని తెలియవలయును. వాఁడును, రాజు మం
త్రము వినఁదగినవాఁడుగాఁడు. తెలివిలేనివాఁడును, అపరిశుద్ధుఁ
డును, గర్వము గలవాఁడును, శత్రువుల సేవించువాఁడును,తన్నుఁ
దాను బొగడికొనువాఁడును, గోపియు, లుబ్ధుఁడును, సుహృదుఁడు
గానివాఁడును నగుపురుషుఁడు గూడ రాజు మంత్రాలోచనము
వినఁదగఁడు. క్రొత్తగా వచ్చినవాఁడొకఁడు వాఁడెంతయనుర క్తి
గలవాఁడయినను మిక్కిలి చదువరిగా నుండినను రాజు వానిని

సత్కరింపవచ్చును; మతి వలయునది యీవచ్చును; కాని, యా లోచనమువానికిఁ జెప్పఁదగదు. రా జొకనితండ్రిని దాను మును ప న్యాయమున నూరు వెడలఁ దఱిమినను, బిదప నతనిని సత్కరించి యే ప్పటిపదవియందు నెలకొలిపినను, నతనికొడుకునకుఁ దానెంత మాత్ర మూలోచనము వినిపింపఁదగదు. రాజు తనకు సుహృదుఁ డయినవాని స్వల్పంపుఁ దప్పునకు వానిధనమంతయుఁ దీసికొని రిత్తగావించెనేని వానికిఁ దక్కినగుణము లన్ని యుండినను, రాజు తనమంత్రాలోచనము వినిపింపఁదగదు. మంచిప్రజ్ఞయు మేధయుఁ గలిగి పండితుఁడై, తనదేశమందుఁ బుట్టినవాఁడై, శుచియు, సమ స్తకార్యములందుఁ జక్కటిగలవాఁడునై నపురుషుఁడు రాజు మం త్రాలోచనము వినుటకుఁదగును. ఆత్మజ్ఞానమును లౌకికవిజ్ఞానము ను మిక్కిలియుఁ గలిగి, తనప్రకృతియు, శత్రువుప్రకృతియు, స్వా మి మంత్రిమొదలయినవారల ప్రకృతులను నెఱింగినవాఁడై రా జునకు నాత్మసముఁ డయినస్నేహితుఁ డగుపురుషుఁడు, రాజు మం త్రాలోచనము వినఁదగును. సత్యవాదియు, శీలసంపన్నుఁడును, రహ స్యములను వెలిపుచ్చని లోఁతుగలవాఁడును, సిగ్గరియు, మెత్తని వాఁడును, తండ్రి తాతలతరములనుండి రాజుకొలువుగలవాఁడు ను నగు మనుష్యుఁడు మంత్రాలోచనమున కర్హుఁడగును. రాజు వలన సంతుష్టిగలవాఁడును, సత్పురుషుల మనసుకెక్కినవాఁడు ను, సమర్థుఁడును, రూపములందు ద్వేషముగలవాఁడును, మం త్రాలోచనము తెలిసినవాఁడును, గాలము నెఱింగినవాఁడును, శూరుండును నగుపురుషుఁడు మంత్రాలోచనము విన నర్హుం డగును. దండమునూఁది పరిపాలించునట్టిరాజు, ఈసమస్తలోక మును దిన్నని చల్లనిమాటలచే వశముచేసికొనుటకు శక్తుఁడగు

వానితో మంత్రాలోచనము చేయవలయును. పురజనులును, దేశజనులును ధర్మప్రవర్తనమునుబట్టి యెవ్వనియందు విశ్వాసము గలిగియుందురో, ఎవ్వఁడు యుద్ధముచేయఁగలఁడో, మఱి రాజనీతియందుఁ బండితుఁడో, యట్టివాఁడును మంత్రాలోచనము వినుట కర్హుఁడగును. కాఁబట్టి యిట్టిగుణములన్నియుఁ గల వారును, మిక్కిలియుఁ బూజితులును, రాజు మంత్రిమొదలయిన ప్రకృతుల నెఱింగినవారును, గొప్పకార్యములకు నువ్విళ్లూరు వారును, నగుమంత్రులు మువ్వురకుఁ దక్కువలేకుండ వలయును. వారు తమప్రకృతులందును శత్రుప్రకృతులందును గల రంధ్రములను బాటించుచుండవలయును. మంత్రులయాలోచనము రాజు రాజ్యమునకు మూలము. దానివలననే యారాజ్యము వృద్ధినొందవలయును. మంత్రి రాజునందలి ఛిద్రములను దెలియ నీకుండునట్లు చేయవలయును. పరునియందు ఛిద్రములు కనిపెట్టి వాని పై నెత్తవలయును. తాఁబేలు తనయంగములను లోనికి ముడిచి కాచుకొనునట్లు, మంత్రులును దమమంత్రములనుగాచుకొనవలయును. అట్లె తమఛిద్రములను గప్పిపుచ్చుకొనవలయును. రాజ్యమునందు మంత్రములను గప్పిపెట్టునట్టి మంత్రులే బుద్ధిమంతులనఁ బడుదురు. మంత్రమే రాజునకుఁ గవచము; మంత్రమే రాజ్యమందుఁ దక్కినజనుల కంగములు. రాజ్యమునకు మూలము వేగులవాండ్రు, దానికి సత్తువయంతయు మంత్రమందురు. ఏలికలును మంత్రులును, మదమును గ్రోధమును నడంచి, మానమును నసూయయును విడిచి, యొకరినొకరు సహాయముకొఱకు ననువర్తింతురేని, వారుభయులు సుఖమొందుదురు. రాజు తానై దువిధములగు (అనఁగా మనస్సుచేతను వా

క్కు-చేతను శరీరముచేతను వీనియందలి రెంటిచేతను, మూటి చేతను జేయంబడు కపటము లనెడు) నుపధలు లేకుండునట్టి మంత్రులతోడ నెప్పుడును మంత్రాలోచనము చేయవలయును. రాజా! మువ్వురుమంత్రుల మూఁడువిధము లయినయభిప్రాయ ములను దెలిసికొని వానిని దన మనస్సునం దుంచి వారల యభి ప్రాయమును దన యభిప్రాయమును మీఁదఁ జక్కఁగా నాలో చించుకొఁకుఁ దన గురువుకడకుఁ బోవలయును. ఆగురువు ధర్మా ర్థకామముల స్వరూపములను జక్కఁగా నెఱింగిన బ్రాహ్మణుఁ డుగా నుండవలయును. ఇట్లు మీఁదటియాలోచనమున కై యతనికడకుఁ బోయి మనస్సు సమాహితము చేసికొని యతని యభిప్రాయ మడుగవలయును. అతనితోఁగూడి యాలోచించిన పిదప నొకనిర్ణయము కలుగఁగా రాజు విలంబముచేయక తో డనే దానిని గావింపవలయును. మంత్రతత్త్వముల నిశ్చయము లను జక్కఁగా నెఱింగినట్టివారు, రా జెప్పుడు నీ చొప్పననే మంత్రాలోచనము చేయవలయునని చెప్పెదరు. ఇట్లు మంత్ర ములను గుదురుపఱుచుకొని దాని ననుష్ఠానమునకు నెప్పుడును దేవలయును. అట్లు చేసిననే యవి ప్రజలను వశీకరించుటకు సమర్థము లగును. రాజు మంత్రమాలోచించుచోటఁ బొట్టివారు ను, గుజ్జులుగాని బక్కవారును, గుంటివారును, గ్రుడ్డివారును, జడులును, స్త్రీలును, నపుంసకులును నుండరాదు. అందు, ముందుగాని వెనుకఁగాని క్రిందుగఁగాని మీఁదుగఁగాని య డ్డముగఁగాని యేదియు మెలఁగరాదు. ఎవరును లేని యింటి మేడపయి నెక్కియో, దర్భయు తెల్లను లేక నలుప్రక్కలఁ దెల్ల గాఁ గనఁబడు బయలుగా నుండు ప్రదేశమునందుండియో, మా

టయందుఁ దప్పిదములులేక యంగముల దోషములును జేష్ట లును గావింపక, కాలము మీఱిపోకుండునట్లు, కార్యమును జక్కఁగా నాలోచింపవలయును. ఇది యెనుబదిమూఁడవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ప్రియవచనములాడుటనుగుఱించి యింద్ర బృహస్పతి సంవాదమును ధర్మరాజునకుఁ జెప్పుట.

భీష్ముఁడు 'ధర్మరాజా! ఈ విషయమై బృహస్పతికిని నింద్ర నకుఁ జరిగిన సంవాదమనెడి యీ పురాతన మయినయితిహాస ము నుదాహరించెదరు. ఇంద్రుఁడు 'ఓ బ్రాహ్మణోత్తమా! పురు షుఁ డేయొక్కవిషయమును జక్కఁగా నాచరించునేని సమస్త ప్రాణులకును బ్రమాణమయి మిక్కిలి కీర్తిని బొందును' అని యడిగెను.

బృహస్పతి 'ఇంద్రా! ఇం పయినమెత్తనిపలుకుబడియే యీ యొక్కవిషయము. దాని నొక్కటి నాచరించినచో సమస్తప్రా ణులకును బ్రమాణమై (సమ్మతుఁడై) మిక్కిలి యశస్సును బొందును. ఇంద్రా! సమస్తలోకులకు సుఖము నొసంగునది యిది యొక్కటియే. దీనిని సర్వభూతములయందును నాచరించు వాఁ డెప్పుడును వానికెల్లఁ బ్రియుఁడై యుండును. ఈలోకమం దు నొక్కపలుకయినను మాటాడక బొమలు ముడివడ్డమొగ ముతో నుండునట్టివాఁడు సమస్తప్రాణులకును ద్వేషింపఁదగిన వాఁడగును. తిన్నని మెత్తనిపలుకుబడిలేమియే వానినట్లు చేసి

నది. ఎవఁడు తక్కినవారి నెవ్వరిని జూచినను తానేవారిని ముందుగా మాటాడి, యట్లు మాటాడునప్పుడు చిఱునవ్వు మును ముట్టఁ దొలఁకుచుండునో, వానికిఁ బుచ్చుకొనువారందఱును బ్రసన్నులగుదురు. దానము సైతము చల్లని మెల్లని పలుకుబడితో నియ్యఁబడదేని తీసికొనువాని నెవ్వానిని కూరలేని యన్నమువలె సంతోషపెట్టనేరదు. ఇంద్రా! ఎవరిధనమునేనియు నెత్తికొనుచున్నను, దియ్యనిపలుకులాడునేని, యట్టిపలుకుబడి యాధనమును గోలుపోయినవారిని సయితము దనవశముచేసికొనును. దండమును విధింపఁగోరుచున్నప్పుడును రాజు, తిన్నని చల్లని మాటలే ప్రయోగింపవలయును. సాంత్వము ఫలము గలిగింపక తప్పదు. మఱి యది యెవ్వరిహృదయమును నొప్పింపదు. సాంత్వము మృదువుగను మధురముగను జక్కఁగను బచరించుచుండినచో దానికి సరియైనది యొకప్పుడును గలుగదు' అనెను. ఇది విని యింద్రుఁడు తనపురోహితుఁడు చెప్పినట్లు సర్వమును జేయుచు వచ్చెను. ధర్మరాజా! నీవు నీసాంత్వమును జక్కఁగా నాచరింపుము' అనెను. ఇది యెనుబదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు సమాత్యలక్షణములు మొదలయినవి చెప్పుట.

ధర్మరాజు 'రాజేంద్రా! రాజు ప్రజల నేపద్ధతిని బరిపాలించుచు వచ్చినయెడల విశేషించి ధర్మమును శాశ్వతమయినకీర్తిని విశేషించి స్వర్గమును బడయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'పరిశుద్ధమయిన వ్యవహారముతోఁ బ్రజలను బరిపాలించుటయం దక్కఱగలిగి యుండెనేని, రాజు పరిశుద్ధుఁడై ధర్మమునుబడసి గీర్తిని స్వర్గలోకములను బడయును' అనెను. ధర్మరాజు 'రాజెవ్వరితోడ నెవ్విధమున వ్యవహరింపవలయును? ఇది యడుగుచున్నాను. నీవు మహాప్రాజ్ఞుడవుగాన దీనిని గల రూపున నాకుఁ జెప్పఁదగును. నీవు పూర్వము పురుషునకు వలయు నని చెప్పినగుణములన్నియు నొక్కపురుషునియందు నుండనేర వని నాకుఁ దోఁచుచున్నదే' యనెను.

భీష్ముఁడు 'నీవు మహాప్రాజ్ఞుండవు బుద్ధిమంతుఁడవును గదే! నీవు చెప్పినట్లెయగును. ఈ శుభగుణములన్నియుఁ గూడియున్న పురుషుఁ డరిది. వేయుమాటలేల. ఇట్లన్నిగుణములు నొక్కటఁ గొనగూడియున్నశీల మెంతపాటుపడి వెదకినను దొరకుట దుర్లభము. అయినను మంత్రులనెట్టివారిని గావింపవలయునో చెప్పెదను. వేదముల నధిగమించినవారును, సమగ్రులును, బరిశుద్ధులు నయినట్టి స్నాతక (బ్రహ్మచర్యము సమాప్తిగావించిన) బ్రాహ్మణులు నలువురును, బలవంతులును నాయుధపాణులునయిన క్షత్రియులు పదునెనమండ్రును, ధనసంపన్నులయిన వైశ్యులీరువదియొకండ్రును, వినయముగలవారును నింతకుమునుపుచేసిన కార్యములందుఁ బరిశుద్ధులై యున్నవారును నగు శూద్రులు మువ్వురును *(వినుకోరిక, వినుట, తెలియుట, ధరించుట, ఊహించుట, బుద్ధిచేత నివర్తించుట, విజ్ఞానము, తత్త్వజ్ఞానము ననెడి) యెనిమిది గుణములతోడఁగూడినవాఁడును, బురాణముల నధిగమిం

* అష్టగుణములు—శుశ్రూష, శ్రవణము, గ్రహణము, ధారణము, ఊహనము, అపోహనము, విజ్ఞానము, తత్త్వజ్ఞానమని యెనిమిది.

చినవాఁడును నగు సూతుం డొక్కండును నీకు మంత్రులుగా నుండవలయును. వీరియం దొకొక్కనికి నేఁబదియేండ్ల వయసు నుండవలయును. వారు పెద్దఱికమందుఁ గన్నుగలిగి, యసూయ లేక, శ్రుతి స్మృతుల నధిగమించి, వినయమును నిష్పక్షపాతమును గలిగి యుండవలయు. ఒక కార్యమునుగూర్చి వేఱువేఱువిధ ములు మంచివని వివాదములు చేయుచున్నవారిని, సమాధాన పెట్ట దిట్టలై యుండవలయును. లుబ్ధులుగాకయు మిక్కిలి ఘోరములయిన సప్తవ్యసనములందుఁ దగులకయు నుండవల యును. రా జాయెనమండ్రు మంత్రులనడుమ ముఖ్యుఁడై మంత్రమాలోచింపవలయును. అంత రాజు తనదేశపువారికిఁ దెలియుకొఱకు దన మంత్రినిశ్చయములను బ్రకటింపవల యును. నీ వెప్పుడు నిట్లు వ్యవహరించుచు నీప్రజలను జూచు కొను చుండవలయును. నీయెడ నిల్లడగా దాఁచిన ధన మును గైవసము చేసికొనరాదు. ఖడ్గమును నేను నేను సాం తకాఁప నని తగవులాడునట్టి యొకవస్తువును నీది గావించు కొనరాదు. ఇట్టి నడవడి ధర్మపరిపాలనమును జెఱిపివైచును. ధర్మ పరిపాలనమునకు హానికలుగఁగా నధర్మమును నిన్నుఁ బీడిం చును. నీరాజ్యమును బీడించును. నీప్రజలకు, డేగనుజూడఁగా బక్షులకుంబోలె, భయము పుట్టించును. అంత, నీరాజ్యమును, సముద్రమున విఱిగినయోడవలెఁ బొడవడఁగును. రాజు తనప్రజల నధర్మముతో బరిపాలించునెని యతని మనస్సున భయ మావేశించును. స్వర్గమును నతనికి మూయఁబడును. రా జ్యమునకు ధర్మమే మూలము. అట్టి ధర్మాసనమునఁ గూర్చుండి యధర్మమునఁ బాలించు రాజు మంత్రిగాని, రాజపుత్రుఁడుగాని,

యుయ్యై నియోగములం దధికృతులయ్యుఁ దమసొంత ప్రయోజనములను మున్నిడికొని యకార్యములు చక్కఁగా నాచరింపని యధికారులుగాని, రాజు వెంట నందఱు నధోగతి నొందుదురు. బలవంతులయిన వారిచేఁ బీడితులయిన దుర్బలులు దీనముగాఁ బెక్కులు పలవించుసపు డట్టి దిక్కుమాలిన మనుజులకెప్పుడును రాజే దిక్కు. రెండు పక్షములవారికి వివాదము కలిగినపుడు, సాక్షుల బలిమినిబట్టి తీర్పుచేయుట మంచిది. ఒక పక్షమువానికి సాక్షులులేక దిక్కుమాలి యున్నెడ, వాని విషయమునందు రాజు విశేషించి పరిశీలనము పుచ్చుకొనవలయును. రాజు పాపములు చేసినవారిని వారి యపరాధమునకుఁ దగునీతిని దండింపవలయును. ధనవంతులగు వారిని దండుగులు మొదలయైనవానిచేత ధనమునకుఁ బాపవలయును. వేదవారిని జెఱఁబెట్టవలయును. మిక్కిలి చెడునడవడి గలవారిని డెబ్బలు కొట్టింపవలయును. శిష్టులగు వారిని మంచిమాటలచేతను దానముచేతను బరిపాలింప వలయును. రాజును వధింపఁదలఁచినట్టి మనుష్యునిఁ జిత్రవధము గావింపవలయును. ఇండ్లకు నిప్పుపెట్టినవానికిని దొంగకును వర్ణసంకరము చేయువానికిని నట్లే చేయవలయును. రాజు చక్కఁగా దండమును జరుపుచు సత్పథమునఁ బ్రయత్నపరుఁడై యుండునేని యతనికి శాశ్వతము లయినధర్మములు కలుగును; అధర్మమే కలుగదు. రాజెవ్వఁడు తెలివిమాలి విచ్చలవిడి దండమును గావించునో వాఁ డిహమం దపకీర్తినొంది మృతుఁడయి నరకము నొందును. ఒకనియపరాధమునకుఁగాను మఱొకనికి దండము విధింపరాదు. దండశాస్త్రమును జక్కఁగా ననుసరించియె యొకనిని జెఱఁబెట్టుటగాని విడిచి పుచ్చుటఁగాని

వలయును. రాజు దూత నెట్టియాపదయం దయినను నొకప్పుడును జంపరాదు. దూతను జంపినరాజు మంత్రులతోఁగూడ నరకము నొందును. క్షత్రధర్మ పరుండయిన రాజు, తన్నుఁ జెప్పమన్న విషయమును గలహూపున నొకదూత చెప్పినందులకు వానిని జంపినచో నతనిపితరులు భ్రూణహత్యచేసిన దోషము నొందుదురు. మంచికులమునఁ బుట్టుట, శీలము చక్కఁగాఁ గలిగియుండుట, మాటకారితనము, నేరుపు, ఇంపుగా మాటాడుట, తనకుఁ జెప్పినట్లు సరిగాఁజెప్పుట, జ్ఞాపకశక్తి యనెడియీయేడు గుణములు దూత కుండవలయును. ఈరాజు నంగరక్షకుఁడును, ద్వారపాలకుఁడును, బట్టణ ద్వారరక్షకుఁడును నిట్టి గుణములే కలిగియుండ వలయును. రాజుమంత్రి ధర్మ శాస్త్రార్థముల స్వరూపములను దెలిసినవాఁడును, సంధివిగ్రహములందు నిపుణుఁడును, మతిమంతుఁడును, ధృతిమంతుఁడును, సిగ్గరియు, మంత్రరహస్యములును గప్పి కాచువాఁడును, గులీనుఁడును, మనస్సు దిటగలవాఁడునయి, పరిశుద్ధమగు నడివడిగలిగి యుండవలయును. ఇట్టి గుణములుగలవాఁడయినచో నతఁడు ప్రశంసనీయుఁడగును. సేనాపతియు నిట్టిగుణములతోడనే కూడియుండ వలయును. మఱియు వివిధములయిన యుద్ధవ్యూహములయు యంత్రములయు నాయుధములయు స్వరూపములను దెలిసిన పరాక్రమశాలియై యుండవలయును. మఱియు నతఁడు వాన చలి యెండ గాలి శాకులకు నోర్చువాఁడై పరులయందలి రంధ్రములందుఁ గన్నుగలిగివానిని దెలిసియుండవలయును. రాజు తనశత్రువులను నేమి యపాయము లేదని నమ్మింప నేర్చియుండవలయును. తానుమాత్ర మెవ్వరిని నమ్మరాదు. అతనికిఁ దనకన్నకుమారుని యందుసయితము

నమ్మిక యుంచుట యొప్పుగాదు. అనఘా ! నీ కిపుడు శాస్త్రార్థములను గలరూపున వివరించితిని. రాజులకు నమ్మకుండుట రాజనీతియందుఁ బరమ మయినరహస్యముగాఁ జెప్పంబడు చున్నది' అనెను. ఇది యెనుబదియేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బురలక్షణాదులను జెప్పుట.

ధర్మరాజు 'రాజు వసించునట్టిపట్టణ మెటువంటిదిగా నుండవలయును. ఇంతవఱకుఁ జేయఁబడి యున్నపట్టణమునే యతఁడేర్పఱచు కొనవచ్చునా ? లేక క్రొత్తదిగా నొకటి చేయించుకొని వసింపవలయునా?' అని యడిగెను.

భీష్ముఁడు 'రాజు తనపుత్రులతోడను జ్ఞాతులతోడను బంధువులతోడను నెందు వసింపవలయునో యాపట్టణ మున్నయుని కిని దానిగుప్తిని విమర్శించి తెలిసికొనుట యెంతయు న్యాయము. కాఁబట్టి నే నీవిషయమున, నందును విశేషించి, దుర్గకర్మమును గుఱించి చెప్పెదను. వానిని విని యట్లే చేయుటయే కాక ప్రయత్నంబున నడపుచును రావలయును. ఆఱువిధములయిన దుర్గములను నేర్పఱచుకొన్నపిదప బట్టనముల నేర్పఱుపవలయును. అందు సర్వవిధములయిన సంపదలును ముఖ్యములయిన వస్తువులును నవ్వారిగా నుండవలయును. ఆ యాఱువిధములయిన దుర్గములును, మఱుదుర్గములు, భూదుర్గములు, పర్వతదుర్గములు, మనుష్యదుర్గములు, మట్టిదుర్గములు, వనదుర్గములు నగును. రాజు తనకు వశ్యులయిన

మంత్రులతోడను సైన్యములతోడను వసింపవలసినపట్టనము నకు దుర్గము బలమయినదిగా నుండవలయును. అందు వలయు ధాన్యములును నాయుధములు నుండవలయును. దానికి దృఢ మయినకోటయు నగడ్తయు నుండుటయెకాక, రథగజ తురగ ములందు నెరసిపెరసి యుండవలయును. అందు విద్వాంసులును శిల్పులు నుండవలయును. వలయు సంభారములన్నియు లెస్సగా సమకట్టింపఁబడ యుండఁగలయును. అందలిజనులు ధార్మికులై, మంచిసమర్థులై యుత్తములై యుండవలయును. మిక్కిలి తేజ ముదొలకుచున్న మనుష్యులును మృగములునుగలిగి, చదుక ములచేతను నంగశిపీథులచేతను విలసిల్లుచుఁ, బరిశుద్ధములయి జనవ్యవహారములు వెలయ, మిక్కిలి నిమ్నళముగలిగి, దేనివల ను భయములేనిదై యుండవలయును. అది మిక్కిలి కాంతిం బ్రకాశించుచు సంగీతాదిధ్వనులు బోరుకొనుచు మిక్కిలి యొప్పిదములయిన యిండ్లుగలిగి నెలుంగవలయును. మఱియు నది శూరులచేతను భాగ్యజ్ఞులచేతను నిండి వేదఘోషములకుఁ బ్రతిశబ్దించుచుండవలయును. సభలుగూడుటయు జాతరులును గలిగి సదా దేవతాపూజల రాజిలు చుండవలయును. ఇట్టి పురమునందు రాజు వశ్యులయిన మంత్రి మొదలయినవారితోఁ దాను బ్రవేశించి యుండవలయును. అందుఁ దాను వసించి బొక్కసము నించుచును, సేనలను బెంచుచును, మిత్రులను బెక్కండ్రనుగూర్చుచును, న్యాయసభలను నేర్పఱచుచు నుండ వలయును. అతఁడు తనపట్టనములందును బల్లెపట్టులందును గల సకలదోషములను దొలంగింపవలయును. మఱియు భాండాగార ములను నాయుధాగారములను బ్రయత్నపడి వృద్ధిఁబొందింప

వలయును. సమస్తములయిన బియ్యము మొదలయిన ధాన్యముల రాసులను బెంచి యంత్రశాలలను గుదుర్పవలయును. మఱియుఁ గట్టియలు, లోహములు, ఉముకలు, బొగ్గులు, మ్రాఁకులు, కొమ్ములు, ఎమ్ములు, వెదుళ్లు, మజ్జ, నూనె, క్రొవ్వు, తేనె, మందుదినుసులు, జనుము, సర్జరసము, ధాన్యము, ఆయుధములు, అమ్ములు, తోలు, నరములు, వ్రేములు, ముంజ గడ్డి, మొదవ, వాద్యములను జేర్పవలయును. మిక్కిలి జలముల కునికిపట్టులయిన భూవులను దానికి దాపుసన్నఁ దొట్లను, పాలుస్రవించు మ్రాఁకులను రాజెప్పుడును రక్షింప వలయును. ఆచార్యులను, ఋత్విజులను, పురోహితులను, మేటి విలుకాండ్రను, శిల్పులను, జ్యోతిషులను, వైద్యులను, బ్రాహ్మణులను, మేధావులను, నడఁకువ గలవారలను, సమర్థులను, శూరులను, బెక్కుశాస్త్రముల నధిగమించినవారిని, మంచికుల మునఁ బుట్టినవారినిని, సత్త్వగుణసంపన్నులను, సకలకర్మములందుఁ బూనికగలయట్టివారలనును, రాజు ప్రయత్నంబునఁ సత్కరింపవలయును. రాజు ధార్మికులగువారిని పూజింపవలయు; అధార్మికుల నడంపవలయును. పాటుపడి సకలవర్ణముల వారిని దమతమ కర్మములందు నియమింపవలయును. పట్టణములందును బల్లెపట్టులందును లోపలను వెలుపలను గలవిషయములను వేగులవలనఁ జక్కఁగాఁ దెలిసికొని పిదపఁ గార్యమును జరుపవలయును. రాజు వేగులవారిని, మంత్రా లోచనములను, బొక్కసమును, దండమును విశేషించి తానే పరిశీలించు చుండవలయును. సమస్తమును వీనియందే నెలకొనియున్నది. పట్టణమందును బల్లెపట్లయందును గల యుదాసీనులును, మిత్రు

లును, శత్రువులును, జేయఁదలఁచియున్న దానినంతయుఁ జూచు లనెడి కన్నులచేఁ దెలిసికొనవలయును. పిదపఁ బొగిలుమాలిక లేక వారికిఁ జేయవలసిన కార్యము నంతయుఁజేసి తీర్పవల యును. ఎప్పుడును భక్తులను బూజింపవలయును : పగవారిని నిగ్రహింపవలయును.ఎప్పుడును యాగములు యజించుచుండవల యును; ఎవ్వరిని బీడింపక దానము చేయుచుండవలయును. ప్రజలను బరిపాలింపవలయును. ధర్మమునకు విరుద్ధమయిన కార్య మును జేయరాదు. బీదలకును, దిక్కు-మాలినవారికిని, వృద్ధు లకును, వితంతువులకును, యోగక్షేమములను జీవనమును నెప్పు డును గావించుచుండవలయును. రాజెప్పుడు నాశ్రమస్థు లగు మునులను నాదరించియుఁ, బూజించియు, బహుమానించియు, వస్త్రములను పాత్రములను భోజనములను దగుకాలములందుఁ బంపుచుండవయును రాజు (తన దేశమందలి) తాపసులకు జత నంబునఁ దనయున్న యునికియు దాను బూను కార్యము లన్ని యును, దనరాజ్యస్థితియు, నివేదించుచు వారి సన్నిధియందు మిక్కిలి యడఁకువతోఁ వర్తింపవలయును. వారు వ్రతములందు వాసికెక్కిన వారుగాన, రా జెప్పుడేని యొక సమయమునందు వారి రక్షణము గోరవలసివచ్చునేని, వారు నిచ్చలు రక్షగావిం తురు. రాజు, మంచికులమునఁ బుట్టినవాఁడును, పెక్కుశాస్త్ర ము లధిగమించినవాఁడును, సమస్తములయిన ధనములను బరి త్యజించినవాఁడును నగు నట్టి తాపసునిఁజూచెనేని వారికి శయ నాసన భోజనము లొసంగి పూజింపవలయును. రా జెట్టి యాపద యందును నాతపస్వులందే నమ్మిక యుంపవలయును. దొంగలు సయితము తపస్వులయందు నమ్మిక గలిగియుందురు. వారియొద్ద

నిధులను నుంపవచ్చును; * మరలఁ దీసికొనవచ్చును. † మాటి మాటికి వారికడకుఁబోవుటయు, నతిమాత్రము వారినిబూజించుటయుఁదగదు. రాజు తనరాజ్యమందు వసించువారిలో నొకతాపసిని జేలిమికై యేర్పఱచుకొనవలయును. పరరాష్ట్రమందలివారిలో నొకరినిని నట్లే యేర్పఱచుకొనవలయును. అడవుల యందలి వారిలోను నొకనిని, సామంతరాజుల నగరములలోని వారి యందొకరినిని నట్లే చెలిమిచేసికొనవలయును. రాజు తన రాజ్యమం దుండుతాపసులకుంబోలెఁ బరరాష్ట్రములందును నరణ్యములందును నుండు నాతాపసులకును నాదరమును బహుమానమును నడపుచు వలయువానినెల్ల నిప్పించుచుండవలయును. ఆతాపసులు సంశితవ్రతులుగాన, రాజున కెద్దియేని యాపదకలిగి రక్షణము గానలసివచ్చినపు డతఁడు గోరెనేని తప్పక యట్టి రక్షణసంగుదురు. రాజు తాను వసింపవలసినట్టి నగరమునకు వలయులక్షణములను నీకు సంగ్రహముగా నిప్పుడు చెప్పితిని' అనెను. ఇది యెనుబదియాఱవయధ్యాయము.

రాజధర్మసర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు రాజ్యమును గుప్తిచేయు ప్రకారము మొదలయినవి చెప్పుట. }

ధర్మరాజు 'భరతసింహమా ! రాజ్యము నెట్లొడఁగూర్పవల

---

* 'ప్రజ్ఞాపర్యాదదీతచ' అని జె. మూలము. వారివలనఁ బ్రజ్ఞను గ్రహింపవచ్చునని యర్థము.

† తాపసులకడకు మాటిమాటికిఁబోరాదనుట వారియొద్ద రాజు ధనము మొదలయినవి యున్నవని దొంగలు వారిని బాధింపకుండుటకని తెలియునది.

యునో దాని నెట్లు పదిలముగా రక్షింపవలయునో జక్కఁగాఁ దెలిసికొన నువ్విళ్లూరుచున్నాను. వానిని నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'రాష్ట్రమును రక్షించువిధమును దాని నేర్పఱుచు కొనురీతిని నంతటిని జెప్పెదను; ఎచ్చరికతోడ వినుము. ఒక్కొక్క గ్రామమునకు నొక్కయధిపతి నేర్పరుపవలయును; అట్లు పదిగ్రామములకు (అనఁగాఁ బదిగ్రామాధిపతులకుఁ బయిని) నొక్కపతి యుండవలయును. అట్లే యిరువది గ్రామములకును (అనఁగా ఇరువదిగ్రామపతులకుఁ బయిని) నొకి యీశునిని. ముప్పదిగ్రామములకు నొకనిని, (నతనిపయిని) నూఱుగ్రామములకు నొకరినిని, (నతనిపైని) వేయిగ్రామములకు నొకరినిని నీశునిఁగా నియమింపవలయును. గ్రామాధిపతి గ్రామమందలి వారి లక్షణములను నందలి దోషములను బాటించుచుండవలయును. అట్లు పాటించినవిషయములను దశగ్రామాధిపతికి దెలుపవలయును. * ఆదశగ్రామాధిపతి వింశతిగ్రామాధిపతికిని, వింశతిగ్రామాధిపతి యావిషయములనెల్ల ముప్పదిగ్రామములపతికిని, నతఁడు నూఱుగ్రామముల పతికిని దెలుపవలయును. (గ్రామాధిపతి గ్రామమందుఁ బయిరగు భోజ్యవస్తువులకును మఱి యితరములగు గ్రామసంబంధివస్తువులకును నొడ

---

* 'వింశతి త్రింశతీశంచ సహస్రస్య చకారయేత్' అని. దా మూ. ద్విగుణాయాశ్చ సైన్యం సహస్రస్యచకారయేత్' అని జె. మూలము. దానికి (అనఁగాపదికి) రెండింతల (అనఁగా నిరువది) గ్రామములకు నొకపతియు, నూఱుగ్రామములకు నొకపతియు నట్లే వేయింటికి నొకపతిగుఁ నియమింపవలయును.

యుండుగా నుండవలయును.) గ్రామాధిపతి తనగ్రామమునకై యాగ్రామమందుఁ బయిరగు భోజ్యవస్తువులను దనకుఁ దగుకొలఁది ననుభవింపవలయును.ఒక్కొక్క గ్రామాధిపతియుఁ దనవంతు కొలఁదిని దనగ్రామ వస్తువులను బది గ్రామముల యధిపతికి గ్రాస భరణముగా నొసంగవలయును. పదిగ్రామముల యధిపతియు నల్లె తనవంతుకొలఁది నొసంగి యిరువదిగ్రామముల పతికి భర ణముగావింపవలయును. నూఱుగ్రామములకుఁ బతియైనవాఁడు రాజువలన నన్నిసత్కారములను బడసి తనభరణమునకై జను లునిండినదియు సంపదల నొంపువెంపారునదియు నగు నొకపెద్ద గ్రామము ననుభవింపఁదగును. నూఱుగ్రామముల పతి కట్టి య్యఁబడిన యాగ్రామము వేయిగ్రామములపతికి లోనై యుండ వలయును. ఆవేయిగ్రామముల పతియు మేలయిన యొకశాఖా నగరమును(చిన్నపేటను) దనభరణమునకు నుంచుకొనవలయును. అతఁడు రాజ్యాధికారితోఁబాటిగా దానివలనఁ గలుగు ధాన్య మును బంగారమును దిక్కినవస్తువులను ననుభవింపవచ్చును. అతఁడు దానిని సంబంధించిన యుద్ధకార్యములను, మఱియు గ్రామముల కార్యముల నన్నియును గావింపవలయును. ధర్మజ్ఞుఁ డయినయొకమంత్రి ప్రాలుమాలికలేక యాయధికా రుల కార్యములను నన్నిటిని నరయుచుండవలయును. ఒక్కొ క్క నగరమండును నందలి సమస్తవిషయములను నరయుటకు నొక్కయధికారి యుండవలయును. అతఁడు నక్షత్రములందు ఘోరరూపమయిన యొక గ్రహమువలె నాయధికారులందఱకును నెక్కుడయిన స్థానమందుండి తనక్రిందనున్న యాయధికారు లందఱను జుట్టి చూచుకొనుచు రావలయును. అట్టివాఁడు తన

క్రిందనున్న వారల నడవళ్లను దూతలమూలమున నరయుచుండ వలయును. రక్షణాధికారమునం దుండువారు వంచకులుగను, బరులసొమ్మును బలిమిని బుచ్చుకొనువారుగను, బొపమం దాశ గలవారుగను, జంప నిచ్చగించువారుగను నుందురు. ఆ గొప్ప యధికారి ప్రజల నిట్టివారలవలన నుండి రక్షింపవలయును. రాజు, విక్రయమును, గ్రయమును, బొటలస్థితియు, దిండిని, వ్యయమును, దక్కిన యోగక్షేమములను జక్కఁగాఁ గనుఁ గొని వర్తకులకుఁ బన్నులను విధింపవలయును. శిల్పు లుత్ప త్తిచేయు వస్తువులను వానికయిన వచ్చుబడులను వ్యయములను శిల్పముల తెఱంగును బలుమాఱు పరిశీలించి యాశిల్పులకు వారిశిల్పములమీఁదఁ బన్ను విధింపవలయును. రాజు మిక్కిలిగొప్ప పన్నులు పుచ్చుకొనవచ్చును గాని, ప్రజలను గీడ్పఱుచునట్టి పన్నులను విధింపరాదు. ఎంతఫలితమగునో, యందులకెంత పాటు పడవలయునో, చక్కఁగాఁ దెలిసికొనియే యేపన్నును విధింప వలయును. ఒక్కఁడు తగిన (ఫల) కారణములేక యొకఫలిత మునకుఁ గాని యందుల కయినపాటునకుఁగాని పూనఁడు. ఒకఁ డొకసరకును బొటుపడిచేయఁగా, వాఁడును రాజును దాని ఫలమునకుఁ బొలుపడునట్లుగా రా జాలోచించి పన్ను వేయవల యును. రాజు పేరాసచేతఁ దనకు మూలమయిన దానిని (రా జ్యమును, బగులకు మూలమయిన దానిని (కర్తాదులను), నాశము చేయకుండవలయును. రాజు, లోభమువలని కార్యముల నెల్లఁ నడంచుకొని తన దర్శనమును మఱిఁగించుకొని యుండవలయును. రాజు మిక్కుటముగాఁ బన్ను దీయువాఁ డని పేరుగన్నచోఁ బ్రజ లట్టివానిని ద్వేషింతురు. జనులు ద్వేషించినట్టివానికి

జేయమేమి? మాటుగలిగి యుండువానిని సంపద పొందును. రాజు బుద్ధిలోఁబడక దూడనలె రాజ్యమును బిదుకవలయును. దూడ చక్కఁగా పోషింపఁబడినదై నచో సత్తువగలిగి కాఁతి యును సైఁచును. మిక్కిలిగాఁ బిదుకఁబడిన యావుదూడ పనిచేయఁజాలదు. రాజ్యమును నెక్కువగాఁ బిండినయెడలఁ బెద్దకార్యమును గలిగింపఁజాలదు. ఏరాజు తానే పరిపాలించుకొనుచు రాజ్యము ననుగ్రహమునఁ జూచునో వాఁ డంపుపెట్టినదాని ననుభవించుచు మిక్కిలియు గొప్పఫలమును బొందును. తనరాజ్యమును బరిపాలించుచును, దన ప్రజలకును పన్నులు మొదలగువానియందు ననుగ్రహము చూపుచును, సులభముగా నందుఁ గలుగువానివలననే తనభరణము చేసికొనుచును, నుండునట్టి రాజు మిక్కిలియు గొప్పఫలమును బొందనేర్చును. అట్టున్నయెడ రాజు తనయాపదలకు వలయునంతి ధనరాసులను సంపాదింప నేర్చును జుమీ. అతని రాష్ట్రమంతయు నతనికి బొక్కసమగుచున్నది. అతని బొక్కసమతనిపడుక టిల్లగుచున్నది. పురజనులును పల్లెపట్ల జనులును బీదలుగానుండిరేని, వారు తన్నుఁ దమంతట నాశ్రయించినను, నొకరిమూలమున నాశ్రయించినను, దనశక్తికొలఁది వారియెడఁ గనికరము చూపవలయును. * రాజ్యము బాహ్యములందున్న

---

* 'బాహ్యాం జనం భేదయిత్వా భోక్తవ్యో మధ్యమస్సుఖమ్' అనిమూలము. వెలుపలిపట్ల నడవులనుండు దొంగజనులను మీరు చెలరేఁగుడని భేదము కల్పించి నడుమనున్న గ్రామజనులపలన నవ్వారిగా ధనము ననుభవింపవలయునని యర్థాంతరము. ఇచట రాజులకు విపత్తులయందు ధనరాసులు కావలసివచ్చేసేని వెలిపట్లనున్న దొంగలను జెలరేఁగునట్లు పురికొలుపఁగా నడుమనున్న గ్రామజను

దొంగలనందఱును దండించి రాజు నడుమ నున్న గ్రామజను లను రక్షించి వారికి సుఖముకలిగింపవలయును. ఇట్లు చేయుట వలన జనులు, రాజుతోఁబాటిగా సుఖమును దుఃఖమునుగలవా రగుదురుగాన యతనియెడ నెంతమాత్రమును గోపమునొందరు. రాజు ముందుగనే ధనము సేకరింపవలయు నని *తలపోసి యంతఁ దనరాజ్యమందు ముఖ్యము లయిన పట్టులకుఁబోయి 'ఇదిగో! ఆ పద కలిగియున్నది. పరులదండువలన మిక్కిలియు భయము పుట్టియున్నది. అయినను నీయపాయము తొలఁగిపోవలయునని యేచెప్పవచ్చును. ఏలనఁగా మనశత్రువు, పూచిన వెదురు వలెఁ ద్వరలో నాశము నొందును. నాశత్రునృపులనేకులు చెలరేఁగి పెక్కండ్రు దొంగలతోఁ గూడికొని నారాజ్యమును బీడింప నుంకించుచున్నారు గాని, యట్లు సేయుట వారినాశమునకే యగును జుఁడీ. ఇట్లాపద ఘోరమైయుండఁగా భయము దారు ణముగాఁ గలుగఁగా మిమ్మును నలుగడలఁ గాచుటకై మీవలన ధనములను బ్రార్థించుచున్నాను. ఈభయము తొలఁగినతోడనే మీధనములనంతయు మరల మీకు నిప్పించుచున్నాను. నేను గాక శత్రునృపులు బలవంతముగా నిచటనుండి ధనములను గొంపో

లకువారివలన భయముగలుగఁగలదు. రా 'జాదొంగలనుండి మిమ్మురక్షించు టకు ధనము లిం'డని యవ్వారిగా ధనములను వారివలన గ్రహింపవలయును. వారును రాజుతమసుఖదుఃఖములను గుర్తించి యట్లు చేయుచున్నాఁడని తలం చుటచేఁ దమవలన నవ్వారిగా ధనములు గొన్నందులకు రాజువలన నెంతమాత్ర మును గోపము నొందరని యాశయము.

*'అనుభావ' అనిమూలము 'అనుభావ్య' అనుపాఠమున 'చెప్పి' యని యర్థము.

వుదురేని మరల నెంతమాత్ర మీయరు. ధనమొకటేగాదు; వారి వలన స్త్రీలును దక్కినవన్నియు నాశమునొందవలసి వచ్చును' అని భయమును జూపవలయును. రాజు సమయమునెఱింగి తగిన యుపాయమును జేసినపిదప బ్రజలతో 'శరీరము కొఱకును పుత్రులకొఱకును భార్యలకొఱకును ధనము గూర్పంబడుచున్నది. మీయభివృద్ధి కెంతయు నానందించుచున్నాను. నేను నాపుత్రుల యభ్యుదయమునకుఁ బోలె మీ రెంపుసొంపునకు నానందించుచున్నాను. రాజ్యమునకును మీకును గష్టము లేకుండునట్లు శక్తికిఁ దగినట్లు పుచ్చుకొనెదను. *ఆపదలందేకదా మీరందఱు నొక్కటిగాఁగూడి యీపనిని భరింపవలయును. ఆపద లేవేని వచ్చినపుడు, మీరు ధనమం దంతగాఁ బ్రియముంపరాదు' అని యింపుగను జల్లగను బుజ్జవముగను జెప్పి తన చేఁద్రాళ్లఁబోని యధికారులనుబంపి ప్రజలవలన ధనమును సంతరింపవలయును. రాజు వైశ్యులకు †దండయాత్రనును భృత్యులను భరించుట మొదలగువానివలని వ్యయములను, బరులు దండెత్తివత్తురను భయమును, వారికి యోగక్షేమములు కలిగింపవలసిన యావశ్యకతను, జూపి వారివలననుండి పన్నులు దీయింపవలయును. రాజు వైశ్యుల నుపేక్షించిచో వారు తనరాజ్యమునువిడిచి యడవులకుఁ బోయి తనకు నశించినట్టివారే యగుదురు. కాఁబట్టి రాజు వారలయెడ విశేషించి మెత్తఁదనముతో నడచుకొనవలయును.

---

* 'ఆపత్స్వేవ నిరోధవ్యం భవద్భి స్సంగతైరివ' అని దా.మూ. 'ఆపత్స్వేవచ నిరోధస్యం భవద్భి ర్భంగవైరివ' అని బె.మూలము. వృషభములవలె భరింపవలయునని యర్థము.

† 'ప్రచారమ్' అని దా. మూ. 'ప్రాకారమ్' అని బె. మూలము.

రాజు మాటిమాటికి వైశ్యులను మెత్తనిమాటల లాలించుచుచు, రక్షించుచును, వారికిఁ గుశలముగా నుండునట్లు తోఁపించు కార్యములుచేయుచును, వారికిఁ గలవానిని సుఖముగా ననుభవింపఁ జేయుచును, వారికిఁ బ్రియములయినవియె యెప్పుడు నాచరించుచునునుండవలయును. వైశ్యులు ఫలము పయింబయి నొడఁగూర్చు వలంతులగునట్లుగా రాజు వారియెడ మెలఁగవలయును. వైశ్యులు రాజ్యమును బలమును నృద్ధిఁబొందించుటయేకాక దానివర్తకమును సేద్యమును బెంతురు. కాఁబట్టి తెలివిగల రాజు వారికెంతయుం బ్రయత్నపడి సంతోషము గలిగించు చుండవలయును. రాజు దయగలిగి పరాకువడక మృదువుగాఁ బన్నులను దీయవలయును. వైశ్యులకు * క్షేమము గావించుట యెచ్చటను సులభమేకదా. వారియెడల నట్లు నడచుకొనుటకు సాటియైన ధనము రాజ్యమునకు మఱొకటి గలుగదు' అనెను. ఇది యెనుబదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బ్రజలవలనఁ బన్నుదీయు విధము మొదలయినవి చెప్పుట.

ధర్మరాజు 'మహామతీ ? రాజు తనకెంతధన ముండినను మఱియు బొక్కసము గావలసివచ్చినచో † నెట్లు నడచుకొనవలయునో నాకుఁజెప్పుము' అని యడిగెను.

---

* 'క్షేమచరణమ్' అనిమూలము.

† 'కథంప్రవర్తేతతథా' అని బొం.మూలము 'కథంప్రవర్తేత కరః' అని దా. మూలము. తన్ను నెట్లు వేయవలయునో యని యర్థము.

భీష్ముడు 'ధర్మార్థి యగురాజు ప్రజలహితమం దాసక్తుడై దేశమునకును గాలమునకును దగునట్లును దనబుద్ధికొలఁదిని దనచేత నయినంతవఱకును వారలకుఁ గట్టుపాట్లు చేసికొనవల యును. రాజు తనరాష్ట్రమందుఁ బ్రజలకును దనకును శ్రేయము గలుగునట్లుగా సమస్తములయిన ధర్మములను జరుపవలయును. రాజు,తుమ్మెదలు చెట్లనుండి తేనియను దీయునట్లు,రాజ్యమునుండి * పన్నుదీయవలయును. గొల్లవాఁడు దూడయందుఁగన్ను వీడక యె పాలుపిండును. మఱి యావుపాలిండ్లను దూఁటుపొడువఁడు. అట్లె రాజును నడచుకొనవలయును. జలగ నెత్తురును బీల్చునట్లు రాజు రాజ్యమును మిక్కిలిమృదువుగానే పీల్వవలయును. ఆఁడు పులి తనకూనలను వాఁడిపండ్లఁ గఱచినను నొవ్వుగలిగింపకయే కొంపోవునట్లు, రాజును బీడింపకయే పుచ్చుకొనవలయును. ఎలుక మిక్కిలివాఁడియైన కోఱపండ్లు గలిగియుండినను నిదురించుచున్న వారికాలను వారిఁ దెలియకుండునట్లు మెలపుగాఁ గొఱుకునట్లు రాజును మిక్కిలి మృదువయిన యుపాయమున రాజ్యమునుండి పుచ్చుకొనవలయును. వర్ధిలుచున్నయొకనినుండి కొంచెము కొంచెముగా పన్ను నెచ్చునట్లు నిప్పించుకొనవలయును. ఉటమీఁద, నెచ్చుగను నంతకుఁబిదప మఱింతహెచ్చుగను,నిట్లుక్రమముగాఁ దగినంతకొలఁదికి బన్నును హెచ్చింపవలయును. ఒకఁడు చిన్నయె ద్దునకు బరువును రానురానుహెచ్చించుచు మోయఁబనుపఱుచు

* 'మధుదోహం దుహే ద్రాష్ట్రీ భ్రమరా ఇవపాదపమ్' అని బొ.మూ. మధుదోహంచుహే ద్రాష్ట్రీమ్ భ్రమరాన్న ప్రపాతయేత్' అని. దా.మూ. 'రాజుతేనెను దీయునట్లు రాజ్యమును బిమకపలయును. తుమ్మెదలను బడఁగూల్పరాదు' అని యర్థము.

నట్లు, తనప్రజలభారములను గ్రమంబున హెచ్చించుచు రావల యును. అతఁడు మిక్కిలి మెలపుతోను మెత్తఁబాటుతోను బ్రవర్తించుచుఁ గడపటఁ ద్రాళ్లను వారికిఁ దగిలింపవలయును. ఒకతూరి వారికిఁ*గట్టుఁద్రాళ్లువైచినచో మీఁద నడంపరానివారు గాకుందురు. వారల నడఁగిమడఁగి యుండునట్లు చేయుటకుఁ దగిన ప్రయత్నము లాచరించి వారి ననుభవింపవలయును. వట్టి ప్రార్థనలచే వారి నడఁగియుండునట్లు చేయుటచాలదు. అండఱు మనుష్యుల యెడల సమముగా నడచుకొనుట శక్యముగాదు. ప్రజలయందు ముఖ్యులయినవారిని బుజ్జగముచేఁ గయివసము చేసికొని తక్కినవారి నడంకువకుఁ దెచ్చుకొనవలయును. భార మును వహించు సామాన్య ప్రజలయందు (వారిముఖ్యులమూల ముస) భేదముపుట్టించి రాజుతానే వారిని సమాధానపెట్టుటకు ముందటికివచ్చి దానిచే వారివలనఁ దీయఁగలిగిన దానిని హాయి గా ననుభవింపవలయును. రాజు పన్నులను, దగని కాలములం దును, దాని భరింపఁదగనివారియందును వైవరాదు. క్రమక్ర మముగాను, బుజ్జగముతోను, దగినకాలమునను, దగిన విధము నను వానిని విధింపవలయును. నేనుజెప్పుచున్న యీయుపాయ ములు రాజనీతి కనురూపము లయినవి కాని, మాయలతోఁ గూడినరీతులు గావు. గుట్టులను నుపాయములమూలి యడంపఁ జూచువాఁడు దానిని గినియించును. కల్లంగళ్లు, బోగముస్త్రీలు, కుంపెనకత్తెలు, నట్టువులు, జూదములును, జూదపుగొట్టము

* పనుపడని యెద్దులకు బరువు గొంచెము గొంచెముగా నెక్కించుచు మెల పుతోడఁ బాటుపడి వానికిఁ గడపటఁ గట్టుఁ ద్రాళ్లు తగిలించునట్లు ప్రజలయెడ నడచుకొనవలయునని భావము.

లుంచుకొనియుండువారు, మఱియు నిట్టివారును రాజ్యమునకు హానికరులు గావున, వీరి నందఱి నడంచి పుచ్చవలయును. వీరు రాజ్యములోపల వసించుచుఁ బ్రజలయందు మేలయిన తెగలవారిని గొట్టి బాధింతురు. ఒకరి కొక యాపదయు లేనపుడు, మఱొకరి నేదియు యాచింపరాదు. మనువే తొల్లి సమస్తజనులకును నిట్టియేర్పాటు చేసెను. మనుష్యులెల్లవారును యాచించుచును దిరిపమెత్తుచును బనిపాటులుచేయక బ్రతుకఁగోరిరేని యీ లోకములన్నియు రూపుమాయును. ఇందులకు సందేహములేదు. రాజొక్కఁడే నియమించుటకును వారించుటకును శక్తుఁడు. ప్రజలను బాపమునుండి వారింపనిరాజు, రాజరక్షణము లేనందునఁ బ్రజలాచరించు పాపమునందు నాలవపాలును బొందుచున్నాఁడు. ఇట్లని శ్రుతులు ప్రతిపాదించెడిని. రాజు ప్రజలధర్మములందుఁబోలె వారిపాపములందును బాలుగలిగియుండును గాన పాపములాచరించుప్రజలను నట్లుచేయనీక వారింపవలయును. అట్లు వారిని వారింప నుపేక్షించినచో రాజు తనంతటఁ బాపి యగును. వారి పుణ్యములందుం బోలె వారి పాపములందును నాలవపాలునొందును. నేను జెప్పెడియీ దోషములను నడంచిపుచ్చవలయును. ఇవి సంపదను నాశముసేయునట్టివి. కామమునందు మిక్కిలి తగులు గలపురుషుఁ డకార్యమేది సేయకుండును? కామమునకు లోపడినవాఁడు మద్య మాంసములను, బరులవస్తువులను, బరులదారములను ధనములను నపహరించును; అట్లి తరులకుఁ జెడుపద్ధతినేర్పఱచుచు యాచించి బ్రతుకునట్టి వాఁ దెవరుగారో, వా రాపత్సమయమందు యాచింపవచ్చును. వారలకుదయతోను ధర్మముతోను దానముచేయవలయునేకాని భయముతోఁ

గాదు. నీరాజ్యమందు యాచకులును దొంగలును నుండరాదు. వీరు ప్రాణులనుబట్టి వీడించువారేకాని వారికిఁ బెంపొందించువారుగారు. ఎవరు భూతములందు దయసూపుదురో, ప్రజలను వృద్ధినొందింతురో, యట్టివారే నీరాజ్యమం దుండవలయును; కాని, భూతములను మిక్కిలి బాధించువారువలదు. ప్రజలవలనఁ గొలఁదికి మించి పన్నుదీయు నధికారులను దండింపవలయును. కొలఁదిచొప్పునఁ బన్నుదీయు నధికారులను వేఱు నియమింపవలయును. కృషి, గోరక్షణము, వర్తకము మఱియు నిటువంటి వయిన తక్కినపనులును బెక్కండ్రు పురుషులనుగొని వేఱువేఱు వారివారికిఁ గలకర్మములచొప్పున జరుపనలయును. కృషి, గోరక్ష, వర్తకమును జరుపుచుండు మనుష్యుఁడు (దొంగలు కూరిరులుమొదలగు వారివలన) క్షేమము లేకుండునేని దానివలన రాజు మిక్కిలియు నిందనొందును. రాజు ధనికులగువారిని, బీన ములు వస్త్రములు భోజనములు మొదలయినవానిచేఁ బూజించుటయేకాక వారితో 'మీరు నన్నుఁగూడి ప్రజలను బెంపొందింపుఁ' డని చెప్పవలయును. ధనవంతులు రాజ్యమునకు గొప్ప యంగము చుమీ. సకలమనుష్యులకు ధనవంతుఁడు కన్నాకు; ఇందులకు సందేహము లేదు. ప్రాజ్ఞుండును, శూరుండును, ధనవంతుఁడును, ధార్మికుఁడును, దపస్వియు, సత్యవాదియు, బుద్ధిమంతుఁడును, స్వామిగనుండువఁడును, రాజ్యరక్షణమునందు సహాయకారి యగును. కాఁబట్టి రాజా! సమస్తప్రాణులందును ప్రీతిగలిగియుండుము. సత్యమును, నిష్కాపట్యమును, గోపము లేమియుఁ, గూరత్వము లేమియును బాటింపుము. ఇట్లు సత్యమును నార్జవమును గలిగి, మిత్రులతోను బొక్కసముతోను

సైన్యముతోనుగూడి దండమును జెల్లింపుము. బొక్కసమును బెంపుము. మిత్రులను బడయుము. రాజ్యమును నెలకొల్పుము' అనెను. ఇది యెనుబదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముడు ధర్మరాజునకు రాజనీతిని జెప్పుట.

రాజా! నీరాజ్యమందు భుజింపదగిన పండ్లుగల వృక్షములను నటుక రాదు.మూలములును ఫలములును బ్రాహ్మణుల సొమ్ముగుట ధర్మమని జ్ఞానవంతులు చెప్పెదరు.బ్రాహ్మణులకుఁబోఁగా నెక్కువ గామిగిలినదానిని దక్కనిజను లనుభవింపవలయును.బ్రాహ్మణుల కు నడ్డుపడి మటియొకఁ డేవస్తువునేని నేవిధమునఁగాని హరింపఁ గూడదు. జీవనములేనికొఱతవలన నొక బ్రాహ్మణుఁడు వేఱొక చోట బ్రతుకు వెదకికొనుటకై రాజ్యమును దిగవిడువఁగోరు నేని, రా జతనికిని నతనిభార్యకును బ్రతుకు నేర్పుఁజపవలయును. అప్పటికి నాబ్రాహ్మణుఁడు పోక మరలఁడేని బ్రాహ్మణసంఘము కడకుఁబోయి '* ఇపుడు లోకులు తమ్ము మర్యాదయందు మెలఁ పుటకెవనిని బ్రమాణముగాఁ గొందురు? ఈ బ్రాహ్మణుఁడు రాజ్యమును విడిచిపోవుచున్నాఁడే' యని చెప్పవలయును. అప్పటికి నాబ్రాహ్మణుఁడు విడిచిపోవుతలంపును విడువక మటియే

---

* బ్రాహ్మణులు తక్కినవారిని లోకమర్యాదలందు మెలపుటకుఁ బ్రమాణభూతులు. కాన యొకబ్రాహ్మణుఁడు రాజ్యమును విడుచునేని జనులు తామొక స్నేహితునిని గురువును నియామకునిఁబోఁగొట్టుకొన్నవారగుదురు. కావున నే రాజాబ్రాహ్మణునిఁగూర్చి యిట్లుచెప్పుట తెలియునది-ప్రతాపచంద్రరాయులు.

దేని చెప్పనేని, రాజతనితో 'కడచినదానిని మఱచిపోవలయు' నని చెప్పవలయును. కాంతేయా ! ఇది శాశ్వత మయిన రాజనీతిధర్మము. రాజు మఱియు నతనితో 'బ్రాహ్మణోత్తమా ! బ్రాహ్మణునికి జీవనమునకు వలయునంతయె యీఁదగునని జనులు చెప్పెదరు. అయినచే నీమాటను బాటింపను. అతఁడు రాజు (తనకు బ్రతుకుగల్పింపకున్న) తగినినడవడికి న ట్లాచరింపఁ (తనరాజ్యము విడిచిపోవఁ) గోరునేని (యతని కట్టిబ్రతుకుఁ దెరువు కల్పించుటయే కాక యతఁడు కోరెనేని) వలయుభోగములనుగలిగించి నిలువఁ బ్రార్థింపవలయు' ననఁదగును. జనులకుఁ గృషియు గోరక్షణమును,వర్తకము నీలోకమున జీవనమగును. వేదవిద్య పరలోకమునకు సాధనమగును. అది జనులను బెంపునొందించునది. అది క్రిందపడునపు డెవరుదాని ప్రచారమున విరోధులగుదురో వారు

---

* రా జ్ఞాబ్రాహ్మణుని నీవిధమునఁ బోనీక నిలుపవలయును. అందులకు నతఁడు సమాధానపడక రాజుమునుపటియనాదరము నెత్తిచూపునేని రాజుదానిని మఱచుటకు క్షమాపణము వేఁడి,యతనికి జీవనమేర్పఱుపవలయునని ప్రతాపచంద్రరాయలు-- 'అసంశయం నివ క్తేత నచేద్వక్ష్యత్యతః పరమ్ । పూర్వం పరోక్షంవ క్తవ్యమ్' అని. బొ. మూ. 'పక్షతి' అనుటకు 'త్యక్షతి' అని దాపాఠము. 'అప్పుడు సంజేహములేక మఱలును. అట్లుగాక జీవనమునకుఁ జెక్కుడుగా భోగమే వలయునని పట్టణమును విడువఁజూచునేని 'బ్రాహ్మణా ! మొదటిదయినయీభోగవాంఛను మఱవవలయునని చెప్పవలయును. కాంతేయా! ఇదిశాశ్వతమయినధర్మమని జనులుచెప్పెదరు.అయినను నేనుదీనిని నమ్మటలేదు. బ్రాహ్మణుఁడు భోగములు వేడినను నవియు నొసంగి యతని నుపచరింప వలయును' అని మఱియొక యర్థము. 'అహు రేతజ్జనా బ్రహ్మన్నచైత చ్ఛిద్దథ్యా మ్యహమ్, నిమన్త్ర్యశ్చ భవే దోఽగ్నైరపృత్స్యాచ్చ తదా చరేత్' అని మూలము. 'బ్రహ్మన్' అనుటకు 'రాజన్' అని పఠించి యీయర్థము కల్పించుట తెలియునది.

మ్రుచ్చు (అనఁగా జనసంఘమునకు శత్రువు) లగుదురు. అట్టివారిని వధించుకొఱకే బ్రహ్మదేవుఁడు క్షత్రియుల నీలోక మందు సృజించెను. కాఁబట్టి రాజా ! పగవారిని గెలుపుము. ప్రజలను బాలింపుము. యాగములను యజింపుము. కురు నందనా ! శూరుండవై యుద్ధమునఁబోరాడుము. రక్షింపవల సినవారిని రక్షించునట్టి రాజే, రాజులాదు తనుఁడగురాజు.ఎవ్వరు వారిని రక్షింపరో యట్టిరాజు లుండియుఁ బసలేదు. తనప్రజల కెల్ల మేలు గలుగుటకై రా జెప్పుడును * యుద్ధము చేయవల యును. దానినిబట్టియే మనుష్యుఁడు మనుష్యులనే యేల వలయును. సొంతవారివలననుండి పరులను, పరులనుండి సొంత వారలను, పరులవలననుండి పరులను, సొంతవారలనుండి సొంత వారలను,నిక్కెల్లవారిని నెప్పుడును గాచుచుఁ బరిపాలించుచుండు ము. తొలుత రాజు తన్నెల్లవారివలన నుండియురక్షించుకొనుచు భూమిని రక్షింపవలయును. విద్వాంసు లగు జను లన్నిటికిని మూలము తాను (అనఁగా రాజు) అని చెప్పుదురు. రాజు తనలో 'ఛిద్రము లేమియున్నవి? నాకేవ్యసనము లందుఁ దగులుగలదు? నాదుర్బలత్వమునకు మూలమేమి? దోషములకుఁ గారణమెద్ది?' యని యెప్పుడును జింతించుచుండవలయును. రాజు ముందటిదిన

---

* సదైవరాజ్ఞా యోద్ధవ్యం సర్వలోకా ద్యుధిష్ఠిర । తస్మాద్ధేతోర్హి భుఞ్జీత మనుష్యానేవ మానవః । అని. దా. మూలము. 'యోద్ధవ్యమ్' అనుటకు 'బోద్ధవ్యమ్' అనియు 'భుఞ్జీత'కు 'యుఞ్జీత' యనియు. ఖై. మూలము. అప్పుడు 'తనప్రజలకెల్ల మేలునకై రా జందఱిచేష్టలును దలంపులును దెలిసికొనవల యును. అందులకై యతఁడు చేసులవారిని దక్కిన రహస్యభూతులగు మనుష్యులను నియోగింపవలయును' అని యర్థము. ఇదియె సరసముగానున్నది.

మున జరపినదానిని జనులు కొనియాడుచున్నారా లేదా యని తెలియుటకు సమ్మకము గలవేగులవారిని రహస్యము గాఁ దనభూమియందుఁ గ్రుమ్మరునట్లు నియమింపవలయును. మఱియు నతఁడు తననడవడిని సాధారణముగాఁ బ్రజలు కొనియాడుటయుఁ గొనియాడమియును, బల్లెపట్లవారి కదిరుచించుటయు గుంపకుండుటయు, రాజ్యమునందుఁ దనకు మంచికీర్తి కలుగుటయు లేకుంటయు నరయుచుండవలయును. యుధిష్ఠిరా! ధర్మజ్ఞులును ధైర్యవంతులు నయినవారిలోపల యుద్ధమందెవరు వెన్నిచ్చి పాఱరో, రాజ్యమందెవరు వసింపరో, యెవరు నిన్ను గొలిచి బ్రతుకుచున్నారో, నీకమాత్యులెవరో, మఱి తటస్థులుగనుండువారెవరో, నిన్నెవరు సర్వవిధములఁ బ్రశంసింతురో, లేక నిందింతురో, వారి కండఱకును గారవములు నీవు గావింపవలయును. ఏమనుష్యుఁడుఁగాని యండఱకును నొక్కఁ తీరున నిష్టుఁడు గానుండుట శక్యముగాదు. సమస్తజనులకును మిత్రులును శత్రులును మధ్యస్థులును గలరు' అనెను.

ధర్మరాజు 'సమాన భుజబలమును సమానము లగు గుణములును గలజనులయం దొక్కఁ డెట్లధికుఁడగుచున్నాఁడు? ఎట్లు మనుష్యులను నేలుచున్నాఁడు?' అని యడిగెను. అందులకు భీష్ముఁడు 'జంగమములు స్థావరములను దనును (ఏలును). కోఱలుగలవి కోఱలులేనివానిని దినును (ఏలును). క్రూరవిషములగు సర్పములును గుపితములై యల్పసత్వములగు సర్పములను దినును. (ఈతీరునసే మనుష్యులయందును బలీయుఁ డగురాజు తక్కినవారి నడంచి మించును.' రాజు తనప్రజలవలనను బరాకు పడకుండవలయును. పరాకుపడినా గ్రద్దలవలె వారు పయిఁబడు

దురు. రాజా ! నీరాజ్యమందు వర్తకులు సరకులు కొంచె ముగాఁ దీయువారును విస్తారముగఁ దీయువారును బరువయిన పన్నులకు నలఁగి కలఁగి యడవులకుఁబోయి వసించియుండరు గదా ? నీరాజ్యమందు సేద్యగాండ్రును బీడితులై దానిని దిగ విడువకున్నారుగదా ? రాజుభారమును వహించువారే తక్కిన వారిని సయితముభరించువారు సుమీ. ఆలస్యము ధర్మమునం దొకపాతికభాగమును నపహరించును. మఱి యొకపాతిక భాగము పాషండునిఁ బొందియున్నది. మఱియొకపాతిక రాజును బొందియున్నది. ఇం కొకపాతిక కృషి నాశ్రయించియున్నది. రాజును బొంది యున్నయొకపాదమును దక్కిన మూఁడుపాద ములుగూడి నాఁటినాటికిఁ దినుచున్నవి. కాఁబట్టి రాజా! ఇన్ని పాట్లునుబడి నీపాతికభాగమును రక్షించుకొనుము. దేవతలును, చిత్రగణములును, మనుష్యులును, ఉరగులును, రక్షస్సులును, బక్షులును, బశువులును, నిందు నీ వొసంగుదానివలననే జీవించు చున్నవి. ఇవియే రాజ్యమును బాలింపవలసిన సాధనములును రాజులను రక్షింపవలసిన విధములును. వీనినే మఱులఁ జెప్పె దను' అనెను. ఇది యెనుబదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు * ఉచథ్యమాంధాతృ సంవాదమును జెప్పుట. }

భీష్ముఁడు - ఆంగిరసవంశ్యుఁడును బ్రహ్మవిత్తముఁడును నయి

* దాక్షిణాత్యకోశములందు 'ఉచథ్య' డనియును, ఔత్తరాహకోశము

యుచథ్యుఁడు మున్ను యువనాశ్వునికొడు కయిన మాంధాత కుఁ బ్రీతిగడలుకొన త్రిధర్మముల నుపన్యసించెను. బ్రహ్మ విదులందు మిన్నయగునతఁ డారాజునకు నుపదేశించినవిధ మునఁనే దానినంతయు నీకుఁజెప్పెదను.

ఉచథ్యుఁడు, 'మాంధాతా! రాజు ధర్మమునకై యున్నాఁడు గాని తనయిచ్చలను జేయుటకై కాదు. లోకమును రక్షించు వాఁడు రా జని యెఱుంగుము. రాజు, ధర్మము నాచరించు నేని దేవత్వమునకు నర్హుఁడగును. అతఁ డధర్మము గావించునేని నరకమునకే పోవును. సకలభూతములు నాధర్మమునందు నెల కొనియున్నవి. ఆధర్మము రాజునందు నెలకొని యున్నది. దానిని జక్కఁగాఁ బాలింపఁగోరురాజే సంపదను బొందును. *మాంధాతా! రాజుచేయు నపరాధమునుబట్టి 'సంపదగలవాఁడు, పాపాత్ముఁ'డను మాటకలుగుచున్నది. దేవతలును నిందనుబొం దెదరు. ధర్మములేదనియుఁ జెప్పంబడును. అధర్మమందుఁ బ్రవ ర్తించువారికిని నర్థములు సిద్ధించుట చూపట్టును.లోకమంతయు, నదియే మంగళమని దాని ననువర్తించుచున్నది. పాప మెప్పుడు, వారింపఁబడదో యప్పుడు ధర్మవృత్తము నెకల్పఁబడుచున్నది. అధర్మమును బెచ్చుపెరుఁగుచున్నది. రేయింబవలు భయ మను చుందురు. నాయనా ! పాపమును వారింపనియెడ ధర్మము.

లందు 'ఉతిథ్యు' డనియును పాఠములున్నవి. ఇట దాక్షిణాత్యకోశానుసార ముగా 'ఉచథ్యు' డనియే కైకొనఁబడినది.

* 'రాజాపరాధాన్మాంధాతర్లక్ష్మీర్వా పాప ఉచ్యతే' అని దా. మూ. 'రాజా పరమధర్మాత్తా లక్ష్మీర్వా ధర్మ ఉచ్యతే' అని బొ. మూలము. రాజు పరమధర్మాత్ముఁడును సంపన్నుఁడు నయినచో నతఁడే ధర్మము స్వరూపమనఁ బడునని యర్థము.

చొప్పున 'ఇది నాది;ఇది నాది గాదు' అని సాధువుల యేర్పాటు కలుగదు. పాపము బలీయముగా నున్నపుడు మనుష్యులకు భార్యయుఁ బశువులును బొలమును గృహమును గలుగనేరవు. పాపమును వారింపనియెడ దేవతలు పూజల నెఱుంగలేరు; పితరులు శ్రాద్ధములఁ దెలియఁజాలరు. అతిథులు పూజల నందఁగలుగదు. పాపము వారింపనపుడు బ్రాహ్మణులు వ్రతము లూఁది వేదముల నధిగమింపరు; యాగములు గావింపరు. మహారాజా! పాపమును వారింపనపుడు మనుష్యుల మనసులు వధ్యులయిన ప్రాణులమనంబులుం బోలెఁ గలగుండుపడుచుండును. కాఁబట్టి మును లుభయలోకములను నుద్దేశించి 'వీఁడందఱ ప్రాణులయందును గొప్పయై ధర్మస్వరూపుఁడై యుండుఁగాక' యని రాజును గారవించిరి. ఎవనియందు ధర్మము వెలుంగునో వానిని రాజు గాఁజెప్పుదురు. ఎవనియందు ధర్మము నశించుచున్నదో వానిని దేవతలు వృషలునిఁగాఁ జెప్పుదురు. మహనీయమగు ధర్మము నకు 'వృష' మనియుఁ బేరుగలదు. దానికి 'లయ'ము (నాశము) కావించువాఁడు వృషలుఁ డనఁబడును. కాఁబట్టి ధర్మమునకు లోపముగలిగింపరాదు. ధర్మము వర్ధిల్లఁగా సకలప్రాణులును నెప్పుడును వర్ధిలుచుండును. అది నశింపఁగా నన్నియు నశించుచున్నవి. కాఁబట్టి ధర్మము నెప్పుడును బెంచుచుండవలయును. ధనములను బెంచుటవలననో లేక (లోకములను) ధరించుటవలననో ధర్మమని చెప్పఁబడుట నిశ్చయము. రాజా! ఆధర్మము మనుష్యులకు * (నరకము) నెల్లను నంతము నొందించునదిగాఁ

* 'మానవానాం మనుష్యేన్ద్ర సీమా న్తకరణస్మృతః' అనిమూలము. అది మనుష్యుల దుష్టకృత్యములెల్ల సాఁగనీయనిది. (ప్రతాప).

జెప్పఁబడుచున్నది. (అనఁగా ధర్మముగల వఱకు స్వర్గము. లేని చో నరకమని చెప్పఁబడుచున్నది.) బ్రహ్మ ప్రాణులపెంపునకుఁ గాను ధర్మమును సృజించెను. కాన ప్రజల ననుగ్రహించు నిమిత్తమై ధర్మమును మిక్కిలియు వృద్ధినొందింపనలయును. రాజశార్దూలా! కాఁబట్టియే ధర్మము మిక్కిలి శ్రేష్ఠమయి నదిగాఁ జెప్పఁబడుచున్నది. ఎవఁడు మంచికార్యముల నాచరించుచుఁ బ్రజలను బరిపాలించునో వాఁడే రాజు. కామక్రోధముల నెంతమాత్రమును బాలింపక ధర్మమునే పరిపాలింపవలయును. రాజులకు ధర్మమే శ్రేయస్కరము లయినవానిలోనెల్ల మిన్నయైనది. ధర్మమునకుఁ బుట్టుచోటు బ్రాహ్మణుఁడు; కాఁబట్టి, వారల నెప్పుడును బూజించుచుండవలయును.నూఁధాతా! బ్రాహ్మణులు కోరినకోర్కలను నసూయలేక చేయవలయును. వారలు కోరినది చేయకపోవుటవలన రాజులకు భయముప్పతిలుచున్నది; మఱియు మిత్రులను వృద్ధినొందక పోవుటయే కాక శత్రువులు నగుదురు. వికోచనుని పుత్రుఁడయిన బలి బాల్యము మొదలుగా నెప్పుడును బ్రాహ్మణులయం దసూయగలిగియుండెను. పిదప నతనియందుఁ గల (ప్రతాప)లక్ష్మి యెంతయుఁ గుపితయై యతనినుండి తొలఁగిపోయినది. అట్లు తొలఁగి యది యింద్రునికడకుఁ బోయినది. అంత నాబలి యింద్రునియందున్నలక్ష్మిని జూచి మిక్కిలియు మనంబున ననుతాపపడెను. అసూయకును నభిమానమునకును ఫల మిదియే. కాఁబట్టి ప్రతాపసంపన్న యగులక్ష్మి నిన్ను దిగవిడువకుండునట్లు తెలియుము. అహంకారము లక్ష్మికి నధర్మమువలనఁ గలిగిన పుత్రుఁడని శ్రుతి ప్రతిపాదించుచున్నది. రాజా ! ఆయహంకారము

వలనఁ బెక్కండ్రు దేవతలు ననురులును నాశము నొందింపఁ బడిరి. అట్లే పెక్కండ్రు రాజర్షులును నాశమునొంది రని యెఱుంగుము. అయ్యహంకారమును జయించినవాఁడు రాజగును. దానిచే జయింపఁబడినవాఁడు దాసుఁ డగును. మాంధాతా! చిరకాలము తిరముగా నుండఁ గోరుదువేని యహంకారముతోఁ గూడిన యధర్మము ననుసరించి పోకుండునట్లు మెలంగుము. మదముగలవాఁడును బరాకుగలవాఁడును దెలివిలేని పసివాఁడును బిచ్చివాఁడును విశేషించి నిందితుఁడైనవాఁడును దురాచారముగలవాఁడును శత్రులనుసేవించువాఁడును, నిగ్రహింపఁబడినయమాత్యుఁడును, విశేషించి స్త్రీలును, బర్వతమును, విషమమయినదుర్గము, నేనుఁగును, గుఱ్ఱమును, సర్పమునెడి వీనితోడ నెప్పుడును జేరిక లేకుండవలయును. రాత్రులయందుఁ ద్రిమ్మరఁగూడదు మిక్కిలిపేరాసయు నభిమానమును డంభమునుఁగోర్కిఁయును దిగవిడువవలయును. తెలియని స్త్రీలతోడను, పెడిపడఁతులతోడను, అంకుటాండ్రతోడను, బరులయిల్లాండ్రతోడను, బెండ్లాడని కన్యలతోడను సంభోగముగూడదు. రా, జెప్పఁడుపాపమును వారింపక ప్రాలుమాలిక గలిగియుండునో యపుడు వర్ణముల సంకరము గలుగును. దాని వలనఁ బాపులగు రాక్షసులును, నపుంసకులును, నంగహీనులును, మూఁగలును, మూఢులును, మఱియుఁ దక్కినవారును బుట్టుదురు. కాఁబట్టి రాజు విశేషించి ప్రజలహితమందు వర్తింపవలయును. రాజు పరాకు గలిగి యుండినా ప్రబలదోషము కలుగును. ప్రజలకు వర్ణసంకరము కలిగించునట్టి యధర్మములు మిక్కిలి పెరుఁగును. చలిలేని కాలమందుఁ జలి కలుగును. చలి వలసిన సమయమందుఁ జలికలుగదు. అనావృష్టియు, అతివృ

ష్టియు, నొప్పులును, బ్రజలను బీడించును. ఇట్టి కాలములందు (ధూమకేతువు మొదలయిన) నక్షత్రములును గ్రహములును దోఁచును. రాజు నాశమునకుఁ గారణములయిన యుత్పాతములు పెక్కులిందుఁ గనుపట్టును. ఏరాజు తన్నును రక్షించుకొనక ప్రజలను రక్షింపక పోవునో యతనిప్రజలు నాశమునొందుదురు. పిదప నతఁడును నాశమునొందును. ఒకనిధనమును నిరువురును, నిరువురధనమును దక్కిన పెక్కండ్రును గొట్టి దోచుకొందురు. కొమిరెపడఁతులను జెఱుపుదురు. అది రాజు దోషమువలనఁ గలిగినదని చెప్పుదురు. రాజు, ధర్మమును దిగవిడిచి పరాకునఁ బ్రవర్తించినపుడు మనుష్యులయందు 'ఇది నాది' యని వస్తువుల సొంత మడుగంటుచున్నది' ఇది తొంబది యవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ఉచథ్య మాంధాతృ సంవాదము.

'పర్జన్యుఁడు కాలమందువర్షించునేనియు రాజు ధర్మము నాచరించునేనియు, మిక్కిలి సంపత్తి పెంపుగలిగి, ప్రజలను సుఖంబునందు నోలాడఁబోషించుచుండును.వస్త్రములందున్నముఱికిని, దాని చాయను బోఁగొట్టకయే తీయనేరని చాఁకలివాఁడు చాఁకలివాఁడేకాఁడు. బ్రాహ్మణశ్రేష్ఠులయందును క్షత్రియులందును వైశ్యులందును నాలుగవవారగు శూద్రులందును నెవఁడొకఁడు తనతనధర్మములను దిగవిడిచి తాఁటుమాఁటుగ నానాకర్మములందు వర్తించుచుండునో వాఁడు నాచాఁకలివంటి వాఁడే

యగును. శూద్రునకు నూడిగమును వైశ్యునకుఁ గృషియు, క్షత్రియునకు దండనీతియు, బ్రాహ్మణులకు బ్రహ్మచర్యమును, తపమును మంత్రములును సత్యమును ధర్మమగును. ఏక్షత్రియుఁడు, పాత్రములకు శుద్ధిచేయునట్లు, వారల శీలమందుఁ గలదోషములను బోఁగొట్టనేర్చునో, యట్టిరాజు జనులకుఁ బతియుఁ దండ్రియు నగును. కృత, త్రేత, ద్వాపర, కలి యనెడి యివియన్నియు రాజు నడవడులే. రాజే యుగమని చెప్పఁబడుచున్నాఁడు. రాజు ప్రమాదము నొందునపుడు నాలుగువర్ణములును, నశ్లే వేదములును, నాలుగాశ్రమములును నన్నియును విశేషించి మోహమునొందును. రాజు పరాకు పడియున్నయెడల మూఁడగ్నులును మూఁడువేదములును దక్షిణలతోడి యాగములును నన్నియుఁ దెలియఁబడకపోవును. రాజు ప్రాణులకుగఁ ర్త. రాజేప్రాణులకు నాశకుఁడు. ధర్మాత్ముఁడగువాఁడుకర్తయు, నధర్మాత్ముఁడు నాశకుఁడు నగుదురు. రాజు ప్రమాదముగలవాఁడగునేని రాజు భార్యలును బుత్రులునుబంధువులును సుహృదులును నందఱునుగూడిశోకము నొందుదురు. రాజధర్మవర్తనముగలిగియుండినేని, యేనుఁగులును, గుఱ్ఱములును, బళువులును, లొట్టియలును గంచరగాడిదలును, గాడిదలును, దక్కిన సకలప్రాణులును దుఃఖమునొందును. మాంధాతా! బలము దుర్బలులను రక్షించుటకై బ్రహ్మదేవునిచే సృజింపఁబడినదని చెప్పఁబడుచున్నది. బలములేనిదే మిక్కిలియుఁ

---

* ఏవమే తద్ద్విజేంద్రాణాం క్షత్రియాణాం విశాంతథా, శూద్రశ్చతుర్థో వర్ణానాం నానాకర్మస్వవస్థితః' అని మూలము. ఆమూఁడువర్ణములందు నెవఁడు తన ధర్మములనువిడిచి నానాకర్మములు చేయునో వాఁడు శూద్రుఁడగును. (ప్రతాప)

బెద్ద. అందులకై యన్నియు నెలకొనియున్నవి. రాజా! రా, జ: ధర్మమునందు వర్తించునేని, యాప్రాణిని బోషించువాఁడును నాపోషకుని కులమం దుదయించినవారును నందఱును శోకము నొందుదురు. బలము లేనివాఁడు, ముని, సర్పము, ననెడివీని కను దృష్టిని సహించుట మిగులఁగటువు. బలము లేనివానిపొంతకుఁ బోకుము. బలము లేనివారి నెప్పుడుగాని యవమానింపరాదని తలంపుము. దుర్బలులకన్నులు నిన్ను బంధుసహితముగా దహింపకుండుఁ గాత. దుర్బలులచే దగ్ధుఁడయిన వాని కుల మందు నొకటియు మొలవదు. వారు వేగుతోడఁ గాల్చివైతురు. దుర్బలులదగ్గఱకుఁ బోకుమా. బలమునకంటె బలము లేమి మిక్కిలియుఁ బెద్దది. అది యధికబలముగల బలము. దుర్బలులచేఁ గాల్పఁబడిన బలమునం దించుకయు మిగులదు. అవమానింపఁబడిన వాఁడును, కొట్టఁబడినవాఁడును, కస్తిపెట్టఁబడిన వాఁడును, గాచువానిని బొందక పోయినయెడ నాదేశమందలిరాజును దైవకృత మయినదండముచంపును. నాయనా! బలమందున్న నీవు బలము లేని జనులవలనఁ గప్పము దీయఁ గోరకుము. అగ్ని దాపటివానిని గాల్చునట్లు, దుర్బలులకన్నులు నిన్నుఁ గాల్పకుండుఁగాక. లేని యపరాధము మోపఁబడినవా రేడువఁగాఁ గ్రిందఁబడువారి కన్నీటిబొట్లు, లేని యపరాధమునువారియందు మోపినట్టివారిపుత్రులను బశువులను జంపును. తనయం దది ఫలింపక పోయినచోఁ దనపుత్రులయందును, లేనిచో, పౌత్రుల యందును, వారల పుత్రులయందును నది ఫలించును. చేసిన పాపకర్మము పశువుంబోలెఁ దోడనే ఫలముచూపదు. ఒకదేశ మందు దుర్బలుఁడయినవాఁడు కొట్టుపడి కాచు దిక్కునొందక

పోవునేని, యీదేశమందు వైవక్రృతమును గ్రూరమునయిన పెనుదండము సంభవించును. దేశమందుఁ గలవారు యుక్తిగల వారైబ్రాహ్మణులవలెనన్న్యాసివేషములతో మాటిమాటికి భిక్ష యెత్తునపుడు వారు రాజును జంపువారగుదురు. రాజు దేశమందు రాజును సంబంధించిన పెక్కండ్రు పురుషు లెప్పుడు నీతిమాలి నడ చుకొందురో యప్పుడది రాజునకుఁ గొప్పపాపమగును. రాజు నధికారులు జనులు దీనులయి బతిమాలు కొనుచున్నను శాటింపక కామమువలనఁగాని, ధనమునకు లోనయి కాని, యుక్తి తోడ ధనములను దీయుదురేని యది రాజునకుఁ బెద్దకీడగును. గొప్పమాను, మొదటఁబుట్టి యంతటఁ బెద్దదిగాఁ బెరుఁగుచున్నది. దానిని బెక్కులు ప్రాణులువచ్చి యాశ్రయించుచున్నవి. అయినను దానిని నఱికి కాల్చివైచినపుడు దాని నాశ్రయించియున్నవానికి నునికిపట్లు లేకపోవుచున్నవి. ఒక రాజ్యమందలి ప్రజలు ముఖ్యము లయినధర్మముల నాచరించుచు దేశసంస్కారములనో రాజు గుణములనో గొనియాడుచు నుందురేని యారాజు వృద్ధినొందును. పాపమును దొలఁగును. ఇట్లు గాక యందలి ప్రజలు ధర్మమును దెలియక యధర్మము నాచరింతురేని పుణ్యము వేగ తొలఁగిపోవును; పాపమును వచ్చును. పాపులెందు బాహాటముగాఁ (దప్పులకును దగిన దండనము లేక) గ్రుమ్మఱుదురో యాదేశములందలి రాజులనును బరిపాలకులనును గలిపొందును.ఏదేశమందు రాజు తనశక్తిచే జనులనడఁచి పాలింపఁడో యాదేశము వృద్ధినొందదు. ఏరాజు తగుగీతిని నమాత్యులను సమ్మానించి మంత్రాలోచనమందును యుద్ధమందును నుపయోగించునో యతనిరాజ్యము వృద్ధినొందును. అతఁడును,

భూమి సంతయును జిరకాల మనుభవించును. మంచికార్యము లను, మంచివచనములను గనుఁగొని యెంతయు గారవించు నట్టిరా జు త్తమమయిన ధర్మమునొందును. పంచికుడుచుటయు, పరుల నవమానింప కుండుటయు, గర్వించియున్న బలవంతునిఁ గొట్టుటయు, రాజునకు ధర్మ మని చెప్పఁబడుచున్నవి. వాక్కు చేతను శరీరముచేతను మనస్సుచేతను నన్నిఁటిని రక్షించుట యు, నిందులకు విరోధియగునేని పుత్రునయినను సహింపకుండు టయు, రాజునకు ధర్మమని చెప్పఁబడును. రా జెప్పుడు బలము లేని మనుష్యులకు దానమొసంగి భుజించునో యపుడు వారు బలవంతులగుదురు. అదిరాజునకు ధర్మమనిచెప్పఁబడును. రాజ్య ములను రక్షించుటయు, దొంగలఁ దఱుమఁ గొట్టుటయు, యుద్ధమందు జయించుటయు, రాజధర్మ మని చెప్పఁబడు ను. కార్యములచేతను మాటలచేతను బ్రియుఁడుగా నుండి నను బొప మాచరించు నట్టివానిని నోర్వకుండుట రాజునకు ధర్మమని చెప్పఁబడును. కన్న పుత్రులవలె వర్తకులను రక్షిం చుటయు, మర్యాదను భేదింపకుండుటయు రాజునకు ధర్మమని చెప్పఁబడును. కామద్వేషములను గయికొనక, శ్రద్ధగలిగి, యా హ్తజఙ్ఞులతోడ యాగములు చేయుట రాజునకు ధర్మమని చెప్పఁబడును. వేదవారలయు దిక్కుమాలినవారలయు వృద్ధు లయుఁ గన్నిటిని దుడుచుటయు, మనుష్యులకు సంతసముగలిగిం చుటయు రాజునకు ధర్మమని చెప్పఁబడును. మిత్రులను వృద్ధి నొందించుటయు, నల్లె శత్రువులను డిందుపడ నీడ్చుటయు, సాధువులమ లెస్సఁగాఁ బూజించుటయును రాజధర్మమని చెప్పఁబడును. సత్యమును రక్షించుటయుఁ, బ్రేమతోడ భూమి

దానములు సేయుటయు, నతిథులను బూజించుటయు, భృత్యుల నాదరించుటయు రాజుధర్మమని చెప్పఁబడును. నిగ్రహానుగ్రహములు రెండును నెవనియందు నెలకొని యుండునో యూరా జిహామందును బరమందును ఫలమునొందును. మాంధాతా! రాజు యముఁడే యగును. అతఁడు ధార్మికులకెల్లఁ బరమేశ్వరుఁడు.* ప్రాణులనడంచువాఁడు యమునివలె నగును; అడంపనివాఁడగ్నికి సాటియగును. ఋత్విజునిని, పురోహితునిని, ఆచార్యునిని, నవమానింపక, సత్కరించి రాఁబట్టుకొనుట రాజునకు ధర్మమగును. యముఁడు సకలములయిన ప్రాణులను, భేదము లేక యడంచుచున్నాఁడు. అట్లు రాజును నడంపవలయును. రాజు సర్వవిధముల నింద్రునితోడఁ బోల్పఁబడుచున్నాఁడు. ఎవఁడు దేనిని ధర్మముగాఁ దలఁచుచుఁ గనుఁగొనుచున్నాఁడో యది ధర్మము. నీవు పరాకువడక యౌర్వును, బుద్ధియును, ధైర్యమును † దెలివియుఁ గఱచుకొనుము. సమస్తజనుల బలమును దుర్బలమును గలరూపునఁ దెలియఁగోరుము. మంచిసెబ్బరలను వివేచింప నేర్చుకొనుము. సమస్తప్రాణులయెడఁ గలుపుఁగోలు తనముగలిగి, దానములుచేయుచుఁ దియ్యనిపలుకు లాడవలయును. పురజనులను దేశజనులను కన్నబిడ్డలవలెఁ రక్షింపవలయును. సమర్థుఁడుగాని రాజు ప్రజలను నొక ప్పుడును రక్షింప

---

* 'సంయచ్ఛ్ యమవత్ప్రాణా నసంయచ్ఛంస్తు పాపకృత్' అని మూలము. ఇంద్రియముల నడంచుటపలన గొప్ప పెంపునొందును. అడంపమిపలనఁ బాపమునొందును. ఇందులకు 'సంయచ్ఛ్ భవతి (పృథ్వీం ప్రాప్నోతి) ప్రాణా న సంయచ్ఛంస్తు పాతికృత్' అని కౌ. మూలమును దదర్థమును దెలియునది.

† 'మతిఞ్' అని ఆ. మూ. 'రతిఞ్' అని కౌ. మూలము.

శ క్తుఁడు గానేరఁడు. రాజ్య మనెడి భారము మోయుట మిక్కి లీయు నెక్కువయైనది. ప్రాజ్ఞుండును శూరుఁడును దండశా స్త్ర విదుండు నగు రాజొక్కఁడే దానిని రక్షింపఁజాలును. చుఱుకు దనమును బుద్ధియును లేక దండశా స్త్రము నెఱుంగకయు నుండు నట్టిరాజు రాజ్యభారమును వహింప నెంతమా త్రము దగఁడు. మం చి చక్కఁదనము గలిగి, గొప్పకులమునఁ బుట్టిన వారును, సమర్థు లును, దనయందు భ క్తిగలవారును, మిక్కిలి చదువరులును నగు మంత్రులతోఁగూడి, మనుష్యుల మనసులను, నా శ్రమము లం దున్న తాపసులగు వారి తలంపులను గార్యములను సయి తము స్వబుద్ధిచేఁ బరిశీలించు చుండవలయును. ఇట్లు నడచు కొనుటవలన నను స్తవర్ణములవారి ధర్మములను దెలియఁ శ క్తుఁడ వగుదువు. నీవు స్వదేశమందుండినను బరదేశమందుండి నను, నీధర్మములను నాచరించుట కిది తోడ్పడును. ధర్మార్థకా మములు మూఁటియందును ధర్మమే యుత్కృష్టమైనది. ఈ లోకమందును బరలోకమందును ధర్మాత్ముఁడే సుఖంబున వర్ధిలు చున్నాఁడు మనుష్యులను నీవు చక్కఁగాఁ బూజించితివేని వా రా పూజనమునుబట్టి నీకొఱకై తమభార్యలను బుత్రులనును దిగ విడుతురు. సజ్జనులను జేరఁబెట్టుకొనుట, జనుల మంచిగా నాద రించుట, దానము, తియ్యనిపలుకులు, ప్రమాదము లేకుండుట, శౌచము, ననెడి యివి రాజున కెంతయు సంపద గలిగించును. మాంధాతా! ఈగుణములవలన నెప్పుడును బరాకుపడకుము. రా జేమఱుపాటు లేక తనచిద్రములను బరుల చిద్రములను బాటిం చుచుండవలయును. తనచిద్రమును బరులకుఁ దెలియనీయరాదు. పరులయందు చిద్రమునుజూచి పైఁబడవలయుము. ఈవిధమున నే

యింద్రుఁడును, యముఁడును, వరుణుఁడును వర్తించిరి. రాజర్షు లెల్లవారును నడచుకొన్నవిధము ననుష్ఠింపుము. పురుషసత్తమా! దివ్యంబగు మార్గమును శీఘ్రముగఁ గయికొనుము. ధర్మమందు వర్తించినరాజును నిహమందును బరమందును దేవతలును ఋషులును గంధర్వులును నెంతయుఁ దేజంబు దొలంకునట్లు కీర్తింతురు' అనెను.

ఉచథ్యుఁ డిట్లుచెప్పఁగా మాంధాతి శంక లేక యట్లు చేయుచున చ్చెను. తానొక్కఁడును భూమిని బడిసెను రాజా! మాంధాతవలె నీవు నట్లే చక్కఁగా ధర్మము నాచరించి భూమిని బరిపాలింపుము. స్వర్గమునందు స్థానము నొందుదువు' అనెను. ఇది తొంబదియొకఁడవయధ్యాయము.

—✧—

రాజధర్మపర్వము.

వామదేవ సుమనస్సంవాదము.

ధర్మరాజు 'పితామహా! రాజధర్మమునందే ప్రవర్తింపఁగోరు వాఁ డెట్లు నడచుకొనవలయును? నిన్నడిగెదను. నాకది చెప్పుము' అనెను.

భీష్ముఁడు 'ఈ విషయమందును సమస్తార్థముల స్వరూపమును గనుఁగొన్న బుద్ధిమంతుఁ డగు వామదేవుఁడు పాడిన పురాతనమయినయీ యితిహాసము నుదాహరించెదరు. వసుమనుండను రాజుండెను. అతఁడు కోసలదేశమునకు రాజు; బలవంతుఁడును బరిశుద్ధుఁడును, అతఁడు తపస్సంపన్నుఁ డగు వామదేవమహర్షిని జూచి 'మహాత్మా! నేనెట్టి నడవడిగలిగియుండినచో

స్వధర్మమునుండి జాఱకుండునో ధర్మార్థయుక్తంబులగు వచనంబుల నాకు నుపదేశింపుము' అని యడిగెను. అందుల కాతపస్వి వామదేవుఁడు బంగరుచాయఁ దుఱుంగలించుచు నహుషకుమారుండయిన యయాతివలె సుఖాసీనుండయి యున్న పురూరాజుతో నిట్లనియె.

వామదేవుఁడు:— 'ధర్మమునే యనువర్తించుచుండుము. ధర్మమునకంటె నెక్కుడయినది మఱొక్కటిలేదు. రాజులు, ధర్మమునందుఁ దప్పక నెలకొన్నట్టివారే యీభూమిని జయించుచున్నారు. ఏరాజు ధనసిద్ధికంటెను ధర్మమునే యెక్కుడుగాఁ దలఁచి దానిని వృద్ధినొందించుటయందు బుద్ధినుంచునో యతఁడు ధర్మముచేఁ బ్రకాశించుచున్నాఁడు. ఏరాజు ధర్మమును బాటింపక బలాత్కారముతో మాత్రము ప్రవర్తించునో వానివలన నుండి ధర్మమును నర్థమును రెండును వేగ తొలఁగిపోవును. దుష్టుఁడును భాషాత్ముఁడు నగుమంత్రిచెప్పినచొప్పున వర్తించురాజు ధర్మమును నాశముసేయును గాన, యట్టివాఁడు లోకులకు సపరివారముగా వధ్యుఁడగును; వాఁడు శీఘ్రముగానే నాశమునొందును. రాజకార్యములను జక్కఁగా ననుష్ఠింపలేనివాఁడును, విచ్చలవిడి వర్తించువాఁడును, దన్నుఁ దాను బొగడికొనువాఁడును నగు రాజు సమస్తభూమిని బడసినను శీఘ్రముగానే నశించును. శుభమును బడయఁగోరువాఁడై, యసూయలేక, జితేంద్రియుఁడై మతిమంతుఁడగురాజు నదీ ప్రవాహములవలన సముద్రముం బోలె వృద్ధినొందును. రాజా! ధర్మమునందుఁగాని, కామమందుఁగాని, అర్థమందుఁగాని, బుద్ధియందుఁగాని,

* మిత్రులందుఁగాని పూర్తినొందినట్లు తలంపరాదు. లనగాఁ వీని యన్నిటియందే లోకయాత్ర నెలకొనియున్నది. ఈ యుప దేశములను వినుటవలన రాజు, యశమును గీర్తిని సంపదను బ్రజలను బడయుచున్నాఁడు.ధర్మమునందుఁ బూనికగలిగి, ధర్మమును నర్థమునుబడయుట్కై జింతించుచు, నొక్కొక కార్యమును జక్కఁగా వానిఫలాదుల నాలోచించిన పిదపఁ జేయ నారంభించునట్టిరాజు మిక్కిలీయు సంపదను బొందును. ఈవి లేని వాఁడును, జెలిమిలేనివాఁడును, బ్రజలను దండనీతిచొప్పున మెల పనివాఁడును, సాహసప్రకృతియు నగు రాజు శీఘ్రముగా నశించును. బుద్ధిలేనివాఁడు తాను జేసినపాపమును బుద్ధిచేతఁ గనుఁగొనఁజాలఁడు.అట్టినాఁ డిపకీర్తినొంది మరలనరకమునఁ బొందును. † రాజయ్యెవారిని దగురీతిని సమ్మానించుచు, దానము లొసంగుచుఁ, దయ్యనిమాటలపస నెఱింగి పలుకుచు నుండునేని యతనికిఁ గలుగువ్యసనములను బ్రజలు తమకుఁ గలిగినవానింబోలె బోకార్పఁ నుంకించుచుందురు.ఎవనికి ధర్మములను దెలుపునట్టి గురుండు గలుగఁడో,యెవఁడు తక్కినవారినడుగఁడో, యెవఁడుధనములను గసుగందకయె హాయిగాసంపాదింప నెంచునో, వాఁడు చిరకాలము సుఖమునొందఁడు.ధర్మములందు గురువును ముఖ్యునిగాఁగొని నడచువాఁడును, తనంతటఁ జక్కఁ గార్యములు

---

* 'మిత్రతః' అని. జె. మూలము. 'మంత్రతః' అని దాక్షిణాత్య మూలము తెలియునది.

† 'అథ మానయితుర్ధామ్నః (దాతుః) శ్లక్ష్ణస్య రసవేదినః। వ్యసనం స్వమివోత్పన్నం విజిఘాంసంతి మానవాః' అని. జె. మూలము. 'తతోనయాచితుర్దాతుః శ్లక్ష్ణస్యరసవేదినః—పతివర్తినః' అని. దా. మూలములందలి పాఠము

చూచుకొనువాఁడును, లాభములను ధర్మమే ప్రధానముగా నుంచుకొని (అనఁగా నెంతమాత్రము ధర్మమును దప్పక) పొందువాఁడును, చిరకాలము సుఖ మనుభవించుచుండును.' ఇది తొంబదిరెండవయధ్యాయము.

రాజధర్మసర్వము

వామదేవ సుమనస్సంవాదము.

వామదేవుఁడు 'బలవంతుఁడగురాజు దుర్బలుఁడగు వానియం దధర్మముగా నడచుకొనునపుడు, వానినంశపువారును, నట్టి నడ వడినే యనుసరింతురు. తక్కినవారును నశ్లి పాపమును బ్రవ ర్తింపఁజేయుచున్న యారాజు ననువర్తింతురు. ఆవినీతుఁడయిన యట్టిమనుష్యుని ననువర్తించుట రాజ్యమునకు శీఘ్రముగా నాశముగలిగించును. రాజు తనయుచితధర్మముల ననుష్ఠించు చుండునేని యతనిసడవడిని సామాన్యముగా మనుష్యులందఱు నిదర్శకముగాఁగొని యనువర్తింతురు. రాజు ధర్మములనుండి జాతి వర్తించినచో నతని సొంతజనులుగూడ దానినిసైఁపరు. శాస్త్రవిధులను బొటింపక సాహసప్రకృతిగలిగి మిట్టిపడి యించుక బాధకలిగించినను శీఘ్రముగనే నాశము నొందును. ఏక్షత్రి యుఁడు జయించినట్టియు నపజితులయినట్టియు సద్వర్తనము గలట్టియు క్షత్రియు లాచరించుచు వచ్చిననడవడి ననువర్తిం పఁడో వాఁడు క్షత్రధర్మమునుండి తొలఁగినవాఁడగును. ముందుఁ దనకు మంచి చేసియున్నయొకశత్రురాజును యుద్ధ మునఁబట్టుకొని, రాజట్టివానిని ద్వేషమునే యూని సమ్మానింపని

యొడల నతఁడు క్షత్రధర్మమునుండి తొలఁగును. రాజు తనశక్తి నెఱపవలయును; మిక్కిలి సుఖముగా నుబుసుపుచ్చ వలయును; ఆపదలయం దుద్ధరింపవలయును. అట్టివాఁడు సమస్త జనులకును బ్రియుండగును. ఐశ్వర్యమునుండియు భ్రంశమునొందఁడు. నీవొకనికి నప్రియ మాచరించితివేని మరల సమయము వచ్చినపుడు వానికిఁ బ్రియమాచరింపవలయును. ఎవఁడు ప్రీతిలేని వానికిఁ బ్రియముగావించునో వాఁడు వానికిఁ ద్వరితముగాఁ బ్రియుఁడగును. అబద్ధ మాడరాదు. వేఁడకయే ప్రియము గావింపవలయును. కామమువలనను క్రోధమువలనను ద్వేషమువలనను ధర్మమును దిగవడువరాదు. తెలివిగలవాఁడు వంచనలేక వర్తింపవలయును. సత్యము, దమము, ధర్మము, శీలమును, బ్రజలకు హితమయిన క్షత్రధర్మములు. కాన వీనిని విడువరాదు. ప్రశ్నము లడుగునపుడు బదులు చెప్పుటకు లజ్జపడరాదు. అవమానకరములయిన మాటలాడఁగూడదు. తొందరపాటును నసూయయు లేకుండవలయును. అట్లుండినచో బరుఁడు తనకు వశగతుఁడగును. ప్రియునియం దతినూత్రము హర్షము నొందరాదు. అప్రియునియందుఁ దుందుడుకు పడరాదు. ప్రజలహితమును దలపోసి వారలకై ధనములు వెచ్చింపవలసిన సంకటములు కలిగినపుడు తపింపరాదు. ఏరాజు మంచిగుణములచేత నెప్పుడును బ్రియము గావించుచుండునో, యతఁడు చేయుకార్యములన్నియు సిద్ధినొందును. అతనిని సంపదయ వీడదు. అధిపతికిఁ బ్రతికూలములయిన వాని నెంతయువదలి యతనికిఁ బ్రియములయిన వానినే కావించుచు నతనిభక్తి గలిగియుండునట్టి పురుషుని రాజెంతయు నాదరింపవలయును. ఇది సజ్జనులనడవడి. ఇంద్రియములను విచ్చల

విడిని విడువక గెలిచి, తన్నెంతయు ననుసరించుచు శుచియై శక్తుఁడై యనురక్తుఁడునై యుండుమనుజుని రాజు గొప్పకార్యములందు నియోగింపవలయును. శ్రేయస్సునకు లక్షణమయిన పరాక్రమ మెవనియందుఁగనుపట్టునో ఎవఁడు కీర్తిముఖ్యముగాఁ గలవాఁడో, ప్రతిజ్ఞ నెవఁడు తప్పఁడో, సమర్థుల నెవఁడుపూజించుచు వారిని మచ్చరికింపకుండునో యట్టివానిని,ఇట్టిగుణములు గలిగి రాజును రంజించుచు భర్తకార్యములందుఁ బరాకుపడక వర్తించుచుండు నట్టిపురుషుని, ధనకార్యములందు నియోగింపవలయును. మూఢుఁడును, నింద్రియలోలుఁడును, లుబ్ధుఁడును, అపథ్యం బగు నడవడిగలవాఁడును, గూఢవిప్రియుఁడును. బరీక్షయందుఁ దేఱనివాఁడును, హింసాశీలుఁడును,దుర్బుద్ధియుఁ,జదువురానివాఁడును,బెద్దతీకము లేనివాఁడును, ద్రాగుబోతును, జూదమునందును స్త్రీలయందును వేఁటయందును నాసక్తుఁడయినవాఁడును నగు మనుష్యుని గొప్పకార్యమందు నియోగించినచో రాజుసంపదలు పాయును. తన్ను మొదల రక్షించుకొనుచుఁ, బిదప రక్షింపఁదగినవారిని రక్షించునట్టిరాజునకుఁగలప్రజ లభద్రమును వృద్ధినొందుదురు.దానిచే నతనికి సుఖము మిక్కిలియుఁ గలుగును. రాజు తనకు సుహృదు లయినవారికిని బరులకును దెలియనివారగు చారులచేత నితరులగు రాజుల పోకలనెల్లను బరికించుచుండవలయును. దానినలన రాజునకుఁ జెఱుపేదియుఁ గలుగకుండును. బలవంతుఁడగువానికి నపకారముచేసి వైచిదవ్వుల నున్నానని యూరడిలి యుండరాదు. వార లేమఱిపాటున నున్నపుడు డేగలు వైపడునట్లు పడుదురు. రాజు మిక్కిలి గట్టిగా వేరూని, తనబలముకొలఁది తెలిసి, బుద్ధి పొరఁబడక

తనకంటె బలహీనులగువారిని దలపడవలయును; కాని, బలీయునిఁ దలపడరాదు. ధర్మపరాయణుండగు రాజు పరాక్రమమున భూమినిబడసి ప్రజలను ధర్మంబునఁ బాలించి యుద్ధంబున మరణము గావించుకొనవలయును. ఈ జగమందలియొక్కొక్కటియుఁ దుదిని మరణమునకుఁ బాలయినది. ఇందేదియుఁ గీడునొందనిది లేదు; సత్యముగాదు. కాఁబట్టి ధర్మముందుఁ దప్పక వర్తించునట్టి రాజు ప్రజలను ధర్మంబునఁ బాలింపవలయును. రక్షించుటకుఁ బట్టులయిన కోటలును, యుద్ధమును, ధర్మమును పాలించుటయు, రాజకార్య విచారమును, సమయంబునఁ బ్రజలకు సుఖముగూర్చుటయు ననెడి యీయైదింటిచేతను భూమి నృద్ధినొందును.ఎవఁడీ యైదింటిని రక్షించునో వాఁడే రాజు. రా జీయైదింటియందు నెప్పుడు నెడతెగక వర్తించి చూచుకొనుచుండునేని యీభూమిని నెప్పుడు ననుభవించును. వీని నెప్పుడును నొక్కఁడే చూచుకొనుట యశక్యముగాదు. వీనియందాప్తులగువారిని బ్రతిష్ఠించి, రాజు చిరకాలము భూమిని పాలింపవచ్చును. దాతయుఁ, బంచికుడుచు నట్టివాఁడును,మృదుస్వభావముగలవాఁడును, బరిశుద్ధుండును, దనమనుష్యులను దిగవిడువనివాఁడును నగుపురుషునిఁ బ్రజలు రాజుగాఁ జేసికొందురు. తనయభిప్రాయములను విడిచి మేలునకై యితరులుపదేశించు తెలివి విషయములనువిని దానినచ్చికైకొనునట్టిరాజునకు లోకమంతయు నడఁగి వర్తించును. ఎవఁడు తనకుహితమును గోరునట్టి పురుషుఁడు చెప్పుమాటలును, అవి తనకుఁ బ్రతికూలముగా నుండుటవలన నెంతమాత్రము సైఁపడో,నుఱి తనకుఁ బ్రతికూలములయినవాని నెప్పుడును మనసునఁ బాటింపకవినునో, గొప్పవార లాచరించు

నదియు, నాపన్నులను స్వస్థులను నవలంబించునట్టిదియు నగు వర్తనమును నెప్పుడును సేవింపఁడో, వాఁడు క్షత్రధర్మమునుండి తొలఁగినవాఁడగును. (నిగ్రహింపఁబడిన యమాత్యుని వలనను, విశేషించి స్త్రీలవలనను, పర్వతమువలనను, విషమంబయిన దుర్గమువలనను, ఏనుఁగువలనను, గుఱ్ఱమువలనను, సర్పమువలనను, నెప్పుడు నెచ్చరిక గలిగి తన్నురక్షించు కొనవలయును.) ఎవఁడు ముఖ్యులయిన మంత్రులను విడిచి, హీనులయిన వారిని బ్రియులను గావించుకొనునో, యతఁడు వ్యసనములను బొంది * మంచిమార్గమునకు రానేరఁడు. శుభగుణములుగల జ్ఞాతులందు ద్వేషముచేఁ బూపోపనివాఁడై, మనసుదిటి లేక, కోపము దృఢముగాఁ గలిగియుండువాఁడు మృత్యువ్యసనమీపమున నసించుచున్నాఁడు. ఎవఁడు మిక్కిలి గుణవంతులగువారిని దనహృదయమునకు నెంతయుఁ బ్రియులయినవారయినను, బ్రేమ గడలుకొనఁదనకు వశగతులను గావించుకొనునో యతఁడు చిరకాలముయశము గలిగియుండును. అకాలమందు పన్నులనుదీయరాదు. అప్రియమేదేని కలిగినను మనస్సునఁ దుందుడుకు పడరాదు. ప్రియముగలిగినను మితిమీఱియుబ్బరాదు. మంచికర్మములందెప్పుడును బూనికి గలిగి యుండవలయును. రాజులలో నాకెవరనుర క్తులు? ఎవరు నన్నుభయమునబట్టి యాశ్రయించినట్టివారు? ఎవరు మధ్యస్థుల దోషముగలవారు? అని నీవు నిత్యము నాలోచించుచుండనలయును. నీవు బలవంతుఁడవుగా నున్నామని తలఁచి బలహీనుని యందొకప్పుడును నమ్మిక యుంపరాదు. ఈబలహీను లేమఱి

---

* 'సాధుమార్గం నవిన్దతి' అని చా. మూ. 'సిద్ధిమార్గం'అని బొ. మూలము. తనపూనిన కార్యముల సిద్ధిసెన్నఁడును బడయ నేరఁడని యర్థము.

యుండునపుడు డేగలవలె పైపడుదురు. సమస్తగుణసంపన్నుఁడును బ్రియవాదియు నగు నధిపతికిని బాపాత్ముఁడు ద్రోహము సేయఁజూచును; కాఁబట్టి యట్టిమనుష్యుల నెంతమాత్రము నమ్మరాదు.* నహుషునిపుత్రుఁడగు యయాతి రాజనీతి రహస్యములను జెప్పినపుడు 'మనుష్యుల విషయమై యెంతయు నెచ్చరికతోఁ బాటుపడువాఁడు, ఇంద్రసహితులయినశత్రువుల నయినను జంపఁగలఁడు' అనెను. ఇదితొంబదిమూడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వామదేవ పసునున స్సంవాదము.

వామదేవుఁడు 'రాజు యుద్ధములేకయె జయమును గలిగించుకొనవలయును. యుద్ధముచేతఁ గలిగిన జయమును దక్కువయినదిగాఁ జెప్పెదరు. రాజు వేరుగట్టిగా నూనకుండునపుడు, తాను బొందకున్నవానిని (అనఁగాఁ గొత్తవానిని) బొందుటకుఁ గోరరాదు. మూలము దుర్బలముగా నున్నరాజునకు నేదేని పొందినను నది పైపైనికొనసాఁగియుండనేరదుచుమీ. ఎవ్వనిదేశము మంచి సమృద్ధిగలిగి, సంపత్తియుఁగలిగి, ప్రియులును సంతుష్టులు నయినజనులును గలిగి, పెక్కండ్రు పెంపుగల మంత్రులతోఁ గూడి యుండునో యట్టిరాజే దృఢమయిన మూలముగలవాఁడు (వేరుగట్టిగా నూనినవాఁడు) అగును. † ఎవనియోధులు మిక్కిలి

* 'ఏతద్రాజోపనిషదం యయాతిఃస్మాహనాహుషఃమనుష్యవిషయే యుక్తోహ్యనిశ్శత్రూన్ సవాసవాన్' అని దా.మూలము. 'మనుష్యవిషయే యుక్తాం రాజశ్రీమకరీం సదా' అని కొన్నిప్రతులు.

† 'యస్యయోధా స్సుసంతుష్టాఃస్వనురక్తా స్సుపూజితాఃఅల్పేనాపి స

సంతుష్టులై యెంతయు ననుర క్తిగలిగి మిక్కిలియుఁ బూజితులు నై యుందురో యట్టి రా జల్పుదండుచేత నయినను భూమిని జయించును. * [ఎచ్చట దండము బలీయముగా నుండునో యచట సామమే ప్రయోగింపవలయును. భేదముచేయుట ముఖ్యమయిన యుద్దేశముగాఁ గలచో సామము(మంచిమాట) లాడుచుఁ గోరినది యిచ్చుట యెంతయుఁ గొనియాడఁబడును. రా జెప్పుడు సామదాన భేదములు మూఁడును విఫలములగుట చూచునో యపుడు తెఱపితెలిసికొని ముందువెనుకఁ జూడక దండమును బ్రయోగింపవలయును. ఒకశత్రువు మిక్కిలి బలీయులయిన శత్రులచేతఁ గ్రిందపఱుపఁ బడినపుడు వాని నుపేక్షింపవలయును. బలవంతులగువారికిఁ జంపఁదగినట్టి స్థితి(యుం దెదిరియుండుట)యే బలము. రా జెప్పుడు దుర్బలుఁడుగా నుండునో యపుడు † నాలుగింటికిని విరుద్ధము గాకుండున ట్లుపేక్ష గావింపవలయును. ఉపేక్ష యైదవయుపాయము. అది యన్నింటను మిక్కిలి బలవంతమయినది. కోసలపతీ! నీవు తత్త్వజ్ఞుండవు కాన భార్గవుండు పాడిన శ్లోకముల తత్త్వమునెఱింగి కలరూపున వానిని జేయవలయును. అవి యేవనఁగా 'ఏదేని యొకచోట రాక్ష

దండేన మహీంజయంతి పార్థివాః' అని దా. మూ. 'యస్యయోధాః సుసంతుష్టాః సాంత్వితాః సూపధాస్థితాః' అని ఔ. మూలము. ఎవనియోధులు, మిక్కిలి సంతుష్టులై, బుజ్జగింపఁబడి శత్రువులను వంచింపనేర్తురో యట్టివారనియర్థము.

[*] కుండలీకరణములోని పాఠము. దాక్షిణాత్యకోశములందే చూపట్టుమన్నదిగాని తక్కిన ప్రతులయందుఁ గానిపింపదు.

† సామము, దానము, భేదము, దండము, అని నాలు గుపాయములు. ఇచట 'ఉపేక్ష' యైదవయుపాయముగాఁ జెప్పఁబడినది.

నుఁడు పిశాచముచేతఁ గొట్టఁబడునేని యీ జోలికిఁ బోకుండ వలయును. * బలహీనులకుఁ బలుకకుండుటయే (మిన్నకుండుటయే) బలము. (బలవంతులకు మాటపడకుండుట బలము.)' అనుటయే. రాజా! బలము లేనివాఁడు శత్రువును శత్రువులను గొనియే వెకల్పవలయును. కాలియందలి ముల్లును జేతియందలి ముల్లు చేతనే యెత్తవలయును, గూఢవిప్రియులగు మంత్రుల యందును, మ్లేచ్ఛులయందును నుపాయముల లోపల నీయుపాయమే తగునని చెప్పఁబడుచున్నది. జ్ఞాతిచేత నినుమును నినుముచేత జ్ఞాతినిని నాశముచేయవలయును. బిల్వకాయలను వేఱు బిల్వకాయలచేతను, మ్లేచ్ఛులను నితర మ్లేచ్ఛులచేతను నాశము చేయింపవలయును. మిక్కిలియు గర్వించియున్న దానులకును నిదియే చేయవలయును. చండాల జాతులవారిని మ్లేచ్ఛజాతుల వారిని దండనుచేతనే వారింపవలయును. మఱుఁగున వంచించు నట్టివారికి దుష్టులను గొని ముందు చెప్పినదానిని చేయవలయును. ధర్మార్థకామ మోక్షములనెడు చతుర్వర్గమునకు విరోధులగు కడపటిజాతివారిని, శఠులగుమంత్రులను, దుష్టబ్రాహ్మణులు మొదలగువారిని నుపాయము లయిదింటిచేతను సాధింపవలయును. ఏవీడయునొందక తనయందనుర క్తులై రాష్ట్రమునకువలయు పనులను జేయుచు వినయపరులై యుండు పురజనులనును దేశజనులనును, రాష్ట్రమునకు విరోధులై వినయము లేకుండు పౌరదేశజనులనును, జండాలురను మ్లేచ్ఛులను బాహ్యులను స్వధర్మము

* 'వాచ్యతాంబలినాంబలమ్' అని దా. కోశమునందున్నది. ఇది యసంగతముగను అప్రకృతముగను నున్నది గాన 'అవాచ్యతాఽబలినాంబలమ్' అనియో 'అవాచ్యతా బలినాంబలమ్' అనియో పాఠము గ్రాహ్యము.

లాచరింపనివారిని బలవంతులను నాశ్రమములను గాయకు లను నర్తకులను నెల్ల ప్రయత్నమున సాధింపవలయును.] ఎవని పురజనులును దేశజనులును భూతదయాళువ్రలై ధనధాన్య సంప న్ను లై యుందురో యట్టిరాజు దృఢం బగుమూలము గలవాఁడు. రాజు తన ప్రతాపము శత్రువునకుఁగల ప్రతాపముకంటె నధిక మయినదని యెప్పుడుతలఁచునో యపుడు మంచిబుద్ధినెరపి పరుని భూమిని ధనములను గయికొన నుంకింపవలయును. భోగములు పయిపయిని వర్ధిల్లు చున్నవాఁడును, భూతములందు దయగల వాఁడును,సోమరితనము లేక పనులయురవడిగలవాఁడును,తన్నుఁ దాను బదిలముగారక్షించుకొని యుండువాఁడు నగురాజు దేశము వృద్ధి నొందుచుండును. తనయెడలఁ జక్కటితో నర్తించుచున్న తన జనులయెడఁ గపటముగా వర్తించునట్టి రాజు గొడ్డలిచేత నడవి నఱుకునట్లు తన్ను నఱికికొనుచున్నాఁడు. రాజు తనశత్రు వులను గొట్టుటకు నుంకింపఁడేని పగవారతనికిఁ దఱుఁగరు. ఏరాజు తనకోశధమును జంపనెఱుంగునో యతనిని ద్వేషించు వారు గలుగరు. రాజు ప్రాజ్ఞుఁడగునేని యార్యజనులు ద్వేషించు నట్టి కార్యమును జేయఁడు; మఱి తనకేది మంగళకరమైన కా ర్యముగాఁ దలంచుచున్నాఁడో యందుఁ దన్నుఁ బురికొలుపవల యును. ఏరాజు తనకార్యము లన్నియును ముగించి సుఖముల ననుభవింపఁగోరునో యట్టివానిని బరు లవమానింపరు; తానును బరితాపము నొందఁడు. ఏరాజు మనుష్యులయెడ నిట్టినడవడి గలిగియుండునో యతఁ డుభయలోకములను జయించి జయము నందు నెలకొనుచున్నాఁడు" అనెను.

వాసుదేవుఁడిట్లుచెప్పఁగా విసుమనసుఁడ
యుఁ జేయుచువచ్చెను. నీవు నట్లుచేయఁగా
లనును జయింతువు. ఇందులకు సందేహము లేదు' అని
ఇది తొంబదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు యుద్ధధర్మమునుఁ జెప్పుట.

ధర్మరాజు 'ఒకక్షత్రియుఁడు మఱియొక క్షత్రియుని యుద్ధ
మునందు జయింపఁగోరునేని, యట్లు జయించువిషయమున
నతఁడు చేయవలసిన ధర్మమేమి ? అడిగెదను. నాకుఁ జెప్పుము'
అనెను.

భీష్ముఁడు 'రాజు సహాయము గలవాఁడైనను లేనివాఁడైనను
దాను జయింపఁగోరినరాజు రాష్ట్రముసకు వచ్చి 'నేను మీకు
రాజను. నిమ్మెప్పుడును రక్షించుచుందును. ధర్మంబున నాకుఁ
గప్పము గట్టుఁడు ? లేదా యుద్ధమున నన్నుఁ దెలపుఁడు' అని
చెప్పవలయును. వా రతనిని దమకు రాజుగా నంగీకరించిచేసే
యుద్ధమక్కఱలేదు. వారు క్షత్రియులు కానివారై మఱియొరో
ధమును జూపుదురేని యపుడు వారు తమకు విహితము కాని
(క్షత్ర)కర్మములందు వర్తించుచుండుటంబట్టి సమస్తములయిన
యుపాయములచేతను వారి నడించిపుచ్చవలయును. పయినెత్తి
వచ్చిన యాక్షత్రియుఁడు యాయుధమెత్తికొని (యుద్ధసన్నద్ధుఁ
డయి) యుండఁడేనియు, తన్నుఁ దాను రక్షించుకొనఁజాలఁడే
నియు, శత్రువును మిక్కిలిగాఁ దలంచునేనియు, దక్కువ వంశ
ముల వారతనిపయి నాయుధముల నెత్తికొందురు' అనెను.

తాతమహా! క్షత్రియుండయిన రాజు మఱియొక
ఁడు దలపడిపోవునేని తానెట్లు మించి పోరాడవల
దాని నాకుఁజెప్పుము'అనియడిగెను. అందులకు భీష్ముఁడు
'సన్నాహము లేనివాఁడును గవచములేనివాఁడును నగు నొక
క్షత్రియుని యుద్ధమునఁ దలపడరాదు. తా నొక్కఁడును నొంటి
వానిని దలపడి 'నీవు బాణము విడుపుము. నేనును విడిచెదను' అని
తెలుపవలయును. వాఁడు సన్నాహముతోఁగూడవచ్చునేని పిదపఁ
దానును సన్నాహముతోడ నుండవలయును. వాఁడు సేనలతోఁ
గూడ వచ్చునేని తానును సేనలఁగూడి వానిని బిలువవలయును.
వాఁడు గపటముగా యుద్ధము సేయునేని, దానును గపటముగా
నెదిరించి పోరవలయును. అట్లుగాక ధర్మంబున యుద్ధము సేయు
నేని, ధర్మంబుననే వారింపవలయును. రథికుని గుఱ్ఱము నెక్కి
తలపడరాదు. రథికునితోఁ రథమెక్కియే యడరవలయును. ఆప
త్సమయమందుఁ గొట్టరాదు. భయపడినవానిని జయింపఁబడిన
వానిని గొట్టరాదు. విషముపూసిన బాణములను, కర్ణిబాణము
లను వేయరాదు. ఇవియ సత్పురుషుల కాయుధములు. యథా
విధిగానే యుద్ధము చేయవలయును. కొట్టఁ దివిరినవానిని గోపిం
పరాదు. యుద్ధముల నొక్కనికి నేనుఁగుండఁగా మఱియొక్క
నికి నేనుఁగు లేకుండునేని, కాల్బం లేనుఁగునెక్కినవానితోడ
యుద్ధము సేయరాదు. ఏనుఁగుచేతి నేనుఁగుతోడఁ దలపడవల
యును.ఒకసమయమునఁ జక్కఁగా నలవడిన గుఱ్ఱముతోను యు
ద్ధము చేయవచ్చును. దివ్యాస్త్ర బలముగలవాఁడు. తా నిష్ట
పడినట్లు, గజముమీఁదను, భూమియందును, సమస్థలమందును,
దేరియందును, గుఱ్ఱమునెక్కియు, నెప్పుడును యుద్ధము చేయ

వచ్చును. రాజా! రామునకును రావణునకును జరిగిన యుద్ధమందు, వానరులును మహాభాగుండగు లక్ష్మణుఁడును నక్లె విభీషణుఁడును బదాతులుగా నుండిరి. రావణుని యంతకాలమందు, దురాచారుఁడును బాపకారియు నగువానిని రాముఁడిం ద్రునిరథము నారోహించి చంపెను. దివ్యాస్త్రబలసంపన్నులగు వారియందు నివియన్నియు విధింపఁబడుచున్నవి. ఇది దేవాసురు లందఱయందును బూర్వులు గాంచిరి. బలము లేనివానిని, బుత్రులు లేనివానిని, ఆయుధము విఱిగినవానిని, ఆపదనొందిన వానిని, అల్లెత్రాడు తెగినవానిని, వాహనము పోయినవానిని, నెట్లును జంపరాదు. రాజాపదగలవానిని దనదేశమునకుఁ బంపి చికిత్సచేయవలయును. లేనిచో వాని నిల్లుచేరునట్లు చేయవలయును. గాయము లాఱినపిదప వానిని విడిపింపవలయును. ఇది సనాతనమయిన ధర్మము; కాఁబట్టి ధర్ముచొప్పున యుద్ధము చేయవలయునని స్వాయంభువమనువు చెప్పెను. సాధువుల ధర్మము సాధువులందు నెలకొనియుండును. దానిని బొంది నశింపకుండునట్లు చేయవలయును. ధర్మమునందు నిష్ఠగలక్షత్రియుఁడెవఁ డధర్మంబున జయమునొందునో వాఁడు పాపాత్ముఁడు. వాని బ్రతు కవమానింపఁదగినది. అట్టివాఁడు తన్నుఁ దనచేతనే చంపుకొనుచున్నాఁడు. మంచివారిని జెడుమార్గముల నెలుచుట దుష్టులవృత్తి. ధర్మంబునఁ గలుగుమరణము మేలయినది. పాపకర్మమువలనఁ గలుగు జయము మేలయినది గానేరదు. రాజా! అధర్మమును జేసినయెడల నది పశువుంబోలెఁ దోడనే ఫలమొసంగదు. అది తన్నుఁజేసినవానిని వేళ్లతోను గొమ్మలతోను దహించి ముంచును. పాపి యగువాఁడు పాపకర్ములచేత ధన

మును బడసి యెంతయు సంతసించును. వాఁ డాపాపముచేత నే పయిపయిని వృద్ధినొందుచు దానియందు మిక్కిలి తగులు గలిగియుండును. మఱియు ధర్మ మనునదియే లేదని తలంచుచుఁ బరిశుద్ధు లగువారి నపహసించుచుండును. ధర్మమందు నమ్మిక యెంతమాత్రము లేక, తుదకు వినాశమునొందును.* వానిని దేవతలు వరుణపాశములఁ గట్టి యవమానింతురు. వాఁడు గాలినింపిన పెనుతిత్తియుంబోలె దన చేసినకార్యముచేతనే వృద్ధినొందుచున్నాఁడు. అంత నదియొడ్డున నుండుమార్కుంబోలె వేరు తోఁగనూఁడఁ బెకలి చెడుచున్నాఁడు. అంత జ్ఞాతిమిత్రులఁ గొట్టువడి పగిలినకుండవలె వాఁడు చెడుటను జూచి జనులు వానిని నిందింతురు. కాఁబట్టి ధర్మంబున జయమును బొక్కసమును రాజు పొందఁ గోరవలయును. ఇది తొంబదియేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు జయలక్షణములను మఱియుఁ గొన్ని రాజధర్మములను జెప్పుట.

భీష్ముఁడు 'రాజధర్మంబున భూమిని జయించుటకు, దానివలనఁ దాను భూమికంతయుఁ బతియగునేనియుఁ, గోరరాదు. అధర్మమున జయమును బొందిన యేరాజు ముడిమునఁ బొదలును? అధర్మంబునఁ గలిగినజయము సతముగా నుండదు;

* 'సబద్ధోవారుణైఃపాశైరమర్త్యరవమన్యతే' అని దా.మూ. అమర్త్యఇవ మన్యతే. (జౌ. మూలము.) వరుణపాశములఁ గట్టువడియుఁ దన్ను దేవతలఁగా నదలఁచు ననుట.

మఱి స్వర్గమునకుఁ గారణమును గానేరదు. అది రాజునును భూమిని గీడ్పఱుచును. కవచము చినిఁగినవానిని, 'నీవాఁడ' నని పలుకుచున్నవానిని, అంజలిచేసినవానిని, ఆయుధము విడిచినవానిని బట్టికొని హింసింపరాదు. రాజు, తనసైన్యముచేత నోడినవానితోఁ మరలఁ దాను యుద్ధముసేయరాదు; కాని వాని నొకసంవత్సరము 'నీకు దాసుఁడ' నని చెప్పించుచు నడంప వలయును. అట *మోఁద వాఁడు మరలఁ బుట్టుక నొందినవాఁడగును. †పగవానియింట నొకకన్యను బరాక్రమంబున రాజు దెచ్చెనేని యాపఁడతిని సంవత్సరమునకు లోనుగా నెవరిని బెండ్లాడెద వని యడుగరాదు. సంవత్సరమునకుఁ బిదప నీ వెవరిని బెండ్లాడెదవు? 'నన్నా? మఱొకఁ్కనినా?' యని యడిగి దాని యిష్టముచొప్పునఁ జేయవలయును. ఇట్లు బలవంతముగాఁ దెచ్చిన తిఁ్కనధనముల (దాసులు మొదలగువారి) పట్లను నడచుకొనవలయును. (అనఁగా వారొల్లనియెడ మరల శత్రువునకే యొప్పింపనలయును.) ‡దొంగలు మొదలగు వధ్యులగువారిధనమును దీసి యుంచుకొనరాదు. దానిని వ్యయముచేసి పుచ్చవలయును. బ్రాహ్మణులు సాపరాధులగునుసేని వారిని క్షమింప

---

* వాఁడల్లు చెప్పినను జెప్పకపోయినను దాసత్వము నొందినవాఁడే యగును. కాన మఱి యొక పుట్టుక పుట్టినట్లేయగును. ఒక సంవత్సరమునకుఁ బిదప వానిని విడిచిపుచ్చవలయునని నీలకంఠులు.

† 'వార్ష్ణిక్సంవత్సరాత్కన్యా ప్రష్టవ్యా విక్రమాహృతా' అని మూలము. 'నచసంవత్సరంకన్యాఃస్వీస్యాఃసమాహృతాఃస్యాత్' అని పాఠాంతరము. బలిమిని దెచ్చినకన్యలను సంవత్సరమువఱకు సుట్టరాదని యర్థము.

‡ 'నతువధ్యే ధనం తిఁ్కపేత్పిబేయుర్బ్రాహ్మణాఃపయఃయుఞ్జీరన్నప్య

వలయును. వారు తమపశువులపాలను ద్రాగనీయవచ్చును. ఎద్దు లను నుపయోగించుకొన నీయవచ్చును. క్షత్రియునితోడ క్షత్రి యుడే యుద్ధముచేయఁదగునని ధర్మము విధింపఁబడియున్నది. క్షత్రియుఁడు గానివాఁడు క్షత్రియుని గుఱించి యేవిధమున నాయుధమును వైవరాదు. రెండుసేనలును యుద్ధముసేయుటకుఁ దారసించి నిలిచియున్నపు డుభయపక్షములకును క్షేమమును గోరి బ్రాహ్మణుఁడు నడుమఁజొచ్చునేని యపుడు యుద్ధముచేయ రాదు. అట్లు బ్రాహ్మణుని నతిక్రమించినవాఁడు (అనఁగా నతనిని జంపినవాఁడును గాయపఱిచినవాఁడును) శాశ్వతం బగుమర్యా దను భేదించినవాఁ డగును. క్షత్రియుఁడు మర్యాదనుమీఱి నడచునేని వాఁ డధముఁడగును. ఇంతేకాక ధర్మమునకు లోప ముగలిగించి మర్యాదను భంగపర్చినట్టి క్షత్రియుఁడు క్షత్రియ జాతిలో గణింపఁ దగినవాఁడుగాఁడు. మఱి సంఘమునందును గయికొనఁదగినవాఁడు గాఁడు. జయింపఁగోరునట్టిరా జట్టినడ వడి ననువర్తింపరాదు. ధర్మముచేతఁ బడయు జయమునకంటె మఱి పెద్దలాభము వేఱేమి గలదు ? లోపఱుచుకొన్నయొక రాజ్యమందుఁ గోపమునఁ జెంగలించుచున్నట్టివారలను జాగుసేయక మంచిమాటలచేతను వలయుభోగముల నొసంగుటచేతను గలం కదేర్చి శీఘ్రముగా వశపఱచుకొనవలయును. ఇది రాజులకుఁ

నడుచుఁ క్షత్రవ్యంవా పునర్భవేత్' అని మూలము. 'శత్రువులనుండి తెచ్చిన గోవులను బ్రాహ్మణులకిచ్చి వారు దానిపాలను ద్రాగునట్లు చేయవలయును. అట్లు తెచ్చినయెడ్లను దున్నుట మొదలగుపనుల కుపయోగించుకొనవచ్చును. లేదా శత్రువులకే మరల నిచ్చిపుచ్చవచ్చును' అని ప్రతాపచంద్రరాయులు. ఈ శ్లోకపాదముల యర్థము మిక్కిలి క్లిష్టముగానున్నది.

బరమమయిన నీతి. ఇట్లు గాక వారలకు వలయుభోగముల నొసం గక యడఁచి యేలినచో వారు రాజ్యమును దిగవిడిచి, తమ్ము గెలిచినవాని శత్రువులను గొలుచుచు, వానికి వ్యసనములు గుం పులుగా వచ్చుట యెదురుచూచుచుండురు. అట్టి రాజువలనఁ దుష్టినొండనివా రతని వ్యసనముల కువ్విళ్లూరుచు నతని కాపద వచ్చినపుడు సర్వవిధముల నతని శత్రువుల పక్షము చేపట్టుదురు. *శత్రువును మోసముపన్ని వంచింపరాదు; ఏవిధమునను (మూలు నట్లు)మిక్కుటముగాఁ గొట్టరాదు. ఏలనఁగా నట్లుబిట్టుగాఁగొట్టిన యెడల నతఁడొకవేళఁ బ్రాణములను దిగవిడిచినను విడుచును. †అట్లపరాధముసేయఁబడినవానికిఁ గొంతధనమిచ్చినను సంతుష్టి నొందకపోవును. అట్టివాఁడు కందులేనిబ్రతుకే గొప్పగాభావిం చును; కాని నిందితమయిన (అనఁగా రాజుచే నవమానమొం దిన) బ్రతుకును నట్లు భావింపఁడు. ఏరాజుదేశము పెంపుసొంపా రుచు, ధనవంతమై, రాజునందుఁ బ్రీతిగల జనులుగలిగి, భృ త్యులును మంత్రులు సంతుష్టులై యుండవెలయునో, యట్టి రాజు గట్టిగా వేరూనినవాఁ డగును. ఏరాజు ఋత్విజులును బురోహితులును నాచార్యులును మఱియుఁ బూజ్యులును

---

* ఇచ్చట—'మోసముపన్ని యుద్ధముచేయరాదు. ఒకవేళ చేసినను శత్రు వును జచ్చునట్లు గొట్టరాదు. ధర్మయుద్ధమునఁ జంపవచ్చును గాని యధర్మ మునఁ జంపుట పాప'మని భావము.

†'అల్పేనాపిచసంయుక్త స్తుష్యతే నాపరాధితః, శుద్ధం జీవితమే వాపి తాదృశో బహుమన్యతే' అని దా.మూల. 'అల్పేనా...తుష్యత్యేవ నరాధిపః...' అని బొ. మూలము ఇందర్థము క్లిష్టము. మఱి పూర్వోత్తరసంబద్ధమును గాకున్నది గాన యీపాఠము త్యాజ్యము.

మిక్కిలి . చదువరులునయినతక్కినవారును బూజితు లైయుం దురో యట్టిరాజు లోకజ్ఞుం డనఁబడును. ఇట్టినడవడిచేతనే యింద్రుఁడు లోకాధిపత్యమును బడసెను. * ఇట్టి నడవడిచేతనే, భూమియందలివారును నింద్రపదవి నొందఁగోరుదురు. ప్రతర్దనుఁ డనురాజు తనశత్రులను మహాయుద్ధమున జయించి, వారిధనమును ధాన్యములతోడను, ఔషధులతోడను గయి కొనెనుగాని నాభూమినిమాత్రము గయికొనఁడయ్యెను. †రా జ గుదిమ్రొదాసుఁడు నశ్లె శత్రువులను గెలిచినపిదప వారి యగ్ని హోత్ర శేషములను, అందులకయిన హవిస్సులను, వారియాహా రములను దీసికొనెను; కావునఁనే యతఁడు తనజయముఁవలన ఫల ము నొందక వంచితుఁడయ్యెను. రాజగు నాభాగుఁడు (శత్రువు లను గెలిచినపిదప) తాను గొన్నరాజ్యములందలి శ్రోత్రియుల సొమ్ములను దాసులధనములను దప్పఁ దక్కిన రాజ్యము లను, వానిరాజులతోఁగూడ నక్షీణులుగా నొసంగిపుచ్చెను. ధర్మరాజా! ధర్మజ్ఞులయిన తొల్లింటిరాజుల ‡నడవడి యెంతయు గొప్పదిగానున్నది. ఆదియెల్ల నాకు మిక్కిలి యిష్టముగానున్నది.

---

* 'అనేన చేంద్రవిషయం విజిగీషన్తి పార్థివాః' అని బొ. మూలము. 'అన్యేపి చైవ విజయం విజిగీషన్తిపార్థివాః' అని దా. మూ. తక్కినరాజులును జయ ముకు బద్ధయత్నులగుదురని యర్థము

†ప్రతర్థుఁడును గొనదగినవానిని గొనుటచేఁ బాపమొందఁడయ్యె ననియు, భీమోదాసుఁడు గొనరానివానినిగూడఁ గొనుటచే విజయముఁవలని ఫలము నొందక పోయెననియు భావము.

‡ 'వృత్తాని' అని బొ- మూలము. 'విత్తాని' అని పెక్కుప్రతులపాఠము. ఇదియంత యుపపన్నముగాదు.

తనకైశ్వర్యమును గోరునట్టిరాజు జయమును సమస్తములయిన విద్యలపెంపుచేతఁ బడయఁగోరవలయునుగాని మాయపన్నికాని డంభమునెరపికాని పడయఁగోరరాదు'' అనెను. ఇది తొంబదియాఱవయధ్యాయము.

రాజధర్మసర్వము.

భీష్ముఁడు క్షత్రియులు యుద్ధమునుసేయుట ధర్మమగునని నిరూపించుట.

ధర్మరాజు 'భరతసత్తమా! క్షత్రియధర్మముకంటె మిక్కిలి పాపమయిన ధర్మము మఱొక్కటి లేదు. రాజు దండెత్తిపోయినపుడును యుద్ధమునుసేయునపుడును, బెక్కండ్రజనులను జంపుచున్నాఁడు. రా జేకర్మమునుచేసినచో నట్టిదోషమువీడి మంచిలోకములను జయించును? నే నిది తెలియనువ్విళ్లూరుచున్నాఁడను గాన నాకుఁజెప్పుము' అనెను.

భీష్ముఁడు—'పాపులను నిగ్రహించుటచేతను, సాధుప్రజల నాదరించుటచేతను, యజ్ఞములచేతను, దానములచేతను, రాజులుదోషములు వీడి నిర్మలులగుదురు. రాజులు జయమునుగోరునపుడుండులకై పెక్కులు ప్రాణులను బీడించుచున్నానుట నిజమే; కాని వారే జయమును బడిసినపిదప మరిలఁ బ్రజలను వృద్ధిఁబొందించుచున్నారు. దానము, యాగము, తపము ననెడి వీనిఫలముల చేతఁ బాపములను దొలఁగఁబుత్తురు. * ప్రాణులను రక్షించుట

* 'అనుగ్రహేణభూతానామ్' అని దా. మూలము. 'అనుగ్రహాయభూతానామ్' అని జె. మూ. 'ప్రాణులను రక్షించుకొఱకై వీరలకుఁ బుణ్యముపెరుఁగుచున్నది' అని యర్థము.

చేత నీరలకుఁ బుణ్యమెంతయు వర్ధిలుచున్నది. పొలము మీఁద జక్కఁబెట్టువాఁడు పయిరుతోఁ జేరిన పులుగడ్డిని నాశముసేయుచున్నాఁడుగాని దానివలన ధాన్యపుఁబయిరు నశింపదు. అట్లె యాయుధములను వైచువారు వధింపఁదగువారిని బెక్కండ్రను జంపెదరు. కాని మగలఁ దక్కినవారిని వృద్ధినొందించుటయె దానికిఁ బరిహారమగుచున్నది. ఎనఁడు ప్రాణుల ననర్థమునుండియు, వధమునుండియుఁ, గష్టముల నుండియు రక్షించునో, వాఁ డట్లు దొంగలవలన నుండి కాచి ప్రాణముల నొసఁగుటవలన ధనమును సుఖమును నొసంగు *బ్రహ్మ యగుచున్నాఁడు. ఆరాజు, అభయదానమే దక్షిణలుగా యాగముల నెల్ల యజించి యిహమునందు శుభములనెల్ల ననుభవించి పిదప నింద్రునితోడి సాలోక్యము నొందుచున్నాఁడు. †బ్రాహ్మణుల ప్రయోజనముకొఱకై యుద్ధము చేయవలసిరాఁగా నందులకై రాజు తానువెలువడి తనదేహమునే యూపముగా (యజ్ఞస్తంభముగా) నాఁటి భయములేక బాణములుగొని శత్రువుల పయిఁ గురియించునేని, యట్లుచేయుయుద్ధ మపారమయిన దక్షిణలతోఁ గూడినయజ్ఞమగుచున్నది. దేవతలు నంతకన్న నెక్కుడయినట్టి వస్తువును భూమియం దొక్కటినేని చూడఁ జాలరు. యుద్ధమందు, వానితోలి నెన్నియాయుధములు భేదించునోయన్ని యశ్వయలోకములను, సకలకామములను బిదుకు

---

* 'విశాట్' అనిమూలము. ఆహారమునొసంగువాఁడని ప్రతాపచంద్ర రాయలు.

† 'బ్రాహ్మణార్థే సముత్పన్నే యోఽభిమన్యేత యుధ్యతి' అని దా. మూ. యోఽరిభిః సృత్యియుధ్యతి' అని (బొ.మూ.)

నట్టివానిని, వాఁడు పొందును. యుద్ధమునందు వాని దేహమునుండి తొరఁగుర క్తముతోఁగూడనే వాని పాపములన్నియుఁ దొలఁగుచున్నవి. ప్రాణములు పోవుకాలమున దుఃఖములను సహించుట కంటెఁ బెద్దతపము లేదని ధర్మవిదులు తెలుపుచున్నారు. ధర్మబుద్ధిగల పురుషులు, యుద్ధమందు భయపడినవారు, పర్జన్యునివలననుండి జలమును గోరునట్లు, శూరునివలననుండి రక్షణమునుగోరి పిఱుందనుండుదురు. * శూరులవలన రక్షలు భయము లేకుండునట్లు క్షేమముగా రక్షించి యాపురుషులను యుద్ధమందు ముందు నిలువనీయక తామే నిలుతురేని వారికెంతయుఁ బుణ్యమగును. ఆపిఱికివాండ్రు శూరుఁడు చేసిన కార్యమును గౌరవించి వాని నెప్పుడును బూజింతురేని యుక్తమును న్యాయమును గావించిన

---

* 'యదిశూర స్తథా క్షేమే ప్రతిరక్షేద్యథాభయే। ప్రతిరూపం జనంకుర్యా న్నచతద్వ ర్తతే తథా॥ యదితేకృత మాజ్ఞాయ సమస్కుర్యుస్స దైవతమ్। యుక్తంన్యాయ్యంచ కుర్యాస్తే, నచ తద్వ ర్తతే తథా' అనినూలను. ఈపాఠము నీలకంఠాది వ్యాఖ్యాతలు గ్రహించినది. ఇందు రెండవశ్లోకమున 'నచతద్వ ర్తతే తథా' అనుటకు 'అట్లుచేయరేని వా రాభయమునుండి విడిపడఁజాలరు.' అని ప్రతాపచంద్రరాయలు. రెండవశ్లోకమునకు 'యుక్తం న్యాయ్యంచ కుర్యుఃʼ అనుచో 'యుద్ధంన్యాయ్యంచ కుర్యుఃʼ అని పాఠముగొని' ఆపితి కివా రాశూరుఁడుచేసినది యెంతయుగౌరవించి యతని నెప్పుడును బూజించుచు న్యాయమునుచొప్పున యుద్ధమునుచేసిరేనియు నది వాని కట్లు పుణ్యము గాదు' అని యర్థము మతియొకరు వ్రాసియున్నారు. ఈ యర్థములు 'నచతద్వ ర్తతే తథా' అను రెండుపట్టులయందును గ్లిష్టముగానే యున్నది. దాక్షిణాత్యకోశములందు 'యదిశూరస్తథా క్షేమే ప్రతీక్షేరన్యథాభయే। ప్రతిరూపంజనాఃకుర్యుర్న చ తద్వ ర్తతేతథా...'అని యున్నది. ఆపిఱికిజనులు శూరుని భయకాలమందుంబోలె క్షేమకాలమందును సెదురుచూచి గారవింతురేని

వారగుదురు. అట్లుచేయనిచో వారి కట్లు పుణ్యముగలుగదు. మనుష్యులందఱును బయికి సమానులుగాఁ జూపట్టుదురుగాని లోపల మిక్కిలియుఁ దారతమ్యముగలదు. యుద్ధమునందు సేన లొండొంటిని దలపడి బిట్టుచప్పుడు చెలరేఁగునప్పుడు కొందఱు వీరులు సేనల మార్కొనిపోదురు. శూరుఁడు, సేనలు దార్కొని పోరాడుచుండఁగా స్వర్గమార్గమును బాటించి తానునుమార్కొ. నును. పిఱికిపంద, విషమ మయిన సమయమునఁ దనతోడి వారిని దిగవిడిచి పఱుగువాఱును, ఉట్టి యధర్మపురుషులు నీవంశమునఁ బుట్టకుందురుగాక. సహాయులను యుద్ధమున దిగవిడిచి యఁగ ములు గాయపడక కుశలముగా నింటికిఁ బరుగిడిపోవునట్టివారికి నింద్రుఁడు మొదలగు దేవత లశుభములు గావింతురు. ఎవ్వఁడు తనసహాయులను దిగవిడిచి తనప్రాణములను రక్షించుకొనుటకుఁ జూచునో యట్టివానిని గఱ్ఱలతోఁగాని తాలతోఁగాని కొట్టిచంప వలయును; లేక గడ్డిచాపలను బుట్టి కాల్చివేయ వలయును. క్షత్రి యులం దిట్టివా రెవరేనియుండినచో వారిని బశువులవలెఁ బట్టి చంపవలయును (అనఁగా నాయుధము మొనలచేతఁ జిత్రవధ ముగాఁ జంపనలయును) క్షత్రియుఁ డగువానికిఁ బఱుకిమ్మనఁ

వారు తగిన ప్రతిచేసినవారిగుదురు. కాని యట్లుజరుగుటలేదు. వా రాశూ రులు చేసిన కానని గనఁగొని యందులకెప్పుడును నతనినిబూజింతురే, కాము నట్లు భయముబీడి న్యాయముచొప్పున యుద్ధము చేయుదురే, అది న్యాయ్య మగును. కాని యట్లుజరుగుటలేదు' అని యుద్ధము చేసినచో మఱింత యుప పన్నముగాఁ దోఁచెడిని. ఇది పూర్వమందు భీతులు శూరుని శరణుఁజొచ్చుట కును వెనుక పురుషుల తారతమ్యమును జెప్పుటకును నడుమనుండుట సంబద్ధము గా నున్నది.

బరుండి, కష్టముగ్రక్కుచు, మూత్రము విసుచుచు, దీనముగాఁ బాపించుచును, మరణమునొందుట యెంతయు నధర్మము. క్షత్రియుఁడు గాయములు పడని దేహముతో మరణమునొందునేని యాకర్మును బురాణవిదులగువారు గొనియాడరు. నాయనా! క్షత్రియులకు నింటియందు మరణమెంతమాత్రము తగినదిగాదు. వారు శూరులు. శూరత్వము లేని కార్యము వారికెంతయు నీచమును నధర్మము నగును. రోగమునందు నొకఁడు 'అయ్యో! ఇదేమి సంకటమువచ్చినది! ఏమిదుఃఖమిది! నే నెంతోపాపిని' యని యంగలార్చుట వినఁబడుచున్నది రోగి, ముఖమంతయు కలఁగినలఁగి, చెడ్డకంపు గొట్టుచు. పుత్రులు దన్నుఁజూచి శోకించుచున్నట్లు చేయు చున్నాఁడు. అట్టివాఁ డారోగ్యముగలవారి స్థితికి నుద్విగ్నుఁడగుచు బాధపడఁజాలక మాటికి మరణము గోరుచున్నాఁడు. వీరుఁడును గర్వితుఁడును గొప్పమనస్సుగలవాఁడును నగుపురుషుఁ డిట్టిమరణమున కెంతమాత్ర మర్హుఁడుగాఁడు. క్షత్రియుఁ డగువాఁడు తన సుహృదులచేఁ బరివేష్టితుండై యుద్ధములందుఁ బగఱ నుఱుమాడి సుహృదులెంతయుఁ బూజించుచుండ, మిక్కిలి వాఁడియగు శస్త్రములచేత గంట్లువడి మృత్యువు నొందుట యెంతయుఁదగును. శూరుండు మనస్సు తెంపును రోషమును బయికొనఁగా మైమఱచి బెట్టిదముగా యుద్ధము చేయునుగాన యపుడు శత్రువులు తనయవయవములను గంట్లు పఱుచుచున్నను దెలియఁడు. అతఁడు యుద్ధమందు మరణముఁ బొంది మిక్కిలి ప్రశస్తమైనదియు లోకులచేతఁ బూజితమైనదియు నగు స్వధర్మమును నవ్వారిగాఁబడసి యింద్రునితోడి సాలోక్యమునొందుము. శూరుఁడెంతమాత్రమును బగవానికి మెన్నుఁ

జూపక సమస్తములయినయుపాయములచేతను యుద్ధాగ్రమందు నిలిచి ప్రాణములువిడిచి యింద్రునితోడి సాలోక్యమునొందును. శత్రుప్రులు చుట్టుముట్టికొనియుండగా శూరుఁ డొచ్చెమెచ్చటనేని గొట్టువడి దైన్యము చూపక మరణము నొందునేని యట్టియ ములగు లోకమును బొందును' అనెను. ఇది తొంబదియేడవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

ఇంద్రుఁడు సుదేవచరిత్రమును యుద్ధయజ్ఞమం దలి బుల్వాదియంగములను యుద్ధమృతులకుఁ గలుగులోకములను నంబరీషునకుఁ జెప్పుట.

ధర్మరాజు 'పితామహా! వెనుదీయక యుద్ధముచేయుచు శూరులు మరణము నొందినేని వారికేలోకములు గలుగును? నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'ఈవిషయమందు నంబరీషునకును నింద్రునికిని సంవాదమనెడి పురాతనమయిన యీయితిహాసము నుదాహరించెదను. నాభాగునిపుత్రుఁ డయినయంబరీషుఁడు మిక్కిలి దుర్లభంబయిన స్వర్గమునకుఁ బోయి యాదేవలోకమందుఁ దన సేనాపతి యింద్రునితోను మంత్రులతోనుగూడి దేజము లెల్లను మిక్కిలియు రాజిల్లుచుండఁగాఁ జూచెను. ఆసేనాపతి దివ్యంబగు రూపంబున మేటివిమానమందు వసించి మతియుఁ బయిపయి స్థానములకుఁ బోవుచుండెను. ఇట్లు పయిపయి స్థానములకుఁ బోవుచున్న సుదేవుం డనెడిసేనాపతి వెంపుసొంపును జూచి గొప్పమతి యగునంబరీషుఁ డాశ్చర్యపడి యింద్రునిఁ జూచి

'వాసవా! సముద్రము పొలిమేరగాఁ గలభూతలమునంతయు యథావిధిని బరిపాలించితిని. ధర్మమునుగోరి చతుర్వర్ణములయందును శాస్త్రోక్తప్రకారమునఁ బ్రవర్తించితిని, కడిఁది బ్రహ్మచర్యమునను గొప్పయాచారమునను గుసుశుశ్రూషను ధర్మంబునను వేదములనధిగమించి రాజశాస్త్రమును బూర్ణముగఁగఱచితిని. అతిథుల నన్నపానములచేతను, బితరులను శ్రాద్ధముల చేతను, ఋషులను వేదాధ్యయనదీక్షలచేతను, దేవతలను నుత్తమంబయిన యజ్ఞములచేతను. దృప్తినొందించితిని. క్షత్రధర్మమును యథాశాస్త్రముగను విధ్యుక్తముగను నాచరించితిని. సేన నాకంటఁబడినా వెనుదీయక నూరొక్కని యుద్ధమున దానినిజయింతును. నే నిట్టివాఁడను. దేవేంద్రా! ఈనుదేన్యుఁడు తొల్లి నాకుసేనాపతిగా నుండెను. మఱియు మేటియోధ; మిక్కిలిశాంతాత్ముఁడుగను నుండెను ఆయినను నితఁడు నన్నే కారణమున నతిశయించెను? ఇతఁడు సూర్యునింబోలె వెలుఁగుచున్న విమానమెక్కి దేవలోకమున ముదంబునఁ బొడలుచున్నాఁడు. ఇతఁడు మేటి యజ్ఞములను యజించినవాఁడునుగాఁడు. బ్రాహ్మణులను విధ్యుక్తముగాఁ దృప్తినొందించినవాఁడును గాఁడు. ఇట్టి పీఁడు సకల దేవతలకును నెంతయు దుర్లభమయిన యిటువంటి యైశ్వర్యమునుబడసి యిట్టి నన్నె ట్లతిశయింపఁ గలిగెను?' అనియడిగెను.

ఇంద్రుఁడు *'రాజా! వీఁడుచేసిన కార్యము నీకుఁ బ్రత్యక్షమయినదే! మున్ను నీవు ధర్మంబున భూమిని జక్కఁగాఁ బాలించుచుండుటవలన, నీకహితముగావించు శత్రువులందఱును జయిం

* ఈకుండలీకరణములోని పాఠము దాక్షిణాత్యప్రతులందే కానిపించుచున్నది.

పఁబడిరి. నీవొకప్పుడు యజ్ఞముసేయుచుంటివి. అట్టిశుభకాల
మున శతశృంగుఁడను రాక్షసుని పుత్రులు సంయముఁడు, వియ
ముఁడు సుయముఁడనుచువ్వురురాక్షసులను, యుద్ధమం
దెంతయుఁ బోతరించి జయింప నలవిగాక యుండినట్టివారిని,
జయించితివి. నీవు దేవతలకు హితముసేయఁగోరి యశ్వ
మేధమనెడిమహాయాగమును జేయుచుండఁగా నీకు విఘ్న
ము సేయఁగోరి యీమువ్వురు రాక్షసులును నూఱుకోట్ల
పరివారముగల మహారాక్షససైన్యమును గొని వచ్చిరి. అంత
నీప్రజలందఱును జెఱఁబెట్టంబడిరి. నీప్రజలందఱును సైనికులం
దఱును విహ్వలులయిరి. రాజా! అక్కాలమందు సుదే
వుఁడు నీకు సేనాపతిగా నుండెను. వానిని నీవు మంత్రుల
మాటవిని సమస్తకార్యములనుండియుఁ దొలంగించి యుంటివి.
అప్పుడు నీ వామంత్రుల కపటవచనములు విని జయింపనలవిగాని
రాక్షసులను జంపుటకై యీసుదేవునితో 'రాక్షససైన్యమును
గెలువక నీవు మరలిరాఁగూడదు; చెఱఁబెట్టఁబడిన వారిని విడిపిం
పకయు మరలఁగూడదు' అనిచెప్పి సకలసైన్యములం గూర్చి
పంపితివి. రాజా! సుదేవుఁడామాటవిని పయనమై ప్రజలు
చెఱఁబెట్టఁబడిన చోటికిఁబోయెను. ఆసేనాపతి ఘోరమయిన
రాక్షసమహాసైన్యమునుజూచి 'ఈసైన్యమును దేవాసురు లిం
ద్రునితోఁ గూడివచ్చినను గెలువఁజాలరు. దివ్యాస్త్రబల
మెంతయుఁగల యంబరీషునివంటివాఁడు నీసేనయందలి పదునా
ఱవపాలినిగూడఁ గూల్పఁజాలఁడు. ఇఁక నాఁబోఁటివాఁ డెగూ
ల్చుట చెప్పనేల?' అని మిక్కిలియుఁ జింత నొందెను. అంత
వాఁడు నీవు కపటులగు మంత్రులందఱితోడను సమాత్యుల

తోడను గూడియున్నయెడకు సైన్యమునంతయు మరల్చి పంపెను. అంత వాఁడు జగత్పతియు వృషభధ్వజుండును శ్మశాన నిలయుండు నగుమహాదేవుని శివుని శరణుఁజొచ్చి స్తోత్రముచేసెను. అట్లు స్తుతించి యంత నాయుధముగొని తనతల నఱుకనుంకించెను. ఆదేవదేవుండు కరుణించి యాయుధముఁగూడినవాని కుడిచేతిని బట్టుకొని వానినిజూచి 'పుత్రా! నీవేల యీసాహసము చేయఁదలఁచితివి? నాకుఁ జెప్పు' మని యడుగఁగా నాసుదేవుఁడు తలనేల సోఁకమ్రొక్కి యమ్మహాదేవునితో 'దేవేశా! నా కీరాక్షససైన్యమును యుద్ధమున జయింప శక్యముగాకున్నది. కాఁబట్టి ప్రాణముల విడువనున్నాను, జగత్పతీ! మహాదేవా! ఆర్తుండగునాకు దిక్కగుము. మహాదేవా! అంబరీషమహారాజు మంత్రిసహితుఁడై యాక్రోశంబున నాతో నెలువక కాని రాఁగూడదు' అని చెప్పెనతఁడు. అట్లు మొగమువాంచి నేలపయింబడి యున్నమహాత్ముని సుదేవునిఁజూచి యాదేవుఁడు, ప్రాణిహితముగోరి గణములతోను విగ్రహము(యుద్ధము)తోను గూడినదియు, రథగజ తురగములచేతఁ బరివృత మయినదియు దివ్యాస్త్రములచే నలంకృతమైనదియు నగుధనుర్వేదమును బిలిచి, మఱియుఁ ద్రిపురములను గెలుచుటకు సాధనమును మహాభాగ్యవంతము నయినరథమును, పినాకమనెడి వింటినిని, గాండీవమనెడి ధనుస్సును, నసురులనెల్లవారిని జంపినదియు భయంకరము నయిన యాపాశుపతమహాస్త్రమును నొసంగి, 'సుదేవా! నీ వీరథంబు నందుండఁగా దేవతలకును నసురులకును నిన్ను గెలువఁ దరముగాదు. నీవు మాయచేత మోహితుఁడవై భూమియందు దడుగిడుట తగదు. నీవు రథమునందుండి దేవాసురుల నందఱను

గెలువఁగలవు. వేయిసూర్యుల కాంతిచేఁ దుఱఁగలించుచున్నది యీరథము. ఇట్టిరథమును రాక్షసులకును బిశాచులకును దేఱి చూచుటకే శక్యముగాదు; ఇఁక నీతోడ యుద్ధముసేయ నెట్లు శక్యమగును ?' అనెను. ఆసుదేవుఁడు రాక్షసుల నెల్లవారిని జయించి చెఱయం దున్నవారినెల్ల విడిపించి యారాక్షసులనం దఱ నుఱుమాడినపిదప విమలునితోడఁ దలపడి బాహుయుద్ధ మున హతుఁడయ్యెను. విమలుఁడును గూల్పఁబడెను. నా యనా! ఆసుదేవునకు బరాక్రమించుటవలన యుద్ధమునెడి మిక్కిలి గొప్పయజ్ఞము గలిగెను. మఱి యుద్ధముసేయ నొక్కొక్కనికి నిచ్చ గలుగుచున్నది. కవచముదొడిగి సేనాముఖమునకుఁ బోయి యుద్ధముసేయునట్టి యొక్కయోధుఁడును నాయజ్ఞ మందు దీక్షితుఁడగుచున్నాఁడు. అట్టివాఁడు యుద్ధయజ్ఞమున కధికారము గలవాఁడగుననుట నిశ్చయము' అనెను.

అంబరీషుఁడు 'ఆయజ్ఞమందు హవిస్సులెవ్వి ? ఆజ్యమెద్ది ? దక్షిణయేది ? ఎవ్వరు ఋత్విజులుగాఁ జెప్పఁబడుదురు ? శత క్రతూ ! ఇవి నాకుఁజెప్పము' అని యడిగెను. అందులకింద్రుఁడు 'ఆయజ్ఞమందు నేనుఁగులు ఋత్విజులు; గుఱ్ఱము లధ్వర్యువులు; పగవారి మాంసములు హవిస్సులు; నెత్తు రాజ్యమని చెప్పఁ బడును. నక్కలు, గ్రద్దలును, గాకులు ననుపక్షు లా యాగ మందు సదస్యులు. ఇవి శేషించిన యాజ్యమును గుడుతురు; యాగమందలి హవిస్సును భుజింతురు. ఆయాగము చేయువా నికిఁ దళతళమెఱయుచు వాఁడులై పదనుగావింపఁబడిన ప్రాస ములు, తోమరములు, ఖడ్గములు శక్తులు, గొడ్డండ్రును స్రుక్కు లగును. వింటినుండి వేగముగా నిగిడినదై వాఁడినై పరులదేహ

ములను భేదించునదై చక్కనై, చక్కఁగా దీటఁబడియుఁ దొడ
యంబడియు, నున్నఁబాణము పెద్దస్రుక్కువ మగును. పులితోలి
గవిసెన గలదియు, ఏనుఁగుదంతిపుఁ బరుఁజు గలదియు
నై, యేనుఁగు తొండములను నఱుకునట్టి కత్తి యాయుద్ధ
మందు * స్రుక్కయ మగును. మొనలంట నుక్కుచేతఁ జేయంబడి
నవియు వాఁడులునై తళతళ మెఱయుచుఁ, దీడంబడిన ప్రాసము,
శక్తి, ఋష్టి, గొడ్డలి యనుపీనివలనిదెబ్బ యిచ్చుధన మగును.
యుద్ధమునందలి కొట్లవలన భూమియందు దొరుఁగు రక్తము,
సర్వకామముల నొసంగునట్టిదియు సమృద్ధ మయినదియుఁగా
హోతలు గావించుపూర్ణాహుతి యగును. యుద్ధపుమొన
యందు 'నఱుకు' 'చీల్చు' అని వినఁబడుశబ్దము యమునిరాకకుఁ
గారణముగా సామగులుచేయు సామగానమగును. పగుల సేనా
ముఖ మాయాగమునకు † హవిర్ధానమగును. ఏనుఁగుల సమూ
హమును గుఱ్ఱముల సమూహమును, గవచధారుల సమూహ
మును నాయాగమందు ‡ శ్యేనచితి మనెడియగ్నియగును.
ఇందు వేయిమంది పడినతోడనే రేగునట్టి మొండెము, ఎనిమిది
యంచులుగలిగి నచంద్రయూప స్తంభముగా నాకాశమున కగును.
అంకుసముతోఁ బురికొల్పఁబడిన యేనుఁగుల ఘీంకారములు,
§ ఇడాహ్వానము లగును. రాజా ! నారిచప్పుడుతోఁగూడిన చేతి
చప్పట్లు, వషట్కారమగును. ఆయుద్ధమందలి దుందుభివాద్యము

---

* స్రుక్కయమనఁగా యాగవేదికపయిని గీతలుగీచునట్టి క్రమానికట్టి.

† హవిర్ధానమనఁగా హవిస్సు పెట్టుచోటు.

‡ యాగమందు నగ్నినుంచుటకు డేగ యాకారముగాఁ గట్టఁబడుమేడ.

§ ఒకవిధమయిన హవిస్సును వేల్చునపుడు దేవతలను బిలుచుట.

మూఁడుసామములయుద్ధాత యగును. బ్రాహ్మణుల ధనమును బగవా రపహరించునపుడు యుద్ధమందుఁ బ్రియమయిన దేహ మును విడిచి దానిని యూపముగానాఁటి చేయునట్టి యాయాగ మఖియం బగుదక్షిణ గలదియగును, ఏశూరుఁడు భయంబునఁ దిరుగువడక యొడయనికొఱకు సేనాముఖమున నిలిచి వెలు వడునో వానికి నాఁలోకములపంటి లోకములు సిద్ధించుచున్నవి. ఎవని యుద్ధవేదిక పులితోలి యొఱలుగల కత్తులచేతను బరిఘ ములకుఁ బొటియైన చేతులచేతను బఱవంబడియున్నదో వానికి నాఁలోకమువంటి లోకము సిద్ధించును. రాజా! సేనామధ్యమం దుఁ జొచ్చి సంకటమునం దుండునపు డొవఁడు వేఱొకసహాయము నపేక్షింపకుండునో వానికి నాఁలోకమువంటి లోకములు సిద్ధిం చును. యుద్ధముసేయునపుడు రక్తమహానదిని బుట్టింపవలయును. అది నెత్తుగు వెల్లువలును భేరులనెడుకప్పలును దాఁబేళ్లును గలది; వీరులయెమ్ము లనెడుమొరపఱాలచేఁ బోవరానిది. మాంస రక్తములనెడి రొంపితోఁగూడి వాలుపలక లనెడుతెప్పలును, వెండ్రుక లనెడుప్రాఁచితీఁగలును బచ్చికయుఁ గలది. ఘోరమై తునిసిపడిన గుఱ్ఱములయు నేనుఁగులయు రథములయుఁ బ్రోవు లనెడువంతెనలు గలిగి పతాకలును ధ్వజములు ననెడుప్రేఁపబొద రులను, జచ్చిన యేనుఁగులశరీరము లనెడువెనుమొసళ్లును యష్టులును ఖడ్గములు ననెడువెనుచేఁపలును, గ్రద్దలును గంక పక్షులగుంపు లనెడితేలుచున్న తెప్పలును గలిగియుండును. అది నెత్తు రనెడునీళ్లతో నిండి పరలోకమునకుఁ గొంపోవున దగును. దానిని రాకుసు లనుసరింతురు. అది పిఱికివారలకు జంకు గలిగించునట్టిది. అది గడిదేఱిన వారలకును దాఁటుట

కెంతయుం గష్టము, ఇట్టినది యేయోధుని యుద్ధమునందుఁ గలుగుచున్నదో యది వాని * కవభృథమగును. అనఁగా నట్టినదిని గలిగించునేని యుద్ధయజ్ఞమును బూర్తి గావించుటకుఁ జేయు నవభృథ మది వాని కగును. ఎవని యుద్ధయజ్ఞపు వేదిశత్రువుల శిరసులచేతను గజతురగములు కుత్తుకలచేతను బఱవం బఱుచున్నదో వానికి నాలోకమువంటి లోకములు సిద్ధించును. ఎవనికి శత్రువుల సేనాముఖము † పత్నీశాలగాను, తనసేన హవిర్ధానముగాను, తనకు దక్షిణమందుండు యోధులు సదస్యులుగాను, ను త్తరమం దుండుయోధుల ‡ నాగ్నీధ్రులుగాను గావించునో, మఱి శత్రుసేనలను దనయిల్లాలివలెఁ జూచునో, వాఁ డుత్తమలోకములను బొందునని స్రాజ్ఞులు చెప్పుదురు. § రెండుప్రక్కల యుద్ధమునకై పన్నియున్న రెండు సైన్యములకును నడుమనున్నబయలట్టి యాజకునకు వేదియగును. పన్నిన వ్యూహములు మూఁడగ్నులగును. ఆవ్యూహనులచే నతఁడొప్పుడు నావేదియందు యజ్ఞము చేయును. ఏయోగ్నుఁడు భయపడి మరలఁబడి పఱులచేత హతుఁ

---

* యాగపూర్తికై చేయు కడపటి స్నానజలమగును.

† యాగము చేయువాని పత్నియుండుచోటు.

‡ ఆగ్నీధ్రునఁగా నొకఋత్విజుఁ డుండునట్టిస్థలము.

§ యస్యతూభయతో వ్యూహే భవత్యాకాశ మగ్రతశ్చ, సాస్యవేది స్తదా యజ్ఞైర్నిత్యం వ్యూహ స్త్రయోగ్నయ' అని. దా. మూలము. నిత్యం వేదా స్త్రయోగ్నయ' అని నీలకంఠాదులపాఠము. వేదములనుటకంటె వ్యూహములనుట ప్రాకరణికము. ఇట ఎవ్వనిరెండు ప్రక్కలను (అనఁగా దనప్రక్కనున్నదియు తనయెదుటనున్న పగవారిదియునగు) పన్నియున్న సేనలలో నెదుటఁ బన్నియుండునది (అనఁగా శత్రుసేన) పట్టిబయలగునో (అనఁగా నిర్వాహము గావింపఁబడునో)

డగునో వాఁడు నిలుకడపడ్డి నరకము నొందుననుటకు సందియము లేదు. ఎవని (యుద్ధ)వేది రక్తప్రవాహముచేతఁ జక్కఁగాఁ దడుపఁబడినదై వెండ్రుకలచేతను మాంసముచేతను నెమ్ములచేతను నెరసినదగునో వాఁడు త్తమగతి నొందును. ఎవఁడు సేనాధిపతిని జంపి వానివాహనముపయి నెక్కునోవాఁడు విష్ణుపరాక్రమమునకు సాటియైనపరాక్రమముగలవాఁడును, బృహస్పతిం బోలినవాఁడును బ్రభువునగును. ఎవఁడు రాజునో, యతనిపుత్రునో, యతని చేతఁ బూజితుఁడగు మనుజునో, ప్రాణములతోడఁ బట్టునో, వానికి నాలోకములనంటి లోకములుసిద్ధించును. యుద్ధమందు హతుఁడయిన శూరునిగుఱించి యెంతమాత్రమును శోకింపరాదు. హతుఁడయినశూరుఁడు శోకించుట కర్హుఁడుగాక స్వర్గలోకము సందుఁ బూజితుఁడగును. యుద్ధమందు హతుఁడయినవానికి, నన్నదానము నుదకదానమును, స్నానమును, ఆశౌచమును పెద్దలుగావింపఁగోరరు. వాని కగులోకములను జెప్పెదనువినుము. యుద్ధమందు హతుఁడయినశూరుని గుఱించి 'నాకు భర్తగావలయు' నని పెక్కువేల యచ్చరమిన్నలు వేగంబునఁ బొయి తెంతురు. యుద్ధమందు వెన్నిచ్చి పాఱినివానికిఁ దపస్సును బుణ్యమును సనాతన మయినధర్మమును నాలుగాశ్రమములును సిద్ధించుచున్నవి. ముసలివానిని, బాలునిని, స్త్రీనిని, బూరి

యుపుడాతని (యుద్ధయజ్ఞపు)వేది యజ్ఞములచే నిండినదగును.(అనఁగానెదుట సేనను నిగ్రహములుసేసి నశ్చలులుగావించుసేని యతఁడు యుద్ధయజ్ఞముచేసి తీర్చినవాఁడగుననుట). ఈపాఠమున 'తిదాయుజ్ఞే' అనుటకు 'తతోయజ్ఞే' అని గ్రహించునది. ఈపాఠమేసమంజసము. అట్టివాని కన్నిలోకములును సమీపమందున్నవి యగును. అందలి వ్యూహములే యతనికి మూఁడగ్నులని యర్థము.

గఱచినవానిని, 'నీవాఁడ' నన్నవానిని గొట్టరాదు. పిఱికిదిప్రక్క నుండి కొట్టనుఁదగదు. నేను వృత్రాసురునిని, బలునిని, బాకాసురునిని, మహాకాయునిని, విరోచనుని, వారింపరాని సముచిని, వెక్కుమాయలుగల శంబరునిని, విప్రచిత్తిని, బ్రహ్లోదుని, దనుపుత్రుల నందఱను యుద్ధంబునఁ జంపి పిదప దేవతలకు రాజ నయితిని' అనెను.

ఇట్లింద్రుఁడు చెప్పినదివిని యతనిని బూజించి యంబరీషుఁడు తనయోధులు సొందునట్టిసిద్ధిని దెలిసికొనెను. ఇది తొంబది యెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు, జనకుఁడు తన సేనల నుత్సాహపఱచి యుద్ధమునకుఁ బంపుటను, వ్యూహములుపన్నట మెంపలగువారిని జెప్పుట.

భీష్ముఁడు-'ఈవిషయమై ప్రతర్దనుఁడును జనకుఁడును జేసిన యుద్ధమును గుఱించి పురాతనమయిన యీ యితిహాసమునుదాహరించుచున్నారు. ధర్మరాజా ! మిథిలాపతి యగుజనకుఁడు యుద్ధ (మనెడి యజ్ఞ) మునకు ధనుర్జ్యోవీతిమును దాల్చిన వాఁడై తనభటులను నుత్సహింపఁ జేసెను అది చెప్పెదను వినుము. ఆజనకుఁడు మహాత్ముఁడు, సకలతత్త్వములను దెలిసిన వాఁడు; కాన, యతఁడు తనయోధులకు యోగబలమున స్వర్గమును నరకమును జూపి 'ఇవిగోఁజూడుఁడు: భయములేని వారికి మిక్కిలియుఁ బ్రకాశించుచున్న యీలోకములు గలుగును. ఇందు గంధర్వసుందరీమణులు గ్రందుకొని యున్నారు. ఇవి

యత్నయములు; సమ స్తకామితములను బిదుకునవి. ఇవిగో జూడుఁడు. భయపడి పరుగిడువారికి, నరకము లని చూపట్టు చున్నవి. అందు,వారు శాశ్వతమయిన యపకీ ర్తితోడఁ గల కాలముఁ * గ స్తి గుడుచుచుండవలయును. ప్రాణములు దిగ విడుచుటకు నిశ్చయించి పగవారిని గెలువుఁడు. అపకీ ర్తికర మయిన నరకమునకుఁ బొలుగాకుఁడు. యుద్ధమునందు దేహ మును త్యజించుటయే శూరులకు నుత్తమమయిన స్వర్గద్వా రము' అనెను. ఆరా జిట్లు చెప్పఁగా మిథిలాపురపు యోధులు రాజున కుబ్బుగలుగునట్లుగా యుద్ధమునఁ బగవారిని జయించిరి. కాఁబట్టి ప్రాణములు విడువఁ దెగించియే యుద్ధాగ్రమం దెప్పు డును నిలువవలయు. ఏనుఁగులనడుమ రథికులను నిలుప వలయును. రథికులపిఱుఁద గుఱ్ఱపురౌతుల నిలుపవలయును. వీరికిఁ బిఱుఁదఁ గవచధారు లగుకాలుబంట్ల నిలుపవలయును. ఈరీతిని వ్యూహమును బన్నిరా జెప్పుడును బగవారిని జయిం చును. కాఁబట్టి, యుధిష్ఠిరా ! ఈవిధమునఁ యొడ్లు పన్న వలయును. స్వర్గమందు సుఖమును గోరువారు, మిక్కి-లి రోషము గడలుకొనఁగా లెస్సగా యుద్ధము సేయుదురు. అట్లు యుద్ధముసేసి మకరములు సముద్రమునుం బోలెఁ బరసైన్యములను గలగుండుపఱుతురు. వా రొండొరులకు దిట గలిగించుకొని తెంపుదూలియున్నట్టివారికి నుబ్బుకలిగింపవల యును. అట్లు గెలిచినవాఁడు గెలిచినభూమిని బాధలు పొరయ కుండ రక్షింపవలయును. తనభటులు, భంగమునొంది పాఱినశత్రు

* 'పతితవ్య మనన్తరమ్' అని. బొ. మూలము. 'యతితవ్య మనన్తరమ్' అని దాక్షిణాత్యకోశములందు పాఠము చూపట్టుచున్నది.

వులను మిక్కిలి వెంటనంటి వారింపకుండునట్లు చేయవలయును. శత్రువులు పాఱిపోయియు బ్రదుకుఁదెరువు గానమిచే నాశలుడిగి మరలఁ బయిని బడుదురేని వారలయురవడిని సహించుట యెంతయుఁ గడిఁది. కాఁబట్టి వారలను మీఁదుమిక్కిలి తన సైనికులు వెంటాడకుండునట్లు చేయవలయును. కనుక శూరులయినవారు భయమునఁ బరుగిడువారినెంతమాత్రమును గొట్టరు చుమీ. కాఁబట్టి పాఱిపోవువారిని మిక్కిలి వెంటనంటి పోనీయరాదు. చరములగు వానికి నచరములును, గోఱలుగల వానికిఁ గోఱలు లేనివియుఁ, * జేతులు గలవానికిఁ జేతులు లేనివియు, శూరులకుఁ బిఱికివారును, నాహారమగుదురు. పిఱికివారు తమ్ము గెలిచినవారివలెనే వీఁపును, గడుపును, జేతులును, గాళ్లునుగలిగియుండియు, † బ్రాణములను బిఱ్ఱిడికినుంచి పోవుదురు. కాబట్టి భయాక్రాంతులగువారు మరలి దండముపెట్టి యంజలిసేసి శూరుల మ్రోలనిలుచుందురు. ఈలోకము, తండ్రిచేతులయందు బిడ్డఁడుంబోలె శూరులచేతులయందు వ్రేలుచున్నది. కాఁబట్టి సమస్తలోకములందును శూరుఁడు సమ్మానమునొందనర్హుఁడు. శౌర్యమునకంటె నెక్కుడయిన దేదియు మూఁడులోకములందును గలుగదు. శూరుఁడు సమస్తమును బాలించుచున్నాఁడు. సర్వమును శూరునియందు నెలకొనియున్నది'' అనెను. ఇది తొంబదితొమ్మిదవయధ్యాయము.

---

* 'అపాణయుఃపాణిమతామ్' అని మూలము. 'ఆపఃపిపాసతామన్నం' అని బౌ. మూలము. దప్పిగొన్నవానికి నీళ్లు నన్నమని తాత్పర్యము.

† 'పశ్చాచ్ఛరం భీరవోఽనువ్రజన్తి' అని దా. మూలము. 'పరాభవం భీరవోవ్రజన్తి' అని బౌ. మూలము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు యుద్ధముచేయు విధము మొదలగు వానిని జెప్పుట.

ధర్మరాజు 'భరతసత్తమా ! జయమును గోరువారు ధర్మమును గొంచెము పీడించియేనియు నెట్లు (రాజువలని భయము చూపి) యుద్ధమునకు సేనను నడపించుకొని పోదురు? ఇదినాకుఁ జెప్పుము.' అని యడిగెను.

భీష్ముఁడు-'కొందఱు ధర్మము సత్యముచేతఁ గుదురుగలిగియున్నది చెప్పెదరు. కొంద ఱుపపత్తిచేత ననియుఁ జెప్పెదరు. కొందఱు మంచినడనడిచేత నందురు. కొంద ఱుపాయనులచేత నని చెప్పెదరు. నేను దోడనే యర్థసిద్ధిని గలిగింపఁ జాలినయుపాయములను ధర్మములను జెప్పెదను వినుము. దొంగలు మర్యాదలనెల్లనుల్లఁఘించి ధర్మాదులకు నాశకు లగుచున్నారు. వారిని వారించుటకును వేదోక్తము లయినయుపాయములను జెప్పెదను. కార్యములు లెస్సగా సిద్ధించుకొఱకు వానిని దెలిసికొనుము. ప్రజ్ఞ ఋజు వనునది, వంకరయైనది యని రెండు విధములు. ఆరెంటిని రాజు తెలిసికొనవలయును. రాజు వక్రమును దెలిసికొనియున్నను దాని (నితగులను బొధించుటకై) ప్రయోగింప

---

* 'సత్యే ఽహిస్థితా ధర్మఉపపత్త్యా తథాపరే' అని బొ. మూలము. 'సత్యే ఽహిస్థితా ధర్మఉపపత్త్యా తథాపరే' అని బా. మూలము. 'యథార్థంబగు క్షత్ర ధర్మము నొప్పనఁ గొందఱు ధర్మంబునందున్నారు. మఱికొందఱు మరణము గలదని నిశ్చయమున, ధర్మమం దున్నారు, అని యర్థము.

రాదు. అతనిని నపాయములు వైకొనెనేని వానిని బాధించుట కై దానిని గయికొనవచ్చును. శత్రువులు రాజునకు (వారివారిదగు మంత్రులు సైనికులు మొదలగువారియందు) భేదము గలిగించి * యపచారము చేయుదురు. రాజు వంచనను జక్కఁగా నేర్చి యుండి దానితోడ్పాటున నాశత్రువులకుఁ బ్రతికారము చేయ వచ్చును. భారతా! ఏనుఁగుల కవచములును, నావులయు నెద్దు లయుఁ గొండచిలువలయు తోళ్లును, అలుఁగులును, ముండ్లును, నినుపమేకులును, మేలయినకవచములును, పదును జేసినయాయు ధములును, జక్కఁగాఁదొడియంబడిన యినుపకవచనులును నుం డవలయును. పతాకలును ధ్వజములును పలురంగులు వేయంబడి యుండవలయును. బుష్టులును దోమరములును గత్తులును గొడ్డం డ్యును, వాఁడులుగా నుండవలయును. పలకలచేతను దోళ్లచే తను గావింపఁబడిన పలువగల కేడెములును మిక్కుటముగా నేర్పుచుకొనవలయును. ఆయుధములను జక్కఁగా నాయిత పటిచినవిగాను బంట్లు తెగింపుగలవారుగాను నుండవలయును. చైత్రమాసమందుఁగాని మార్గశీర్ష మాసమందుఁగాని, పండువెడ లుట యుత్తమము; అప్పుడు భూమియందుఁ బయిరులు లెస్సఁ గాఁబండియుండును. జలమును సమృద్ధముగాఁ గలిగియుండును. కాలమును మిక్కిలి చలువయు వేఁడియుఁ గాకయుండును. కాఁ బట్టి యీకాలమందుఁగాని లేక పరులకు సంకటమయిన కాలమం దుఁగాని ప్రయత్నము చేయవలయును పరులను బీడించువిషయ మున సేనల కీయుపాయము లుత్తమములగును. జలమును

* 'భేదేనాపచర న్తి' అని బౌ. మూలను. 'భేదేనోపచర న్తి' అని దా.మూ

బుల్లును గలదై, సమమై, అడవియందున్న సమర్థులగు వేగుల వాండ్రు చక్కఁగాఁ బనుపడి తెలిసియుండునట్టిదారి పోవ్వటకుఁ దగినదిగా వన్నెకెక్కి యున్నది. మృగసమూహములవలె నడవులంబోవుట శక్యముగాదు. కాఁబట్టి జయమునుగోరునట్టి వారు, సేనలకడ నాయకవినునుష్యులనే చేర్చియుంతురు. శక్తి మంతులును సత్కుల ప్రసూతులు నగుజనులు ముందుపోవలయును, జలముగలదియు దాపునఁ బచ్చికబయలు గలదియు నగుదారి విడిపట్టుగానుండుటకు నుత్తమమయినది. అట్లుండిన చోఁబరుల దూతలను వారింపనలవియగును. యుద్ధమందు సమర్థులయిన జనులు, పలువిధములయిన గుణములు మిక్కిలిగా నుండుటచే నడివిదాపున నున్నబయలును నుత్తమనుయినదని తలఁచుచున్నాఁడు. సేనలకు మిక్కిలి దూరముగాని చోట బొక్కసముండవలయును. బొక్కసముదాపునఁ గాలుబంట్లు దిగునట్లును మఱిఁగియుండునట్లును జేయవలయును. ఇది భూపతుల్కులమందుఁ బగవారిని జంపుటకు ముఖ్యకారణమగును. సప్తర్షినక్షత్రములను మున్నిడికొని కొండలంబోలినవారై యుద్ధముచేయవలయును. ఈవిధిచొప్పున, జయింప నసాధ్యులయిన పగవారినిని జయింపఁగోరవచ్చును. వాయువును సూర్యుండును జంద్రుండునుగల పక్షమందు జయముగలుగును. యుధిష్ఠిరా! ఈరెండు పక్షములును గూడికగలదేని, వీరియందు మునుము న్నుండువారు మిక్కిలి శ్రేష్ఠులు. యుద్ధమందు సమర్థులయిన జనులు, రొంపిలేనిదియు జనులులేనిదియుఁ బ్రాకారము మొదలయిన గఱునులేనిదియు మట్టిగడ్డలులేనిదియు నగుభూమిని, గుఱ్ఱములకుఁ దగినదని కొనియాడుదురు. మిట్ట పల్లములు లేనిదియును

రొంపిలేనిదియును, బొటియలులేనిదియు నగుభూమి తేరులకును త్తమమగును. చిన్నచెట్లు గలదియు మిక్కిలియుఁ బులుగలదియు జలముతోఁగూడినదియు నగుభూమి యేనుఁగులనెక్కి యుద్ధముసేయువారికి నెంతయు మేలయినది. వెక్కుదుర్గములుగలదియుఁ బెనుపొదరులుగలదియు వెదుళ్లచేతను బ్రేపపొదరులచేతను మఱుఁగుపడినదియు నగుభూమియుఁ బర్వతములును నడవిపట్టులును గాలుబంట్లకుఁ దగినవగును. కాలుబంట్లు బహుళముగాఁ గలిగినసేన మిక్కిలిదృఢముగానుండును. వానలేని మంచిదినములందు రథములును నశ్వములును గలసేన మిక్కిలి యొప్పును. వానకాలమందు కాలుబంట్లును నేనుఁగులును మిక్కిలి గలసేన యెంతయునొప్పును. ఈగుణములనును దేశకాలములను జక్కఁగాఁ దెలిసికొని, సేనను యుద్ధమునకుఁ బంపవలయును. ఇట్లు చక్కఁగానెఱిఁగి మంచి తిథినక్షత్రములందు, నాశీర్వాదములును బడసి, సేనను జక్కఁగా నడపించుకొని పోవువాఁడే యెప్పుడును జయమునొందును. నిదురపోవువారిని దప్పిగలవారిని శ్రమపడినవారిని తట్టుకుఁడుగా నుండువానిని * యుద్ధము నిలిచియున్నపుడును, పరుగెత్తి పోవుచున్నపుడును, దారిని సన్నాహములేక పోవుచున్నపుడును, త్రాగునపుడును, గుడుచుచున్నపుడును, గొట్టరాదు. పిచ్చివానిని, బుద్ధికలఁగి యున్నవానిని, మిక్కుటముగా గాయపడియున్నవానిని, గాయములచే సత్తువ మిక్కిలియు సురిఁగినవానిని, నమ్మికతో నిలుచున్నవానిని, ఒకకార్యను నారంభించి ముగింపలేకున్నవానిని, సురంగములు

* 'మోక్షేప్రయాణే చలనే పానభోజనకాలయోః' అని మూలము. 'మోక్షమార్గమునసున్నపుడు' అని ప్రతాపచంద్రరాయలు.

మొదలైనవిశేషశిల్పములందు నిపుణుఁడయినవానిని,దుఃఖమొం దినవానిని, బండములు పచ్చిక మొదలగువానిని దెచ్చుటకై శిబిర మునుండి వెలుపలఁబోవువానిని,శిబిరములునిర్మించువానిని,దాని వెంటఁబోవువానిని, పరంపరగారాజుద్వారమునుహత్తుకొనియుం డువానిని, మంత్రి ద్వారమందుండువానిని, సేనయందలి ముఖ్యు లకుఁ బరిచర్య సేయువానిని అట్టివారికి నధిపతు లయినవారి నిని గొట్టరాదు. నీసేనయం దెవరు పరులసేనను భేదింతురో, తమసేనను భేదించినయెడల మరల నొకటిగాఁ గుదురుపఱు తురో, యట్టివారికి నీతోఁబాటిగా భోజనమును బానమును జరుగుటయేకాక వారి వేతనములను రెండింతలు గావింపవల యును. మఱియు నట్టివారిజాతియును గోత్రమును దెలిసికొని వారుచేసిన యుత్తమం బయినకార్యమును గనుఁగొని, తనకు సమానముగా శరీరమును రక్షించుటకై వాఁకి వేతనము రెం డింతలు మూఁడింతలు నాలుగింతలును గావింపవలయును. అట్టి వారియందుఁ బదిమందికి నధిపతియైనవారిని నూఱుగురకు నధి పతులుగా నియమింపవలయును. పదిప వారియందు సోమరితన ములేనివాఁడును శూరుండు నగువానిని వేయిమందికి నధిపతిగా నియమింపవలయును. ముఖ్యులుగానుండువారి నొక్కటిగాఁ గూర్చి 'మనము జయమునొందుటకై యొకరినొకరు విడువరా దని * శపథముచేయుదము. ఎవ్వరు పిఱికివారో వారిచ్చటనే నివర్తింపవచ్చును. దొమ్మిగా యుద్ధముజరుగుచుండఁగా శూర

* 'సంశపామహే' యని మూలము. 'సంశయామహే' అని పాఠాంతర మెంతయు అసంగతమును అప్రకరణికమునుగాన పరిత్యజింపఁబడినదని తెలి యునది.

ముగా నడచుకొనుటకు నుపేక్షించి తమముఖ్యులను నితరులచేఁ జచ్చునట్లు చేయువారును నిచ్చటనే నిలిచిపోవచ్చును. తానును యుద్ధమునుండి విడిపోక తనపక్షమువారిని నెదిరికిఁ జంప వీలియ్యక యుండునట్టివారు వత్తురుగాక. తమ్మును దమపక్షపువారినిని రక్షించుకొందుఁగాని యట్టివారు యుద్ధమునఁ దప్పక శత్రువును జంపుదురు. యుద్ధమునఁ బలాయనమగుటవలన ధననాశమును, వధమును, నిందయు, నపకీర్తియుఁగలుగును. ప్రాణసంశయము కలిగినపుడు పరుగెత్తువాఁడును, పెదవులును పండ్లును మాలిన వాఁడును (సిగ్గువీడినవాఁడును), ఆయుధము దిగవిడిచినవాఁడును, సహాయులను విడిచి పరుగెత్తినవాఁడును, శత్రువులచేఁ జెఱఁబడినవాఁడును, మనసునకుఁ గటువై వినుటకు దుఃఖకరమయిన మాటలను వినవలసివచ్చును. ఇట్టివెప్పుడును మనశత్రుపక్షమువారికిఁ గలుగుఁగాక. ఎవరు యుద్ధమునకుఁ బెడమొగముపెట్టుదురో వారు మనుష్యులందు నధములగుదురు. వారుమనుష్యుల మొత్తమును బెంచుటకుమాత్రమే యైనవారుగాని యిహమునందును బరమునందును వారుండియు ఫలములేదు. పరుగెత్తుచున్నవారిని జయశీలురయిన శత్రుపక్షపువారు మనంబుల సంతోషము గనులుకొన * వందిజనుల స్తోత్రములుచెలంగ వెంబడించి పోదురు. †శత్రువులొకనిని యుద్ధమందుఁ దారసిల్లి వానియశమును బోకా

---

* 'వందినాం మండలేనచ' అనిమూలము. 'వందనైర్మండలేనచ' అనియు 'మంగళైర్వంగనేనచ' అనియు 'మంగళైశ్చందనేనచ' అనియుఁ బాఠాంతరములు.

† 'యస్య స్మసంగ్రామగతా యశోవైఘ్నన్తిశత్రవః। తదసవ్యాతరం దుఃఖమహంమన్యే వధాదపి' అని ఔ. మూలము. యస్యస్మవ్యసనేరాజన్నసుమోదన్తి

ర్తురేని యది వధమునకంటె మిక్కిలియుసహింపరాని దుఃఖ మని నేను దలఁచుచున్నాను. * జయమే ధర్మమునకును, సమ స్త సుఖములకును మూలమని తెలియుఁడు. † పిఱికివాండ్రు దేనిని మిక్కుటమయిన (నలఁకువ)గా నెంతురో దానిని శూరుఁడు సాం పునఁ బొందును. మనము స్వర్గమును బడయఁగోరి బ్రాణములను సఁకుసేయక యుద్ధముసేయుదము; జయించినను వధింపఁబడి నను మనము సద్గతిఁబొందుదము' అందురు. ఇట్లు వీరులగువారు శపథముచేసికొని ప్రాణములనెంతమాత్రము లక్ష్యపెట్టక భయ మించుకయులేక శత్రుసేనాసమూహమును జొత్తురు. ముందట వాలును బలకయుం గలమనుష్యులదళము నుంపవలయును. పిఱుందఁదేరులును బండ్లును నుండవలయును. ఈరెంటికినడుమఁ దక్కిన రక్ష్యంబగుసేనయుఁ, బరులను మార్కొని వారించు కొఱకు పదాతులను, నిట్లు నడుమనుంచి మఱుఁగుపఱుపవల యును. ఆసైన్యమందు మిక్కిలి యూఱితేఱిన దిట్టలగువారు

శత్రవఃlతదసహ్యాతిరందుఃఖం మన్యస్తేమరణాదపి' అని దా.మూలము. శత్రువు లాశనిదుఃఖమునకు సంతోషింతురేని యది మరణమునకంటె వానికి దుస్సహ మని తలంతురని యర్థము. ఇది సంగతముగాదు.

* 'జయం' అని బొ. మూలము. 'శ్రియమ్' అని దా.మూలము. ఇది యుప పన్నముగాదు గాన పరిత్యాజ్యము. ప్రతాపచంద్రరాయలును జయమనియె గ్రహించియున్నారు.

† 'యాభీరూణాం పరాఙ్ముఖాన్యుర స్తా మధిగచ్ఛతి' యుద్ధపుఁగట్టను పిఱికివారు గొప్పదిగాఁ దలఁతురుగాని శూరులు దానిని సొంపుగాఁగొని తృణీ కరింతురని భావము.'పరాఖ్యాతిం'అని దా. మూలము. పిఱికివాండ్రఁ బెనుకీర్తిని శూరులు గొందురని యర్థము. పిఱికివాండ్రకు ఖ్యాతిగాని పెనుఖ్యాతిగాని యెక్కడిది?

ముందునిలిచి పోరాడవలయును. వారు తమపిఱుంద నున్నసైని కులను గాపాడుదురు. మంచిబలిమియు ధైర్యమును గలవారుగా నభిమతు లగునట్టివారిని సేనముందఱ నుంపవలయును. తక్కిన జనులు వారిని మున్నిడికొని పిఱుందనుండవలయును. భయపడు వారికిఁ బ్రయత్నపడి యుత్సాహము కలిగింపవలయును. వారిని, సైన్యపుమొత్తమెక్కుడుగా శత్రువులకుఁ జూపుకొఱకుమాత్ర మేని సేనకు సమీపమం దుండునట్లు చేయవలయును. సైని కులు కొందఱే యుండిరేని వారిని దగ్గఱగాఁగూర్చి యుద్ధము చేయింపవలయును. ఒకవేళ సేనాపతి యిష్టపడెనేని, దగ్గఱగాఁ గూర్చినకూర్పును విరివిగానుండునట్లు విస్తరింపఁజేయవచ్చును. ఒక కొందఱుసైనికులు వెక్కండ్రతోఁ బోరాడవలసి వచ్చి నప్పుడు సూచీముఖ మనెడియొడ్డు పన్నవలయును. స్వల్పసైన్యము వెద్దసేనతోఁ బోరాడునపుడు, మొదటిదానిసేనాపతి తమవారు సమానముగాఁ బోరుచున్నను, తక్కువపడుచున్నను, నిజమయి నను, అబద్ధమయినను, చేతులనుబట్టుకొని 'శత్రువులు విఱిగిరి, విఱిగిరి' యని బిగ్గఱఁగూఁపెట్టవలయును. వారియందు మి క్కిలి బలవంతులగువారు 'మనమిత్రబలము వచ్చివేసినది. కొ ట్టుఁడు భయమువల' దని భయంకరములగు చప్పుళ్లుసేయుచు నెదురొక్కని వైపడవలయును. తక్కినవారికి ముందుండువారు సింహనాదములను గిలకిలమను ధ్వనులనుగావించుచు, క్రకచము లను, కొమ్ములను, భేరులను, మృదంగములను, బణవములను, మునుపడఁ జెలంగునట్లు చేయవలయును' అనెను. ఇది నూఱవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు యోధులలక్షణములను జెప్పుట.

ధర్మరాజు 'భారతా! యోధులు యుద్ధమునకుఁ జాలియుండుటకు నెట్టిశీలముగలవారుగా నుండవలయును? వారిపూర్వ్ఞ యెట్టిది గావలయును? వారి రూపములును, సన్నాహములును, శస్త్రములు నెట్లుండవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'ఈవిషయమున యోధులకు వారివారి యాచారములచొప్పున శస్త్రములును వాహనములును విధింపఁబడుచున్నవి.*ఆచారమునుబట్టియేకదా యీలోకమందుఁ బురుషుఁ డాయాకర్మములందుఁ బ్రవర్తించుచున్నాఁడు. గాంధారదేశపువారును, సింధుదేశీయులును సౌవీరదేశపువారును భయములేక మిక్కిలియు బలవంతులై తమ నఖములచేతను, బాహుసములచేతను యుద్ధముచేయుదురు. వారిబలమంతటను దుదముట్టియుండును. ఉశీనరదేశపువారు బలవంతులై సమస్తాయుధములందును నిపుణులై యుందురు. తూర్పుదేశపువారు గజయుద్ధములందుఁ గుశలులై కపటయుద్ధముచేయువారగుదురు. అట్లు యవనులును గాంభోజులును మథురచుట్టునుండువారును గుఱ్ఱపు యుద్ధమందు సమర్థులుగానుందురు. దక్షిణదేశపువారు వాలును బలకయునుగొని యుద్ధముచేయుదురు. మిక్కిలి సత్త్వమును, మిక్కిలి బలమును గలశూరు లన్నియెడలను బుట్టుదురనుట

*'ఆచారాద్ధీపురుష స్తథాకర్మసువర్తతే' అని (దా. మూలము). 'ఆచరణ వీరపురుష స్తథా కర్మసువర్తతే' అని బొ.పాఠము. నీలకంఠపాఠము నిదియే. వీరపురుషులిట్టిసాధనములుగొని యుద్ధకర్మములందువర్తింతురని యర్థము.

ప్రసిద్ధము. అవంతిదేశపువారు మహాశూరులుగా నుందురు. మూళవదేశపునాగు చతురంగములందును మహాశూరులు. వీరలయందొక్కఁడొంటిమెయినుండినను, యుద్ధమందు వేయిమందిని మార్కొనఁగలఁడు. దేశములను బహుతరముగా గుర్తించితిని. ఇఁక శూరులలక్షణములను జెప్పెదవినుము. సింహమును బులియుంబోని కంఠధ్వనియుఁ గన్నుఁగవయుఁగలవారును, సింహమువలెను బులివలెను నడచువారును, పావురాలవలెను బాముల వలెను గన్నులుగలవారందఱును, శూరులును పగవారినిగలంచి నలంపఁజాలునట్టివారునై యుందురు. జింకల యెలుంగువంటి యెలుంగుగలవారును, పులివలెను *ఆఁబోతువలెను గన్నుఁగలవారును, శత్రువులను గలంచి నలంచునట్టివారై మిక్కిలి చుఱుకుదనము గలిగియుందురు. చిఱుగంటలవంటి యెలుంగుగలవారు | పరాకుగలవారును మందులును గోపస్వభావులు నగుదురు. మేఘధ్వనివంటి యెలుఁగుగలవారును గూర్మరములయిన ముఖములుగలవారును ‡ లొట్టియవంటి మొగముగలవారును వంకరయగు కొనముక్కును నాలుకయుఁగలవారును, మిక్కిలియు దూరము చనఁజాలువాఁడును, దూరమునుండియే గుఱిపెట్టి యేయనేర్చినవారునగుదురు. పిల్లివలె గూనుగలవారును కదలిక

---

* 'బుషభాక్షౌ స్థరస్వినౌ' అని మూలము. బుషభాక్షౌ స్థథాపరే' అని దా. మూలము.

† 'ప్రమాదినశ్చ మందాశ్చ' అని జౌ. మూ. 'ప్రమాథినశ్చ మందాశ్చ' అని దా. మూలము.

‡ 'కేచిత్కరభసన్నిభాః' అని జౌ. మూ. 'కేచిచ్చ కలనిస్వనాః' అని దా. మూలము.

లేని కన్నులుగలవారును, కొంచెపాటి వెండ్రుకలును మిక్కిలి పలుచని తోలుగలవారును, వేగముగలవారుగను జంచలచిత్తులుగను దగ్గఱవసింపరాని వారుగను నుందురు. *ఉడుముపలె గన్నులు మొగిడియుండ, మెత్తనిస్వభావమును, గుఱ్ఱమువంటివేగమును గంధర్వనియును గలవారు సకలశత్రువులను గడతేర్ప శక్తులగుదురు. చక్కని మేనికట్టును, జక్కనియవయవములును, నిక్కుగల ఱొమ్మును గలవారును, పగవారి వాద్యధ్వనులు విన్నంతనే సైఁపక కుపితులగువారును, కలహములం దుబ్బి చెలరేఁగువారును, గంభీరములగు కన్నులఁగల గలవారును, వెలికుఱికిన మిడిగ్రుడ్లుగలవారును, పింగళవర్ణములగు కన్నులుగలవారును, బొమముడిపడి యుండు ముఖములుగలవారును, ముంగిసవంటికన్నులు గలవారును, వీరందఱును శూరులై యుద్ధమందు దేహములను విడుచుటకు వెనుదీయకుందురు. వంకరలగు కన్నులుగలవారును వెడలుపయిన నుదురుగలవారును, కండలేని చెక్కిలిపట్లు (హనువులు) గలవారును, †వంకరలగు చేతులును వ్రేళ్లును దొడలునుగలవారును, బక్కపలుచని దేహముగలవారును, నరములం తటఁ దెలియుచున్నవారును, యుద్ధము తటస్థించినపుడు భయము మాలి వేగచొచ్చివత్తురు. వా రేనుంగులవలె మత్తిల్లి, దార

---

* 'గోధానిమిళితాఃʼఅని మూలము. 'గోరానిమిళితాʼఅని దా.మూలము. బంగరువాయయు మొగిచినకన్నులును గలవారు మృదుస్వభావముగలిగి యుండురని యర్థము.

† 'వక్రబాహ్వంగుళీ సక్థాఃʼ అని దా.మూ. 'వ్రజబాహ్వంగుళీ చక్రాఃʼ అని బొ. మూలము. వ్రజములవంటి బాహువులును వ్రేళ్లయందుఁ జక్రముల వంటి గీతలును గలవారని యర్థము.

సింపరాకుందురు. ఎఱ్ఱవాతి ప్రిదిలిన వెండ్రుకలచివరలు గలవారును, బలిసిన ప్రక్కలును నుబ్బి లయినచెక్కిలి పట్టులును ముఖములును గలవారును, నిక్కుగల మూఁపులుగలవారును, బలితంపుఁగుత్తుక గలవారును, భయంకరులును, బలుపుగల పిక్కనూఁసముగలవారును, కృష్ణుని వాసుదేవ మనుగుఱ్ఱమువలెను వినతగన్నపక్షియగు గరుడునివలెను బయికిఁజెంగలించువారును, గుండ్రనితలలును వెడలుపయిన మొగములును గలవారును, పిల్లివంటి ముఖముగలవారును, గఠోరమగు ధ్వనిగలవారును, గోపముగలవారును, యుద్ధమందు బిట్టుగానార్చుచునుంకించువారును, ధర్మముల నెఱుంగనివారును, గర్వితులగువారును, బెట్టిదముగాఁ గనుపట్టువారును, నీరందఱు *నుదగ్రులై తమదేహములను నెంతమాత్రము లక్ష్యపెట్టకయు యుద్ధమునుండి వెనుదీయకయు నుందురు. అట్టిసైనికులను యుద్ధము మొనయం దుంపవలయును. వారెప్పుడును దమశత్రువుల నుఱుమాడుటయేకాక తామును శత్రువులచేఁ జంపఁబడుటకు వెనుదీయ కుందురు. వారు ధార్మికులై వేఱువిధము లయిననడవళ్లు గలిగి తిన్నని మెత్తనిమాట లపజయమునకు లక్షణములని తలంతురు. వారిని మృదువుగా మెలపనిచో రాజువలనను మిక్కిలి కుపితులగుదురు' అనెను. ఇది నూటయొకండవయధ్యాయము

---

* 'ఉదగ్రాః' మూలము 'అంత్యజాః' అనిజె.మూ. చివరపట్టులందు వసించువారని యర్థము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు సేనకుఁగల జయచిహ్నము లును రాజనీతిని జెప్పుట.

ధర్మరాజు 'భరతసత్తమా ! ఒకసేన జయమునొందఁ బోవుటకుఁ బ్రశస్తములగు లక్షణములేవి ? వానినిగూడ నెఱుంగఁ గోరెదను' అని యడిగెను. భీష్ముఁడు 'జయింపఁబోవు సైన్యమునకు నేప్రసిద్ధలక్షణములు గలుగునో వాని నన్నింటిని జెప్పెదను. దేవతలు కోపమునొందినపుడు, మనుష్యులు కాలముచేతఁ బ్రేరితులయినపుడును, విద్వాంసులు జ్ఞానచక్షువులచేతఁ గన్నియుఁ గనుఁగొని స్వాయశ్చిత్తవిధులును,జపహోమములను, మంత్రజపములను గావించి యహితములకు శాంతిగావింతురు. ఏసేనయందు యోధులును వాహనములును మనస్సు తెంపుసొంపుగలిగి యుండునో,దానికిఁదప్పక జయముకలుగును. అట్టిదానికి ననుకూలముగానే వాయువులు వచ్చును. ఇంద్రధనువు లాకాశమునఁ దోఁచును. మేఘములు తమనీడల వారిపయిఁ బొలయించును. సూర్యకిరణములు వారిపయిఁ బ్రసరించును. నక్కలును, గ్రద్దలును వారికి ననుకూలములగు బలములుగలిగి యుండును. ఇవియన్నియు నాసేనకుఁ బొసఁగినపుడు దానికి నుత్తమమయిన సిద్ధి (జయము)గలుగును. అగ్ని ప్రసన్నమయిన కాంతితోడ, కిరణములు పొడవుగాఁ బర్వుచుఁ, బ్రదక్షిణముగాఁ జుట్టివచ్చు జ్వాలలుగలిగి, పొగలేనిదై వెలుంగుచుండును. ఆహుతుల వాసనలెంతయు మంచివిగాను నింపుగాను నుండును. ఇది జయముగలుగుటకు లక్షణముగాఁ జెప్పెదరు.

అట్టియెడ శంఖములును భేరులును గంభీరముగాను బిట్టుగాను శబ్దించును. యుద్ధముసేయ నున్నవారును నడ్డుచెప్పక తమ కముగలవారై యుందురు. ఇదియు జయము కలుగుటకు సూచనముగాఁ జెప్పుదురు. యుద్ధమునకు బయలుదేఱిన వారికిని బోవనున్న వారికిని బిఱుఁదను నెడమప్రక్కను జింకలు మొద లగు మృగములు పోయినచో నది శుభంబగును. యుద్ధమునఁ జంప నుంకించు చున్నవారికుడిప్రక్కఁ బోయినను సిద్ధిగలుగు నందురు. కాని యట్టివారిముందఱఁ బోయెనేని విఘ్నకారు లగును.హంసలును, గొంచపిట్టలును, బెగ్గురులును,పాలపిట్టలును, మంగళకరములగు శబ్దములను గూసినను, యోధులు మనస్సు తెంపును నుబ్బునుగలిగి యుండినను, నిది రాఁగలజయమునకు సూచకమందురు. ఎవరి సైన్యము, శస్త్రములచేతను, యంత్ర ములచేతను, గవచములయు ధ్వజములయు గాంతులచేతను, అందున్న పడుచువీరుల ముఖకాంతులచేతను, దళితళమని మెఱ యుచున్నదై దేఱిచూడరాను దరముగాకుండునో యట్టివారు శత్రువులను గ్రందుసఱుతురు. ఒకరియోధులు పోరాటముచేసి యుపకరింపఁ దలంపుగలిగియు గర్వము లేకయుఁ బరస్పరము చెలికారము పాటించియు, శౌర్యమునవలంబించియు నుండుదేని యది వారికిఁ గలుగనున్న జయమునకు లక్షణమని చెప్పుదురు. మనస్సున కింపయినశబ్దములును సుఖములయిన స్పర్శములును గంధములును గలుగునేని, యోధులను ధైర్యమావేశించునే నియు,నదిరాఁగలజయమునకు ముందుగుఱుతగును.కాకి యుద్ధము నకుఁ బయలుదేఱినవానికి నెడమప్రక్కను యుద్ధమునకుఁబోవ నున్న వానికిఁ గుడిప్రక్కను నున్నచో శుభంబగును. వెనుక

ప్రక్క-నుండినచో కార్యమును * జెఱుపుచున్నది. ముందఱి ప్రక్క-నున్నచో విఘ్నము గావించుచున్నది. యుధిష్ఠిరా! చతురంగములతోఁగూడిన సైన్యమును గూర్చికొన్న పిదపఁ గూడ, నీవు తొలుత సామముతోనే ప్రవర్తింపుము. అది పనలేకపోయెనా పిదప యుద్ధమునకుఁ బ్రయత్నింపుము. యుద్ధము వలనఁ గలుగునట్టి జయ మధమమేయగును. యుద్ధమునందలి జయము యాదృచ్ఛికముగనో దైవముచేతనో గలుగునని విచారింపవలయును. ఒక పెద్దసైన్యము విఱిగి సైనికులు పరువెత్తునపుడు దానిని వారించుట యెంతయును గష్టము. అది మహావేగము గలనదీప్రవాహమువలెను, బెదరిపాఱు మృగసమూహమువలెను నుండును. కొందఱు పాఱుదురు. వారు పాఱెదరనియే, మఱివేఱు కారణములేకయే శక్తినవారును నెంత తెలిసినవారుగా నుండినను విఱిగిపాఱుదురు. ఒక పెద్దసైన్యము మిక్కిలి యుదారు లయినయోధులు గలిగి యుండినను, † రుగువు లనెడిజింకకడుపునకు సాటియే యగును. ఒండొరుల నెంతయు నూఁది, యుబ్బుగలిగి, ప్రాణములను సరకు గొనక, దృఢనిశ్చయు లైనట్టిశూరు లొకప్పు డేఁబదిమందిమాత్రమే యుండినను, తమకంటె మిక్కిలియెక్కుడుమొత్తము గల పర

---

* 'సంఘాతయత్యర్థమ్' అని మూలము. 'సంనాధ యత్యర్థమ్' అని దా. మూలము. వెనుకప్రక్క కాకికూఁత కార్యమునుసాధింపఁ జేయుచున్నదని యర్థము. ముందటిప్రక్క నున్నదిచెఱుపుటచే వెనుకప్రక్క సాధింపఁజేయుట యే సమంజసము.

† ఒకజింక పరువెత్తినచో నది పరుగెత్తినదెసనే తక్కినవియు మఱొకా రణమును లేక పరువెత్తును. కాన యుది యిటఁ బెద్దసేనలకును ననుసంధించునది.

సైన్యమును నుఱుమాడి వైచెదరు. ఏఁబదిమందియే కాదు; ఒకప్పుడు, దృఢనిశ్చయులై కులీనులును బూజితులును నగు శూరులు, ఐదుగురో యార్గురో యేడుగురో యైనను నొండొరులను గుత్తముగాఁ గూడికొని తమకంటె నెక్కువ మొత్తముగల శత్రువులను జయింతురు. ఏవిధమున నయినను వారింప శక్యమైనంతవఱకును యుద్ధమున మాఱుమొగము తలపెట్టరాదు. మొట్టమొదట సామమును దానమును భేదమును ప్రయోగింప వలయును. పీనికిఁ బిదపనే యుద్ధమునకుఁ బూనవలయునందురు. ఒకసేన వచ్చుటఁజూచినంతమాత్రనే, పిఱికివాండ్రను, మండుచున్న పిడుగునుజూచి 'అయ్యో! ఇది యెవరిని బడఁగూల్చునో' యని కూలెట్టునట్లు, భయముపట్టి బాధించుచున్నది. యుద్ధమొకటి రేఁగుచున్నదని తెలియఁగానే యందులకుఁ జేరఁబోవు యోధుల యవయవములును, * జయించుచున్నవాని యవయవములును మిక్కుటముగాఁ జెమర్చుచున్నవి. (యుద్ధముజరుగుచున్న) దేశమంతయు నందలిస్థావరజంగమములతోఁగూడ, మిక్కిలి వ్యథనొందుచున్నది. దేహములమజ్జలాయుధముల వేఁడిమిచేఁ గ్రాగి నొవ్వునఁ గుందుచున్నది. కాఁబట్టి, రాజు, మాటిమాటికి వారలకు సాంత్వవచనములను గటువయినచేఁతలతోఁగలిపి చెప్పుచుండవలయును. (సాంత్వము లోఁదార్చుటకును గటుత్వము వెన్నిచ్చి పాఱకుండుటకును జెప్పఁదగును.) జనులు శత్రువుల చేతఁ బీడింపఁబడుచున్నపుడు వారెల్ల ప్పుడును సంధికి రాఁజూచుచుందురు. శత్రువులకు నంతరంగు లయిన(మిత్రులగు) వారి

* 'విజయస్య' అనిమూలము. 'విషయస్య' అని దా.మూలము. దేశమందలి వారియవయవములని యర్థము.

యందు భేదముపుట్టించుటకుఁ జారులను బుచ్చవలయును. అట్లు భేదము పుట్టించి యాశత్రురాజునకు నవ్వలఁ బలీయుఁడయి యుండు రాజుతో సంధిచేసికొనుట యెంతయు మంచిది. దండెత్తురా జీవిధమునఁ దనశత్రువునకు శత్రువయిన వానితోడఁ గూడికొనుటచే నాశత్రువు నిరుప్రక్కల నుట్టడించి బాధించు నట్లు మఱియొకవిధమున వానిని బాధించుట శక్యముగాదు. ఓరుపు సాధుజనులను బొందును; కాని యెప్పుడు నసాధు జనులను బొందదు. ధర్మరాజా! క్షమకును క్షమలేమికిని (క్రూరత్వమునకును) గల ప్రయోజనములను వినుము. రాజు జయము నొందినపిదప క్షమచూపునేని యతనికీర్తి మిక్కిలియు వర్ధిల్లును; అట్లు క్షమించు గుణముగలవాఁడు మహాపరాధము చేసినప్పటికిని, వానిశత్రువులు సతనియందు నమ్మక ముంతురు. ఒకశత్రువును బీడించి యోర్చి పిదప వానియెడ క్షమనుపాటింపవలయును. ఏలన వంకరయుగు నొక మ్రానికి నగ్నివేడిమిని మొదటఁజూపి దాని వంకను నిడివిగాఁ జూఁగించినచో సది మరలఁ దన యెప్పటి వంక కేవచ్చునని*శంబరుఁడు చెప్పుచున్నాఁడు. అయినను దీని నాచార్యులుకొనియాడరు;ఇదిమంచిదర్శనముగాదు.ఎవనినిగానికన్న బిడ్డలవలె నడంపవలయును.కానివారు 'తండ్రి తనపుత్రునింబోలె రాజు, శత్రువును గోపములేకయు నాశముసేయకయు నడంపవలయు'నందురు.యుధిష్ఠిరా! రాజుగ్రుండగునేని ప్రాణులెల్ల నతనిని ద్వేషించును. మఱియతఁడు మృదువయ్యెనేని యండఱునతని నవమానింతురు.కాఁబట్టి యుగ్రత్వమును మెత్తనయు రెండును

* 'శంబరుఁ' అని మూలము 'శాంబరుఁ' అని దాంమూలము. మాయావిదులు చెప్పుచున్నారని యర్థము.

గలిగియుండవలయును. ప్రహరించుటకు మునుపును, బ్రహరించుచు చున్నపుడును, బ్రియముగాఁ బలుకవలయును. ప్రహరించిన పిదప నందులకు దుఃఖించుచును నేడ్చుచునున్నట్లు తోఁపించి వారియెడఁ గనికరము చూపవలయును. రా జొకఁడైన్యమును గూల్చి హతశేషులయిన వారితో 'నాసైనికు లిందఱను జంపిరని నాకు సంతోషము లేదు! అయ్యో! వీరిని నేను మాటిమాటికి వలదని యెంతచెప్పినను నాయాజ్ఞలను వినరయిరే! అక్కటా! వీరందఱు బ్రతుకుదురా యని యువ్విళ్లూరుచున్నాను! వారి కిట్టినది యెంతమాత్రము తగదు. వారందఱును సత్పురుషులు. యుద్ధములం దెంతమాత్రము పలాయితులుగారు. ఇట్టివా రెంతయు నరుదు. ఈ వీరునియుద్ధమునఁ జంపినవాఁడు, నాకెంతయు నప్రియముచేసినాఁడు' యని యిట్టిమాటలు నోటఁబలుకుచు రాజు దన శత్రుసైనికులను జంపినవీరులను రహస్యమున వారికిఁ దగునట్లు పూజ గావింపవలయును. శత్రుసైనికలనల గాయములుపడిన తనవారి నొప్పులను మానింపఁ జేయుటకై రాజు వారిలను మఱింతఁ గూర్చుకొనుటకును, వారి చేతులను బట్టుకొని ప్రేమమీఱ నేడువను వలయును. రా జిట్లు సకల సందర్భములందు సామమును మున్నిడుకొనియే ప్రవర్తింపవలయును. భయరహితుఁడును ధర్మజ్ఞుండు నగురాజు సమస్త ప్రాణులకును బ్రియుండగును. సకలప్రాణులు తనియం దెంతయు నమ్మిక గలిగియుందురు. అట్లు వారినమ్మికను బడసి యయ్యో కాలములందుఁ దగిన పూనికతోఁగూడి భూమి ననుభవించుటకు సమర్థుఁడగుచున్నాఁడు. కాఁబట్టి మాయనువిడిచి సమస్తభూతములకును దనయందు నమ్మికను గలిగించికొనవలయును. అతఁడు

భూమిని ననుభవింపఁ గోరునేని తన ప్రజలనుండఁబను రక్షింపవలయును' అనెను. ఇది నూటరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు శత్రుజయమునుఁబట్టి యింద్రునకును బృహస్పతికిని జరిగినసంవాదము యుధిష్ఠిరునకుఁ జెప్పుట.

ధర్మరాజు 'పితామహా! మృదు వయినపగవానియెడను, ఉగ్రుఁడయినపగవానియందును, మిక్కిలియు సహాయసంపత్తిగల పగవానియందును, రాజెట్లు వర్తింపవలయునో నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'ధర్మరాజా! ఈవిషయమందును బృహస్పతికిని నింద్రునకును జరిగిన సంవాదమనెడి పురాతనమయిన యీయితిహాసము నుదాహరించెదరు. దేవేంద్రుఁడు బృహస్పతి చెంతకుఁ బోయి మ్రొక్కి యంజలిఘటించి యతనితో 'బ్రహ్మణోత్తమా! నేను బగవారియెడ నెట్లు ప్రాలుమాలక నడచుకొనవలయును? వారిని నాశము సేయక యేయుపాయములచేత నెట్లడంపవలయును? రెండుసేనలును దలపడినపుడు, జయము సాధారణముగాన రెండుపక్షములయం దెవరికేని గలుగవచ్చును; కనుక నందొకపక్షమే గెలుచునని నిశ్చయింపరాదు. నేనేమి చేసినయెడల, నెట్లు ప్రవర్తించినయెడలఁ, బ్రకాశించుచున్న నాయైశ్వర్యము, పగవారిని గ్రాఁచునట్టిది, నన్నుదిగనాడకుండును?' అని యడిగెను. అంత ధర్మార్థకామములందు నిపుణుఁడును రాజధర్మవిధానములఁ దెలిసినవాఁడును మహాబుద్ధినుంతుఁడు నగు బృహస్పతి యింద్రు

నితోఁ ఎప్పుడుగాని విరోధులను గలహముచేత నడంపఁగోరరాదు. కోపమును నోర్పులేమియు బొలురు (అవివేకులు) సేవించునట్టివి. శత్రునివధమును గోరువాఁడు శత్రువును నెచ్చరికగలిగి యుండునట్లు చేయరాదు. కోపమును,భయమును, సంతోషమును,తన లోపలనే యడంచుకొని వైకి విశ్వాసముగలవానివలెనుండియు లోపల విశ్వాసము లేకయే శత్రువు ననువర్తించుచు నుండవలయును. ఎప్పుడును బ్రియముసే పలుకవలయును. అప్రియము నించుకంతయుఁ జేయరాదు. పసలేని వైరములనుండి విరమింపవలయును. కొండెములను వర్జింపవలయును. ఇంద్రా ! పశులను జేత్రాడువైచి పట్టువాఁడు దాను బట్టఁగోరిన పశుల యెలుంగుల వంటి యెలుంగులను గూయుచు నాపిట్టలను వశపఱుచుకొనునట్లు, రాజును జతనంబున శత్రువులను దనవశము చేసికొనవలయును; తనకిష్ట ముండెనా చంపవలయును. పురందరా ! రాజు శత్రువులను గ్రిందుపఱిచిన పిదప నెచ్చరికమాని సుఖముగ నిదురింపరాదు.దుష్టాత్ముఁడగు శత్రువు, కుప్పయందలి యగ్ని యూరకయేయుండి మరలఁ దలయెత్తునట్లు, తాను మేలుకొనియే యుండి తలసూపును. జయమెవ్వరికిఁ గలుగునో తెలియరాకుండునపుడు, యుద్ధముచేయుట దగదు. మహాత్ములను మంత్రాలోచనము తెలిసినవారు నగు మంత్రులతోడంగూడి చక్కఁగా నాలోచించికొని శత్రువును నమ్మించి తనవశము గావించుకొని పిదప * వాని నడంచి పుచ్చవలయును. † ఒకశత్రువు నుపేక్షిం

---

* విశ్వాస్యై వోపసన్నమ్యఃʼ అని దా.మూ. ʻఉపసన్నాస్థాʼ అని ఔ. మూ. శత్రువును వశము చేసికొని కోరినప్రయోజనము పొందవలయుననియర్థము.

† ఉపేక్ష్యమాణోవిజ్ఞాతో హృదయేనాపరాజితః । అథాస్యప్రహరేత్కా-

చి యలక్ష్యపెట్టినచో వాఁడు మనసునం దెంతమాత్రములోను గాక యుపాయములనెఱిఁగి,యట్లుతన్ను పేక్షించినవాఁడుతనకృత్యమునుండి తప్పిదాఁటిన సమయముచూచి పైకొనికొల్లను. * తన కాప్తు లయినపురుషులనుగొని వాఁ డా జయించినరాజు సేనను భేదమూలమునఁ జెఱిపివైచును. † రాజు తనశత్రువు మొదటిని నడుమును దుదిని (అనఁగా నతనినిగుఱించిన సకల విషయములను) దెలిసినవారిని రహస్యముగాఁ బిలిచి విచారింపవలయును. ఆశత్రువుబలములను యథార్థముగాఁగలరూపుదెలిసికొనుచు వానిని,భేదముచేతనునించుకదానములచేతను జెఱిపిపుచ్చనలయును. అట్లైవిషముమొదలయిన యౌషధములను వారికిఁ జేర్పవలయును. రాజెన్నఁడుగాని పగవారితోడికూడికొల్లరాదు. రాజు

లే విధేర్వించలితోయథా అని దా. మూ. 'అవజ్ఞాతః' అనియు, 'కించిద్విచలితే పదే' అనియు జె. పాఠములు. పైని జయింపఁబడినరాజు కర్తగాఁ జెప్పంబడెను. జయించినరాజును కర్తగాఁ గొన్నచో 'అట్లడంచిన శత్రువు హృదయము లోన లొంగక యుండుటను దెలిసికొని యూరకయుండి వాఁడు క్రమమునుండి పొరఁబడిన సమయముచూచి కొట్టవలయును' అని యర్థము చేయవచ్చును. శత్రుజయోపాయఘట్టము గాన యిదియే సమంజసముగా నున్నది.

* 'దండంచ దూషయేదస్య పురుషై రాప్తకారిభిః, అని. మూలము. దీనికి జయింపఁగోరురాజు పరముగా 'ఆశత్రువుయొక్క సేనను ఆప్తులగు పురుషులచే భేదముగల్పించి చెఱుపవలయును' ఇదియే ప్రాకరణికమైన యర్థము.

† 'ఆదిమధ్యావసానజ్ఞాన్ ప్రచ్ఛన్నంచ విచారయేత్' అని దా. మూలము ఆదిమధ్యావసానజ్ఞాః ప్రచ్ఛన్నంచ విదారయేత్' అని జె మూలము. రాజా! శత్రువు మొదలు నడుమ తుదలనుదెలిసి రహస్యముగా వానియందు విరోధము గలిగి యుండవలయునని ప్రతాపరుద్రరాయలు.

చాలఁగాల మెదురుచూచుచుండి తుదకు వారి నడంచియే తీఱవలయును. శచీపతీ! * కాలము నెదురుచూచుచు నెచ్చరికతోడ వారిని నారాధించుచుండవలయును. వారికి నమ్మికగలుగునట్లు ప్రియములు పలుకుచుండవలయును. తోడనే పగవారిని జంపరాదు. †జయము నిశ్చయముగాఁ గలుగుటను గనుఁగొని పిదప వారిపైఁ బడవలయు. అట్లు సేయనిచో మరల నదిహృదయమునకు శల్యము గలిగించును; మరలఁ గ్రొత్తగంట్లు గావించును. సమయము రాఁగాఁ దోడనే కొట్టవలయును. దేవేంద్రా! అట్టికాలము మరలఁ బగవారిని జంపఁదలఁచినపుడు రాదు. పగవారిని జంపఁ దివురు పురుషుఁ డిట్లు వారియెడల నడచుకొనవలయును. కాలము తన్నెదురుచూచుచున్నపురుషుని నొకసారి కడచిపోయెనేని, వాఁడు కార్యము చేయఁగోరినపు డది మరలి వచ్చుట యరుదు. రాజు సాధువుల సమ్మతిని గయికొని, శత్రువుబలిమి పర్వకుండు

---

* 'కాలకాంక్షీచ యుక్తస్సన్నుపాసీతశచీపతే। తథాప్రియంచ ఏకృష్ణం యథావిస్రంభమాప్నుయాత్' అని దా.మూలము.'కాలకాంక్షీహి కుపయేద్యథా విస్రంభ మాప్నుయుఃʼ అని పైరెంటికి నొకపాదమే బొ.మూలమునఁ గానఁబడుచున్నది.

† 'న సద్యోరీ న్నిహన్యాచ్చ ప్రహృష్టస్యో విజయోద్ధుపఃయశ్శల్యం ఘటయతి నవం చకురుతే వ్రణమ్'అని దా.మూలము.'నసంహూ్ష్ వినిహన్యాచ్చ...। నశల్యం వా ఘటయతి నవాచాకురుతే వ్రణమ్' అని బొ. మూలము. రాజు శత్రుసేనలందు పెనుమొత్తములను జంపరాదు. అయినను తనకు యుద్ధము దిర మగునంతవఱకును జూచుకొనవచ్చును. శత్రువునకు మనస్సున శల్యముగా నుండునట్టి చెడుగు సేయరాదు. మఱిమాటలచేతను మనసు పుండుచేయరాదు. (అని ప్రతాపచంద్రరాయలు).

నట్లుమాత్ర మడంపవలయును. * అకాలమందు తనకృత్యము లను సాధించుకొనఁ జూడరాదు. కాలము సమీపించి యున్న పుడు శత్రువును బీడింపరాదు. కామమును గోపమును నహంకా రమును దిగవిడిచి రాజెచ్చరికగలిగి యెపుడును మాటికి శత్రువు నందలి చిద్రములను వెదకుచుండవలయును. మృదువుగానుం డుటయు, బెట్టిదముగా దండించుటయు, అలసత్వమును, ఏమఱి పాటును, శత్రువులు లెస్సగాఁ బన్నువంచనలును, మూఢుఁడగు రాజును నాశముసేయును. ఏరా జీనాలుగును దొలఁగఁబుచ్చి శత్రువుల వంచకపుఁబన్నుగడలకుఁ బ్రతిచెసివారించునో యత డేసం దేహమును లేక శత్రువులను గొట్ట శక్తుఁడగును.ఒకరహస్య కార్యమునకు నొక్కమంత్రియె చేయ శక్తుఁడగునేని దానినిఁ గుఱించి యాయొక్కనితోనే యాలోచింపవలయును. వెక్కుం డ్రు మంత్రులతో నాలోచించినయెడల వారు దాని నొండొరుల పయి మోపఁ జూచుటయేకాక రహస్యమగు దానిని వెలువడు నట్లును గావింతురు. ఒకరితోడ నాలోచించుట యుక్తముగా కుండినచో రాజు తక్కినవారితోడను గూడి యాలోచింపవల యును శత్రువులు గానరాకుండినపుడు బ్రహ్మదండమును (బురో హితాదుల మూలమున నభిచారాదులను లేక దైవకృత దండ

---

* 'ఓజశ్చవినయే దైవ సంగృహ్ణన్నాధు సమ్మతమ్। అకాలేసాధయేత్కృత్యం నచప్రాప్తే ప్రపీడయేత్' అని బౌ. మూలము. 'ఔజస్యం జనయేద్దైవ... కాలేన సాధయేత్కృత్య మప్రాప్తో నహిపీడయేత్' అని (దా. మూ.) సాధువు లకు సమ్మతమగురీతిని బలమును గలిగించుకొనవలయును. కాలమందుఁ గార్య మును సాధించుకొనవలయును. కాలమును బొందక శత్రువును బీడింపరాదు. అని యర్థము. ఇది క్రిందటి యర్థమంత ప్రాకరణికముగాదు.

మును) వారు కనఁబడినపుడు చతురంగములతోఁ గూడిన సేనను బ్రయోగింపవలయును. అట్లు మొదట భేదమును సామమును బ్రయోగింపవలయును. ఆయాయుపాయమునకుఁ దగిన యా యాకాలము వచ్చినపుడు రా జాయాయుపాయమును బ్రయోగింపవలయును. శత్రువు బలవంతుఁడుగా నుండెనేని సమయము వచ్చినపుడు రాజు వారికినమస్కరింపను వలయును. మఱియుఁ దా నెంతయు డేమఱకుండి పగవాఁ డేమఱియుండునపుడు వాని వధింపఁ జూడవలయును. మొక్కుటచేతను, దానముచేతను, దియ్యని పలుకులతోడను మాటలాడుచుఁ బగవానిని ననుసరించి యుండవలయును. ఒక స్పడును వానికి సందేహము గలుగునట్లు చేయరాదు. శంకకుఁ బట్టయినవాని నెల్లను, శంకాస్పదులయినవారి నందఱను నెప్పుడును వర్జింపవలయును. రాజు తాను గ్రిందుపఱిచిన శత్రువులను నమ్మియుండరాదు. క్రిందు పఱుపఁబడినవారు కీడుసేయుటకు జాగరూకులై యే యుందురు. (శత్రువులకుఁ దనయెడలసందేహము గలుగకుండునట్లు వారినాశ్రయింపవలను గాదు. దీనికంటెదుష్కరమయినకార్యము వేఱొక్కటియులేదనుమా*నడవడియొకరీతిగాక నానావిధములనుండువారి యైశ్వర్యమువలెనే స్వభావమొకరీతిగాక నానావిధములనుండువారి నడవడియుఁ దిరముగానుండదని చెప్పఁబడుచున్నది.† రాజు మిత్రుఁడమిత్రుఁడని విచారింపకయుపాయము నూఁది ప్రయత్నింపవలయును. రాజు మృదువుగా నుండినచోఁ బ్రజలవమానింతురు.

* తథా వివిధశీలానా మషిసంభవ ఉచ్యతే' అని దా. మూలము. 'వివిధనానానామపి' అని పాఠాంతరము.

† ప్రయుక్తేష్వేగమాస్థాయ మిత్రామిత్రా నధారయేత్' అని దా. మూ

వేండ్రముగా నుండినచోఁ బ్రజలు వడంకుదురు. నీవు కేవలము క్రూరుఁడవుగాఁగాని కేవలము మృదువుగాఁగాని యుండకుము. వేండ్రమునను మృదువుగను నుండుము.అంతటను జలములునిండినదై యురవడిగాఁ బొయుచున్న ప్రవాహముచే గట్టు దెగిపోవున నుభయమెప్పుడు నుండునట్లు,పరాకుగలిగిపొరఁబడుచుండుటచేత రాజ్యమునకు నాశముగలుగునని భయనుండును.ఒక్కసమయ మందే పెక్కండ్రు శత్రువులను ముట్టడింపకుము. పురందరా! వీరలం దొక్కొక్కని, సామముచేతను దానముచేతను భేదము చేతను దండముచేతను జక్కఁగా నలంచి కలంపవలయును. మిగిలినవారియెడ (కొందఱగుటంజేసి) తనసామర్థ్యము చొప్పున నడచుకొనవచ్చును. బుద్ధిమంతుఁడగు రాజు తాను శక్తుఁడై యుండినను శత్రునుల నందఱను నొక్కపెట్ట నడంపఁ జూడరాదు. రాజు రథగజతురగపదాతులు గలదియు, యంత్రనుల తోఁ గూడినదియు, నిట్లాంగములు గలదియుఁ, దనయందు రక్తిగలదియు నగుచెద్దసేన గలిగియుండునపుడును, దన్ను శత్రునులతోఁ జక్కఁగాఁ బోల్చిచూడఁగా ననేకవిధములఁ దానెక్కుడుగా నుండునట్లు తలఁచునపుడును, దానుముందు వెనుక విచారించి బాహిరముగాఁ బైపడి కొట్టవలయును. శత్రుఁడు బలవంతుఁడుగా నుండెనేని సామము దగదు. రహస్యముగు దండోపాయమే యెప్పును. శత్రునులయెడ మృదువుగా నుండుటయుఁ బలుమాఱు దండెత్తిపోవుటయుఁ దగదు. సలనఁగా దాని వలనఁ గలుగు పంటలనాశమును, విషము మొదలగువానిని

లము. 'యతతేయోగ మాస్థాయ మిత్రామిత్రం విచారయేత్' (భా. మూ. రాజు లుపాయమునూఁది మిత్రుని నమిత్రుని విచారించి తెలిసికొనవలయు.

బావులు మున్నగు వానియందుఁ గలుపుటయు, మాటిమాటికి సమాత్యుఁడు మొదలయిన ప్రకృతులను గుఱించిన విచారణయు, లేకుండును; రా జిట్టి సమయములందుఁ బలువిధములయిన మాయలను, శత్రువులకు భేదము పుట్టించుటకై పలుతంత్రములను, వెక్కువిధములయిన కపటవధములను, జేయింపవలయును. తన చేతలవలనఁ గీర్తి గొఱవడకుండునట్లు చేయవలయును. ఆప్తులగుమనుష్యులను గొని పట్టనములందును దేశములందును శత్రువులపోకలు తెలియు చుండవలయును. బలవృత్ర సంహారకా! రాజు శత్రుపుల వెంటనంటి, వారిపురములందుఁ జొచ్చి యందలి భోగ్యవస్తువుల నన్నింటిని గయికొనుచుఁ బట్టనములందును విధ్యుక్తముగా నీతివిధుల నేర్పఱచుచున్నారు. మఱియు వారికి గూఢముగా దానములుచేసి, వారి భోగములెల్ల బాహిరముగాఁ బెఱికికొని వారిని బిట్టుగాఁ గారింపక, వారందఱను దుష్టులనియు వారిదోషములచేతనే యిట్లనుభవించెదరనియుఁ బ్రకటించి వారివలనఁ గొన్నపట్టనములందును రాజ్యములందును దమయధికారుల నియమింతురు. అట్టిసమయమునఁ నే వారు తమపట్టనములందు, శాస్త్రవిదులును జక్కఁగా నలంకృతులును శాస్త్రవిధానమందుఁ బ్రసిద్ధులును విద్యలయందు లెస్సఁగా గడిదేఱినవారును, భాష్యములను జెప్పుటయందు బండితులు నగు నితరపురుషులచేత, శత్రువులను జంపునట్టి కృత్యనారాధింపవలయును' అనెను.

ఇంద్రుఁడు, 'బ్రాహ్మణోత్తమా! దుష్టుని లక్షణములేవియగును? దుష్టునిన్నెట్లు తెలియనగునో యడిగెదనుజెప్పుము' అనెను. అందులకు బృహస్పతి 'దుష్టుఁడు, మఱుఁగున నొకరిపయిని దోష

ములను జెప్పును. మంచిగుణములకు నసూయపడును. తనముం గలఁ బరులగుణములు పొగడఁబడినపుడు వెడమొగము పెట్టికొని మిన్నకుండును. * కారణము లేకయే మాటలాడ కుండుటంబట్టి యుఁ దెలిసికొనవచ్చును. నిట్టూర్పు విడుచుటయు, వెదవికొఱు కుటయు, తల పంకించుటయు నుండును. అట్టివాఁడు మాటిమా టికిఁగలసి(తప్పులువెట్టుటకై లేనిపోని విషయములె త్తి)యసంబద్ధ ముగాఁ బలుకుచుండును. అట్టివాఁడు తా నొకరికిఁ బ్రతినచేసిన దాని నతినిదృష్టి తనపయిఁ బొలయకుండునపుడు, చేసితీర్చఁడు. ఆ మనుష్యునిచూపు పయిఁబడినా, యాదుష్టుఁడు ప్రతిజ్ఞచేసినవిష యమున బ్రస్తావమునకును దేకుండును; వాఁడు తానొంటిగనే కుడుచునుగాని యితరులపొత్తునఁ దినఁడు; ఆయన్నమునుజూచి 'నేఁటి కిది తగినరీతిగా లే'దని తప్పులు వెదకును. కూర్చుండు నపుడును, బరుండునపుడును, బోవునపుడును, వాని భావములు విశేషించి చూపట్టుచుండును. ఆ ర్తికిలిగినపు డా ర్తిపడుటయు, సంతోషముగలిగినపుడు సంతోషించుటయు, మిత్రునిలక్షణము. దీనికి విరుద్ధమయినదేదయో యదియే శత్రులక్షణమని తెలియ వలయును. దేవాధిప ! వీనినినేఁ జెప్పినట్లు మనస్సునఁ దెలియు ము. దుష్టులను దెలుపునట్టి లక్షణముల నిట్లు నీకుఁ జెప్పితిని. శాస్త్రములందలి తత్త్వములను విని యట్లే నడచుకొనుము' అనెను.

భీష్ముఁడు 'బృహస్పతిచెప్పినదివిని, శత్రువులనుమాడుటయం దాసక్తుఁడయిన యింద్రుఁడు తప్పక యట్లు యాచరించెను. జయ

---

* 'ఊరక మాటాడకున్న మాత్రమున దుష్టత్వమునకు లక్షణముగాదు' అని ప్రతాపచంద్రరాయలు; కాని, దీనికుపపత్తి మూలమందుఁ గానరాదు.

మునకైపూని, యూపగవారిని జంపు బలియుఁడు, అందులకుఁ గాల
ముకాఁగా, ఉపదిష్టము లయినవాని చొప్పుననే నడచుకొని తన
శత్రువులను వశగతులు గావించుకొనెను' అని చెప్పెను. ఇది
నూటమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

రాజ్యాదులను భోఁగొట్టు కొన్నవాఁడును ధర్మా
త్ముఁడునగు రాజు వృత్తియెపగు వానిని గుఱించి
కాసల్యకాలకవృక్షీయ సంవాదమును జెప్పుట.

ధర్మరాజు 'ధార్మికుఁడయినరాజు, అమాత్యులచేత మిక్కి
లియు బాధితుఁడై బొక్కసమును సైన్యమును దనకు లోనుగా
కయు, ధనమును లేకయు నుండునేని, సుఖమును బడయుటకెట్లు
డొట్లు నడచుకొనవలయును' అని యడిగెను.

అందులకు భీష్ముఁడు—'ఈవిషయమై శ్రేమదర్శినిగుఱించి
యీ యితిహాసము చెప్పఁబడుచున్నది. అది నీకుఁ జెప్పెదను.
తెలిసికొనుము. మున్నొకకాలమున శ్రేమదర్శి యనునొకరాజ
కుమారుఁడు బలముగుండినవాఁడై కాలకవృక్షీయుఁడను ముని
యొద్దకు వచ్చెనని మాకు వినికి గలదు. అతఁడామునికి నమస్క
రించి 'మహాత్మా! మిక్కిలియు బెట్టిదమయిన యాపదయందుఁ
దగులుపడితిని. నేను ధనమునకెంతయుఁ దగుదును. మాటిమాటికి
నెన్నిపాట్లుపడినను రాజ్యము నాకు లభించినదిగాదు. ఇట్టి నను
బోఁటివానికి మరణమును, దొంగతనమును, పరులనాశ్రయించు
టయు, మఱియుఁ దక్కినక్షుద్రము లయినయాచారములును

దక్క వేఱేమిచేయవచ్చును? దానిని నాకుఁ జెప్పుము. మనసు తెవులుచేతను దేహవ్యాధులచేతను బాధపడుచున్న మనుష్యునకుఁ, బెక్కు చదువులుచదివి ప్రజ్ఞయం దాతీఁతేఱియున్న నిను బోఁటివాఁడే శరణమగును. మనుష్యుఁడు విషయభోగములందు విరక్తినొంది ప్రీతిని శోకమును దిగవిడిచి జ్ఞానమనెడి ధనమును బొంది సుఖముగా వర్ధిలుచున్నాఁడు. ఎవరికి సుఖము ధనము నాశ్రయించియుండునో (అనఁగా ఎవరు ధనమువలననే సుఖమును బడయువారగుదురో) వారినిగుఱించి దుఃఖించుచున్నాను. నాతో బెక్కులు ధనములు స్వప్నములందుఁ బొందినవియుంబోలె నాశమునొందినవి. గొప్పధనరాసుల నొకరు దిగవిడిచిరేని, ఔరా ! వారెంతో దుష్కర మయినకార్యమును జేసినట్లే సుమీ ! మేమో లేకదూలునట్టి యీధనములనుగూడ దిగవిడుచుటకుఁ జాలకున్నారము. బ్రాహ్మణోత్తమా ! ఇట్టియవస్థను బొంది దీనుండై సంపదను దిగనాడి దుఃఖించుచున్న నాకు నిందు వేఱేమిసుఖముగలదు ? దాని నుపదేశింపవలయును' అని యడిగెను.

బుద్ధిమంతుఁడగు నారాజకుమారుఁ డట్లడుగఁగా మహాతేజుం డాకాలకవృక్షీయుఁ డతనితో 'నీకు మునుపే యిది తెలిసియున్నది. కాఁబట్టి 'నేను' 'నాది' యనెడి యిదియంతయును నిత్యనుఁ గాదనెడియీబుద్ధి యుండవలయును. ఎద్దానిని గలదని తలంతువో యదియంతయు నిజమునకు లేదని యెఱుంగుము. ఇట్టి యెఱుకగలవాఁ డెట్టికష్ట మయినయాపదఁ బొందిననుదుఃఖమునొందఁడు. జరిగినదియు జరుగనున్నదియు నెట్టియులేదనుట నిజము. నీ విట్లు తెలియవలసినదానిని దెలియుడువేని వ్యాస

నములనుండి విడివడుదుఫు. * మునుపటినారు గడించినవియు, వారికిఁ బిమ్మటివారు గడించినవియు నన్నియు నశించినవి గాని యిపుడు న్నవిగావు.ఇది తెలిసినచో నెవఁడు తుందుడుకుపడును. ఈలోక, ముండియు లేనట్టిదగును. లేకుండియు నున్నది యగును. శోకించుటవలన సాధించునదేదియులేదు. † కాఁబట్టి యేవిధము నను శోకింపరాదు. రాజా ! ఇపుడు నీతండ్రియెక్కడ ? నీతాత యేఁడీ ! నీవు వారి నిపుడు చూడవు.వారును నిన్నిపుడు చూడరు. శరీరమిట్లు సతముగాదని దీనిచే నీకుఁ దెలియుచుండఁగా నీవు వారినిగుఱించి యేలదుఃఖపడెదవు ? బుద్ధిచేత నాలోచింపుము. నిలుకడగా నుండున దొకటియులేదు రాజా ! నేనును నీవును నీసుహృదులును శత్రువులును నవశ్యము లేకుండనే పోవుదుము. అన్నియు లేకపోవును. ఇప్పుడిరువది యేండ్లును ముప్పది యేండ్లును గల మనుష్యులందఱును నూఱేండ్లకులోపలనే చావఁగలరు. పురుషుఁడు తన పెనుధనములను విడువ నిచ్చగింపకపోయినను బోవుగాక. 'ఇదినాది కాదు' అని ‡ తలఁచి యందువలనఁ దనకు

---

* 'యచ్చపూర్వం సమూహాశే యచ్చపూర్వంపరేపశే। సర్వం తిన్నాస్తితే చైవ' అనిజౌ.మూలము. 'యేచపూర్వసమారమ్భా యేచ పూర్వతరేపశే। సర్వం నాస్తీతితే చైవ' అని దాక్షిణాత్యమూలము. మునుపటవారి పూనికలును వారి కంటె మునుపటివారివియు, బిమ్మటివారివియు, మఱి నీయవియు లే వనియే తెలియపలయును. ఇది తెలిసినపిదప నెవఁడు దుఃఖపడును' అని యర్థము.ఇది యే సమంజసముగానున్నది.

† శోకమ్యాత్మ-థంచన' అని మూలము. 'శోచేత సకథంనరః' అని దా. మూలము. అది తెలిసినమనుష్యుఁడు శోకించుటయెట్లు ? అనియర్థము.

‡ అనఁగా ఆవిత్తము తనకొఱకుఁగాక తనసుహృదులు మొదలగువారి

మంచి గావించుకొనవలయును. తనకు రాగల వస్తువును 'నాది కా'దని తెలియవలయును. కడచిపోయినదానిని 'నాదికా' దని తెలియవలయును. దైవము బలీయమని తలంపవలయును. ఇట్లు నడుచువాడే పండితులు. ఇట్లు తలంచుటయే సత్పురుషుల స్థితియందురు. వెక్కండ్లు బుద్ధియందును బౌరుషమందును సంపన్నులగువారు గలరు. అందుగొందఱు నీకు సమానులు నను, గొందఱు నీకంటె నధికులుగను నున్నారు. వారు ధనహీనులై యుండినను రాజ్యమేలక పోయినను బ్రతికియెయున్నారు. వారు నీవలె శోకించుచుండలేదు. కాబట్టి నీవును శోకింపకుము. నీవుబుద్ధియందును బౌరుషమందును వారికంటె నెక్కుడుగానా? లేదా సమానుడేని కావా?' యనెను.

రాజు 'బ్రాహ్మణోత్తమా! ఆరాజ్యమంతయు నేప్రయత్న మునులేక యలవోకగా లభించినదని తలంచుచున్నాను. బలీయమయిన కాలము దానినంతయు నపహరించికొని పోయినది. తపోధనా! ఆరాజ్యమంతయుఁ బ్రవాహముచేతఁబోలే గాల ముచేతఁ గొట్టువడిపోవుటకు, నేనిపుడు దొరకినదానితోఁ గడుపు పోషించుకొనుచుండుట ఫలముగాఁ జూపట్టుచున్నది' అనెను.

అందులకు ముని 'కోసలాధిపతీ! (జీవయాత్రయందు) యథార్థమైనది యని నిశ్చయించుకొని రానున్నదానిని గుఱించియుఁ గడచిపోయినదానిని గుఱించియు శోకింపకుండవలయును. సమస్త విషయములందును నట్లె యుండుము. పడయఁగూడినవానినే కోరుచుఁ, బడయరానివాని నొకప్పుడునుగోరక, యిప్పటికిఁ గలిగి

కొఱకి చ్యుతిబడినదని తలంపనలయును. దానిచే నతనికి దానమునందు దభీరుచి కలిగి శ్రేయస్సు సిద్ధించునని యాశయము.

యుండువాని ననుభవించుచుఁ, గలుగకున్నవానికి శోకింపకుండుము. కౌసల్యా! అట్లుండువేని, తనుదాన దొరకిన మంచివస్తువుల తోనే సంతోషపడుచుండఁగలవు. నీకు సంపదపోయినను, దానికి శోకింపక శుద్ధమయినస్వభావము గలిగియుండును. చెడ్డబుద్ధిగల వాఁడు తాను మొదట ననుభవించినభోగ్యములు నశింపఁగా భోగములు పోయినందులకుఁగాను ధాత నెప్పుడును నిందించుచుండును. దొరకినవానితోఁ దుష్టినొందఁడు. అట్టివాఁడు తక్కిన వారెంత యసగ్గులుగా నుండినను, వారిని శ్రీమంతులని తలఁచుచున్నాఁడు. ఈకారణమునుబట్టి యీర్ష్యయు, నహంకారమును గలిగి తమ్ముఁ దామే పుణ్యశ్లోకులుగాఁ దలఁచుకొనునట్టి వారు మఱింతదుఃఖము ననుభవించుచున్నారు. రాజా! ప్రాజ్ఞుండవు. నీ కట్టిమచ్చరము లేదుగదే! నీకు సంపద లేకపోయినను నితరులసంపదకు సైఁచియుండుము. మచ్చరము మాన నేర్చిన నిపుణులగువారు పరులయందున్న సంపదనుగూర్చి ననుభవింపఁ జాలుచున్నారు. ఇతఁగులను ద్వేషించువానియందు సంపదయుండియునుదొలఁగిపోవును. ధర్మచారులును*త్యాగధర్మములనుదెలిసినవారునగు ప్రాజ్ఞులు సంపదను బుత్రులను బౌత్రులను దమంతటఁదాఁజింతురు.(స్వాయంభువకులమునం దుదయించినపుణ్యుఁడు భరతుఁడు, నానారత్నములు నెరసినపెనురాజ్యమును విడిచెనని వినికి. అట్లె తక్కినరాజులును, మహాభ్యుదయసంపన్న మయిన రాజ్యమును విడిచియున్నారు. అట్లారాజులందఱును రాజ్యము

---

* 'త్యాగధర్మవిదః' అని దా. మూలము. 'యోగధర్మవిదః' అని బొ. మూలము. యోగము పుత్రపౌత్రాదివిరక్తికి సాధకమయినను నిచట తత్త్యాగము ప్రస్తుతముగాన 'త్యాగధర్మవిదః' అనుపాఠమే సరసము.

లను విడిచి యరణ్యములకుంబోయి యందలి ఫలములును భుజించుచుఁ దపంబుపారంబునొందిరి.) అట్లె మఱియుఁ గొంద ఱంకలివన్నుపులు వెక్కుఁలు, ఉడుగక సనిచేయుచు సాధింపవలసినదిగా నుండుటంబట్టియు యెంతయు నస్థిరములుగా నుండుటనుజూచియు, నవి మిక్కిలియు దుర్లభములని తలఁచి వానిని ద్యజించుచున్నారు. నీవు మిక్కిలి ప్రాజ్ఞుఁడవు. ఇట్లుండియుఁ గోరఁదగినవియుఁ బరాధీనములయినవియు నస్థిరములునగు ధనములను గోరుచు నేలదీనముగాఁ బరితపించుచున్నావు ? * నేనుజెప్పినబుద్ధిని జక్కఁగానెఱిఁగి నీయంతటనే వీనిని బరిత్యజింపుము. అనర్థము లగరూపములుగను, అర్థము లనర్థరూపములుగను దోఁచుచున్నవి. కొందఱు ధనమును గడింపఁబోగా ధననాశము గలుగుచున్నవి.† మఱికొంద ఱాసుఖము ననిత్యముగాఁదలఁచి సంపదను బడయఁగోరుదురు. వేఱుకొంద ఱుసంపదయందుఁ గ్రీడించుచు నంతకంటె నెక్కుఁడు లేదని తలఁతురు. ‡ అందులకై వాఁడు పాటుపడుచుండఁగా దానివలన వాని

---

* 'తాం బుద్ధి మనువిజ్ఞాయ త్వ్ మే వై తాంపరిత్యజ' అని దా.మూలము. 'తాం బుద్ధి సుపజిజ్ఞాసు స్త్వ మేవై తాక్ పరిత్యజ' అని బౌ.మూలము. 'నీవు(ధనములన్నియుఁ బోయినను సుఖమును బడయునట్టి) బుద్ధిని తెలియఁగోరెదవు. వీనినెల్ల (కామవిషయాములనెల్ల) దిగవిడువుము. అదియే యాబుద్ధి'యని (ప్రతాపచంద్రరాయులు)

† 'అనిత్యం తత్సుఖం మత్వా శ్రియమన్యేన లిప్సతే' అని మూలము. 'అనంత్యం తత్సుఖం మత్వాశ్రీ యమన్యః పరీప్సతి' అని బౌ.మూలము. మఱికొంద ఱాసంపద యనంతసుఖమునకు మూలమని తలఁచి దానిని బడయఁగోరుదురని యర్థము.

‡ 'తథా తస్యేహమానస్య సమారంభో వినశ్యతి' అని బౌ. మూలము. 'సంరంభోఽపివినశ్యతి' అని దా.మూలము.

తక్కిన పూనికలంతయు నశించుచున్నవి. కౌసల్యా! ఒకడు తానెంతో కష్టపడి కోరినచొప్పునఁ బడసినధనమును బోఁగొట్టు కొనునేని యపుడు వాఁడు తనపాటంతయు భంగము నొందినందులకు ధనమువలనియాస లన్నియు దిగవిడుచును. ధర్మాత్ములును గులీనులునగు కొందఱు ధర్మమును బడయుటకే ప్రయత్నింతురు. వీరు పరలోకసుఖమునె కోరుచు నిహలోకపు సుఖములన్నిటను విరక్తులగుదురు. మఱికొందఱు మనుష్యులు, ధనమువలని పేరాసఁ బట్టి ప్రాణములను దిగవిడుతురు. వీరు ధనములేనిచో జీవితము వలన నెంతమాత్రమును బసలేదని తలంతురు. అక్కటా! వీరి దీనతచూడుము! వీరిబుద్ధి లేమిని జూడుము! జీవితము నిలుకడ లేనిదిగానుండఁగా, నిది తెలియక ధనమువలని తృష్ణకుఁ బొలగుచున్నారు. కూర్చుటకు నాశము కడపలగా నుండఁగా, జీవితము నకు మరణము తుదిగానుండఁగా, కూడికకు నెడఁబాటు ముగింపుగా నుండఁగా, వీనియందు మన సెవఁడుంచును? రాజా! పురుషుఁడు ధనమునో, లేకధనము పురుషునో, తప్పక విడుచుట నిజము. అది తెలిసినవాఁ డెవఁడు కొందలపడును? ఇంకను గొందఱకు ధనములును సుహృదులును నశింతురు. రాజా! బుద్ధిం గొని చూడుము; మనుష్యులకు గలుగునాపదలు వారినడవడికిఁ దగున ట్లుండుటను జూడుము. కాఁబట్టి (యాపదలకు బరిహారముగా) నింద్రియములను మనస్సును వాక్కునడంచిపుచ్చుము. ఇవి బలహీనములై యహితములగునేని వీని దొసఁగులునుండి యెవ్వఁడును దన్ను వారించుకొనలేఁడు. *కడచిపోయినవానినిదెలి

* 'ప్రాప్తిసృష్టేషు భావేషు వ్యపకృష్టేష్వసంభవే। ప్రజ్ఞానతృప్తో విద్వాన్నస్వద్విధోనానుశోచతి' అని మూలము. ఇందర్థము క్లిష్టముగా నున్నది.

యుటకును, రాఁగలవానిని గనుఁగొనుటకును శక్యముగానందునఁ బ్రజ్ఞానముచేతనే తృప్తినొందియుండు నినుబోఁటిపరాక్రమశాలి కూడికకును నెడఁబాటునకును దుఃఖమునొందఁడు. అట్లుమృదుప్రకృతిగలిగి దాంతుఁడై మంచినిలుకడగలిగి, బ్రహ్మచర్యమాచరించుచుండునినుబోఁటివాఁడుచాపలము లేకదొరికినమట్టునకుస్వల్పమునే కోరుచుండునుగాన ముదమునొందఁడు. దుష్టపురుషులకుచితమైనదియు, దుఃఖయుక్తమయినదియు, మిక్కిలిపాపాత్మకమును, గూర్చి వృత్తిగలదియు వంచకులసంబంధించినదియు నగు కాపాలికవృత్తి (పునుకలో బిచ్చమెత్తుబ్రతుకు) నీకెంతమాత్రముతగదు. వాక్కును మనస్సును నడంచి సమస్తభూతములందును దయగలిగి మహారణ్యమందు నొంటిమెయి ఫలమూలములను దినుచునేని సుఖంబుండును. బండికాఁడులంబోని దంతెములుగల యేనుఁగులతోఁగూడ నడవియందు సుఖంబుండుటయు, స్వల్పముచేతను సంతోషించుటయుఁ, బండితునకు సహ్యమయినది. ఒకపెద్ద మడుఁగు మిక్కిలియుఁ గలగుండునొండెనేని, తానే తనంతటఁ దేటపడును; అట్లె మంచిప్రజ్ఞ నొందినవాఁడు కలతనొండెనేని తనంతటనే ప్రసన్నతనొందుచున్నాఁడు. రాజా! నినుబోఁటి స్థితిని బొందినవాఁ డీవిధమునను సుఖముగానుండవచ్చునని నాకుఁ

'ప్రతికృష్టేషు భాగ్యేషు వ్యపకృష్టేషు సంభవే। ప్రజ్ఞా ..' అనియుఁబాఠము గలదు. భాగ్యములు వచ్చినపుడును దొలఁగిపోయినపుడును బ్రజ్ఞానతృప్తుఁడును బరాక్రమశాలియునగు నినుబోఁటివాఁడు దుఃఖమునొందఁడని యర్థము. మఱి యొక్కరు పూర్వపాఠమునకు 'తొలఁగియున్న వస్తువులను జూచుట యెవ్వరికిని శక్యముగాదని తెలిసియుండఁ బ్రజ్ఞానతృప్తుఁడు ..' అని యర్థము చేసియున్నారు.

దోచుచున్నది. నీకు సంపద మరల దొరకరాకుండఁగా, మంత్రులు మొదలయినవారును లేకుండఁగా, నిట్టిదారియే యర్హము. కానిదైవమునే నమ్మి మేలు పడయఁ గోరెదవా? ఇది నూట నాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

క్షేమదర్శికిని గాలకవృక్షీయునకును శత్రువులను గెలుచుకపటోపాయములను గుఱించిన సంవాదము.

ముని—'క్షత్రియా! లేక నీయందుఁ బౌరుషమే దేని గలదని నీకుఁ దోచెనేని నీరాజ్యమును మరలఁబడయుటకుఁ దగునీతిని జెప్పెదను. నీవానీతి ననుష్ఠించుటకు శక్తిగలిగి యందులకు వలయు కార్యములను జేయుదువేని నీసంపదను నింకను బడయ వచ్చును. నీకునేనును గలహాపునఁ జెప్పనదంతయు వినుము. నీవు నేను జెప్పినకార్యమును జేయుదువేని మిక్కిలి గొప్ప యర్థములనో, రాజ్యమునో, లేక రాజ్యమంత్రమునో మిక్కిలి సంపత్తినో పడయఁగలవు' అనెను.

రాజు 'మహాత్మా! నీతి నుపదేశింపుము. పౌరుషము గలిగి యున్నాను. ఉపదేశింపుము. ఇప్పుడు నీతోడిసమాగమము నాకు ఫలకారిగా నుండుఁగాక' యనెను.

ముని—'నీవు మానమును, డంభమును, కోపమును, హర్షమును, భయమును విడిచి, నీశత్రువులకు మొక్కిక్కి చేతులు మోడ్చికొలువుము. ఉత్తమమును బరిశుద్ధము నగుకార్యముల నెప్పుడును గావించుమిధిలాపతి యగుజనకునిఁ గొలువుము.

అతఁడు*సత్యమెంతయును దప్పక నీకు ధనము నొసంగ నర్హుఁడు. అప్పుడు నీవు విదేహరాజునకుఁ గుడిభుజమవై యందఱకు విశ్వాస పాత్రమగుదువు. అందువలన నీకు నుత్సాహవంతులును వ్యసన దూరులును బరిశుద్ధులునగు సహాయులు పెక్కండ్రుగలుగుదురు. ఒకఁ డాత్మనిగ్రహముగలిగి యింద్రియములను గెలిచి తనకు శాస్త్రవిహితములయిన వానియందు వర్తించుచుండునేని, వాఁడు తన్నుఁ బయికినుద్ధరించుకొనుటయే కాక తక్కినవారినిఁ దనకుఁ బ్రసన్నులను గావించుకొనును. అంత ధృతిమంతుఁడును శ్రీమంతుఁడు నగు నాజనకునిచేత సత్కృతుండవై యతనికిఁ గుడిభుజమవై సమస్తజనులనమ్మికను బడయుదువు. అంత నీవు పెక్కండ్ర సుహృదులబలిమిని బడసి మంచిమంత్రులతో లెస్సగా నాలోచించి, యాప్తులనుగాని శత్రువులందు భేదముపుట్టించి బిల్వముచేత బిల్వమును గొట్టునట్లు వారినందఱను గూల్పుము. లేదా, నీశత్రువునకు శత్రువగువానితోడ సంధిచేసి నీశత్రువు బలమును నాశముఁ జేయుము. శత్రువునకు మిక్కిలి లభింపరాని సొగసయిన వస్తువులయందును, సుందరులయిన స్త్రీలయందును, వెలపొడుగయిన వస్త్రములు శయనములు ఆసనములు వాహనములు మొదలగువానియందును, గృహములయందును, నానావిధములయిన పక్షులయందును, మృగజాతులయందును, రసములందును, గంధములందును, ఫలములందును, †మిక్కిలి తగులుగలి

* 'సత్యసంగరః' అని బొం. మూలము. 'సత్యవిక్రమః' అని దాక్షిణాత్య మూలము.

† ఈవస్తువులందెల్లఁ దగులు గలుగుటవలన శత్రువు బొక్కసమంతయు నిందులకై వ్యయముకాఁగా వాఁడు తనంతటఁ దానే నశించునని యాశయము. ప్రతాపచంద్రరాయలు.

గించి, దానివలనఁదనంతటఁదానేనశించునట్లు చేయుము. ఇట్లాశత్రువునువారింపవలసినను, లేకయుపేక్షింపఁదగియుండినను, మంచినీతిచొప్పున నడవఁగోరువాఁడు దేనినిగాని యాశత్రువొకప్పుడును దెలిసికొనునట్లుచేయరాదు.* నీమిత్రులకు సమ్మతమగు మార్గమున శత్రువుపట్టణమందును, దేశమందును, మిత్రునివలె వసించియుండుము. మఱియుఁబసమాలినగుక్కలయు, జింకలయుఁ, గాకులయునడవళ్లు ననుకరించుచుఁ బయికి మిత్రధర్మమును నటించుచు నుండుము. మఱియు వారిని మిక్కిలియు గొప్పవియుఁ జేయుటకు సాధ్యము లయినవియు, మహానదివలెఁ గడవ నలవిగానివియు నగు స్వారంభములందుఁ జొనుపుము. బలవంతులతోడ విరోధము పెట్టించుము. మిక్కిలి రమణీయములయిన యుద్యానములు శయనములు, ఆసనములు మొదలగువానింబోని † యింపారు భోగముల మూలమున వారిబొక్కసమును రిత్తగావింపుము. వీనికొఱకు ‡ యజ్ఞములను దానములను బొగడుము. దానివలన

---

* 'ఏసస్వపురమామిత్రం విషయే మిత్రసమ్మతః। భజస్వశ్వేతకాకీయైర్మిత్రధర్మమనర్థకైః' అని దా. మూలము. 'రమస్వపరమామిత్రే విషయే ప్రాజ్ఞసమ్మతః।...' అని బౌ. మూలము. ప్రాజ్ఞులకు సమ్మతమగుచొప్పున వర్తించుచు శత్రువు దేశమందు మిక్కిలియు రమించుచుండుము.' అని యర్థము. శ్వేతకాకీయమనఁగా శ్వా (కుక్క) + ఏత (జింక) కాక (కాకి)ములను సంబంధించిన ధర్మములు- కుక్కవలె జాగరూకతయు, జింకవలె బెదరును, కాకివలె పరేంగితములను దెలియుటయుఁ గలిగియుండుటయని తెలియునది.

† ప్రీతిభోగసుఖైశ్చైవ (దా. మూ.) ప్రతిభోగసుఖైశ్చైన (బౌ. మూ.)

‡ యజ్ఞదానే ప్రశంసాస్తే బ్రాహ్మణా ననువిర్తయ (దా. మూలము.) ప్రశాధ్యస్తే బ్రాహ్మణా ననుపర్ణ్యతాత్ (బౌ. మూ.)

బ్రాహ్మణులను సంతోషపెట్టుము. వారు (దక్షిణాదులను నీచేతులారాఁదీసికొని) నీకుఁ (దపములచేతను లేక క్రియలచేతను) మంచి గావించుచు నీశత్రువును దోఁడేళ్లుంబోలె స్రుంగుదురు. పుణ్యశీలుండగువాఁడు తప్పక పరమగతిని బొందును. పుణ్యకార్యములవలన దేవలోకమందు మిక్కిలి పుణ్యము లగుశాశ్వత పదములను బొందును. ఒకఁడు ధర్మకార్యములయందును నధర్మకార్యములందును బ్రేరితుఁడగుటఁజేసి వానిబొక్కసము క్షీణింపఁగా వాఁడు శత్రువులకు వశగతుఁడగుచున్నాఁడు. కోశము స్వర్గమందలి సుఖఫలమునకును భూమియందలి జయమునకును మూలము. కోశములవలననే శత్రువు లట్టిసుఖమనుభవింతురు. కాఁబట్టి దానిని సర్వవిధముల రిక్తగావింపుము. నీశత్రువు మోలఁ బొరుపమును గొనియాడకుము. ద్వైధమునే యెక్కుడుగా వర్ణింపుము. ద్వైధమునే మిక్కిలి యూఁదియుండువాఁడు తప్పక శీఘ్రముగానే నశించును. నీశత్రువుచేత * విశ్వజిత్తనెడి యాగమును జేయించి వానిని సర్వస్వమునకుఁ బాయునట్లు చేయుము. పిదప † వాఁడు మహాజనులను బీడించుచు ధనమొడఁగూడినివాఁడై పోవును. ‡ త్యాగధర్మము నెఱింగిన

---

* విశ్వజిత్తనెడి యాగమున సర్వస్వదానము విహితముగాన యట్లు చేయింపుమనుట తెలియునది.

† 'తతోగచ్ఛల్యకృద్ధార్థ్య పీడయానో మహాజనమ్. (దా.మూలము.) తతోగచ్ఛతి సిద్ధార్థ్య పీడ్యమానం మహాజనమ్' అని. ఔ.మూలము. అంతే నీకోర్కియీడేఱును. పిదప బొక్కసము నించుటకై మహాజనులుపీడితులగుటను శత్రువునకుఁ దెలుపవచ్చును- అని ప్రతాపచంద్రరాయులు.

‡ 'త్యాగధర్మవిదం' అని. దా.మూలము. 'హ్యాగధర్మవిదం' అని ఔ. మూలము. మహాజనులు పీడితులయిరని ప్రజలందు నిస్పృహకలిగించి పిదప

పుణ్యాత్ముని నొకనిని వీనికి నిర్ణించిచెప్పుము. ఒకవేళ నీశత్రువు త్యాగమేని చేయఁగోరును; క్షేమముగా నుండుటకై యడవులకేని పోవును. నీవు పిదప సమస్తశత్రువులను నాశముసేయు నట్టిదియు పెక్కుమూలికలచేత సిద్ధము గావింపఁబడినదియునగు నౌషధములను, గృత్రిమములగు నుప్పులను, బ్రయోగించి శత్రువునకుఁ గలగజములను నశ్వములను మనుష్యులను నాశము సేయింపుము. రాజపుత్రా! ఇట్లు చక్కఁగా నాలోచించి యిట్టివియు మఱియు నితరము లయినవియునగు కపటోపాయములఁ బెక్కుంటిని బ్రయోగించుట దిట్టయగువానికి శక్యముకాని దిట్టగానివానికి శక్యముగాదు' అని చెప్పెను. ఇది నూటయేనవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

కాలకవృక్షీయునియానతిని క్షేమదర్శుల రాజ్య ప్రాప్తి మొదలగువానిని బడయుట.

రాజు 'బ్రాహ్మణోత్తమా! కపటముచేతను డంభముచేతను జీవించుటకు నేనొల్లను. ధనములు మిక్కిలియు నధికములయినను గూడ నధర్మముతోఁ గూడియుండెనేని నా కిష్టముగావు. మహాత్మా! మొదటనే నేను వీనిని వలదంటిని. దేనియందుఁ బాపము

త్యాగవిధునితోడి కూటమి గలిగించుటవలన రాజ్యమును ధ్వంసంచునట్లు చేయఁగలుగుననియుఁ బిదప రాజ్యము నీకు సిద్ధించుననియు భావము. యోగధర్మమను వాఙ్మయమును రాజ్యవిరక్తికి సాధకమే. పెక్కుచోట్ల 'త్యాగ'మనుటకు యోగమని పాఠమండుట చూపట్లుచున్నది.

నెడిశంకకలుగదో, యేది యన్నివిధముల హితమగునో, దేనిచేత నెంతమాత్ర మితరులకు బాధగలుగదో, యట్టిధర్మముచే నే నీ లోకమున బ్రతుకఁగోరుచున్నాను. నీవుచెప్పినరీతిని జేయుటకు నేను శక్తుఁడను గాను. ఇది నాకు యుక్తముగాదు' అనెను.

మునిక్షత్రియా! ఇట్లు మాటాడుటంబట్టిసీవు నీతిగలవాఁడవని తెలియుచున్నది. నీవు స్వభావముచేతను బుద్ధిచేతను నీతిమంతుఁడుగ నున్నావు. నీయెఱుక యద్భుతముగానున్నది. నీకును నా విదేహరాజునకు నుభయులకును సహాయముచేయుటకుఁ బ్రయత్నించెదను. లేదా మీ యిరువురుకును శాశ్వతమయి యెడఁబాయకుండునట్టి కూడికనయినను గలిగించెదను. సత్కులప్రసూతుఁడును నక్రూరుండును మిక్కిలి చదువరియు రాజ్యము నడపుటయందు సమర్థుండు నగునినుబోఁటివాని నెవఁడమాత్యునిఁగాఁ జేసికోఁడు? క్షత్రియా! నీవు రాజ్యమునుండి వెడలఁగొట్టంబడియు,మిక్కుటమయినన్యసనముపాలయ్యు,నక్రూరంబగు నడవడిని బ్రతుకఁగోరెదవు; కాన యిట్లు చెప్పుచున్నాను. సత్యసంధుఁడగు విదేహరాజు నాగృహమునకు శీఘ్రముగ వచ్చును. అతఁడు నే నేమి యానతిత్తునో దానిని దప్పకచేయును' అనెను.

భీష్ముఁడు.—అంత మునివై దేహునిఁ బిలిచి 'రాజా! ఇతఁడు రాజకులమునఁబుట్టినవాఁడు. ఇతని యంతరంగమునాకుఁదెలియును.ఇతనియాత్మయద్దమువలెను, శరత్కాలపుఁజందమామవలెను శుద్ధముగా నుండును.ఇతనియందు దోషముగానరాదు. నేనన్ని విధములచేతను నితనిని బరీక్షించితిని. నీ కితనితోడఁ జెలిమియే యుండుఁగాక, నాయందుంబోలె నితనియందును నమ్మిక గలిగి

యుండుము. అమాత్యుఁడు లేక రాజ్యమునేల శక్యముగాదు. అమాత్యుఁడు శుద్ధుఁడుగను బుద్ధిసంపన్నుఁడుగను నుండవలయును. ఆ రెండుగుణములచేతనే రెండులోకములును సిద్ధించును. రాజా! రాజ్యము నేలుటకు నీరెండుగుణములు గావలసియుండుటను జూడుము. ధర్మాత్ములగు వారికి లోకమునం దెచ్చటఁగాని యిటువంటిమార్గము వేఱొకటిలేదు. ఈరాజపుత్రుఁడు మహాత్ముఁడుగను సాధువులమార్గము నొందినవాఁడుగను నున్నాఁడు. *ఇతఁడు ధర్మమును మున్నిడికొన్నవాఁడుగాన యిట్టివానిని గయికొనుటయెంతయు లెస్సపని. ఇతనిని, లెస్సగాగారవించుచు వత్తువేని, నీశత్రువులపెనుసమూహములను గలంచిపుచ్చును. ఇతఁడునీతోయుద్ధమునకుఁ దలపడినా యది క్షత్రియుఁడగువానికి స్వధర్మమేయగును. ఇతఁడు తనతండ్రితాతల చొప్పున నిన్ను యుద్ధమున జయింపఁగోరునేని నీవును బగవారిని గెలుచుటయనెడి క్షత్రియవ్రతము ననుష్ఠించువాఁడవు గనుక, నీకును నితనితోడ యుద్ధము సేయఁదగును. అయినను నీవు యుద్ధము చేయుటయే నాని యోగమున, నీహితమును గోరి యితనిని నీవశమునం దుంచుకొనుము. అయుక్తమగు లోభమును దిగవిడిచి ధర్మమునందుఁగన్నుంపుము. కామమువలనఁగాని ద్రోహమువలనఁగాని నీవు స్వధర్మమును విడుచుటతగదు. ఎప్పుడును జయమేకలుగదు.

---

* సుసంగృహీతస్తే వైరిపక్షో యథా ధర్మపురోగమః। సంత్యేవమానాశ్చ క్షత్రాంస్తే గృహ్ణీయాన్మహతోగణాన్. అని. మూలము. అసంగృహీతో...గృహ్ణీయాన్మహతోగణాన్. అని. (దా. మూలము.) ఇతని నీవు గయికొనకపోయితివేని నీశత్రుసమూహములను జేపట్టునని యీయర్థము తెలియుచున్నది. (ప్రతాప చంద్రరాయలు.)

ఎప్పుడు నపజయమే కలుగుటయులేదు. కాఁబట్టి శత్రువును దన్నేలుకొనునట్లును జేయవలయును.శత్రువును దా నేలుకొనను వలయును. జయపరాజయములు రెండును దనయందుఁ గలుగుటను జూడవచ్చును. పగవానిని నిశ్శేషముగాఁ జంపఁజూచువారికి నట్లు దామే నిశ్శేషముగాఁ జేయఁబడునట్టి భయము కలుగవచ్చును' అనెను. ముని యిట్లుచెప్పఁగా జనకుఁడు పూజార్హుఁ డయినయాబ్రాహ్మణోత్తమునిఁ బూజించి సత్కరించి యతనితో 'నీవు మహాప్రాజ్ఞుఁడవు. మిక్కిలి చదువరివి. నీవు శ్రేయస్సునుగోరి యేమిచెప్పెదవో యది మాయుభయులకును హితమగును. నీవేమెమియెట్లు చేయఁజెప్పితివో దానినంతయు నట్లు చేసెదను. ఇదియేనాకు శ్రేయము. ఈవిషయమై నాకు విచారింపవలసినది లేదు' అనెను. పిదప విదేహరాజు కోసలరాజును బిలిచి 'రాజసత్తమా ! నేను రాజధర్మముచేతను బుద్ధిచేతను బలమిచేతను భూమిని జయించితిని. నీవు నీగుణములచేత నన్ను జయించితివి. నీవు నిన్నుఁ గ్రిందుపఱచుకొనక (అనఁగా నాచేతి జయింపఁబడునట్లు తలంచుకొనక) (నాయొద్దనుండువేని) జయమొందినవానివలె నుండుము. నేను నీబుద్ధిని గారవించుచున్నాను. నీపౌరుషమును గారవించుచున్నాను. నిన్ను నేను గెలిచితినని చెప్పుచు ని న్నవమానింపను. నీవు జయించినవానివలె నుండుము. రాజా ! నీవు విధ్యుక్తముగా నాచేతఁ బూజితుండవై నాగృహమునుండి నీయింటికిఁబొమ్ము' అనెను. పిదప వారిరువురును

---

* 'తస్మాద్భోజయితవ్యశ్చ భోక్తవ్యశ్చ పరోజనః' అని జౌ. మూలము. 'తస్మాజ్జయశ్చభోక్తవ్యో భోక్తవ్యశ్చపరాజయః' అని. దా. మూ. జయమును ననుభవింపవలయును. అపజయమును ననుభవింప వలయును.

గాలక వృశ్నీయమునిని బూజించియొండొరులయందు నమ్మిక యుంచి తమతమ గృహములకుం బోయిరి. అంత విదేహరాజు కాసల్యుని వేగ తనగృహమునకుఁ దోడ్కొనిపోయి పూజార్హుండగు నతనిని నర్ఘ్యపాద్యము లొసంగి మధుపర్కమునిచ్చి పూజించెను; మఱియు నతనికిఁ దనకుమారిక నిచ్చి నానావిధముల రత్నముల నొసఁగెను. ఇట్లు సంధియే రాజులకుఁ బరమధర్మము. ఏలన జయాపజయములు రెండును గలుగుట సమములే కాన సతములు గావు' అనెను. ఇది నూటయాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు గణసృష్టి మొదలగువానిని జెప్పుట.

ధర్మరాజు 'పరంతపా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల ధర్మవృత్తులును వారలవిత్తములను, జీవనోపాయములను వాని ఫలములను జెప్పితివి; మఱియు రాజులనడవళ్లును, బొక్కసమును బెంచువిధములను వారిజయములను జెప్పితివి. అమాత్యుల గుణములను వృత్తులను బ్రగలను వృద్ధినొందించు విధములను, సంధివిగ్రహాదు లయిన యాఱుగుణముల లక్షణములను, సేనల నీతియు, దుష్టులను దెలిసికొను విధమును, దుష్టులు కానివారల లక్షణములును, సనూనులయుఁ, దక్కువ వారలయు, నధికులగువారలయు యథార్థలక్షణములను, మధ్యస్థులను సంతోషపెట్టుకొనుకు వృద్ధినొందఁ గోరువాఁడు వారియెడల నుండవలసిన యునికియు, క్షీణులగువారిని నాదరించువిధమును, వారి జీవనోపాయమును జెప్పితివి. నీవు వీనినంతయు, శ్రుత్యాదిగ్రంథములం

దున్న చొప్పున సులభమయిన విధుల రూపమున వివరించి తివి. అట్లె జయింపఁగోరువానికిఁ దగునడవళ్లను జెప్పితివి. నీవు మతిమంతులందు మేలుబంతివిగదే. కాన, రాజును బరివేష్టించి యుండుశూరగణములయెడనడచుకొనవలసిన విధమును వినఁగోరు చున్నాను. ఆగణము లెట్లు నర్ధిలుదురో, యెట్లురాజువలన భేదిల్లక సమ్యక్తులై యుందురో, వా రెట్లు శత్రులను జయింపనేర్తురో, మఱి యెట్లు మిత్రులను బడయుదురో, తెలియఁగోరెదను.గణము లనాశమునకు భేదమే మూలమని నాకుఁ గనుపట్టుచున్నది. నుతేయుఁ బెక్కండ్రుగూడి యాలోచించిన రహస్యమును గప్పి పుచ్చుట యెంతయుఁ గష్టమని నాకుఁ దోచుచున్నది. ఇది నేను బూర్ణముగా వినఁగోరుచున్నాను.ఆశూరగణము లెట్లు రాజుతో భేదము నొందకుండునో చెప్పుము,' అనెను.భీష్ముఁడు'గణములకును రాజులకును సడుమ లోభమును జూపోపమియును గోపమును వైరమును బెంచుచున్నవి. ఈ యిరుతెగలయం దొకరు (అనఁగా రాజు) * లోభమును జెందుచున్నాఁడు. పిదప మఱొకరు (గణ మును) దోడ నీ సైఁపమిఁ (గోపమును) బొందుచున్నది.ఇట్లా యిరుదెగలు నొకరినొకరు సైఁపక యొండొగులయెడఁ బ్రతి కూలమయిన యభిప్రాయములు గలిగి, చారుల నియోగించియు,

* రాజు లోభముచే జనులపయి నెక్కుడుపన్నులను వేయుఁగాఁ బ్రజలు రాజును నాశ మేయుఁ జూచురని యూహయును.

† తతోన్యోన్యమర్ష సంయుక్తా వన్యోన్యజనితాశయా। చారమంత్ర బలా దానైః సామదానవిభేదనైః క్షయవ్యయభయోపాయైః ప్రకర్ష న్నీతికోవిదమ్।' అని. దా. మూలము. 'తే క్షయవ్యయసంయుక్తా వన్యోన్యంచ వినాశినా। చార..... భేదనైః। క్షయవ్యయభయోపాయైః కర్శయ న్నీతికోవిదమ్' అని బొ. మూలము. ఒకరినొకరు క్షీణింపఁజేయుటకును నాశము సేయుటకును

కుట్రలాలోచించియు, బలిమిమెఱసియు, నెక్కువ కప్పము మొదలయినవి పుచ్చుకొనియు, సామదానభేదములను బ్రయోగించియు, తీక్ణతినుసాశమును భయమునుగలిగించు నెక్కుపాయములచేత నొకరినొక రతిశయింపఁ గడఁగుదురు. అందు గణములు మొత్తముగాఁగూడి మూడియుండువారుగాన రాజు తమవలన నెక్కువగాఁ బుచ్చుకొనునేని యతనినుండి మొత్తముగా వేఱుపడసాగుదురు. ఇట్లు రాజునుండి వేఱుపడి యందఱును మనసులుచెడి, భయమువలన, రాజు శత్రున్నసకు వశగతులగుదురు. గణములవారు నొకరినుండి యొకఁగ వేఱుపడిరేని నశింతురు; అట్లు వేఱుపడుట వలన (మొత్తముగా నుండుటవలని బలిమి తఱిఁగి) శత్రువులకు సులభముగా లోపడుదురు. కాఁబట్టి గణములవారు మొత్తముగానుండియె యెంధులకును బ్రయత్నము చేయవలయును. వారు మొత్తముగఁ గూడి మూడియుందురేని (యొరిమగలరేని) యందువలని బలిమిచేతను బౌరుషములచేతను వారు వలసిన యర్థములను బడయుదురు. వా రట్లు(లెక్కనుత్యమున) మొత్తముగాఁ గలసిమెలసివర్తింతురేని బయటివారును వారితోడఁ జెలిమి చేసికొందురు. ఇట్లు వీరొకరినొకరు ప్రేమతోడఁ గూడి తోడుపడుచుందురేని మిక్కిలి జ్ఞానవంతులగు వారు సేరి నెంతయుఁ గొనియాడుదురు. అందఱు సుఖముగా వేఱువేఱు తలంపులను నీడి యేకార్యమందు నైకమత్యముగలిగి యుందురేని యన్నివిధముల సుఖముగా వర్ధిల్లుదురు. ఉత్తములయినగణములవారు శాస్త్రముచొప్పున మిక్కిలి ధర్మయుక్తము లయిన

బూని యొండొరులను దుదముట్టింతురు. చారులు మొదలయిన యుపాయములచే నొకరినొకరు కాపాడుదురని యర్థము.

వ్యవహారములను గలరూపునఁ గనుఁగొని నెలకొలుపుచు నందు వలన నెంతయు వృద్ధినొందుదురు. పుత్రులను దోఁబుట్టువులను నడఁకువగలిగించి వారికిఁ జదువు మొదలయినవానిని గఱపి వినయ వంతు లగుపెద్దలను నెప్పుడును నాదరించుచును వృద్ధినొందు దురు. మఱియు వారు చారులను నియమించుట యందును, మంత్రములను విధించుటయందును, బొక్కసములను నించుట యందును నెప్పుడు నెచ్చరికగలిగి యన్నివిధములను వర్ధిల్లు దురు. మఱియు గణములవారు, సాధ్యులను, మిక్కిలి యుత్సాహ వంతులను, నిలుకడయైన పౌరుషముగలవారును శూరులు నగు వారి, నెంతయు జాగ్రత్తతోడ నెప్పుడును గారవించుచు వృద్ధి నొందుదురు. ధనవంతులును శూరులునై, శస్త్రవిదులును శాస్త్రపారీణులునై యుండు గణములవారు, మూఢులగు జనులను మిక్కిలి కష్టములయిన యాపదలనుండి దాటింతురు. ధర్మరాజా! క్రోధమును, భేదమును, భయమును, దండమును, బోధించుటయు, నిగ్రహించుటయు, వధించుటయు (రాజు చేసిన యెడల) నవి గణ ములవారిని శత్రువునకు వశగతులంగావించును. కాఁబట్టి యాగణ ముల ముఖ్యులగువారిని ముఖ్యముగా సమ్మానింపవలయును. రాజా! లోకయాత్ర తఱుచుగా వారి యజుచేతియందున్నది. మంత్రాలోచనమును గణముఖ్యులతోడనే కావింపవలయును. చారులను వారి వశమందే యుంపవలయును. రాజు గణముల వారియందొక్కఁడితోను మంత్రాలోచనములు చేయరాదు. రాజు, గణముఖ్యులతోఁగూడి యాలోచించి గణమునకుహితమై నదిగావింపవలయును. గణములవారు పరస్పరము వేఱుపడి యైక మత్యము లేకయు నాయకుఁడు లేకయు నుండిరేని వేఱువిధము

లయిన యుపాయములను జేయవలయును. గణములవా రొకరి కొకరు భిన్నులై తమతమ చెల్లుబడి కొలఁదిని వర్తింపఁజూతు రేని వారికిఁగల యుర్థము లడుగంటుటయేకాక యనర్థములును బుట్టుచున్నవి. వారియందుఁ బండితులగువా రొకరియం దొక కలహము పుట్టెనా తోడనేదానిని నడఁచిపుచ్చవలయును. కుల మందుఁ బెద్దలగువా రపేక్షగలిగి యున్నయెడలఁ గులమునందుఁ గలహములుపుట్టి కులమునంతయు నాశముసేయును. మతిగణ ములకుఁ బరస్పరభేదము పుట్టించును. లోపలఁ గలుగు భయ ములనుండి నిన్నుఁగాచుకొనుము. వెలుపలనుండి గలుగుభయము లంతగా సారమైనవిగావు. లోపలనే కలుగుభయము, రాజా ! యపుడే మూలములను ద్రుంచివైచును. జాతియందును గులము నందును సమానులయినవారు సహజములయిన క్రోధమోహా ములచేతను లోభముచేతను నున్నట్టుండి యొకరితో నొకరు మాటాడకుందురు. ఇది పరాభవమునకు లక్షణము. శత్రువులు గణముల నడఁగఁద్రొక్కుట తమప్రాణ్కిచేతను, బుద్ధిచేతను, రూపముచేతను, ధనముచేతను గాదు; మతి వారియందలి భేదముచేత నట్లుసేయుదురు. కాబట్టి గణములవారికి మొత్త ముగాఁగూడి మాడుటయే గొప్ప రక్షకమని చెప్పుదురు'. ఇది నూటయేడవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు మాతృషిపితృగురువుల మహిమలను వర్ణించుట

ధర్మరాజు 'ధర్మమార్గము మిక్కిలియుఁ బెద్దది, అందలి శాఖలును బెక్కులు. ధర్మములలోపల మిక్కిలియు ననుష్ఠింపఁ

దగినది లోకమందేదియని నీవు నిశ్చయించి యున్నావు. సమస్త ప్రాణులకును నేకార్యము చేయుట మిక్కిలి గొప్పదని నీ మతమో, మఱినాకు నిందును నందును మిక్కిలియు ధర్మము నొడఁగూర్చునో చెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు 'తల్లిని దండ్రిని గురువును బూజించుట మిక్కిలియు ముఖ్యమని నామతము. ఇందు దీనిని జేయువాఁడు మంచిలోకములను మహనీయమైన యశస్సును బొందుచున్నాఁడు. నాయనా! యుధిష్ఠిరా! వారిని జక్కఁగాఁ బూజించి వారేమిచేయనానతియిత్తురో యది ధర్మముగాన ధర్మవిరుద్ధముగానే చేయవలయును. వారానతియ్యని ధర్మమును మఱెద్దానిని జేయరాదు. వారేదిచేయుమని యానతిత్తురో యదియే ధర్మమనుట నిశ్చయము. వారే మూఁడులోకములు; వారే మూఁడాశ్రమములు; వారే మూఁడువేదములు; వారే మూఁడగ్నులు. తండ్రి గార్హపత్యాగ్నియుఁ తల్లి దక్షిణాగ్నియు, గురు వాహవనీయాగ్నియుఁగాఁ బెప్పఁబడుచున్నారు. ఈమూఁడగ్నులను మిక్కిలి గొప్పవి. ఈమూఁడగ్నులయందునుఁ బ్రాలుమాలిక లేక యుందువేని మూఁడులోకములను సయితము జయింతువు. తండ్రిని బూజించుటవలన నీలోకమును, దల్లిని బూజించుటవలనఁ బరలోకమును, గురువును బూజించుటవలన బ్రహ్మలోకమును గట్టిగ జయింతువు. ఈమువ్వురెయెడఁ జక్కఁగా నడపుము. మూల్లోకములందును గీర్తినొందుదువు. నీకు శుభంబుగలుగును.మహాఫలంబగు ధర్మంబును జేకుఱును.నీవు వారిని మీఱియుండకుము. వారు కుడువక నీవు భుజింపకుము; వారలు భుజించుదానికంఁటె మేలయిన దానిని భుజింపకుము; వార

లను దూషింపకుము. ఎప్పుడును వారికిఁ బరిచర్యచేయుచుండుము. అదియే యుత్తమమయిన పుణ్యము. నీవు కీర్తిని బుణ్యమును యశమును మంచిలోకములను బడయుదువు. ఎవఁ డామువ్వురను నాదరించునో వాఁడన్నిలోకములను నాదరించినవాఁడగును. వారి నాదరింపనివాఁడు చేయుక్రియ లన్నియు నిష్ఫలములే యగును. ఆమువ్వురు గురువులను నెవ్వఁడెప్పుడును బూజింపకయే యుండునో వానికిలోకమును బరలోకమును గీర్తియుఁ గలుగవు. వానికీర్తి యీలోకమందును బరలోకమందును వెలుంగదు. మఱి యుఁ బరలోకమందుఁ గలుగునవిగాఁ జెప్పంబడు తక్కినశుభమే దిగాని వానికిఁగలుగదు. యుధిష్ఠిరా! వారికొఱకై యెసంగినదం తయు నూఱుమడుంగులును వేయిమడుంగులును నెక్కుడయినవి. కాఁబట్టియే నాకు మూఁడులోకము లిప్పుడును జక్కఁగాఁ బ్రకాశించుచున్నవి. మంచియాచార్యుఁడు పదుగురు * శ్రోత్రియుల కంటె నెక్కుడు. ఉపాధ్యాయుఁడు పదుగు రాచార్యులకంటె నధికుఁడు. తండ్రి పదుగురుపాధ్యాయులకంటె నధికుఁడు. తల్లి యొక్కతియుఁ దండ్రికంటెఁ బదినుమడుంగు లెక్కుడు; భూమి యంతకంటెను గొప్పది. తల్లికి సాటియైనగురువులేదు. భారతా! గురువు తెలిదండ్రులకంటె మిక్కిలి యధికుఁడని నామతము. ఏలనఁగా, తల్లియుఁ దండ్రియు నిరువుగును బుట్టుకకుమాత్రమే యుపయోగించెదరు. ఈ తల్లియుఁ దండ్రియు శరీరమును సృజించుచున్నారు. ఆచార్యునివలనఁ గలుగు పుట్టుకయో యజ

* శ్రోత్రియుఁడు=వేదాధ్యయనము చేసినవాఁడు. ఆచార్యుఁడు=వేదార్థము నుపదేశించువాఁడు. ఉపాధ్యాయుఁడు=వేదము నధ్యయనము చేయించువాఁడు.

రామరమైనది. (ముదిమియు మరణమును లేనిది) తల్లియుఁ దండ్రియు నపకారముచేసినను వారిని వధింపరాదు. వారిని దండింపకున్నందులకు వానికి దోషముగలుగదు. వారినిదండము పొందకుండుట వానిని దోషిఁగావింపదు. తప్పుచేసినదండ్రులను సయితము గారవముతో నాదరించుధర్మమునకై పాటుపడువారిని దేవతలును ఋషులును ననుగ్రహింపఁదగినవారినిగాఁ దెలియుదురు. ఎవఁడధ్యయనము చేయించుటయనెడి సత్కంబగు కర్మము చేత వేదమునుపదేశించి యఋయంబగు పదమునొసంగి యనుగ్రహించునో యట్టివానిని దండ్రియనియుఁ దల్లియనియుఁ దెలియును. అతఁడుచేసినదానియెడ నెనరుగలిగి యతనికి ద్రోహము చేయకుండవలయును. ఎవఁ డాచార్యునియొద్ద విద్యనుగఱచినపిదప నతనియెడ మనస్సుచేతను క్రియచేతను నడఁకువగలిగి యూదరము చూపకుందురో, యట్టివారు భ్రూణహత్యచేసినపాపమునొందుదురు. లోకమందట్టివానికంటెఁ బాపముచేసినవారు గలుగరు. గురువులు వారినెంతయు ననుగ్రహించుచుందురు. వారును గురువు లనుగ్రహించువిధమునఁ దాము గురువుల నర్చింపవలయును. కాఁబట్టి, తొల్లింటి నుండివచ్చుచున్న ధర్మమును బడయఁగోరువాఁడు, తనగురువుల నెంతయు జతనంబునఁ బూజించియు నర్చించియు వారితోఁబాటిగా నేదియుఁబంచి కుడువవలయును. ఎవనియెడఁ దండ్రి ప్రీతుఁడగునో వానియెడనే ప్రజాపతియుఁ బ్రీతినొందును. ఎవనియెడఁ దల్లి ప్రీతినొందునో వాఁడు భూమిని సయితము పూజించినవాఁడగును. ఎవఁడుపాధ్యాయుని సంతోషపెట్టునో వాఁడు బ్రహ్మను సయితము పూజించిన వాఁడగును. ఈ కారణమునుబట్టి గురువు తల్లికంటెను దండ్రి

కంటెను నెక్కుడు పూజ్యుఁడగును. గురువులను బూజించుచుం డినయెడల ఋషులును, దేవతలును, బితరులును సంతోషిం తురు. కాఁబట్టి గురువే యందఱికంటెఁ బూజ్యుఁడు. గురువు నేవిధమయిన నడతచేతఁగాని యవమానింపరాదు. తల్లిగాని తండ్రిగాని గురువునంతటి పూజ్యులు గారు. తల్లిని దండ్రిని గురువును నెంతమాత్ర మవమానింపరాదు. వారుచేయు కార్యమునందుఁ దప్పులుపట్టరాదు. దేవతలును ఋషులును గురువులను బూజింపవలయు ననియే తెలిపెదరు. ఎవ రుపా ధ్యాయునికిని దండ్రికిని దల్లికిని మనస్సుచేతఁగాని, క్రియ చేతనుగాని ద్రోహముచేయుదురో వారు భ్రూణహత్యచేసిన పాపమునొందుదురు. లోకమునందు వారికంటెఁ బాపులు గలు గరు. తల్లిదండ్రుల కడుపుననే పుట్టి వారిచేతనే పెంపఁబడిన పుత్రుఁడు పెద్దవాఁడయినపిదప వానిపెంచినవారిని బదులునకుఁ బోషింపఁడేని భ్రూణహత్య చేసినపాపము నొందును. వాని కంటెఁ బాపాత్ముఁడు లోకమునందు వేఱొకఁడు గలుగఁడు. మిత్రులకు ద్రోహము చేయువాఁడును, నెనరులేనివాఁడును, స్త్రీని జంపినవాఁడును, కొండెగాఁడు ననెడి యీనలుపుర పాపము లకును ప్రాయశ్చిత్తములేదని వినుచున్నారము. ఈలోకమందు మనుష్యునకుఁ జేయవలసినదిగా నున్నదంతయు మనువు నుపదేశ మందుఁ జూపట్టుచున్నది. ఇది శ్రేయమయినది. ఇంతకంటె నెక్కుడయినది లేదు. సమస్తము లయిన ధర్మముల సారము నొక్కటిగాఁజేర్చి యిది చెప్పఁబడినది' అనెను. ఇది నూటయె నిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు సత్యాసత్యముల స్వరూపములను జెప్పుట.

ధర్మరాజు 'ధర్మమనఁదే నెలకొనియుండఁ గోరువాఁ డెట్లు నడచుకొనవలెను ? నేను గలరూపు దెలియఁగోరుచున్నానుగాన నాకుఁ జెప్పుము. సత్యము, అసత్య మనెడియీ రెండును లోకముల నావరించియున్నవి. ధర్మమునే తిరముగా నూఁదియున్నవాఁ డిరెంటిలో దేని నాచరింపవలయును? సత్యమనఁగా నేమి? అసత్యమేమి ? సనాతనధర్మము నెద్ది ? ఎట్టికాలమున సత్యము పలుకవలయును? ఎప్పుడసత్యమును బలుకవలయును'?అని యడిగెను. భీష్ముఁడు 'సత్యమునుజెప్పుటయె మంచిది. సత్యమునకంటె నెక్కుడయినది లేదు. భారతా ! లోకమునఁ దేది సాధారణముగా నందఱికిను దెలియుట మిక్కిలి కష్టమో దానిని నీకుఁ జెప్పెదను. ఎచ్చట నసత్యము సత్యమువంటిదగునో యచ్చట నసత్యమునైనను బలుకవలయును. * సత్యాసత్యముల స్వరూపము లిట్టివె యుండఁగా వానియందుఁ గల రూపున సత్యమేదియగునని యెవఁడు నిశ్చయింపఁ జాలఁడో యటువంటి మూఢుఁడు చిక్కుపడును. సత్యమిది యసత్య మిదియని చక్కఁగా నిశ్చయించినపిదప ధర్మవిదుఁడగుచున్నాఁడు. అప్రాజ్ఞుఁడును, బ్రజ్ఞాహీనుఁడును, అతికూరుఁడు నగు పురుషుఁడు

* 'తాదృశే బధ్యతేబాలో యత్ర సత్యమనిశ్చితమ్ అని' మూలము. కొన్నిట 'తాదృశః' అనియుఁ గొన్నిట 'ఏధ్యతేపాపః' అనియుఁ గొన్నట 'సత్యమనుష్ఠితమ్' అనియుఁ బాఠాంతరములు.

సయితము గ్రుడ్డిమృగమును వధించుటవలన బలాకుఁడను బోయవానివలె మిక్కిలియు గొప్పపుణ్యమును బొందును. మూఢుఁడయినవాఁడు ధర్మమనఁదెంత కోరిక గలిగియుండినను ధర్మమిదియని తెలియకి యధర్మము నాచరించుట † యే మాశ్చర్యము? గంగాతీరమందలి ‡గుడ్లగూబవలె (హత్యచేసిన వాఁడును) మిక్కిలి గొప్పపుణ్యమును బడయుచున్నాఁడు. నీవడిగిన యీప్రశ్నము నట్టిదే(యనఁగా మిక్కిలియు గష్టమయినది.) ఏలనఁ ధర్మమనఁగా నిట్టిదని చెప్పుట యెంతయుఁ గష్టముగానున్నది. ఈవిషయమునం దూహాచేత నిర్ణయము చేయుటయు దుష్కరము. ఇందెట్లు నిశ్చయముచేసి యొకఁడు చెప్పఁగలఁడు? ప్రాణులవృద్ధికొఱకై ధర్మమును (బ్రహ్మ) యుపదేశించెను. కాఁబట్టి యేది యభివృద్ధి గలిగించుచున్నదో యది ధర్మమనుట నిశ్చయము. అహింస, సత్యము, క్రోధములేమి, తపము, దానము, దమము, మతి, అనసూయ, (పరులను నలవఱచుటయందు) సామర్థ్యములేమి, ఈర్ష్యలేమి, శీలమునడి యివి ధర్మమని దేవదేవుండగు బ్రహ్మచెప్పెను. ఇదియు సనాతమయిన

---

* కర్ణపర్వము (అధ్యా.72)మూఢుఁడగు నొకసత్యవాది దొంగకుభయపడి దాఁగియుండిన కొందఱుమనుష్యులను నాదొంగలెక్కఁడనని తన్నడుగఁగాసత్యమెచిన మే చెప్పదునన్న యభిమానముచేత వారుపోయియున్నమార్గమును జెప్పి దొంగలచే వారినిజంపించెను. ఆకథ యిట యనుసంధింపఁబడినది.

† కర్ణపర్వము 72. అధ్యాయము. ఒకగుడ్లగూబ తనగుక్కతో నొక యూఁడుసర్పమును పెట్టిన వేయిగుడ్లను దిని గొప్పపుణ్యమును బొందినకథ యిట యనుసంధింపఁబడినది.

ధర్మమే ! రాజా ! ఈధర్మమందు వర్తించువాఁడు భద్రము లనుగాంచును. వేదవిహితమయిన వధయును నిజమునకు హింసా త్మకముగాని ధర్మమేయగును. * లోకమును ధరించుట (పోషిం చుట) వలన ధర్మమని చెప్పుదురు. ప్రజలు ధర్మముచేత ధరింపఁ బడుచున్నారు. ఏది ధరించుశక్తితోఁగూడినదో యది ధర్మ మనుట నిశ్చయము. ప్రాణులకు హింసలేకుండుకొఱకు ధర్మోప దేశము చేయఁబడినది. వేదమందుఁ జెప్పఁబడినదే ధర్మమని మఱికొందఱు చెప్పెదరు. † అవికాదని తక్కినకొందఱు చెప్పె దరు.అందులకుమేము వారిని నిందింపము. అన్నియు వేదమందు విధింపఁబడలేదు. కొన్నియెడల దొంగలు మఱొకనిసొమ్ము నపహరింపఁగోరి యాకందువ నడిగిరేని వారల కాపట్టును జెప్పరాదు. అది ధర్మమనుట నిశ్చయము. చెప్పకుండుట వలనఁ దప్పించు కొనఁగూడునేని యేవిధమునను జెప్పకయే యుండవలయును. చెప్పియే తీఱవలసివచ్చినను జెప్పకుండి నచో వారు సందేహింతురేనియు నట్టియెడల సత్యమును జెప్పుటకంటె శపథముచేసియైనను నసత్యమునుజెప్పి పాపుల సంబంధము నుండి విడినడుట మిక్కిలి యొప్పిదమందురు. శక్యమైనచోఁ బాపుల కేవిధమునను ధనము నీయరాదు. ఏలనఁగా పాపులకిచ్చిన ధన మట్లిచ్చిన వానికిని బీడ కలి

---

* 'ధారణాద్ధర్మ మిత్యాహుః ధర్మేణవిధృతాః ప్రజాః' అని ధర్మశబ్ద నిర్వచనము.

† నేత్యాహురపరేజనాః' అని జె. మూలము. 'మానాన్యాహుఃపరే జనాః' అని దా. మూలము. తక్కినజనులు వేఱు ప్రమాణములనుగూడఁ జెప్పుచున్నారని యర్థము.

గించును. * రొక్కమిచ్చినవాఁడప్పులకాఁపును శరీరకష్టము పడి తనకుఁబనిచేయించికొని యాయప్పును దీర్చుకొనఁదలఁచిన వాఁడై యొడంబడిక నిజమును రూఢిపఱుచుటకు సాక్షులను బిలిచి యడుగునేని, వారు చెప్పవలసినది చెప్పకపోయిరేని యనృతము చెప్పినవారగుదురు. ప్రాణమున కపాయము గలుగునపుడును, వివాహమందు ననృతమును జెప్పవచ్చును. పరుల ధనమును రక్షించుకొఱకును ధర్మకార్యములు చేయుకొఱకును ననృత మాడవచ్చును. ధర్మమును గోరువాఁడు, పరుల కార్యము సిద్ధించుకొఱకుఁ దక్కువయగు వేషమును దాల్పవచ్చును. † ఒకఁడిచ్చెదనని ప్రతిజ్ఞ చేసినపిదప నిచ్చియే తీఱవలయును. అట్లియ్యక తన పని చూచుకొనువాని నిచ్చునట్లు బలాత్కరింపవచ్చును. ఒకఁడు తాను ధర్మముచొప్పునఁ జేసిన యొడంబడికవలనఁ దప్పి యధర్మమున వర్తించునేని, యట్టినూర్గము నూఁదినవానిని దండము చేతనే కొట్టవలయును. వంచనయే బ్రతుకుగాఁగల యొకఁడు,

---

* ఇఁటి నర్థము క్లిష్టముగానున్నది. ఇరువురును జేరి లాభమును బొందునట్లొడంబడిక చేసికొనిరి. అందొకరివలన రొక్కమును పుచ్చుకొని మఱొక్కఁడు పనిచేయుచుండఁగా దొంగలు వానియొద్ద ధనము నపహరించుకొని పోయిరేని రొక్కమిచ్చినవాఁడు పుచ్చుకొన్నవానిని బాధించి యైనను ఆధనమును దీసికొనఁగోరునేని యందులకై పిలిపించిన సాక్షులు పుచ్చుకొన్న వానియొద్ద ధనమున్నదని చెప్పుట యనృతముగాఁ బర్యవసించునని భావము.

† ప్రతిశ్రుత్య ప్రదాతవ్యః స్వకార్యస్తు బలాత్కృతః అని. జె. మూలము. 'ప్రతిశ్రుత్య నదాతవ్యం స్వకార్యస్తు బలాత్కృతః' అని. దా. మూలము. ధనము సార్జించువాఁడు దొంగలచేత బలవంతముగా ధనము గొలుపోయెనేని ధనమిచ్చినవానికిఁ బ్రతిజ్ఞ చేసిన ధనము నీయనక్కఱలేదు అని యర్థము.

ధర్మములన్నిటిని వీడి స్వధర్మములును దిగనాడి తనకడుపుఁ బ్రో చుట కెప్పుడును నన్నురుల కపటోపాయములనే యూఁదుచు నుండును. అట్లు కపటముచే బ్రతుకుచుండు నాపాపాత్ముని సర్వ విధములను జంపవలయును. అట్టి పాపులందఱును లోకమున ధనమునకంటె మించిన దొక్కటియు లేదని తలఁతురు. కపట మార్గములచే నరకమును బడయునట్టి పాపాత్ములతోడ వివాహ సంబంధములు గూడదు. పొత్తునఁ గుడుచుటయుఁ దగదు. వారు దేవతలను మనుష్యులను వీడి తొలఁగినవారును, యాగములేని వారును, దపములేనివారును. బ్రేతముల వంటివారు నగుదురు. వారితోడఁ జేరరాదు. ధనమునకు నాశముగలిగినచో వారు ప్రాణములు విడుచునట్టి మహాదుఃఖమును జేసికొందురు. పాపుల యందు 'ఈధర్మమును నీవు ప్రియముగాఁ జేయు' మని నీవు చెప్పుటకుఁ దగినవాఁడొక్కఁడును గలుగఁడు. పాపికి లోకము నందు ధనమునకు మించిన దొక్కటియు లేదనియే నిశ్చయము; అట్టివాని నెవఁడుచంపునో వానికిఁ బాపముగలుగదు. ఒకఁడు వానిని జంపునేని తనకర్మములచేత మునుపె చచ్చినవానిని జం పినవాఁడగును. వాఁడు చంపఁబడినయెడలఁ జచ్చినవానిని జంపు టయేయగును. దుష్టబుద్ధులను జంపునట్లు ప్రతినపట్టినవాఁ డా ప్రతినను దప్పరాదు. అట్టిపాపులు కాకులవలెను గుక్కలవలెను వంచనచేతనే కడుపు పోషించుకొనుచుందురు. వారు దేహమును వీడినపిదపఁ గాకి కుక్కలజన్మములే యెత్తుదురు. ఎవఁ డెవని యెడల నెట్లు వర్తించునోవాఁడు వానియెడల నట్లె వర్తింప వలయును. అదియే ధర్మము. కపటముగా నడచువానిని గపట ముచేతనే బాధింపవలయును. మంచి నడకగలవానిని మంచిని

గొనియెఁ రాఁబట్టుకొనవలయును' అనెను. ఇది నూటతొమ్మిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు ధర్మరాజునకు దుర్గతిని దాఁటు నుపాయ ముపదేశించుట.}

ధర్మరాజు 'పితామహా! ప్రాణు లాయూవిషయములచేత వేఱువేఱ యెడతెగక కాటియపడుచున్నవి. ఏయుపాయముచేత నట్టికడింది దుఃఖములను గడవవచ్చునో చెప్పుము' అని యడిగెను. భీష్ముఁడు 'ద్విజాతులెవరు తమయాత్మలనడంచి విధ్యుక్తములయిన యాశ్రమములందు శాస్త్రములఁ జెప్పఁబడినరీతిని వర్తింతురోవారు కడిందికష్టములను గడతురు. ఎవరు ధర్మమును దంభమునకై చేయరో, ఎవరు కట్టుపాటుల కిడఁగి జీవనముచేయుదురో, ఎవరు విషయముల నిగ్రహింతురో, వారును గడపరాని కష్టములను గడతురు. ఎవరు నిందింపఁబడినను మాఱు పలుకరో, హింసింపఁబడినను హింసింపరో, యిత్తురుగాని పుచ్చుకొనరో, వారుకడింది యిడుములను గడతురు. అతిథుల కెప్పుడును వసతి గలిగించువారును, ఎప్పుడు నసూయ లేకుండువారును, ఎప్పుడును వేదాధ్యయనశీలురును నగువారు కడిందికష్టములను గడతురు. ఎవరు ధర్మములందుఁ బ్రవీణులై, తలిదండ్రులయెడ నడచుకొనవలసిన విధమున నడచుకొనుచును, బగటియందు నిదురపోవకయు నుందురో వారును గడిందికష్టములను గడతురు. ఎవరు మనస్సుచేతను, వాక్కుచేతను, క్రియచేతను, బాపమును జేయకయుఁ బ్రాణులను దండింపకయు నుందురో వారునుగడింది

కష్టములను గడచనుదురు. ఏరాజులు రజోగుణముగలిగి లోభ
మువలన బహువయిన పన్నులు దీయకయు, తమదేశములను
జక్కఁగా రక్షించుచును నుందురో వారును గడింది కష్టము
లను గడతురు. ఎవరు న్యాయంబుగ లభించిన తమభార్యలను
ఋతుకాలములఁజెల్లను బొందుచుఁ దక్కినకాంతల పొత్తు సే
యక యగ్నిహోత్రములం దాసక్తిగలిగియుందురో యట్టి సాధు
వులు కడింది కష్టములను గడతురు. ఏశూరులు మరణమువలని
భయమును దిగవిడిచి యుద్ధములందు ధర్మముచొప్పున జయ
మును గోరుదురోవారు కడింది కష్టములను గడతురు. ఈలోక
మం దెవరు ప్రాణములు విడువవలసి వచ్చినను సత్యమేచెప్పుచుఁ
బ్రాఁతులకు విశ్వాసపాత్రులై యుందురోవారు కడింది కష్టము
లను దాఁటుదురు. ఎవరిక్రియలు నిందింపఁదగనివిగాను, మాట
లు సాధువుల కుపయోగపడునవిగను నున్నవో వారు కడింది
కష్టములను గడతురు. ఏ బ్రాహ్మణులు, అధ్యయనము చేయురాని
దినములందు నధ్యయనము చేయకయు తపమునందు నిష్ఠగలిగి
మిక్కిలి తపస్సంపన్నులయ్యు, నుందురో వారు కడిందికష్టము
లను గడతురు ఎవరు కౌమారమందు బ్రహ్మచారులై యుండి
తపముసలిపి, విద్యలందును వేదములందును వ్రతము లాచరించి
నెఱవేర్చిన వారగుదురో (స్నాతకులగుదురో) వారు కఠిన
ములయిన యిడుములనుం గడతురు. ఎవరు రజోగుణమునడఁచి
తమోగుణమును నిగ్రహించి సత్త్వగుణమందు నెలకొని
యుందురో యట్టిమహాభాగులును గడింది కష్టములను గడతురు.
ఎవరివలన నొకరికిని భయముగలుగదో, ఎవరికి. నొకరివలనను
భయము గలుగదో, ఎవరు లోకులనందఱను దమవలెఁ

జూతురో వారును గడిందికష్టములను గడతురు. పురుషవ ర్యులగు నేసాధువులు పరులసంపదను జూచి పరితాపపడకయు నీచ మయినయాచారములనుండి తొలఁగియు నుందురో వా రును గడిందికష్టములను సైతము గడతురు. ఎవ రెల్లదేవతలకు నమస్కరించువారును, ఎల్లధర్మములను వినువారును, శ్రద్ధ గలవారును, అడఁకువ గలవారునుగా నుందురో, వాఁడకడిఁది కష్టములను గడతురు. ఎవరు తమకు గౌరవమును గోరక యిత రులను గారవించుచు గౌరవింపఁబడుచున్నవానిఁ బూజించుచు నుందురో వారు కడిఁది కష్టములనేని గడతురు. ఎవరు బిడ్డలను బడయఁగోరి మిక్కిలి పరిశుద్ధములగు మనంబుల నొక్కొక తిథి యందును జేయఁదగు శ్రాద్ధాదులను జేయుదురో వారు కడిఁదికష్టములనుగడతురు. ఎవరు తమకోపమును మిక్కిలియు నడంచి కోపవంతులను మిక్కిలి శాంతులుగాఁ జేయుచును, * భృ త్యులయందును గోపము లేకయు నుందురో వారుకడిఁది కష్టము లనయినను గడతురు. ఏమనుష్యులు పుట్టినదిమొదలుగా మధు వును మాంసమును బడఁతులను, గల్లును నెప్పుడును వర్జించి యుందురో వారు కఠినములయిన యిడుములనుగూడఁ గడతురు. ఎవరు బ్రతికియుండుటకై భోజనమును, సంతతిగలుగు కొఱకు స్త్రీసంగమమును,సత్యమూ చెప్పకొఱకు మాటాడుటయుఁ, గలిగి యుందురో వారు కడిఁది కష్టములనేనియుఁ గడతురు.ఎవరు సర్వ భూతములకు నీశ్వరుండును జగమునకు నుత్పత్తి స్థితులుగలుగు పట్టును నగుదేవుని నారాయణుని భజింతురో వారు కడిఁది

* ఏప్రాణులయందును గోపముశేకయుందురో యసి పాఠాంతరము (ప్ర తాప చంద్రరాయలు.)

కష్టములనేనియుఁ గడతురు.రాజా ! ఇదిగో నున్నయితఁడు తా
మర రేకులవంటి కన్నులఁగవగలిగి పచ్చనివలువ గట్టినమహాభుజుం
డును, నీకు సుహృదుండును, భ్రాతయు,మిత్రుండును సంబంధియు
నగు శ్రీకృష్ణుఁడచ్యుతుం డగునారాయణుండు చుమీ ! ఇతఁడు
సకలము లయిసలోకములను దనయిచ్చ గలిగెనా తోలు
వలెఁ బుట్టినవె మటకు సమర్థుఁడు. ఇతని యాత్మస్వరూప మచిం
త్యము. ఇతఁడు గోవిందుఁడు, పురుషోత్తముఁడు. అర్జునునకును
నీకును ప్రియంబును హితంబు నగువానిని జేయుటయం దాస
క్తుఁడై యున్నయీపురుషతిలకుఁడు, ఈయదుశ్రేష్ఠుఁ డానై
కుంఠుఁడే చుమీ. ఈహరిని నారాయణుని భక్తితో నెవరాశ్ర
యింతురో వారిందుఁ గలుగుకడింది కష్టములనేనియుఁ దరిం
తురు. ఈవిషయమై విచారింప నక్కఱలేదు. *ఎవరు తామర
రేకులంబోని కన్నులఁగవ గలయీకృష్ణునియందు సమస్తభావ
ముతోఁ దమకర్మఫలముల నర్పింతురో వారు కడిఁది కష్టము
లనేని తరింతురు. ఎనగు లోకములను రక్షింపఁగోరి యదితియం
దుఁ గశ్యపునకు బుత్రుండై యుదయించిన దేవు నింద్రుని నమ
స్కరింతురో వారు కడిఁది కష్టములనుఁదరింతురు. ఎవరు లోక
ములను సృజించినవాఁడును, సజ్జనులకుఁ బతియును, యాగముల
చేతఁ బూజింపఁదగినవాఁడును నగు బ్రహ్మదేవునిఁ బూజింతురో
వారు కడిఁది కష్టములనుండియుఁ దరింతురు. ఇంద్రుఁడును విష్ణు
డును శంభుఁడును లోకపితామహుం డగుబ్రహ్మయుఁ బలువిధము
లయిన స్తోత్రములచెతె స్తుతించుచుండు దేవదేవుఁ డగు మహే

---

* ఈకుండలీ కరణములోని పాఠ మొకానొక ప్రతియందుఁ దప్పఁ బె
క్కింటఁగానరాదు గాన, యిది ప్రక్షిప్తముగా నోపునని తెలియునది.

శ్వరుని నెప్పుడును నెవరుపూజింతురో వారు కడిఁది కష్టములను గూడఁ గడతురు.) కడిఁది కష్టములను దాఁటుటకైన యీశ్లోకములను జదువువారును నితరులకు వినిపించువారును, బ్రాహ్మణులతో ముచ్చటించువారును, గడిఁది కష్టములను సైతము తరింతురు. అనఘా! మనుష్యుఁడీలోకమునను బరలోకమునను గడిఁది యిడుమలను దరించుటకై చేయవలసిన కార్యములను నొన్నింటిని నీకిదె యుపదేశించితిని' అనెను. ఇది నూటపదియవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు 'తండ్రీ! వేండ్రమయినవాఁడు పైకిఁ జల్లని వారుగను, జల్లనివారు పైకి వేండ్రముగలవారుగను జూపఁబడిరి. ఇట్టివారిని మనమెట్లు తెలిసికొనవచ్చును?' అని యడిగెను.

భీష్ముఁడు 'యుధిష్ఠిరా! ఈ విషయమై యొకపులికిని నక్కకును జరిగినసంవాదమై పురాతనమయిన యీ యితిహాసమునుదాహరించెదరు. దానిని వినుము. తొల్లి పురికియను శ్రీమంతమగు నొక పురమందు పౌరికుఁడను నొకరా జుండెను. ఆపురుషాధముఁడు మిక్కిలి క్రూరుఁడై పశులను హింసించుటయందే యాసక్తి గలిగియుండెను. వాని కాయువు ముగియఁగా, ఘోరదగని గతిని బొందెను. వాఁడు పూర్వకర్మములచేత దూషితుఁడై నక్కగాఁబుట్టెను. ఆనక్క తన మునుపటిజన్మము తలఁచి మిక్కిలియు నిర్వేదమునొంది, పశులొసంగిన మాంసములను

సయితము దినకుండెను. అది, యే ప్రాణికిని హింసగావింపక, సత్యముపలుకుచు, వ్రతమును మిక్కిలి దృఢముగా నూఁది, యుక్తకాలమందు పండిరాలిన పండ్లను నాహారము గావించుకొనుచునుండెను. (అది యొకసమయమందు నాకులే యాహారముగాఁ గొనుచు, నొకసమయమందు నీరేయాహారముగాఁ గలిగియు, నిట్లు వ్రతము నియమమునఁ జలుపుచు నొకరికిని లోనుగాక తనంతట నుండెను). ఆనక్కకు శ్మశానమందు వసించుట మిక్కిలి సమ్మతముగా నుండెను. అది దానికి జన్మభూమియగుటచేత మఱియొకచోటు నది యొల్లకుండెను. దాని జాతియందుఁగల తెక్కిన నక్కలన్నియును చాని శౌచమునుసైఁపక మిక్కిలి వినయముతోడి మాటలచేత దాని బుద్ధిని వేఱుపఱుపఁ దొడంగి దానితో 'నీవు భయంకరమైన యీవల్లెకాటియందు వసించియుండియుఁ బరిశుద్ధిని బడయఁ గోరెదవు. నీ యీబుద్ధి విపరీతముగా నున్నది!. ఏలన నీవు స్వభావముచేఁ మాంసము తినుదానవేకదా ? కాఁబట్టి మాతోఁబాటిగ నుండుము. నీకుఁ దినవలసినదానిని మేమిచ్చెదము. శుద్ధియనుదానిని దొలఁగఁబుచ్చి యెవి నీకునాహారముకాఁదగునో వానినిదినుము' అని చెప్పినవి. ఆమాటలునువిని యానక్క మధురములై వినయసంపన్నములై సహేతుకములై మృదువులగు వాక్యముల వానితో 'పుట్టుక నాకుఁ బ్రమాణముకాదు. కులము, శీలమును బట్టియే కలుగును. ఏకర్మముచేతఁ గీర్తి విస్తరిల్లునో యదియే నేను వేఁడుచున్నాను. వల్లెకాటియందు నేను వాసముచేసినను నాసమాధిని (బుద్ధిస్థితిని) జూడవలయును. (వసించుచోటు ధర్మమునకుఁ గారణముగాదు.) ఒకనియాత్మయే వానికర్మములకుఁ

గారణము గాని వాఁడు వసించుచోటుగాదు. ఆచోటు వానిధర్మమునకును గారణముగాదు. లేక (వాఁడాచరించుచున్న యాశ్రమముగాదు; *ఒకని యాశ్రమమును వానిధర్మమునకుఁ గారణముగాదు) ఆశ్రమమం దొకఁడు బ్రాహ్మణునిఁ జంపుచున్నాఁడు. ఆశ్రమము లేనియెడ నొకఁడు దానముచేయుచున్నాఁడు. ఆచంపుట పాతకమును గాకుండునా ? ఆదానము వృథయగునా ? మీకుఁ బ్రియమైనదానియందుఁ బేరాసగలిగి పొట్టఁ బోర్చికొను విషయమొక్కటియందె యాసక్తులై యున్నారు. తెలివిచెడినవారు కడపల నచ్చుదోషములను జూడరు. మీరు జరపుచున్నబ్రతుకు సంతోషముగఁ గావింపఁబడునదిగాదు. అది ధర్మహానివలన నెంతయు దూషితమైనది గాన నింద్యముగానున్నది; ఇహమందును బరమందును గీడుగావించునది. కాఁబట్టి, యట్టివృత్తినే నెంతమాత్రమొల్లను' అనెను. అంతఁ బరాక్రమమందువన్నెగన్న యొకపులి యానక్క శుచియుఁ బండితుఁడు నగుననితలఁచి తనకుం దగినపూజ దానికిఁ గావించి తానే దానినిమంత్రిగా వరించుకొనఁదలఁచి దానితో 'సౌమ్యా ! నీ స్వరూపము నాకుఁ దెలిసినది. నాతోడఁగూడి రాచఱికపుఁ గార్యములను జూచుకొనుము. నీ కిష్టమయినభోగములను బడిపూర్ణముగాఁగయికొనుము. అక్కఱలేనివానిని వదలుము. మాజాతివారువేండ్రమునివా రని ప్రసిద్ధిగాంచినవారు. ఇది నీకుఁ దెలుపుచున్నారము. నీవు మెత్తఁబాటు మున్నిడికొని యేలవలయును.

---

* 'నాశ్రమో ధర్మలక్షణమ్' అని మూలము. 'ఒకని యాశ్రమము వానిధర్మమునకుఁ గారణముగాదు' అని ప్రతాపచంద్రరాయులు.

అప్పటికి శ్రేయమును బొందుదువు' అనెను. అంత నక్క మృగ పతియైన యాపులిచెప్పిన మాటలనెంతయు గారవించి తలయించుకవాంచి వినయంబుతోడి పలుకుల 'మృగరాజా ! నాపట్ల మీరుచెప్పిన యీమాట మీకెంతయుఁదగియున్నది. మఱియు నీకు మంత్రులుగానుండుటకు ధర్మార్థములందు నిపుణులును, బరిశుద్ధులు నగువారిని వెదకుటయు నీకుఁ దగియున్నది. తగిన మంత్రిలేక గాని, నీప్రాణమునకే విరోధియగు దుష్టమంత్రికలిగి కాని, నీమహత్త్వమును బాలించుకొనుట శక్యముగాదు. మహా భాగా ! నీవు నీమంత్రులయందు, నీయెడ ననురక్తులును, నీతి విదులును, ఒకరినొక రూననివారును, ఆలోచనముగలవారును, జయమును గోరువారును, పేరాసలేనివారును, మోసములేని వారును, బ్రాహ్మణులును, నీమేలునందె కన్నుగలవారును, మంచి మనస్సు దిటగలవారును నగువారిని,నీతోఁబుట్టువులను నీతండ్రి లనుంబోలెఁ బూజింపుము. మృగాధిపా ! అయినను నాయి ప్పటి స్థితితోనే సంతుష్టుఁడనై యుండుటకంటె మఱియొకటి నాకిష్టము గాకున్నది. సుఖములందును, భోగములందును, నీయొద్దఁగాఁ యైశ్వర్యములందును నాకుఁ గోరిక లేదు. నాస్వభావము నీప్రాతపనివాండ్రతోడఁ బొసఁగియుండదు. వారు నాయెడల దుశ్శీలురై యుందురేని నీకును నాకును భేదము పుట్టింతురు.*నీవు మిక్కిలి తేజంబు గులుకున్నట్టి వారలకితరులకును నాశ్రయింపఁ

---

*'సంశ్రయాః శ్లాఘనీయా స్త్వమస్యేషా మపిభాస్వతామ్'అనిదా.మూలము. 'న సంశ్రయాః శ్లాఘనీయ స్త్వన్యేషా మపి భాస్వతామ్' అని బొ. మూలము. 'ఎంతతేజంబు వెలుఁగుచునున్నవారినైనను నొకరినాశ్రయించుట యొప్పిదముగా' దని యర్థము.

దగినవాఁడవు. మఱి యెంతయు శ్లాఘనీయుఁడవు. ఇఁక నాఁ బోఁటికి నిన్నాశ్రయింపఁదగియుండుట చెప్పనేల?* మఱియు నీవు కృతాత్ముండవు, మహాభాగుండవు, పాపులయెడను గూర్మిరత చూపనివాఁడవు, దీర్ఘదర్శివి, మిక్కిలి యుత్సాహము గలవాఁడవు, దాతవు, మహాబలుండవు. నీవుచేసిన పనులేవియు వ్యర్థములుగావు. భాగ్యములచేత సలంకృతుఁడవు. అయినను నాకుఁ గల యంతవట్టునకు సంతుష్టి నొందియున్నవాఁడను. కష్టమగు సేనకవృత్తిని జేసినవాఁడనుగాను. కాఁబట్టి సేవసేయుటకును నేరను. విచ్చలవిడిని వనమునఁ దిరుగుచుండువాఁడను. నా కివి యెట్లు తెలియును. రాజు నాశ్రయించి మనుచుండువారికి నిందల వలని దోషము లన్నియుఁ గలుగును.వనమునందున్ననో, యేపొత్తునుగలుగదు; ఏభయమును లేదు; ఏవిఘ్నమును జూపట్టదు. రాజు పిలువఁగా మనసునందేమి భయముపుట్టునో యది యడవి యందలి ఫలమూలములను దిని తినివిొందియున్నవారికిఁ గలుగదు. కస్తిలేక కలుగునట్టి వట్టి నీరు భయముతోఁగూడిన మేలి యన్నముకంటె నెంతయు లెస్స. ఈరెంటి నాలోచించి చూడఁగా నెచట నెమ్మదిగలదో యచటనే సుఖమని నాకుఁ దోఁచుచున్నది. రాజుభృత్యులయందొకొందఱే, చేసిన యపరాధములకుఁ దగిన దండమునొందుదురు.వారియందుఁ బెక్కండ్రులేని పోని యపరాధములచేత దూషితులై రాజునలన మృతినొందుదురు. నేరముచేయక దండమునొందువా రెందఱో నేరముచేసి

---

* ఇవన్నియు నక్కకు విశేషణములుగా నుత్తరదేశపాఠములందుఁ జూపట్టుచున్నవి. అయిన నివి పులికి విశేషణములుగానుండుటయె మఱింత యుపపన్నముగాన చాక్షిణాత్యపాఠమె కయికొనఁబడినది.

దండమునొందువా రంద ఱుండరు.మృగేంద్రా ! ఇవియన్నియు నట్లుండ నన్ను మంత్రినిగాఁ జేయఁదలఁతువేని నీవు నాయందు నడచుకొనవలసినరీతినిగుఱించి న్యాయముచొప్పున నొకసమయము చేయఁగోరెదను. నన్నుఁ జేరినవారిని నీవు గౌరవింపవలయును. నేను జెప్పహితమును వినవలయును. నాకై నీ వేర్పఱచునర్థ మును నీవుమార్పక నిక్కిలి తిరముగానే యుంపవలయును.నే నొకప్పుడును నీదు తక్కినమంత్రులతోడ మంత్రాలోచనముచేయను. అట్లు చేసితినేని వా రర్థశేయము గోరుదుగాన, లేనిపోనితప్పులు నాయెడఁ జెప్పుదురు. నీ వొక్కనితోడనే నే నొక్కండును గలసి హితమును మంతనమునఁ జెప్పుదును. నీజ్ఞాతులను సంబంధించినకార్యములందు నన్ను 'హితమేది యహిత మేది' యని యడుగరాదు. నాతో నాలోచించిన పిదప నీవు నీమంత్రులను హింసింపరాదు. నీవు కోపము నొంది సంబంధించినవారిని దండింపరాదు' అనెను. అందులకుఁ మృగనాథుఁ డా పులి వల్లె యని సమ్మతించి దాని నెంతయుఁ బూజించెను. నక్కయుఁ బులికి మంత్రిగానుండుట నంగీకరించెను. అట్లు పులి యానక్కను సత్కరించి యాయా కార్యములందు నియమించుచుఁబుటనుజూచి మునుపటి భృత్యులందఱు నొక్కటిగాఁ గూడి యెడతెగక దానిని ద్వేషింపనారంభించినవి. ఆదుష్టబుద్ధులు మొదట మిత్రభావముతోడ మంచి మాటలఁ గయివసముచేసికొని రాజ్యమునం దున్నదోషములందుఁ జొప్పించి దాని నామోదించునట్లు చేయఁజూచెను. ఏలనఁగా వారు పరద్రవ్యములను నపహరించుచు జాలఁగాలము సుఖముగా వసించుచుండిరి. ఇప్పుడు నక్క కట్టుదిట్టములకులోనై

యుండుటచేత నితరులధనముల నించుకయైన నపహరించుట వారికి శక్యము గాకపోయెను. అవి తమయభివృద్ధిని గోరుచు దానిని నధికారమునుండి లేవనెత్తుటకుఁ దివురుచు దాని నింప యిన ముచ్చటలచేత నాసగొలుపఁజూచినవి. మఱియు గొప్ప లంచము లిచ్చి దానిబుద్ధిని వశీకరింపఁ బ్రయత్నించినవి. అయినను నానక్క మిక్కిలియుఁ బ్రజ్ఞగలదిగావున నవిచేయువానికిఁ దన మనస్సు దిట తప్పినదిగాదు. పిదపఁ దక్కినవి దానికి నాశము గలిగింపవలయు ననిసంకేతించుకొని మృగరాజునకు మిక్కిలి యిష్టమైన యతనికిఁగాను జక్కఁగాఁ బక్వము సేయఁబడినట్టి మాంసము నెత్తికొనిపోయి యానక్కయింట గహస్యముగాఁ బెట్టినవి. అమాంసము నెవరు దొంగిలితెచ్చిరో, యది యెవరెందులకుఁగా నట్లుచేసిరో యానక్కకుఁ దెలియును; అది యన్నియు దెలిసియుండియును (దీనిమూలమున నీబంధము మనకుఁ దెగిపోవ్రగాక యని యీ) యొకకారణమునుబట్టి సహించియుండెను. మంత్రిపదవిని బొందుకాలమునం దానక్క 'ఓరాజా ! నీవు నాయందుఁ దెలిఁగిగోరుదువేని నన్నుఁ దగినకారణములేక నమ్మక పోవరాదు. (నాకుఁ దెడుగుసేయరాదు)'అని ప్రతిజ్ఞ చేసికొన్నది. ఆయాలోచన మున్న తెఱఁగును దెలియఁగోరియు నావిషయ మందపేక్ష గలిగియుండెను. పిదప మృగరాజాకలిగొని లేచిరాఁగా నతనికి భోజనము తేవలసిన సమయమందు నామాంసము కనఁబడదయ్యె. మృగరాజు దొంగను వెదకిపట్టవలయునని యానతిచ్చెను. కపటములగు నానక్కలును 'ఆమాంసము విద్వాంసుఁడును మహాప్రాజ్ఞుండు నని తన్ను నెన్నుకొనుచుండుమీ మంత్రి యపహరించినాఁడు' అని తెలిపెను. తోడనే నక్కచాప

లమును విని పులి కోపముగొని చూపోపనిదయ్యె. రాజగు పులి యానక్క-ను జంపవలయుననియుఁ దలంపుగొనెను. ఆతఁఱిని జూచి దాని పూర్వకుంత్రులు దానితో 'ఆనక్క- మాయంగఱు జీవనములను జెఱుపఁజూచుచున్నది' యనెను. ఇట్లుచెప్పి మరల నవి యానుంత్రినక్క-రాజు మాంసమును దొంగలించిన కార్య మును విస్తరించి తెలుపఁబూని యా పులితో 'అదిచేసిన యీ పనియే యిట్లున్నది. ఇఁక మఱెద్ది యదిచేయదు ? అది దేవర యెట్టిదిగా ముందు వింటిరో యట్టిది గానేకాదు.మాటలయందే ధర్మముట్టిపడుచున్నది ; స్వభావమందో బెట్టిదముగా నున్నది. అది నిజమునకుఁ బాపి; వైకి ధర్మవేషము వేసికొనియున్నది. దాని యాచారమంతయు వట్టిబూటకము. తనకార్యముకొఱకు భోజ నము మొదలగువానియందు నియమములుపెట్టికొని వ్రతము లనుబూని శ్రమపడిన దింతేకాని.ఇది దేవరకు నమ్మికగాదేని దీనిని గన్నులయెదుటఁ జూపెదము' అనెను. ఇట్లుచెప్పి యవి తోడనే వేగముగా నానక్క-యింటనుండి యామాంసమును దెచ్చినవి. అట్లు మాంసమును గొంపోవుటయు నవిచెప్పినతక్కిన మాట లును విని పులి నక్క-ను జంపున ట్లాజ్ఞ చేసెను. అంత నక్క-కుఁ గలిగినవ్యసనమును జూచి పులితల్లి హితవచనములచేత బోధిం చుటకై యామృగరాజుకడకువచ్చి 'పుత్రా ! ఈపన్నుగడ యంత యుఁ గపటంపుఁగుట్రతోఁగూడినది. దీనిని నీవ్ర గయికొనరాదు. అశుద్ధులగువా రసూయవలని దోషములకులోనై శుద్ధుఁడగు వానియందుఁ దప్పులుపెట్టుదురు. ఒకరియున్నతిని మఱియెవ్వఁ డునుజూచి సైఁపఁడు. గొప్పయధికారకృత్యము వైరమును గలి గించునది. తపస్సుమొదలయిన వానియందుఁ బరిశుద్ధునియందు



572. పులి నక్కను జంప ప్రయత్నించుట ; పులితల్లి నివారించుట.

దోషములు వైతురుగదా. వనమందుండి తనకర్మములను గావించుకొనుచుండు మునికినిగూడఁ మిత్రుఁడు, మధ్యస్థుఁడు, శత్రుఁడని మూఁడుపక్షములు నుప్పతిల్లుచున్నవి. లోభులకుఁ బరిశుద్ధులయందును, బిజీకివారలకు బలశాలులయందును, మూర్ఖులకుఁ బండితులయందును, దరిద్రులకు ధనాఢ్యులయందును, అధర్మాత్ములకు ధార్మికులయందును, విరూపులకు చక్కనివారియందును, ద్వేషముగలుగుట సహజము. పండితులందుఁ బెక్కండ్రును, మూర్ఖులును, లుబ్ధులును, కపటమున బ్రతుకువారును, నొకదోషరహితునియందు వాఁడు బృహస్పతివంటి బుద్ధిగల వాఁడయ్యును దోషములు చెప్పుదురు. నీవు లేనపుడు నీయింటనుండి యీమాంస మపహరింపఁబడినదేకానిమ్ము. అయిన నానక్కయొకరిచ్చినదానినిగూడ నొల్లదు. మొదట దీనిని జక్కఁగా నాలోచింపుము. పొల్లయినవి నిజముగాఁ జూపట్టుచున్నవి. నిజములయినవి పైకిఁ బొల్లుగాఁ గనుపట్టుచున్నవి. లోకమునఁ బ్రాణులందు నానావిధములు చూపట్టుచున్నవి. కాఁబట్టి వాని యందెది యెట్టిదో పరీక్షింపవలయును. ఆకాశము నల్లనిపాత్ర యడుగువలెను మిడుంగురుబురు వగ్గిమిడుఁగుఱువలెనుగానఁబడుచున్నవి. నిజమునకు నాకాశమునకడుగులేదు. మిడుగురు బురువునం డగ్గియులేదు. కాఁబట్టి కన్నారఁ గనఁబడునట్టివస్తువును గూడఁబరీక్షింపవలసినదియుక్తముగానున్నది. ఒకఁడేవస్తువైనఁ బరీక్షించి తెలిసికొనునేని, పిదప దానివిషయమునఁ బరితాపపడకుండును. పుత్రా! ప్రభువగువానికిఁ దనభృత్యునిఁ జంపించుట యొకకష్టముగాదు. కాని లోకమునఁ బ్రభువు లగువారికి మన్నించుటయే యెంతయుఁ గొనియాడఁదగినది. అదియెంతయుఁ గీర్తి

కరము. పుత్రా! నీ పీనకక్కను మంత్రిగాఁ జేసితివి ఇది సామంతుల కెల్లను దెలిసినదే. పాత్రము దొరకుట యరిది. ఇది నీకుఁ జెలి కాఁడు; కాఁబట్టి దీని నుంచుకొనుము. పరిశుద్ధుఁడగు నొకనిని, రాజు, వానిపగవారు మోపిన లేని దోషములను బట్టి, దోషియ నియేవేఱుగఁదలఁచునేని, యారాజు తనమంత్రులనుజెడితాను నువేగనశించుచున్నాఁడు.' అనెను ఆపులి యిట్లుచెప్పి ముగించిన పిదప నానక్క క్రిందియధికారియొకటి మిక్కిలి ధర్మాత్మకమైనది, దానిశత్రువుల నడుమనుండి ముందటికివచ్చి యాకపటపుఁబన్ను గడ పన్నిన విధమంతయు వెలిపుచ్చెను. అంత నామృగనాథుఁ డానక్క మంచినడవడిగలదిగాఁ దెలిసి దానిని సత్కరించి విడిచి పుచ్చెను; మఱి చెలిమి గడలుకొనం బలుమాఱు బిగియఁ గౌఁ గిలించుకొనెను. నీతిశాస్త్ర విదం బయినయానక్క యాయవ మానమునకు మిక్కిలి పరితపించి యామృగపతిని బ్రాయోప వేశమునకు ననుజ్ఞయిచ్చునట్లు వేఁడెను. ఆపులి గన్నులు విచ్చి చెలిమివలనఁ దేఱుకొనఁజూచి మిక్కిలి ధర్మాత్మకంబయిన యానక్కను నెంతయుఁ బూజించి యట్లు చేయవలదని వారిం చెను. ఆనక్కయు నట్లు తనయేలిక నెయ్యమునఁ దొట్రుపడు చుండుటనుజూచి ప్రణతుఁడై పలుకు కన్నీటిచే డగ్గు త్తికవడ దా నితో 'మొదట నీవు నన్నుఁబూజించితివి; పిదప నవమానించితివి; నీనడత నన్ను నీకు శత్రువై యుండు స్థితికిఁ దెచ్చినది. ఇఁక నీయొద్దనుండుట నాకుఁదగదు. సంతుష్టి లేనివారును, తమ యధి కారపదమునుండి తొలఁగఁబడినవారును, గౌరవము క్రిందు పఱుపఁబడినవారును, తమ్ముఁదామే చెఱుపుకొన్నవారును, తమ (యేలికకోపమువలన) శత్రువులచేత వంచితు లయినవారును,

మిక్కిలి క్షీణించినవారును, వేరాసగలవారును, క్రుద్ధులును, భీతులును, వైయధికారులచే వంచితులును, రాజుచేత సొమ్మపహరింపఁబడినవారును, గరువమగు గొప్పకృత్యములు చేయుటకుఁ దమకము గలిగియుండియు విత్తమార్జించు నుపాయములు లేకుండునట్టివారును, తమకుఁగలిగించినబాధకు దుఃఖముననో కోపముననో పొక్కుచుండువారును, తమయేలికకు వ్యసన సమూహములు వచ్చుటకై యెదురు చూచుచుందురు. ఒడయఁడు నంచింపఁగా వారితనిని దిగవిడిచి శత్రువులచేతికి మంచిసాధనము లగుదురు. నీవు నన్నవమానించితివి. మరల నన్నధిక్కారమునందు నిలిపితివేని నన్నెట్లు నమ్మఁగలవు? నిన్నుఁగాని నేనెట్లు నమ్మఁగలను? నన్ను నీవు సమర్థుఁడని చేరఁబట్టి పరీక్షించి యధికారమందు నిలిపితివి. అప్పుడు చేసినయొడంబడికను నుల్లంఘించి, నన్నవమానించితివి. ఒకనిని బదుగురి నడుమ మొదట శీలవంతుఁడని బ్రకటముగాఁ జెప్పినచో, అట్లు చెప్పినవాఁడు తానాడి తప్పకుండునేని మరల వానినిగుణహీనుఁడని చెప్పరాదు. ఇట్లు నన్నవమానించితివి గావున నాయందిఁక నమ్మకయుండఁజాలదు. నీకు నమ్మకము తీసిపోయినపిదప నీయందు నాకుభయము కలుగును. నీకు నమ్మకము లేకుండఁగా, నాకు భయమగుచుండఁగా, మనశత్రువులు మనల బాధించుటకు సందులు వెదకుచుందురు. నీప్రజలు తుదకు నెయ్యము లేక, తనివియుఁ గానకపోదురు. ఇట్టిస్థితికిఁ బెక్కుదోషములు గలవు. మొదట గౌరమును బిడప నవమానమును గలిగినట్టి స్థితి సుఖమైనదిగాఁ బ్రాజ్ఞులెన్నరు. వేఁయుపడినది గూడికొనుట కష్టము. వేఁయుపడి మరలఁ గూడినచోటఁ గలుగు ప్రీతి మరల స్నేహముచేతఁ బెరుఁగదు.


భ ర్తవగు నిహితము గోరువాఁ డొక్కఁడును గనుపట్టకున్నాఁడు. కొలువు, తనకును దనభ ర్తకును మంచిసేయు నభిప్రాయము నుండియే కలుగుచున్నది. అన్నిక్రియలును స్వార్థమును బట్టియే కయికొనఁబడుచున్నవి. స్వార్థమునుబట్టి కాక వట్టి నెయ్యమును బట్టి కలుగు నభిప్రాయములు మిక్కిలియు దుర్లభములు. రాజుల కెవరికి మనసు చలించుచును నిమ్మళము లేకయు నుండునో వారి పురుషుల కలరూపు నెఱుంగుట యెంతయుఁ గష్టము. నూర్వురయం దొక్కఁడే సమర్థుఁడుగను జంకులేని వాఁడుగను దిరుగుచున్నాఁడు. మనుష్యుల కభివృద్ధియు, నాశమును దనంతటనే కలుగుచున్నవి. శుభమును నశుభమును, మహత్వమును రానీక నిలుపఁజూచుట బుద్ధి తక్కువయే యగును.' అనెను.

భీష్ముఁడు. 'నక్క యిట్లు ధర్మార్థకామయుక్తము లగు తిన్నని మాటలాడి రాజును బ్రసన్ననిఁ గావించి వనమునకు మరలిపోయెను. బుద్ధిమంతమయినయానక్క మృగరాజు వేఁడుకొన్నను బాటింపక ప్రాయోపవేశముచేసి శరీరమును విడిచి స్వర్గమును బొందెను'అనెను. ఇది నూటపదునొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడలసత్వమనర్థహేతువని నిరూపించుటకై లూటియకథను జెప్పుట.}

ధర్మరాజు 'ధార్మికోత్తమా! రాజు చేయవలసిన దేఁగ? ఏమి చేసి సుఖమునొందును? దానిని గలరూపున నాకుఁ జెప్పుము' అని యడిగెను. భీష్ముఁడు 'ఈలోకమందు రా జేమి చేయవలయు



577. లొట్టియ తనగొంతుకు గాలివలన సహాయము లేకుండుటకై
కొండగుహాలో నుంచుట ; నక్కలు చలిచే వచ్చి
దానిగొంతును గొఱికి తినుట.

నో, దేనినిజేసెనేని సుఖమునొందునో యట్టి కార్యమును ముఖ్యముగా నిశ్చయించి యిప్పుడు నీకుపదేశించెదను వినుము. ధర్మరాజా! ఒక లొట్టియనుగుతించి యీ పెద్దకథను మేము వినియున్నాము. దానియట్లుండరాదు; అది తెలియుము. కృతయుగమందొక పెద్ద లొట్టియయుండెను. దానికి పూర్వజన్మస్మరణముగలదు. అది వాఁడి యగునియమముతో వరణ్యమందుఁ దప మనుష్ఠించుచుండెను. దానితపము ముగియఁగా బ్రహ్మ దానియెడఁ బ్రీతుండై కోరినవర మడుగు మనెను. అందుల కా లొట్టిపిట్ట 'మహాత్మా! నీ యనుగ్రహమువలన నాయొక్కుత్తుక నూఱుయోజనముల తుద నున్న యూహారమునేనియుఁ దీసికొన శక్యమగునంత నిడివిగా నుండవలయును' అనెను. అందులకు బ్రహ్మ 'వల్లె'యని చెప్పఁగా నది గొప్పవరమును బడసి తనయడవిని బోయిచేరెను. అపు డా యొంటె మిక్కిలి చెడుబుద్ధిగలది గాన, బ్రహ్మదేవుఁడు వరమొసంగినకారణమున సోమరితనమును గలిగియుండెను. ఆదురాత్మకమయినది చెడుకాలముచేఁ దెలివి యుడిగి, యాదినము మొదలుగాఁ బచ్చికమేయుటకు బయలు వెడలినదిగాదు. ఒక నాఁడది నూఱుయోజనములు నిడుపయిన తనకుత్తుకను జూఁచి యేశ్రమములేక యూహారము నరయుచుండఁగా నొక గొప్ప గాలివుట్టెను. అవివేకి యగునాలొట్టియ తనతలనును గుత్తుకనును నొక కొండగుహయందుఁబెట్టి యూగాలివాన యడుగుటఁ జెదురుచూచుచుండెను. తోడనే లోకమునంతయు వెల్లినిముంచునట్లు బెట్టిదమయిన వర్షము గురిసెను. అపు డొకనక్కలిచేత నవయవములు వడఁకుచుండ నాకటిచే స్రుక్కుచు వానవెల్లికిఁ గలంగి భార్యయుఁ దానును వేగ యూగుహకువచ్చి

చొచ్చెను. మాంసమువలన బ్రతుకునట్టి యామృగము మిక్కిలియు నాకలిచే గటకటంబడుచు నాలొట్టియకుత్తుకను దినగడంగెను. తెలివిమాలిన యాలొట్టియ, తాను భక్షింపబడుచుండుటను దెలియఁగానే మిక్కిలియు దుఃఖమునొంది కుత్తుకను ముడుచుకొనఁ బ్రయత్నించినది. లొట్టియ కుత్తుకను గ్రిందుగను మీఁదుగను ముడుచుకొనుటకై కదల్పఁగానే నక్కయు దానిభార్యయుఁ బట్టువిడువనికి దానిని దినుచునే యుండెను. ఆ లొట్టియ యొకింత సేపటికిఁ బ్రాణమువిడిచెను ఆనక్కయంత లొట్టియను జంపితిని తుపాను దీసినపిదప నాగుహానుండి వెడలి వచ్చెను. ఇట్లాలొట్టియ దుర్బుద్ధిచేత మరణము నొందెను. సోమరితనమువెంట గొప్పదోషము క్రమముగా వచ్చుటను జూడుము ! నీవట్లు సోమరితనము లేక యింద్రియముల నియమించి తగినయుపాయముతో నేదియుఁ గావింపుము. జయమునకు బుద్ధియే మూలమని మనువు చెప్పెను. కర్మములు బుద్ధిచేతఁ జేయఁబడునవి శ్రేష్ఠములు; భుజబలముచేతఁ జేయఁబడునవి మధ్యములు; పిక్కలచేత (త్రిమ్మరి) చేయఁబడునది యధమములు; బరువుమోసి చేయఁబడునది యన్నిటికంటెఁ దక్కువయైనవి. రాజు రాజ్యము నడుప సమర్థుఁడై యింద్రియముల నిగ్రహించినవాఁడేని యతనిరాజ్యము చెడక నిలిచియుండును. ఆర్తిగలవాఁడు బుద్ధిమూలముననే తాను గోరినది సాధింపవలయునని మనువు చెప్పెను. ధర్మరాజా ! రహస్యముగా నున్న మంత్రాలోచనములను వినువారును, సహాయులు మిక్కిలి గలవారును, చక్కఁగాఁ బరీక్షించి నడచుకొనువారును, సమస్తకార్యముల యందు సిద్ధినొందుదురు. అట్టి సహాయము గలరాజు భూమినంత

యుఁ బాలింపశక్తుఁడగును. మహేంద్రసమాన ప్రభావా! తొల్లి శాస్త్రవిదులగు పురుషులచే నిది చెప్పఁబడినది. నేను శాస్త్ర మందుఁ గన్నిడియే దీనిని నీకుఁ జెప్పితిని. నీవు పరాకునడక నడచుకొనుము' అని చెప్పెను. ఇది నూటపండ్రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు బలవంతుఁడగు శత్రువును జయించి కొనుటకు వినయ ముపాయమగు నని నదీసాగర సంవాదమును జెప్పుట.

ధర్మరాజు 'భరతసింహమా! రాజు, తగినసాధనములు లేక యే *దుర్లభం బగు రాజ్యమును బడసి మిక్కిలియు వృద్ధినొందియున్న శత్రుపురెడల నెట్లు నడచుకొనవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు—'భారతా! ఈ విషయమందు నదులకును సముద్రునకును జరిగిన సంవాద మయి పురాతనమయిన యీ యితిహాసమును నుదాహరించుచున్నారు. తొల్లి, యసురులకు మనికిపట్టును నదులకుఁ బతియునగు సముద్రుఁడు సమస్తనదులను జూచి తనకుఁగలిగిన సంశయముల నడుగఁదొడఁగి 'నదులారా! మీరు ప్రవాహములు వెల్లిగొని పెద్దపెద్ద మ్రాఁకులను వేళ్ళతోడను గొమ్మలతోడను బెకిల్చి యిచ్చటికిఁ దేఁగాఁ జూచుచున్నాను. కాని నీరుప్రబ్బలిని మాత్రము పెకల్చి తేఁగాఁ జూడను. మీగట్టులయందు మొలచు నీరుప్రబ్బలి చిన్న కొలఁది

* 'రాజా రాజ్యమను ప్రాప్యదుర్లభమ్' అని బొ. మూలము. 'దుర్బలః' అని దాక్షిణాత్య పాఠము.

గలది; దాని సత్తువయు నల్పము. దానిని నలక్ష్యభావముచేతఁ బెకల్చి తేరా? లేక దానివలన మీకేమియినను ప్రయోజనము గలదా? మీకందఱు కిట్లు నీరుప్రబ్బలిని గట్టులను ద్రెంచి తేకుండుటకుఁ గలయభిప్రాయ మేమో వినఁగోరుచున్నాను అని యడిగెను. ఆవిషయమున గంగానది సముద్రునిఁ జూచి యర్థవంతమును హేతుయుక్తమును బోధకరము నగుమాటల తో 'ఈపెద్దమాఱికు లున్నచోటనేయుండి యీచోటునుండి కదలక మెదలక దృఢముగా నెలకొనియుండును. ఇట్లవి మా నెల్లువల నెదుర్చుననిగా నుండుటవలన నవి పెరిగినచోటును విడుచునట్లు గావింపఁబడుచున్నవి. నీరుప్రబ్బలి, యున్నచోట నుండి తొలఁగదు. అది పెల్లునయురవడిని జూచి వంగిపోవు చున్నది. తక్కిన మాఱికు లట్లు వంగవు. ప్రవాహవేగము తీసినదే యీనీరుప్రబ్బలి మరలఁ దనయెప్పటిచోటు నొందును. అది కాలమును సమయమును దెలిసినది; మాకు వశ్యమైయుండునది. మాకనుకూలముగా నడచుకొనునది. స్తంభమువలె దిటముగా నిలఁబడక యుండును. కాఁబట్టి యది నిన్నుఁ జేరుటలేదు. నీటి యురవడికిని గాలివేగమునకు నడఁగియుండి పిదప బయికిలేచు నట్టి యోషధులును, మాఱికులును, జెట్లును, నవమానము నొందవు' అనెను. యుధిష్ఠిరా! కాఁబట్టి మిక్కిలి వృద్ధినొంది యున్న శత్రురాజువలని బంధమును బోఁగొట్టుకొనుటకు వాని మొదటియురవడి నెవఁడు సైఁపఁడో వాఁడు శీఘ్రముగానే నశించును. మంచి తెలివిగలరా జెవఁడు తనకును శత్రువునకును గల బలాబలములను సేనను బరాక్రమమును దెలిసి నడచుకొనుచున్నాఁడో వాఁడవమానము నొందఁడు. ఇట్లు తెలి విగలవాఁడు,

శత్రుపు తనకంటె నెక్కుడుబలముగల వాఁడని తెలిసినప్పుడు నీరు బ్బబ్బలికీతి నాశ్రయింప వలయును. ఇదియే తెలివికి లక్షణము' అనెను. ఇది నూటపదునూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు సభయందు దుష్టుఁడు చెడ్డవాట చెప్పి నను దానినోర్చుట మంచిదనుట. }

ధర్మరాజు 'మూఢుఁడును గూర్మికుండు నగునొక చిట్టమాటల వాఁడు మెత్తనివాఁడగు విద్వాంసుని సభయందు నిందించు చుండఁగా నావిద్వాంసుఁ డేమిచేయవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'రాజా ! ఈవిషయము చక్కఁగాఁ దెలియునట్లు వినుము. ఎప్పుడు నెఱుకగలవాఁడల్పబుద్ధియగు మనుష్యుని మాటలకు సైఁపవలయును. దూషింపఁబడువాఁడు కోపమునొందక యుండినేని దూషించువాని సుకృతమునెల్లఁ బొందుచున్నాఁడు. అట్లు సైఁచినవాఁడు తనదుష్కృతములను, గోపంబున నట్లు దూషించినవానికె పుచ్చుచున్నాఁడు. * కూపెట్టుచున్న రోగియెడలంబోలె,నిందించుచున్న యామనుష్యునియెడల నుదాసీనుఁడై యుండవలయును. లోకులపగకుఁ బాలయినవాఁడు బ్రతికియు వ్యర్థమే. మూఢుఁడు 'నే నట్టిగొప్పవానిని నట్టి సభయం దిట్టి మాటలడిగితిని' అని పలుమాఱు చెప్పుకొనుచుండుటను, నట్లు

* 'గర్హితం తమువేక్షేత వాశ్యమాన మివాతురమ్' అని మూలము 'టిట్టిభం తమువేక్షేత వాశ్యమాన మివాతురమ్' అని బౌ. మూలము. రొదసేయుచున్న టిట్టిభపక్షినింబోలెనని యర్థము.

చేసిన చెడుగునకుఁ దన్నుఁబొగడుకొనుచుండుటను మాటికిఁ జూడ వచ్చును. మఱియువాఁడు 'వాఁడు నేను దూషింపఁగా సిగ్గు పడి సత్తువచెడి చచ్చినవానివలె నుండెను' అని చెప్పికొనును. పురుషాధముఁ డితరులు డంబముగాఁ జెప్పికొనరాని యట్టిపని చేసియు సిగ్గుమాలి డంబముగాఁ జెప్పికొనును. అట్టి పురుషాధ మని జతనంబున దాంతుఁడగువాఁ డుపేక్షింపవలయును. అల్ప బుద్ధిగలవాఁడు చెప్పెడిమాటలనెల్ల నప్పటికి సైఁపవలయును. వాఁ డడవియందు వ్యర్థముగాఁ గూయిడుచుండు బుద్ధిమాలిన కాకి వంటివాఁడు. అట్టివాఁడు కొనిమాడియు దూషించియు నేమిచేయఁగలఁడు; ఒకరిని వట్టిమాటలచేతనే దూషించువా రట్లు దూషణములను నిరూపింపఁగలుగుదురేని వారిమాటలకుఁ గొంతసేపు గలుగును. నిజమునకు వారిమాటలు, మూఢులు తాముకలహరించువారిని జచ్చునట్లు పెట్టుశాపము లంతపస యే కలవిగాని వేఱుకాదు. నిందించువాఁడు తనచేష్టల చేతను మాటలచేతను దనతల్లియందు మాఱుమగనికిఁ బుట్టు టను బ్రకటించికొన్నవాఁ డగుచున్నాఁడు. నెమ్మలి నృత్యము సేయునపుడు గుహ్యప్రదేశమును వెలిపుచ్చును. అది తన నృత్యమునకే విఘ్నమగునుగాని తనగోప్యాంగమును జూపుటకు సిగ్గుపడనట్లు నిందించువాఁడును తాను బరుని నిందించినందులకే సంతోషించునుగాని దానివలనఁ దనతల్లిదోషము వెలిపుచ్చినం దులకు సిగ్గుపడఁడు. ఎవని కీలోకమందుఁ జెప్పరానిమాటయుఁ జే యరానిపనియు నొకటియుఁ గలుగదో*యట్టివానిపుట్టుకకుమతి

* 'సంక్లిష్టజన్మా' అని మూలము. 'సంక్లిష్టకర్మా' అని పాఠాంతరము. ఈపాఠమునం దర్థము క్లిష్టముగా నున్నది.

యొకడును(మాఱుమగడును) హేతువుగాఁగలసి యున్నాఁడు. అట్టివానితో శుచియగువాఁడు మాటాడరాదు. ఎవఁడొకని యెడుటవానిగుణములను, మఱుఁగున వానిదోషములను, నెత్తి చెప్పనోవాఁడులోకమునఁ గుక్కవంటివాఁడు. వానికి మంచిలోకములును జ్ఞానమును ధర్మమును నశించినవగును.అట్టిమనుష్యుఁడు పెక్కుదినములు దాను చేసిన దానములును వేల్చిన హోమములును, మఱుఁగునఁజేసిన నిందనములచేతఁ దోడనే నాశముచేసికొనుచున్నాఁడు. కాఁబట్టి ప్రాజ్ఞుండును నుతిమంతుఁడునగువాఁడట్టి పాపచిత్తుండును నర్జనీయుండునగుమనుష్యునిఁ గుక్కమాంసముంబోలెఁ దోడనే వర్జింపవలయును. పెక్కుజనులసమూహములలోపలి గొండెములుచెప్పు దురాత్ముఁడు సర్పము తనపడగనెత్తి చూపునట్లు తనదోషములను వెలిపుచ్చుకొనుచున్నాఁడు. ఆవెనుఁ గొఱుకుఁ దనకుం బోలినపనిని (పరనిందను) గావించుచుండఁగా వానికి మాఱుసేయనుంకించువాఁడు, బూడిద కుప్పలోమునిఁగిన బుద్ధిమాలిన గాడిదయుంబోలె దుఃఖమున మునుఁగుచున్నాఁడు. జనుల నెప్పుడును నిందించుచుండుటయందే యాసక్తుఁడైయుండు వానిని, జిమ్మిరేఁగిన తోఁడేలుంబోలెను మత్తిలి యెసరేఁగి గర్జించుచున్న యేనుంగుంబోలెను మిక్కిలి బెడిదమునుగల కుక్కనుం బోలెను ధ్యజింపవలయును. అయోగ్యులు పోవుమార్గమున వర్తించువాఁడును, ఇంద్రియనిగ్రహమును వినయమును లేనివాఁడును, పాపుండును, శత్రుత్వమే వ్రతముగాఁగలవాఁడును, ఎప్పుడును నితరుల సంపద నశింపవలయుననియే కోరుచుండువాఁడును, పాపబుద్ధియునగు నట్టిమనుష్యుఁడిస్సీ ! పాడైపోవుగాక. మఱియు

వారు నిన్ను మిక్కిలియు నిందించుచుండినను నీవది విని యూర్కొం డ వెంతమాత్రము గాకుము. గొప్పవానికిఁ దక్కువవానితో వాదము స్థిరబుద్ధు లగువారెంతయు నిందింతురు. వాఁడు గోప ముగొనెనా కొట్టెకినను గొఱుకును.కొట్టినను గొట్టును. దుమ్మును నుముకను బయిని జల్లినను జల్లును. పండ్లుతెఱచి చూపి భయ పెట్టును. ఇదంతయుఁ గుపితుండును శూరుండు నగు మూఢుని యందు సిద్ధము. దురాత్ముఁడు సభయందుఁ గావించు నిందను దుర్జనులను సహించువాఁడును మాటికిని నీ నిదర్శనములను జదువువాఁడును. మాటలచేత నేవిధమయిన బాధయును బొం వఁడు' అనెను. ఇది నూటపదునాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు రాజులకు సాహాయ్యమును జేర్చుకొనుట గూఢపర్యకి మని చెప్పుట }

ధర్మరాజు 'పితామహా ! నీవు మిక్కిలియుఁ బొగ్గిజ్ఞుఁడవు. నాకుఁ బెద్దసందేహ మొకటిగలదు. ఇది నీవే తొలఁగింపఁ జాలు దువు. నీవు మాకులమును వృద్ధి నొందించినవాఁడవు గదా ! తండ్రీ ! చెడునడవడియుఁ జెడుమనస్సును గలమనుష్యులు నిం దించి మాటలాడుటను గుఱించి యిపు డుసన్యసించితివి;మఱియు నీ కొకటి విన్నవించు కొనుచున్నాను.రాజ్య తంత్రమునకు హిత మైనదియు, కులమునకు సుఖము కలిగించునదియు, మీఁదటికిని నిప్పటికిని క్షేమమును వర్ధిల్లఁజేయునదియు, పుత్రులకును బౌ

త్రులకును సంతోషమును బుట్టించునదియు, రాష్ట్రమును వృద్ధిఁబొందించునదియు, అన్న పానములకును దేహమునకును హితమునదియు నగు దానిని నాకుఁ జెప్పవలయును. రా జభిషిక్తుఁడై రాజ్యము నేలుచు * మిత్రులచేతఁ బరివేష్టితుఁడయ్యు సుహృదులంగూడియుఁ బ్రజల నెట్లు రంజింపవలయును? ఏ రాజు తన నెయ్యములయు సనురాగములయు బారిందఁబడి దుష్ట విషయములందు మిక్కిలియుఁ దగులుగలిగి, యింద్రియముల నడంపఁ జాలమి వలనఁ జెడుమనుష్యులను బరిపాలించుచు నుండునో యతని భృత్యులు కులీనులగు వారందఱును నతని మొడవిముఖులగుదురు. అతఁడు మంచి భృత్యుల బలమువలనఁ బడయఁదగు నర్థములను బడయనేరఁడు. నీవు బుద్ధియందు బృహస్పతికి సముండవు. రేయుం బగలు రాజ ధర్మములనే చింతించుచున్న వాఁడనుగాన నాకు నీ విషయమును నీవు చెప్ప నర్హుఁడవు. పురుషసింహమా ! నీవు మాకులహితమందే యాసక్తిగలిగి యుందువుగాన మాకు రాజకీయ విషయములను నుపదేశించుచుందువు. మహాప్రాజ్ఞుండగు విదురుం డొక్కండును నెప్పుడును మా కుపదేశము సేయుచుండువాఁడు. నేను నీవలనఁ గులహితమును రాజ్యమునకు హితకరంబు నగునుపదేశమును విని యవ్వయంబగు సమృతంబును ద్రావినట్లు తృప్తినొంది సుఖముగా నిదురించెదను. ఎట్టి భృత్యులు నికృష్టులు? ఎట్టివారు సర్వగుణసంపన్నులు ? ఎటువంటి భృత్యులతోఁ గూడి లేక యెట్టి కుల మునఁ బుట్టిన భృత్యులతోఁగూడి, రాజ్యయాత్రజరుపఁ దగును?

* మిత్రులనఁగా ప్రత్యుపకారమును గోరి యుపకరించువారు; సుహృదులది గోరకయే యుపకరించు వారని భేదము తెలియునది.

భృత్యులులేక యె రాజు తా నొక్కండును బ్రజలను రక్షింపఁ జాలఁడు గదా. గొప్పకులమునఁ బుట్టిన వారందఱును రాజ్యము నేలుట కువ్విళ్లూరుదురు' అనెను.

భీష్ముఁడు—'భారతా! రాజు, తా నొక్కండే రాజ్యము నేలఁజాలఁడు. భృత్యుల సహాయము లేనిచో నతనికే యర్థము లును బడయ శక్యములుగావు;పడసినవాని నెప్పుడును రక్షించుట కును శక్యముగాదు.ఏరాజునకుఁగల భృత్య జనులందఱును జ్ఞాన విజ్ఞానములందుఁ బండితులును రాజహితమును గోరువారును సత్కుల ప్రసూతులును బరస్పరము నెయ్యము తియ్యము గల వారునై యుందురో యట్టిరాజు రాజ్యఫలనిఫలమును బొందును. ఏరాజు మంత్రులు,కులీనులును,పరులచే వేఱుపఱు పరానివారును, రాజు ప్రక్కఁ బొయకుండువారును, రాజు నకు మతి నుపదేశించు చుండువారును, అయ్యెవ స్తువుల సం బంధములను లెస్సగా గుఱు తెఱింగిన వారును, మీఁదటి కాల మునకు వలయునవి యెల్ల ముందుగా సమకట్టువారును, కాల గుణములను జక్కఁగా నెఱింగినవారును, గడచిపోయిన వానికి దుఃఖింపకుండువారును, సగుమంత్రు లుందురో యట్టి రాజు రాజ్యమువలనిఫలమును బడయును. ఏరాజునకు సహాయులగు వా రతనితోడ సుఖదుఃఖములు గలవారును, బ్రియముచేయు చుండువారును, రాజు కార్యముల నొడఁగూర్చుటయే యెప్పు డును జింతించు చుండువారును, సభ్యులునై యుందురో యట్టి రాజు రాజ్యమువలని ఫలమును బొందును. ఏరాజుదేశము నందలి వారు కాతియలేక యెప్పుడు నున్నతి గలిగి నీచులుగా కయు.మంచిమార్గము నూఁదియువ ర్తింతురో యతఁడు రాజ్యము

వలని ఫలమును బొందును. ఏరాజు బొక్కసము,నతని యాదాయమును వృద్ధిచేయు మార్గములఁ జక్కగాఁ దెలిసినవారును నాప్తులును రాజువలన సంతుష్టులును ధనధాన్యసంపత్తిచేఁ బుష్టిగలవారును, నగు మనుష్యులు పరిపాలించు చుందురో యట్టి రాజు రాజ్యమువలని ఫలమును బడయును. ధాన్యాదుల కొట్లు, పరులచే వేఱుపఱుపరాని వారును, ఆప్తులును, పైపయిని సేకరించుటయం దాసక్తులును, బాత్రులును, బేరాసలేని వారును నగు పురుషులచేఁ బాలింపఁబడుచుండు నేని రాజొప్పిదమును బొందును. ఏరాజు నగరమందలి వ్యవహారము *శంఖలిఖితుల వ్యవహారముంబోలెఁ గచ్చితమై ధర్మఫలమును గలిగించునద్దై చూపట్టునో యారాజు ధర్మమువలని ఫలమును బడయును. ఏ రాజు రాజధర్మములను దెలిసికొని ప్రజలను జేరఁబట్టుకొనుచు నాతెంట నొకపాలు కప్పముఁ బుచ్చుకొనునో యతఁడు ధర్మమువలని ఫలమును బొందును'అనెను. ఇది నూట పదియేనవయధ్యాయము.

రాజధర్మసర్వము.

భీష్ముఁ డొకముని చిఱుత మొదలగు వాని
వలన భయపడిన కుక్కను నాయా మృగ
ముగాఁ జేయుటను జెప్పుట.

(ధర్మరాజు 'భరతసత్తమా ! ఏ సమయమందు రాజునకుఁ గులీనులగు సహాయులులేరో యట్టియెడఁ గులీనులుగాని వారిని సహాయులుగా నేర్పఱుచు కొనవచ్చునా ?'అని యడిగెను.)

* శంఖలిఖిత చరిత్రమును ఆపదిర్వమునఁ జూడుము.

భీష్ముఁడు 'ఈ విషయమై పురాతనమయిన యొక యితిహాస ముగలదు. అది లోకులకు దృష్టాంత ప్రాయమై సజ్జనులచేత నాచరింపఁబడినదయ్యు నెప్పుడు నొప్పుచున్నది. అది ప్రకృత విషయముంబోలినది. దానిని నేను బరశురాముని తపోవన మందు ఋషిసత్తములు చెప్పఁగా వింటిని. మనుష్యులు లేని యొక మహారణ్యమందు, నొకముని ఫలమూలములఁ దినుచు నియతుఁడై యింద్రియముల నడఁచి వసించియుండెను. అతఁడు వ్రతనీతులచేత నెంతయు బడలియు, దమముగలిగియు, నెప్పు డును వేదాధ్యయనము చేయుచును శుచియై, యుపవాసముల చేత నాత్మశుద్ధియునొంది యెల్లప్పుడు సన్నార్గమునందే వర్తిం చుచుండెను. ధీమంతుఁడతఁడు గూర్చుండియుండఁగా నతని మంచిభావమును గాంచి యడివియందుఁ గ్రుమ్మఱుచుండు జంతువులన్నియును నతనిని బ్రేమంబున దగ్గఱి వచ్చి యుండును. సింహములును, పులులును, శరభములును మదించిన వెద్ద యేనుఁగులును, జిఱుతపులులును, ఖడ్గమృగములును, ఎలుఁగు గొడ్లును, మఱియు బెట్టిదముగాఁ జూపట్టునవియు, నెత్తురా హారముగాఁ గలవియు నగు తక్కిన మృగములును నన్నియు నాముని కడకు వచ్చి కుశలప్రశ్నములు సేయుచుండును. అవి యన్నియు నతనియెడ శిష్యులవలెను, దాసులవలెను నడచు కొనుచు నతని మనసెఱిఁగి ప్రియమునే యెప్పుడును గావించు చుండును. అవి యతని యొద్దకువచ్చి 'సుఖమా' యని యడిగి యతని బదులును గయికొని తమతమ నెలవులకుఁ బోవుచుం డును. అం దొకజంతువు మాత్రము గ్రామ్యమగు కుక్క, యమ్మహాముని నెప్పుడును విడువకయే యుండెను. అది యెప్పు

ఱను భక్తియు ననురక్తియుఁ గలిగి యుండెను. అది యుప
వాసములచేఁ గృశించి బలహీనమై పండ్లును వేళ్లును నీరును నా
హారముగా శాంతమై శిష్టునివలెఁ జూపట్టుచుండును. అమ్మహర్షి
యాసనమందుఁ గూర్చుండఁగా నది యతని యడుగుల క్రింద
మనుష్యునివలె మనసునుంచి నెయ్యమునచే మిక్కిలియు నత
నికి బద్ధమైయుండెను. ఒకనాఁడు రక్తము నాహారించునట్టి
యొక పెట్టిదపుఁ జిఱుతపులి యచ్చటికి వచ్చెను. ఆ కూర్మర
జంతువు కుక్కను జూడఁగానే యెంతయు నుప్పొంగి రెండవ
యమునివలెఁ జూపట్టెను.అది యాఁకలియు దప్పియుఁగొని సెల
వులు నాఁకికొనుచుఁ, దోఁక నెడతెగక జాడించుచు, నోరు తెఱు
చుకొని యాకుక్క మాంసమును గోరివచ్చెను.ఆకూర్మర మృగ
మట్లు వచ్చుచుండుటను జూచి కుక్క బ్రతుకుగోరి యామునిని
జూచి యిట్లు చెప్పెను. అది చెప్పెద వినుము—— 'మహాత్మా !
కుక్కలకు శత్రువయిన యీ చిఱుత నన్నుఁ జంపఁ దివురు
చున్నది. మహాముని ! నీ యనుగ్రహముంజేసి యీ పులివలన
నుండి నాకు భయము లేకుండ వలయును. మహాత్మా! అట్లు
దయసేయవలయును, నీకన్నియుఁ దెలియుననుటకు సందియము
లేదు' అనెను. అమ్మని సకలప్రాణుల కూతలును నెఱిఁగిన
వాఁడు ; మఱి యణిమాదిసిద్ధులు గలవాఁడు.అతఁ డాకుక్కకుఁ
గలిగిన భయమునకు హేతువును నా కుక్క భావమును దెలిసి
దానితో 'బిడ్డా ! చిఱుతపులి వలన నీ కేవిధమునను మరణ
భయముకలుగదు. ఇదిగో నీవు నీకుక్క రూపమునుమాని చిఱు
తపులి వగుదువు' అనెను. తోడనే కుక్క చిఱుత రూపము


నొందెను. అప్పు డది బంగారుంబోని మేనును వింతలయినచాఱలు గల యంగములును మిక్కిలియుఁ బ్రకాశించుచున్న కోఱ పండ్లనుగలిగి భయంబుమాని వనంబున నుండెను. చిఱుత యూకుక్క తనకు సాటియైన మృగమై యెదుర నుండంగని తత్క్షణమే దానియెడఁ గల విరోధమంతయు నుడిగిన దయ్యెను. అంత నొక పెద్దపులి మిక్కిలియు భయంకరమైనది యూఁకటిచేత నోరు తెఱచుకొని సెలపులు నాకికొనుచు నెత్తురున కువ్విళ్లూరుచు నాచిఱుతకై వచ్చెను. ఆచిఱుతయు వాఁడి కోఱలుగలిగి యూఁకటఁ గటకటంబడుచు వచ్చు పెద్దపులినిజూచి ప్రాణరక్షణము కొఱకు ఋషిని శరణుఁజొచ్చెను. పిదప నమ్ముని కూడి మాడు చుండుటవలని నెయ్యము నపుడు నెఱపుచు నా విరోధియగు పెద్దపులికంటె బలవంతమయిన పెద్దపులిగా నాచిఱుతను గా వించెను. అపు డాపెద్దపులి చానిని జూచి పయింబడిదయ్యె. ఆకుక్కయో బెబ్బులితనమునొంది బలముగలదై మాంసము నాహారింపఁ దొడఁగినది కాని ఫలమూలముల నెంతమాత్ర మొల్లదయ్యెను. అది మొదలుగా బెబ్బులియైన యాకుక్క మృగరాజువలెనే వనమందలి తక్కిన మృగములను నాహారించుచుండెను. ఇది నూటపదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడాముని తనకుక్కను పలువగలమృగములను
గావించుటయుఁ బిదప నది తన్నుఁ జంపఁగోరఁ
గా మరల మునుపటివలెఁ గుక్కను గావించుట
యును జెప్పుట.

పెద్దపులియును మృగములను జంపి తినుచుఁ బర్ణశాల మూలయందు హాయిగా నిదురించుచుండెను. ఒకనాఁడది యాశ్రమమున నుండఁగా మదించిన యొకయేనుఁగు పయికిలేచిన మేఘమువలె నచటికి వచ్చెను. దానిచెక్కులందు మదజలము దొరుఁగుచుండెను. అది మిక్కిలి పొడవై పద్మములు గలిగి, వెడఁదయైన కుంభస్థలమును, నిడుదలయిన కొమ్ములును, పెనుకాయమును గలిగి మేఘమువలె గంభీరధ్వనితోఁ గూడియుండెను. అట్లాయేనుఁగు బలమున విజృంభించుచు మత్తిలి పయికి వచ్చుచుండఁగా నాబెబ్బులి దానికి భయపడి వడఁకుచు నమ్మునిని శరణొందెను. అంత నాఋషి సత్తముఁడు దాని నేనుంగు గావించెను, అప్పుడు వచ్చినయేనుఁగు పెద్దమేఘమువలె నున్నదానిని జూచి భయమునొందెను. అంత నాక్రొత్తయేనుఁ గది మొఱలుగాఁ దామర తంపరలంగును,అందుగు తోఁపులందును,మదంబు మిగులఁ దామరల పుప్పొడి మేనియం దొప్పులు గులుకుచుండ, విహరించుచుండెను. ఇట్లాయేనుఁ గాపర్ణశాలయందు మునియెదుటఁ జెరలాడుచుండఁగాఁ జాలఁగాలము గడచిపోయెను. అంత నొకనాఁడు పర్వత గుహాయందుఁ బుట్టినదియు నేనుఁగుల కులమునకు మృత్యువయినదియు భయంకరమైనదియు నగు సింహమొకటి యెట్టని జూలు దయివాఱనచ్చటికివచ్చెను.అట్లు వచ్చుచున్న సింహ

మునుజూచి యాయేనుఁగు భయమునఁగలంగి వడవడ వడంకుచు ఋషిని శరణుఁజొచ్చెను. అప్పుడు ముని దానిని సింహముగావిం చెను. అప్పు డీక్రొత్తసింహ మెదుటిసింహముజాతిలోనే తాను జేరినదిగాన దానిని సరకుసేయదయ్యెను. వచ్చిన సింహ మును దీనిని జూచి బాధసేయక చలముడింపదయ్యెను. ఆక్రొ త్తసింహ మా యరణ్యమం దొకయాశ్రమమునసే సుఖముగా వసించియుండెను. అప్పుడు తక్కిన యల్పమృగములు దానికెం తయు భయపడిప్రాణములవలని యాసంజేసి తపోవనమును సమీ పింపకయుఁ గనఁబడకయుఁ బోయెను. అట్లుండఁగా, నొకప్పుడు బలవంతమును రక్తము నాహరించునదియు నానాజంతువులకు భయంకరమయినదియు నగునొకశరభమృగము వనమునం ద్రిమ్మరునది యామునిపర్ణశాలయం దున్నయాసింహమును జంపు టకువచ్చెను. అట్లువచ్చు శరభమునుజూచి సింహము శత్రు వను భయమున వడంకుచు మునిని శరణొందెను ముని దానిని మిక్కిలి బలముగల శరభము గావించెను. తోడనే వనమందుండి వచ్చిన శరభము, తనయెదుట మిక్కిలి యుగ్రమును బలవంత మునయిన మునిశరభమును జూచి వేగమున వనమునకుఁ బాఱి పోయెను. ఇట్లు మునిచేత, శరభ పదవియం దుంపఁబడిన యా మృగ మెప్పుడు మునిప్రక్కఁ బాయక సుఖంబుండెను. రాజా! అంత శరభమునకు భయపడిన మృగసమూహము లన్నియును, ఆ భయమునఁ బ్రాణముల రక్షించుకొనఁగోరి వనమునుండి నలు దిక్కులకుఁ బాఱిపోయినవి. మాంసాశనమగు నాశరభము మిక్కిలి సంతోషమునొంది యెప్పుడును బ్రాణులను జంపుట యందే యాసక్తిగలిగి ఫలమూలముల నాహరింప నొల్లదయ్యె.



593. ఒకముని తన కుక్కను బలువిధములైన మృగములుగా
గావించుట; పిదప నది శరభము కాగానే
మునిని క్రుంగ వచ్చుట.

అంత నాశరభము బలవంతమై గొప్పకులమునందుఁ జేర్పఁబడి నదయ్యు నడవడి నీచమైనదిగాన నెనరుదప్పి యామునినే చంపఁ గోరెను. అపుడు మునుపు గుక్కగానుండిన యామిగండ్లమెక ము'నే నిమ్మునిమహిమచేత నావాకొక్కటి చేతనే సకల ప్రాణుల కును భయంకరమైనదియు నెంతయుఁ బడయరానిదియు నగు శరభత్వమును బొందితిని. ఈ ముని నాశ్రయించి బ్రతుకు మృగ ములును నక్లె పక్షిసమూహములును, నిందుఁ గలతక్కిన ప్రాణులును భయమున వడఁకుచుఁ గుందుచునున్నవి. లోకము నందు సకలములయిన ప్రాణులకంటె ను త్తమమయిన బలము నెలకొని యున్నట్టి యిట్టి శరభత్వమును నొకవేళఁ దక్కినవానికిఁ గూడ నితఁడిచ్చిన నీవచ్చును. ఇతఁడొకవేళఁ బక్షులకును గరుడుని బలమునొసంగవచ్చును. ఈబ్రాహ్మణుఁడు కరుణగడలుకొన, నెంత యుఁ బ్రీతితళుకొత్త, నుల్లసిల్లుచుమతియొక్క ప్రాణికిబలము నొ సంగకమునుపే నేను శిష్యుఁగా నీతనిఁ జంపవలయును. మునీం ద్రునిఁ జంపినపిదప నే నిచట నే జంకునులేక యుండవచ్చును' అని యాలోచించెను. అంత నాముని తన తపోమహిమచేతఁ దోడనే దానిని గనుఁగొనెను. అట్లు తెలియఁగానే యాస్త్రాజ్ఞుండు దానికిశాపమొసంగువాఁడై 'నేను భృగుకులమునంబుట్టినయగ్ని ప్రభుఁడను మునిని; నేను మనస్సుచేత జగత్తును గాల్పను ధరిం పను జాలుదును. దేవతలును జరాచరము లగు సకలజంతువు లును నాకు లోనై యున్నవి. దేవతలు నావలన భయపడి తమ ధర్మమును విడువకుందురు. నేను స్వధర్మమును దిగవిడిచినవాని నెవనినేనియు నావాక్కుచేతనే కాల్చిపుత్తును. ఓరీ! ఏనొన్వను లేని శరభజన్మమును బొందించిన నాకు నీవెంతమాత్రము?

నీవు తొలుత సకలప్రాణులయందును క్రూరమై హీనమై యశుచి యైన కుక్కగానుండి నాచేతఁ జిఱుత గావింపఁబడితివి. చిఱుతగా నుండి బెబ్బులితనమును బొందితివి. దానినుండి మదపుటేనుంగు గాను, ఏనుఁగుగానుండి సింహముగాను నయితివి. సింహమ వై యుండి బలముమించి నీవు మరల మీఁగండ్లమెక మయితివి. ఇప్పుడు నీప్రాణములకు సందేహించి నేను బలుదెఱంగులుగాఁ గావించినవాఁడవేకాని యాయాకులములందు నిజముగాఁ జేరిన వాఁడవుగావు. పాపా ! ఇట్లే పాపముసేయని నన్ను నీవు చంపఁ దలఁచినకారణమున మరల నీతొలి పుట్టుకనొంది కుక్కగా నుందువుగాక' యని శపించెను. అంత దుష్టస్వభావమునను నవి వేకమునను దెలివిదూలి యాశరభము ఋషిని ద్వేషించి యా తని శాపమునకుఁబాలై మరలఁ దొంటి కుక్కరూపము నొం దినదాయెను. ఇది నూటపదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు మంత్రి మొదలయిన వారిగుణములను జెప్పుట. }

ఋషి యట్లు హుంకారముచేసి తపోవనమునుండి వెలికిఁ దఱుమఁగొట్టఁగా నాజంతువు తన యెప్పటిరూపునొంది మిక్కుటమయిన దీనత్వము పాలయ్యెను. విషయ మిట్లున్నది. కాన మతి మంతుఁడగు రాజు, శీలము, శౌచము, ఆర్జవము, స్వభావము, బుద్ధి, చదువు, నడత, కులము, అడఁకువ, జాలి, బలము, వీర్య ము, ప్రభావము, మనశ్శాంతి, క్షమ యనుపీనిని గనుఁగొని, యోగ్యులగువారిని మంత్రులుగాను భృత్యులుగాను నాయా

యధికారములందు నెలకొలిపి చక్కఁగా రక్షింపవలయును. రాజు పరీక్షింపక పనివాండ్రను నియమింపరాదు చెడుకులము నఁ బుట్టిన మనుష్యులు రాజుచుట్టు నుందురేని యతఁడు వృద్ధి నొందఁజాలఁడు. రాజా! మంచికులమునఁ బుట్టినవాఁడవివేకిగా నుండినను, దప్పులేక నిందింపఁబడినను, ఆకులమునందుఁ బుట్టిన కారణమున నెప్పుడుగాని పాపమందు బుద్ధిని జెల్లింపఁడు. చెడు కులమునందుఁ బుట్టిన యవివేకి యగువాఁడో సాధువుల నాశ్ర యించి పడయరాని యైశ్వర్యమును బడసినను, వానిని నిందించి నచో వైరము చూపఁదొడఁగును. (కాకియు, కుక్కయు, బిల్లి యు, బామును, చెడుకులమునందుఁ బుట్టిన మనుజుఁడును, అట్టి స్త్రీయును, సమానులని చెప్పఁబడిరి. స్త్రీనేనియు, లేక పురు షునేనియుఁ జెడుకులమునందుఁ బుట్టినవారిని లోకపాలురు సయితి మెప్పుడును భయంబునఁ జూతురు. అందులకును గార ణము శీలమే. శీలములేమినిబట్టి వా రట్లు చూతురు. పురుషుఁ డును స్త్రీయును జెడుకులంబునఁ బుట్టినవారయ్యును, నహిం సయు శీలమును గలిగియుండి నేని * ధార్మికులును గొప్పకులమునఁ బుట్టినవారు నగుదురు. రాజా! బృహస్పతి ధర్మమును గుఱించి కొన్నిశ్లోకములు చెప్పెడిని. వాని సంతయువిని మనంబున నుంచు కొనుము. అవియేవనఁగా—'దమముగల తపస్వివలెఁ బరిశుద్ధ కర్మం డగువాఁడు నల్లనిచండాలుఁడుగా నుండినను మంచినడవడి గలిగి యుండుటవలన వానిని దేవతలు బ్రాహ్మణునిఁగాఁ దెలియు

---

* 'ధర్మ్యాత్కులతాం ప్రజేత్' ధర్మ్యకులతనొందునని యర్థము. ఇది పూ ర్వోత్తర విరుద్ధముగాన 'ధర్మ్యస్సుకులతాం ప్రజేత్' అని పాఠము దిద్దంబడె నని తెలియునది.

దురు. ఒకఁడు ప్రజలహితముగోరియుఁ దక్కిన సమస్తజంతు వుల హితముకొఱకును, బాపం బగు నొకజంతువును జంపునేని దానిచేత వాఁడు హింసచేసినవాఁడు గాఁడు. పశువులయు బ్రాహ్మణులయు హితముకొఱకును, బిడ్డలను స్త్రీలను వృద్ధు లను రోగులను రక్షించుకొఱకును, నెవఁడు చిఱుతపులిని, శరభ మును, సింహమును, పెద్దపులినిని, ఏనుఁగును, ఎనుమును, అడవి పందిని, ఊరఁబందిని, కుక్కను, సర్పమును జంపునో వాఁడు ధర్మమును బొందును. బ్రాహ్మణుఁడుగా నుండియుఁ బాపము చేయువాఁడుగను, మ్లేచ్ఛుఁడుగా నుండియుఁ బరిశుద్ధుఁడుగను ధార్మికుఁడుగను నుండునేని వారియందు మ్లేచ్ఛుఁ డధికుఁడును బ్రాహ్మణుఁడు మిక్కిలి పాపాత్ముండును నగును. చెడుకులమునఁ బుట్టినవాఁడైనను మంచికులమునఁ బుట్టినవాఁడయినను నొకఁ డు మంచిశీలము గలిగియుండునేని వాని స్వభావము తెలిసికొని స్థిరముగానో లేక పరీక్షించుటకై కొంతకాలమువఱకో సమా హితుఁ డై యొక మంచియధికారమునఁగాని లేక మంచి కార్యమునఁగాని నియోగింపవచ్చును. రాజు చెడ్డనడవడిగలవా నిని బాపకార్యములందు నియోగింప వలయును' అనియే. మంత్రియగువాఁడు కులీనుఁడును, జదువునందు శిక్షితుఁడయిన వాఁడును, బండితుండును, జ్ఞానవిజ్ఞానములందు నిపుణుండును, సమస్తశాస్త్రార్థముల కలరూపు నెఱింగినవాఁడునై యుండవల యును. మఱియు నోర్పుగలవాఁడుగను, స్వదేశమందుఁ బుట్టిన వాఁడుగను, నెనరుగలవాఁడుగను, బలవంతుఁడుగను, క్షాంతి యు దాంతియుఁ గలవాఁడుగను, జితేంద్రియుఁడుగను నుండ వలయును. మఱియు లోభములేనివాఁడుగను, దొరకినదానితో

సంతోషించువాఁడుగను, తన యధిపతినిని మిత్రులనును వర్ధిలఁ జేయఁ దివురుచుండువాఁడుగను, కార్యాలోచనమందు సహాయుఁడుగను, దేశకాలములను దెలిసినవాఁడుగను, సమస్తప్రాణులను నాదరమునఁ గయికొనుటయం దాసక్తుఁడుగను, బరిశుద్ధుఁడుగను, కొలఁదిమాట లాడువాఁడుగను, హితమునుగోరు స్వభావము గలవాఁడుగను, స్తాలుమాలిక లేనివాఁడుగను, యుక్తమయిన యాచారముగలవాఁడుగను నుండవలయును. తనదేశమునందువలయు సంధి విగ్రహములందు నిపుణుఁడుగను, బ్రసిద్ధుఁడుగను, ధర్మార్థకామములు మూటిని దెలిసినవాఁడుగను, బురజనులకును దేశజనులకును బ్రియుఁడుగను, సైన్యములనొడ్డు పన్నుటను జక్కఁగాఁ దెలిసినవాఁడుగను, సైనికులను నుబ్బునఁ జెలరేఁగునట్లు చేయుటకు దిట్టయైనవాఁడుగను, ఇంగితమును నాకారమును స్వరూపముల నెఱిఁగినవాఁడుగను, దండయాత్రలందు సమర్థుఁడుగను, గజములను నశ్వములను బనుపఱుచు తత్త్వములందు సమర్థుఁడుగను, అహంకారము లేనివాఁడుగను, చుఱుకుఁదనముగలవాఁడుగను, ధైర్యవంతుఁడుగను, అడఁకువ గలవాఁడుగను, యుక్తముగ నాలోచనముసేయువాఁడుగను, బరిశుద్ధుఁడుగను, బరిశుద్ధులగువారు బలసియున్నవాఁడుగను, మంచివేషము గలవాఁడుగను, జూచుట కింపయినవాఁడుగను నుండఁదగును. కార్యములనడుపఁజాలువాఁడుగను, నీతియందుఁ గుశలుఁడుగను, ఆయుగుణములతోఁ గూడినవాఁడుగను, మోటుఁదనము లేనివాఁడుగను, వినయముగలవాఁడుగను, మృదువయినవాఁడుగను, మెత్తఁగఁ బలుకువాఁడుగను, ధీరుఁడుగను, శూరుఁడుగను, గొప్ప వెంపుగలవాఁడుగను, దేశకాలములకుఁ బొసఁగునట్లుచేయువాఁడు

గను నుండవలయును. అట్టివానిని మంత్రిగాఁ గావించికొని యత నిని గ్రిందుపఱుపక యేరా జుండునో యతనిరాజ్యము చంద్రుని వెన్నెలవలె వి స్తరించును. శా స్త్రములందుఁ బండితుఁడై ధర్మ మే ప్రధానమైనదిగాఁ గలిగి ప్రజాపాలనమం దాసక్తుఁడై మిాఁది గుణములెల్లఁ గలిగియుండురా జండఱకును గోరందగిన వాఁడగును. అట్టిరాజు ధీరుఁడును, సైఁచువాఁడును, శుచియు, కాలమునకుఁ దగినట్లు చుఱుకుగలవాఁడును, ప్రయత్నమువలని పసనెఱింగినవాఁడును, పెద్దలయెడ శుశ్రూషఁ గలవాఁడును, చదువరియు, అర్థులగువారి యుపదేశముల వినువాఁడును, ఊహమందును నపోహమందును బండితుఁడును, మేధావియు, ధారణాశ క్తి గలవాఁడును, న్యాయముఁ జొప్పున జరుపువాఁడు నుగా నుండవలయును. మఱియు నతఁ డెప్పుడును దమముగలిగి, ప్రియభాష లాడువాఁడై, అపకారియందును క్షమనెరపుచు, *తనచేతులార దానము సేయువాఁడును, శ్రద్ధగలవాఁడును, చూ చుట కింపయినవాఁడును, ఆర్తులగువారికి నెప్పుడును జేయిచ్చి కాచువాఁడును, ఆప్తులయిన మంత్రులుగలవాఁడును, నీతియం దాసక్తుఁడునై యుండవలయును. మఱియు నేనునెడి యహంకా రము లేకయు, భార్య లేకుండకయు, తనయిచ్చకుఁదోఁచినట్లెల్ల విచారింపక యేదేనియొకటిచేయకయు నుండవలయును. మంత్రు లేదేని మంచికార్యము చేసిరేని వారి కతఁ డుపకారము చేయ వలయును. భృత్యజనులయందుఁ బ్రీతిగలిగి యుండవలయును.

---

* 'దానాచ్చేదే స్వయంకారీ' అని మూలము. 'నాతిచ్చేత్తా స్వయం కారీ' అని దా. మూలము. మితిమీతి త్రుంపనివాఁడును, తానేకార్యమును జేయువాఁడునని యర్థము.

సమస్తజనులను బ్రాహ్మలుమూలక రాఁబట్టుకొనుచుండవలయును. ప్రసన్నమగు మొగముగలిగి యుండవలయును. మఱియు నెల్ల వారిని రక్షించుచును భృత్యజనుల నేకొఱఁత లేకుండ నాదరించుచును, గోపము నెరపకయు గొప్ప మనస్సుగలిగియు నుండవలయును. మఱియు దండమును దిగవిడువక దానిని యుక్తముగాఁ బ్రయోగించుచు ధర్మకార్యములం దందఱను నియమించు చుండవలయును. అతఁడు చారులనెడి కన్నులచేతఁ బ్రజలస్థితిగతులను గనుఁగొనుచు ధర్మార్థములం దెప్పుడును గుశలుఁడై యుండవలయును. ఈ నూఱుగుణములును గలిగి యున్నట్టి రా జెల్లవారికి గోరఁదగినవాఁడగును. రాజేంద్రా! రాజు తనరాజ్యమును రక్షించుటకు సహాయులుగా సకలగుణగణములతోఁ గూడినవారగు మంచి పురుషులను సైనికులుగా నరసి కూర్చుకొనవలయును. రాజు తనవృద్ధిని గోరునేని వారి నెంతమాత్ర మవమానింపరాదు. ఏరాజు యోధులు, యుద్ధమందుఁ బరాక్రమశాలులును, గృతజ్ఞులును, శాస్త్రకోవిదులును, ధర్మశాస్త్రము చక్కఁగాఁ దెలిసినవారును, పదాతిసమూహములు బలసియున్నవారును, * నిర్భయులగు గజసైనికులుగలవారును, రథయుద్ధమందు విశారదులును, ఇషుప్రయోగమందును నస్త్రములందును నిపుణులును నగుదురో యట్టిరాజు పాలిసొమ్మై యీభూమి. జ్ఞాతుల నవమానింప కుండుటయు, భృత్యులందుఁ గపటము లేకుండుటయు, ధనముల నార్జించు వ్యాపారములందు నేర్పు మెలపుగలిగియుండుటయును గలరాజు పాలిది యీభూమి. ఆలస్యము, నిద్ర, వ్యసనములు, మిక్కిలి

* అథయా గజపృష్ఠస్థాఃʼ అని మూలము.

పరియాచకమునఁ నెడి యివి యెవరికిఁ గలుగవ్రో యారాజున కే మిక్కిలియుఁ జిరకాల మీభూమి దక్కియుండును. పెద్దలను గొలుచువాఁడును, మిక్కిలి యుత్సాహము గలవాఁడును, నాలుగువర్ణములవారిని గ్రమముదప్పనీయక రక్షించువాఁడును, ఎప్పుడును ధర్మకార్యములు చేయుచుండువాఁడు నగు రాజున కే యెంతయుఁగాలము నీభూమి దక్కియుండును. నీతిమార్గమునే యనుసరించుటయు, నెప్పుడును బ్రయత్నశీలుఁడై యుండుటయు, పగవారి నవమానింపకుండుటయుఁ గలవాని కీభూమి చిరకాలము దక్కియుండును. మనువు తొల్లి పురుషకారమును దైవము ననెడియీరెంటియందుఁగలపెక్కుదెఱంగులును వర్ణించి యున్నాఁడు. వానిని జెప్పెదను వినుము. రాజులకుఁ బౌరుషమునే బృహస్పతి చెప్పుచున్నాఁడు. నీవెప్పుడును నయమును ననయమును గుఱించినవిధులను దెలిసియుండుము. విరోధుల ఛిద్రములను గనుఁగొనుచును, సుహృదుల కుపకారముచేయుచును, భృత్యుల తారతమ్యములను దెలియుచును నుండు రాజు రాజ్యమువలని ఫలమును బొందును. ఏరాజు సమస్తప్రజలను దనపక్షమునఁ గూర్చుకొనుటయందే యెపుడును గనుగలిగి పురుషప్రయత్నము చేయు స్వభావముగలిగి మిత్రుల బలిమి నిండారియుండునో యతఁడే రాజసత్తముఁడు. ఏరాజు మనుష్యులందఱను దనపక్షమున రాఁబట్టుకొని యుండునో యతఁడు వీరులగు వేయిమంది గుఱ్ఱపురౌతులతో భూమినంతయు గెలువ శక్తుం డగును. ఇది నూటపదునెనిమిదవయధ్యాయము.

———

రాజధర్మపర్వము.

భీష్ముఁడు భృత్యులను దగినయధికారములందు నియమింపవలయుననుట ; భృత్యుల లక్షణములను జెప్పుట.

భీష్ముఁడు—'ఏరాజు, (కుక్క కథవలనఁ దేలిన సిద్ధాంతము చొప్పున) నాయాభృత్యులను వారివారికిఁదగిన స్థానములందు నియమించునో యతఁడే రాజ్యమువలని ఫలమును బొందును. కుక్కను దానికిఁ దగినపదవికొలఁదిని మాఁటి పూజించి యెక్కుడుపదమం దుంపరాదు. దానికిఁ దగినపదముకంటె నెక్కుడు చానియందుఁ బెట్టినచోఁ గానరమున విజ్రుంభింపఁగును. మంత్రులను వారికిఁ దగినస్థానములం దేర్పఱుపవలయును. వారును దమపదవులకుఁదగిన గుణములను గలిగియుండవలయును. తగనిస్థానమునం దధికారమేర్పఱుచుట తగదు. ఏరాజు భృత్యులకు వారివారికిఁ దగినపను లొసంగునో యతఁడు వారి గుణములవలనఁ గలుగుఫలమును బడయును. శరభమును శరభస్థానమందును, సింహమును సింహస్థానమందును, బెబ్బులిని బెబ్బులిస్థానమందును, జిఱుతపులిని జిఱుతపులిస్థానమందును నుంపఁదగునట్లు, భృత్యులను విధ్యుక్తముగా వారివారికిఁ దగినపనులయందు నుంపవలయును. కార్యములవలని ఫలమును బడయఁగోరురాజు, ఆయాభృత్యులను వారికి నెక్కుడయిన యధికారములందు విపరీతముగా నేర్పఱుపరాదు. ఏరాజు బుద్ధిమాలి ప్రమాణము నతిక్రమించి భృత్యులను వారికిఁ దగనిపదవులందు నియమించునో, యతఁడు ప్రజలను రంజింపఁజాలఁడు. రాజు గుణములను గోరువాఁడేని, జిన్నవాండ్రను, అల్పులను, ప్రజ్ఞలేనివారలను, ఇంద్రి

యములను జయింపనివారిని, జెడుకులమునఁ బుట్టినవారిని దన కెలన నుంచుకొనఁడు. సాధులును, గులీనులును, శూరులును, ప్రాజ్ఞులును, అసూయలేనివారును, పెద్దలకిఁకము గలవారును, బరిశుద్ధులును, సమర్థులునగు మనుష్యులు రాజుపొంత నుండఁ దగినవారగుదురు. రాజునకుఁ గ్రిందుపడి యతనిమేలిమిని గొండా డువారును, అడఁకువగలవారును, బరిశుద్ధులును, శుభగుణ ములు సహజముగా నలవడినవారును, తమతమ స్థానములను దప్పకుండువారు నగు మనుష్యులు రాజునకు వెలుపలఁ దిరుగు ప్రాణము లగుదురు.

సింహము ప్రక్క నెప్పుడును సింహమే పరివారముగా నుండ వలయును. సింహముగానిది సింహముతోఁ గూడినచో నది సింహమువలె ఫలమునొందును. ఏసింహము సింహము చేయ వలసిన కార్యమును బూనునదై, కుక్కలను ప్రక్కందోడు గాఁ బెట్టుకొనునో, యది యాకుక్కల కొలువునలన సింహము పొందఁదగుఫలమును బొందుట కెంతమాత్రము నేరదు. రాజా! ఈవిధముననే శూరులును ప్రాజ్ఞులును మిక్కిలి చదువరులును గులీనులు నగువారిఁ దోడుచేసికొన్నచో భూమినంతయు జయిం చుటయు శక్యమగును. రాజు తనపొంత విద్యావిహీనుఁడగు వానినిఁ, గపటనర్తనుని, ప్రజ్ఞలేనివానిని, పెనువాసి కెక్కని వానిని జేరఁబట్టరాదు. స్వామి కార్యమం దెంతయు నాసక్తిగల మనుష్యులు తమయేలిక యానతీయఁగానే ప్రాణమువలె దానిని జేయఁ బోవుదురు. అట్టిరాజునకు హితము లాచరించుచుండునట్టి భృత్యులయెడ రా జెప్పుడును మంచిమాటలే యాడుచుండవల యును. రాజులు మిక్కిలి ప్రయత్నపడి యెప్పుడును బొక్కస

మును రక్షించుచుండవలయును. రాజులకు బొక్కసమే యాధారము. కాఁబట్టి బొక్కసము నెప్పుడును వృద్ధిచేయుచుండవలయును. నీధాన్యపుకొట్టునం దెప్పుడు ధాన్యములను సమృద్ధముగాను జక్కఁగాను సేకరించియుంచుచుండవలయును. నీధనములను ధాన్యముల నెప్పుడును సత్పురుషులగు భృత్యులకప్పగించి చూచుకొనునట్లు చేయవలయును. నీభృత్యులెప్పుడును నెచ్చరికగలిగి యుద్ధములం దాతితేఱినవారై యుండవలయును. గుఱ్ఱములను గుఱించిన సకలప్రయోగములం దును సామర్థ్యముండవలయును. పాండుపుత్రా! జ్ఞాతులను, బంధువులను నాదరించుచుండుము. మిత్రులును సంబంధులును బలసియుండనుండుము. పురజనుల కార్యముల హితమును నరయుచుండుము. నీకెప్పుడును వృథముగా నుండవలసిన బుద్ధియుఁ బ్రజ్ఞయును నిదె చెప్పితిని. ఇందు నీకుఁ గుక్కయె నిదర్శనము. మఱియునేమి వినఁగోరెదవు' అని యడిగెను. ఇది నూటపందొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ప్రజాపాలనవిధము మొదలయిన వానిని ధర్మరాజునకుఁ జెప్పుట.

ధర్మరాజు 'భారతా! రాజధర్మములును వాని ప్రయోజనములను జక్కఁగాఁ దెలిసి పూర్వులు తొల్లి నియమించినట్టి రాజవృత్తములను బెక్కింటిని నాకుఁ జెప్పితివి. సజ్జనులకు సమ్మతమయిన యా పూర్వవృత్తమునే నాకు విస్తరించి చెప్పితివి? దానిని సంక్షిప్తముగా నుపదేశింపవలయును' అని యడిగెను.

భీష్ముఁడు 'సమ స్తప్రాణులను రక్షించుట క్షత్రియులకు త్తమ మయిన ధర్మముగా నెన్నఁబడుచున్నది. అట్టి రక్షణమెట్లు చేయ వలయునో చెప్పెదను'వినుము. నెమిలి పలువన్నెలుగల పించె ములను ధరించినట్లె ధర్మవిదుండగు రాజును బలువిధములయిన రూపులను బూనవలయును. వాఁడిమియుఁ గపటమును సత్య మును నార్జవమును ననుగుణము లతని కుండవలయును. అతఁడు సుఖమును బడయువాఁడేని, పక్షపాతములేక మంచితనము నూఁదియుండవలయును. ఏకార్యమునం దేరూప ముండవల యునో యం దారూపునే నూపవలయును. పెక్కురూపు లొందఁ జాలిన రాజునకు మిక్కిలి చిన్నకార్యము సంభవము చెడిపోవ కుండును. రాజు, శరత్కాలమందుఁ గూపెట్టక మూఁగయై యుండు నెమిలివలె నెప్పుడును మంత్రాలోచనమును బయలు గ్రక్కక కాచుచుండవలయును. * అతఁడు కొంచెముగనే

* శ్లక్ష్ణాక్షరతనుఃశ్రీమాఁక్ భవేచ్ఛాస్త్రీ విశారదః । ఆపద్వ్యాకోష యుక్తస్యాత్ జలప్రస్రవణేష్వివ । శైలవన్మోదకాసీవ ద్విజాఁక్ సిద్ధాఁక్ సమాశ్రయేత్ । అర్థకామశ్శిఖాం రాజా కుర్యాద్ధర్మధ్వజోపమామ్ ॥నిత్యముద్యత దండస్యా దాచారే చాప్రమాదవాన్ । లోకే భాయవ్యయా దృష్ట్వా బృహద్వృక్షమి వాస్రవత్' ఈప్రకరణమందు రాజు పృత్తములు మయూరపృత్త ములతోఁ బెక్కులుపోల్చి చెప్పనట్లు చూపట్టుచున్నది. కాన యిట యీయా వ్యాఖ్యాతలు వేఱువేఱువిధముల నర్థములుప్రాసియున్నను నన్నియు మయూర సాదృశ్యయుక్తముగా నుండునట్లర్థమె వ్యాసహృదయముగాఁదోఁచుచున్నది. ఎట్లనఁగా - నెమలి కొంచముగను మధురముగను గూయునట్లు రాజు గొంచె ముగను దయగను మాటలాడుచు సిరిగులుకుచు నుండవలయును. నెమలి సెల యేళ్లయెడ నెచ్చరికగలిగి యుండునట్లు రాజు నాపద్వారములందు జాగ్రత్త గలిగియుండవలయును. అదికొండయందలి వర్ష జలముల నాశ్రయించినట్లు రాజు

మాటాడవలయును. ఆ కొంచెమును దీయగా నుండవలయును. అతఁడు సిరిగులుకు కేకలుగలిగి శాస్త్రములం దాతితేటియు నుండవలయును. మనుష్యులు చెఱువునుండి నీరువచ్చు తూము కాలువలయందు (నవి మితి మీఱి తమపొలములను నిండ్లను ముంచకుండునట్లుగా) నెచ్చరిక గలిగియుండునట్లు, రాజు తనకాపదలు వచ్చుద్వారములందుఁ గనుగలిగి యుండవలయును. జనులు కొండలనుండి వర్షజలములు కొత్తగావెల్లి గొన్న నదులను నాశ్రయించునట్లు రాజు సిద్ధినిబొందిన బ్రాహ్మణుల నాశ్రయింపవలయును. ధనమును సేకరింపఁగోరు రాజు, పయికి ధర్మచిహ్నములను ధరించు కపటులు తలయందు శిఖ పెంచుకొనునట్లు తాను గపటవేషము నూఁదవలయును. రాజెప్పుడును దండమును జేతనెత్తికొని యుండవలయును. ఆచారములందుఁ బ్రమాదము నొందరాదు. రాజు ప్రజలకుఁ గలయాదాయమును వ్యయమును ముందుఁ బరిశీలించి కనుఁగొని పెద్దవెరిఁగిన తాటిమ్రాన నుండి రసమును దీయునట్లు వారివలనఁ దగవెఱింగి

సిద్ధులగు బ్రాహ్మణుల నాశ్రయింపవలయును. అది తలయందు వేసమునకైజుట్టుం దాల్చి యుండునట్లు ధర్మవేషమునకైన చిహ్నమును దాల్పవలయును. ఎప్పుడును నది కొయ్యను (దండయష్టి) నెక్కియుండునట్లు రాజు దండము నెప్పుడును దాల్చి పరాకుపడకుండ వలయును. 'లోకేచాయవ్యయౌ దృష్ట్వా వృద్ధౌద్వౌ క్షమి వాప్రజేత్' అని పాఠాంతరము. ఇది నెమలి కనుగుణముగా అర్థమును గలిగియున్నది. నెమలి యొకచెట్టునుండి మేలయిన మఱియొకచెట్టునకు బోవునట్లు రాజాయవ్యయములను జూచి తక్కువ వ్యయముగల కార్యమునకుఁ బూనవలయు నని యర్థము.

పన్ను దీసికొనవలయును. * రాజు తనకూటువవారిని దనయాజ్ఞ యందు మెలఁగించుచును, శత్రువుపంటలను దనసేన గుఱ్ఱముల త్రొక్కుడులచేఁ జెల్లాచెదరు గావించుచుఁ, దనకు బఱ్ఱము (సహా యము) బలమయినపుడు శత్రువులపయికిఁ బోవుచునుండవల యును. తనయందుఁగల వికలత్వములెల్లఁ గనుఁగొనుచుండవల యును. అతఁడు శత్రువుల దోషములను వెలిపుచ్చవలయును. వారిపక్షము వారినెల్లఁ గ్రిందుపఱుప వలయును. అడవినుండి పువ్వులనుంబోలె బయటనుండి ధనములను సంతరించు చుండ వలయును. † కొండలవలెమిక్కిలి యున్నతినొంది పెంపుసొంపారు

---

* 'ఆజ్ఞావాన్ స్యాత్ స్వయూథ్యేషు భోమాని చరణైఃకిరేత్ జాతపక్షఃపరిస్పన్దేత్ ప్రేక్షేద్వైకల్యమాత్మనఃʼ నెమిలి తనకదుపులయందుఁ జెల్లుబడిగలిగి భూమియందుఁ గాలితోఁ గ్రుమ్మరుచు (పక్షములు) రెక్క లు మొలవఁగానే పయికెగురుచు తనవైకల్యమును (గోప్యస్థానమును) జూపునట్లును, రాజు తనవర్గ ములందాజ్ఞగలిగి శత్రువులపంటలను గుఱ్ఱముల కాలం జమరుచు పక్షము (సహా యము) రాఁగానే పయినెత్తుచు దనవికలతను గనుఁగొనుచు నుండవలయును.

† ఉచ్ఛ్రితాన్నాశ్రయేత్ స్ఫీతాఁ నరేంద్రా సచివోపమాఁ । శ్రయేచ్ఛాయామివిజ్ఞాతం గుప్తంశరణ మాశ్రయేత్ʼ అని మూలము. ఉచ్ఛ్రితా న్నాశ్రయేత్ ...శ్రయేచ్ఛాయామివ జ్ఞాతిం గుప్తంశరణ మాశ్రయేత్ʼ అని దా. మూలము. నెమిలి తనతోఁపిక చేతనే కాకి మొదలయినవాని కొఱఁత తోఁపిం చునట్లు రాజు తనస్మార్తిచేత నే శత్రువుల కొఱఁతలు వెలియగునట్లు చేయు నలయును. దా. మూలపాఠమున నెమిలి పొడపయిన పర్వతముల నాశ్రయిం చినట్లు ఉష్ణర్తులై వర్షిల్లియుండు శత్రువుల నాశ్రయింపవలయును. నెమిలి బడలినపుడు నీడ నాశ్రయించినట్లు పెంపుగుందిన కాలమందు జ్ఞాతిని నాశ్ర యింపవలయును. నెమిలి వేసవికాలమందు చెట్టునందుఁ బదిలముగా మతీఁగి కాచుకొనునట్లు రాజు రహస్యముగా గుప్తినిగావించు కొనవలయుననియర్థము

చుండు మేటి శత్రురాజులను, దెలియరాని కందువపట్టుల నాశ్రయించియు, పదిలమయిన పట్టులందుఁ బొంచియుండియు, నాశము సేయవలయును. * నెమిలి వర్షాకాలమందుంబోలె రాజు రాత్రియందుఁ దన విడిదిపట్టును, వేఱొక్కరును లేకయు నెవ్వరికిని దెలియకయు నుండునట్లు ప్రవేశింపవలయును. నెమిలివలె నేయతఁడు తన మందిరమునలో నిశలందుఁ జెలువల పొత్తుగూడి విహరింపవలయును కపటమును విడిచియుండరాదు. తన్నుఁ దానే రక్షించుకొనుచుఁ (నెమిలి తానుతిరుగు చోటులందు వైచినవలలను దొలఁగఁ ద్రుచ్చుకొనునట్లు) చారులు చూపెడి చోట్లఁ గపటముగా వైచియున్న పాశములను వర్జింపవలయును. తన శత్రువులచారులను వశము గావించు కొనవలయును. వారలు పట్టువడినచో నాశము సేయవలయును. ఇట్లు నెమిలి ధర్మముచొప్పున నెప్పుడును వర్తించునది. విషమును గోపమును వంకరగతియుఁ గలపాములను జంపునట్లు మిక్కిలి విషము గలవారును గోపముగలవారును వక్రమగు నడవడిగలవారునగు శత్రువులను జంపవలయును. నెమిలి, పురువు మొదలయిన వానికి రోయకుండునట్లు, కుచ్చింపఁదగినవానియెడ నసూయపడరాదు. నెమిలి బలువయిన పక్షులను బడసియుండునట్లు దిటమయిన మూలము గలమంత్రులు మొనలయిన పక్షులవారిని బట్టు కొలిపికొనవలయును. నెమిలి యెప్పుడుగాని తనపక్షములను నిచ్చలొప్పున విరివిగాఁ జేసికొనునట్లు తనపక్షపువారిని బర్వఁ జేయుమేలికార్యము నాచరింపవలయును. అన్నిచోటులనుండి

---

* 'ప్రాపృషీ వాసితగ్రీవో మాద్యేత నిశి నిర్జనే' అని మూలము. అసితగ్రీవమనఁగా నెమిలి-నీలకంఠమునకుఁ బర్యాయము.

యుఁ బ్రజ్ఞను బడయవలయును. మిడుతలగుంపు లడవులందుఁ బడి యాకులేకుండఁ జేయునట్లు, ఒక్కటిగాఁగూడి శత్రురాజ్య ములపయి దండు వెడలవలయును. రా జిట్లు నెమ్మిలివలెఁ దన రాజ్యమును బరిపాలింపవలయును. సమర్థుం డగు రాజు తనకు నెంతయు బుద్ధిని గలిగించునట్టి నీతిని జెల్లింపవలయును. తన బుద్ధిచేతఁ దన్నడంచుకొని పరబుద్ధిచేత విచారముచేసి నిర్ణయిం చుకొనవలయును. శాస్త్రములచేత సంస్కరింపఁబడిన యాబు ద్ధినిగొని యొకఁడు తనకార్యగుణమును నేర్పఱచుకొనవలయును. దీనియందే శాస్త్రములపస యున్నది. శత్రువును సామము చేత నమ్మింపవలయును. తనశక్తిని సయితము చూపవలయును. తన యాలోచనముచేతఁ గార్యనిశ్చయమును దనబుద్ధిచేత నం దులకుఁదగిన యాలోచనమును జేయవలయును. సామోపాయు మందు మతిగలప్రాజ్ఞుఁడు కార్యాకార్యములను వివేచించి నడప నేర్చును. లోఁ తెయినబుద్ధిగలధీరునకు నుపదేశింపవలసినది లేదు. ప్రాజ్ఞుం డగునతఁడు బుద్ధియందు బృహస్పతిని బోలిన వాఁడయినను గొఱమాలిన ముచ్చట యగు బుద్ధిమాలిన వాదమును మాటాడునేని పరుని యుక్తివాదముచేత, కాఁచఁబడిన యినుము నీరు దగిలి చల్లఁబడునట్లు, తన యెప్పటి ప్రతిభదూలినవాఁ డగును. రాజు తన కార్యము లనుగాని పరుల కార్యములనుగాని యాగమములం దుప దేశింపఁబడిన రీతుల చొప్పునఁ జేసికొనవలయును. ధనము నార్జించు విధులను దెలిసినరాజు మృదువుగను గ్రూరుఁడుగను బ్రాజ్ఞుఁడుగను శూరుఁడుగను నుండువానిని జక్కఁగా మాటాడు నట్టితక్కఁగలవారినిని దనకార్యములందు నియోగింపవలయును.

రాజు తాను జక్కఁ జూచుచుండక పోయినను దమతమ కను రూపములయిన కార్యములందు నియుక్తులయి యుండువారిని నిడుద లయిన వీణతంతి స్వరములనుంబోలె ననువర్తింపవల యును. ధర్మములకు విరోధము లేకుండునట్లుగా వారికిఁ బ్రియ మాచరింపవలయును. 'ఈలోకము నాది'యని తలఁచు రాజు వ్యవహారమును గలరూపునఁ దెలిసికొని, సూర్యుఁడు నిషద లయిన తనకిరణములంబోలె, ప్రియాప్రియములను సమముగాఁ జేసికొని కొండవలె దిటగానిలిచి ధర్మమునే రక్షింపవలయు. లేక యేరాజును నందఱును 'నితఁడు నావాఁడు' అని భావిం తురో యట్టిరాజు పర్వతమువలెఁ జలింపకుండును. వాది ప్రతివాదు లకువ్యవహారమును జక్కఁ బెట్టుటకుఁ బూనినపుడు రాజు ప్రియు లనియు నప్రియులనియు భేదముచేయక యిగుతెగలను సూ ర్యుఁడు తనకిరణములంబోలె సనుముగాఁ జూచుచు ధర్మమునే నిలఁబెట్టవలయును. రాజు తనకార్యము లన్నింటియందును నాయా దేశములను వారివారి ప్రకృతులను నాయా కులము లను దెలిసినవారును, మృదువుగాఁ బలుకువారును, నడివయసు వారును, దోషము లేనివారును, హితము సేయుటయందేయాసక్తి గలవారును, అన్నిటియందు బనుపడి యాతి తేటినవారును, పేరాస లేనివారును, జదువరులును, అడఁకువ గలవారును, ధర్మ మునందు నిలుకడగలవారును, సమస్తకార్యములను రక్షించు నట్టివారు నగుపురుషులను నియమింపవలయును. ఈప్రకారమున రాజు చారులను మున్నిడికొని వారుచెప్పినచొప్పున నాయాకా ర్యములు జరుగురీతులును వానికిఁ దుదగలుగు ఫలములును దెలిసి కొని మిక్కిలి జాగరూకతతో వాని ననుష్ఠించి సంతుష్టి నొంద

వలయును. రాజు వ్యర్థకోపమును సంతోషమును బొందకయు తా నే యొక్కొక్కకార్యమును జక్కఁజూచుకొనుచును, బొక్కసములు (అనఁగా నాదాయవ్యయములను) తనకన్నారఁ బరికించుచును నుండునో యతనికి భూమి సకలధనములను నిచ్చుచుండును. ఏరాజు తనయధికారులకును బ్రజలకును, వారేదేని మంచి చేసినచోఁ బ్రకటముగా వారిని సమ్మానించునో, దండింపఁదగిన వారిని శాస్త్రోక్తప్రకారమున దండించునో, తన్నుఁదానుఁ రక్షించుకొనుచును రాజ్యములను గీళ్లనుండి గాచుచుండునో, యతఁడే రాజధర్మములను దెలిసినవాఁడగును. సూర్యుఁడు తనకిరణములనుగ్రిందనున్న యన్నింటియందును బ్రసరింపఁ జేయునట్లు రాజు తనరాజ్యమును దానే యెప్పుడును జూచుకొనుచు బుద్ధిచేతఁ దన చారులను ననుచరులను బరానుర్మించు చుండవలయును, రాజు కాలమెఱిఁగి ప్రజలవలనఁ బన్ను పుచ్చుకొనవలయును. తాను జేయునదొక్కటి సూచింపరాదు. బుద్ధిమంతుఁడగువాఁడానును నొక్కపెట్టునఁగాక నాఁడునాఁటికిఁ బిదుకుకొనునట్లు రాజును భూమిని నాఁడునాఁటికిఁ బిదుకుకొనవలయును. తుమ్మెద పువ్వులనుండి తేనియను గూర్చుకొను క్రమమునసే రాజును,ధనమును కొంచెముకొంచెముగాఁ దీసికొనుచు గూర్చి పెట్టవలయును. కొంతధనమును బడిలముగా నెత్తిపెట్టి మిగిలినదానిని రాజు ధర్మములుచేయుటకును గామము లనుభవించుటకును వెచ్చింపవలయును. శాస్త్రవిధులను దెలిసిన బుద్ధిమంతుఁడగు రాజు కూర్చిపెట్టిన మొదలు ధనమునుండి వెచ్చము సేయరాదు. ధనమును దేనినిగాని కొంచెమని నిరాకరింపరాదు. పగవాఁడు దుర్బలుఁడని యవమానింపరాదు. అతఁడు తనబుద్ధిచేతఁ దన్నుఁ

బరిశీలించుకొను చుండవలయును. బుద్ధిలేని వారియందు నమ్మక ముంపరాదు. నిలుకడయు, సమర్థతయు, తన్నుఁ దానడంచు కొనుటయు, బుద్ధియు, ఆరోగ్యమును, వికార పడకుండుటయు, శూరత్వమును, దేశకాలములందుఁ గనుగలిగియుండుటయు ననెడి యీయెనిమిదియు ధనము స్వల్పమయినను నధిక మయినను వెచ్చువెరుఁగునట్లు చేయును. రవ్వంతయగ్గి, నేయిపోసినచో పెద్దమంటగా మండును. ఒక చిన్నవిత్తు వేల కొలఁది నృక్షము లగును. రాజు తనయాదాయమును వెచ్చ ముసు మిక్కిలి విపులములని విన్నను వానినిబట్టి యల్పములగు ధనములను నలక్ష్యముసేయరాదు. శత్రువు, బాలుఁడయినను, వయసుకాఁడయినను, నుదుకఁడయినను, బరాకుపడియున్న వానిని జంపనేర్చును. కొఱనూలిన శత్రువయినను గాలమును దోడ్పాటుచేసికొని రాజును వేగతోఁగూడఁ బెకల్పనేర్చును. కాఁబట్టి కాలమును గనుఁగొనురాజే రాజులందు మిక్కిలియు శ్రేష్ఠుఁడు. శత్రువు బలవంతుఁడయినను, దుర్బలుఁడయినను, దుష్టుఁడగునేని యొకరాజుకీర్తిని శీఘ్రముగా నాశనుసేయఁ గూడును; అతనిధర్మమును నడ్డగింపఁగూడును; అతని ధనమునకు విఘ్నముసేయఁగూడును; అతనిబలిమిని నాశముసేయఁగూడును. కాఁబట్టి రాజు తనకు శత్రువుగలఁడేని వానిని కుదురుగానుంచు కొని వానివలనఁ బరాకు పడకుండవలయును. బుద్ధిమంతుఁడగు రాజు సంపదనుగాని జయమునుగాని కోరినచో, యతఁడు తన వ్యయమును వచ్చుబడిని గూడఁబెట్టిన ధనమును బరిపాలనమును జూచుకొని శత్రువుతో సంధిగాని యుద్ధముగాని చేయవల యును. ఈ కారణమునుబట్టి రాజు బుద్ధిమంతుఁడగు మంత్రి

తోడు నాశ్రయింపవలయును. చక్కఁగాఁ బ్రకాశించుచున్న బుద్ధి యెట్టి బలవంతుఁడగు శత్రువునైనను జంపును. బుద్ధిచేతఁ బెరుఁగుచున్న బలమును బాలింపవచ్చును. వర్ధిలుచున్న శత్రువును బుద్ధిలోపోడ్పాటుచేత దుర్బలునిఁ గావింపవచ్చును. కాఁబట్టి యొక్కొక కార్యమును బుద్ధిని మున్నిడికొని గావించినచో మిక్కిలి కొనియాడఁదగినదగును. రాజు ధీరుఁడును దోషహీనుఁడునగునేని, యతఁడు గోరినచో, మిక్కిలి యల్పమయిన సేన చేతనే తనకామములన్నియు నొడఁగూర్చుకొనవచ్చును. అయినఁ నతఁడు స్వార్థపరుఁడయినచ్చకపువాండ్రను జుట్టును జేర్చుకొని యుండునేని యల్పమయిన శ్రేయమునుగూడఁ బూరించుకోనఁ జాలఁడు. ఈ కారణములనుబట్టి రాజు ప్రజలనుండి మిక్కిలి మెలపునఁ బన్నుఁ బుచ్చుకొనుచుండవలయును. అతఁడు దీర్ఘకాలము ప్రజలను బీడించుచుండినేని, * ఋణముసేపు మొఱసి మాయమగు మెఱపుఁబోఁగవలెనే యతనిసంపద సమూలముగా నశించును. విద్యను, తపమును, విపులమయిన ధనమునంతయుఁ బూనికచేతఁ బడయ శక్యమగును. అది దేహధారులయందు బుద్ధి ననుసరించి యుండును. కాఁబట్టి పూనిక గొప్పదియని తెలిసికొనవలయును. ఈ దేహమందు బుద్ధిగలవారును గొప్పమనస్సు గల

---

* ఇట 'రాజు ప్రాణులయందు నెయ్యముగలవాఁడై సమస్తప్రజలవలనను సంపదలు మూలమయినధనమును బుచ్చుకొనవలయును. చాలఁగాలము బీడింపఁబడుచున్నను శక్తికిఁదగునట్లు ధనమునుగడించు ప్రయత్నముతోఁ గూడియుండవలయును' అని దాక్షిణాత్యపాఠము. 'తస్మాద్రాజా ప్రగృహీతఃప్రజాసు । మూలం లక్ష్మ్యాः సర్వశోహ్యాదదీత । దీర్ఘంకాలంవ్యాపి సంపీడ్యమానో । వ్యుత్పాత్సంపద్వ్యవసాయేన శక్త్యా' అని దాక్షిణాత్యమూలము.

వారును నగు నింద్రుఁడు, విష్ణువు, సరస్వతియు, భూతములు నెప్పుడును వాసముచేయుచున్నవి. కాఁబట్టి తెలివిగలవాఁడు (ప్రాణికమూలి) దేహము నవమానింపరాదు. పేరాసగలవానిని నెడఁతెగక దానములిచ్చి లోపఱుచుకొనవలయును. పేరాసగల వాఁడు పరునిధనమును బొందినను దనివి నొందఁడు. పుణ్యఫల మయిన భోగమందు నెల్లవారికి నాసయుండును. ఎవనికి ధన ము లేదో వాఁడు (ధనమువలనఁ బడయఁదగిన) ధర్మమును గామ మును బడయఁజాలఁడు. పేరాసగలవాఁడు, ఐశ్వర్యమును బడసి యుండినను బరులధనమును భోగమును బుత్రులను భార్యలను నన్నిటిని గోరును. ఆశగలవానియం దన్నిదోషములునుండును. కాఁబట్టి రాజు పేరాసగలవానిని జేర్చుకొనరాదు. ఎక్కువ వానినిగూడఁ దాను దనంతటఁ బరిశీలించి పనియందు నేర్పఱుప వలయును.ప్రాజ్ఞుఁడగువాఁడు పగవాని ప్రాణికలను, సమస్తము లయిన ప్రయోజనములను నాశము సేయవలయును. పాండు కుమారా ! కులీనుండును నాప్తుండు నగునేరాజు ధర్మయుక్తు లును జ్ఞానవంతులు నగు బ్రాహ్మణులవలన నుపదేశమునొందఁ గోరునో, మఱి మంత్రులచేత రక్షితుండగునో యట్టిరాజు,తన రాష్ట్రమందలి ముఖ్యులనెల్లఁ దనపక్షమున నిలఁబెట్టుటకుఁ జాలి నవాఁడగును. రాజా ! నీకు శాస్త్రప్రోక్తములయిన ధర్మముల నెల్ల సంగ్రహముగాఁ జెప్పితిని. వానిని బుద్ధిచేతఁ దెలిసి కొనుము. ఏరాజు ధర్మముల ననుసరించి కార్యములను గావిం చునో, యతఁడు భూమిని బరిపాలింప శక్తుఁడగును. ఏరాజు నీతిపద్ధతివలనఁ గలుగు సుఖమునుబాటింపక యలవ్రాకగాఁ గలుగుసుఖమును వెదకుచున్నాఁడో యతఁడు రాజ్యమువలని

యు త్తమసుఖమును బడయకుండుటయే కాక పరలోకసుఖమును బడయఁజాలఁడు. ధనవంతులును, మతిచేతను శీలముచేతను బూజితులును, గుణసంపన్నులును, యుద్ధమందుఁ బరాక్రమము జూపినవారును, సంధి విగ్రహాదులయిన యీఱుగుణములందు నెచ్చరికగలవారును, ప్రయత్నశీలురునయిన శత్రువులను బరాకు లేకుండునట్టివాఁడు కినుగలిగియుండి శీఘ్రమునఁ జంపును. * పలువిధములయిన కార్యములందును నుపాయములను జూడ వలయును. ఉపాయములేకయె బుద్ధిని జెల్లింపరాదు. దోషములు లేనివారియందును దోషములు చూచునట్టినమనుష్యుఁడు త్తమమయిన సంపదను, బెనుకీర్తిని, ధనమును బడయ నేరఁడు. స్నేహితులిరుపురయందుఁగల ప్రేమమును, నొక్కకార్యమందు వా రెంతంతచేసినదియుఁ దెలిసి విచారించి వారియం దేమిత్రుఁడు వెనుభారము దాల్పఁదగునో వానినే యుత్తమస్నేహితునిఁగాఁ బ్రార్థించుఁడు చెప్పవలయును. నేనుజెప్పిన యీరాజధర్మముల ననుష్ఠింపుము. మనుష్యులను రక్షించుటయందు మతినుంపుము. సుఖముగా నాపుణ్యములవలని ఫలమును బడయుదువు. రాజా ! జగమునకంతటికిని ధర్మమే మూలముచుమీ' యనెను. ఇది నూటయిరువదియవయధ్యాయము.

---

* పలువిధములయిన కార్యములను విచారించి యందువలన నుపాయములను దెలిసికొనవలయును. ఉపాయములేక పట్టెదైనను దానిబుద్ధి నూనరాదు' అని యాశయము.

రాజధర్మపర్వము.

భీష్ముడు యుధిష్ఠిరునకు దండస్వరూపము మొదలగువానిని జెప్పుట.

ధర్మరాజు 'పితామహా ! సనాతనమయినరాజధర్మము నీవు పుడు చెప్పి ముగించితివి. నీవు చెప్పినదానినిబట్టి దండమే యన్ని టికంటె గొప్పదనియు నన్నింటికి నీశ్వరుడనియుఁ దోఁచుచున్నది. ఏలన దండమందే సర్వము నెలకొనియున్నది. ప్రభూ! దేవతలు, ఋషులు, మహోత్ములయిన పితరులు, యక్షులు, రాక్షసులు, పిశాచులు, విశేషించి మనుష్యులు, మఱియు లోకమందుఁ బక్షులు మొదలుగాఁ దక్కువ యోనులందుఁ గలసకల ప్రాణులనీనెఱివాని కన్నిటికిని, మఱియుఁ దిక్కనవాని కన్నిటికిని మహాతేజం బగు దండమే యెక్కుడనియని నీవు చెప్పితివి. చరాచరములతోడను సురాసురమనుష్యులతోడను గూడిన లోకమంతయు దండమునకు లోనైయుండుట చూచువారికెల్లఁ దెలియుచున్నది. భరతసింహమా ! కాఁబట్టి నేను దీనినిగలరూపునఁ దెలియఁగోరుచున్నాను. దండమనఁగా నెద్ది ? దాని రూపమేమి? దాని ముఖ్యగతియేమి ? దేనితోఁ జేయఁబడినది? ఎక్కడనుండి పుట్టినది ? దాని లక్షణములెవ్వి ? అదియెట్లు ప్రభవగును ? ప్రజలయందు విహితరూపమై యది యెట్లు మేలుకొని (పాలించుచు) నున్నది ? ఏది మునుపును వెనుకను (అనఁగా నెప్పుడును) లోకమును బాలించుచు మేలుకొనియున్నది. ఏది యన్నిటికి మునుపటిదిగాఁ దెలియుచున్నది. దండ మనఁబడు మేటి యెవరు ? దండము దేనియం దూఁదియున్నది. దానిగతియేమి?' అని యడిగెను.

భీష్ముఁడు 'కురునందనా ! దండ మనఁగా నేమియో యది వ్యవహారమనియు నెట్లు చెప్పఁబడునో చెప్పెదను; వినుము. ఈలోక మందన్నియు దేనికిలోనై యున్నదో యదియే దండమనఁబడును. మహారాజా ! ధర్మమును జక్కఁగా నిలఁబెట్టునదే దండము. అది వ్యవహారమనియుఁ గొన్నియెడలఁ జెప్పఁబడును. లోకము లందు నజాగ్రత్తలేకుండు బుద్ధిగలవారు, ధర్మమునకు లోపము రాకుండునట్లు చేయుపద్ధతియేదియో యదియే * 'వ్యవహారము' అనుపదమునకు ముఖ్యమయిన యర్థముగా గ్రహింపఁబడు చున్నది. రాజా ! మనువు మొట్టమొద లీతత్త్వమును జెప్పెను. అది యేకనఁగా—'ఎవఁడు ప్రియులందు నప్రియు లందును సమమయిన బుద్ధిగలిగి పక్షపాతములేక దండమును జక్కఁగా జరుపుచుఁ బ్రజలను జక్కఁగా రక్షించునో యతఁడు కేవలధర్మమేకాని వేఱుగాదు'—అనియే. నేను జెప్పినట్లు యీ వచనమును మనువు పూర్వమే చెప్పియున్నాఁడు. ఇది వసిష్ఠుఁడు చెప్పిన బ్రహ్మదేవుని మహావచనము నగును. మనుపు యిట్టివచనము చెప్పఁబడియుండుటవలన దీనిని 'ప్రాగ్వచనము' (మొట్ట మొదటి మాట) యని తెలియుదురు. మఱియు దండమువలననే పరులధనమును నపహరించుట లేకుండఁ జేయుటచే నాదండము వ్యవహార మనుపేరును బిలువఁబడుచు నయ్యెను. ధర్మార్థకామము లను త్రివర్గమును, ఆదండమును జక్కఁగా జరుపుటవలననే యెపుడును బ్రవర్తించుచుండును. దండమును జక్కఁగాఁ జెల్లిం పనిచో నామాఁడును గొనసాగవు. దండము పరమధైవము.

---

* 'వ్యవహారః' 'వి+అవహారః-అపహారః'=దుర్మార్గమున నితరులధనము నప హరించుట, వి=లేదని వ్యుత్పత్తి.

అది రూపమున జ్వలించుచున్న యగ్నివలె జూపట్టును. అది నల్లగలువరేకులవలె నల్లగానుండును. దానికి *నాలుగు కోఱలును †నాలుగు భుజములు ‡నెనిమిదిపాదములును బెక్కు-§కన్నులును

---

* మానభంగము, ధనాపహారణము, శరీరచండము, వధము అను నాలుగు ప్రాణిహింసాసాధనములే నాలుగు కోఱపండ్లు.

† బాహువులనగా ధనముదీసికొనుసాధనములు—1. ప్రజలబలమును సామంతరాజులబలమును పన్నుదీయుట. 2. అబద్ధమాడినవానికి వాడుచెప్పిన ధనమునకు రెండింతలపరాధము విధించుట. 3. అసత్యమాడుప్రతివాదికి సమమయిన ధనమును దండముగవిధించుట. 4. ధనవంతుడును లోభియునగు బ్రాహ్మణునియుద్దసుండి ధనమునంతయు నాక్రమించుట యనెడి నాలుగు.

‡ ఇట పాదములనగా సంచరించుటకు సాధనములయినవి— అవి 1. ఆవేదనము (సంతకిముచేసి వాదాడుట) 2. భాష (ప్రతివాదినిబిలిచి వానిముందిలనాళ్లె వ్రాయించుట) 3. సంప్రతిపత్తి (వాదవ్యవహారమును బ్రతివాదియొప్పుకొన్నయెడల నొక్కరికిని దండముగవిధింపక సమాధానముచేయుట.) 4. మిథ్యోత్తరము (వాదియభియోగము మిథ్యయని చెప్పుట.) 5. కారణోత్తరము (వాదిచెప్పినట్లు జరిగినదివా స్తవమే కాని యొకమరల నిచ్చియనని పరీతివాదిచెప్పుట) 6. ప్రాజ్ఞాన్యము (ఈవివాదమునునే ముంగొకప్పుడు నీవు నన్నడిగి యపజయమునొందినాడవు ప్రతివాగిచెప్పుట) 7. ప్రతిభువు (ఈ మూఁడుత్తరములకును వాదిప్రతివాదులుచేసి యుంచిన పూటచీటి) 8. క్రియు (వారివారిపక్షములకునలయు సాక్షి, పత్రము, అనుభోగము, ప్రమాణము మొదలగువానిని జూపుట) 9. ఫలసిద్ధి (దానినుండి తెప్పకుండువాఁకి జయము) వీనియందు సంప్రతిపత్తి యనుమూఁడవవానియందు దండనువిధించుటకుఁ గారణములేనందునఁ దక్కినయెనిమిదియు దండమునకుఁ బాదములని చెప్పఁబడుచున్నవి

§ 'రాజు, అమాత్యుఁడు, పురోహితుఁడు, పరిషత్తు' అనెడి నాలుగు దండమునకుఁ గన్నులగును.

గలిగియుండును. దాని చెవులు శంకువులవలె నుండును. దాని వెండ్రుకలు నిట్టనిలిచియుండును. అది * జటలుగలిగి రెండునాలుకలతోఁ గూడియుండును. దాని మొగము రాగివలె నెఱ్ఱనై యుండును. అది సింహపుఁజర్మమును దొడిగియుండును. దండమిట్లు గ్రరూపమును దాల్చి యెప్పుడును దారసింప రాకుండును. అది మరల కత్తి, విల్లు, గద, శక్తి, త్రిశూలము, ముద్గరము, బాణము, ముసలము, పరశువు, చక్రము, పాశము, దండము, ఋష్టి, తోమరము, మఱియుఁ గలయాయుధములన్నింటిమూర్తులను దాల్చి యాయన్నియుఁ దానై లోకమున సంచరించుచుండును. దండము భేదించుచును, ఛేదించుచును, నొప్పించుచును, ద్రుంచుచును, చీల్చుచును, బ్రద్దలువాపుచును, కోట్లుచును, పగుఁబడుచును నిట్లు చరించుచుండును. యుధిష్ఠిరా! దండమున కివిపేళ్లు. అసి, విశసనము, ధర్మము, తీక్ష్ణవర్మము దురాసదము, శ్రీగర్భము, విజయము, శాస్త, న్యవహారము, ప్రజాగరము, శాస్త్రము, బ్రాహ్మణమంత్రము, ప్రనదనము, పరము, ధర్మపాలము, అక్షరము, కోపము, సత్యకము, నిత్యకము, గృహము, అసంగము, రుద్రతనయము, మనువు, జ్యేష్ఠము, శివంకరము, అనునవి. ఇవి దండమునకుఁ జెప్పఁబడుచున్నవి. దండము వ్యాపకుఁడును, యజ్ఞరూపియు, మాటిమాటికిఁ బెనురూపముదాల్చువాఁడును, మహాపురుషుఁడునయిన భగవంతుఁడు నారాయణుఁ

* పెక్కుసందేహములు గలుగుటచే జటగలది యనఁబడెను. ఒకటి కొకటి సంబంధపడకుండు వాది ప్రతివాదుల రెండువిధములయిన వచనముల వలన రెండువిధములయిన నాలుకలుగలదానివలె నున్నదని యాశయము.

డనువానిని ప్రభువుగాఁ జెప్పఁబడుచున్నది. అట్లు లోకమును బరిపాలించు దండనీతి బ్రహ్మదేవుని పుత్రియనియు, లక్ష్మియనియు, నీతియనియు, సరస్వతియనియు జెప్పఁబడుచున్నది. దండము పెక్కుశరీరములు గలది. కురుకులతిలకా ! అర్థము అనర్థము, సుఖము దుఃఖము, ధర్మము అధర్మము, బలము అబలము, దౌర్భాగ్యము భాగధేయము, పుణ్యము పాపము, గుణము దోషము, కామము అకామము, క్షణము పగలు, రాత్రి, మాసము ఋతువు, ప్రమాదము అప్రమాదము, సంతోషము, శోకము, శమము, దమము, దైవము పురుషకారము, మోక్షము, బంధము, భయము, అభయము, హింస అహింస, తపము, యజ్ఞము, సమాధి, విషము అమృతము, ఆది, మధ్యము, అంతము, కృతములగువాని విస్తరము, మదము, ప్రమోదము, దర్పము, డంభము, ధైర్యము, నయము అనయము, అశక్తి శక్తి, మానము, స్తంభము, వ్యయము, ఆయము, వినయము, విసర్గము, కాలము అకాలము, అనృతము, అజ్ఞత్వము, సత్యము, శ్రద్ధ అశ్రద్ధ, క్లీబత్వము, వ్యవసాయము, లాభము అలాభము, జయము అపజయము, తీక్ష్ణత్వము మృదుత్వము, అత్యుగ్రము, ఆగమము అనాగమము, విరోధము అవిరోధము, కార్యము అకార్యము, బలము అబలము అసూయ, అనసూయ, ధర్మము అధర్మము, సిగ్గు సిగ్గులేమి, హ్రీ, సంపత్తి, విపత్తి, తేజస్సు, కర్మములు, పాండిత్యము, వాక్శక్తి, బుద్ధితత్త్వత (వీనిని గలరూపునఁ దెలిసికొనుట) అనియిట్లు దండము నకు పెక్కులురూపు లీలోకమందు వెలయుచున్నవి. ఈలోకమందు దండము లేనిచో నొకరినొకరు గొట్టుకొనుచుందురు.

ధర్మరాజా ! దండమువలని భయముననే యొకరినొకరు కొట్టు కొనకున్నారు. రాజా ! ఈలోకమందుఁ బ్రజలు ప్రతిదినమును దండముచేత రక్షితులై యేచుమీ రాజును వర్ధిల్లఁ జేసెదరు. కాఁబట్టి దండమే ముఖ్యగతి. రాజా ! దండ మీలోకమునెప్పు డును ధర్మమార్గమున నెలకొలుపుచున్నది. సత్యమునం దూనిన దైనధర్మము బ్రాహ్మణులయం దున్నది. ద్విజశ్రేష్ఠులు ధర్మ యుక్తులై * దేవతలలోఁ బాటిగాఁ జేర్చి లెక్కింపఁదగినవారగు దురు. దేవతలవలననుండి యజ్ఞముగలిగినది. యాగము దేవ తలను సంతోషపెట్టుచున్నది. దేవతలును సంతుష్టులై లోకులను నిద్రునకు గొప్పగింతురు. ఇంద్రుఁడు నీప్రజల ననుగ్రహించు (ధాన్యాదులను బండిం)ను వర్షముయొసగునున) నన్నము నిచ్చు చున్నాఁడు.సమస్తభూతిములపాణములును,అన్నమందే యెప్పు డు నెలకొనియున్నవి. దానివలనఁ బ్రజలు గుదుగుకొనుచున్నా రు. దండము (క్షత్రియరాజురూపమున) నాప్రజయందు మేలు కొనియున్నది. ఇట్టి ప్రయోజనముగల దండము క్షత్రియరూప మునొందిప్రజలను రక్షించుచు, నెప్పుడును మిక్కిలి యెచ్చ రికగలదై నాశములేనిదై మేలుకొనియున్నది.అది యీశ్వరుఁడు, పురుషుఁడు, పాణము, సత్త్వము, వృత్తము, ప్రజాపతి,భూతా త్ముఁడు, జీవుఁడు సనెడి యీనామెనిమిది నామములచేఁ జెప్పఁ బడుచున్నది. ఈశ్వరుఁడు (సేనారూపమగు) బలముతోఁగూడిన వాఁడును, (ధర్మము, వ్యవహారము, దండము, ఈశ్వరుఁడు, జీవు డనెడి)దైదింటిచేత నయినవాఁడు నగు రాజునకు నైశ్వర్యమును దండమును రెంటిని నొసంగెను. యుధిష్ఠిరా ! అతనికిఁ

---

*'దేవయుక్తాఃఅని పాఠము.'వేదయుక్తాఃఅని బొ.మూలము తెలియునది.

గులమును, మిక్కిలి ధనవంతులగు నమాత్యులును, ప్రజ్ఞయు, (శరీరము, బుద్ధి యింద్రియములనెడి వీని) బలములును, పూర్వోక్తములయిన యెనిమిది వస్తువులచేఁ గలిగింపఁబడు బలమును, మఱియు (కోశాదులవలనఁ గలుగు) నితరబలమును నావశ్యకములుగాఁ జెప్పఁబడియున్నవి. ఆబలము-గజములు, అశ్వములు, రథములు, పదాతులు, ఓడలు, బరువుమోయువారు, దేశమందలివారు, (అడవియందుఁగల) గొల్లలు ననెడి యెనిమిది యంగములు గలదిగాఁ జెప్పఁబడుచున్నది. మఱియు సన్నాహముతోఁ గూడిన సేనకు, రథికులును, నేనుఁగు రౌతులును, గుఱ్ఱపు రౌతులును, గాలుబంట్లును,మంత్రులును,వైద్యులును నంగములగును. భిషకులును, బ్రాహ్మిస్వీవాకులును (ముఖ్య న్యాయాధికారులును) జ్యోతిషికులును, శాంతికపౌరక కర్మములను జేయువారును, బొక్కసమును మిత్రులును ధాన్యమును మఱియుఁ దక్కిన సకలమైన యుపకరణములును రాజ్యమునకు దేహమగును. ఆదేహమునకు, అమాత్యుఁడు మొదలయిన యేడు ప్రకృతులును పూర్వోక్తములయిన యెనిమిదంగములు నుండును. దండమును రాజ్యమునకు బలీయమయిన యంగమగును. (సేనారూపమయిన) దండము రాజ్యమునకుఁ బుట్టుచోటు. అదికారణముగా నీశ్వరుఁడును గ్రహించి యెప్పుడును లోకమును రక్షించుటకై దండమును రాజున కొసంగెను. సనాతన మయినయీ ప్రపంచమంతయు దండస్వరూపమే. రాజునకు దండమునకంటె మిక్కిలి పూజ్యమయినది లేదు. దండమువలననే ధర్మము రీతులు ప్రవర్తింపఁబడుచున్నవి. లోకమును రక్షించుకొఱకును వారివారి ధర్మములను నెలకొలుపుట కొఱకును బ్రహ్మదేవుఁడే దండము నేర్పఱి

చెను. బ్రహ్మవలననుండి పుట్టినవ్యవహారము మఱియొకటి గలదు. అందులకు వాదిప్రతివాదులిరువురు కారణము. అవ్యవహారమునకు నాయిరువురలో నొకనియందు నమ్మకయుంచి (తీర్పు చేయుట) లక్షణముగా నుండుటంబట్టి యది హింసతోఁ గూడి నదై చూపట్టుచున్నది. మఱియొక విధమయిన వ్యవహారమును గలదు. అది వేదాత్మకమయినది. దానికి వేదము కారణమనియుఁ జెప్పఁబడుచున్నది. వ్యవహారము మూఁడవదియు మఱొకటి గలదు. అది కులాచారమును సంబంధించినది. మఱియు నది శాస్త్రముల ననుసరించినది. * వాదిప్రతివాదు లిరువురయం

---

* వ్యవహారమనఁగా నిప్పటి చట్టమని చెప్పవచ్చును. ఇచట మూఁడు విధములయిన వ్యవహారములు చెప్పఁబడినవి. మొదటిది సాధారణమయిన వ్యవహారము—అనఁగా చట్టము. దీనినిబట్టి వాదిప్రతివాదుల తగవులు తీర్పఁబడును. ఇందు సివిల్ క్రిమినల్ చట్టములు రెండు నడంగియున్నవి. దీనిని భర్తృప్రత్యయ లక్షణమని చెప్పఁబడును. ఇరుదెగలయం దొకరినిని నమ్మిక లక్షణముగాఁగలదియని యర్థము ఒకవ్యాజ్ఞను వచ్చినపుడు రాజుగాని మఱే న్యాయాధికారిగాని సాక్ష్యమును విచారించి యిరుదెగ వారిలో నొకరియందు నమ్మకముంచి తీర్పుచెప్పను. దీనివలన ఓడుటలయో గెలవటమో కలుగును. ఈరెండుపక్షములకు నది నడుమరూపమే యుండును రెండవ విధమగు వ్యవహారము వేదమునందలి విధియుండును. శ్రుతిస్మృతులందు మనుష్యుని యాచారధర్మ మొక్కొక్కటిని గుఱించి విధింపఁబడియుండు విధానములే యివి యుండును. మూఁడవదియగు వ్యవహారము కులములను లేక కుటుంబములను సంబంధించినది. ఇది కులాచారమనియుఁ జెప్పఁబడును. కులాచారము స్థాపితమైయున్న చట్టమునకు విరుద్ధముగాని, వేదవిధికిఁబ్రతికూలముగాని, కాకున్నచో నదియు నంగీకారపాత్రమగును. భీష్ముఁడిచటఁ గులాచారము శ్రుతిస్మృతులకును బ్రతికూలమయినదిగాఁ దలఁపరాదని యభిప్రాయపడుట తెలియునది.(ప్రతాప చంద్రరాయలు)

చొకనియెడ నమ్మికయుంచి తీర్పుచేయుట లక్షణముగాఁ గలదని పూర్వము చెప్పఁబడినట్టి వ్యవహారము, రాజునందు నెలకొని యుండునదిగా మన మెఱుఁగవలయు. దానిని దండమనియుఁ బ్రత్యయమనియు (సాక్ష్యమందలి నమ్మకమనియు) రెండు పేళ్లు మనము తెలియవలయును. దండము ప్రత్యయము చేత నిర్వర్తింపఁబడుట చూపట్టుచున్నను దాని స్వరూపము వ్యవహారమనియె చెప్పఁబడు చున్నది. వ్యవహారుని చెప్పఁబడునది వేదవిషయాత్మకముగా నుండును. (అనఁగా వేద విధుల రూపముగా నుండును.) వ్యవహార మేది వేదము నుండి పుట్టినస్వరూపము గలదియో యది ధర్మమగును. అది ధర్మమునందు శ్రద్ధగలవారికి గుణమును (హితమును) గలిగించునది. కృతాత్ముఁడగువాఁడా వ్యవహారమును * ధర్మమునుంబోలె వ్యవహరించి యున్నాఁడు. మూఁడవదియగు వ్యవహారము సయితము ప్రజలను రక్షించునది. అందులకును మూలమువేదమే. అది మూఁడులోకముల నుద్ధరించుచున్నది. అది సత్యస్వరూప మయినది ; ఐశ్వర్యమును బెంచునది. దండమను నదియే సనాతనమయిన వ్యవహారమని మనము చూచితిమి. వ్యవహారమని చెప్పఁబడునదియే వేదము. వేదమనునదియే ధర్మము. ధర్మమనునదియే సత్పథము. ఈకడపటిదియే తొల్లి పితామహుండును బ్రజాపతియు నగు భగవంతుఁడు బ్రహ్మదేవుఁడుగా నుండెను. బ్రహ్మ సురాసురులతోడను మనుష్యులతోడను

* మనువు మొగలయినవారు ధర్మమునకుఁగూడ రాజులు జరుపునట్టి వ్యవహారము (చట్టము) వలెనే లోపడఁదగునని చెప్పియున్నారని యిచట భావము.

నురగులతోడను మఱియుఁ దక్కినవారితోడను గూడిన సకల లోకములకును గ ర్తమై. కాఁబట్టి యతనివలననుండి భ ర్తృ ప్రత్యయలక్షణమగు (వాది ప్రతివాదులం దొకరివలన నమ్మిక చేదీర్పఁ జెప్పుట లక్షణముగాఁ గలదగు) వ్యవహారము మనకు నుప్పతిల్లినది. కాఁబట్టి యతఁడు వ్యవహారము నుద్దేశించి 'తనధర్మము చొప్పునఁ బాలించునట్టి రాజునకుఁ, దల్లిగాని తండ్రిగాని, తోఁబుట్టువుగాని, భార్యగాని, పురోహితుఁడుగాని, దండింపఁ దగని వారొక్కరును లేరు' అని నీనిని జెప్పెను' అనెను. ఇది నూటయిరువదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు వసుహోమ మాంధాతల సంవాదమును జెప్పి దండోత్పత్తి మొదలగు వానిఁ దెలుపుట.

భీష్ముఁడు 'ఈవిషయమందుఁ బురాతనమయిన యీయితిహాసము నుదాహరించెదరు.అంగదేశమందు వసుహోముఁడని ప్రసిద్ధుఁడయిన యొకరాజుండెను. అతఁడు మిక్కిలి కాంతిమంతుఁడు. అతఁడెప్పుడును ధర్మకార్యములు చేయుచుండువాఁడు. అతఁడెప్పుడును గామము నెలుపుచుండును. అతఁడు పత్నిం గూడి దేవగ్ను లెప్పుడును సేవించుచుండు ముంజిపృష్ఠమునకుఁ బోయెను. అచ్చట సతీ డా హిమవంతపు శిఖరమునందు వసతి గావించుకొనెను. రాముఁడు ముంజమని యచటఁగల వృక్షము క్రింద జటలు దీయుటకు నాజ్ఞయిచ్చెను.అది మొదలుగా నా ప్రదేశమును సంశిత వ్రతులయిన ఋషులు ముంజపృష్ఠమని పేరి

డిరి. అందు రుద్రుడుండును. శ్రుతి ప్రోక్తములయిన గుణములు పెక్కులుగల యూరా జపు డాముంజపృష్ఠమున బ్రాహ్మణులయను మతిఁబడసి దేవర్షికి సాటిగా నుండెను. ఒకప్పు డచ్చటికి నుదార చిత్తుఁడును నింద్రునకు సఖుఁడు నగు మాంధాతయనురాజు వచ్చెను. అతఁడు వసుహోముని యొద్దకుఁబోయి యామహాతప స్విని జూచి వినయమున నిలుచుండెను. వసుహోముండును మాం ధాతకు నర్ఘ్యమును మధుపర్కమునకుఁగాను బశువును నొసంగి యతనిరాజ్యము సప్తాంగములు కుశలమా, కుశలముగావా, యని యడిగెను. పిదప వసుహోముఁడు సజ్జనులు తొంటినుండి యాచరించు విధులను గలరూపున ననుసరించువాఁడగుమాం ధాతనుజూచి 'రాజా! నీకు నేనేమి చేయవలయును?' అని యడి గెను. మాంధాతి యందులకు బరమప్రీతుండయి కూర్చుండి యున్న మహాప్రాజ్ఞని వసుహోమునిఁ జూచి 'రాజా ! నీవు బృహ స్పతిమతము నంతయుఁ జదివియున్నావు రాజోత్తమా ! అట్లె శుక్రుఁడు రచించినశాస్త్రమును నీకుఁ జక్కఁగాఁ దెలిసియున్నది. కాఁబట్టి దండమెట్లు పుట్టినదో వినఁగోరుచున్నాను. దండమునకు మునుపేది మేలుకోనియుండును? దానికిఁ దుది యేమందురు ? దండమెట్లు క్షత్రియుల నిపు డాశ్రయించినదయ్యె? నీవు దీనిని నాకుఁగలరూపునఁ జెప్పవలయును; నీకు గురుదక్షిణ యొసఁగెదను' అనెను.

వసుహోముఁడు 'రాజా ! లోకము నుద్ధరించునట్టి దండ మెట్లు పుట్టినదో వినుము. అది ధర్మమున కాత్మయైనది; సనాతన మైనది. అది ప్రజలను బాలించుటకును రక్షించుటకునై యేర్పడి నది. సర్వలోకపితామహుం డగు భగవంతుఁడు బ్రహ్మదేవుఁడు

యాగమునేయఁగోరి తనకు సరియైనఋత్విజునిఁ గానఁడయ్యెనని మాకు వినికి.ఆదేవుఁడు వెక్కు_వర్షములు మనసునందు గర్భము దాల్చియుండెను.పిదప నాగర్భము వేయేండ్లు నిండఁగానేయతఁడు తుమ్మునపుడు క్రిందఁబడెను. అది యరిందముఁ డగు తుపుఁడను ప్రజాపతి యయ్యెను. ఆప్రజాపతి మహాత్ముఁ డయినయీ బ్రహ్మదేవుని యాగమందు ఋత్విక్కు_గా నుండెను. రాజసత్తమా! బ్రహ్మదేవుని యాసత్రయాగము జరుగుచుండునపుడు, బ్రహ్మ, యాగమందు దీక్షితుఁడై యుండుటవలన నతఁడపుడు, శాంతుఁడగు యజమానుని రూపమున మెలఁగుచుండుటఁబట్టి (యతని యుగ్రరూపమందు వసతిగలిగియుండిన) దండము (పట్టులేక) మఱుఁగయ్యెను. అది మఱుఁగుపడఁగానే ప్రాణులకు సంకరము (గజిబిజి) గలిగెను. అప్పుడేది చేయఁదగును; మఱేదిచేయరాదు; భుజింపఁదగిన దేది భుజింపరాని దెద్ది; త్రాగఁదగున దేది యేది త్రాగరా దనెడిభేదము లేకపోయెను. సిద్ధియెక్క_డిది? జను లొకరినొకరు హింసించిరి. స్త్రీపురుషులం దెవరినెవరు పొందవచ్చును బొందరా దను కట్టుపాటు లడుగంటెను. ఒకటి యొకరి సొమ్మనునియతి పోయెను. కుక్క_లు మాంసముల నాక్రమించుకొనునట్లు, జను లొకరి ధనముల నొకరపహరింపసాగిరి. బలవంతులు బలహీనులను జంపిరి. లోకమునందు మర్యాదకలుగదయ్యె. అంత బ్రహ్మసనాతనుండగు విష్ణునిఁబూజించి యతనితోఁ * కేశవా! ఈ సమయమందు

---

*ఇచట నీలకంఠాదిపాఠములందు, కేశవా! యనియున్నది. అయిననతనికి విశేషణములు 'శూలపాణియుఁ' అనియున్నది. దాక్షిణాత్య కోశములందు 'శంకర' అని పాఠమును దాని కనుగుణముగా రెండుమూఁడుశ్లోకము లధిక

మాయెడ ననుగ్రహింపఁదగును. ఇపుడు కలిగియున్న సంకటము మాయునట్లు గావింపుమా' యని వేఁడెను. అంత మేటి శూలమునుదాల్చిన యాభగవంతుఁడు విష్ణువాలోచించి తన్నుఁ దానే దండముగా సృజించెను. ధర్మము పాదములుగాఁ గల యారూపముననుండి సరస్వతీదేవి దండనీతిని సృజించెను. అది వేగ త్రిలోకములందును బ్రసిద్ధికెక్కెను. ఈదండము పాప కారులందుఁ జెల్లింపఁబడుచున్నది. దండమును సయిచుకారణ ముంబట్టి యది దండనీతి యని యీలోకమునఁ జెప్పఁబడుచున్నది. (శూలధరుఁడయినయాప్రభుఁడు మఱియుఁ జాలసేపు చింతించి దండనీతిని బ్రయోగించుటకు సర్వవిధములఁ బ్రమాణములును శాశ్వతములు నయిననాలుగువిద్యలను బలువిధములయిన వాని యంతర్భేదములను సమస్త శాస్త్రములనును, గలిగించెను. నాలుగువేదములును, ఆ అంగములును, మీమాంసయు, విరివియైన న్యాయశాస్త్రమును,పురాణమును ధర్మశాస్త్రమనెడి యీపదునాలుగు విద్యలును, ఆయుర్వేదము, ధనుర్వే

యుగాను సున్నదికాని యిదయే 'శూలవరాయుధ' అను విశేషణమునకుఁ బొసఁగినదిగాఁ జూపట్టుచున్నది. అయినను బెక్కుప్రతులందును లేమిఁబట్టియు బ్రబద్ధవ్యాఖ్యాతి యుదాహరింపఁబట్టియు పైపాఠము గయికొనఁబడెను. దాక్షిణాత్యపాఠమున 'అత్రిత్వమనుకంపాం వైకర్తు మర్హసిశంకర। అహం విష్ణుస్సభూతభవ్యం ధర్మస్యపరిరక్షణే। త్వంహి సర్వవిధానజ్ఞ సత్వానాం త్వంగతిఃపరా) సంకరో నభవేదత్ర యథాతద్వై విధీయతామ్॥ తతఃస భగవాఁ ధ్యాత్వా తదా శూలవరాయుధః। (దేవదేవో మహాదేవః కారణం జగతఃపరమ్। బ్రహ్మవిష్ణ్వింద్రసహితైః సర్వైశ్చాస సురాసురైః। లోకసంధారణార్థంచ లోకసంకరనాశనమ్)ఆత్మనామాత్మనాదండం ససృజే దేవస త్తమః' అని యున్నది. కుండలీకరణములోనిది జౌత్తరాహపాఠములందుఁ గలుగవు.

దను, గాంధర్వమునకెడి మూఁడును, నాలుగవదియైన యర్థ శాస్త్రమునుగా విద్యలు పదునెనిమిదియే యగును. ప్రసిద్ధము లగు నీపదునెనిమిది విద్యలును ధర్మమును సంబంధించినసంహిత లగును. మహేశ్వరుఁ డీ పదునెనిమిదివిద్యల యంతర్భాగ ములను జెప్పెను. మున్నాఱు శాస్త్రములును డెబ్బది మహా తంత్రములును, మహాదేవునిచేతఁ జెప్పంబడిన యీవిద్యల యంతర్భేదములే. ప్రసిద్ధమగు పాశుపతతంత్రమును, ప్రసిద్ధమగు పాంచరాత్రమును, యోగశాస్త్రమును, సాంఖ్యమును, లోకా యతతంత్రమును, బ్రహ్మాదుల యనేకప్రసిద్ధతంత్రమును, దేవ తలదయినతర్కవిద్యయు, సుఖదుఃఖములను దెలిసికొను టకుఁ గారణమైనదిగా వన్నెగాంచిన శాస్త్రమును, ఎనిమిది విధ ములయిన తర్కవిద్యలును, విస్తరముగల న్యాయశాస్త్రమును నతఁడు చెప్పెను. పురాణములందలివియు, యోగమును సంబం ధించినవియు నగుసంహితలు పదునెనిమిది యని తెలియవల యును. ఈ శ్లోకములందుఁ గల పురాణములన్నియు సంహిత లన్నియును నతనిచేత రచితములయినవి. ధర్మశాస్త్రములును నక్లె పురాణములును వేదములును వేకార్థములేకాని వేఱు కావు. కాఁబట్టి వేదుఁడు శంకరుండు నానార్థము లయినసమస్త శాస్త్రములను, గాలమును దెలుపునట్టి శాస్త్రములను నఱువది నాలుగుకళలను, నుత్తరభాగముతోఁ గూడిన యాయుర్వేద మును,పదునెనిమిది విభాగములుగలది యు స్థిరమయినదియు నగు దండనీతిని, గాంధర్వ శాస్త్రమును, పలువిధము లయిన వి స్తర ములుగల యితిహాసమును జెప్పెను. ఇట్లు శబ్దార్థము లడఁగి యున్న యీవిద్యలును మరిల వాని విస్తరములయిన వేయి

విభాగములును శంకరునిచేతఁ జెప్పఁబడినవి. ఋషులచేతను దేవతలచేతను గంధర్వులచేతను నంతర్భేదములు గలదై విస్తరమయిన వేదమొకటియే మాటిమాటికి లోకమున నభ్యసింపఁబడుచున్నది. సంగ్రహమయిన నాలుగువేదములును పెద్దలచేత రచితమయిన ప్రసిద్ధములగు వేదవాదములు ననెడి వీనిపారము నొందినవాఁడే వేదపారంగతుఁడనఁబడుచున్నాఁడు. గుద్రుఁడును విష్ణువును నింద్రుఁడును బృహస్పతియు శుక్రుఁడును నాత్మధర్మవిదుండగు స్వాయంభువమనువును, నెప్పుడు సమస్తసురాసుర సహితుండు నగు బ్రహ్మదేవుండును వేదపారగులగుదురు. వీరలందఱి యనుగ్రహమునలనను వ్యాసుఁడును వేదపారగుఁడగుచున్నాఁడు. శంతనుని పుత్రుండగు భీష్ముఁడగునేను విష్ణుశంకర బ్రహ్మల యనుగ్రహమునఁజేసి వేదపారగుఁడని చెప్పఁబడుచున్నాను. ఋజ్ఞవల్క్యుఁడును సర్వవిధముల వేదపారగుండగును. ఆదికల్పమందు బ్రహ్మచేతను విష్ణునిచేతను శివునిచేతను సృజింపఁబడిన విద్యలును నొక్కొక్కకల్పమందును మహాభాగ్యవంతులును దత్త్వవిదులు నగు ఋషులచేతను ఋషికుమారులచేతను వెక్కండ్రుగూడిన ఋషిసమూహముల చేతను మఱల విభజింపఁబడుచున్నది. మఱల సాధువులచేత విభజింపఁబడుచున్నవి. ఇప్పుడును విభజించు శక్తిగల విద్వాంసులచేత విభజింపఁ బడుచున్నది. ఈ సనస్పతి పూర్వజన్మమునుసరించి వెక్కువిధములుగా నున్నది. శూలవరాయుధుఁడగు నాభగవంతుఁడు మరల చాలసే పాలోచించి యీయీవర్ణమునకు నొక్కొక్కని యధిపతినిగాఁ జేసెను. సహస్రాక్షుఁడగుఁ నింద్రుని దేవతలీశునిఁగాఁ జేసికొనిరి. సూర్యుని పుత్రుఁడయిన

యమునిని బితరులకుఁ బతిగావించిరి. దేవతలరాజ్యమందు వరు ణుని జలములకుఁ బ్రభువుగావించిరి. కుబేరుని ధనములకును రాక్షసులకును బతిఁగాను, మేరువును బర్వతములకుఁ బతిగాను, సముద్రమును నదులకుఁబతిగాను, మృత్యువును ప్రాణము లకుఁ బతిగాను, నగ్నిని దేజస్సులకుఁ బతిగాను గావించిరి. మహాత్ముఁడును దేవతలయందుఁ బెద్దయుసనాతనుండు నగు విశా లాక్షుని రుద్రుల కీశ్వరుఁడుగాను, రక్షకుఁడుగాను ప్రభువు గావించెను. (ఈపదునొకండు రుద్రులును నితనిశరీరము వల ననుండి కలిగినవారు. నానారూపధరుఁ డగు భగవంతుఁడు శివుఁడు నసిష్ఠుని బ్రాహ్మణులకు నీశ్వరునిఁగాను, అగ్ని ని పసువు లకుఁ బతిగాను, సూర్యునిఁ దేజస్సులకుఁ బతిగాను, జంద్రుని నక్షత్రములకుఁ బతిగాను గావించెను. సూర్యునిఁదీగలకుఁ బతి గాను, పండ్రెండు భాహువులుగల కుమారస్వామిని బ్రాణు లకు రాజుగాను నాజ్ఞాపించెను. నృద్ధిసంహారములకుఁ గారణ మును, సమస్తమునకుఁ బ్రభువునయిన కాలమును (ఆయుధము, శత్రువు, యముఁడు, కర్మమని కాని రోగము, బాధకర మగు నాహారమును దినఁజేయు నాశ, యముఁడు, కర్మమ కాని)నాలుగువిభాగములుగల మృత్యువునకును,దుఃఖమునకును, సుఖమునకును ప్రభువుగాఁచేసెను. దేవదేవుఁడును, రాజరాజును, పురుషశ్రేష్ఠుఁడును నగు శూలపాణి శివుఁడు సకల రుద్రులకు నీశ్వరుఁ డని వేదము చెప్పుచున్నది. పిదప మహాదేవుఁడు శివుఁడు బ్రహ్మదేవుని పుత్రుఁడును దనకుఁ బిదపఁ బుట్టినవాఁడును సకల ధర్మములను బరిపాలించువారియందు మేటియు నయిన యాతని పునిఁ బ్రజలకు నధిపతిగా నొసంగెను. పిదప నాయాగము

ముగియఁగానే మహాదేవుఁడు సమాహితుఁడై ధర్మమునకు రక్షకమయిన దండమును సత్కరించి * విష్ణువున కొసంగెను. విష్ణువు దాని నంగీరసున కిచ్చెను. అమ్మునిసత్తముఁడు దాని నింద్రుఁడు మరీచియను నిరువుర కొసంగెను. మరీచి భృగువున కిచ్చెను. భృగువు ధర్మసహితమయిన దండమును ఋషుల కొసంగెను. ఋషులు లోకపాలకులకును, లోకపాలకులు క్షుపునకును, క్షుపుఁడు సూర్యపుత్రుండయిన మనువునకును నిచ్చెను. శాంతిద్ధదేవుఁడు (మనువు) సూక్ష్ముఁలగు ధర్మార్థకామములను బడయుటకై తన పుత్రుల కొసంగెను. దండమునందు నయము నెఱుంగఁగోరువాఁడు నయానయములను వేఱువేఱ తెలిసికొని, దండమును జెల్లింపవలయును. దుష్టులను శిక్షించుటకే దండము. రొక్కమును దండుగలు విధించుట భయమును బయటికిఁ గలిగించు పనికే కాని బొక్కసము నిండించుటకుఁ గాదు. శరీరము నంగహీనముగాఁ జేయుటగాని వధించుటగాని స్వల్పకారణములనుబట్టి విధింపరాదు. శరీరమును దండించుటయు కొండపయినుండి దొరలించుటయు స్వదేశమునుండి వెడలఁగొట్టుటయు గొప్పకారణములనుబట్టి విధింపవలయును. సూర్యపుత్రుఁడగు మనువు జగమును రక్షించుటకై నీనినిపుత్రులకొసంగెను. ఈదండము వరుసగానొక్కరిచేతను బ్రయుక్తమై ప్రజలను బరిపాలించుచు మెలంగుచున్నది. ఈదండమువలన భగవంతుఁడైన్ద్రుఁడును నింద్రునినుండి కాంతిధనుఁడగు నగ్నియు, నగ్నివలననుండి వరుణుఁడును, వరుణునివలన

---

* ఇందుఁ జాల నసంబద్ధములు పూర్వోత్తర వ్యాఘాతములును గలవు. కాఁబట్టిదీనియందుఁ బ్రక్షిప్తములు చాలఁగలవని తోఁచుచున్నది. వ్యాఖ్యాతలు నేమియుఁ జెప్పకున్నారు. (ప్ర. రా.)

నుండి వినయస్వరూపమయిన ధర్మమును వెలయుచున్నది. * లేక దండమువలనఁ దొలుత నింద్రుఁడు మెలఁగుచున్నాఁడు. దానివలనఁ బిదప నగ్ని; పిదప వరుణుఁడును ప్రజాపతియు; ప్రజాపతికిఁ బిదప వినయస్వరూపమయిన ధర్మమును మేలుకొని మెలంగుచున్నది.) ధర్మమునకుఁ బిదప బ్రహ్మపుత్రుఁడును. (అనఁగా సనాతనమగు నీతియు) నీతివలన వ్యవసాయమును (బూనికయు) మెలంగుచున్నది. ఆవ్యవసాయమువలననుండి లోకమును రక్షించు తేజస్సు వెలుంగుచున్నది. ఆతేజస్సునలన నుండి యోషధులును, నోషధులనుండి పర్వతములును, బర్వతములనుండి రసమును వెలయుచున్నవి. రసగుణమునుండి నిర్ఋతిదేవియు, నిర్ఋతిదేవినుండి జ్యోతిస్సులును వెలుంగుచున్నవి. జ్యోతిస్సులనుండి నిలుకడయగు వేదములును, వేదములనుండి ప్రభుండయిన హయగ్రీవుఁడును, హయగ్రీవునినుండి పితామహుండును నవ్యయుండు నగు బ్రహ్మయు వెలుంగుచున్నారు. బ్రహ్మదేవునినుండి మహాదేవుఁడు శివుఁడు విలసిల్లుచున్నాఁడు. శివునినుండి విశ్వదేవతలును విశ్వదేవతలనుండి ఋషులును, ఋషులనుండి భగవంతుఁడగు సోముండును, సోమునినుండి సనాతనులయిన దేవతలును, దేవతలనుండి బ్రాహ్మణులును లోకమున వెలయుచున్నారని తెలియుము. బ్రాహ్మణులనుండి క్షత్రియులు ధర్మంబుచొప్పున లోకములను రక్షించుచున్నారు. క్షత్రియులనుండి సనాతనములయిన స్థావరములును జంగమములును బ్రజలును నీలోకమున విలసిల్లుచున్నారు. ఆప్రజలయందు దండము వెలుంగుచున్నది.

---

* ఈ శ్లోకములకు నభిప్రాయమేమియో తెలియరాకున్నది. నీలకంఠాచార్యులు నేమియుఁ జెప్పలేదు. (ప్రతాపరాయలు).

అన్నింటి నడంచునట్టి దండము పితామహుని పుత్రుండగు ప్రభువగును. 'భారతా! మొదటను నడుమను గడపటను గాలము వెలుంగుచున్నది. సకల లోకములకును నీశుండును, బ్రజాపతియు మహాదేవుడును దేవదేవుండు నగు శివుఁ డొప్పుడును మేలుకొని వెలుంగుచున్నాఁడు అత్రిఁడు, కపర్ది, శంకరుఁడు, రుద్రుఁడు, భవుఁడు, స్థాణుఁ, డుమాపతి యనుపేళ్లను బేర్కొనఁబడుచున్నాఁడు. ఇట్లు దండము, మొదటను నడుమను గడపటను మేలుకొని వెలుంగుచున్నది. ధర్మవిదుండగురాజు దండము చూపిన న్యాయంబుగఁ బ్రవర్తింపవలయును' అనెను.

భీష్ముఁడు—ఇట్లు వసుహోముండు చెప్పిన యీమతిము నెవఁడు మనసార విని వినిన యట్లే లెస్స నడచుకొనునో, యా రాజు మంచిలోకములను బొందును. మనుజసింహమా! ధర్మముచే నాక్రమింపఁబడిన లోకమునంతయు నియమించునట్టి దండమును గుఱించిన సమస్తమును నీకు వివరించితిని. రాజా! మాం ధాత తొల్లి వసుహోమునినలన విన్నదియు, లోకమునఁ బ్రసిద్ధమైనదియు నగు నీయాఖ్యానమును నీకుఁ జెప్పితిని' అనెను. ఇది నూటయిరువదిరెండవయధ్యాయము.

—— ✧ ——

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మముల ప్రయోజనము మొదలయినవానినిజెప్పిధర్మమునువిడిచినవాఁడు చేయునపలయము ప్రాయశ్చిత్తవిధిని నరిష్టుఁడను రాజునకుఁ గామందకుఁడను మునియుపదేశించిన దానిని జెప్పుట.

ధర్మరాజు 'ధర్మార్థకామములను గుఱించిన నిశ్చయమును

వినఁగోరుచున్నాను. లోకయాత్ర పూర్ణముగా నీమాఁటిలోఁ దేనియందు నెలకొనియున్నది? ధర్మార్థ కామములు చేయుటకు మూలము లేమి? ఈమూఁడును గలుగుటకుఁ గారణమేమి? అవి కొన్నియెడల నొండొంటిని గలసియుఁ గొన్నియెడల వేఱువేఱుగను జూపట్టుచున్నవే! ఇది యెట్లు?' అని యడిగెను.

భీష్ముఁడు'—* లోకమునందు మనుష్యులు మంచిమనస్సులతో ధర్మమును మున్నిడికొని యర్థమును బడయఁగోరునపుడందులకుఁ దగినకాలమును, దేశమును, గార్యమును జతగూడఁగా ధర్మము నర్థము కామము మూఁడును నొక్కటిగాఁ జేరియుండుట చూపట్టుచున్నది. అర్థమునకు మూలము ధర్మము. అర్థమునకు ఫలము కామమని చెప్పఁబడుచున్నది. ఈమూఁటిని మూలము సంకల్పము. సంకల్పము విషయములను సంబంధించినది. విషయములన్నియుఁ బరిపూర్ణముగా భోగము సిద్ధించుకొఱకు. కాఁబట్టి యీవిషయములే త్రివర్గమునకు† మూలము. విషయములనుండి బొత్తిగా నివర్తించుటయే మోక్షము. ధర్మము

---

* ఇందులకు దృష్టాంతి మెట్లనఁగా, ఒకధార్మికుఁడు తనపత్నిని దగినకాలమునఁ బొందుచున్నాఁడు. ఇట్లు చేయుటచే గర్భాధాన మనువిధి నాచరించి ధర్మమును బడయుటేకాక సుఖరూపమైన కామమును పుత్రరూపమైన ధనమును బడయుచున్నాఁడు. ఇట్లు ధర్మమునను మంచిమనస్సునను నర్థమును బడయఁగోరినపుడు, అందులకుఁ దగినట్లుగాఁ దగినకాలమును దగినవిషయమయిన పత్నిని తెచ్చియర్థమైన పుత్త్రుఁడు నని పొందుపడఁగా నందు ధర్మార్థకామములు మూఁడును గూడియుండుట తెలియుచున్నదని త్రివర్గములు పరస్పరము కూడియుండుటను గుఱించిన ప్రశ్నకు మొదట నిందుసమాధానము చెప్పఁబడినది.

† ఇది ధర్మార్థ కామముల మూలమేమి యనుటకు నుత్తరము.

శరీరరక్షణమునకును, అర్థము ధర్మమును బడయుటకును, గోరఁ బడుచున్నది. కామమనఁగా నింద్రియములఁ దనివినొందించుట యె. కాఁబట్టి ధర్మాదుల మూఁటికిని గామమే (అనఁగా నిం ద్రియములఁ దనివినొందించుటయె) ఫలముగా నున్నది. ధర్మార్థ కామ మోక్షములను మోక్షము మొదలయిన ఫలములకుఁ గాను బూనినచో వానిఫలములును బ్రకృష్టము (దూరము) లగుటచే నవియును బ్రకృష్టములుగాఁ జెప్పఁబడుచున్నవి. ఆత్మ జ్ఞానమునకై వానిని గోరినపుడు సన్నికృష్టములు (దగ్గఱివి) అనఁబడుచున్నవి. అవి *సన్నికృష్టము లయినవాని నొకఁ డాచ రింపవలయును. వానిని మనస్సుచేతఁగూడ దిగవిడువరాదు. ధర్మార్థకామములను దిగవిడువఁ గోరినచోఁ దపస్సుచేత వాని నొందినపిదపనే దానిని త్యజింపవలయును. ఆ మూఁటి కయిన యుద్దేశము మోక్షమే! మనుష్యుఁడు దానిని బడయుఁగాక. ఒకఁడు బుద్ధిని మున్నిడిగొని చేసినకార్యము సయితము దాని కుద్దేశించిన ఫలమును బొందినను బొందవచ్చును; పొందక పోయినను బోవచ్చును. ధర్మమే యర్థమున కెప్పటికిని మూలము గాదు. ధర్మముతప్పఁ దక్కినవిగూడ (అనఁగా కొలువు సేద్యము మొదలయినవియు) నర్థమును గలిగింపవచ్చును. అయినను దీనికి విపరీతమయిన యభిప్రాయమునుగలదు. (ఏలనఁగాఁగొందఱర్థము, అదృష్టముజన్మము మొదలయిన కారణములచేతఁగలుగునందురు) కొన్నియెడల నర్థమును బడయఁగా నది యనర్థమును గలిగించు

---

* ఒకఁడు ధర్మము నాత్మశుద్ధికొఱకును ; అర్థము, ఫలాపేక్షా రహితము లగు సత్కార్యములకొఱకును ; కామమును దేహధారణ మాత్రమునకు నాచ రింపవలయునని భావము.

చున్నది. అర్థమునకంటె నితరములయినవియు (అనఁగా వ్రతోపవాసాదులును)ధర్మమునుబడయుట కుపకరించుచున్నవి. ఈవిషయమై, తెలివిలేమిచే నికృష్టమయిన బుద్ధిగలవాఁడు ధర్మార్థములకుఁ బరమమయిన ఫలమును (అనఁగామోక్షమును) బడయఁజాలఁడు. ధర్మమునకు ఫలమును గోరుటయేమలము. అర్థమునకు దాఁచిపెట్టుట మలము. కామమునకు నింద్రియములందలి యతిమాత్రతుష్టి మలము. ఇట్టిమలములు దొలఁగి మంచి గుణములు నెరసియుండునేని యీమూఁడును జిత్తశుద్ధిని గలిగించి మోక్షమను మహాఫలము నొసంగును. భారతా! ఈవిషయమై యరిష్టుఁడనురాజునకును గామందుఁడను మునికిని జరిగిన సంవాదమయిన యీపురాతన మగు నితిహాసము నుదాహరించెదరు. కామందుఁ డాసనమునఁ గూర్చుండియుండఁగా నరిష్టుఁడతనికి నమస్కరించి 'ఋషీ! రాజు కామమోహాములు బలవంతపెట్టఁగా నొకి పాపముచేసి యందులకుఁబడప నను తాపపడునేని యతఁ డేకర్మములు చేసినచో నాపాపము నశించును. మఱియు నొకఁడు, జ్ఞానముచేత నధర్మమయిన దానిని ధర్మమను బుద్ధిచేత నాచరించునేని రాజట్టిపాపము లోకులనడుమ ననుష్ఠానమునకు రాకుండునట్లు లెట్లాఁపనచ్చును?' అని యడిగెను.

అందులకుఁ గామందుఁడు 'ఈలోకమం దెవఁడు ధర్మమును నర్థమును బరిత్యజించి కామమునే యనువర్తించు చుండునో వాఁడు ధర్మార్థములను విడుచుటంబట్టి ప్రజ్ఞ నశించినవాఁడగును. ప్రజ్ఞ నశించుట యనెడిమోహము ధర్మార్థముల నశింపఁజేయును. దానినుండి నాస్తికత్వమును దురాచారమును బుట్టుచున్నవి. మిక్కిలి దుష్టములయిన దురాచారములను రాజెప్పు

డడంపకుండునో యప్పుడు లోక మింట నున్నపామునకు వడంకు నట్లారాజునకు వడంకుచుండును. ప్రజలును బ్రాహ్మణులును సాధుప్రులు నట్టిరాజుయెడ రక్తి గలిగియుండరు. దానివలన నతఁడు మిక్కిలి డిందుపడినవాఁడై వధ్యుఁడు నగుచున్నాఁడు. మతి బాధయుఁ బడి యవమానమును బొంది యతఁడు దుర్ముఖంపు బ్రతుకు బ్రతుకును. అట్లు బాధితుఁడై బ్రతుకుట యనఁగా శుద్ధ మరణమేకాని యది మఱొకటిగాదు. అట్టివాని విషయమునం దాచార్యులు, పాపమును దొలంచునట్టి యీయుపాయము నుప దేశించుచున్నారు. అట్టిమనుష్యుఁడు వేదవిద్యల నధిగమింపవల యును; బ్రాహ్మణులను బూజింపవలయును. ధర్మమందు మిక్కిలియు మన ముంపవలయును. గొప్పకులమందుఁ బెండ్లాడవల యును. ఋమయు గొప్పమనస్సునుగల బ్రాహ్మణులను సేవింపవల యును. అతఁడు స్నానాదు లాచరించుచు, పవిత్రమంత్రములు జపించుచుండవలయును. సంతోషముతోఁ గూడిన ముఖము గలిగి నాస్తికుఁడు గాకుండవలయును. దుష్కార్యములు చేయు వారిని వెలుపలఁ దొలఁగఁబెట్టి ధర్మాత్ములగువారిని లోనికిఁ జొప్పింపవలయును. మధురమయిన మాటలచేతను జేతలచేతను వారిని బ్రసన్నులను గావించుకొనవలయును. ఎప్పుడును శత్రులయినను బరులగుణములనే చెప్పికొనుచు 'నేను నీవాఁడను' అనవలయును. ఇట్టి నడకగలవాఁడు పాపము దూలి శీఘ్రమున బహుమానమును బడయును. మిక్కిలి కడింది పాపముల నయినను వాఁడడంచుకొనవచ్చును. ఇందులకు సందేహములేదు. గురువులు చెప్పినట్టి పరమధర్మ మెద్దియో దాని నట్లేచేయుము.

గురువుల యనుగ్రహముచేతనే పరమం బయినశ్రేయమును బడయఁగలవు' అనెను. ఇది నూటయిరువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మమునకుఁ బ్రథమ కారణమయిన శీలమును దుర్యోధనునకు ధృతరాష్ట్రుఁడు చెప్పిన యింద్ర ప్రహ్లాద సంవాదమును ధర్మరాజునకుఁ జెప్పుట.

ధర్మరాజు 'ధార్మికోత్తమా! ఈలోకమందలి జనులందఱను నెప్పుడును ధర్మంపు శీలమునే మిక్కిలియుఁ గొనియాడుచుందురు. వా రట్లు కొనియాడు కొందుల కని నాకుఁ బెద్దసందేహముగా నున్నది. అది మాకుఁ దెలిసికొన శక్యమగునేని, యా ధర్మశీలమును నెట్లు బడయవచ్చునో దానినంతయు వినఁగోరెదను. ఆశీలమెట్లు పొందఁగూడును? దానిలక్షణము లేవియని చెప్పెదరు? నీవు మాటకారులందు మేటివిగదే; వినఁగోరెదఁ జెప్పు'మని యడిగెను.

భీష్ముఁడు. 'మానదా! మునుపు దుర్యోధనుఁడు నీకుఁగలిగిన సంపత్తినిజూచి యింద్రప్రస్థమున నీవునునీతమ్ములను గూడియున్న సభయందుఁ జరిగినపరిహాసమునకును దపించుచుఁదనతండ్రియగు ధృతరాష్ట్రుని నీప్రశ్న మే యడిగెను. అప్పుడు జరిగినది చెప్పెద వినుము. నీదు మహాసభను, నీవు పొందియున్న యుత్తమమయిన సంపత్తినిని,జూచి దుర్యోధనుఁ డపుడు దీనుఁడై యదియంతయుఁ దనతండ్రికిఁ దెలిపెను. అదివిని ధృతరాష్ట్రుఁడు కర్ణసహితుఁడైన యాదుర్యోధనునకు నిట్లనియె.

ధృతరాష్ట్రుఁడు—'పుత్రా! నీవెందులకుఁ దపించుచున్నావో యున్నదియున్నట్లుచెప్పఁగా వినఁగోరుచున్నాను.విన్నపిదప నందులకుఁ దగినకారణము లున్నవని తెలిసెనేని, నేను ని న్ననునయించెదను. నీ కెప్పుడును మహా ద్వైశ్వర్యమును గలిగియున్నది. నీతమ్ములందఱును మిత్రులును సంబంధులును బాంధవులును నీవు చెప్పినపని చేయుచుందురు. మేలయిన వస్త్రములను దొడిగెదవు. మంచి సంజుళ్లయన్నమును గుడిచెదవు. ఆజానేయపు గుఱ్ఱముల స్వారిచేసెదవు. ఇట్లన్నిసొంపులు నిండియుండఁగా నెందులకు శోకించుచున్నావు?' అనియడిగెను. అందులకు దుర్యోధనుఁడు 'తండ్రీ! ధర్మరాజు గృహమందు మహోత్సులయిన స్నాతకులు పదివేలమంది పసిండిపాత్రములందు భుజించెదరు. దివ్యములయిన పుష్పములచేతను ఫలములచేతను నలంకృతమయిన యాతని దివ్యసభనును, తిత్తిరిపిట్టలవలె నానావర్ణములుగల యతని యశ్వములను, నానావిధములయిన యతని రత్నములను జూచియు, మఱియు నింద్రుని పెంపుంబోలె నతిమనోహరమై మిక్కిలియు గొప్పదైయున్న మనసగవారిల పాండవుల యాపెంపుసొంపును జూచియు దుఃఖించుచున్నాను' అనెను.

అందులకు ధృతరాష్ట్రుఁడు—'నాయనా! పుత్రా! యుధిష్ఠిరునికిఁగల యట్టిసంపత్తినిగాని లేక యంతటికంటె నెక్కుడయిన సంపదనుగాని గోరితివేని శీలవంతుఁడవు గమ్ము.శీలముచేత మూఁడులోకములను జయింప శక్యమగును. ఇందులకు సందేహములేదు. శీలవంతులగువారికి లోకమం దసాధ్యమేదియుఁ గలుగదు. మాంధాత యొకరాత్రిని, జనమేజయుఁడు మూఁడు రాత్రులను, నాభాగుఁడేడురాత్రులను భూమినంతయుఁ బడ

సిరి. ఈరాజులందఱును శీలవంతులును, యశస్సంపన్నులును కావునసే భూమి వారి గుణములకు నమ్ముడువ్రోయి తనంతట నే వారిని బొందినది' యనెను. అందులకు దుర్యోధనుఁడు 'భూమి నంతయు నతిశీఘ్రమున నారాజులు పొందిన యాశీలమును బొందు విధమెట్లు ? వినఁగోరెద' నని యడిగెను. ధృతరాష్ట్రుడు 'ఈవిషయమై పురాతన మయినయీ యితిహాసము నుదాహరించుచున్నారు. నారదుఁడు మున్ను శీలమునుగుఱించి యిది చెప్పెను. తొల్లి, దైత్యుండగు ప్రహ్లాదుఁడు శీలమునాశ్రయించి మహాత్ముఁడగు నుహేంద్రుని రాజ్యమునుహరించి మూఁడులోక ములను దనవశము గావించుకొనెను. పిదప నింద్రుఁడు మహా ప్రాజ్ఞుండుగాన బృహస్పతినిబొంది యంజలి గీలించి యతనితో 'శ్రేయమెద్దియో తెలిసికొనఁ గోరెదను' అని యడిగెను బృహ స్పతి యతనితో '(ముక్తికారణమగు) జ్ఞానమే పరమమయిన శ్రేయ'మనిచెప్పెను. ఇంద్రుఁడతనితో మరల 'దానికంటె విశే షించినది గలదా?'యని యడిగెను. బృహస్పతి 'నాయనా! దీని కంటె విశేషించినదియుఁ గలదు. మహాత్ముఁడగు శుక్రుఁడు నీకు దానిని మఱింతలెస్సగా నుపదేశింపఁగలఁడు. అచటికింబొమ్ము. నీకుశుభం బగుఁగాక;పోయి యతనినడుగు'మనెను. మహాతపస్వి యు నతిమాత్రకీర్తియు నగు నింద్రుఁడు భార్గవునికడకుఁ బోయి ప్రీతి గడలుకొన మోక్షసాధన మగు జ్ఞానము నుపదేశము నొం దెను.పిదప మహాత్ముండగు శుక్రునివలన ననుజ్ఞవడసి యింద్రుఁ డతనితో 'దీనికంటె నెక్కుడయిన శ్రేయస్సుగలదా ?' అని యడిగెను. అందుల కాసర్వజ్ఞుండు శుక్రుఁడు 'మహాత్ముం డగు ప్రహ్లాదునకు నింతకంటె నధికమయిన జ్ఞానముగలదు' అని

చెప్పెను. అది విని యింద్రుడు హగ్ము నొందెను. అంత నింద్రుడు బ్రాహ్మణవేషము వేసికొని ప్రహ్లాదుని యొద్దకుఁ బోయి యతనితో 'శ్రేయమెద్దియో తెలియఁగోరుచున్నాను' అని యడిగెను. ప్రహ్లాదుఁ డాబ్రాహ్మణునిఁ జూచి 'బ్రాహ్మణోత్తమా ! మూఁడులోకములను బరిపాలించుటయందుఁ దగులువడి యున్నానుగాన నాకవకాశములేదు. కాఁబట్టి నీ కుపదేశము సేయనేరను' అనెను. బ్రాహ్మణుఁడు 'రాజా ! నీ కనకాశముగల యప్పుడేని మిక్కిలి యుత్తమమయిన కర్తవ్యమెద్దియో యుపదేశింపవలయును' నని వేఁడెను. అందులకుఁ బ్రహ్లాదుఁడు ప్రీతుఁడై బ్రహ్మవాది యగునాబ్రాహ్మణునికి వల్లెయని చెప్పి యప్పుడు తగినకాలమున నతనికి జ్ఞానతత్త్వమునుపదేశించెను. ఆబ్రాహ్మణుఁడు బ్రహ్లాదునియెడ గురున్నదెస నుండవలసినన్నతిని గయికొని మనఃపూర్వకముగా నతఁడు గోరినది చేయసాఁగెను. ఆబ్రాహ్మణుఁడు పలుమా ఱతనినిజూచి 'అరిందమా! మూఁడులోకముల రాజ్యమును నీ వే విధమున జయింపనేర్చితివి. ఆయుపాయము లెవ్వియో ధర్మజ్ఞా ! నాకుఁ జెప్పు' మని యడిగెను.

ప్రహ్లాదుఁడు—'బ్రాహ్మణా! నేను రాజనని విఖ్యాతుఁడగను. మఱి బ్రాహ్మణులయెడ నసూయపడను. వారు శుక్రునిమతము ననుసరించిచెప్పెడి నీత్యుపదేశములను గయికొని యట్లె యనుష్ఠింతును. వారు చెప్పఁగోరినదానిని మిక్కిలి నమ్మికతో నాకుఁజెప్పి యక్రమ మయిన దారినుండి నన్ను వారింతురు. నే నెప్పుడును శుక్రునిమార్గమునే యనుసరింతును. నేను బ్రాహ్మణులకును నా పెద్దలకును నెప్పుడును శుశ్రూష సేయుచుందును. నా కహం

కారము కలుగదు. మఱియు ధర్మాత్ముఁడనై క్రోధమునుజయించి యింద్రియములనడంచి యడఁకువ గలిగియుందును. శాస్త్రజ్ఞులగు బ్రాహ్మణులు తేనెటీఁగలు వెఱలోఁ దేనియనుబోయిన ట్లింపయిన యుపదేశము లతో నామదిని దడుపుచుందురు. ఆ విద్వాంసులాదరించునట్టియమృతరసమును గోరులుచు నత్యంత్రము లందుఁ జంద్రుఁడునుంబోలె నాజాతివారియందు వెలుగుచుందును. బ్రాహ్మణులముఖమున శుక్రునినీతుల వినుటయు నట్లు యనుష్ఠించుటయు ననెడి యిదియె భూలోకమందలి యమృతము. ఇదియే యుత్తమమయిన చక్షువు. ఇదియే శ్రేయము' అనెను. ఆ బ్రాహ్మణునిచేత శుశ్రూష నంది మరలఁ బ్రహ్లాదుఁడతనితో 'బ్రాహ్మణోత్తమా ! నీవు గురువనెడునుంబోలెనే నాయెడ నడచుకొన్నందులకుఁ బ్రీతుండనయితిని. నరమడుగుము. నీకు శుభంబగుఁగాక. వరమునిచ్చెదను. సందేహము వలదు' అనెను. అందుల కాబ్రాహ్మణోత్తముఁడు 'మంచిది: అట్లు చేసెద' ననెను. ప్రహ్లాదుఁడు 'వరము గయికొను' మని ప్రీతిమీఱ మరలఁజెప్పెను. బ్రాహ్మణుఁడు 'రాజా ! నీవు నాయెడఁ బ్రసన్నుఁడవయితివేని నాకుఁ బ్రియము చేయఁగోరెదవేని నీశీలమును బడయఁగోరుచున్నాను. ఇదియ నాకు వరము' అనెను. ఇందులకుఁ బ్రీతుఁడయినను బ్రహ్లాదుఁడు మిక్కిలియు భయమునొందెను. ఆబ్రాహ్మణుఁ డావరము నడిగినప్పుడు ప్రహ్లాదుఁ డతఁడల్పచిత్తుఁడు గాఁడని తెలఁచెను. అతఁడు మిక్కిలి యాశ్చర్యపడుచుఁ గడపట 'వల్లె' యనెను. ఆ దైత్యనాథుఁడు వరమునొసఁగియు నపుడు మిక్కిలియు దుఃఖమునొందెను. వర మీయఁగానే బ్రాహ్మణుఁడు పుచ్చుకొని వెడలిపోయెను; కాని ప్రహ్లా

డుఁడు మాత్రము మిక్కిలియుఁ జింతకుఁ బాలై యేమిచేయుట కును రూఢిగాఁ దోఁపకుండెను. ఆదైత్యనాథుఁ డావిషయ మును జింతించుచుండఁగా నతని యొడలినుండి యొకచాయ యపుడు బయలువెడలెను.అది తేజోరూపముగలిగి మిక్కిలియుఁ బెద్దదిగా నుండెను. ప్రహ్లాదుఁడు దానినిజూచి 'నీవెవ?'రని యడి గెను. అందులకది 'నేను శీలము. నీవు త్యజింపఁగా విడిచిపోవు చున్నాను. నీకు శిష్యుఁడై యుండి నిత్యమును సమాహితుఁడు గా నుండిన యాబ్రాహ్మణోత్తమునియందు నసింపఁగలను' అనెను. ఇట్లది చెప్పి మఱుఁగుపడి యంత నింద్రునిఁ బ్రవేశిం చెను. ఆతేజస్సు పోఁగానే యంతి కటువంటిరూపము గలమఱి యొకఁ డాప్రహ్లాదుని దేహమునుండి వెడలివచ్చెను. ఆప్రహ్లా దుఁడు 'నీవెవ?'రని యడిగెను. అది 'అసురేంద్రా ! నన్ను ధర్మ మని తెలియుము. ఆబ్రాహ్మణుఁ డిచ్చటనున్నాఁడో యచ్చటికిఁ బోయెదను. ఎచ్చట శీలముండునో యచ్చటనే కదా నే నుండు వాఁడను' అనెను. పిదప మహోత్సుండయిన యాప్రహ్లాదుని దేహ మునుండి కాంతిచే మిక్కిలి జ్వలించుచున్నట్లున్న మఱియొకఁడు వెలికివచ్చెను. ప్రహ్లాదుఁడు'నీవెవ?'రని యడుగఁగా మహాద్యుతి యగు నాపురుషుఁడు 'అసురేంద్రా ! నన్ను సత్యమని యెఱుం గుము. ఇపుడు వెలుపలికిఁ బోవుచున్నాను; నేను ధర్మము నను సరించి యుండువాఁడను' అనెను. ఆపురుషుఁడు ధర్మము వెంటఁ బోవఁగానే యాప్రహ్లాదునినుండి మఱియొక పురుషుఁడు వెలికి వచ్చెను.'నీవెవ?'రని ప్రహ్లాదుఁడడుగఁగానే 'ప్రహ్లాదా!నన్నువృత్త మని తెలియుము.సత్యముండుచోటనె కదా నేనునుండువాఁడను' అనెను. ఆపురుషుఁడు పోఁగానే యాప్రహ్లాదుని దేహమునుండి

వెనుశబ్దము వెలువడెను. ప్రహ్లాదుఁడు 'నీవెవ'రని యడుగఁగా నది 'నన్ను బల మని తెలియుము.వృత్తమున్నచోటనే యుండువాఁడను' అనిచెప్పి యది వృత్తమున్నయెడకుఁ బోయెను.పిదప నా ప్రహ్లాదుని దేహమునుండి ప్రభావమయియగు నొకదేవిబయలు వెడలెను. ప్రహ్లాదుఁ డాదేవిని 'నీవెవ'రని యడిగెను. ఆయమ, నేను 'లక్ష్మిని ; సత్యపరాక్రమా ! నేను నీయందెప్పుడును సుఖముగా వసించుచుంటిని. నీవు విడువఁగాఁ బోవుచున్నాను. నేను బలము ననుసరించి యుండుదాన ను గదా' య నెను. అంతఁ బ్రహ్లాదునకు భయముపుట్టెను. అతఁడు 'తామరయందుండు ముద్దరాలా ! నీవు లోకమునకుఁ బరమేశ్వరివి. సత్యవ్రతవును గదే ! ఎచ్చటికిఁ బోయెదవు? ఈబ్రాహ్మణ శ్రేష్ఠుఁడెవఁడు ? యథార్థమును దెలియఁ గోరుచున్నాను' అని యడిగెను. అందుల కాలక్ష్మీదేవి 'ప్రభూ ! నీయొద్ద బ్రహ్మచారిగానుండి విద్యగఱచినవాఁడింద్రుఁడు. ముల్లోకములందును నీకుఁ గలిగియున్న యైశ్వర్యమును నతఁడపహరించెను. ధర్మజ్ఞా! శీలముచేతఁగదా మూఁడులోకములను నీవుగెలిచితివి. ప్రభూ ! దానినిదెలిసి దేవేంద్రుఁడు నీశీలము నపహరించినాఁడు; మహాప్రాజ్ఞుండవు గదే ! ధర్మమునకును,సత్యమునకును,నట్లే వృత్తమునకును, బలమునకును, అట్లే నాకును, నెప్పుడును శీలమే కారణముగాఁ గలిగియుండును. ఇందులకు సందేహములేదు' అనిచెప్పి యాదేవి పోయెను.వార లాఁడఱునుం బోయిరి' అనెను.

భీష్ముఁడు—'ధర్మరాజా ! దుర్యోధనుఁ డెప్పుడు మరలఁ దండ్రినిజూచి 'కురునందనా ! శీలమునకుఁగల తత్త్వమును దెలియఁ గోరెదను. శీలమునెట్లు పడయవచ్చునో యా యుపాయమును

నాకుపదేశింపవలయును' అనియడిగెను. ధృతరాష్ట్రుడు 'రాజా! మహాత్ముండయిన ప్రహ్లాదుఁడు తొల్లి యింద్రున కుపదేశించునపు డాయుపాయములను దెలిపియున్నాఁడు. సంగ్రహముగా శీలమును బడయువార్గమును జెప్పెదవినుము. సమస్త భూతములందును మనస్సుచేతను వాక్కుచేతను క్రియచేతను ద్రోహము లేకుండుట, అనుగ్రహము, దానము ననెడియీమూఁడును శీలమని ప్రశంసింపఁబడుచున్నవి. ఏది యితఁగులకు హితముగా నేరదో, ఏది సిగ్గుపడుటకుఁ గారణమగునో, యట్టికర్మమునుగాని పౌరుషమునుగాని యేవిధమునను జేయరాదు. దేనిని జేసినయెడలసదస్సునందుగొనియాడుట గలుగునో యట్టికార్యమును జేయవలయును. నీ కీశీలమును సంక్షేపముగా నుపదేశించితిని. రాజా! శీలము లేనివారును గొన్నియెడల సంపదను బొందుచున్నారు. అయినను, నాయనా! చాలఁగాల మనుభవింపఁజాలరు; వారు వేరు తోఁగూడఁ ద్రెళ్లుదురు. పుత్రకా! దీనిని గలరూపునఁ దెలిసికొని శీలము గలిగియుండుము. నాయనా! నీవు యుధిష్ఠిరునకంటె నెక్కుడు సంపదనో యంతకంటె నధికమయిన దానినో కోరుదువేని శీలవంతుఁడవు కమ్ము' అనెను. కుంతిపుత్రా! నీవు దీనిని గావింపుము; ఈఫలమును బడయుదువు' అనెను. ఇది నూటయిరువదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడాశను నిరూపించుటకై బుధభక్తమిత్ర చరిత్రమును జెప్పఁ దొడఁగుట.}

ధర్మరాజు 'పితామహా! నీవు శీలము మనుష్యునకుఁ బ్రధాన

మయినదని చెప్పితివి. ఆశ యెట్లు గలుగుచున్నది? అదియేమి? దానిని నాకుఁజెప్పుము. పితామహా! నాకిది పెద్దసందేహముగాఁ గలిగియున్నది. ఈసందేహమును ద్రెంచువాఁడు నీవుదప్ప వేఱొకఁడు లేఁడు. (సుయోధనుని మోటుఁదనమును బట్టి) గొప్ప యుద్ధము జరుగనున్నపుడు వాఁడు యుక్తమయిన దానిని జేయునని నేను వానియెడల గొప్పయాశ గలిగియుంటిని. ఒక్కొక్కని యందు నాశ గొప్పదిగానున్నది. ఆయాశను జెఱిపినపుడు, మిక్కిలియు దుఃఖము గలుగుచున్నది. ఆదుఃఖము మరణమే యనుటకు సందేహములేదు నేను బుద్ధిమాలిన వాఁడనుగాన యీదురాత్ముఁడు ధృతరాష్ట్రుని కొడుకు నాయాశను దూలబుచ్చెను. నామందమతిని జూడుము! ఆశ,వృక్షములతోఁగూడిన కొండకంటెఁ బెద్దదియని తలఁచుచున్నాను. లేక యాకాశమున కంటెను విరివియైనదిగానచ్చును. లేక యది యింతింతనికొలఁది యిడరాని దగును కూఁగు శ్లేష్మా! ఆశ యిట్టిదని తలపోయుటయు దాని నడంచిపుచ్చుటయు నెంతయుఁ గష్టముగానున్నది. అది యిట్లు దుర్లభముగా నుండుటంబట్టి దానికంటె దుర్లభమయిన దేది'యని యడిగెను.

భీష్ముఁడు-'యుధిష్ఠిరా! ఈవిషయమందు సుమిత్రుఁడను రాజునకును ఋషభుఁడను మునికిని జరిగినకథను నీకుదాహరించెదను. నీవలనఁ దెలిసికొనుము. హైహయ దేశమునకు రాజు సుమిత్రుఁడను రాజర్షి యొకఁడుండెను. అతఁడొకనాఁడు వేఁటకుఁ బోయి వంగిన కిణుపులుగల (నున్నని) బాణముచేత నొకమృగమునేసి తఱిమెను. ఆజింక మిక్కిలి బలిమిగలదిగాన యమ్ము నెత్తికొని పఱచెను. బలవంతుఁడారాజును మిక్కిలి వేగముగా

మృగమును వెంటనంటి పోయెను. ఆమృగము వేగముగొని పల్లమునందును మెఱకయందును బరుగిడెను. రాజేంద్రా! ముహూర్తమువలె నది సకలమయినదారిని బోయినది. పిదప నారాజు యౌవనము చేతను, మేనియందలి బలిమిచేతను విలు గొని వాలుఁబట్టి కవచముదాల్చి దానిని మఱియు వేఁటాడెను. ఆరాజు తానొక్కఁడు నాయడవియం దామృగమును దఱు ముచుఁ బెక్కునదులను, నదములను, కొలఁకులను, నడవులను దాఁటిపోయెను. ఆమృగము మిక్కిలియు వేగముగలది గాన యారాజునకుఁ దనయిచ్చ చొప్పున నప్పుడప్పుడు కనుపట్టుచును మహావేగమునఁ బరుగిడుచునుండెను. ఆరాజేసిన వెక్కస్ములు గాఁడిపాఱఁగా నాయడవిమెకము వేఁటకాఁడుబోలె నతనిని దఱిసి వచ్చును. అది వేగనంతముగాన మఱల వడిగొని దాఁట్లు వైచు చుఁబోయి మఱల నగ్గఱికివచ్చును. సుమిత్రుఁడామృగము మర్మమును భేదించునట్టి క్రూరంపు బలుబాణమెత్తి వింటినుండి యేసెను.పిదపఁ గదుపునందు గమికాఁడయిన యామెకమురాజు నమ్మనేటిబారికిఁ దొలఁగి రెండుక్రోసుల దూరమునఁ బరిహ సించు నదియుంబోలె నిలుచుండెను. కాంతి దళుకొత్తుచున్న యాబాణము భూమియందుఁ బడఁగానే మృగ మరణ్యమందుఁ బ్రవేశించెను. రాజును మృగమును దఱుముకొని పోయెను. ఇది నూటయిరువదియేనవయధ్యాయము.

రాజధర్మ పర్వము.

భీష్ముడు, సుమిత్రుడు బుష్యాశ్రమమునకుఁ బోవుటయు వారిని జూచి యాశ్రమపెద్దయిన యాకాశము పెద్దయిన మొదలయినవారు యెదురుగొనుటయుఁ జెప్పుట.

అంత సుమిత్రుఁడు మహారణ్యమునఁ బ్రవేశించి ఋషుల యాశ్రమమును జేరి యపుడు బడలికితో నందుఁ గూర్చుండెను. అప్పు డారాజు విలుదాల్చి శ్రమంబునఁ బీడితుఁడై యాఁకిట నలంగుచుండుటను జూచి ఋషులువచ్చి యతనికి విధ్యుక్తముగా నుపచారముచేసిరి. రాజు నా ఋషులొసంగిన పూజను గయికొని వారి నందఱను జూచి 'మీతపము లత్యుత్తముగా వర్ధిల్లుచున్నవా?' యని యడిగెను. ఆతపోధనుఁ డారాజు మాటను గయికొని యతని నందులకు వచ్చిన దానికిఁ గారణమేమి యనియడుగువాఁడై 'శుభవదనా! నీవెందులకుఁగాను నడుమునఁ గత్తిగట్టి విలునమ్ములు దాల్చి కాలినడకను దపోవనమునకు వచ్చితివి? ఏకులమునఁ బుట్టినవాఁడవు? నీపేరేమి? మాకుఁజెప్పుము' అని యడిగిరి. అంత నారాజు బ్రాహ్మణులందఱకును దనవృత్తాంతమును గలరూపునఁ దనరాకను జెప్పఁదొడఁగి 'బ్రాహ్మణులారా! నేను హైహయ దేశరాజుల కులమునఁ బుట్టినవాఁడను. నాపేరు సుమిత్రుఁడు. పెద్ద సైన్యముతోడను నమాత్యులతోడను నంతఃపురకాంతలతోడను గూడి బాణములచే మృగసమూహములను వేలకొలఁదిని గొట్టుచు గ్రుమ్మరితిని. ఒకఁడంక నాయమ్ము దగిలి యాగ్రుచ్చుకొన్న యమ్ముతోడనే పరుగిడినది. అల్లది పరుగెత్తుచుండుఁగా దాని వెంటఁ దఱుము కొనుచు య

దృచ్ఛచే నీవనమును జేరితిని. నేను లక్ష్మిని దిగనాడి యాశ్రమంబున సోలి మీయింతకు వచ్చితిని. ఇంతకంటె దుఃఖమేమున్నది? శ్రమార్తుండనై, యాశ వమ్మయి, రాజులక్షణములు వీడి నేను మీయాశ్రమమును జేరితిని. తపోధనులారా! నాయాశ చెడుట నాకుఁ దీవ్రమయిన దుఃఖమును గలిగించునట్లు రాజ లక్షణములు విడుచుటయు దుఃఖమును గలిగింపదు. తపస్వులారా! హిమవత్పర్వతము తనపొడవుచేతను, మహోదధి యగు సముద్రము తనవిశివిచేతను, భూమ్యాకాశములనడిమికి నెట్లావరింప కున్నవో యట్లే నే నాశకుం గలతుదిని బొందకున్నాను. అన్నియు మీకుఁ దెలిసియుండును. తపోధనులగు ఋషులు సకలమును దెలిసినవారే కదా? మీరు మహాభాగ్యవంతులు. కాఁబట్టి యొక సందేహము నడుగుచున్నాను. ఒక మనుష్యుని కాశయున్నది. ఆకాశము నున్నది. దీనియందు లోకమున నేది పెద్దది యని మీకుఁ దోఁచుచున్నది. దీనిని గలరూపున వినఁగోరుచున్నాను. ఈ లోకమందేది దుర్లభము? ఇది యెప్పుడును మీకు గోప్యముగా కుండునేని జాగులేక చెప్పుఁడు. బ్రాహ్మణోత్తములారా! మిక్కిలియు రహస్యమయిన దానిని నేనడుగఁ దలంపను. మీతపములకు విఘ్నములయిన కార్యమునుండి నేను దొలంగెదను. ముచ్చటించుట కవకాశము గలదేని నేనడిగిన ప్రశ్నమునకుఁ గారణమును సమర్థతయు యథార్థముగా వినఁగోరుచున్నాను. ఎప్పుడును దపములు సలుపుచు సమాధి యం దుండుమీరలే దీనిని జెప్పఁదగుదురు' అనెను.

ఇది నూటయిరువదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ఋషభుండను ఋషి సుమిత్ర రాజునకు దమతీర్థ యాత్రాదులను జెప్పుట.

అంత నచటఁ గూడియున్న యా ఋషులలోపల శ్రేష్ఠుండగు ఋషభుండను బ్రహ్మర్షి నన్నుచు రాజుం జూచి రాజసింహా! ముందొకప్పుడు నేను దీర్థయాత్రకుఁ బోఁగా దివ్యమయిన నరనారాయణాశ్రమమును జేరితిని. అచ్చట సొగసయిన యా బదరీ వృక్షమును నల్లె గంగానదిసంబంధి యగుతటాకమును నున్నవి. రాజా! అచ్చట హయగ్రీవుఁడు శాశ్వతము లయిన వేదములను జదువుచున్నాఁడు. నేను మును పాతటాకమందు దేవతలకును బితరులకును విధ్యుక్తముగాఁ దర్పణముగావించి పిదప నరనారాయణు లనెడి యాఋషు లెప్పుడును గ్రీడించు చుండిన యాశ్రమమునకుఁ గొంచెము సమీపమున వసింపఁగోరి పోయితిని. అప్పు డచ్చట వల్కలము సజినమును దాల్చినవాఁడును, గృశుండును, మిక్కిలియుఁ బొడవయిన వాఁడును, నగు తను వనెడు ఋషి వచ్చుచుండఁ గాంచితిని. అతనిదేహ మితరమనుష్యుల దేహములతో నెంతమాత్రమును బోల్పఁదగదు. అట్టి కృశత్వమును నేను జూచినది లేదు. చిక్కియున్న యతని శరీరము చిన్నవ్రేలికి సాటిగా నుండును. కుత్తుకయును జేతులును గాళ్లును వెండ్రుకలును మిక్కిలి వింతగాఁ జూపట్టినవి. తలయును జెవులును గన్నులును నతని మేనికిఁ దగు మాత్రముగా నుండెను. అతని వాక్కును గర్మమును నొక్కరూపై యుండెను. నేను గృశుండయిన యా బ్రాహ్మణునిఁ జూచి మిక్కిలియు భయపడి యెంతయు మనం

మునఁ దూలుచు నతని యడుఁగులకు మ్రొక్కి పిదప నా గోత్ర మును నామమును గార్యమును దెలిపి యంజలిగీలించి యెదుట నిలిచియుంటిని. అతఁ డొసంగినయాసనమందు మెల్లగాఁ గూర్చుంటిని. మహారాజా ! అంత ధార్మికోత్తముఁ డయినయాబ్రహ్మర్షియు నట్టి బ్రహ్మలసదుమ ధార్థ యుక్తములయిన ముచ్చటలను జెప్పెను. అతఁడు చెప్పుచుండఁగానే తామరదేకుల వంటి కన్నులుగల వీరద్యుమ్నుఁ డనురాజు మహాసైన్యముతోడను నంతఃపుర స్త్రీలతోడను గూడి యక్కడకు వచ్చెను. అమ్మహాకీర్తి, కానయందుఁ గానకపోయిన తనపుత్రుని భూరిద్యుమ్నునిఁ దలంచుకొని మిక్కిలిశోకించుచు 'వాని నిచటఁజూతును.ఇయ్యెడఁజూతు' నని యాశతో వేగము లగు గుఱ్ఱములతోడ వచ్చెను. ఇట్లాశచేతఁ గృశించిన యారాజు వసమందు సంచరించుచు 'ఆపుత్రుని మరల నేను జూడఁగందునా? లేదు. ఒకఁడే పుత్రుఁడు మహారణ్యమందు ముందుఁ గనఁబడక పోయెను. వానిని నాకుఁజూడశక్యముగాకున్నదే. నాకాశయుఁ ద్రిద్దిగానున్నది. ఆశ నాదేహమునంతయు నావరించియున్నదిగాన నేను మరణమునొందనర్హుఁడనుటకు సందేహములేదు' అని యపుడు మాటిమాటికిఁ జెప్పెను. పూజ్యుఁడయినయా ఋషితిలకుండు విని తలవంచి యొకముహూర్తము ధ్యానాసక్తుఁడై యుండెను. మిక్కిలి శోకముగల యారాజామునిధ్యానము సేయుటను జూచి బుద్ధి విన్నవాఁడై 'దేవర్షీ ! ఏది దొరకుట యరిది? ఆశకంటెఁ బెద్దది యేది? ఇది గోప్యముగాదేని పూజ్యుఁడగు నీ వుపదేశింప వలయు'నని మాటికి మిక్కిలి యల్లల్లఁ జెప్పెను. తనువు 'రాజా ! నీకొడుకు మహాత్ముఁడయినయొక ఋషి నవమానించినాఁడు. వాఁడు

మందభాగ్యముచేత బుద్ధిమాలి యట్లుచేసినాఁడు. ఆఋషి నీకొ డుకును నొకబంగారు కలశమును వల్కలములను నడిగెను. వాఁ డవజ్ఞచేసియు నతని కవి యొసంగఁడయ్యె, ఆఋషి నీకొడు కుచేత నట్లు భంగపడి యాశ దూలినవాఁడయ్యె' ననెను. ఇది విని లోకపూజితుం డగు ఋషికి నభివాదనముచేసి ధర్మాత్ముఁ డా రాజు నీవలెనే బడలికచే సోలియుఁ గూర్చుండెను. ఆఋషి యర ణ్యవాసుల విధిచొప్పున నర్ఘ్యపాద్యములను రప్పించి రాజున కర్పించెను. పిదప సప్తఋషులు ధ్రువునింబోలె ఋషులందఱు ను నారాజును బరివేష్టించి కూర్చుండిరి. అపుడు వా రారాజును జూచి 'యాశ్రమమునకు వచ్చిన కారణమే' నుని యడిగిరి. ఇది నూటయిరువదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

తెను మహర్షి వీరద్యుమ్ననకు దుర్లభ వస్తువును గృహితరమైన యాశయును బ్రతి పాదించుట.

రాజు—'నేను వీరద్యుమ్నుం డను రాజను. దిక్కులయందు, బ్రసిద్ధిగన్నవాఁడను. నాకొడుకు భూరిద్యుమ్నుండు గానకపోఁ గా వానిని వెదకుటకై యడవికి వచ్చితిని. బ్రాహ్మణోత్తమా! వాఁడొక్కఁడే పుత్రుఁడు; నుతియు బాలుఁడు; ఏ తప్పును లేని వాఁడు. అట్టివాఁ డీవనమునఁ గనఁబడకపోయెను. వానిని వెదకు టకై క్రమ్మఱుచున్నాను' అనెను. అందులకు ముని ముఖము వాంచి మాటాడకయే యుండెను గాని యాసనుయమున రాజు ను జూచి బదులు చెప్పఁడయ్యె. ఏలనఁగా మును పారాజు

తానా బ్రాహ్మణుని నంతగాఁ బూజించినవాఁడు గాఁడు. దానిచే నతఁ డాశ చెడి దీర్ఘమయిన తపము నాశ్రయించెను. అతఁ డప్పుడు 'నేనేవిధమునను రాజులవలనఁగాని తక్కిన జాతు లనారివలనఁగాని ప్రతిగ్రహము చేయుటలేదు' అనుబుద్ధిని గలిగించుకొనెను. అతఁడు తనలో 'ఆశయేకదా పట్టుకొని యవివేకి యగు పురుషుని మాఁటాడించుచున్నది. నేను నామనస్సుననుండి యాయాశను దఱిమి వైచెద' నని తలఁచి యల్లి గట్టిగానుండెను. వీరద్యుమ్నుఁ డా మునివరునిఁ జూచి 'ఆశపలుచఁదన మెంత? భూమియందు దుర్లభ మెద్ది? మహాత్మా! నీవు ధర్మార్థములను గనుఁగొన్నవాఁడవు గాన దీనిని నాకుఁ జెప్పుము' అని యడిగెను. అంతఁ గృశత నుండయిన యమ్ముని యప్పుడంతయును దలంచుకొని రాజును గూడఁ దలఁపించుచు నతనితో 'రాజా! పలుచఁదనమునందు (కృశత్వమునందు) ఆశకు సాటియైన దొక్కటియు లేదు. నేను బెక్కురాజులను బ్రార్థించి * యది తోఁపించు వస్తువు కంటె దుర్లభమయినది లేదని కనుఁగొంటిని' అనెను. రాజు 'బ్రాహ్మణోత్తమా, నీమాటలవలన నేది కృశమో యేది కృశముగాదో తెలిసికొంటిని. ద్విజుఁడు గాని వానియందు వేదవాక్యమువలెనే, ఆయాశయందుఁ దోఁచువస్తువే దుర్లభ మని తెలియనయ్యెను. మహాప్రాజ్ఞా! అయినను నామనసునం దొక సందేహమున్నది. నేనడుగఁగా దానిని గలరూపునఁ జెప్ప

* 'తస్యా వైదుర్లభత్వాచ్చ ప్రార్థితః పార్థివోమయా' అని పాఠాంతరము. దాని నడంప శక్యము గానందున నే రాజును బ్రార్థించితినని యర్థము. ఇది మఱింత సమంజసము.

వలయును. నీకంటె మిక్కిలి కృశముగా నుండునదేది?(ఈభూమి యందు దుర్లభమెద్ది?) బ్రాహ్మణవర్యా! పూజ్యుండవగు నీకు గోప్యముగాదేని దీనిని జెప్పవలయు' ననెను. ఋషియు 'తృప్తి గలయాచకుడు దొరికుట మిక్కిలియు నరిది. లేక యట్టివాడీ లోకమునందు లేదనవచ్చును. నాయనా!అంతకంటెను యాచకు నవమానింపకుండువాడు దొరకుట మిక్కిలియు నరిది. ఒకటి చేసెదమని ప్రతిజ్ఞచేసి తమచేతనైన కొలఁదిని యాచకునికర్థా మగురీతిని దానిని జేయకుండువారి నాశ్రయించిన * యాశయో నాదేహమునకంటెఁ బలుచనైనది. కృతఘ్నులయందును గ్రూరులయందును, సోనరులయందును, అపకారులయందును, నుంచినయాశ నాకంటెను బలుచనైనది. ఒక్కఁడే పుత్రుఁడుగల తండ్రి, యాపుత్రుఁడు గానకపోయినను లేక దేశాంతరగతుఁడైనను వాని వృత్తాంతము దెలియకుండునేని యట్టితండ్రి యాశ నాకంటెను బలుచనైనది. రాజా! ముదుసలి పడఁతులకుఁ బుత్రుఁడు కావలయునని ప్రసవమందుఁ గలుగునట్టి యాశయు, అల్ప ధనవంతులకుఁ గలుగునాశయు, నాకంటెఁ బలుచనైనవి. వయసెడిగినకన్యలకుఁ దమమోజులఁ బెండ్లిముచ్చట లెవరేని యాడునపుడు వినఁగా వారిమనసునందుఁ బెండ్లిచేసికొనఁ బూడమునట్టియాశయు నాకంటెఁ బలుచనయినది' అనెను. అది విని యారాజు తనయంతఃపురస్త్రీతోడ, శిగను ముని యడుగులు సోఁక నతనికిఁ గ్రిందఁబడి మ్రొక్కి 'మహాత్మా! నీయను గ్రహమును వేఁడెదను. పుత్రునిఁ జేరుటకు నువ్విళ్లూరెదను.

* అట్టిప్రతిజ్ఞా ఘాతకులను నమ్మరాదనియు, అట్టివారియందు ఆశయుంచువారి యాశ తనదేహమునకంటె పల్చనయనియు ఆశయము.

నీ విప్పుడు చెప్పినదంతయు యుక్తమే; నీవు కోరినవరము లడుగుము. నీవాక్యములు సత్యములనుటకు సందేహము లేదు' అనెను. ఋషభుఁడు—అంత ధార్మికోత్తముఁ డా పూజ్యుఁడు తనువు నవ్వి, తపస్సుచేతను శ్రుతముచేతను నతనిపుత్రుని వేగ రప్పించి యారాజును (తన్ను మున్నవనూనించి సందులకు) దూఱెను. అంత నాధార్మికోత్తముఁడు తన్ను ధర్మదేవతగాఁ జూచెను. అతఁ డద్భుతముగాఁ బొడకట్టుచున్న తనదివ్య స్వరూపమును జూపి యంత నేకోపమును వైరమును లేక దాపుననున్న వన మందుఁ బ్రవేశించెను. రాజా! నేను దీనినంతయుఁ గన్నారఁ జూచితిని, ఈ మాటలును వింటిని. కాఁబట్టి, మిక్కిలి పలుచ నయినయీయాశను వేగ దిగవిడువుము' అనెను. భీష్ముఁడు—'రాజా! అప్పుడు మహాత్ముం డగు ఋషభుఁ డట్లు చెప్పఁగా నానుమిత్రుఁడు తోడనే మిక్కిలిపలుచనయిన యాశను వీడెను. కాంతేయా! నీవు నిశ్చలు నేనుజెప్పిన యీమాటను విని హిమవంతముంబోలె నిశ్చలుండవై స్థిరుఁడవై యుండుము. రాజా! ఈలోకమందు నీవే, కష్టములయిన యిట్టివిషయములను గుఱించి యడుగువాఁడవుగను వినువాఁడవుగను నున్నావు. నావలన నిది విని నీవిక నిహవిషయములందు సంతాపము నొందఁ దగదు' అనెను. ఇది నూటయిరువదిఎనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

యముఁడు తలిదండ్రులకుఁ బరిచర్య సేయుట వారి ఋణమును దీర్చుకొనుట కృపాయిమగునని గౌతమునకుఁ జెప్పుట.

ధర్మరాజు—'భారతా! అమృతమునందుఁ దృప్తిగలుగనేరని యట్లు, నీవుచెప్పుదానియందుఁ జాలుననెడితలంపు నాకుఁగలుగకున్నది. [ఆత్మజ్ఞాన సమాధియందుండు వాఁడొట్టి తృప్తినొందియుండునో యట్టి తనివిగలిగి యున్నాఁడను.] పితామహా! కాఁబట్టి మరల నీవీధర్మవిషయమును నాకుసదేశింపవలయును. నేను నీ ధర్మోపదేశమనెడి యమృతపానముచేసి తృప్తినొందనేరకున్నాను' అనెను. భీష్ముఁడు—'ఈవిషయమున గౌతమునకును మహాత్ముఁడయిన యమునకును జరిగిన సంవాదమును పురాతనమయిన యీ యితిహాసమునుదాహరించెదరు. పారియాత్రమనెడు పర్వతమందు గౌతముఁడొక పెద్దయాశ్రమముండెను. తపసుచేఁ బాపములు నెల్ల దహించినట్టి యాగౌతముఁడందు వసించుచుండెను. అమ్మని యయువది వేలసంవత్సరములు తపముచేసెను. అప్పుడట్లుగ్రముగాఁ దపము సలుపుచున్న యమ్మహాముని కడకు లోకపాలకుండయిన యముఁడు వచ్చి వినయంబు మీఱఁ గాంచెను. ఆ బ్రహ్మర్షి యట్లు వచ్చినవానిని, దేజస్సునుబట్టి యముండని తెలిసి చేతులుమోడ్చి ప్రణతుఁడై పొంతకుఁ బోయెను. యముఁడును నా భార్గవోత్తమునిఁ జూడఁగానే నమస్కరించి 'నేను ధర్ముఁడను. మీకేమి చేయవలయును?' అని చెప్పి రాఁబట్టుకొనెను. గౌతముఁడు 'పురుషుఁడేమికావించి తలిదండ్రులయెడ ఋణములేని వాఁడగును? పడయఁదరము

గాని పుణ్యలోకములను నెట్లు పడయును?' అని యడిగెను. అందులకు యముఁడు 'ఎప్పుడును దపమును శౌచమును గలిగి సత్యధర్మపరాయణుఁడై యహరహమును దలిదండ్రులకుఁ బూజను దానే చేయుచుండవలయును. ఆప్త దక్షిణలతోఁ గూడిన యశ్వమేధయాగములు పెక్కులు చేయవలయును. దానిచేతఁ బురుషుఁ డద్భుతముగాఁ గనుపట్టు పుణ్యలోకములను బడయును' అనెను. ఇది నూటయిరువదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజాపత్కాలమందు బ్రజలను బీడించిగొనను బొక్కసము నవశ్యము వృద్ధిచేయనలయునని చెప్పుట.

ధర్మరాజు—'భారతా! మిత్రులు దిగవిడిచిన వాఁడును బెక్కు శత్రుప్రులు గలవాఁడును బొక్కసము క్షీణించినవాఁడును సైన్యము లేనివాఁడును నగు రాజు నడచుకొనవలసిన దెట్లు? మఱియు వానిచుట్టును దుష్టులగు మంత్రులున్నను, వాని మంత్రము లన్నియును బర్వినను, వాని కేదారియుఁ దోఁపకున్నను, పరరాష్ట్రముపై దండెత్తినపుడును, పరరాజ్యమునుబట్టి నలంచుచున్నపుడును, దాను దుర్బలుఁడైయున్నను బలవంతునితో విగ్రహించుచుండునపుడును, ఎట్లు నడచుకొనవలయును? మఱియు వాని రాష్ట్రము చక్కఁగా రక్షింపఁబడకున్నను, వాఁడు కాలదేశములను దెలియకున్నను, తాను మిక్కిలియుఁ బీడితుఁడగుటవలనఁ బ్రజలయందు నిమ్మళపాటుగాని శత్రుప్రులయందు భేదముగాని పుట్టింప శక్యముకాకున్నను, వానినడక యేమి? వాఁడు చెడ్డ యుపాయములచేత ధనమును బడయఁ జూడఁ

వలయునా ? లేక ధనమును గోరక యే ప్రాణమును దిగవిడువ వలయునా ? ఏదిచేసిన లెస్స ?' యని యడిగెను.

భీష్ముడు—'ధర్మజ్ఞా ! నీవు మిక్కిలి రహస్యమైన ధర్మమును గుఱించి నన్నడుగుచున్నావు ? ఈ ధర్మము నడుగక యే చెప్పుటకునే నుత్సహింపను. భరతసత్తమా ! ధర్మము మిక్కిలియు సూక్ష్మమైనది చుమీ ! అది శాస్త్రములు చెప్పుటవలన నొకఁడు తెలిసికొనుచున్నాఁడు. విన్నదానిని మనస్సునకుఁ దెచ్చుకొని యనుష్ఠించియు మంచి యాచారము లాచరించియు నొకఁ డొక్కయెడ సాధువుగావచ్చును. రాజు బుద్ధి మున్నిడికొని కార్యము చేసియు ధనవంతుఁడయినను గావచ్చును ; కాకయుఁ బోవచ్చును. నీవు నీ సాంతబుద్ధినిగొని నీప్రశ్నమున కీవిషయమున నేమి బదులు చెప్పవలయునో యాలోచించి చూడుము. భారతా ! రాజులాపదలందుఁ దాము వ్యవహరము నడపుకొనుటకై మిక్కిలియు ధర్మయుక్తమగు నుపాయమేదియో వినుము. కేవలము ధర్మమును బట్టిచూడఁగా, నే నిట్టియుపాయములను ధర్మములని చెప్పను. దుఃఖమెట్టి బొక్కసమును నించుకొన్నయెడ నిట్టి నడక రాజును బిదప మృత్యువు దరికిఁదెచ్చును. ఈ విషయమై యాలోచింపఁగా, బుద్ధిమంతుల నిశ్చయమే యిది యగును. మనుష్యుఁడు నిత్యమును నెట్టియెట్టి శాస్త్రమును జదువుచున్నాఁడో యట్టి జ్ఞానమే వానికిఁ గలుగును. అట్టి విజ్ఞానము వాని కిష్టముగానే యుండును. విజ్ఞానము లేమివలనఁ బురుషునకుపాయ నాశమును విజ్ఞానమువలన నుపాయమును గలుగుచున్నది. ఉపాయమనఁగా సంపత్తిని గలిగించెడి పరమ సాధనము. నీవు శంకయు నసూయయులేక నేనిదె చెప్పునది వినుము.

బొక్కసము తగ్గుటవలననే రాజునకు మిక్కిలి బలమును దగ్గును. రా జెప్పుడును జలములేని యడవిపట్టున జలమును బుట్టించువిధ మున, నే యుపాయమైనఁ బన్ని బొక్కసమునునిండింపవలయును. రాజు పూర్వు లాచరించిన యీ యుపధర్మము నూఁది కాలము వచ్చినపుడు ముందు పీడించిన ప్రజలయెడ ననుగ్రహము చూప వలయును; సంతోషపఱుపవలయును. ఈ ధర్మ మిట్టి యాప త్కాలమందు యుక్తమగును. సమర్థులగువారికి (సామాన్యసం దర్భములందు) ధర్మము వేఱు. ఆపత్సమయములందు ధర్మము వేఱు. బొక్కసము లేకయు రాజు (తపోవ్రతాదులవలన) ధర్మ మును బడయవచ్చును. ధర్మముకంటె జీవనము మఱియుఁగొ ప్పది. (జీవనము ధనము లేక జరుగదుగాని ధనమును బడయుటకు విఘ్నముగావించు ధర్మమును బూనరాదు). బలహీనుఁడయిన రాజు వట్టిధర్మమునుమాత్రము పడయునేని జీవనముసకు న్యాయ మయిన మార్గములను బొందఁజాలఁడు. మఱియు నతఁడు తా నెం తపాటు పడినను ధర్మముచేతనే బలిమి నొందఁజాలఁడు. కాన యాపదలందుఁ గావించు నధర్మములును ధర్మలక్షణము గల విగా వినఁబడుచున్నవి. అయినను విద్వాంసు లట్టికర్మము లధ ర్మము కలిగించుననియె తెలియుదురు. ఆపద తొలఁగిన పిదప క్షత్రియుఁనకు దోషమును బోకార్చునట్టి ప్రాయశ్చిత్త మేమి విధిం పఁబడి యున్నది? అతఁ డట్టిసమయమునఁ దనకు ధర్మముకుం దకుండునట్లుగా నడచుకొనవలయును. మఱియుఁ దన శత్రువు వారికిఁ * జిక్కకుండునట్లుగాను ప్రవర్తింపవలయును. ఇవియు

* అనఁగాఁ దాను శాంతికవిధులు చేసికొని తాను బీడించినవారికి ద్వేష ము గలుగకుండునట్లు హితము లాచరింపవలయునని భావము.

వానికిఁ గ ర్తవ్యములుగాఁ జెప్పెదరు. అవి యేవనఁగా నతఁడు దైన్యము నొందరాదు. ఆపత్కాలమందుఁ దనధర్మమునుగాని, బరులధర్మమునుగాని బాటింపనలసినది లేదు. సర్వవిధముల యిన యుపాయములచేతఁ దన్నుఁ దాను విడిపించు కొనవల యును. ఇదియే నిశ్చయము. ధర్మవిదులగు బ్రాహ్మణులు ధర్మ మునందు నిపుణులుగా నుండవలయు ననుట నిశ్చయింపఁ బడిన దని శ్రుతిగలదు. అట్లు క్షత్రియుఁడు బాహువీర్యము గలవాఁడు గానయుద్ధమందు నిపుణుఁడై యుండవలయునని యది చెప్పెడిని క్షత్రియునకుజీవనమార్గమునకడ్డగలిగినపుడుతాపసులయుశ్రోత్రి యులయుసొమ్ముతప్పఁదక్కిన దేదియువాఁడొత్తికొనవచ్చును. బ్రాహ్మ ణునకు,గుందునొందినపుడు,యాగముచేయింపరానివానికి యాగ ముచేయించుటయు భుజింపరానిదానిని భుజించుటయు నెట్లుకూ డునోయట్లు,క్షత్రియునకుఁ దక్కిన యెవరిసొమ్ము నేనియుఁగయికొ నఁజెల్లును ఇందులకు సందేహము లేదు. ఆపదగలవానికిఁబోరాని దారియేది? (చెఱ మొదలయినవానిచే) అడ్డగింపఁబడిన వానికి (తప్పించుకొను విషయమున) జెడ్డదారి యేదియుఁగాదు. ఒకఁడు పీడింపఁబడినపుడు వాఁడు తప్పదారిని దప్పించుకొని పరుగి డును. అట్లు యిదియు. క్షత్రియుఁడు బొక్కసముతఱిగి సేన యుఁగుంది మిక్కిలియుఁ గీడ్పడియున్నపుడు వానికి భైక్షచర్య గాని వైశ్యశూద్రుల జీవనవృత్తిగాని విహితముగాదు. వానికి యుద్ధమునను జయమునను ధనమును బడయుటయే స్వధర్మము. వాఁడు తనజాతివాని మఱొకని నెప్పుడును యాచింపరాదు. వాఁడు తన స్వధర్మమును దిగవిడువవలసి నట్టియాపద గలిగిన పుడు తన మొదటికల్పమునకు (స్వధర్మమునకు) రెండవకల్పము

(అనఁగాఁ బ్రజలను బీడించియేని ధనమును బడయుట) చొప్పున జీవనముచేయుట న్యాయమగును. ఆపద నొందినవాఁడు ధర్మమునుసంబంధించిన న్యాయమును విడిచియు బ్రదుకవచ్చును. ఇది జీవనమునకు లోపముకలిగినపుడు బ్రాహ్మణులయందుఁ గానఁ బడినది. క్షత్రియునివిషయమై యిది నిస్సందేహముగా నిష్కర్షింపఁబడి యున్నది. క్షత్రియుఁడు ధనముగోరినపుడు ప్రజలవలననుండి ధనమును దీసికొనవచ్చును. తా నెట్లును గీడ్పడకుండు నట్లు చూచుకొనవలసినది ముఖ్యము. క్షత్రియుఁ డాశ్రయించిన ప్రజలను రక్షించువాఁడని చెప్పుదురు. కాఁబట్టి రక్షింపఁగావించు వాఁడగురాజు ప్రజలధనము నెత్తికొనవలయును. ఈలోకమందు క్షత్రియులు గానివారియందు సయితము మెటునంటి మనుష్యునకును హింసలేని జీవనము గలుగదు. అడవియం దొంటరిగాఁ దిరుగుచుండు మునులకును, తిలవ్రాలుచొప్పున జరుగునని నమ్మి బ్రదుకుట శక్యముగాదు. ప్రజారక్షణము సేయఁగోరు క్షత్రియునకు నిది మిక్కిలియు నశక్యము ఆపత్కాలమం దెల్లప్పుడు రాజును రాజ్యమును నొండొరుల రక్షింపవలయును. ఇది సనాతనమయిన ధర్మము. రాజాపత్కాలములందు నరాధములను గొనిరాజ్యమునురక్షించునట్లు,రాజ్యముసైతమాపత్కాలమందు రాజును రక్షింపఁ దగియుండవలయును. రాజు తనకెంత యాపదకలిగినను, రాజ్యమును సంబంధించిన బొక్కసమును, దండమును, సైన్యమును, మిత్రులను, సుహృదులను, మతియుఁదక్కిన ముఖ్యులను దిగవిడువరాదు. ధర్మవిదులగువారన్నమును దగ్గించియైన విత్తనమును* సంపాదింపవలయు నందురు. ఈయాపద్ధ

* విత్తనములను మిగత పడకుండునట్లు భుజించినచో పిదప భోజనము

ర్మము మహామాయుఁడయినశంబరాసురుని మతమని చెప్పుదురు. ఎవనిరాజ్యము జీవనము లేక కష్టపడుచున్నదో, ఎవఁడు వేఱు గతిలేక జీవనమునకై దేశాంతరమునకుఁ బోవుచున్నాఁడో, యట్టిరాజు బ్రతుకు, ఇన్సీ! నింద్యము. రాజునకు మూలము బొక్కసమును సైన్యమును. అతని సైన్యమునకు మూలము బొక్కసము. ఆసేన సమస్త ధర్మ్ములకును మూలము. ప్రజలకు మూలము ధర్మ్ము, ఈలోకమందు నితరులను బాధింపకయే బొక్కసమును సంతరించుటకు వలనుగాదు. మఱి సేనగాని యెక్కడిది? అట్టిబొక్కసమునకై పీడించుటవలన రాజు దోషమును బొరయఁడు. చేయఁదగనివికూడఁ గార్యముకొఱకు యాగము లందుం జేయఁబడుచున్నవి. ఆపత్కాలమందు బొక్కసము గూర్చుటకై చేయఁదగనివి చేసినను, ఈకారణమునబట్టి దోషమును బొందఁడు. ఆపదయందుఁ బ్రజలను గట్టిపెట్టుట వారి క్షేమమునకుఁ గారణమగును. గజము లశ్వములు మొదలయిన వానిని రక్షించుట నిష్ఫలమైనను నది యంతయు ధనమును జేర్చుటకుఁ గారణమగును. బుద్ధిమంతుఁడగు రాజిట్టి బుద్ధిగలిగి తన కార్యములను నిష్కర్షించుకొనవలయును. యాగములకు మఱొకటి (అనఁగాఁ బశువులు) సాధనము; యాగము మఱొకటికి (అనఁగాఁ జిత్తశుద్ధికి) సాధనము. పశువులు, యాగములు, చిత్తశుద్ధి యన్నియును మోక్షమునకు సాధనము లగుచున్నవి.

అరుదగును. అన్నమును వగ్గించియైన విత్తనములను నిలువఁజెట్టినచోఁ బిదప చక్కఁగా దొరకును. అట్లే ప్రజలు ధనముతగ్గినరాజును వృద్ధికిఁ దెచ్చినచో పిదప రాజుచేతఁ బ్రజలు రక్షితులగుదురు. రాజునకు విపత్తుగలిగినచోఁ బ్రజలు నశింతురు - అని యొక వ్యాఖ్యయందుఁ జూపట్టుచున్నది.

ఇట్లే నీతియు దండమును బొక్కసమునకును, బొక్కసము సేనకును, నీతి బొక్కసమును సేనయు మూఁడును బగవారి నుఱుమాడి రాజ్యమును గాచి వృద్ధినొందించుటకును సాధనములగును. ఈవిషయమై ధర్మతత్త్వమును నిరూపించు నట్టియొక దృష్టాంతము చూపెదను. యాగమునకై యూపమునకుఁ దగిన మ్రానును గొట్టుచున్నారు. దానిని గొట్టునపుడు దానికడ్డుగానున్న తక్కిన చెట్లనుగూడ నఱుకుదురు. ఈచెట్లు గూలునపుడు దాపున నున్నయితరవృక్షములను విఱుచుచున్నవి. ఈవిధమునఁ బొక్కసమును బెద్దది గావించుటకు నడ్డుగానుండు వారినందఱను జంపకతీఱదు. మఱియొక విధమున నీసిద్ధిని బడయుట నాకుఁ దోఁపకున్నది. ధనమువలన నిహమును బరమును సత్యమును ధర్మమును జయింపవచ్చును. ధనములేనివాఁడు శవమే యగును. సర్వవిధములయిన యుపాయములచేతను యాగమునకు నుపయుక్తమగు ధనమును సంపాదింపవలయును. భారతా! ఆపత్కాలమందుఁ జేసిన కార్యమునకుఁ గలుగు దోషమును, ఆకార్యమునకే యితర సమయములందుఁ జేయఁగాఁ గలుగు దోషమును, సమములు గానేరవు. ధనమును బడయుటయు విడుచుటయు రెండును నొక్క పురుషునియందే కలుగుట యరిది. రాజా! అడవియందు ధనవంతుఁడగువానిని నేను జూడలేదు. లోకమున ధనమని కనుపట్టు నొక్కొక్కవస్తువును గుఱించియుఁ బ్రతిమనుజుఁడును మఱియొక్కనితో 'ఇది నాకువలయును. ఇది నాకువలయు' నని మచ్చరికించుచుండును. ఏవిధమునను రాజునకు రాజ్యలాభముతో సమమయిన దొక్కటియు లేదు. బ్రజలకు సాధారణకాలములందు బదువయిన పన్నులు

విధించి పీడించుట రాజున కెంతయు నధర్మము. అది మఱియొక (గూఢ)కాలమందు వేఱగును (ధర్మమగును). కొందఱు దాన ములచేతను యజ్ఞములచేతను, మఱికొందఱు బుద్ధిచేతను సామ ర్థ్యముచేతను ధనమును సంతరింతురు. ధనము లేనివానిని దుర్బ లుఁ డందురు. ధనముగలవాఁడు బలవంతుఁడగును ధనముగల వాని కన్నియుఁ బడయఁగూడును. బొక్కసము చక్కఁగా నిండి యున్నరాజు, సమస్తమును జయించును. బొక్కసమువలన ధర్మ మును, గామమును, బరలోకమును, నిహలోకమును నన్నిటిని ధర్మంబునఁ బడియవచ్చును. అయినను బొక్కసమును, ధర్మ మును మున్నిడికొనియే నింపవలయునుగాని, యూపకాల ములందు ధర్మములగు నధర్మములు దప్పఁ దక్కిన యధర్మ ములచే నింపరాదు' అనెను. ఇది నూటముప్పదియనయధ్యా యము.

* రాజధర్మ పర్వము సమాప్తము.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు రాజాపదయందు సర్వస్వమును బరిత్యజించియైనఁ దన్ను రక్షించుకొనవలయునని చెప్పుట.

ధర్మరాజు—'భారతా! శ్రీమంతుఁడైనవాఁడును, సోమరియును, బాంధవులు నశింతురనుభయమున యుద్ధమునకు రానివాఁడును,

* ఈదీవ్యకోశములందు రాజధర్మపర్వమునకు రాజధర్మానుశాసన పర్వమని నామాంతరము.

ఎప్పుడును ముఖ్యులయందు సందేహపడుచునే యుండువాఁడును, మంత్రముల గావనేరనివాఁడును నగురాజునకు, నింతవఱకుఁ జెప్పినదికాక మఱియుఁ జేయవలసిన దేమియున్నది? మఱియుఁ దనరాజ్యమును బురజనులను శత్రువులు పంచుకొన్నట్టి వాఁడును, ధనసమూహము గోలుపోయినవాఁడును, దారిద్ర్యము వలన మిత్రులను గారవింప లేనివాఁడును, సర్వ విధముల భిన్నులయినమంత్రులు గలవాఁడును, శత్రు సేనలచే నెదిరింపఁబడినవాఁడును, దుర్బలుఁడును, బలవంతుఁడగు శత్రువులచే మనస్సు గలంపఁబడినవాఁడును నగు రాజునకు మఱియు నేమి చేయఁదగియున్నది? దానిని జెప్పనలయు'నని యడిగెను. భీష్ముఁడు 'దండెత్తివచ్చిన శత్రువు పరిశుద్ధమయిన మనస్సు గలిగి ధనమందేకాక ధర్మమందును గుశలుఁడుగా నుండునేని నీవు చెప్పినట్టిరాజు మునుముట్ట జూగుసేయక యతనితో సంధి చేసికొని ముందు వానిచే నాక్రమింపఁబడిన రాజ్యభాగములను విడిపించు కొనవలయును. అట్లు దండెత్తివచ్చినవాఁడు ధర్మంబున జయింపఁగోరినవాఁడును బలవంతుఁడును బాపమునందెపట్టుగలవాఁడునుగా నుండునేని యట్టివానితోను, దనరాజ్య మండలి కొన్నిగ్రామము లిచ్చియైనను సంధిచేసికొనవలయును. పయినెత్తి వచ్చినవాఁడు సంధికెంతమాత్రము సమ్మతింపఁడేని, రాజు, తనరాజధానినైనను విడిచియో లేక మఱియే యుపాయమును జేసియో యాపదను దాఁటుకొనవలయును. రాచతిక మునకుఁ దగినవాఁడునుఱోడనుండినయెడల మరలనట్టి ధనములను సంపాదించుకొనవచ్చును. సంభవించిన యాపదలను బొక్కసమును బలమును దిగవిడిచినచోఁ దప్పించుకొనఁ గూడు

నేని, యప్పుడ నర్థధర్మములు దెలిసినవాఁడెవఁ డారెంటిని ద్యజిం పక వానికంఁటె నెక్కుడయిన తన్నుఁ ద్యజించుకొనఁజూచును? * రాజు తన యంతఃపురపు వారిని బదిలముగాఁ గావఁజూడవల యును. వారు శత్రువు భారిం జిక్కరేని వారికొఱకై (తన్నుఁ జిక్కించుకొనియైన విడిపింపవలయునని) దయచూపరాదు. రాజు తనకు శక్యమయినంతవఱకుఁ దన్ను శత్రువునకుఁ బట్టియిచ్చు కొనరాదు' అనెను.

ధర్మరాజు 'తనమంత్రులు మొదలయినవారు తనయెడఁగోప ముగొనియుండఁగాబయటనుండియె త్తివచ్చినవారుతన్నుఁ బీడిం పఁగా, తనబొక్కసము క్షీణింపఁగా, తనమంత్ర రహస్యములు బయలుపడఁగా, సపు డట్టిరా జేమి చేయవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'రాజట్టి సందర్భములందు (శత్రువు ధర్మబుద్ధి గల వాఁడేని) వేగిరముగా సంధిచేసికొనవలయును; (అధర్మబుద్ధిగల వాఁడేని) వేగముగాఁ దీవ్రమయిన పరాక్రమము నెఱపవల యును. పరాక్రమము నెఱపినచో వేగముగాఁ బగవాఁడు పరు విడును. లేక వానిచేత యుద్ధమున మరణము గలుగునేని దాని చేతఁ బుణ్యలోకముగలదు. రాజు తనసేన యల్పమయినను నది తనయెడ భక్తియు సంతుష్టియు బుష్టియుఁ గలిగినదై యుం డునేని, దానిచేతనే భూమిని జయించును; చంపఁబడియైనను స్వర్గమును జయించును; పగవారిని జంపియైనను సుఖమును బడ యును. యుద్ధమునందుఁ బ్రాణములను విడుచువాఁ డింద్రుని

*'అవరోధాత్ జుగుప్సేత' యనిమూలము.'అపరాధాత్ జుగుప్సేత' యని దాక్షిణాత్యకోశము. ఇదియొంతియు నప్రకరణముగా నుండుట తెలియునది.

తోడి సాలోక్యమును బడయుటకుగదా. *[యుద్ధమువాని శాంతతను బొందుటకై సకలజనులు తెలియునట్టి మార్గము గావించి నమ్మికగలిగించి యడఁకువగలిగి యుండవలయును. (అడఁకువ తెలుపుటకు) పాదరక్షలనేని విడిచి పుచ్చవలయును. వేగముగా బయటవెడలిపోవఁ గోరువాఁడుతనసైన్యమును మంచిమాటలచే సమాధానపఱిచి దేశాంతరమునకుఁ బోయినపిదప నాలోచించి పిదపఁ దాను వలయుదాని నుపక్రమింపవలయును]' అనెను. ఇది నూటముప్పదియొకఁడవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

భీష్ముఁడు రాజు దుష్టులనుండి ధనము నాక్రమించి యైన నాపదనొందిన బ్రాహ్మణులను రక్షింపవలయు ననుట.

ధర్మరాజు- 'పితామహా! సమస్తప్రజలకును గోరందగినదియు రాచఱికమునకు మిక్కిలి ముఖ్యమయినదియు నగు ధర్మము కొఱవడఁగా, భూమియందు జీవనమంతయు దొంగల పాలుకాఁగా, నిట్టి చెడుకాలము వచ్చినపుడు బ్రాహ్మణుఁడు, నెయ్యమునను గనికరమునను దనపుత్రపౌత్రులను విడువఁజాలక దేనిని గొని జీవింపఁగలఁడు?' అని యడిగెను.

భీష్ముఁడు—'అటువంటి సమయము వచ్చునపుడు తెలివి బలిమి నూఁది బ్రతుకవలయును. లోకమునందుఁ గనుపట్టు సమస్తవస్తువులును సాధుజనులకే యగును. అసాధువుల కొక్కటియు

* ఈకుండలీకరణములోనిది ప్రతాపచంద్రరాయలపాఠమువలెదు.

నిందుఁ గలుగదు. ఎవఁడు ప్రాప్తికిఁ దన్ను సాధనముగాఁ జేసి కొని యసాధులకడ నున్నధనమును దీసి సాధువుల కిచ్చునో వాఁ * డాపద్ధర్మములను దెలిసినవాఁడగును. రాజా ! రాజు తన రాచఱికమును జరుపఁగోరినవాఁడై తన ప్రజలకుఁ గోపముకలి గింపకయుఁ, గలహింపఁజేయకయు, సొంత కాఁపు ధనమును దానై యియ్యకపోయినను దానిని 'తమ్ముని ధనమునాఁది' యని మెలపునఁ దీసికొనవచ్చును. ఒకఁడు జ్ఞానముచేతను,బలిమిచేతను బరిశుద్ధుఁడై తక్కిన సమయములందుఁ జక్కని నడవడి నడవఁ దెలిసినవాఁడగు ప్రాజ్ఞుండగునేని యట్టివాఁ డాపత్కలయందు నిం దితములయిన కార్యములందుఁ బ్రవర్తించుచున్నను నతని నిం దు నిందించుట కెవఁడు తగును? ఎవఁడును దగఁడు. యుధి ష్ఠిరా ! ఎవరు తమబలిమి నెఱిపియె బ్రతుకు గావించు కొను చుందురో యట్టినారికి వేఱువిధమున జీవించుట గుచింపదు. బల వంతులగువారు తేజముతోనే ప్రవర్తింతురు. ఆపత్తున కగుశా స్త్ర మిట్లు సామాన్యముగా రా జనుష్ఠింపవలయును. మఱియు నతఁడు మేధావియు నగునేని యీపదలయం దీశాస్త్రము చొప్ప్ర నే కాక యింతకంకె † నెక్కువగాను నడచుకొనవచ్చును.

---

* 'ఆపద్ధర్మవిత్' అనిమూలము. 'ఆపద్ధర్మకృత్' అని డా. మూలము. ఆపద్ధర్మముల ననుష్ఠించువాఁడనుట.

† సామాన్యముగా రా జాపత్సమయములందు జనులపయిని బరువయిన పన్నులు విధించి బొక్కసము నాపద్ధర్మశాస్త్రము చొప్పున నించుకొనును. అతఁడు బుద్ధిమంతుఁడు నగునేని యీశాస్త్రము చొప్పననే యందఱకును బన్నులు విధించుటను విడిచి యపరాధులు నితర దేశజనులు దుష్టులు మొదలగు వారికి దండుగలు విధించి తక్కినప్రజల నొప్పింపకయే బొక్కసము నించునని భావము.

సత్కృతులును భూజితులునగు ఋత్విజులును పురోహితులును నాచార్యులునగు బ్రాహ్మణులును (మిక్కిలిగా ధనముగలవారైయున్నను) వారిని ధనమునకుఁ గాను బీడింపరాదు. పీడించినచో దోషములొందును. ఈ శాస్త్రము లోకమునకుఁ బ్రమాణము. ఇది సనాతనమయిన చూపు. దీనిని బ్రమాణముగాఁ గొని మంచిదో చెడ్డదియో దీని చొప్పున నడచుకొనవలయును. గ్రామమందుండు మనుష్యులు వెక్కండ్రొక్కరివై నొకరు దోషములు చెప్పుదురు. రాజు వారలవచనములను విని సత్కారముచేయుటగాని పీడించుటగాని తగదు. అపవాదపు మాట లేవిధమునను బలుకఁదగదు; వినునుఁ దగదు. అపవాదము లాడుచోటఁ జెవులను మూసి కొనవలయును. లేక యచ్చటనుండి మఱియొకచోటికేనియుఁ బోవలయును. అపవాదములాడుటయుఁ గొండెము చెప్పుటయు సాధువుల స్వభావముగాదు. యుధిష్ఠిరా! సాధువు లెప్పుడును గుణములనే యెత్తిచెప్పుదురు. మంచి స్వభావము గలిగి చెప్పినట్లు లోపడునవియును జక్కఁగా బనుపడినవియు బరువు లెస్సగా మోయునవియు నగు కవయెద్దులు, కాఁడికి మెడనిచ్చి బరువును మనఃపూర్వికముగా నీడ్చునట్లు, రాజును నాపదలందుఁ గష్టభరములను సైఁపనలయును. రాజు తానట్టి సమయములం దెట్లుండినఁ బెక్కండ్రు సహాయులుచేరుదురో యట్లు నడచుకొనవలయును. ఆచారమునే ధర్మమునకు గొప్పలక్షణమనికొందఱు చెప్పెదరు.*శంఖలిఖితునిధర్మమందుఁ

---

* ఇక్కడ భావమేమనఁగాఁ గొందఱు ఋత్విజులను బ్రాహ్మణులను దండించుటయుఁ బన్ను విధించుటయుఁ దగదందురు. ఇది సనాతనమైన యాచారముగాన నీతియేయగును. వేఱుకొందఱు శంఖుఁడు లిఖితునియెడ నడ

బ్రీతిగలమఱికొందఱు ఋత్విజులు మొదలయినవారు తప్పుచేసినను ధనము నపహరించుకొనుదండము తగ దనెడియీ ధర్మమును నెంత మాత్రమునొల్లరు. వారట్లు లాధర్మము నొల్లమనుట మచ్చరముచేతను గాదు, లోభముచేతను గాదు. గొప్ప ఋషులును. ధర్మవిరుద్ధముగా నడచినచో గురువునయినను దండింపవలయునని విధించుట కనఁబడుచున్నది. అయిన నీఋషుల వచనమునకు ననుగుణమయిన ప్రమాణ మొక్కటియు నొక్కచోటను గానఁబడకున్నది. అట్టి మనుష్యులు బ్రాహ్మణాదులు, నీచులై దుష్కర్మము లాచరింతురేని దేవతలే వారిని దండింప విడువవలయును. నెపము పన్ని ధనము సంపాదించువాఁడు ధర్మమును బోఁగొట్టుకొనును. సత్పురుషులచేతను సంపన్నులచేతను బూజింపఁదగినదియు, దనమనసునకుఁ దృప్తికరమగునదియు నగు ధర్మమేదియో దానినే పూనవలయును. ఎవఁడు * నాలుగు గుణములతోను గూడినట్టి ధర్మమును దెలియఁడో వాఁడు ధర్మవిదుఁడు. సర్పముసడుగువలెనే ధర్మము కారణములును దెలియుటకష్టము. వేఁటకాఁడు తన బాణము గాఁడినమృగము పోయినదారిని నేలమీఁద దానియడుగు నెత్తురుపడిన పట్టులను

చుకొన్న ధర్మమునే యభినందించువారై యీ మతమునొల్లక యెట్టివానినైనను దండింపవలయునందురు. ఇట్లనుటకు వీరియందు మచ్చరముగాని లోభముగాని కారణముగాదు. మొదటి వారివలెనే వీరును ధార్మికబుద్ధులే యగుదురని భీష్ముని యభిప్రాయము దెలియునది. ఈరెండవతెగవారు ఋత్విజులను బ్రాహ్మణులను సైతము దండింపవలయునందురు. (ప్రతాపచంద్రరాయలు.)

* నాలుగు గుణములనఁగా శ్రుతి, స్మృతి, ఆచారము, తనమనస్సు లేక. వేదము, తర్కశాస్త్రము, కృషిశాస్త్రము, దండనీతియనెడి యీ నాలుగు.

బట్టి తెలిసికొనునట్లె ధర్మముచొప్పులను దెలిసికొనవలయును. యుధిష్ఠిరా! ఇట్లే మనుజుఁడు సత్పురుషులు తొక్కినమార్గమును వినయమునఁ ద్రొక్కవలయును. ఇదియె తొంటిరాజర్షుల వృత్తి. నీవు నిట్లె నడువుము" అనెను. ఇది నూటముప్పది రెండవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

భీష్ముఁడు రాజీవిధమునను బొక్కసమును బెంపవలయు ననియు, దొంగలు నాపదలయందు ధనమునంతయుఁదోచుకొనక కొంతమిగిల్చి తక్కినవాని నపహరింపవలయుననియుఁ జెప్పుట.

భీష్ముఁడు—'రాజు తనరాజ్యమువలననుండియుఁ బరరాష్ట్రము వలననుండియు ధనముగడించి బొక్కసము గలిగించు కొనవలయును. బొక్కసమువలననే ధర్మము పెరుఁగుచున్నది. బొక్కసమువలననే రాజ్యమునకు మూలములు పెరుగుచున్నవి. కాఁబట్టి బొక్కసమును గలిగించుకొనవలయును. దాని నట్లు కలిగించుకొన్నపిదప (రిత్తవెచ్చములపాలుపుచ్చక) యెచ్చరికతో గారామునఁ బాలింపవలయును. అట్లురక్షించి జగమునకు నుపకారము చేయవలయును. ఇది సనాతనమైన ధర్మము. అట్టి బొక్కసము పరిశుద్ధమయినభావముచేతఁగాని లేక కూరిమిత్వముచేతఁగాని నింపఁదగదుగాదు. ఈరెంటికి నడిమిపదము నూఁది కోశమును జేర్పవలయును. బలహీనుఁ డగువానికి బొక్కసమెక్కడిది? ధనములేనివానికి బలమెక్కడిది? బలములేనివానికి రాజ్య

మెక్కడిది ? రాజ్యము లేనివానికి సిరియెట్లుకలుగును ? గొప్ప పదవి నొందినవానికి సంపద చెడుట మరణమునకు సాటియగును. కాఁబట్టి రాజు బొక్కసమును బలమును మిత్రులను బెంపవలయును. బొక్కసము లేని రాజును మనుజులవమానింతురు. వాఁడిచ్చుకొంచెమునకు దనివినొందక వానిపనులయం దుత్సాహమెంతమాత్రమును గలిగియుండరు. రాజు తనసంపదనుబట్టి యెంతయు గొప్పగౌరవమును బొందును. పడఁతి గుహ్యభాగములను బుట్టము గప్పిపుచ్చునట్లు రాజుపాపములను సంపద గప్పిపుచ్చును. రాజు ముందెవ్వరితోఁ గలహించెనో వారందఱు నతని కొత్తసంపదకు ననుతాపపడుదురు. వారు కుక్కలవలె మరల నతనిక్రిందఁ గొలువుగయికొందురు.అయినను వా రతనిని జంపుటకు సమయమునే యెదురుచూచుచున్నను, రాజేమియుఁ గలుగనట్లు లట్టివారిని గయికొని యుండును. భారతా ! అట్టి రాజునకు సుఖమెక్కడిది ? రాజు పయిపయిని బోవుటకే పాటు పడవలయును; గాని యెప్పుడును గీడ్పడరాదు. ఉద్యమమే పౌరుషము. * కణుపులేనిచోట విఱుగనైనవచ్చును గాని యొక్కరికిని వంగరాదు. అతఁడడవులకేనియుఁ బోయియుండి మృగసమూహములతోఁగూడఁ జరింపవచ్చును. కాని మేరలనుగడచి దొంగలవంటివారయిన మంత్రులు మొదలయినవారితోఁ గూడి మాడియుండరాదు. భారతా. అడవియందలి దొంగలకుసయితము

---

* 'అప్యపర్వణి భజ్యేత న నమేతేహ కస్యచిత్' అని మూలము. ఇది వెదురు మొదలయినవి, కణుపులందు విఱుగునవి గాక తక్కినపట్టుల విఱుగుటను ననుసంధించి చెప్పినది. 'అనఁగా ప్రతికూలమయిన తఱిని నశింపనయిన వచ్చునుగాని యొక్కరికిని లొంగిపోవరాదని భావము.

బెట్టిదము లయినకార్యములుచేయుటకు నేనల సమకూర్చి యిచ్చుట సులభము. రాజొక్కపెట్ట మర్యాదలనెల్ల నతిక్రమించునేని జనులందఱును నతనియెడల భయమునొందుదురు. దయయనునది యిట్టిదని తెలియకుండుదొంగలుసయిత మిట్టిరాజునకు నెంతయు జంకుదురు. ఈకారణమునుబట్టి రాజెప్పుడును జనులమనసులను నుల్లసిలంజేయుటకు మర్యాదలను గట్టుపాటులను స్థాపింపవలయును. మిక్కిలి యల్పములయిన వ్యవహారములందును మర్యాదయొకటి యుండినయెడ,నది యించుకయినను, జనులు దానినెంతయు గారవింతురు. ఈలోకమే లేదనియుఁ బరలోకమును గల్లయనియు నిశ్చయముగలవారును గలరు. ఇట్టినా స్తికుఁ డగువానిని, వానిమనసు రహస్యముగా జంకుగొంకుల చేతఁ గలఁగినట్టిదయిననుఁ, దా నెంతమాత్రమునమ్మరాదు.అడవియందలి దొంగలు తక్కిన యొప్పిదములు గలిగియుండి పరులధనముల నపహరించుటమాత్రము గావింతురేనియు నట్టియపహారములను నహింసఁగాఁ దలంపవలయును. దొంగలట్టికట్టుపాట్లనుసరించుటవలన వేలకొలఁది ప్రాణులు రక్షితములగుచున్నవి. యుద్ధముసేయక పాఱిపోవుచున్న శత్రువును జంపుటయు, పరభార్యలను జెఱుపుటయు, చేసినమేలు మఱచుటయు, బ్రాహ్మణధనమును బుచ్చుకొనుటయు, బంధని ధనమంతయు మిగతలేకుండు నట్లుగా దోఁచుకొనుటయు,కన్యల నపహరించుటయు,గ్రామములకును బట్టనములకును బోయి వాని యెడయండ్లవలె నెడతెగక నాక్రమించుకొని యుండుటయు ననునివి దొంగలకు సయితము దోషములేయగును; కాఁబట్టి దొంగలును వాని నెప్పుడు మానియుండవలయును. రాజులు దొంగలతో

సంధిచేసికొని వారికిఁ దమయందు నమ్మికగలిగించు కొనుదుఁగాని యట్టిరా జాదొంగలలోపలి వెలుపలివెల్లఁ గనుఁగొని వాని నిర్మూలము సేయుదురనుట నిశ్చయము. ఈకారణమును బట్టి రాజు దొంగలతో వ్యవహరించునపుడు వారిని నిశ్శేషముగా నాశము సేయరాదు. వారిని దనయేలుబడికి లోఁకువ గావించు కొనఁ జూడవలయును. రాజు తాను వారికంటె బలవంతుఁడనని తలఁచి వారియెడఁ గూరకార్యములు గావింపరాదు. ఏరాజులు వారిని నిశ్శేషులఁ గావింపరో యారాజులకుఁదాము నిశ్శేషుల మగుదుమని భయముగలుగదు. అయినను వారిని నిశ్శేషులఁ జేయువార లట్లు చేసినందుల కెప్పుడును భయము గలిగి యుండవలసి నచ్చును. ఇది నూటముప్పదిమూఁడవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు బలమును బొగడుట. పాపమునకుఁ బరిహారోపాయములను జెప్పుట.

భీష్ముఁడు—'ఈవిషయమై పురాతనమైన యీయితిహాసమునుదాహరించుచున్నారు. ఈవిషయమునఁ బురావిదులగువారు కామందకమని చెప్పిన వచనమును జెప్పెదరు. అదియే దనఁగా—ఎఱుకగల క్షత్రియునకు ధర్మార్థములు రెండును బ్రత్యక్షములే (అనఁగా బ్రత్యక్షధర్మములే) యనుటయే. వాని కతఁడు *ధర్మమునుగుఱించిన సూక్ష్మవాదములచేతను, బరలోకము పరోక్ష

* 'పరోక్షా ధర్మబోధనా' అని దా. మూలము. ధర్మోపదేశము పరోక్ష మయినదని యర్థము.

మయి యుండుటంబట్టియు విభూతము చేయరాదు. భూమి యందు నడుగు *ముద్రలను జూచినంతనే యవి తోడేలియడుగు లోకావో యని విచారించుట యెట్లో యట్లె యొకటి ధర్మమా యధర్మమాయని విచారముసేయుట యెల్ల నిష్ఫలమే. ఈలోక మున నెవఁడుగాని యెప్పుడేనియు ధర్మఫలమునుగాని యధర్మఫ లమునుగాని చూచినవాఁడు లేఁడు. కాఁబట్టి క్షత్రియుఁడు బల ముచే పడయఁజూడవలయును. బలముగలవానికే యన్నియు వశ మందుండును. సంపదవలన బలము (సైన్యము) గలుగును. బల మువలన నమాత్యులు గలుగుదురు. ధనములేనివాఁడు పతి తుఁడు. అల్పమంతయు నెంగిలి వంటిది. బలవంతుఁడు వెక్కులు కార్యములు చేసినను వానివలని భయమున వానిని నెవ్వఁడే మియుఁ జేయఁడు. ధర్మమును బలమును సత్యముతోఁ గూడి యుండునేని యవి వెనుభయమునుండి రక్షించును. అయిన నా రెంటిని బోల్చిచూడఁగా ధర్మమునకంటె బలమే యెక్కుడని తోఁచుచున్నది. బలమువలననుండియే ధర్మము ప్రవర్తించు చున్నది. జంగమములెల్ల భూమియందు నెలకొనియున్నట్లు ధర్మము బలమునందు నెలకొనియుండును. పొగ గాడ్పునకు వశమై యుండునట్లు బలమును ధర్మ మనువర్తించుచుండును. ధర్మము తనంతట నియంతగానందునఁ దీఁగ మ్రాఁకునుంబోలె బలము నాశ్రయించియుండును. భోగవంతులకు సుఖము వశమై యుండునట్లు బలవంతులకు ధర్మము లోనై యుండును. బలవం తుల కసాధ్య మెద్దియులేదు. అన్నిటిని బలవంతుఁడు జయిం

---

* 'యథావృక్షపదం తథా' అని మూలము. 'యథావృక్షేఫలంతథా' అని దాక్షిణాత్యమూలము. ఇది యంతగాఁ బొసఁగినది గాదు.

చును. బలములేనివాఁడు, దురాచారములను గావించుట వలనఁ దప్పించుకొనలేఁడు. జనులందఱును నట్టివానియెడలఁ దోఁడేలు పట్లంబోలె భయపడుదురు. ధనముడుగులినవాఁ డవమానము నొంది దుఃఖంపుబ్రతుకు బ్రతుకును. అవమానముతోఁ గూడిన బ్రతుకు మరణమువంటిదే యగును. ఒకఁడు తనపాపంపునడవడి చేతఁదనకువలయువారందఱను దిగవిడుతు రేని, వాఁడితరులమాట లనెడిశల్యములు గ్రుచ్చుకొనఁగా మిక్కిలియు దుఃఖమునఁ బొ క్కుచుండునని ప్రాజ్ఞులు చెప్పెదరు. ఆచార్యులగు 'వారొక పా పమునుచేసినయెడల నందులకు విముక్తిగలుగుకొఱకు మూఁడువేద ముల నధిగమింపవలయును. ద్విజుల నుపాసింపవలయును. మనుష్యులను దియ్యని పలుకులచేతను, గార్యములచేతను సంతోష పఱుపవలయును. మఱియు గొప్ప మనస్సు గలవాఁడయ్యి గొప్పకులమునఁ బెండ్లాడవలయును. తనదోషములను జెప్పికొ నుచుఁ బరుల గుణములనే కీర్తించుచుండవలయును. స్నానాచ మనాదులయిన యుదకకార్యములం దాసక్తుఁడై మంత్రముల జపింపవలయును. మృదువయిన స్వభావముగలిగి మిక్కిలియు మాటాడరాదు. మిక్కిలి దుష్కరములయిన (తపములు)సలుప వలయును. బ్రాహ్మణులను క్షత్రియులను నండ గొనవలయును'- అని చెప్పెదరు. పెద్దలు పాపము లాచరించినవాఁడు జనులు తన్నెంత దూషణము లాడుచుండినను వానినెల్ల సరకుసేయక యిప్పుడు చెప్పిన యాచారము లెల్లఁ గయికొనవలయును. ఇట్లు చేయుటవలన నొకఁడు శీఘ్రముగాఁ బాపములను వీడి లోకము వారి యెన్నికకెక్కును.సుఖముగా ధనము ననుభవింపనేర్చును. మంచినడవడి నెప్పుడును రక్షించుకొనవలయును.లోకమునందుఁ

బూజ్యతయును నిహమందును బరమందును మహాఫలమును బొందును. ఇది నూటముప్పదినాలుగవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

భీష్ముఁడు దొంగగానుండినను శాస్త్రమర్యాద ననుసరించియుండువాఁడు పరలోకమును బొందునని నిరూపించుటకు శాప వ్యచరిత్రమును జెప్పుట.

భీష్ముఁడు—దొంగ మర్యాదతోఁ గూడినవాఁడై యుండి నచో దొంగతనముచేత సిద్ధి నొందునను విషయమునఁ బురాతనమయిన యీ యితిహాసము నుదాహరించెదరు. *"కాపచ్యుఁడని యొక దొంగయుండెను. వాఁడు క్షత్రియునకు నొకనిషాది యందు (బోయెతయందుఁ) బుట్టినవాఁడు. వాఁడు క్షత్రియధర్మములనే యాచరించుచుండెను వాఁడు గొట్టుటందు సమర్థుఁడును, మతిమంతుఁడును, శూరుఁడును, జదువరియు నై క్రూరత్వము లేకుండెను. వాఁడు బ్రాహ్మణులకుఁ దత్పరుఁడై, పెద్దలను బూజించుచు నుండెను. వాఁ డాశ్రమములందలి ఋషులధర్మమును రక్షించుచుండెను. వాఁడు దొంగగానుండినను సిద్ధిని బొందిన వాఁ డయ్యెను. వాఁ డడవియందు రేపును మాపును జింక కదుపులను వేఁటాడి కోపము రేపుచుండును. వాఁడు బోయవాండ్రు మృగసమూహములను వేఁటాడుటకై పచరించు విధులన్నియుఁ దెలియును. బోయలందు వాఁడు సమర్థుఁడు. వానికి నడవియందుఁగల ప్రదేశములన్నియుఁ జక్కఁగాఁ దెలియును.

* కాపవ్యుఁడని యుత్తరకోశములందెల్లఁ బూపట్టుచున్నది.

వాఁ డెప్పుడును బారియాత్రమను పర్వతమున సంచరించుచుం డును. వానికి సమస్తజాతుల ధర్మములును దెలియును. వాని బాణములు వాడులై యాయుధము లుజిదియై యొప్పుచుం డును. వాఁడు తా నొక్కఁడె పెక్కువందలసేనలను జయించెను. వాఁడు పేరడవియందు ముదుసం డ్లయినకన్నతలిదండ్రులను బూజించియు మధుమాంసములచేతను ఫలములచేతను బలువి ధములయిన యన్నములచేతను మరియాదతోడఁ గుడువఁబెట్టు చుఁ జక్కఁగా వారికి శుశ్రూష సేయుచువచ్చెను. అరణ్య ముసందు సన్న్యాసు లగుబ్రాహ్మణులను రక్షించుకొనుచు నెప్పు డును వనములందలి మృగములను గొట్టుచు వారలకుఁ బంపుచు వచ్చెను. దొంగవెట్టుభోజనమని శంకించి వానివలన నది పుచ్చు కొననివారి యిండ్లయందు వాఁడు పెందలకడనే మాంసములను బెట్టిపోవును. నిర్దయులై వర్తించు దొంగలయందు మేర మీఱిన వారు పెక్కువేలమంది వానిని గ్రామాధిపతిగా వరించుకొనిరి. దొంగలు వానితో 'నీవు దేశకాలములు చక్కఁగా నెఱుంగు దువు, ముహూర్తములను దెలియుదువు, మంచి తెలివిగలవాఁ డవు, శూరుండవు, స్థిరమయిన వ్రతముగలవాఁడవు. కాఁబట్టి నీవు మాయందఱకు సమ్మతుండును ముఖ్యుండు నగు గ్రామాధి పతిగా నుండుము. నీవు చెప్పనల్లెల్ల మేము చేసెదము.తల్లియుఁ దండ్రియుంబోలె నీవు మమ్ము న్యాయంబున రక్షింపుము' అని చెప్పరి.

కాపచ్యుఁడు వారితో— 'మీరు స్త్రీలను భయపడినవా రిని, బిడ్డలను, దపస్వులను, జంపరాదు. యుద్ధమునకు రానివా నిని వధింపరాదు. స్త్రీలను బలవంతముగా నపహరింపరాదు.

సమస్తప్రాణులందును స్త్రీని నెవ్విధమునను జంపరాదని తెలి
యుఁడు. గోవులకును బ్రాహ్మణులకును నెప్పుడును క్షేమమునే
చింతించు చుండవలయును. అందుల కొఱకు యుద్ధమును జేయ
ను జేయవలయును. వైరులను నాశము సేయరాదు. దేవతలును,
బితరులును నతిథులును బూజితులగు వివాహాది శుభకార్యము
లకు విఘ్నములు సేయరాదు. సమస్తప్రాణులందు బ్రాహ్మణుఁ
డధికుఁడుగాన యతనిని మీకొల్లలనుండి విడిచి పుచ్చనలయును.
ఆబ్రాహ్మణులకుఁ బూజసేయవలయును. వారలకు మీకుఁగల
యంతయు నిచ్చియును సత్కరింపవలయును. ఈ బ్రాహ్మణు
లెవనియెడఁ మిక్కిలి కుపితులగుదురో, యెవని కవమానము
గలుగఁగూరుదురో, వానికి మూఁడులోకములందును వారినుండి
రక్షించువాఁడు గలుగఁడు. ఎవఁడు బ్రాహ్మణులను నవమానిం
చుచున్నాఁడో, మఱి వారలకు నాశమును గోరుచున్నాఁడో
వానికి, సూర్యోదయమునఁ జీఁకటికింబోలె నాశము సిద్ధము. మీ
రందఱు నిచ్చటనే వసించియుండి మీశౌర్యములకు ఫలములం
దవచ్చును. ఎవరు మనకు నీయవలసినదాని నియ్యరో వారి
కడకు సేనల నంపవలయునను. *దండము దుష్టులకొఱకే విధిం
పఁబడి యున్నది కాని, సొంతవృద్ధికొఱకుఁ గాదు. ఎవరు సాధు
వులను బాధింతురో వారిని వధించుట ధర్మమని చెప్పఁబడుచు
న్నది. ఎవరు కొందఱురాజ్యమును బీడించి తమకు వృద్ధిని గలి
గించుకొందురో వారు పీనుఁగునుబట్టిన పురువులుంబోలె నారా

---

* 'శిష్ట్యర్థం విహితోదండో న పృథ్వ్యర్థం విధీయతే' అని మూలము. శిష్ట్యర్థం విహితోదండో నవధార్థం విధీయతే' అని దా. మూలము. వధ. ముకొఱకుఁ గాదని యర్థము.

జ్యమందుఁ జాము హింసించినవారితోఁ గూడనే మరణింతురు. దొంగ లెవ రీలోకమందు ధర్మశాస్త్రముచొప్పున వర్తింతురో వారు దొంగలుగా నుండినను శీఘ్రముగా సిద్ధి నొందుదురు' అనెను. ఆదొంగలును గాపచ్యుని యాజ్ఞచొప్పననే నడచుచు వచ్చిరి. అందఱును బాపములనుండి విరమించుటవలన వృద్ధి నొందిరి.దొంగలను బాపములనుండి యుడిపి సాధుపులకు క్షేమ ముగావించినందునఁ గాపచ్యుఁడు గొప్పసిద్ధిని బొందెను.ఎవఁడు కాపచ్యుని యీకథను నెప్పుడును జింతించునో వానికరణ్యము లందలి ప్రాణులవలన నుండియు నేవిధమునను భయముగలు గదు. వానికి మనుష్యులవలననుండియు భయము గలుగదు. మఱి యేవిధమునను దేవతలవలననుండియు భయముగలుగదు. సాధుపుల వలననుండియు భయముగలుగదు. అట్టివాఁ డరణ్య మునకుఁ బోయినను రాజే. (అనఁగా రాజువలెనే సుఖంబుం డును) ఇది నూటముప్పదియేనవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బొక్కసము వృద్ధిసేయు కొఱకు సేధన మపహరింపవచ్చునో యేదిగూడదో వివేచించుట.

భీష్ముఁడు:—పురాణవిదులు బొక్కసమును బుట్టించు విధ మునుగుఱించి బ్రహ్మదేవుఁడు పాడినగీతములను జెప్పెదరు:— అవి యేవన-యజ్ఞశీలుఁడగువాని ధనమును దేవాలయపు ధన ములను నపహరింపరాదు. క్షత్రియుఁడు యాగాదిక్రియలను జేయక దొంగలవలె నెన్నంబడు వారిధనములను నపహరింపఁ

దగును. క్షత్రియులకు నీలోకమందుఁగల ప్రజలు రక్షింపఁదగిన వారును జంపఁదగినవారు నగుదురు. ఈ లోకమందలి ధనము క్షత్రియునిదే; మఱొక్కనిది గాదు. ఆధన మాక్షత్రియునకు బలముకొఱకుఁగాని యజ్ఞముకొఱకుఁగాని కావలయును. భుజించుటకు నర్హములుగాని చెట్లను జేమలను నఱికి కట్టియలుగాఁజేసికొని భుజింపఁదగినయన్నమును జనులు వండుకొందురు. (అట్లె రాజును దుష్టులను దండించి శిష్టులను బోషింపవలయును) ఎవఁడు దేవతలను బితరులను మనుష్యులను హవిస్సుచేత నారాధింపఁడో వానియొద్ద గలధనము నిరర్థకమని ధర్మవిదులగువారు చెప్పెదరు.రాజా! ధార్మికుఁడగురా జట్టివానిధనము నపహరించుకొనవచ్చును. అందువలన రాజు జనులకు సంతోషము గలిగింపఁడనుట గలుగదు. జనులు నందులకై రాజును నిందింపరు. ఏరాజు తన్ను సాధువులు ధనమును బడయుటకు సాధనము గావించికొని యసాధువులనుండి సాధువులకు ధనమును దీసియిచ్చునో యతఁడే ధర్మమును దెలిసినవాఁడు. భూమిని భేదించుకొనివచ్చు శాకవస్తువులను నజ్రియను క్రిములును నెట్లు పయింబయిఁ దమంతట మిక్కిలియుఁ బెరుఁగునో యట్లె రాజును దనశక్తికొలఁదిని గర్మములాచరించి పయింపయిఁ బుణ్యలోకములను దనంతట జయించుకొనుచుండును. చెదపురుగు లేనిమిత్తములేకయే కలుగునట్లు * యజ్ఞములు

* అనఁగా యజ్ఞములకు మిక్కిలి ధనముండుటంబట్టి కాకయుద్దేశమును బట్టియె కలుగును. ఉద్దేశముండినచో ధనము గూడునని యుఁ బిదప యజ్ఞములు జరుగుననియు భావము. ఇందులకుఁ జెదపురుగు లేకారణములేక పుట్టి పెరుఁగుట దృష్టాంతము (ప్రతాప).

నేనిమి త్తము నంతగా లేక యెు కలుగును. అడవి యీఁగలును, దోమలును, జీమలును, బురుగులును, నెట్లు పశువులనుండి వానినిపాలుపిదుకునపుడు తొలఁగఁబుత్తురో యట్లె యజ్ఞములకుఁ గూర్పని వారినందఱను రాజ్యమునుండి తొలఁగింపవలయును. ఇట్లే ధర్మము విధింపఁబడియున్నది. భూమియందలి దుమ్మును రెండుఱాలనడుమ నిడి మఱియుఁ బొడి గావింపఁగాఁ బయింబయి మఱింత సన్నని నగునట్లు ధర్మవిషయములను బయింబయి విచారించుకొలఁదిని మఱిమఱి సూక్ష్మము లగుచున్నవి. ఇది నూటముప్పదియూఁఅనయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు రానున్నయాపదను బోఁగొట్టునుపాయ
మును మునుపే చేసికొనవలయునని రూపించు
టకై మతోన్మత్తోపాఖ్యానమును జెప్పుట.

భీష్ముఁడు:— మీఁదటిదానికి మునుపే సమకట్టువాఁడును, (అనాగతవిధాతయు) అప్పటికిఁ దగుబుద్ధి స్ఫురించువాఁడు (ప్రత్యుత్పన్నమతియు) ననెడి యీయిరువురును సుఖముగా వర్ధిలుదురు. దీర్ఘసూత్రుఁడు (జాగుసేయువాఁడు) నశించును. ఈ విషయమై చేయఁదగినదియు చేయరానిదియునను వీని నిర్ణయించుటకై దీర్ఘసూత్రునిగుఱించి యుత్తమమయిన యీయాఖ్యానమును దొట్రుపడక వినుము. కౌంతేయా 'మిక్కిలి లోఁతుగాని యొక కొలనియందుఁ జేఁపలు పెక్కులుండెను. అందు మూఁడు బేడిసలును జేఁపలు సుబరస్వరము చెలిమి గలిగి యొండొంటినిగూడి చరించుచుండెను. ఈ మూఁటి యందొకటి

యప్పటికిఁ దగినవెరవు తోడనే తెలిసికొని చేయునట్టిది ; మఱి యొకటి దవ్వులంజూచి రాఁగలదానికి ముందుగా సమకట్టుకొను నది; మూఁడవది దీర్ఘసూత్రమయినది. పిదప నొకప్పుడు చేఁపలను బట్టువారు (జాలరులు) నలుప్రక్కలను బలుదారుల మూల మునఁ గొలకుఁలోని నీరు క్రిందుగానున్న పల్లములకు వడియ విడిచిరి. అప్పుడా కొలనియందు నీరు రానురాను దగ్గుచుండుటను జూచి భయముకలుగఁగా దీర్ఘదర్శియగుటచేతఁ దక్కినయిద్దఱు సుహృదులగు చేఁపలనుజూచి 'నీటియందు వసించువానికెల్ల నీయాపద దాపరించినది. దారి యరికట్టుటకుమునుపే వేగముగా మఱొకచోటికిఁ బోవుదము. ఎవఁడు రానున్న యనర్థమును మంచినీతులవలన వారించుకొనునో వాఁడెప్పుడును సంశయము నొందఁడు. కాఁబట్టి మఱొకచోటికిఁబోవుదము' అనెను. అందు దీర్ఘసూత్రుఁడు 'ఇక్కడఁ జక్కఁగా వసించి యుండవచ్చును. అంతలోపలఁ దొందరపడ నక్కఱలేదని నాకు నిశ్చయముగాఁ దోఁచుచున్నది' అనెను. అంతఁ బ్రత్యుత్పన్నమతి యగు చేప దీర్ఘదర్శినిజూచి 'కాలమేదేని వచ్చినపుడు నాకేమియు నీతివెరవు కొఱవడదు' అనెను. ఇట్లు తక్కినవి రెండునుజెప్పఁగా మహా మతి యగుదీర్ఘదర్శి తోడనే బయలుదేఱి యొకకాలువ వెల్లి

---

* 'యథాహ్యాకస్తాదృపతి భూమాపాంసుర్వి లోలితః'తథై వేహ భవేద్ధర్మ్యః సూక్ష్మః సూక్ష్మతరః స్మృతః' అని ఔత్తరాహమూలము. భూమా పాంసు తృణోపలక్ష' అని దాక్షిణాత్యపాఠము. ఇందులకు భూమియందు దుమ్మును బుల్లును గల్లును నేకారణమునులేక సూక్ష్మముగను నంతకంటెను సూక్ష్మముగను నుండునట్లు ఈలోకమందు ధర్మమును సూక్ష్మముగను సూక్ష్మతరముగను దనం తటనే యుండును' అని యర్థము.

మూలమున మిక్కిలియు లోఁతయిన యొకమడుఁగును బోయి చేరెను. పిదప జాలరు లాకొలని నీరువడసియుండుటను లెస్సఁగాఁ జూచి వెక్కులుపాయములచేతఁ జేపలనుబట్టఁదొడఁగిరి. జలము వడిసి యున్నయాకొలను గలఁపఁబడినపు డం దున్న దీర్ఘ సూత్రము తక్కినచేపలతోఁ గూడఁ బట్టువడినది. జాలరులు పెద్దత్రాటికిఁ దాముపట్టు చేపలను గ్రుచ్చుచుండఁగాఁ బ్రత్యుత్పన్నమతి యగుచేపఁ యట్లు గ్రువ్వఁబడిన చేపలనడుమఁ జొచ్చి త్రాటిని బెనఁచుకొని తానును గ్రువ్వంబడినదియుంబోలె వారికిఁదోఁచునట్లు కడలక మెదలకుండెను. జాలరు లాచేప లన్నియును నాదారమునఁ గ్రువ్వఁబడియున్నవనియె తలఁచిరి. పిదప వారు మిక్కిలి జలములందు చేపలను గడుగునపుడు ప్రత్యుత్పన్నమతి యనుమీను దారమునువదలి విడివడి శీఘ్రమానీటిలోనికిఁ బోయెను. నుందస్వభావమును గలిగియున్న దీర్ఘసూత్రము తెలివిమాలినమూఢము గనుక నింద్రియములు లేనివానివలె విడివడనేరక నాశమొందెను. ఇల్లువఁడు తెలివి మాలుటవలన ముఖ్యముగా దొరకొన్నసమయమును దెలి యఁడో వాఁడు దీర్ఘసూత్ర మనుచేపవలె శీఘ్రముగా నాశ మొందును.ఏమనుష్యుఁడు తాను సమర్థుఁ డను తలఁపున మొద టనే తనజేమమును జేసికొనకుండునో వాఁడు ప్రత్యుత్పన్న మతివలె సంశయస్థితి నొందును. కాఁబట్టి యనాగతవిధాతయుఁ బ్రత్యుత్పన్నమతియు నగు నిరువురును సుఖముగా వర్ధిలుదురు. దీర్ఘసూత్రుఁ డగువాఁడు నశించును.కాలమైనది లవము క్షణము కాష్ఠ కల ముహూర్తము పగలు రాత్రి పక్షము మాసము ఋతువులు సంవత్సరములు ననియును, దేశము, భూమి

యనియుఁ జెప్పఁబడుచున్నవి. ఆకాలమో కనఁబడుటలేదు.'ఇష్ట మయినకార్యములు సిద్ధించువిషయమై యొకఁడు దేని నేరీతిని మనంబునఁ దలపోయునో యారీతినే యది యొనగూడుటయుఁ జెడుటయుఁ గలుగును. ధర్మశాస్త్రములందును మోక్షశాస్త్ర ములందును దేశమును గాలమును (లేక దీర్ఘదర్శిత్వమును ప్రత్యుత్పన్నమతిత్వమును) ముఖ్యములయినవిగా ఋషులుచెప్పి యున్నారు. మతియుఁ గామశాస్త్రమందును మనుష్యలీరెంటి నంగీకరించియున్నారు. ముందు పరీక్షించి యొకటి చేయువాఁ డును, ఒకటిసాధించుటకు వలయుయుక్తులు సేయువాఁడును, దలఁచినకార్యమును జక్కఁగా నొడఁగూర్చుకొందురు. దేశకాల ములను దెలిసిచేయువారును మునుపుచెప్పిన యిరుప్రకారంబును నెక్కుడుఫలమును బొందఁగలుగుదురు' అనెను. ఇది నూట నుప్పదియేడవయధ్యాయము.

ఆపద్ధర్మపర్వము.

భీష్ముఁ డాపదయందు శత్రువుతోడ సైతము సంధి చేసికొనఁ దగునని రూపించుటకై పిల్లికిని నెలుకకును జఁగిన కథను జెప్పుట

ధర్మరాజు-'భరతసత్తమా! అనాగతములకు ముందుగా సమ కట్టుకొన్నబుద్ధియు, అప్పటికిఁదగిన వెరవుగాఁ బ్రత్యుత్పన్నమగు బుద్ధియు శ్రేష్ఠములయినవనియు, దీర్ఘసూత్రమగు బుద్ధి నాశము గలిగించునదనియుఁ జెప్పితివి. పితామహా! రాజు శత్రువులచేత నలుగడలఁ మిక్కిలియుఁ బీడితుండైనపు డేబుద్ధిని గయికొ న్నచోఁ దెలివి దప్పకుండునో యుత్తమమయిన యాబుద్ధిని వినఁ

గోరుచున్నాను. నీవు ధర్మార్థములందు నిపుణుఁడవు, ప్రాజ్ఞుఁడవు, సర్వశాస్త్రములందును బండితుఁడవు. కాఁబట్టి నిన్నడుగుచున్నాను. దీనిని నాకు వివరించిచెప్పుటకుఁ దగుదువు. పెక్కండ్రు శత్రువులుచుట్టుముట్టికొనఁగా రాజు తన్నెట్లు విడిచిపుచ్చుకొనఁగూడునో యావిధమునంతయు శాస్త్రోక్తప్రకారమున వినఁగోరుచున్నాను. ఒక రాజు సంకటమునఁ జిక్కియున్నపుడు, వాని చేత మునుపు తప్పులయినశత్రువులు పెక్కండ్రుగాఁ జేరి యాయొక్కని కెదురై వానిని వేరుతోడఁ బెకల్పఁ దివురుదురు. రాజు తాను దుర్బలుండును నొక్కరుండునై యుండఁగాఁ బెక్కండ్రు మహాబలు లగు శత్రువు లొక్కటిగాఁ గూడి తన్ను నలుగడల మూఁగొనినలంచుచుండునపుడు, తానసహాయుండై వారినిమూఁగొని యెట్లు నిలువఁశక్యమగును ? అట్టి సమయములందు రాజు మిత్రులను శత్రువులను బడయు విధమెట్లు ? అప్పుడతఁడు మిత్రులయెడను శత్రులయెడను నెట్లు నడచుకొనవలయును ? మిత్రలక్షణములే యన్నియు గలిగియుండినవారు వాస్తవమున శత్రువులయిరేని యపుడు రాజు సుఖముఁ బడయఁగోరునేని యేమిచేయవలయును? అతఁడెవరితో యుద్ధము పెట్టుకొనవలయును ? ఎవరితో సంధిచేసికొనవలయును ? తాను బలవంతుఁడయి యున్నను శత్రువులనడుమ నున్నపు డెట్లు నడచుకొనవలయును ? ఇది రాజునకుఁ గలసమస్త కృత్యములలోపల మిక్కిలి యెక్కుడయిన కృత్యమని తలఁచుచున్నాను. సత్యసంధుఁడును జితేంద్రియుఁడు నగు భీష్ముఁ డొకఁడు తప్ప దీనిని జెప్పఁజాలిన వాఁడొక్కఁడును లేఁడు. చెప్పినను వినువాఁడు

దొరకుటయు నెంతయు నరుదు. కాఁబట్టి, మహాభాగా! దీనిని విమర్శించి యంతయు నాకుఁ జెప్పుము' అని యడిగెను.

భీష్ముఁడు—'యుధిష్ఠిరా! ఇట్టిప్రశ్నము నీకెంతయుఁ దగినది. దీని కుత్తరమెంతయు గుణసంపన్నమైనది. పుత్రా! అపదలయం దనుష్ఠింపవలసిన ధర్మములను గుహ్యము లయినవానిని నంత యును జెప్పెదను వినుము. శత్రువు మిత్రుఁడగును; మిత్రుఁడుగూడ శత్రుఁడగును. కార్యములగతి యీయీసందర్భముల కూడికచేత నెవ్వఁడును నొక్కతీరుగా నుండదు. కాఁబట్టి యొకటిచేయ వచ్చునా? చేయఁగూడదా? యని నిశ్చయింప వలసినపుడు, దేశ మును గాలమును దెలిసి పరులను విశ్వసించుటయో లేక వారితో విరోధించుటయో చేయవలయును. మఱియుఁ దనచేత నైనంత వఱకుఁ దనంతటఁ బ్రయత్నపడుచును హితమును గోరునట్టి బుధులతో సంధిగలిగి యుండవలయును. భారతా! ప్రాణము ములను వేఱువిధమున రక్షించుకొన నలవిగాకుండునేని శత్రు వులతోడ సంధి యేనియుఁ జేసికొనవలయును. తెలివిమాలిన వాఁడెవఁడు తనపగవారితో నెప్పుడును సంధిచేయకయే యుండు నో వాఁ డొకకార్యమునుగొని ఫలములను బడయ నేరఁడు. ఎవఁడు కార్యమునకుఁదగిన వెరవును జక్కఁగాఁ గనుఁగొనియు మిత్రునితోడ సంధియు మిత్రునితోడ విరోధమును జేసికొనునో వాఁడు మహాఫలమును బొందును. ఈవిషయమై యొకమట్టి చెట్టునం దుండినపిల్లికిని నెలుకకును జరిగిన సంవాదమై పురా తనమగు నీయితిహాసము నుదాహరించెదరు.

ఒకపెద్దయడవియందు, మిక్కిలిపెద్దది యగు నొకమట్టి చెట్టుండెను. దానిని బెక్కులు తీఁగజొంపములు గ్రమ్ముకొని

యుండెను. అందు నానావిధములయిన పక్షుల సమూహములు నసించుచుండెను. అది మిక్కిలియుఁ బొడవయిన బలితంపు బోదెగలిగి మేఘమువలెఁ బొడకట్టుచుఁ జల్లని నీడలనొసంగుచు మనోహరముగా నుండెను. మఱియు నది యాయడవి నలుప్రక్కలను బర్వి వెక్కసర్పములతోను మృగములతోను గూడి యుండెను. దాని యడుగున మిక్కిలియుఁ బ్రజ్ఞగల పలితుఁడనెడియొక యెలుక నూరుద్వారములుగల యొకలాఁగుగావించుకొని సుఖముగా వసించియుండెను. అప్పుడు లోమశుఁడను నొక పిల్లి యాచెట్టుకొమ్మయందు సుఖముగా వసించి ప్రతిదినమును బెక్కుపిట్టలను బిలుకుమార్చి తినుచుండెను. కొంతకాలము నకుఁ బిదపఁ జండాలుఁ డొకఁడు డాయడవికివచ్చి యందొక గుడిసె మనికిపట్టు గట్టుకొనెను. వాఁడు ప్రతిదినమును బ్రొద్దు గ్రుంకినపిదప మృగాదులనుబట్టి మాయంపు టురులొడ్డుచు వచ్చెను. వాఁడు సన్నపునరములతోఁ జేయబడిన వలత్రాళ్లను బెట్ట వలసిన విధిచొప్పునఁ బన్ని యింటికిఁబోయి రేయెల్ల సుఖముగా బరిపి తెల్లవాఱఁగానే యక్కడకు మరలివచ్చును. ఆ యురియందుఁ బ్రతిదినమును రాత్రియందుఁ బలువిధములయిన మృగములు పట్టువడియుండును. ఒకానొకప్పు డాపిల్లియు నేమఱి యాయురియందు గట్టిగాఁ జిక్కుకొనెను. పలితుఁడను నెలుక, మిక్కిలిబలవంతుఁడును దనకుఁ బగవాడునై తన్నెప్పుడును జంప వచ్చుచుండునట్టి యాపిల్లియు నురియందుఁ జిక్కువడఁగా నా సమయముదెలిసి యించుకయు భయములేక గ్రుమ్మరసాగెను. అది యడవియందు జంకులేక యెరకై తిరుగులాడుచుండఁగాఁ గొంతసేపటికి నాబోనునందుఁ (జండాలుఁ) డుంచియున్న

మాంసమును జూచెను. అది యాయురిపయినెక్కికొని యందలి నంజుడును దినఁదొడఁగెను. అది తనలో నవ్వుకొనుచు నావల యందుఁ గట్టువడియున్న తనపగవాఁడగు నాపిల్లిపయినిగూడ నెక్కి దానిని దినసాగెను. అది మాంసము దినుటయందే మనస్సు మరిగి తనకుఁ గలభయము గనుఁగొన్నదిగాదు. ఏలనఁగా నది యున్నట్టుండి కన్నెత్తిచూడఁగాఁ దనకు భయంకర మయినశత్రు వొకటి యక్కడికివచ్చి యుండుటను జూచెను. అది రాగివలె నెఱ్ఱనికన్నులుగల హరికమనెడు యొకముంగిస. అది మిక్కిలి చురుకైనది. అది నేలబొఱియలలో వసించుచుండినది. దానిమేను తెల్లుపూపులవలె నుండెను. అది యెలుకవాసననుబట్టి వేగిరముగా నచ్చటికి దానిని మ్రింగుటకై వచ్చెను. అది తన సెలవుల నాకికొనుచుఁ దలపయికెత్తికొని వెనుకటికాళ్లు భూమిపయి నానించుకొని నిలుచుండెను. మఱియు నాయెలుక యాసమయమునందే చెట్టుతొఱటలలో వసించు మఱియొక్క శత్రువపు డాచెట్టుకొమ్మపయిఁ గూర్చుండియుండఁగాఁ జూచెను. అది వాఁడి ముక్కుగల చంద్రకమనెడి యొకగుడ్లగూబ. ఆయెలుక ముంగిసయు గూబయు బొరింబడి మిక్కిలియు భయంబునకుఁ బాలై తనలోనిట్లని చింతింప సాగెను—'మిక్కిలియుఁ గష్టమయిన యాపద యిదే దాపరించినది. మృత్యువు నన్నుఁదేఱి చూచుచున్నది. ఎటుప్రక్కను భయ ముప్పతిల్లి యున్నది. ఇట్టి సమయమున నొకఁడు తనమేలుగోరి యేమిచేయఁదగును?' అని తలపోసెను. అది యట్లు చుట్టును నరికట్టంబడి యంతటను భయముగలందులకు స్రుక్కి మిక్కిలియు భయమున వడఁకుచు నొక గొప్పయాలోచనము చేసెను. అది తనలో 'పెక్కులాప

దలు వచ్చినపుడు పలువగల యుపాయములచేత వారించికొనుచు జీవితమును గాచుకొనవలసినది ముఖ్యము. ఇప్పుడు నలుప్రక్కల నిదె బ్రాహ్మణసందేహము దాపరించియున్నది. కాఁబట్టి యీపద కలిగియున్నది. ఈయూరినుండి తొందరపడి దిగి నేలకుఁబోయితి నా ముంగిన నన్నుఁదప్పక పట్టి మ్రింగివైచును; ఈయురియందే యుంటినా గుడ్లగూబ పట్టుకొనును; మఱిపిల్లి, త్రాళ్లు వీడనేని తప్పక నన్నుఁబట్టి చంపును; ననుబోఁటి ప్రాజ్ఞునకు నిట్టియెడఁ దెలివితప్పుట తగవుగాదు. ముక్కున నూపిరి యడఁగువఱకును నాయుసుఱును గాచుటకు వలయుపాటు పడెదను. బుద్ధిగలవాఁడును నీతిశాస్త్రమందుఁ గుశలుఁడు నగు ప్రాజ్ఞుఁడు క్రూరమతిన గొప్పవిప త్తినొందినను నందు మునుంగఁడుగదా! ఇప్పు డీయాప దయందుఁ బిల్లికంటె నాకు వేఱుగతి దోఁపకున్నది. నాపగవాఁడయిన యీపిల్లియు సంకటమునఁ జిక్కియున్నది. దీనికిని నా చేతఁ గాఁదగిన సాయము పెద్దదిగానే యున్నది. మూఁడు పగవాండ్రు నన్నుఁ జంప నుంకించుచున్నారు గాన, యిపు డెట్లు నా యుసుఱు గాచుకొనఁజూతును? నా యుసుఱునుబట్టి యీపిల్లి నే మిత్రముగా నాశ్రయించెదను. ఈశత్రుసమూహమును బుద్ధిని మున్నడికొని వంచింపవలసిన విధముగ నీతి శాస్త్రము నూఁది యీపిల్లికి హితము చెప్పెదను. నాకు నీపిల్లి యత్యంతశత్రువు గాని యిది చిక్కియున్న సంకటమును నత్యంతముగానే యున్నది. ఈమూఢునకు వాని కయిన యర్థమును నేనుజేరి తెలిపితినేని తెలిసికొనునేమో చూచెదను. వీఁ డిట్టి వ్యసనమందుఁ బడియుండుటంబట్టి నాతోడ సంధిచేసికొన వచ్చును. బలవంతుఁడు నటిసి బాధించుచున్నపుడు పగవానితోనయినను సంధి

చేసికొనవలయును. ఒకఁడు విషమమునఁ జిక్కి తనప్రాణములు గాచుకొనఁగోరునేని యిట్లే నడచుకొనవలయు నని యాచార్యులగువారు చెప్పెదరు. అ పండితుఁడగు మిత్రునికంటెను బండితుఁడగు శత్రువే మేలు. ఇప్పుడు నాగతియో, నా బ్రతుకు నాశత్రువగు పిల్లిచేతియం దున్నది. కాఁబట్టి వీనికిఁ దన్నురక్షించుకొనుటకు నుపాయము నుపన్యసించెదను. ఇట్టిసమయమున నీపిల్లిని పండితుఁడయినశత్రువుఁగాఁ గొనుట తప్పుగాదు' అని యిట్లు శత్రువులెల్లఁ జుట్టు నరికట్టుయుండఁగాఁ దనలో నాలోచించెను. ఇట్లు తలపోసి యూమెలుక యర్థము గతులను గలరూపున నెఱుంగుచుదియు సంధివిగ్రహములకుఁ దగు కాలములను దెలిసినదియు నగుటఁ జేసి మెల్లన యాపిల్లితో 'పిల్లీ ! నీతోడఁ జెలికారమున మాటాడుచున్నానుగాని మఱేమిగాదు. బ్రతికియున్నావే కదా? నీవు బ్రతుకుదువనియె యువ్విళ్లూరుచున్నాను. మనయిరువురకును మేలు సమముగాఁ గోరెదనుజుమీ. సౌమ్యా ! నీవు భయపడవలదు. మునుపటివలె హాయిగా బ్రతికి యుందువుపో ! నీవు నన్ను నిజముగాఁ జంపకుందువేని నిన్ను నే నుద్ధరించెదను. ఇట్టియెడగున నాకొక మంచియుపాయముతోఁచి యున్నది. అది మిక్కిలి చాలునని నాకుఁ దోఁచుచున్నది. దానిచేత నీవును బప్పించుకొనవచ్చును. నేనును మిక్కిలియు మేలుపడయవచ్చును. నేను సూటిగా నాలోచనముచేసి నీకొఱకును నాకొఱకును నాయుపాయమును గనుఁగొంటిని. దానివలన మనకిరువురకును మేలుగలదు చుమీ? * ఇవిగో ముంగిసయు గూబయుఁ బాపబుద్ధితోఁగూడి యున్నవిగాన యింకను నన్ను బెదరింపఁ దొడంగవు. కాబట్టి యిప్పుడు (నిన్నువిడిచి పుచ్చు

* ఇదిగో ముంగిసయును గూబయును బాపబుద్ధితోఁగూడి యున్నవిగాన యింకను నన్ను బెదరింపఁ దొడంగవు. కాబట్టి యిప్పుడు (నిన్నువిడిచి పుచ్చు

బుద్ధితో వేచియున్నవి. పిల్లీ! అవి నన్నుఁదలపడుకుండు నంత వఱకే నా బ్రతుకు క్షేమముగానుండును. ఇదిగో మార్జినికొమ్మ కొనయందుండి గుడ్లగూబ కన్నులిటునటు మాటికిఁ ద్రిప్పుచుఁ గూయుచును నన్నుఁ దేఱిచూచుచున్నది. దానిని జూడఁగా నాకెంతయు వడంకుగలుగుచున్నది. స్నేహము సాధువులకు * నేడడుగులచే గలుగును. నీవు నట్టిపండితుఁడవు గావున నాకు మిత్రుఁడవు. నేనునీయెడ మిత్రునివలెఁ దోడుపడెదను; కాఁబట్టి నీ ప్రాణములకు భయపడవలసినది లేదు. పిల్లీ! నాసాయములేక నీవు తార్క్ష్యుని ద్రెంచుకొన శక్తుఁడవుగావు. నీవు నన్ను హింసింపకుందువేని నీయురి తార్క్ష్యుని నేను గొఱికివైచెదను. నీవు మార్జినికొనయం దుండువాఁడవు. నేనో మార్జినియఱుగున నుండుదానను. మనమిరువుర మిమార్జినియందుఁ జాలఁగాలముగా వసించి యున్నా మనుట నీకును దెలిసినవిషయమే. ఎవని నొక్కరును నమ్మరో, యెవఁ డొక్కరినిని నమ్మకుండునో, యాయిరువురను భ్రష్టులు గొనియాడరు. ఏ రెప్పుడును మనస్సున నెమ్మదిలేకుందురు. ఈకారణమునుబట్టి మనయిరువురకును బరస్పరము ప్రీతిపెరుఁగునుగాన మనయిరువురును గలసిమెలసి యుందము. ఈలోకమందుఁ గాలముతప్పి చేయుకార్యమును బండితులు కొనియాడరు. కాఁబట్టి మనయిరువురకు నిట్టిప్రయోజనముతోఁగూడిన కాల మిదియే యని తెలియుము. 'నీవు

నట్టి నేను క్షేమముగానుండుటంబట్టి) నీబ్రతుకునకును క్షేమము' అని దాక్షిణాత్యశోశములందలి పాఠమునకు నర్థము.

* 'సతాం సాప్తపదమ్ మైత్రమ్' అని మూలము. సాధువు లొకరితోనొకరు గూడి యేడడుగులు పెట్టినచో వారలకు చెలిమిగలుగునని యిందలి యాశయము.

బ్రతుకవలయునని నాకుఁగోరిక ; నీవును నేను బ్రతుకవలయునని గోరెదవు. మనుష్యుఁడు మిక్కిలి లోఁతయిన పెద్దయేటిని నొక కట్టియనుగొని దాఁటుచున్నాఁడు. వాఁడాకట్టియను నవ్వలిదరికిఁ గొంపోవుచున్నాఁడు; ఆకట్టియయ వాని నవ్వలిదరికిఁ జేర్చుచున్నది. ఇట్లే మనయిరువుర కార్యమును గూడికొనుటయు మిక్కిలియు గొప్పదిగానున్నది. నేను నిన్నువిడిపించెదను. నీవును నన్ను విడిచిపుత్తువు' అనెను. ఇట్లు పలితుఁడనెఱి యెలుక, యు భయులకును హితంబును యుక్తియుక్తంబును గయికొనందగి నదియు నయిన యీవిషయమును జెప్పి దాని యుత్తరమున కెదురు చూచుచుండెను.

అంత నట్లాయెలుక లెస్సగాను సహేతుకముగాను నొప్పు కొనఁదగునట్లుగాను జెప్పినమాటవిని బుద్ధిమంతుఁడును మాట కారియు సగుపిల్లి తానున్నకష్టదశను జింతించి యాయెలుక మాటను గయికొని దానిని మంచిమాటలఁ బూజించెను. వాఁడి యైన మునిపండ్లను వైడూర్యమణుల వన్నె కన్నులునుగల యాలోమశుఁడను పిల్లి యెలుకను మెల్లఁగన్నెత్తిచూచి దానితో 'సామ్యా ! నాకు నీయందు సంతోషము గలుగుచున్నది. నీవు నన్ను బ్రతికింపఁ గోరుచున్నావుగాన నీకుశుభం బగుఁగాక. నీ వేది శ్రేయమని తలఁచెదవో దానిని ద్వరతోఁ జేయుము. ముందువెనుక విచారింపకుము. నేనో మిక్కిలియు విపత్తియందున్నాను. నీవు నాకంఁటె నెక్కువ విపత్తియందున్నావు. ఆ పన్నుల మగు మనయిరువురకును సంధిగావలయును, జాగువలదు, సమయమునకుఁ దగినదేదియో దానిని జేయుము. మనయిరువుర కార్యమును సిద్ధింపనీ. నేను గష్టమునుండి విడివడితినేని నీ

చేసినయుపకారము నిష్ఫలముగాదు. నీయెడ గౌరవము నుంచిన వాఁడనగుదును, నీకు భక్తుఁడనగుదును, శిష్యుఁడనగుదును, నీకు హితకరుండ నగుదును, నీపంపు దప్పక సేయువాఁడ నగుదును, నిన్ను శరణుఁజొచ్చితిని' అనెను. ఇట్లుది చెప్పఁగా నర్థవిదుం డగు పలితుఁడు తనకు వశగతమయిన యాపిల్లితో నర్థయుక్తం బును హితంబునయిన వచనముల నిట్లనియె.

'నీవు చెప్పినది యుత్తమమైనది. ఇది నినుబోఁటివాని యం దొకవింతకాదు. మనయిరువురకును హితముగలుగుటకై నేనుబన్నినయుపాయమును జెప్పెదనువినుము. నేను నీమేనిక్రిందఁ జొచ్చియుండెదను. నాకు ముంగిసను జూడఁగా మిక్కిలి భయ ముగా నున్నది. నీవు నన్ను రక్షింపవలయును; కాని చంపరాదు. నిన్నురక్షించుటకు నేను శక్తుఁడనై యున్నాను. గూబవలన నుండియు నీవు నన్నురక్షింపవలయును. అల్పమయిన యది నన్నుఁ దినఁగోరుచున్నది. మిత్రమా! నీత్యాళ్లను నేను ద్రెంచి వైచెదను. ఇట్లని నీకు గట్టిగాఁ బ్రతిజ్ఞ సేయుచున్నాను' అనెను. ఆయెలుక యుక్తియుక్తముగాను బొసఁగునట్లును మంచివిషయ ముగలయట్లును జెప్పినయప్పలుకువిని లోమశుఁడు సంతుష్టుఁడై తేఱిచూచి పలితుని స్వాగతమునఁ బూజించెను. అట్లాపిల్లి పలి తునినెయ్యము పచరించినందులకుఁ బూజించి కొంత సేపు చింతించి యంతసంతోషము గడలుకొన వేగదానితో 'వేగరమ్ము! నీకు శుభం బగుఁగాక. నీవు నాకుఁ బ్రాణసముఁ డగుచెలికాఁడవు. ప్రాజ్ఞా! నీయనుగ్రహమువలననేకదా ప్రియ మయినబ్రతుకును మరలఁ బొందుచున్నాను. ఇప్పు డిట్టిస్థితి నొందిన నేను నీకేమేమి చేయవలయునో యానతిమ్ము. నేను జేసెదను. మన యిరువురకును

సిద్ధికలుగుఁగాత. నే నీప్రాణసంశయమునుండి విడివడి నామిత్ర సమూహములను బంధుజనులనుగూడి నీకుఁ బ్రియమును హిత మునగు కార్యములనెల్లఁ జేయుదును. సౌమ్యా! నే నీవ్యసన మునుండి విముక్తుఁడనై నీకుఁ బ్రీతిని గలిగింతును. ప్రత్యుపకా రము చేయుటకును శక్తుండ నగుదును. మొదట నుపకారము చేసినవానికిఁ బిదపఁ బలువిధములఁ బ్రత్యుపకార లెన్నిచేసినను సాటియగు నని నాకుఁదోఁపలేదు. ఈ యిరువురలో మొదట నుపకరించినవాఁడు కారణములేకయే యట్లు చేయుచున్నాఁడు. రెండవవాఁ డుపకారమును బొందియేకదా చేయుచున్నాఁడు' అనెను.

ఇట్లు పిల్లి సమాధానపఱుపఁగా నెలుక గలయూయెలుక మిక్కిలియు నమ్మకమునొంది దానిమేనిక్రిందఁజొచ్చి దానినెం తయు నంగీకరించెను. అట్లది యాపిల్లికిఁ దనకార్యమును దెలిపి నెయ్యము తియ్యముగలదై తలిదండ్రులయెడంబోలె నాపిల్లి కడుపునందు నిదురింపఁదొడంగెను. అట్లామూషిక మాపిల్లి యవయవములందు మఱిఁగికొని యుండుటనుజూచి ముంగిసయు గూబయు నిరాశులయి మరలిపోయినవి. ఆపిల్లికిని నెలుకకును గలిగిన యత్యంతప్రీతిని జూడఁగా నాముంగిసకును గుడ్లగూబ కును మిక్కిలిభయముగలిగి యుత్సాహము తగ్గుటయే కాక యెంతయు నాశ్చర్యమును జనించెను. హరితుఁడును జంద్ర కుఁడు నిరువురును, బలమును బుద్ధియుఁ గలవారు. ఇరువురును దమయెరను బట్టుసమర్థులే. ఆయిరువురును దాపునఁ నేయుండియు నాపిల్లిని నెలుకను వానికిఁ బరస్పరముగలిగిన నెయ్యంపుటూఁడం బడికనుండి బలవంతముగా విడఁదీయఁ జాలకుండినవి. ఆపిల్లియు

నెలుకయుఁ దమతమకార్యములకొఱకు సంధియిట్లు గావించుకొ నుటఁజూచి నకులమును నులూకమును నచ్చోటువాసి తమతమ నెలవులకుఁ బోయినవి. పిదప నెలుకయగు పలితుఁడు కాలదేశ ముల నెఱింగినదిగాన యాపిల్లిమేని క్రిందనుండి యాయురిత్రాళ్ళ ను మెల్లగాఁ గొఱుకుచు దానిని ముగించుటకుఁ దగుకాలము నెదురుచూచుండెను. పిల్లి త్రాళ్ల కట్టులకు మిక్కిలియుఁ గ స్తి నొంది యా మూషికమును త్వరలేక మెల్లగాఁ ద్రాళ్లను గొఱుకు చుండుటఁ జూచి దానినిసైఁపకుండెను. అదిదానివేగిరింపఁదలఁచి దానితో 'సామ్యా! ఏల నీవు వేగిరపడకున్నావే! నీవునావలనఁ నక్కిఱఁ దీర్చుకొని యిపుడు నన్నుఁ బాటింపకున్నావా? ఆచం డాలుఁడు రాకమునుపు త్రాళ్లను ద్రెంపుము' అనెను. ఇట్లు పిల్లి తొట్రుపడుచుఁ జెప్పఁగా బుద్ధిమంతుఁ డగు పలితుఁ డంతఁగాఁ బ్రజ్ఞయందుఁ దేఱుగడగాని పిల్లినిజూచి తథ్యమును నాత్మహితం బునగు వచనముల నిట్లనియె.

'సామ్యా! నీ వూరకుండుము. తొందఱపడకు. తొట్రు పాటునువలదు. ఈవిషయమునఁ గాలముదెలిసినవారము మేమే. సమయముతప్పదు; అకాలమందుఁ జేసినకార్యము చేసినవానికి ఫలమునొసంగునది గానేరదు. అదియే సమయమందుఁ జేయఁ బడినచో మిక్కిలియు ఫలమునొసంగ నేర్చునదగును. అకాల మున నిన్నువిడిచిపుత్తునేని నీవలననే నాకు భయముగలుగును. కాఁబట్టి సమయము నెదురుచూచుచుండుము. చెలికాఁడా! ఎందులకుఁ దొందర పడెదవు? చండాలుఁ డాయుధపాణియై రాఁగాఁ జూచినప్పు డది యుభయులకును భయావహమయినది గాన యప్పుడుతప్పక నీత్రాళ్లను ద్రెంచివైతును. నీ వాసమయ

మందు విడివడి మాత్రనిపై నెక్కి-కొంచువు. నీకప్పు డుసుఱును దాఁచుకొనుటకంశె మఱియొకటిచేయుటకు వీలుండదు. అప్పుడు వేఁటకానికి భయపడి నీవు పాఱిపోఁగా నేను బొఱియలోఁజొచ్చి కొందును; నీవు కొమ్మనెక్కి-కొందువు' అనెను. ఇట్లది యాత్మ హితంబగు మాటచెప్పఁగా మహామతియు మాట పొందెఱింగి నదియునగు పిల్లి తనయుసుఱు గాచుకొనఁ దహతహపడు చుండెను. అది తానుజెప్పినపనిని ద్వరితముగా నెఱవేర్చియు నక్కి తనపనియందు వేగిరము లేకున్నయాయెలుకను జూచి 'సాధువులు మిత్రులకార్యములను నీచందమునఁ గావింపరు; ప్రేమతోడఁ గావింతురు. నేనెంత వేగిరపడి నిన్ను సంకటము నుండి విడిపించితినో యంత వేగిరముగాఁగదా నీవిదినాకుఁ జేయ వలయును; నీవు మిక్కి-లియుఁ బ్రాజ్ఞుండవుగదే! మనయిరువుర సును జేమముగలుగునట్లు ప్రయత్నపడుము. అట్లుగాక నీవు మునుపటి వైరమును దలఁచికొని ప్రొద్దుపుచ్చఁ గోరుదువేని తప్పక నాయుసుఱు నశించును. నీవు దుష్టకర్ముఁడవు గదే! చూడుము. నేను దెలియమిచేత ముందు నీ కేదేని కొంచెము కీడుచేసియుండినను నీవు దానిని మనస్సున నుంచుకొనరాదు. నిన్ను మన్నింప వేఁడుకొనుచున్నాను. నాయం దనుగ్రహింపు' మనెను. ఇట్లు ప్రాజ్ఞుండయిన యాపిల్లి చెప్పఁగా శాస్త్రవేత్తయు నుత్తమబుద్ధియు నగు నాయెలుక యపుడు మేలిమాటల నిట్లనియె.

'పిల్లీ! నీవు స్వకార్యమును బెద్దదిగాఁజేసికొని చెప్పిన మాటనువింటిని. నేను నాకార్యమును బెద్దదిగాఁజేసికొని చెప్పు దానిని సయితము వినుము. ఏమిత్రమును భయముతోడ

సాధింపవలయునో యేమిత్రమునందు భయముగలిగియుండునో వానివలననుండి పాముకోఅలనుండి పాములవాఁడు చేతిని రక్షించుకొనునట్లు తనరక్షను గావించుకొనవలయును. బలవంతునితోడ సంధిచేసికొని యెవఁడు తన్ను రక్షించుకొనక పోవునో వాని కాసంధి పూజితం బయినయపథ్యమువలె మేలునకు మాఱుగాఁ గీడునకు మూలమగును. ఒకఁడు మఱియొక్కనికి మిత్రుఁడే కాఁడు. ఒకఁడు మఱియొక్కనికి శత్రువే కాఁడు. కార్యమునుబట్టియే చుమీ యొకరినొకరు మిత్రులును శత్రులు నయ్యెదరు. ఏనుఁగులచేతఁ బెద్దయేనుఁగులు గట్టుపడునట్లు, కార్యములచేతఁ గార్యములు గట్టుపడుచున్నవి. కార్యముచేసినపిదప నట్లు చేసినవానిని బాటించువాఁడొక్కఁడును లేఁడు. కాఁబట్టి సమస్తములయిన కార్యములను గొంత మిగతపడునట్లుగాఁ జేసియుంపవలయును. ఆసమయమందును నాచండాలునివలన భయపడి కష్టపడుచుఁ బరుగెత్తుటయె నీకు ముఖ్యముగానుండును గాన, నీవు నన్నుఁబట్టుకొనుటకు శక్తుఁడవుగానుండనేరవు. త్రాళ్లు పెక్కులుద్రెంచియైనవి. ఒక త్రాడే మిగతపడియున్నది. దానిని వేగముగా నేను ద్రెంచివైచెదను. లోమశా ! సుఖముండుము' అనెను.

ఇట్లాపన్నులైయున్న యాపిల్లియు నెలుకయు రెండునిట్లు మాటాడికొనుచుండఁగా నారాత్రి గడచినది. లోమశునకు భయమతిశయించెను. పిదప, వేకువను పరిఘుఁడను చండాలుడాయుధపాణియై కనుపట్టెను. వానినిజూచుటకు భయంకరముగానుండెను. వాఁడునలుపును బింగళవర్ణమునుగల చాయయు బలితములయిన చిఱుదొడలును గలిగియుండెను. వాని నోరు

విఱివిఱియై యాచెవినుండి యాచెవివఱకుఁ జాఁగి మిక్కిలి మలిన మైయుండెను. వాఁడుశంకులవంటి చెవ్వులుగలిగి కుక్కతండములు బలసి రా గుద్దలి యొకటినె త్తికొని బెట్టిదముగాఁ గనుపట్టుచు వచ్చెను. యమునింబోలి వచ్చుచున్న యాబోయవానిని జూచి లోమశుఁడు భయముచే వడవడవడంకుచు నెలుకనుజూచి 'ఇప్పుడేమిచేయుదువు'అనియడిగెను. ఆయెలుక పిల్లి చిక్కువడియున్న మిగతత్రాడొక్కటిని సయితము ద్రెంచివై చెను. పిదపఁ బిల్లి విడివడి యామాన్ని పయినెక్కికొనెను. పలితుఁడును నాతొట్రు పాటునుండియు భయంకరుఁ డగు శత్రువునుండియు విడివడి బొఱియలోఁ దూఱెను. ఆలోమశుఁడు కొమ్మపయినెక్కెను. చండాలుఁ డన్నివిధముల నరసి నిరాశుఁడై యిరినె త్తికొని క్షణమున నచటనుండి కదలిపోయెను. భరతసత్తమా ! ఆచండాలుఁడు తనయిలుచేరెను. పిదప లోమశుఁ డాభయమునుండి విముక్తుఁడై దుర్లభమయిన ప్రాణములనుబడసి మాన్యినికొన యందుండులాఁగు నందున్న యెలుకనుజూచి 'ఒక్కమాటయు నాతో మాటాడకయె నీవు తటాలునఁ బాఱిపోయితివే. నేనే దేని చెడ్డతలంపు గలిగియున్నానని నీకు సందేహములేదే కద ? నేను మిక్కిలియు నెనగు గలిగియున్నాను. నీవు నాకు గొప్ప కార్యముచేసితివి. నీవు నాకు విశ్వాసముగలిగించి నాప్రాణములనిచ్చితివే. ఇట్టి నీవు చెలికాండ్రిరువురను గూడి నెయ్యము తియ్యంపు సొంపు ననుభవింపనలసిన కాలమున నాయొద్ద కేల రా కున్నావు? మొదట స్నేహితులనుగాఁ జేసికొని పిదప వారిని మఱచిపోవు దుర్బుద్ధి యగువాఁడు కడిందిసంకటములు వచ్చినపుడు మరల మిత్రులను బడయఁజాలఁడు.అనుంగుఁజెలికాఁడా!

నీసామర్థ్యమంతయునెఱిపి నన్నెంతయుఁబూజించితివి. ఇట్టి నీవు మిత్రత్వమును బొందిననమబోఁటిపేదవానిపొత్తు ననుభవింపఁ దగుదువు. నాకుఁగల మిత్రులును నాకుఁగల బంధువులును నంది మును బ్రియుం డయినయాచార్యుని శిష్యులుంబోలె నిన్నుఁ బూజింతురు. నేనును నిన్ను నీమిత్రగణములతోడను బంధువులతోడనుగూడి పూజింతును. ప్రాణము నొసంగినవానిని నెవరుగలవాఁ డెవఁడు పూజింపకుండును? నీవు నాదేహము ఇల్లు ధనములు మొదలగుననన్నిటికిని నేలికగా నుండవలయును. నీవు నాకాజ్ఞసేయువాఁడవుగా నుండుము. మహాప్రాజ్ఞా! నీవు నాకమాత్యుఁడవుగా నుండుము. పుత్రునిఁ దండ్రియుంబోలె నీవు నన్నుఁ బనిపంపుము. నీకు నావలన భయమువలదు.ఇట్లని నాప్రాణులమీఁద నొట్టుపెట్టుచున్నాను. నీవు బుద్ధినిబట్టి శుక్రుఁడవే. మేము బలిమిచేత నధికారముగలవారము.మంత్ర బలముగల నీవు మాకు జయమును గూర్చువు' అనెను.

ఇట్లు పిల్లి మంచిమాటలుచెప్పఁగా నాయెలుక నిజమును దెలిసికొని యింపయి యాత్మహితకరములయిన వచనముల వానితో 'లోమశా! నీవు చెప్పినదంతయు వింటిని. నాకుఁ దోఁచునదియుఁ జెప్పెదను వినుము. మిత్రులను జక్కఁగాఁ బరీక్షించి దెలియవలయును. శత్రువులను జక్కఁగాఁబరికించి తెలియవలయును. ఈ లోకమం దిటువంటిపనిని జేయుట మిక్కిలియు సూక్ష్మమయినదని ప్రాజ్ఞులు నొప్పుకొనుచున్నారు. మిత్రులు శత్రువులవలెను,శత్రువులుమిత్రులవలెను నుందురు.ఒక తెగవారితో సంధిగావించుకొన్నను వా రాసంధి కియ్యకొనుట రాగమునకును లోభమునకు లోనై యో కాదో వారికలరూపు దెలియుట

యెంతయుఁ గష్టముగానుండును. *(ఎవరికిఁ జల్లఁదనముగలవారే మిత్రులును గోధుశీలురే శత్రువులు నగుదురో వారలకు మంచి మాటలచే మిత్రశత్రుల కలరూ పెంతచెప్పినను వారురాగలోభ ములకులోనై తెమకుఁదోచినదే తెప్పఁ దక్కినవి తెలియరు). పుట్టుకచేత శత్రువగుట లేదు;మిత్రుఁడగుటయు లేదు.ఆయాకార్యము లనుబట్టి మిత్రులును శత్రులు నగుచున్నారు. ఎవఁడు తనకొకఁడు బ్రతికియుండు నంతవఱకే తనకార్యములకు సిద్ధిగలుగు ననియు, వాఁడు మృతుఁడయినచోఁ దనకుఁ బీడ గలుగుననియుఁ జూచునో వాఁడు దానిని దనకు మిత్రముగాఁగొని యీ సందర్భముల మాఱకుండు నంతవఱకు నల్లె మిత్రముగాఁ దలంచుచుండును. మిత్రత్వమును స్థిరమై యుండునది లేదు. శత్రుత్వమును సతమైనది లేదు. కార్యముల కూడికనుబట్టి మిత్రులుగాను శత్రువులుగాను నేర్పడుచున్నారు. కాలము తిరిగినపుడు మిత్రుఁడును శత్రుత్వ మందుచున్నాఁడు; శత్రువును మిత్రత్వము నందుచున్నాఁడు. స్వప్రయోజనమే మిక్కిలి బలీయమైనది చుమీ. కార్యముల పొసఁగుపాటును దలంపక యెనఁడు గ్రుడ్డితనముగా మిత్రులను నమ్ముచును శత్రువులను నమ్మక యు నుండునో వాని బ్రతుకు చంచలమే. ఎవఁడు శత్రువునంమఁగాని మిత్రునందుఁగాని నీతి యుక్తిని విచారింపక మక్కువ నుంచునో వాని బుద్ధియుఁ జంచలమే. నమ్మిక లేని వానియందు నమ్మిక గూడదు. నమ్మిక గలవానియందును మితిమీఱిన నమ్మిక గూడదు. గ్రుడ్డి

* ఈశ్లోకము 'యేషాం సౌమ్యాని మిత్రాణిక్రోధనాశ్చైవ శత్రవఃl సాన్త్వితాస్తే న బుధ్యన్తే రాగలోభవశంగతాఃl'ఇది ఉత్తరప్రతులందులేదు. లేకుండుటయే సమంజసముగానున్నది.

నమ్మికవలనఁ గలుగుభయము వేళ్లనుగూడఁ ద్రెంచును. తల్లియుఁ దండ్రియు కొడుకును మామయు నల్లుఁడును సంబంధులును జుట్టములును గార్యములను బట్టికలుగుదురు. తల్లియుఁ దండ్రియుఁ బతితులయినచో గారాబు పుత్రునయినను ద్రోసిపుత్తురు. జనులు తమ్మె ముఖ్యముగా రక్షించుకొందురు. స్వప్రయోజనమునకుఁగల పసనుజూడుము! (స్వకార్యమునకుఁ గలసార మును జూడుము!) ప్రాజ్ఞా ఒకఁడు తనయసాయమునుండి విడినడినతోడనే, తనశత్రువుసుఖమునకుఁ గారణ మగు దానిని వెదకునేని వాఁడు మరలఁ దప్పించుకొనుట సామాన్యముగాదు. నీవు మానికొననుండి యీచోటికి(నేనున్నయెడకునన్నుఁదినుటకై) మునుపు వచ్చితివికాని బుద్ధిచాపలముచేత నిచ్చట వైచియుండినఁగురిని దెలియవయితివి. (బుద్ధి) చాపలముగలవాఁడు తన్నుఁదాను రక్షించు కొనఁజాలఁడు. మతి తక్కినవారి నెట్లు రక్షింపఁగలఁడు? అట్టివాఁడు తనకార్యముల నన్నింటిని నాశము చేసికొనును. నేను నీకుఁ బ్రియుఁడనని నీవు తీయనిపలుకులు చెప్పుచున్నావు. అదికల్ల. అందులకుఁ గల కారణమంతయు సవిస్తరముగాఁ జెప్పెదను వినుము. ఒకఁడొక కారణమునుబట్టి ప్రియుఁడగుచున్నాఁడు; ఒక కారణమును బట్టియే ద్వేష్యుఁడగుచున్నాఁడు. ఈ ప్రాణిలోకమంతయుఁ దనప్రయోజనమునే కోరుచుండును.ఒక్కఁడు నొక్కనికినిఁ బ్రియుఁడుగాఁడు.ఒకకడుపునఁ బుట్టిన తోఁబుట్టువులకుఁ లోకమందుఁగల చెలిమిగాని, ఒకరి నొకరు వరించిన యాలుమగలకుఁ గల వలపుగాని, స్వకార్యమునే యూఁదియుండును. ఈలోకమం దెవ్వరికిగాని పరస్పరముగల మెట్టిప్రేమయు నొక స్వప్రయోజనము నాశ్రయింప

నిది నేను జూడలేదు. అయినను దోఁబుట్టువులును దంపతులును గొన్నియెడల నొక కారణమును బట్టి కలహించినను మరల సంబంధించియున్న స్వభావమును బట్టి ప్రేమతోఁ గలసికొందురు. ఇది పరస్పర మట్టి సంబంధము లేకుండువారియందుఁ జూప ట్టదు. దాతృత్వముచేత నొకఁడు ప్రియుఁ డగుచున్నాఁడు. ఇంప యిన మాటలచే నొకఁడు ప్రియుఁడగుచున్నాఁడు. మంత్రము చేతను హోమముచేతను జపముచేతను మఱియొకఁడు ప్రియుఁ డగుచున్నాఁడు. ఒకఁడు తా నొదవుకార్యమునుబట్టి ప్రియుఁ డగుచున్నాఁడు. మనయిరువురకును బ్రీతి యొక కారణమునుబట్టి పుట్టినది. ఆకారణ మింక లేదు. అది ముగియఁగానే యా ప్రీతియు ముగిసిపోయినది. నీకు నాయందుఁ బ్రీతిగలుగుటకు నన్ను భుజింపవలయు ననుకారణముతప్ప వేఱుకారణ మేమికలదు? చెప్పుము. ఈవిషయము మనయిరువురకును దెలిసినదే. నే నిది మఱచిపోలేదని నీవు తెలియవలయును. కాలము హేతువును మార్చుచున్నది. * ఆహేతువునే స్వార్థము వెంబడించుచున్నది. స్వార్థమును బ్రాజ్ఞుఁడును కనుఁగొనుచున్నాఁడు. ప్రాజ్ఞుని లోక మనువర్తించుచున్నది. నీవు విద్వాంసుఁడును స్వార్థమును జక్కఁగాఁ దెలిసినవాఁడు నగు వానినిగూర్చి యిట్టిమాటలు పలుకఁదగదు. నీవు సమర్థుండవే కాని నీస్నేహము గల హేతు వున కిది కాలముగాదు. నేను సంధి విగ్రహములందు గడి దేఱిన వాఁడను; కనుక, స్వార్థమునుండి చలింపను. మేఘముల రూపములుంబోలె సంధికిని విగ్రహమునకుఁ గల సందర్భములు

* 'స్వార్థస్తమను వర్తతే' అని దా. మూలము. 'స్వార్థస్త్వమనువర్తసే' అని జే', మూలము. స్వార్థమును నీవు వెంబడించెదవు.' అని యర్థము.

మాటిమాటికిని మాఱుచుండును. నేఁడు నాకు శత్రువుగానుండి వి. నేఁటికే నాకు మరల మిత్రుఁడ వయితివి. నేఁటికే మరల నాకు శత్రుఁడవయితివి. సందర్భములు, మాఱుపడుచుండుట చూడు. మునుపు మనకిరువురకును మైత్రి, యందులకు హేతువుండి నంతవఱకును నుండియుండెను. హేతువు కాలముతోఁ గూడినదిగాన కాలముపోఁగా దానితోఁగూడనే యదియుంబోయినది. ఆహేతువు పోఁగా నామైత్రియుఁ బోయినది. నీవు నాకు స్వభావముచేత శత్రుఁడవుగదా! మనయిరువురకు సమమైన యొక ప్రయోజనము కలుగుటంబట్టి నాకు మిత్రుఁడవయితివి. ఆప్రయోజనము తీఱినది. కాన యెప్పటి స్వభావ మగు శత్రుత్వము మరల వచ్చినది. ఇట్లు రచింపఁబడియున్న శాస్త్రములను గలఱాపున నేను దెలిసియుండఁగా నీకొఱకని మరల నాకట్టు త్రాటియందు నే నేలచొత్తును? అది నాకుఁజెప్పుము. నీబలిమిచేత నేను విడివడితిని. నాబలిమిచేత నీవు విముక్తుఁడవయితివి. ఒకరి కొక రుపకారముచేసి యైనపిదప మరలఁ గూడికొనుట కలుగదు. సౌమ్యా! నీకార్యమో యొడఁగూడినది. నాకార్యమును సమకూడినది. ఇంక నాచేత నీకుఁ గావలసినపని నేను భక్షణముగుటకంటె మఱియొకటి లేదు. నేను అన్నము; నీవు తిను వాఁడవు. నేను బలహీనుఁడను, నీవు బలవంతుఁడవు. మనయిరువుర బలములు, సమానము గాకయుండఁగా (మనయిరువుర స్థితు లిట్లు విషమముగా నుండఁగా) పాసినపిదప మరల మనకుఁ గూడికగలుగదు. నాకు నీప్రజ్ఞ తెలియును. అది మఱేమిగాదు. వలనుండి విడివిడిన వెంబడిని, సులువయిన యుపాయమున భోజనమును వెదకుచున్నావు. ఇందులకు సందేహములేదు. నీ వాహా

ముకొఱకే వలలోఁ జిక్కువడితివి. దానినుండి విముక్తుఁడవయి
వి. ఇప్పుడు ని న్నాఁకలి వేఁచుచున్నది. శాస్త్రములను జదు
ుటవలన నుప్పతిల్లెడు బుద్ధినూఁది నన్నుఁ బెందలకడ భోజన
ుగాఁ జేసికొనఁ జూచుచున్నావు. నీ వాఁకలిగొని యుండుట
ెఱుంగుదును. నీ కిది యాహారము గొనుతఱి యనియు నెఱుఁ
ుదును. నీవు నావలనఁ జూపు నిగిడ్చి యెర నెమకుచున్నావు.
ఱంతేకాక చెలికాఁడా! *నీ వాలు బిడ్డలకొఱకు నాయెడ మాట
ాడుమాటలును, చేయఁబూనిన పనిపాటులును, నాకు నెంత
మాత్రము గొలుపవు. నేను నీతోఁగూడ నుండుటను జూడఁగా
ఏగాదిలి పడఁతియు గారాబుబిడ్డలును, నీవు నెయ్యము గలిగి
యుండఁగనే నన్నుఁబట్టికొని యేలతినకుందురు? కాఁబట్టి నేను
ఏతోడఁ గలసియుండను. అట్టి కలయికకు హేతువు గడచిపోయి
ది. నీవు నేను జేసిన మంచికార్యమును మఱవకుందువేని, నీవు
నాకు శుభము దలపోయుచు నెయ్యమున సుఖం బుండుము.
శత్రువయినవాఁడు ధార్మికుఁడని ప్రసిద్ధుఁడుగాకయు, వేరాఁకలి
గొనియు, నాహారమును వెదకుచును నుండఁగాఁ బ్రాజ్ఞుఁ
డివఁ డట్టివానిభారిం బడును? ఎవ్వఁడును బడఁడు. నీకు శుభం
బగుఁ గాత. నేను బనివినియెదను. దవ్వులనుండియు నిన్నుఁ

---

* కించాత్రపుత్రదారార్థం యద్వాణీం సృజసేమయి, శూత్రూషాం యతసే
ర్తుం సఖే మమ న తత్ క్షమమ్' అని. దా. మూలము. 'త్వంచాపి పుత్రదారస్థో
మత్సంధిం సృజసేమయి' అని మూలము. నీవాలు బిడ్డలుగలవాఁడవు. నీవింకను
నాతోడ సంధిగోరుచు నాకు మక్కువతోఁ బనిపాటులు సేయఁజూచెదవు.
కాని చెలికాఁడా! యివన్నియు నాకుఁ గొలుఁగువు' అని యర్థము. ఇది యేసమయం
దసమయుఁగా దోఁచుమనఁబడి. (ప్రతాపచంద్రరాయలు.)

జూడఁగా నాకు భయమెత్తుచున్నది. నేను నీతోడిపొత్తు నొల్లను. లోమశా! నీ ప్రయత్న ముడుగుము. నేను నీకుఁ జేసినమంచిని మఱవవేని, నేను నమ్మికగలిగి గాని పరాకుపడి గాని క్రమ్మఱఁ గలిగినపుడు చెలిమి ననువర్తింపుము. ఇంతేచాలు; నాకుఁ బ్రతిచేసిన ట్లగును. బలవంతుఁ డగు వానిదాపున నుండుటయు నెప్పుడును మెచ్చుగాదు. బలవంతుఁడు మిక్కిలి శాంతుఁడుగను బ్రాజ్ఞుఁడుగను నుండినప్పటికిని నతని దెస నెప్పుడును భయపడుచుండవలయును. నీ వింతవఱకుఁ జెప్పినట్టి ప్రయోజనము గోరితివేని చెప్పుము. నీకేమిచేయుదును? నేను నీకన్నియు నిత్తునుగాని నన్ను మాత్ర మేవిధమున నియ్యను. తన్ను రక్షించుకొనుకొఱకు సంతతిని రాజ్యమును రత్నములను ధనములను దిగవిడువవచ్చును. తనకుఁగల యంతయు నయినను దిగవిడిచి బుద్ధిమంతుఁడు తన్నుఁ దప్పక రక్షించుకొనవలయును. అందులకై యైశ్వర్యములను ధనములను రత్నములను బగవారికైన నియ్యవచ్చును. ఏలనఁగా నును ఉండినయెడల వానినెల్ల మరలఁ బడయవచ్చును గాన వచ్చుననిమాకువినికి. ధనములంబోలె, రత్నములనుంబోలెఁదన్ను నిచ్చుకొనుట యొప్పదు. ధనములను దారములను విడిచియైనను దన్ను నెపుడును రక్షించుకొనవలయును జుమీ. తమ్మును రక్షించుకొనుటయందుఁ గన్నుగలిగి, యేకార్యమును ముందుఁ జక్కఁగాఁబరీక్షించి చేయనట్టి పురుషులకు దోషములు కలుగవు; కాన, దోషములవలనఁ గలుగునాపదలును బుట్టవు. బలహీనులగువారు దమకంటె బలవంతుఁ డగు వాని నెప్పుడును శత్రువుగానే తెలియుదురు. వారలబుద్ధి శాస్త్రార్థములందుఁ దిరముగా నిశ్చితమైయుండును; కనుక, నది యెన్నఁడును జలింపకుండును' అనెను.

ఇట్లు పలితుఁడు తేట తెల్లముగనే చక్కఁగాఁ బరిహాసము చేయఁగాఁ బిల్లి సిగ్గునొంది దానితో 'నీమీఁద సత్యముగా నొట్టు పెట్టెదను. మిత్రద్రోహ మనుమాట నాకెంతమాత్రము నింద్యము. నాకు నీప్రజ్ఞ తెలియును. నీవు నాహితమం దాసక్తుఁడనియు నెఱుఁగుదును. నీ వర్థతత్త్వము నూఁది మనయిరువుర కును భేదమునకుఁ గారణమున్నదని చెప్పితివి. సాధూ! నన్ను వేఱువిధముగా గ్రహించుట నినుఁబోఁటికి నెంతమాత్రము దగదు. నీవు నాకుఁ బ్రాణప్రదానము చేయుటంబట్టి నీయందు నాకు మిక్కిలియుఁ జెలిమిగలిగినది. నేను ధర్మములను దెలిసిన వాఁడను; పరులగుణములను దెలిసికొన నేర్చువాఁడను; విశేషించి పరులుచేసిన మేలును మఱువకుండువాఁడను; మిత్రుల యందు నాకు మక్కువ; అందును నీయందు విశేషించి నాకు భక్తిగలదు. సాధూ! నేనిట్టివాఁడనయి యుండఁగా నీవు నన్నిట్లు పలుకఁదగదు. నీవు నన్నిట్లు మఱియుఁ బలుకుచుందువేని నేను బంధుసహితముగాఁ బ్రాణములు విడువఁగలను. పండితు లగువారు మనస్వులగు మనబోఁటివారియందు నెయ్యమునే కనుఁగొందురు. నీవు ధర్మతత్త్వములను దెలిసినవాఁడవు. నేను ధర్మము తప్పుదునని సందేహించుట నీకుఁ దగదు' అనెను.

ఇట్లు పిల్లి చెప్పుచున్నను నాయెలుక కొంచె మాలోచించి భావగంభీరముగా దానితో 'నీవు మిక్కిలియు మంచివాఁడవు. నీవు చెప్పినదంతయు వింటిని. అందుల కెంతయు సంతోషించుచున్నాను; గాని యెంతమాత్రము నమ్మఁజాలను. స్తోత్రములు చేసిననుగాని ధనరాసులు గుప్పించినను మరల నీవు నన్నుఁ బడయఁ దరముగాదు. చెలికాఁడా ! ప్రాజ్ఞు లగువారు కార

ణము లేక శత్రువులవశమునకుఁ బోవరు * (ఈ విషయమై శుక్రుఁడుచెప్పిన గాథలు రెంటిని వినుము. అవి యేవనఁగా) దుర్బలునిని బలవంతునిని నిరువుర‌ను సమానముగా శత్రువులు బాధింపఁగా దుర్బలుఁడు బలవంతునితో సంధిచేసికొని బుద్ధి నూఁది మిక్కిలి యెచ్చరికతోడ మెలఁగవలయును. తనకార్యము దీఱినపిదప బలవంతునియందు నమ్మకముంపరాదు. నమ్మఁదగనివానియందు నమ్మికయుంపరాదు; నమ్మినవానియందు నైత మధికముగా నమ్మికయుంపరాదు. ఎప్పుడును నితరులను నమ్మింప వలయునేకాని తాను వారల నమ్మరాదు. కాఁబట్టి సమస్తములయిన యవస్థలయందును దన జీవితమును రక్షించుకొనవలయును. జీవించియుండినచో ధనములును సంతానములును నన్నియుఁ బనికివచ్చును. సంక్షేపముగాఁ జెప్పనెడి, నమ్మకుండుటయె ధర్మశాస్త్రముల యుత్కృష్టమయిన మతము. ఈ కారణమునుబట్టి మనుష్యులందఱియెడ నమ్మకములేకుండుట పుష్కలమయిన హితమును గలిగించును. జనులు తామెంత దుర్బలులుగా నుండినను శత్రువులను నమ్మకుండిరేని, వారెంత బలవంతులయినను వారికిఁ బట్టువడరు. తాము బలవంతులయినను శత్రువులను నమ్మిరేని వారికిఁ బట్టువడుదురు. మార్జాలమా ! నన్ను నీబోఁటివారివలననుండి యెప్పుడును రక్షించుకొనవలసియున్నది. నీవును గుపితుఁడయి కలఁకఁజెందియున్న చండాలుని వలననుండి నిన్ను రక్షించుకొనుము ' అనెను. ఎలుక యిట్లు చెప్పగాఁ బిల్లి వేఁటకానిపేరు విన్నంతనే దిగులుగొని † యీ

---

* ఇది యుత్తరదేశ ప్రతులందుఁ గానరాకున్నదని తెలియునది.

† 'కథాంహిత్వా' అని మూ. 'శఖాంహిత్వా' అని ఉత్తరదేశపాఠము.

ముచ్చటను విడిచి యచటనుండి వేగముగాఁ బాఱిపోయెను. అంత శాస్త్రార్థతత్త్వములనెల్లఁ దెలిసిన యాపలితుఁడు తనబుద్ధి సామర్థ్యము నశ్లె నెఱపి మఱియొక బొఱియలోనికిఁ దూఱెను.

భీష్ముఁడు:—ఇట్లు ప్రజ్ఞ గలపలితుఁడు దుర్బలుఁడయ్యు నొక్కఁడును మహాబలులగు శత్రువులను బెక్కండ్రను వంచించెను. పండితుఁడగువాఁడు సమర్థుఁడగు శత్రువుతో సంధిచేసి కొనవలయును. ఎలుకయును బిల్లియు నొండొరుల నాశ్రయించుటవలన నాపదనుండి విముక్తులయిరి. మహారాజా! నీకిట్లు క్షత్రియధర్మమునకుఁగల మార్గము విస్తరించి నిరూపించితిని; సంక్షేపముగను జెప్పెదనువినుము. పరస్పరము వైరము గలిగియుండిన యిరువురు సంధి లెస్సగాఁ జేసికొనియున్నను వారొకరి నొకరు మించవలయునని మనస్సులోపలఁ దలంపు గలిగియుండుట నిజము. అట్టియెడఁ బ్రాజ్ఞుఁడగువాఁడు తనబుద్ధి బలమునూఁది తక్కినవానిని మించిపోవనేర్చును. ప్రాజ్ఞుఁడు గాని వాఁడన్నచో తన యేమఱుపాటువలనఁ బుద్ధిమంతుఁడగు వాఁడు తన్ను మించిపోవునట్లు చేసికొనును. కాఁబట్టి భయపడినను భయము లేనివానివలె నుండవలెను. నమ్మకుండినను నమ్మికగలవానివలెఁ గనుపట్టవలయును. ఇశ్లెచ్చరికగలిగి నడచుకొను వాఁడెన్నఁటికిని బొరఁబడఁడు. పొరఁబడినను నాశమునొందఁడు. కాలమువచ్చినపుడు పగవానితోఁ సంధిచేసి కొనవలయును. కాలము పొసఁగినపుడు మిత్రునితోడనైనను యుద్ధము చేయవలయును. ఇట్లు చేయవలయుననియె సంధివిగ్రహతత్త్వముల నెఱింగినవా రెప్పుడును జెప్పుదురు. మహారాజా! ఇది తెలిసి శాస్త్రార్థములను మనసునం దిడి మనుజుఁడు మిక్కిలి ప్రూనికతో నెంతయుఁ

బరాకువడక భయమునకు హేతువు కలుగకమునుపే భయపడు వానివలె మెలంగవలయును. మఱియుఁ బురుషుఁడు, భయ హేతువు నిజముగాఁ గలుగకమునుపే భయపడినవానివలె శత్రువులతో సంధినిగాని యుద్ధమునుగాని చేయవలయును. భయమువలన నెచ్చరికయుఁ బూనికయుఁ గలబుద్ధి యుప్ప తిల్లును. భయహేతువు రాకమునుపే భయమునొందినవానివలె నొకఁ డాయితపాటు చేసికొనునేని భయము నిజముగా వచ్చి యున్నపుడు వానికి భయముగలుగదు. ఎప్పుడును భయపడ కుండువానికి భయముకలిగినపు డా భయమునుండి (యా యితపాటులేమిచేఁ గలిగినయశక్తియనెడి) మఱియొక పెను భయము గలుగుచున్నది. 'ఎప్పుడును భయపడకుము' అని యీ మంత్ర మెవ్వనికి నేవిధమునను జెప్పరాదు. ఎవఁడు తనదుర్బ లత్వము తెలియుటవలన భీతినొందునో వాఁడు సదా బుద్ధి మంతుల యాలోచనము నడుగుచుండును. ఈ కారణములంబట్టి పురుషుఁడు భయముగలిగియు భయము లేనివానివలెను నమ్మ కుండియు నమ్మికగలవానివలెను జూపట్టవలయును. * ఒకఁ డిట్టి గొప్పకార్యములను బట్టియుఁ గూడ ననృతమించుకయుఁ బలుక రాదు. యుధిష్ఠిరా! నీ కిట్లు మూషికమార్జాలములను గుఱించిన యితిహాసమునుజెప్పితిని. ఇది విని నీసుహృదులనడుమఁ దగురీతి ననుష్ఠింపుము. ఈకథవలన నుత్తమమయినబుద్ధిని బడసి శత్రు

* 'కార్యాణాం గురుతాఞ్జ్ఞాత్వానానృతం కించిదాచరేత్' అని. జౌ. మూలము. 'నాదృతం కించి దాచరేత్' అని. దా. మూలము. కార్యముల గొప్పతనమునుజూచి అనఁగా గొప్పయగు కార్యములందే కన్నిడి యాదరింపఁ దగని వానిని (అల్పమును) గొంచెమైనను జేయరాదు.' అని యర్థము.

మిత్రులభేదములు దెలిసి సంధి విగ్రహములకుఁ దగుకాల ములను నెఱిఁగి యాపదలనుండు విడివడు నుపాయములను గనుఁగొందువు. తన్నును దనకంఁటె బలీయుఁడగువానిని శత్రువు పీడించునపుడు బలీయునితో సంధిచేసికొని కలసియుండి బుద్ధితో మెలఁగుటయుఁ, గార్య మొడఁగూడినపిదప వానిని మరలనమ్మకుం డుటయువలయును. రాజా! ఈనీతి ధర్మార్థకామములకు మూఁటి కిని విరుద్ధముగానిది. నీవీశ్రుతము ననుసరించి మఱలఁ బ్రజలను రంజించుచు నెంతయు నైశ్వర్యమును బడయుము. పాండవా! నీవెప్పుడును బ్రాహ్మణులతోడఁగూడి మూడి కాలము పుచ్చు చుండుము. బ్రాహ్మణులవలననే నిహమందును బరమందును మిక్కిలియు శ్రేయముగలుగును. వీరెప్పుడు ధర్మమును దెలిసి యుందురు. కర్తవ్యము లివి యని యెఱుఁగుదురు. వారిని బూజించినచో శుభములను గావింతురు. కనుక జననాథా! వారిని బూజింపుము. రాజా! నీ వట్లు చేయుటవలన యథా న్యాయంబుగ రాజ్యంబును బరమం బయిన శ్రేయమును గొప్ప యశస్సును గులమునకుఁ గ్రమముగా సంతతియును బడయు దువు. భారతా! మార్జాల మూషికములకు జరిగిన యీసంధి విగ్రహకథ బుద్ధివిశేషము నెంతయుఁ గలిగించునది. దీనిని లెస్సగావింటివి. రాజగువాఁడు దీనిని లెస్సగాఁ గనుఁగొని శత్రుసమూహమందుఁ బ్రవర్తింప వలయును' అనెను. ఇది నూటముప్పదియెనిమిదవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడు యుధిష్ఠిరునకుఁ బూజనీ బ్రహ్మదత్త సంవాదమును జెప్పుట.

ధర్మరాజు 'మహాభాగా ! నీవు శత్రువులం దెంతమాత్రము నమ్మకయుంపరాదని యాలోచనము చెప్పితివి. రాజైవ్వరి యందును నమ్మక లేకుండినయెడలఁ దానెట్లు మనఁగలఁడు ? నమ్మకమువలన రాజులకు మిక్కిలియు భయము గలుగునంటివి. రా జితరులను నమ్మకయెట్లు శత్రువులను జయింపనేర్చును ? నాయీసందేహము నుడుపుము. నమ్మకుండుటను గుఱించి నీవు ముచ్చటించినదానిని వినఁగా నానునసేమియుఁ దోఁచక తడఁబడుచున్నది' అనెను.

భీష్ముఁడు 'రాజా ! బ్రహ్మదత్తుం డనురాజునకును నతనియింటి యం దుండినపూజని యను పక్షికిని, జరిగిన సంవాదమును వినుము. కాంపిల్యదేశమందు బ్రహ్మదత్తుం డను రాజుగలఁడు. అతని యంతఃపురమునందుఁ బూజని యనునొకపక్షి చాలఁగాలముగా నతనితోఁగూడ వసించియుండెను. అది * జీవజీవకమను పక్షివలెనె యన్నిమృగముల యెలుంగులును దెలిసియుండెను. అది పుట్టుకయందుఁ బక్షియైనను దానికన్నియును నన్ని తత్త్వములును దెలియును. అది యక్కడ వసించియుండునపుడు మంచివర్చస్సుగల యొక పిల్లనుగనెను. అక్కాలమునఁనే రాజునకును నతనిదేవియందు నొకపుత్రుఁడు పుట్టెను.పూజని రాజింట నుండినందులకు నతనియెడ నెనరుగలదై ప్రతిదినమును సముద్రతీరములకుఁబోయి తనకూనకును రాజపుత్రునకును భోజనము

* జీవజీవకమనునది యొకపక్షి. వేటకాఁడనియుఁ గొందఅర్థముచేసెదరు.

నకై రెండుపండ్లను దెచ్చి యిచ్చుచుండెను. అందలియొక పండును దనకొడుకునకును మఱియొక పండును రాజకుమారునకును నిచ్చును. అది తెచ్చుపండ్లు, అమృతము నాస్వాదించినట్లు మిక్కిలి రుచ్యముగా బలమును దేజమును బెంచునట్టివిగా నుండెను. అది ప్రతిదినము నట్లె యాపండ్లను దెచ్చుచును నట్లె యిచ్చుచు నుండెను. పూజని యిచ్చుపండ్లను దినుటవలన రాచబిడ్డడు మిక్కిలియు బలమునొందెను. ఒకనాఁడా రాజకుమారుఁడు దాది చంకయందుఁ దన్నుఁ గానిపోవుచుండునపుడు పూజని కొడుకును జూచెను. అబిడ్డఁడు దాదిచంకనుండి దిగి యాపిట్టయొద్దకుఁ బరుగెత్తివచ్చి బాల్యమువలన దానితో మిక్కిలి యక్కఱగా నాటలాడుకొనసాగెను. వాఁడు కడపటఁ దన యాడుగల యాపిట్టను నెవరు లేనప్పుడు చేతనెత్తికొని నలిపి చంపి యంత దాదిచేతికి నెత్తుకొనుటకు వచ్చెను. ఆపూజని పండ్లను దీసికొనివచ్చి యా బాలుఁడు నేలఁ దనపుత్రునిఁ జంపివైచియుండుటను జూచెను. అది మొగమునిండఁ గన్నీరువెల్లిగొనఁ గూలినకొడుకునుజూచి దీనయై మిక్కిలి దుఃఖమునఁ దపించి యేడ్చుచు 'క్షత్రియునితోడి పొత్తు తగదు. వానితోడి చెలిమియుఁదగదు. వానియెడఁ బ్రీతియుఁ దగదు, వారి కేదేని కార్యము కావలసియుండునేని మంచిమాటలతో లాలించి పనితీఱినదే దిగవిడుతురు. క్షత్రియులెల్లవారికి నపకారము చేయువారుగాన వారినెప్పుడు నమ్మరాదు. అపకారము చేసినపిదప సయితము వారెప్పుడును వట్టి పనికిమాలిన తియ్యనిమాటలమాత్రము బుజ్జగించుచుందురుగాని బధులున కుపకరింపరు. ఈకృతఘ్నుఁడీ కూరుఁడవిశ్వాసఘాతకుఁడు చేసిన యీపనికి వైరము తప్పకదీర్చుకొనెదను. వీఁడు తనపుట్టిన

నాఁడే పుట్టి తనవెరిఁగినచోటనే వెరిఁగి తన పొత్తున భుజించి తన్ను శరణుఁగాఁ గొనియున్న నాయీబిడ్డనిఁ జంపినాఁడుగాన మూఁడువిధములయిన పాపములు చేసియున్నాఁడు' అని యిట్లు చెప్పి యంతఁ దనకాళ్లతో రాచకుమారుని కన్నులను బొడిచి దానివలనఁ గొంతయూఁటనొంది మరల నిట్లనియె—'ఒకఁడు పాపమును వలయునని కోరిచేయునేని హానిని దోడనే యది పయికొనుచున్నది. చేసినదానికి బదులుచేసి తీర్చుకొన్నవారికి దానివలన శుభాశుభములు నశింపవు. ఒకఁడుచేసిన పాపమునకు ఫలము వానియందుఁ గనుపట్టకపోయినచోనదివానిపుత్త్రులందును మనుమలయందును మునిమనుమలయందును వచ్చిపడుచున్నది' అనెను. బ్రహ్మదత్తుఁడు తనకొడుకును బూజని కన్నులుపొడుచుటను జూచి యది తన కొడుకుచేసినందులకుఁ దగిన ప్రతియని తలఁచి యాపక్షితో 'మేము నీకొక యపకారముచేసితిమి. నీవు బదులునకు నపకారముచేసితివి. రెండును సమముగానే యున్నవి. నీవిచటనుండి పోవలదు. ఇచటనే యుండుము' అనెను.

పూజని—'ఒకఁ డొకప్పుడు మఱియొకని కపరాధముచేసి వానియింటనే పోవక నిలిచియుండునేని పండితు లట్టినడకను గొనియాడరు. అట్టిసితియందు నపరాధికి తోలఁగి చనుటయె మేలు. వైరము బాహాటముగానున్నచోట వారెంత మంచిమాటలుచెప్పి బుజ్జగించినను నమ్మియుండరాదు. అట్లు నమ్మినట్టి మూఢుఁడు శీఘ్రమునఁ జంపఁబడును. వైరము త్వరలో నుపశమింపదుగదా. పరస్పరము వైరముగలవారి పుత్త్రులను పౌత్త్రులనుగూడ నావైరము కొనసాగుటవలన నాశమునొందుదురు. అట్లు పుత్త్రులను పౌత్త్రులను నశించుటవలన వారికిఁ బరలోక

మును నశించుచున్నది. ఒండొరులయందు వైరముగలవారికిఁ బరస్పరము నమ్మిక లేకుండుటయే సుఖావహము. విశ్వాసఘాతుకుఁడగువానియం దెడతెగక విశ్వాసముంపరాదు. విశ్వసింపనివానియందు విశ్వాసముతగదు. విశ్వసించినవానియందు సయితము నిక్కిలి విశ్వాసముతగదు. విశ్వసించుటవలనఁ బుట్టెడి భయము వేళ్లనుగూడఁ ద్రెంచివైచును. పరులను వలయునంత నమ్మింపనై నవచ్చును గాని తానుమాత్రము నమ్మరాదు. బంధువులయందుఁ దలిదండ్రులె శ్రేష్ఠులు. * భార్య క్షేత్రము (పొలము) వంటిది. పుత్రుఁడు బీజముమాత్రము. తోఁబుట్టునగువాఁడు (ధనమును బంచుకొనుటచే) శత్రువు. మనుష్యుఁడు (చేతఁ దడియుండునంతవఱకు) మిత్రము. ఆత్మయొక్కటియె సుఖదుఃఖముల ననుభవించునది. పరస్పరము వైరముగలవారికి సంధిపొసఁగదు. † నేనికఁడ వసించుచుండినందులకుఁ గలహేతువు గడచిపోయినది. ఇపుడులేదు. పూర్వమపకారము చేసినవానిని నపకృతుఁడయినవాఁడు, ధనములిచ్చియు సత్కృతులుచేసియుఁ బూజించుచుండు కొలఁదిని నపకారిహృదయ మపనమ్మకమునొందుచుండును. అట్టి పూజాదులు బలవంతుఁడుగా నుండువాఁడు చేయునేని దుర్బలులకు దిగులు పుట్టించుచున్నవి. బుద్ధిమంతుఁడగువాఁడు తా నెచ్చటఁ బిదప నవమానమునొందుటకే మొదట సమ్మానమునొందునో యచ్చోటును విడిచిపెట్టవలయును. తన శత్రువువలనఁ బిదపఁగూడ సమ్మానము గలిగినను వాఁడల్లె

* 'భార్యాజఘా' యను పాఠమున వీర్యహారమైన జర (ముసిమి) యంటిదని యర్థము. 'భార్యాపాత్రం' అని (ప్రతాపచంద్ర)

† ఇట హేతువు పుత్రరక్షగాని స్నేహముగాని గాపచ్చును.

నడచుకొనవలయును. నేను నీ గృహమందు దీర్ఘకాల మేహింస యు లేక సుఖముగా వసించియుంటిని. ఇప్పుడు వైరము పుట్టి నది. సుఖం బుండుము. పని వినియెదను' అనెను. బ్రహ్మ దత్తుడు 'పూజనీ ! ఎవఁడు చేసినదానికి బదులుచేయు నో వాఁడట్లు చేసినందులకు నపరాధిగాఁడు. దానివలన వాఁడు ఋణ ముఁగినవాఁడగుచున్నాఁడు. కాఁబట్టి యిచటనే యుం డుము. పోవలదు' అనెను. అందులకుఁ బూజని 'మొదట నప రాధము చేసినవానికిని పిదపబదులు చేసినవానికిని మరల సఖ్య మొనఁగూడదు. ఆవిషయమును జేసినవానిమనసునకును బ్రతిచేసిన వానిమనసునకును రెంటికిని దెలియు'ననెను. బ్రహ్మదత్తుఁడు 'చేసిన వానికిని బ్రతిచేసినవానికిని మరల సఖ్యముపొసఁగును. అట్టికూడి కయందు వైర ముపశమించినట్లు కనుపట్టుచున్నది. మరల నట్టి యెడఁ గొత్తగా నొకపాపమును గలుగకున్నది' యనెను.

పూజని-'వైరమెన్నటికిని గడచిపోయినదిలేదు. నన్నుమంచి మాటలాడినాఁడని తలఁచి యపకారము నొందినవాఁడు శత్రు వును నమ్మియుండరాదు. ఈలోకమున మనుష్యులు గ్రుడ్డితన ముగా నమ్ముటచే జిక్కులుపడెదరు. కాఁబట్టి యొండొరుల కగ పడకుండుటయే మేలు. మిక్కిలి వాఁడియైన యాయుధముల చేతను బలిమిచేతను లోపఱుచుకొనరానట్టివారిని, వెంటి యేనుఁగులచేత మగయేనుఁగులంబోలె, (కపటంబగు) సామ ముచేత నడంచి లోపఱుచుకొనవచ్చును' అనెను. అందులకు బ్రహ్మదత్తుఁడు 'ఒకరికొకరు ప్రాణాంతకులైన వారికిఁగూడ నొక చోటనే కూడిమాడి వసించియుండుటవలనఁ గుక్కను జంపి తిను చండాలునికిని గుక్కకునుంబోలె బరస్పరము స్నేహ

మును విశ్వాసమును గలుగుట గలదు. ఒకరియెడ నొకరు వైరముగలవారికిని నొక్కటఁగూడి వసించుటవలనవారివైరము మెత్తఁబడుచున్నది. మఱి యది తామరాకునందలి నీరువలె నిలిచియు నుండదు' అనెను. అందులకుఁ బూజని 'వైర మైదు కారణములవలనఁ బుట్టుచున్నది. వానిని బండితులు తెలియుదురు. ఆయైదుకారణములును * స్త్రీ, వాస్తువు, (సరుగని) మాటలు, స్వభావ (విరోధ)ము, అపరాధము అనునవి. అందు వైరమెవరితోఁగలదో వాఁడు దాతయగునేని చంపరాదు. విశేషించి క్షత్రియునకు, నట్టివానిని బ్రకాశముగాఁగాని రహస్యముగాఁగాని చంపుటతగదు. అట్టివిషయమం దా పురుషుని దోషమునకుఁగల బలాబలము తెలిసికొనవలయును. నుమ్మాదుఁడయినను వైరము కలిగినపిదప వాని యందు నమ్మిక యుంపరాదు. కొట్టలం దగ్గి మూఢముగా నుండునట్లు వైరము వారియందుఁ బ్రచ్ఛన్నముగా నుండును. వైరమనెడునగ్ని ధనము లిచ్చినను బరుసములాడినను మంచి మాటల బుజ్జగించినను చదువులు చదివియున్నను సముద్రమునందు బడబాగ్నియుంబోలెఁ జల్లారదు. ఒకతూరి యపరాధమువలనఁ బుట్టిన వైరాగ్ని యొకమాటు దరికొనెనా, రాజా! యిరు దెసలలో నొకనిని గాల్చిపుచ్చక పొనుఁగువడదు. ఒకఁడు మఱి యొకనికపకారముచేసియున్నచోపిదప దానెంతధనములిచ్చియు

---

* ఇందు మొదటికారణమువలన వైరము కృష్ణకిని పాలురకును, రెండవ దానిచే కారపపాండవులకును, మూఁడవదానిచే ద్రోణద్రుపదులకును, నాలుగవ దానిచే పిల్లియెలుకలకును, ఐదవదానిచేఁ బూజనికిని బ్రహ్మదత్తునకును గలిగినవని తెలియునది.

సమ్మానములుచేసియుఁ బూజించినను నామతియొకనియందుఁ జెలిమిగాని నమ్మికగాని గలిగియుండరాదు. అపరాధకర్మమే యుపకారము చేసినవానికి జంకు గలిగించుచున్నది. నీకు నే నెప్పుడు నపకారముచేయలేదు. నీవును నాకెప్పుడు నపకారము చేయవు. ఈకారణమును బట్టి నేను నీయింటి వసించియుంటిని. అదంతయు నిపుడు మాతిపోయినది. ఇప్పటికి నిన్ను నమ్మఁజాల నయ్యెదను' అనెను.

బ్రహ్మదత్తుఁడు 'కాలమే యొకొ్కక్కకార్యమును జేయుచున్నది. కార్యములు వెక్కువిధములు. అవియన్నియు కాలముచేతనే నడచుచున్నవి. కాఁబట్టి యెవఁడెవనికి నపరాధము చేయుచున్నాఁడు? జన్మమును మరణమును నొక్కవిధమునఁ గలుగుచున్నవి. ప్రాణులు కాలముచేత (కార్యములు) చేయింపఁబడుచున్నవి. (పుట్టుచుఁ గిట్టుచున్నవి) అవి జీవము దూలుటకును గాలమే నిమిత్తము. కొన్ని యొకొ్కమ్మడినే గిట్టుచున్నవి. కొన్ని యొకొ్కటిగా గిట్టుచున్నవి. కొన్ని చాలఁగాలము బ్రతుకుచున్నవి.నిప్పు కట్టియలను గాల్చునట్టె కాల మన్నిటిని గబళించుచున్నది. ఈభాత్తురాలా! నేను నీదుఃఖమునకు నిమిత్తము గాను; నీవు నాదుఃఖమునకుఁ గావు. కాలమే దేహధారులకెల్ల నిత్యమును సుఖమును దుఃఖమును నేర్పఱుచుచున్నది. కనుక నీ విచట నీయిచ్చచొప్పున నాయందు నెయ్యము తియ్యము గలిగి యేబాధయునొందక వసించియుండుము. నీవు చేసినది క్షమించితిని. పూజనీ! నీవును నన్ను మన్నింపుము' అనెను.

పూజని 'కాలము నీవు చెప్పిన ట్లన్నిటికిని కారణమగునేని, యొకనికి మఱొక్కనియందు ద్వేషముగలుగదు. బంధుప్రులు తమబంధులు చంపఁబడినయెడల నేల యట్లు చంపినవారివైఁ బగతీర్చుకొనఁ జూచెదరు? దేవతలును ననురులును నందఱును నొకరి నొకరేల తొల్లి కొట్టుకొనిరి? కాలముచేతనే సుఖదుఃఖములును జనన మరణములును గలుగునేని, వైద్యులెందులకు రోగులకు మందులు సేయఁగోరెదరు? కాలమే దేనిని బరిపక్వము చేయునదేని నందులేల? జనులు శోకమున మూర్ఛితులై (మైమఱచి) యేల మిక్కిలియు బిట్టుగాఁ బలవించెదరు. కాలము నీవుచెప్పిన ట్లన్ని కార్యములకుఁ గారణమగునేని, ధర్మకర్మములు చేయువానికే ధర్మముకలుగుట యెట్లు? నీకొడుకు నాకూనను జంపినాఁడు. నే నందులకు వానిని హింసించితిని. రాజా! ఇఁక నేను నీవు బాధించుటకుఁ బాత్రమనయితిని. నేను బుత్ర శోకముచేత నీకొడుకునం దిట్టి పాపముచేసితిని గదా; కావున నీకు నన్ను నన్నుఁ గొట్టవలసిన దయ్యెను. అందులకుఁగల కారణ మును గలరూపున వినుము. మనుష్యులు భక్షించుటకో లేక వేడుకగాఁ బంజరములఁ బెట్టుకొనుటకో పిట్టలను గోరుదురు. వధించుటయు బంధించుటయుఁ దప్ప మూఁడవకారణము మఱి యొక్కటి తగినదిలేదు. పశువులు కొన్నివధమునకును బంధమున కును వెఱచి తప్పించుకొని పాఱిపోవు నుపాయము నాశ్రయించు చున్నవి. వేదవిదులగువారు దుఃఖము పుట్టుకవలనను జావువల నను గలుగునందురు. అందఱికును ప్రాణములుతీపు. అందఱికును గన్నబిడ్డలయందు గారాము. అందఱును దుఃఖమునకు వెఱతురు. అందఱును సుఖమునకే యువ్విళ్లూరుదురు. బ్రహ్మహత్యా! దుఃఖ

మునకుఁ గారణములు వెక్కుఁగలవు. ముదిమి దుఃఖము. ధననా శము దుఃఖము. అనిష్టమగువానితోఁ గూడియుండుట దుఃఖము. ఇష్టములగువాని నెడఁబాయుట దుఃఖము. వధమువలనను బంధ మువలనను దుఃఖముగలుగుచున్నది; స్త్రీవలనను దుఃఖముగలుగు చున్నది; సహజములయిన కారణములవలనను నదిగలుగుచున్నది. పుత్రమరణమువలనఁ గలుగుదుఃఖ మెప్పుడునుజనులను జుట్టుకొని యుండును. పరులకు దుఃఖము కలుగుటవలనఁ దమకు దుఃఖము లేదని బుద్ధిలేనివారు కొందఱు పలుకుదురు. ఎవఁడు దుఃఖమును బొంది యెఱుఁగఁడో వాఁడే మహాజనుల నడుమ నిట్లు వదరును గాని, యెవ్వఁడు దుఃఖమునఁ బీడితుఁడయి శోకమునెఱుంగునో వాఁడిట్లేల పలుకఁదలంచును? సమస్తవిధములయిన దుఃఖము లను జక్కఁగాఁ జవిచూచినవాఁడు తనదుఃఖమునం దెట్లో యట్లే పరులదుఃఖమునందును శోకించును. రాజా! నీవు నాకేమి చేసితివో, మఱి నేను నీకేమిచేసితినో, వీనిని మాయఁజేయుటకు నూఱేండ్లయినను జాలవు. మనము పరస్పరమిట్లు చేసినపిదప సంధి పొసఁగదు. నీవు పుత్రునిఁ దలఁచుకొనుకొలఁదిని నాయందు వైరము క్రొత్తఁగాఁ గలుగుచుండును. ఒకఁడొకనిపయి వైర మును దీర్చుకొన్నపిదప వానితోఁ బ్రియముగావించుకొనఁగోరె నేని యాయిరువురకు, మట్టికుండ పఱియలొకటిగాఁ గూడికొన నేరనియట్లు, సంధి కలుగఁజాలదు. నమ్మిక సుఖము గలిగింపఁ బడుట సర్వశాస్త్రములయందలి సిద్ధాంతము. తొల్లి శుక్రుఁడును రెండుగాథలనుఁ బ్రహ్లాదునికిఁ జెప్పెను. అవి యేవనఁగా—శత్రువు చెప్పుమాటలు సత్యమయినను, నసత్యమయినను

నెవఁడు నమ్మునో వాఁ * డొండుగడ్డి గప్పియున్నగోతిలో నున్న తేనెను నమ్మి దినునట్టివారుంబోలె నాశమునొందును. వైరములు,కులమందుఁ బదియుగము లయినను జల్లాఱవు. ఆకులమందుఁ బుట్టియున్న పుత్రులకుఁ దమపూర్వుల వైరమును దండ్రులు చెప్పుచునుందురు; (కానయది తరములబడి సాఁగుచునే యుండును) అనుటయే. రాజులు వైరముల నడంచుకొని మొదట మంచి మాటలు పలుకుచుందురు; పిదప సమయముఁ రాఁగా నిండినకుండను ఛాతిమీఁదనైచి పఱియలు గావించునట్లు వాని నుఱు ముదురు. రాజా ! 'ఈలోకమందు రా జొకనికిఁ గీడుచేయునేని, పిదప వానిని నెప్పుడును నమ్మరాదు; ఒకని కపకారము చేసినపిదప వాని నమ్మినచో దుఃఖము పాలగును'అనెను. అందులకు బ్రహ్మదత్తుఁడు 'ఒకరియందును విశ్వాసము లేకుండిన యెడల నర్థమును సేకరింపఁదరముగాదు; ఒకటియుఁ జేయ శక్యముగాదు. ఎప్పుడు నొక్కరూపున భయమే పడుచుండువాఁడు చచ్చినవానికి సాటియగునే' యనెను. పూజని 'ఎవనికి నడుగులు పుండ్లుగలవియో వాఁడు పరుగిడునేని యెంతమెలఁకువతో నట్లు చేసినను వానికాళ్లు పడి నొవ్వకమానవు. ఎవ్వనికిఁ గన్నులు తెవులుగలిగియుండునో వాఁ డాకన్నులను గాలికెదురుగాఁ బట్టి చూచునేని, యాకన్నులకు గాలిచేత మిక్కిలియుఁ దెవులు తప్పకకలుగును. ఎవఁడు తనబలము దెలియక చెడ్డమార్గమునఁ బోవ సమకట్టి యట్లు యెడతెగక పోవునో,వానిబ్రతుకును దుద

* కొండలయందుఁ దేనెను వెదకుచుఁబోవువాఁడు తేనెటీఁగలు పోవుదారియందే కన్నుగలిగి యుండుటచే నందలిగోతులు మొదలగు వానియందుఁబడి కెడయుట గలదు. (ప్రతాపచంద్ర.)

ముట్టించుకొనును. సేద్యగాఁడెవఁడు వర్షమును దెలిసికొనక పొలమును దున్ననో వాఁడు తనప్రయత్నమంతయుఁ జెడఁగా నందులకు ఫలమును బొందకపోవును. ఏమనుష్యుఁడు ప్రతిదినమును దనకు హితమయిన (పోషకమైన) యూహారమును, (అది చేఁదుగనో, యొగటుగనో, కమ్మగనో, చీయగనో, యెట్లుండినను లోఁగొనునో వాఁడు చిరాయువు గలిగియుండును. ఎవఁడు తనకుఁ బథ్యమయిన యూహారమును దెలివిలేమివలన విడిచి దుష్టమయిన భోజనమును, దానివలని ఫలమును దెలిసికొనక కుడుచునోవాని జీవిత మంతటిలోఁ దుదముట్టును. డైవమును బురుషకారమును నొకటి నొకటి యాశ్రయించుటచే నెలకొనియుండును; అట్లాశ్రయింపనిచో నెలకొనఁజాలవు. గొప్పరకమువారు పురుషకారమునే యనువర్తింతురు. మగతనము లేని పందలే (పాటుపడక) డైవము నొక్కటినే నమ్మియుందురు. తీక్ష్ణమో, మృదువైనదో, తనకు హితమయిన కార్యమును దప్పక చేయవలయును. స్వభావముచేఁ బాటుపడకుండు నట్టివాఁడు తుదకుఁ గానునులేక యెప్పుడును నర్థములఁబారిఁ జిక్కియుండును. * కాఁబట్టి సంశయింపఁదగినట్టి కార్యమందును బౌరుషమునే కావింప వలయును. మనుష్యులు తమకుఁ గలయంతయు నయినను దిగవిడిచి యాత్మహితమును గావించుకొనవలయును. విద్య, శౌచము, సామర్థ్యము, బలము, శౌర్యము ననెడి యీయైదును దోడఁబుట్టిన మిత్రములందురు. బుధులగువారు వీరి సహాయము

* తస్మాత్సంశయితవ్యేఽర్థే కార్యవీక్ష పరాక్రమః అని (దా. మూ.) తస్మాత్సర్వం వ్యపోహ్యార్థం' అని ఉత్తరగోశములు. సమస్తములయిన విషయములవిడిచి పౌరుషమే కావింపవలయునని యర్థము.

ననే యీలోకమందుఁ గాలమువుత్తురు. గృహములు, రాగి మొదలగు లోహములు, పొలము, భార్య, సుహృత్సమూహము ననెడి యివి శ్రేయమునకు నుపసాధనములుగా బుధులు చెప్పెదరు. మనుష్యుఁడు వీని నెల్లయెడలను బడయవచ్చును. పాఱిజ్ఞుండన్నియెడలను రమించుచుండును: అతఁడన్నియెడల వెలుంగుచుండును. అతఁడు దేనికి బెదరుపుట్టింపఁడు. బెదరుపుట్టించినను భయమొందఁడు. బుద్ధినుంతుఁడగువానికిఁ గలధనమెంత యల్పముగానుండినను నిత్యమును పెరుఁగుటతప్పదు. అట్టివాఁ డొక్కొక్కకార్యమును నేర్పుతోఁజేయును. సంయమమువలన (ఆత్మనిగ్రహమువలన) నతఁడు మంచిప్రతిష్ఠ నొందును. గృహస్థవృత్తియందలి నెయ్యమునకులోనై యల్పబుద్ధులగు మనుష్యుల మేనిమాంసములను గుత్సితస్త్రీ, యాఁడుకొండ్రిని దానిపిల్లలుం బోలెఁ, దినివైచును. కొందఱు మనుష్యులు బుద్ధితడఁబడుట వలనఁ దమయిండ్లను విడువఁగలిగినచో మిక్కిలియు సొంపుగుంది 'నాయిల్లిది, నాభూములు, నామిత్రములు, నాదేశము, వీనినెట్లు దిగవిడుతు' నని డిందుపడుచున్నారు. * ఒకఁడు తన స్వదేశము వ్యాధిచేతను దుర్భిక్షముచేతను బీడితమైయున్నచో దానిని దప్పక విడువవలయును. ఒకఁడు తనదేశమందు నెప్పుడును నందఱిచేతఁ బూజితుఁడై వసించియుండవలయును. అట్లుగానిచో మఱియొక దేశమునకుఁబోయి వసింప

---

* 'ఉత్పతేత్సహజాద్దేశా ద్వ్యాధిదుర్భిక్ష పీడితాత్' అని కొ. మూలము. "ఉత్పతాచ్చ విమానాచ్చదేశాద్దుర్భిక్షపీడితాత్' అని (దా. మూలము.) తప్పదానినుండియు నపమానముగల పట్టునుండియు కష్టములగల దేశమునుండియు నని యర్థము తెలియునది.

వలయును. ఈకారణమునుబట్టి నేను మఱియొకచోటికిఁబోయె దను. నే నిక్కడ నుండుటకెంతమాత్ర మొల్లను. ఏలన నేను నీ పుత్రునకు గొప్ప నేరముగావించి యున్నాను. చెడ్డయిల్లాలిని, చెడ్డపుత్రుని, చెడ్డరాజును, చెడ్డసుహృదుని, చెడ్డచుట్టమును, చెడ్డ దేశమును దూరమునసే విడువవలయును. చెడ్డమిత్రునియందు విశ్వాసముండదు. చెడ్డభార్యయందు రతియెక్కడిది. చెడ్డ రాజ్యమందూఁటగలుగదు. చెడ్డదేశమందు బ్రతుకుఁదెరువుం డదు. చెడ్డపుత్రునియందు మంచిమనస్సుగలుగదు. చెడ్డసంబంధ మందు ధనమునకు నాశముకలిగినచో నవమానము కలుగును. ఎవ్వతి ప్రియముగఁ బలుకునో యదిభార్య. ఎవనివలన సుఖముగలు గునో వాఁడు పుత్రుఁడు. ఎవనియందు విశ్వాసముదగునో వాఁడు మిత్రుఁడు. ఎచ్చట బ్రతుకుగలుగునో యది దేశము. ఎవఁడు నిర్బంధింపఁడో, బీదలను బోషించునో, ఎవనిరాజ్యమందు భయ ముగలుగదో, వాఁడు దిట్టమయినశాసనము గలరాజు. రాజు గుణవంతుఁడును ధర్మమును జరుపువాఁడునై యుండునేని భా ర్య, దేశము, మిత్రులు, పుత్రులు, సంబంధులు, బంధులు నందఱు నొకనికి సుఖముగాఁ బడయనగును. రాజు ధర్మమును బాటింప కేని యతని దేశమందలి ప్రజలు, నిగ్రహమువలన (పీడనము వలన) నశింతురు. పరాకులేక పరిపాలించునట్టి రాజే ధర్మార్థ కా మములకుమూలము. రాజు ప్రజలవలననుండి ఫలమునం దాఱవ పాలు పన్నుపుచ్చుకొని యుపయోగించుకొనవలయును. ప్రజ లను జక్కఁగాఁ బరిపాలింపని రాజు నిజమునకు దొంగయె. ఏ రాజు, అభయమొసంగి, పిదప ధనమందలి పేరాసవలన దాని నెఱవేర్పఁడో యా యధర్మబుద్ధి ప్రజలందలిపాపములను దాను

గయికొని తుదకు నరకమునుబొందును. ఏరాజు,అభయమొసంగి యశ్లి దానిని నెఱవేర్చునో యతఁడట్లు ప్రజలను ధర్మంబునఁ బరిపాలించుచుండుటవలన సర్వసుఖావహుఁడని యెన్నఁబడును. రాజు తండ్రియు, దల్లియు, గురువును, రక్షకుఁడును, అగ్నియుఁ, గుబేరుఁడును, యముండు నగునని యతనికి నీయేడుగుణము లను బ్రజాపతియగు మనువుచెప్పెను. రాజు ప్రజలయెడఁ గనికరముతోఁ బ్రవర్తించునేని యతఁడు వారికెల్లఁ దండ్రియగును జుమీ. అతనియొద్దఁ గపటముగా వర్తించునట్టి మనుజుఁడు మఱుసటిజన్మమునఁ దిర్యక్కుగాఁ బుట్టును. ప్రజలకు మేలు సేయుచు, బీదలను బోషించుచుండుటవలన రాజు వారలకుఁ దల్లియగుచున్నాఁడు. దుష్టులను గార్చుటచే నగ్నియనియు, అహితులఁ బడంచుటచే యముఁడనియు నెన్నఁబడుచున్నాఁడు. ఇష్టులయినవారికి ధనములొసంగుటవలన రాజు కామముల నిచ్చు కుబేరుఁ డగుచున్నాఁడు. ధర్మముల నుపదేశించుటవలన గురుండును బరిపాలించుటవలన రక్షకుండు నగుచున్నాఁడు. పురజనులను దేశజనులను దనగుణములచే నెవఁడు రంజించునో యతఁడు రాజనుటకుఁ దగియుండుటకాక యట్టిగుణములను ధర్మములను బాలించుటవలన నతనినుండి రాజ్యమును వీడదు. ఎవఁడు పౌరజనులను దేశజనులను బూజించుట లెస్సగాఁ దెలియునో యతఁ డిహమందును బరమందును నేకీడునొందక సుఖముగా నుండును. ఎవ్వని ప్రజలు బరువయిన పన్నులచేఁ బీడితులయ్యి నతనికి నెల్లపుడును భయపడుచును, అనర్థములచేతఁ గ్రుంగుచును నుందురో,యారాజు ప్రజలచేత నోటువడును.ఎవ్వని ప్రజలు సరస్సునందుఁ దామరలుంబోలె వర్ధిల్లుచుందురో యా

రాజు సర్వసుఖావహుఁడని వాసికెక్కుటయె కాక స్వర్గలోకమం దెంతయుఁ బూజితుఁడగును, రాజా! బలవంతునితోడ విగ్రహ మొకప్పుడును గొనియాడఁదగదు. బలవంతునితోడ విరోధము గలరాజునకు రాజ్యమెక్కడిది? సుఖముగాని యెక్కడిది?' అనెను.

భీష్ముఁడు 'ఆపత్తి బ్రహ్మదత్తున కిట్లుచెప్పి యతనిచేత నీ డ్కోలు వడసి తనయిష్ట మునుసనదిక్కునకుఁ బోయెను. బ్రహ్మ దత్తునకును బూజనికిని జరిగిన యీ సంభాషణమును నీకుఁ జెప్పి తిని. ఇంకను మతెద్ది వినఁగోరెదవు?'అని యడిగెను. ఇది నూట ముప్పదితొమ్మిదవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

{భీష్ముఁడు శత్రుంతపునకు భరద్వాజుఁడు చెప్పిన యాపద్ధర్మమును ధర్మరాజునకుఁ జెప్పుట.}

ధర్మరాజు 'యుగము క్రమముగాఁ గడచిపోవుటవలన ధర్మ మును జనులును నలుగడల క్షీణింపఁగా లోకము దొంగలచేఁ బీడింపఁబడుచుండఁగా నపుడు రా జెట్లుండవలయును?' అని యడిగెను.

భీష్ముఁడు 'భారతా! అట్టి యాపదలందు రా జెట్టినీతిని బూన వలయునో, దయ సయితము దిగవిడిచి యెట్లు నడచుకొనవల యునో, నీకుఁ జెప్పెదను. ఈ విషయములందు శత్రుంతపుఁ డను రాజునకును భరద్వాజమునికిని జరిగిన సంవాదమయిన యీయితిహాసమును నుదాహరించుచున్నారు. సౌవీరదేశమునకు

శత్రుంతపుఁ డనురా జుండెను. అతఁడు మహారథుఁడు. అతఁ డొకప్పుడు భరద్వాజునికడకుఁ బోయి యర్థ (ధన) శాస్త్రముల సిద్ధాంతముల నడుగువాఁడై 'లభింపకున్న వస్తువు లభించుట యెట్లు? లభించినదానిని బెంచుటయెట్లు? వెంచినపిదప దానిని రక్షించుటయెట్లు? రక్షించినపిదప దాని నుపయోగించుట యెట్లు?' అని యడిగెను. అర్థవిషయమయిన నిర్ణయముల నిట్ల డుగఁగా మతిమంతుఁ డాబుషి సహేతుకములైన యుత్తమ వాక్యముల 'రాజెప్పుడును దండమును జేతఁగొని యుండవల యును. ఎప్పుడును బొరుషమును మెఱయుచుండ వలయును. తనయందు ఛిద్రములు గలిగించుకొనక పరులయందలి ఛిద్ర ములను గనుఁగొనుచుండవలయును. పరులయందలి సందులను వెంబడించి పయినెత్తవలయును. దండమెప్పుడును బూనియుండు రాజునకు జనులెంతయు వెఱతురు. కాఁబట్టి సమస్తములయిన ప్రాణులను దండముచేతనే యడంచి యేలవలయును. తత్త్వ దర్శులగు పండితు లీదండమునే కొనియాడెదరు. కాఁబట్టి యీ నాలుగింటియందును (అనఁగా సామదానభేదదండములయందు) దండమే ప్రధానమయినదని చెప్పఁబడుచున్నది. ఒక పట్టునకు (రాజ్యమునకు) నాధారములయినవి నశించినచో దానిని నా శ్రయించి బ్రతుకు నవియెల్ల హితము లగుచున్నవి. ఒక పెద్ద మ్రానివేళ్లను నఱికినయెడల దానికొమ్మలెట్లు నిలిచియుండును? పండితుఁ డగురాజు భగవానిమూలమునే మొదటఁ ద్రెంపవల యును. పిదప వానిసహాయులను దక్కినవాని పక్షమువారిని నందఱను గూల్పవలయును. ఆపద వచ్చినకాలమందు రాజు ముందువెనుక విచారింపక, చక్కఁగ నాలోచించుటయు,

చక్కఁగాఁ బరాక్రమించుటయు, చక్కఁగయుద్ధముసేయుటయు, వలయునేని లెస్సఁబాఱిపోవుటయుఁ గావింపవలయును. రాజు వాక్కునందుమాత్రము వినయముగలిగి యుండవలయునుగాని హృదయమందు మంగలిక త్తివలె వాఁడిగలిగి యుండవలయును. మఱియుఁ గామకోధములనువర్జించి మెత్తఁదనముతో మాటలాడవలయును. శత్రువుతోఁ గూటువగలిగి యుండవలసివచ్చినపుడు మంచిబుద్ధిగల రాజు వానితోసంధిచేసికొని వానియందు గ్రుడ్డినమ్మిక యుంపకుండవలయును. వానితోడి పని తీఱఁగానే శీఘ్రముగా వానినుండి మరలవలయును. శత్రువును ముందుమిత్రునింబోలె మంచితిన్ననిమాటలచే బుజ్జగింపవలయును.మఱి వాని వలన నింటియందున్న సర్పమువలనంబోలె భయముగలిగియుండవలయును. ఎవనిబుద్ధి నీబుద్ధికిఁ గీడ్పడినదో వానిని జరిగిన సందర్భములను జూపియు, బుద్ధిపసలేనివానిని రాఁగల సందర్భములను నమ్మఁజెప్పియు, మేలయిన బుద్ధిగలవానిని నప్పటికిఁదగిన సమాధానములఁ బన్నియు సమాధానపఱుపవలయును. ఐశ్వర్యమును గోరునట్టివాఁడు, వలయునట్లు చేమోడ్పును, బ్రతిజ్ఞను, మంచి చల్లనిమాటలను, తలవంచి యభివాదనము సేయుటను, కన్నీ రొలికించుటను గావింపవలయును. కార్యము సమకూడువఱకును నొకఁడు తనశత్రువును మూఁపుమీఁద మోచియుండవలయును. కాలమువచ్చినపు డాశత్రువును రాతిమీఁదఁ గుండను వైచి పగుల్చునట్లు దుత్తునురు గావింపవలయును. రాజేంద్రా! రాజు ముహూర్తముసేపయినను దుమ్మికి కొఱివివలె ధగధగజ్వలించుట లెస్స;కాని,చిరకాలము నుముక నిప్పువలె జ్వలింపక పొగయుచు మాత్రముండుట తగదు.తాను గ్రుత్తఘ్నుఁడగు

వానికిఁ బెక్కులు ప్రయోజనములు గావింపవలసియున్నను, అట్టి వానితోఁ నట్టిప్రయోజనమొడఁగూర్చునట్టిసంబంధమును గూడఁ బెట్టుకొనరాదు. ఏలనఁగా(అట్టివాని)ప్రయోజన మీఁడేర్చినచో, సుఖ మనుభవింప శక్యమగును. అది యెనఁగూర్పనిచో నవమానమే కలుగును. కాఁబట్టి యట్టివాని కార్యములు చేయవలసినపుడాకార్యములనెల్లఁ గొంచెము గడమగలిగి యుండునట్లు గానే చేయింపవలయును గాని బూర్ణముగాఁజేసి తీర్పరాదు. రాజు * కోకిల, పంది, మేరుపర్వతము, పాడిల్లు, † పాము, భక్తుఁడగు నెయ్యుఁడు ననువీరలవలెఁదన కేదిశ్రేయమో చేసికొనవలయును. మఱియు నిత్యమును బెందలకడ లేచి యెచ్చరికతప్పక శత్రువునింటికిఁబోయి యతనిని గుశలముగా నుండినను గుశలమాయని యడుగుచుండవలయును. సోమరిపోతులు ధనమును బడయఁ

---

* కోకిల తాను బోషింపింపవలసిన వానిని మఱియొకదానిచేతఁ బోషింపించునట్లు రాజు తనకృషి, వర్తకము, మార్గము, అడవులు మొదలయినచోట్లను గల తనధనములను నితరులనుగాని పోషింపఁ బలయును. (లేక మిత్రులనుగాని ప్రజలనుగాని యితరులనుగాని పోషింపవలయును.) పంది భోజ్య వస్తువులను మూలముతో బెల్లగించునట్లు రాజును శత్రువులను మూలముతోఁ బెకల్పవలయును. మేరువువలె రాజు చలింపకయు నుల్లంఘింప రాకయు నుండవలెను. శూన్యగృహమునకు సంపదలు రావలయునని కోరునట్లు రాజును ధనములను గోరుచుండవలయును. సర్పమువలె రాజు వైరమునశింపక యుంచుకొని యుండవలెను. భక్తిగల మిత్రునింబోలెఁ దన్ను సంబంధించిన వారల క్షేమములకై పాటుపడుచుండ వలయును.

† 'పాము' మాఱు 'నటుఁ'డని ఉత్తరప్రతులు. (నటుఁడనుపాఠమున నటునివలె నానారూపములు సందర్భాను గుణముగఁ బూనుచుండవలయును)

జాలరు ; మగతనము లేని పందలును, మిక్కిలి విడంబముగల వారును బడయఁజాలరు. లోకుల యాడికకు భయపడువారును విడిచి విడిచిపనిఁబూనువారును(దీర్ఘసూత్రులును)ధనమును బడయ నేరరు. రాజు తన ఛిద్రములను బరులు తెలిసికొనకుండఁ జేయ వలయును గాని, పరుల ఛిద్రములను దాను గనుఁగొనుచుండ వలయును. మఱియుఁ దాఁబేలివలెఁ దన మంత్రాంగములను బదిలముగాఁ దాఁచుకొనవలయును. తనయందలి రంధ్రముల నెప్పుడునుగాచికొనవలయును.*కొంగవలె(నొక యేథ్యానముగాఁ) గార్యములను జరిపింపవలయును. సింహమువలె (భయము లేక) పరాక్రమము ప్రకటింపవలయును. దోఁడేలివలెఁ బొంచు వేసి యుండి బాణమువలెఁ జక్కఁబోయిపడి తునియలు గావింపవల యును. పానము, జూదము, స్త్రీలు, వేట, సంగీతము ననువీనిని దగుకొలఁది ననుభవింపవలయును. వీనియందు మిక్కిలియుఁ దగులువలన దోషముగలుగును. పుల్లును విల్లు జేసికొనవలయును; జింకవలెఁ బరుండి యుండవలయును. గ్రుడ్డివలె నుండవలసి నపుడు గ్రుడ్డిగా నుండవలయును, చెవిటివానివలె నుండవలసినపు డు చెవిటిగా నుండవలయును.సమర్థుఁడగువాఁడు దేశకాలములను బాటించి పరాక్రమము మెఱయవలయును. దేశకాలములను మీఱి మెఱయించినట్టి పరాక్రమము నిష్ఫలమగునే కదా? కాలాకాలములను, బివపఁ దనబలాబలములను జక్కఁగా నిశ్చ యించుకొనియు శత్రువు బలమును దెలిసికొనియు నందులకుఁ దగునట్లు తన్ను పయోగించు కొనవలయును. ఏరాజు దండము

* కొంగ కొలను జలములందుఁ బెద్దయుఁ బ్రొద్దు చేపలకై మిన్నక వేచి యుండుట దెలియునది.

చేత లోపఱచుకొనంబడిన శత్రువును బూర్ణముగా నడఁగఁ ద్రొక్కఁడో యతఁ డశ్వతరిగర్భముంబోలె మృత్యువును దన యందు దాఁచిపెట్టుకొన్న వాఁడగును. రాజు ప్రూవులు లెస్సగా ప్రూయవలయునుగాని పండ్లుపండరాదు; పండ్లు పండినను బయికి నెక్కుటాకలవి గాకుండవలయును; పక్వము గాకుండినను బక్వ మయిన ట్లుండవలయును. రాజిట్లు నడచుకొనునేని యేశత్రువు నకుఁ జిక్కఁ కీడ్పడఁడు. రాజు తన్నుఁగోరువారి కాశలు * బల పఱుపవలయును గాని, వాని నొడఁగూర్చుటకు నడుమ విఘ్న ములు పెట్టవలయును.అతఁ డావిఘ్నములకే ప్రో నిమి త్తములను జెప్పవలయును. ఆనిమి త్తములకును దగిన హేతువుల నిరూపింప వలయును. భయమునకుఁ గారణము రాకుండు నంతవఱకును రాజు భయపడినవానివలె వలయు నేర్పాటులన్నియుఁ జేసికొన వలయును. భయకారణము నిక్కముగా వచ్చునపు డతఁడు నిర్భ యముగా పైఁబడి కొట్టవలయును. సాహసము నూఁదక శుభ ములు మనుష్యునకుఁ గలుగవు. మఱియు సంశయముల నడుమఁ జొచ్చియుఁ దనప్రాణముల నిలఁబెట్టుకొనునేని శుభములను బొందును. రాజు రానున్నభయములను ముందుగాఁ దెలిసికొన వలయును. అవి వచ్చియున్నపుడు వానిని దొలఁగఁ బుచ్చవల యును. అవి మరలఁ బెరుఁగునోయని శంకించి వానిని నడంచిన పిదప సయితము వాని నడంపకుండునట్లు భావింపవలయును. అప్పటికి సమకూడియున్న సుఖమును దిగవిడుచుటయు, నిఁక

* 'ఆశాంబలవతీం కుర్యాత్' అని ఉత్తరకోశములపాఠము. 'ఆశాం కాల వతీం కుర్యాత్' అని దా. మూలము. కాలమునకుఁ దగిన ట్లాశ గొలుపవలయు నని యర్థము.

రాగల సుఖమున కువ్విళ్లూరుటయు బుద్ధిమంతులగువారికి నీతి గాదు. ఏ రాజు శత్రువుతో సంధిచేసికొన్న పిదప వాడేమియుఁ జేయఁడని నెఱనమ్మకముతో హాయిగా నిదురించునో వాఁడు చెట్టుకొనవై నిదురించి క్రిందఁబడినవెనుక లేచునట్టివానికి సాటి యగును. తాను దీనత్వము నొందినపుడు మృదుస్వభావుఁడో, క్రూరమో, యే దేనియొక కర్మముచేతఁ దన్నుద్ధరించుకొనవలయును. అట్లు ద్ధరించుకొని, సమర్థుఁడయినపుడు, ధర్మమును జేయవలయును. రాజు తనశత్రువులకు శత్రువులగువారి నందఱను గారవించి యనువర్తింపవలయును. అతఁడు (తనచారులనే శత్రువు లేర్పఱచుకొన్న మనుష్యులుగాఁ దెలియవలయును) తనచారునిని బరులకుఁ దెలియకుండునట్లు చేయుటయే కాక తనచారులను బరులచారులను జక్కఁగా గుఱు తెఱింగి కొనవలయును. పాషండులు తాపసులు మొదలగువారిని జారులను గావించుకొని పర రాష్ట్రములకుఁ బంపవలయును. ధర్మమును జెఱుపువారును బాపులును లోక కంటకులును నగు దొంగలు తోఁటలయందును, విహారస్థలములందును, జలి పఁదిళ్ల యందును, చావడుల యందును, పానశాలలందును, జనులు గూడుచోటులందును, దీర్థములందును, సభలందును వత్తురు. వారలనుగని పెట్టి యుడఁచి పుచ్చవలయును; దొంగతనము లేకుండునట్లును గావింపవలయును. విశ్వసింపఁ దగనివానిని విశ్వసింపరాదు. విశ్వసించిన వానిని మిక్కిలిగా విశ్వసింపరాదు. విశ్వాసమువలన భయము గలుగుచున్నది. పరీక్షింపక యు విశ్వసింపరాదు. శత్రువునకు నిజముగాఁ జూపట్టి హేతువులచేత నమ్మించి వాఁడు తనపట్టు నుండి యించుక చలించినతెఱపిని వైఁబడి కొట్టవలయును.

శంకింపఁ దగనివానియందును శంకగలిగి యుండవలయును. శంకిం పఁదగువారినో యెప్పుడును శంకించు చుండవలయును. ఎవని యఁదు శంక లేకుండునో యట్టివాని వలననుండి కలుగుభయము వేరుతోడఁ ద్రెంచివైచును. ఎచ్చరిక చేతను, మౌనముచేతను, కాషాయములచేతను, జటా వల్కలములు ధరించుటచేతను, శత్రువును నమ్మించి సమయము వచ్చినపుడు తోఁడేలివలెఁ బైపడవలయును. పుత్రుఁడో, తోఁబుట్టువో, తండ్రియో, స్నేహితుఁడో, యెవరుగానుండినను నర్థమునకు విఘ్నముచేయు చున్నట్టివారిని సంపద గోరునట్టివాఁడు చంపి తీఱవలయును. మిక్కిలియు గర్వమునఁ గన్నుఁగానకయు, కార్యాకార్యములను దెలియకయు దుర్మార్గమున వర్తించుచుండు వాఁడు గురువయి నను వానిని దండించుట యావశ్యకము. వాఁడి ముక్కుఁగల పిట్టలు తాము వ్రాలెడి చెట్లయందలి పూవులను బండ్లనును గొంతికివైచునట్లు రాజు లేచి యెదుర్కొని యభివాదనములు చేసియు నేదేని కొంచెమిచ్చియు మిక్కిలియుఁ బూజించి తుదకు శత్రువు సర్వస్వమును బుచ్చుకొనవలయును. పరుల మర్మావయవ ములను భేదింపకయు, దారుణమయిన కార్యములు చేయకయు, జాలరివానివలెఁ బట్టిచంపకయు, గొప్పయైశ్వర్యమును బొందుట శక్యముగాదు. పుట్టుక చేతనే శత్రువైనదియు లేదు; మిత్రమైనది యు లేదు. ఉభయులకు సమమయినయొక ప్రయోజనము పొసఁ గుటంబట్టి మిత్రులును శత్రులును గలిగెదరు. శత్రు వగువాఁడు దీనముగా నెంతపలవించినను వానిని విడిచిపెట్టరాదు. వానియెడల జాలిపడరాదు. పూర్వ మపకారము చేసినవానిని జంపవలయును. సంపదనుగోరునట్టిరాజు తనకు వలయునన్ని మనుష్యులను జేరఁ

దీసికొనుటయేకాక వారికి మంచి సేయుచుండవలయును. నుతి ప్రజలయెడ నడచుకొనునపు డసూయపడకుండవలయును. దుష్టులను బ్రయత్నపడి యడంచుచుండవలయును. కొట్టఁబోవునపుడు నింపుగనే పలుకవలయును. కొట్టిన పిదపను మిక్కిలి యింపే పలుకవలయును. కత్తిచేతఁ దలనఱికినపిదప నందులకై దుఃఖింపను నేడువను వలయును. సంపదను గోరునట్టి రా జితరులను మంచి మాటలచేతను, సమ్మానములచేతను, దానములచేతను రాఁబట్టుకొనవలయును. ఇట్లతఁడు మనుష్యులను దనసేవకుఁ దెచ్చుకొనవలయును. రాజు వ్యర్థములయిన వైరములు వెట్టుకొనరాదు. ఏటిని దన రెండుచేతులనే కొనియీఁదరాదు. పశువుల కొన్నులను దినుట పనికిమాలినది. మఱి దానివలనఁ బుష్టియుఁగలుగదు. పండ్లువిఱిగిపోవుటయేకాక దానివలన రసమును బుట్టదు. ధర్మార్థకామములకు మూఁడువిధములయిన పీడలును మూఁడనుబంధములును గలవు. అనుబంధములను జక్కఁగాఁ దెలిసికొన్నచో బీడలను బరిహరించు కొనవచ్చును. ఋణశేషమును, అగ్నిశేషమును, శత్రుశేషమును నట్లె నిలిపియుంచిన యెడల మాటిమాటికిఁ బెరుఁగుచుండును. కాఁబట్టి వీనినెల్ల నిశ్శేషము గావింపవలయును. ఋణ మెప్పుడును బెరుఁగుచుండును గాన, దానిని నిశ్శేషముగావించిన నేతప్ప నది నశింపకయె యుండును. ఇట్లే యవమానింపఁబడిన శత్రువులును, నుపేక్షింపఁ బడిన వ్యాధులును గడిందికీడును గలిగించును. ఒక్కొక్క కార్యమును జక్కఁగాఁ జేసి తీర్పవలయును. ఎప్పుడును బరాకుపడకుండవలయును. ముల్లంతటిదికూడఁ జక్కఁగాఁ బెఱికి వైచియెడలఁ జిరకాలము బుడిపి గట్టియుండును. మనుష్యులను

జంపుటవలనను మార్గములను జెఱుపుటవలనను గృహములను నాశముసేయుటవలనను బరరాష్ట్రమును బాడుచేయవలయును. రాజుగ్రద్దవలె (దూర) దృష్టియుఁ, గొంగవలె నిశ్చలత్వమును, గుక్కవలె జాగరూకతయు, సింహమువలెఁ బరాక్రమమును, గాకివలెఁ జంకుఁగొంకును గలిగి శత్రురాష్ట్రములను బాము వలె నులుపుగఁ జొరవలయును. రాజు శూరుని నంజలిచేసియు, బిఱికివానిని భయపెట్టియు, లోభిని ధనమిచ్చియు, సమానుని యుద్ధముచేసియు వశపఱుచుకొన వలయును. శ్రేణీముఖ్యులయందు భేదమును, ననుంగులయినవారిని లాలనమును గావించుటయందుఁ గన్నుగలిగి యుండవలయును. అమాత్యులను భేదపడకుండునట్లును, ఒక్కటిగాఁ గూడికొనకుండునట్లును గాచుచురావలయును. రాజు మెత్తనివాఁడయినచో జనులవమానింతురు; వేండ్రమయినచో భయపడుదురు. రాజు వేండ్రముగనుండఁదగినకాలమున వేండ్రముగను, మృదువై యుండవలసిన కాలమున మృదువుగను నుండవలయును. మృదువైనదానిచేతనే మృదువగువానిని జంపుదురు. మృదువుచేతనే దారుణమయిన దానిని జంపుదురు. మృదువున కసాధ్యమయినదిలేదు. కాఁబట్టి మృదువు వేండ్రమునకంటె వాఁడియందురు. ఏరాజు మృదువుగానుండవలసినపుడు మృదువుగను, దారుణముగా నుండవలయునపుడు దారుణముగను నుండునో యతఁడు కార్యములను సాధించుటయేకాక శత్రువునుగూడ నడంచివుచ్చును. పండితుఁడగువాని విరోధము పెట్టుకొన్నపిదప వానికి దూరముగా నున్నారమని నమ్మియుండరాదు. బుద్ధిమంతుని బాహువులు చేతులు మిక్కిలియు నిడుదలయినవి. కాన దన్ను హింసించినవారిని వానిని

గొని హింసించును. దేనిదరిని దాఁటఁ దరముగాదో దానిని దాఁటరాదు. దేనిని శత్రువు మరల నపహరింపఁజాలునో దానిని హరింపరాదు. దేనివేరును బెల్లగింపఁ దరముగాదో యట్టిదానిని ధ్వంసరాదు. ఎవనితల గూల్ప నలవిగాదో వానిని గొట్టరాదు. అయినను రాజెప్పుడును నిట్లు నడచుకొనరాదు. నే నిప్పుడు విధించిన ప్రకారమును నాపదలయందు మాత్రమే యనువర్తింప వలయును. నీహితమును గోరుటంబట్టి నీవు శత్రువులు దలపడి నప్పు డెట్లు నడచుకొనవలయునో నీకుఁ జెప్పితిని' అనెను.

భీష్ముఁడు - హితార్థియై యాబ్రాహ్మణుఁడు చెప్పినదెల్ల విని సౌవీరదేశపు రాజు మిక్కిలియు సొంపుగల మనసుతో నతఁడు చేప్పినట్లెల్లఁగావించి తాను బంధుసహితముగాఁ బ్రకాశించుచున్నయైశ్వర్యము ననుభవించినవాఁ డయ్యెను. ఇది నూటనలువదియవయధ్యాయము.

ఆ ప ద్ధ ర్మ ప ర్వ ము.

భీష్ముఁడాపత్కాలమందు నభక్ష్యమును భక్షించియైనను నాత్మరక్షణముచేసికొనవలయునని నిరూపించుటకై విశ్వామిత్రసంవాదమును జెప్పుట.

ధర్మరాజు - 'పరమం బయినధర్మము లోకులందఱచేతను నుల్లంఘింపఁబడి కొఱవడినపుడును, అధర్మము ధర్మమయినపుడును, ధర్మ మధర్మ మయినపుడును, మర్యాదలు మిక్కిలియు భిన్నములయినపుడును, లోకమందు ధర్మసిద్ధాంతములు గజిబిజినొంది నను, బ్రజలు రాజులచేతను దొంగలచేతను బీడితులయినపుడును,


అన్నియాశ్రమములవారును స్వకర్మములతెలివి మాలినపుడును, అయ్యెకర్మములు చెడినపుడును, మనుష్యులు నలుగడలఁ గామమువలనను లోభమువలనను మోహమువలనను భయమును గాంతుఁదీనియు, సమస్తజనులు నొండొరుల నెప్పుడును నమ్మక యొకరినొకరు కపటోపాయములచేతఁ జంపుకొనినపుడును, ఒకరినొకరు మోసపుచ్చుకొనినపుడును, దేశమునందెల్ల నిండ్లు తగులఁబెట్టఁబడినపుడును, బ్రాహ్మణులు మిక్కిలియుఁ బీడితులయినపుడును, మేఘములు వానకురియకుండునపుడును, జనులకుఁ బరస్పరము భేదముకలిగినపుడును, భూమియందుఁగల బ్రతుకుఁదెరువులన్నియును దొంగలపాలయినపుడును, నిట్లు మిక్కిలియు నీచమయిన కాలము దాపరించినపుడు పుత్రపౌత్రులను బాలిచేత దిగవిడువ నేరకున్న బ్రాహ్మణుఁడు దేనిచేత బ్రతుకవలయును? భారతా! బ్రాహ్మణుఁడట్టి యాపదయందు నెట్లు నడచుకొనవలయును? అట్లు లోకమంతయుఁ గలుషముకాఁగా రాజు సైతమెట్లు నడచుకొన్న నతఁడర్థమునుండియు ధర్మమునుండియుఁ గొఅవడక యుండును?' అని యడిగెను.

భీష్ముఁడు-'మహాబాహూ! ప్రజలయోగక్షేమములకును, మంచివరములకును, వ్యాధిరోగము మొదలయిన భయములకును మూలము రాజు సుమీ. భరతసత్తమా! కృతము త్రేతద్వాపరము కలి యనువీనికిని మూలమురాజే యని నామతము. ఇందులకు సందియము లేదు. ప్రజలకుఁ గీడును గలిగించునట్టి యాకాలమువచ్చునేని యపుడు తెలివి బలిమి నూఁది బ్రతుకవలయును. ఈవిషయమం దొక మాలపల్లెయందు విశ్వామిత్రునకును మాలవానికిని జరిగిన సంవాదమయినయిపురాతనేతి

హాసము నుదాహరించెదరు. తొల్లి త్రేతాద్వాపరయుగముల సంధియందు దైవవ్యత్యాసమువలన లోకమందుఁ బండ్రెండు సంవత్సరములు భయంకరమయిన యనావృష్టి కలిగెను. త్రేతాయుగము మునిఁగి ద్వాపరయుగ మారంభించిన సమయమందు, త్రేతాయుగమందు మిక్కిలియు వృద్ధిఁజెందియుండిన ప్రజలకు నింద్రుఁడు వానకురియఁడయ్యె. బృహస్పతి వక్రగతిఁ బోయెను. చంద్రుఁడు వేఱువిధముగాఁ దిరిగిన మండలముతో దక్షిణమార్గముగఁ జనెను. రాత్రిముగియఁగా నాకాశమందు నొక్కనలుపును లేదయ్యె. మేఘసమూహము లెక్కడనుండును? ఏరులయందు నీరు మిక్కిలియుఁ దగ్గి యడుగునఁ గొంచెము పాఱుచుండెను. కొలఁకులును నదులును బావులును సెలయేళ్లును, దైవవ్యతిక్రమమువలన శోభ నశించి కంటికిఁ జూపట్టుటయు లేకపోయెను. భూమియందుఁ గొలంకు లెండిపోయెను. సభలును జలపందిరులును దూలినవి. యాగములును వేదాధ్యయనములును నశించినవి. వషట్కారము గలుగదయ్యె. కృషియు, గోరక్షణమును నశించెను. అంగడులను క్రయవిక్రయములు నడుగంచెను. పూర్వాచారము లెల్ల మానెను. పెద్దయుత్సవములు నశించెను. అంతటఁ బెద్దయెమ్ములును జిన్నయెమ్ములు నెరసియుండెను. మఱియు జనుల హాహాకారములు భయము గొలుపుచుండెను. పట్టనములు విశేషముగాఁ బాడుపడియు గ్రామములును గృహములును గాలియు నుండెను. అప్పుడు భూమియందు జనులుఁ గొన్నియెడల దొంగలకుభయపడి విడిచిపోయిరి. కొన్నియెడల నొకరికొకరు భయపడి పలాయితులయిరి. కాన భూమి బహుతరముగా శూన్యమై యుండెను. దేవాలయములు

నశించెను. ముదుసళ్లును బాలురును గానంబడ్డారి. గోవులును మేకలును గొఱియలును నెనుములును లేకుండెను. ప్రాణు లొకటినొకటి గొట్టుకొనుచుండెను. బ్రాహ్మణులు చంపఁబడుచుం డిరి. రక్షకులయిన జనులును హతులయిరి. ఉత్సవములును జన సంఘములును నశించియుండెను. మనుష్యసమూహము చాల వఱకు శవప్రాయములయ్యెను. యుధిష్ఠిరా! ధర్మము నశించి భయంకరమై యున్నయక్కాలమందు మనుష్యులాకటికి రేగి యొకరినొకరు పట్టి తినఁ దొడంగిరి. ఋషులు నియమములను నగ్నిహోత్రములనును దేవతలనును ఆశ్రమములనును దిగ విడిచి యిటునటు పలువగలఁ బాఱిపోయిరి. అంతఁ బూజ్యుం డును బుద్ధిమంతుఁడునయిన విశ్వామిత్రమహర్షి యాఁకలి పయి కొనఁగా నెచ్చోటును గానక నలుదిక్కులఁ బరుగిడఁ దొడం గెను. ఆవిశ్వామిత్రుఁ డగ్నిహోత్రమునువిడిచి యింటిని మాని పుత్త్రులను భార్యను నొకజనసమూహమందు విడిచి భక్ష్యభక్ష్య ములను సమముగాఁగొని సంచరించుచుండెను. అపు డొకసమ యమున నొకయరణ్యమందుఁ గుక్కిరులును బ్రాణఘాతుకులు నగు మాలవారుండుపట్టును గాంచెను. అందుఁ గుండలు చెల్లా చెదరై కుక్కమాంసముల నలంకృతమయి యుండెను. మఱి యుఁ బందులయు గాడిదలయు విఱిగినయెముకలును దల వెంకు లును గుండలును నిండియుండెను.మఱియు నాపల్లెయందుఁ బీనుఁ గుల వస్త్రములు వైవంబడియుండెను. పీనుఁగులపయి వైచిన పూదండ లాభరణములుగా నుండెను. అందు గుడిసెల మోసల లందుఁ బాఁపకుబుసముల మాలికలు గుఱుతులుగా నుంపఁ బడియుండెను. అందుఁ గోళ్లచప్పళ్లును గాడిదల యొండ్రలును

భోరుకొనుచుండెను. జను లొకరితోనొకరు పరుసనిమాటల తో రచ్చలాడుచు నుండిరి. అందు గూబలయెలుంగులును క్షుద్ర దేవతల స్థానములును జుట్టును గలిగియుండెను. ఇనుపగంట లలంకారముగాఁ గట్టంబడియుండెను.కుక్కతండములు చుట్టును బలసియుండెను. విశ్వామిత్రుఁ డట్టిమూలపల్లెయందుఁ జొచ్చి యాఁకటి యురవడిచేత నాహారమును వెదుకఁ దలంపుగొని మిక్కిలియుఁ బ్రయత్నమును గావించెను. ఆతఁ డాపల్లెయందు బిచ్చమెత్తుటకుఁ బోయినను నందు మాంసముగాని యన్నము గాని ఫలమూలములుగాని మఱియెద్దిగాని యొక్కచోటను బడయఁజాలకపోయెను. విశ్వామిత్రుఁడు 'కట్టా ! నాకేమికష్టము దాపరించినది' యని నిశ్చయించుకొని సత్తువతగ్గుటచేత నా మూలపల్లెయందుఁ గ్రిందఁబడెను. రాజసత్తమా! ఆముని 'మన కేదిమంచిది? ఎట్లు న్యర్థనుగాఁ జావకుండవచ్చును?' అని చింతిం చెను. రాజా ! ఆముని యంత మూలవానియింట వాఁ డాయు ధముచేతఁ జంపిన కుక్కమాంసము గ్రుచ్చియున్న యొక్కకట్టి పడియుండఁగాఁ జూచెను. అతఁడు 'ఇప్పు డుసుఱుగాచుకొనుటకు వే ఱుపాయములేదు. ఇపుడు నేను దొంగిలింపవలయును. ఆప త్కాలమం దుత్తములయందును మధ్యములయందును నధములయందును దొంగతనము చేయఁదగినదిగా విధింపఁబడి యున్నది; అట్టి దానిని బ్రాహ్మణుఁ డుసుఱుగాచుకొనుటకుఁ జేయవచ్చుననుట నిశ్చయము. మొదట నధమునివలననుండి ముచ్చిలింపవలయును. పిదప మధ్యములవలననుండి నాక్రమింపవచ్చును. ఈరెండును గలుగకయుండినచో ధర్మాత్ముఁడగుమేటిపురుషునివలన నుండియు ముచ్చిలింపవచ్చును. ప్రాణులను జంపఁ దెగించినట్టి చండాలురు



741. విశ్వామిత్రుఁడు చండాలుని గృహముననుండు కుక్కమాంసము నుపహరించుట.

వీరు; కాన యిట్టివారి మాంసము నపహరించెదను. ప్రతిగ్రహదో షముతప్ప దొంగతనమం దెక్కడను దోషము నాకుఁ గానరాకున్నది. కాఁబట్టి యీనంజుఁడును మృచ్చిలించెదను' అని యపుడాలోచించెను. భారతా! ఆవిశ్వామిత్రమహర్షి యిట్టిబుద్ధిని గొని యెచ్చటఁబడెనో యచ్చట లెస్సగా నిదురించెను. ఆపూజ్యఁ డర్ధరాత్రమగుటను జూచి మాలపల్లెయంతయు నిదురింపఁగా మెల్లగా లేచివచ్చి గుడిసెవాకిటిని దూఱెను. ఆమాలవాఁడు నిదురించుచుండి, కంటియందుఁ బుసిగ్రమ్మియుండ, వికారంబగు నెలుంగుగలిగి, కూర్చిరుఁడై చూడ నసహ్యపడఁదగువాఁడై చూపట్టుచు, 'మాలపల్లె నిదురించుచుండు నపుడు వాఁ డెవఁడు నాకట్టి నాడించువాఁడు? మేలుకొని యున్నాను, నేను నిదురింపలేదు. కూర్చిరుని నిన్నిదో చంపెదను' అనెను. అప్పుడు విశ్వామిత్రుఁ డాదొంగతనముచేత లజ్జగ్రమ్మిన మొగముతో వేగ భయపడి వడఁకుచు, నాచండాలునిఁజూచి 'దీర్ఘాయుష్మంతుఁడా! నేను విశ్వామిత్రుఁడను; ఆఁకలిగొనివచ్చితిని. బుద్ధిమంతుఁడవుగదే. నీవు చక్కఁగాఁ దెలిసికొంటివేని నన్నుఁ జంపకుము' అనెను. విదితాత్ముఁ డయినయమ్మహర్షి చెప్పినది వినఁగానే మాలవాఁడు పడుకనుండి సంభ్రమమున నతనిఁ గూర్చిపోయెను. వాఁడు కన్నులనుండి నీరుదొరుఁగ గారవముచేత నంజలిగీలించి విశ్వామిత్రునితో 'బ్రాహ్మణోత్తమా! రాత్రియందు మీ రేమిచేయఁ దలఁచుచున్నారు'? అని యడిగెను. విశ్వామిత్రుఁడు మంచిమాటలాడుచుఁ జండాలునిఁజూచి 'నన్నాఁకలి పీడించుచున్నది. నాయును తొక్కఁడనో లోన యడంగి మడంగియున్నది. నేను గుక్కతొడను నపహరించెదను. ఆఁకలి గల

వాఁడు దుష్కార్యమందుఁ బొచ్చును. ఆహారమున కువ్విళ్లూరు వానికి సిగ్గుగలుగదు. ఈవిషయమై కటికియాఁకలి నన్ను దోష వంతునిఁగాఁ జేయుచున్నది. కాఁబట్టి కుక్కతోడను దొంగలించె దను. నాయుసుఱు నశించుచున్నది. ఆఁకలిచేత నాయెఱుక తప్పు చున్నది. బలముడిందువడి, తెలివియుంబోయి, భక్ష్యము అభక్ష్య మని భేదముఁగానీఁడక, నేనధర్మమును దెలిసినవాఁడనయ్యుఁ, గు క్కతోడ నపహరించుచున్నాను. మీయింట నేను బిచ్చముఁ బడయనప్పుడు నాకుఁ బాపమందు బుద్ధిగలిగెను. కాఁబట్టి కుక్కతోడను నపహరించెదను. దేవతల ముఖమును, వారికి ముందుఁబోవువాఁడను, బరిశుద్ధముగా నుండుటనుమాత్రము సహించువాఁడను, బ్రభుండు నగు నగ్నిదేవునివలె బ్రాహ్మణుండ నగునేను సర్వమును భక్షింప నర్హుఁడ నగుచున్నాను. నేను ధర్మ ముచొప్పున నుండువాఁడనని తెలియుము' అనెను. ఆచండా లుఁ డావిశ్వామిత్రునిఁజూచి 'మహర్షీ ! నామాట వినుము. విన్న పిదప ధర్మమెట్లు కొఅవడకుండునో యట్లుచేయుము. బ్రహ్మర్షీ ! నీకుఁగల ధర్మమును వినుము. నేనది మీకుఁ జెప్పుచున్నాను. మృగములయందుఁ గుక్కయధమమని తెలిసినవారు చెప్పె దరు. అందును దానిశరీరమందలి తొడయన్నచో మిక్కిలి నీచ మయిన చోటుగానున్నది. మహర్షీ ! ఇది మంచి పూనికగాదు. ఇది విశేషించి యభక్ష్యమైనది. మఱి చండాలుని సొమ్ము; కనుక దీని నపహరించుట నింద్యమగు కార్యమగును. నీవు ప్రాణము రక్షించుకొనుకొఱకు వేఱు మంచియుపాయమును జూడుము. మహామునీ ! కుక్కమాంసమును గోరుటవలన నీతపమునకు నాశముగలుగును. తెలివిగలవాఁడు మంచిదారిని బోవలయును.

ధర్మమునకు సంకరముచేయరాదు. ధర్మమును నీవు దిగవిడువ రాదు. ఏలనఁగా, నీవు ధర్మవిదులం దుత్తముఁడవై యున్నాఁడవు' అనెను. విశ్వామిత్రుఁడది విని యాఁకటిచేతఁ బీడితుఁడై మరల వానితో 'నేను జాలఁగాలముగా నాహారము లేకయిటు నటుఁ బరుగులిడుచున్నాను. ప్రాణమును గాచుకొనుటకు నాకు వేఱొకయుపాయము తోఁపకున్నది. మనుజుఁడు తాను జచ్చు నంతటి కాతీయపడుచున్నపుడు ముందువెనుక నాలోచింపక యే కార్యముఁజేసి యైనను దనప్రాణముల నుద్ధరించుకొనవలయును. పిదపఁ దనకు శక్తివచ్చినపుడు ధర్మము నాచరించు కొన వచ్చును. ఆపత్కాలమందుఁ గ్షత్రియుఁడు ధర్మము లాచరింపవలయును. అగ్ని ధర్మము బ్రాహ్మణునికిఁదగును. వేదములగ్ని; అవినాకు బలము. కాఁబట్టి నాయాఁకటి నుడుపుటకై యీయాయభక్ష్యమును నయి తము భక్షించెదను. ఏయేవిధమునఁజేసియే జీవింపవలయునో దానినెల్ల నలక్ష్యముసేయక కావింపవలయును. జీవించియుం డుట మరణముకంటె మిక్కిలిమంచిది. జీవించియున్న వాఁడు ధర్మమును బడయును. అట్టి నేను బ్రాణమును గోరి దీని నభక్ష్యమని కూడఁ దెలిసియే భక్షింపఁగోరుచు న్నాను. అందులకు నీవు సమ్మతింపవలయును. బ్రతికియుండి ధర్మమును జేసెదను. సూర్యుఁడు మొదలయిన జ్యోతిస్సులు వెనుచీఁకటిని బోఁగొట్టునట్లు, తపముచేతను విద్యచేతను నశుభ ములను దొలఁగించుకొనెదను' అనెను. చండాలుఁడు 'ఈమాం సమునుదిని నీవిపుడు ప్రాణమును బడయుటలేదు. లేక యమృత మును భుజించునట్లు తృప్తిని బడయుటయు లేదు. వేఱు భిక్ష గొనుము. కుక్కమాంసమును దినుటయందు మనసు నుంప

కును. కుక్క బ్రాహ్మణుల కెంతమాత్రమును దిన నర్హముగా నిది చుమీ' యనెను. విశ్వామిత్రుడు 'చండాలా! ఇది దుర్భిక్ష కాలము. కనుక వేఱుమాంసము దొరకునని నాకుఁ దోఁప కున్నది; నాకు ధనమును లేదు. ఆఁకట నకనకలాడుచు గతి మాలి యీశదూలి నవయుచున్న నాకుఁ గుక్కతోడ యీఱు రసములకంఱె మేలయినదిగాఁ దలఁచుచున్నాను' అనెను. చం డాలుఁడు 'బ్రహ్మ క్షత్రియ వైశ్యులకు గోళ్లుగలజంతువులలో నైదుమాత్రమే (అనఁగా ఆళువ, ముండ్లపంది, ఉడుము, కుందేలు, తాఁబేలు నవెడియీయైదుమాత్రమే) భక్ష్యములగును. నీకు శాస్త్రము ప్రమాణమగునేని, యభక్ష్యమందు మనస్సు నుంపకుము' అనెను. విశ్వామిత్రుడు 'అగస్త్యుఁ డాఁకలిగొని వాతాపియను నసురను భక్షించెను. నేను నాఁకలిగొని యీప దయందుఁ జిక్కియున్నానుగాన గుక్కతోడను గుడిచెదను' అనెను. చండాలుఁడు 'మఱియొక భీకు నముగుము. నినుఁబోటి కిది సేయుట యెంతమాత్రము దగదు. వాస్తవమున నీ కిట్టిది యెంతమాత్రము చేయఁదగదు. నీ కిష్టముండెనా కుక్కతోడను దీసికొనవచ్చును' అనెను. విశ్వామిత్రుడు '(అగస్త్యుఁడు మొద లయిన) శిష్టులే ధర్మమునకుఁ బ్రమాణము. వారి నడక ననువ ర్తించుచున్నాను. నే నీ కుక్కమాంసమును మేధ్యమైన (పరి శుద్ధమైన) యాహారమునకంఱె నిపుడు మేలయిన భక్ష్యముగాఁ దలఁచుచున్నాను' అనెను. చండాలుఁడు 'అసట్జనులచే నాచ రింపఁబడినది సనాతనధర్మము గానేరదు. అకార్య మెన్నఁటికిని గార్యము గానేరదు. నెపమిడి (బేలుపోయి) యకార్యమును జేయకుము' అనెను. విశ్వామిత్రుడు 'ఒకఁడు ఋషిగానుండి

(అనఁగా నగస్త్యునివంటివాఁడు) పాతకమును జేయఁజాలఁడు. ఇట్టియెడఁ గుక్కయు జింకయు రెండును (మృగములగుటం బట్టి) సమములనియే తలఁచుచున్నాను. కాఁబట్టి కుక్కతొడను భక్షింపఁదగదను' అనెను. చండాలుఁడు, 'ఆయగస్త్యఋషి బ్రాహ్మణులను రక్షింపఁగోరి ప్రార్థింపఁబడి యభక్ష్యమగు నాయసుర మాంసమును భుజించెను; కాని యాశపడి భుజింపలేదు. అది ధర్మమే. అందుఁ బాపములేదు. సమస్తములయిన యుపాయములచేతను మూఁడువర్ణములకును బెద్ద (బ్రాహ్మణు) లగువారు రక్షింపఁబడఁదగినవారుగదా' యనెను. విశ్వామిత్రుఁడు 'నేను బ్రాహ్మణుఁడను. నాయీశరీరము నాకు మిత్రము. ఇది నాకు మిక్కిలి ప్రియమయినది. లోకమందు నాకుఁ బూజ్యతమమయినది. ఈదేహమును బోషింపవలయునను కోరికనుబట్టియె కుక్కతొడను దినవలయునను కోరికగలిగినది. నాకున్న తమకమునకు నినుబోటి నృశంసులకు నే నెంతమాత్రమును వెఱువను' అనెను. చండాలుఁడు 'మనుష్యులు జీవితమును విడుచుటయుఁ గలదు కాని యభక్ష్యమందు బుద్ధి యెవ్వఁడును జొనుపుట గాసరాదు. (ప్రాణములనైన విడువవచ్చునుగాని యభక్ష్యమును దినరాదని తోఁచుచున్నది). ఆఁకటిని నోర్చుటవలన నిహమందుఁ గల కామములనెల్లఁ బొందుదురని తెలియుము. నీవు నాఁకటిని గెలిచి యీకామములను బడయుము' అనెను. విశ్వామిత్రుఁడు 'ఆ కామము (అనశనముచేతమరణము) పిశపటిజన్మమందుఁ బొగడ్తగలిగింపఁ జాలినదనుట యుక్తమే. (జీవించియున్నవానికి) నాహార ములేనిచోఁ గర్మములకు నాశముగలుగు ననుటకు సందేహము లేదు. నేనో యెప్పుడును వ్రతముగలిగియు బుద్ధియం దడఁకువ

గలిగియు నుండువాఁడను. ధర్మమునకు మూలమగు శరీరమును రక్షింపవలయును. కాఁబట్టి యభక్ష్యమును భక్షించెదను. పరిశుద్ధాత్ముఁడగు వానియందు నిట్టికార్యము ధర్మముగాఁ దలఁపఁబడుననుట స్పష్టము. అశుద్ధాత్ముఁడగు వానియందే కుక్కమాంసమునుదినుట పాపముగాఁ గనుపట్టును. నేనిపుడు చేసినది నిశ్చయముగాఁ దప్పిదముగానుండినను (అనఁగా నేను గుక్కమాంసమును దిన్నను) దానినిబట్టి నినువంటివాఁడను నేనుగాను' అనెను. చండాలుఁడు 'ని న్నీపాపమునుండి మరల్పవలయునని నేను మనస్సునందు నిశ్చయించుకొంటిని. బ్రాహ్మణుఁడుగానుండి దుష్కార్యము చేయునేని వాఁడు తనపదవినుండి కీడ్పడును. ఇందులకే ని న్నిట్లు దూఱుచున్నాను?' అనెను. విశ్వామిత్రుఁడు 'కప్పలు బెకబెక లాడుచుండినను నాపులు నీరు త్రాగకమానవు. ధర్మమందు నీకధికారములేదు. కాఁబట్టి నిన్ను నీవు పొగడికొనవలదు' అనెను. చండాలుఁడు 'నీకు మిత్రమనైతిని; కావునఁనే నిన్నుగుఱించి శోకించుచున్నాను. బ్రాహ్మణా ! నీయందు నాకు జాలిచుమీ. కాన యేది మేలో యది చేయుము. లోభమందు మనస్సునుంపకుము' అనెను. విశ్వామిత్రుఁడు 'నీవు నాకు సుహృదుఁడనై నాసుఖమును గోరుదువేని, న న్నీయాపదనుండి యుద్ధరింపుము. అప్పటికి నే నీకుక్కతోడను దిగవిడుతును గనుక, (నధర్మముచేతఁ గాక) ధర్మముచేత నన్ను రక్షించు కొంటినని తెలియుదును' అనెను. చండాలుఁడు 'నీకు నే నీమాంసము నిచ్చుటకు నెంత మాత్రమొల్లను. మఱి నాయన్నమును నీవు దొంగిలించుకొని పోవుచుండఁగా నూరకుండుటకు నొల్లను. నేను నీ కీమాంసము

నిత్తునేని, బ్రాహ్మణుఁడవు నీవు దీనిని గొందువేని, మనమిరువుర మును గుక్కమలమున బ్రుంగి నరకమునఁ గూలుదుమే' యనెను. విశ్వామిత్రుఁడు 'నే నిప్పుడీ పాపకర్మమును జేసితినేని మిక్కిలియుఁ బవిత్రమయిన నాప్రాణమును దప్పక గాచుకొందును. ఇట్లు ప్రాణమును నిలఁబెట్టుకొని పిదప ధర్మమునే యాచరించి నాయాత్మను బరిశుద్ధము చేసికొనెదను. (అన్నము లేక చత్తునా? అశుద్ధమైన యన్నమును దినిప్రాణమును రక్షించుకొందునా?) ఈరెంటిలో నేది యెక్కుడో చెప్పుము' అనెను. చండాలుఁడు 'వానివానికిఁ దగిన ధర్మముల నాచరించు విషయమున (తగును దగదని తెలియుటకు) వాని యాత్మ యే సాక్షీయగును. ఈరెంటిలో నేది చెడ్డకృత్యమో నీయంత నీవే యెఱుఁగుదువు. ఎవఁడు కుక్కనంజుడును భక్ష్యముగా నాదరించునో వానికి నాహారములందు వర్జింపఁదగిన దేదియు నుండదు. వాఁడన్నిటిని దిను నని నాకుఁ దోఁచుచున్నది' అనెను. విశ్వామిత్రుఁడు 'అభక్ష్యమును బుచ్చుకొనుటయందును భక్షించుటయందును దోషమున్నది. అయినను బ్రాణమున కపాయము గలుగునపుడు విధికి నెప్పుడు నపవాదము గలదు. (ఇట్టిదానిని బుచ్చుకొనుట యందును భుజించుటయందును దోషముగలుగదు.) మఱియు నభక్ష్యమును భక్షించుటయందు హింసయు వంచనయు లేకయు నించుక నిందమాత్రము కలిగియు నుండునేని యది యంతగాఁ బెద్దదిగాదు' అనెను. చండాలుఁడు 'అభక్ష్యమును దినుట కిది నీకు హేతువగునేని, నీకు వేదమును నార్యధర్మమును బ్రమాణము గానేరవు. బ్రాహ్మణోత్తమా! కాఁబట్టి నీవిపుడు చేయు దానినిబట్టి భక్ష్యమునకును నభక్ష్యమునకును భేదము చూడ

కుండుటయందు దోషము లేదని నాకుఁ దోఁచుచున్నది' అనెను. విశ్వామిత్రుఁడు 'ఒకఁడు భక్ష్యమును భక్షించిన మాత్రమున వానికిఁ బాతకము గలుగుట గానరాకున్నది. కలు త్రాగిన యెడఁ గూలుచున్నాఁడనుట (మనుష్యులకుఁ ద్రాగుబోతుతనము లేకుండుటకై చెప్పిన) వట్టిమాటమాత్రమేకాని నుతేమికాదు. మఱియు నిట్టివగు తక్కినపాపకర్మములను, అవియెవ్వింగా నుండి నను పాపసంబంధము గలిగినంతమాత్రమున నొకఁడుచేసిన పుణ్యమును నాశము సేయఁజాలదు' అనెను. చండాలుఁడు 'ఏవఁడు విద్వాంసుఁడై యుండి మూలపల్లియయను చెడ్డచోట నుండి, దొంగతనమనెడి హీనకర్మముచేత, నియ్యనొల్లకున్న తక్కువవానివలననుండి, పేరాసతోడఁ గుక్కను బొందునో, వాఁడు సాధువుల నడవడికి విరుద్ధమయిన దానిని గావించినవాఁడగును. వాఁడట్టిపని చేయుటచేత మఱియు దండనమును బొంద వలసియు వచ్చును' అనెను.

భీష్ముఁడు 'అప్పు డాచండాలుఁడు విశ్వామిత్రున కిట్లు చెప్పి యంత నూరకుండెను. విశ్వామిత్రుఁడు బుద్ధియందు నిశ్చయించు కొనియే యాకుక్కతొడను గయికొనెను. అమ్మహాముని బ్రతు కఁగోరి యాకుక్కమాంసము తునుకను బుచ్చుకొని వనమున కుఁగొనిపోయి భార్యయుం దానును దానిని దినఁగోరెను. అంత నతనికి 'నేను మొదటఁ దగుకాలమున దేవతలకుఁ దృప్తిగావిం చినపిదప విధిచొప్పునఁ గుక్కతొడను భక్షించెదను' అని తలంపు గలిగెను. అంత నతఁడు వేదోక్తవిధిప్రకార మగ్నినిదెచ్చి యైం ద్రాగ్నేయమగు విధిచొప్పునఁ దానే చరువును బచనముచేసెను. పిదప విధ్యుక్తముగా వేఱువేఱ యింద్రాదిదేవతలను బిలిచి దైవ

మును బిత్ర్యమునగు కర్మములను గావింపఁదొడంగెను. ఆసమయమందే యింద్రుఁడును విశేషించి వాన గురియించెను; సమస్తప్రాణులను బ్రదికించువాఁడై సమస్తములయిన యోషధులను బుట్టించెను. బ్రాహ్మణశ్రేష్ఠుఁ డతఁ డాకర్మమును ముగించి దేవతలను బితరులను దృప్తిపఱచి యామాంసమును దాను భుజించెను. ఆ బ్రాహ్మణోత్తముఁడు తపముచేఁ బాపములనెల్ల దగ్ధముగావించి దీర్ఘకాలమునకుఁ బిదప మిక్కిలి యద్భుతమయిన సిద్ధినిబొందెను. ఇట్లు తెలిసినవాఁడు వ్యసనముసం జిక్కినపుడు ప్రాణమును రక్షించుకొనఁ గోరునేని బుద్ధియందు విన్నఁదనములేక యుపాయములనెఱింగి సమస్తములయిన యుపాయములచేతను దన్నాపదనుండి యుద్ధరించుకొనవలయును. ఇట్టి బుద్ధిగలిగి యెప్పుడును జీవింపవలయును. పురుషుఁడు ప్రాణము నిలఁబెట్టుకొని యున్నయెడలఁ బుణ్యమును శుభమును బడయవచ్చును. కాంతేయా! కాఁబట్టి బుద్ధిసంపన్నుఁడగు విద్వాంసుఁడు ధర్మాధర్మములను నిశ్చయించు విషయమునఁ దనబుద్ధినే యూఁది యీలోకమందుఁ బ్రవర్తింపవలయును' అనెను. ఇది నూటనలువదియొకండవయధ్యాయము.